# కథా కౌముది

2017 - Part 1





శ్రీ

కౌముది



www.koumudi.net

కౌముది ప్రచురణలు - 186

# కౌముది మాసపత్రికలో

# 2017 జనవరి నుంచి జూన్ 2017

# వరకూ

# వచ్చిన కథలు

| క్రమసంఖ్య | కథపేరు | రచయిత(త్రి)పేరు | పేజి |
|---|---|---|---|
| 1 | బానిస | ప్రతాప వెంకట సుబ్బారాయుడు | 4 |
| 2 | ప్రాణం ఖరీదు | ఆర్. శర్మ దంతుర్తి | 9 |
| 3 | నిర్ణయం | అప్పరాజు నాగజ్యోతి | 15 |
| 4 | మాతృత్వం | చిలకలపూడి సత్యనారాయణ | 19 |
| 5 | బలపరిధులు | ఎలక్ట్రాన్ | 24 |
| 6 | మది రుచిత మందిరమే! | చింతలచెరువు సువర్చల | 30 |
| 7 | నిజమే.. కానీ! | గుడ్లదొన సరోజినీదేవి | 69 |
| 8 | న్యూ యాటిట్యూడ్ | రాగ్ సావేరి | 75 |
| 9 | అనుబంధానికి ఆధారం | శ్రీకళ అబ్బరాజు | 80 |
| 10 | డ్రైవర్ | విద్యార్థి | 84 |
| 11 | దాన సంస్కారం | జయంతి ప్రకాశ శర్మ | 94 |
| 12 | బోను | మల్లాది హనుమంతరావు | 98 |
| 13 | అమ్మకావాలా? ఆటబొమ్మకావాలా? | పోడూరి కృష్ణకుమారి | 103 |
| 14 | సుందరి – సీతారామ్ | కె.ఎస్.ఎం ఫణీంద్ర | 107 |
| 15 | నవనీతం | పోడూరి వెంకటరమణ | 116 |
| 16 | మానసగంగ | కానాల శారద | 123 |
| 17 | అర్థనారీశ్వరం | వి.పద్మినీదేవి | 127 |
| 18 | మతి మెరుపు | డా. డి.వి.జి శంకరరావు | 132 |
| 19 | గ్రాండ్ స్లామ్ | ఉణుదుర్తి శ్రీనివాసు | 135 |
| 20 | LMP | బోడపాటి రమేష్ | 142 |
| 21 | అమ్మకో ఉత్తరం | గంటి భానుమతి | 144 |
| 22 | నవనీతం | డా.జ్ఞానేశ్వర రావు కె.వి.ఎస్ | 149 |
| 23 | గోంగూర పురాణం | ఉమా(వెంకట్ నాగం) | 154 |
| 24 | ఆ నవ్వుకి అర్థం ఇదా...! | శ్రీకాంత్ విహారి | 156 |
| 25 | భాస్కర్‌కి ఒక ఉత్తరం | పొత్తూరి విజయలక్ష్మి | 161 |
| 26 | జరగాల్సింది జరిగితీరాల్సిందే | *కాశీభట్ల శశికాంత్* | 167 |
| 27 | చిరిగిన గాలిపటాలు | కృష్ణవేణి | 173 |

# భానిస ప్రతాప వెంకట సుబ్బారాయుడు

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

‘ఛ..ఛ..వెధవ బ్రతుకు పెళ్ళి చేసుకున్నది లగాయత్తు నరకం. ‘పిల్ల అందంగానే వుంది కదా’ అని కాణీ కట్నం ఆశించకుండా పెళ్ళి చేసుకున్నాను. కృతజ్ఞత లేని మనిషి. మొగుడ్ని లేచింది మొదలు సాధిస్తూనే వుంటుంది. తనని నేను ఎలా చూసుకుంటాను? నెల జీతం రాంగానే మొత్తం ఇచ్చేస్తాను. పండక్కి చీరలు నగలు కొనుక్కుంటుంది. నాకేం కొనకపోయినా ఎప్పుడూ బాధపడింది లేదు. ‘నాకిది కావాలి’ అని అడిగింది కూడా లేదు. నా మంచితనన్ని చవటాయితనం అనుకుంటోంది. నలభై ఏళ్ళ నుండి భరిస్తున్నాను. ఉన్న ఒక్కగానొక్క కొడుకు అమెరికాలో సెటిలయ్యాడు. అక్కడి తెలుగు వాళ్ళ పిల్లని పెళ్ళి చేసుకుని హాయిగా వుంటున్నాడు. అమ్మ దగ్గరకి తీసుకొచ్చి ఆ అమాయకురాలిని బలిచేయలేక వాడు మానుండి ఐసోలేట్ అయిపోయాడు. ఇండియాకి రావడం లేదు. ఫోనులో మాట్లడ్డంలేదు. తెలివైన వాడు. తనే వాజమ్మలా భార్య దాష్టీకాన్ని భరిస్తున్నాడు. ఇహ లాభంలేదు. ఆ గయ్యాళి నుండి దూరం అయిపోవాలి. మొగుడు లేని జీవితం ఒకసారి రుచి చూపించాలి. అప్పుడు గాని తిక్కకుదరదు.’ మనసులో అనుకుంటూ రైల్వే స్టేషన్ వైపు నడుస్తున్నాను. ఏ రైలన్నా ఎక్కి ఎక్కడికైనా సుదూర తీరాలకి పారిపోవాలన్నది నా ఆలోచన.

’ఇహ దాన్ని భరించడం నా వల్ల కాదు’ వందోసారి అనుకున్నాను.

స్టేషన్లో కి వెళుతుండగా "నాయనా.."అని వినిపించింది.

‘ఎవరా’ అని చూశాను.

పొడుగాటి జడలుగట్టిన జుత్తుతో..నుదుటున స్థలం లేకుండా పెట్టుకున్న విభూతి తదితర బొట్లతో..మెడల్ని వంచేంత పెద్ద పెద్ద రుద్రాక్షల దండలతో.. పొడవాటి గడ్డంతో..చేతిలో మంత్రదండంతో..కాషాయంబరధారి అయిన సాధువు కనిపించాడు.

‘‘సమస్య నుండి దూరంగా పారిపోవాలనుకుంటున్నావు. కాని నీ మనసు నుండి దూరమవలేవు కదా, సప్తలోకాల్లో నువ్వెక్కడికెళ్ళినా అది నిన్ను ప్రశాంతంగా వుండనివ్వదు నాయనా!“ అర్ధనిమీళిత నేత్రాలతో గొణుగుతున్నట్టుగా అన్నాడు.

‘ఎదుటి వాళ్ళ మనసుల్ని చదివే శక్తి వీళ్ళకెలా వస్తుందో’. ఆయనన్నది నిజమే! పాతికేళ్ళ నా భార్య నిరంకుశత్వం..హిట్లరిత్వం నేను తనకి ఎంత దూరమైతే మాత్రం మర్చిపోగలను? ప్రశాంతంగా వుండడం కల్ల. అలా అని నా మనసుని ఏ పెట్లోనో వుంచి ఇంట్లో పడేసి రాలేను కదా. అది నాతో పాటూ ఎక్కడికి పడితే అక్కడికి వచ్చి నన్ను మానసికంగా సతాయిస్తుంటుంది. చిత్రవధచేస్తుంది. అచ్చం నా భార్యలా!

"మీరెవరో మహానుభావుడిలా వున్నారు. పెళ్ళి చేసుకుని జీవితాన్ని కోల్పోయాను. భార్యాబాధితుడిలా భారమైన బ్రతుకీడుస్తున్నాను. తరుణోపాయం మీరే సెలవియ్యాలి"అని ఆయన కాళ్ళమీద పడబోయాను. ‘నా బాధని అర్ధంచేసుకునే ఆపద్భాంధవుడిలా కనిపించిన మీరు దేవుడు కాక మరెవరు?’ అన్న భావాన్ని శరీరభాషలో వ్యక్తపరుస్తూ.

ఆయన నన్ను వారించి. "పద, అదిగో దూరంగా కనిపిస్తున్న షెడ్డులో ప్రశాంతంగా కూర్చుని మాట్లాడుకుందాం” అన్నాడు.

నేను ఆయన్ని అనుసరించాను.

షెడ్డు ప్రాంతం నిర్మానుష్యంగా వుంది. మేమిద్దరం లోపలికెళ్ళాం. చాలా విశాలంగా వుంది. కాస్త మసగ మసగ్గా వున్న చోట కూలబడ్డాం.

"నీ మనసు స్థిమితంగా లేదు. ఈ స్థితిలో నువ్వేం వినలేవు. విన్నా ఆకళింపు చేసుకోలేవు. ఇదిగో ఈ మంత్రించిన రుద్రాక్షని జేబులో పెట్టుకో నాయనా, కాస్త కుదుటపడతావు. మాట్లాడే ధైర్యం వస్తుంది."అన్నాడు.

నేను ఆయన చెప్పినట్టే చేశాను.

ఆయన మాటలు మంత్రంగా పనిచేశాయో? లేక మంత్రించిన ఆ రుద్రాక్ష మహత్యమో? కాని గుండె కొట్టుకునే వేగం తగ్గింది. మా ఆవిడ్ని తల్చుకుంటే కలిగే జలదరింపు కూడా కలగలేదు. నిజంగా ఆయన మహానుభావుడే! అయినా అనుమానంతో జేబులోని పర్సు తీసి అందులోని మా ఆవిడ ఫోటో చూశాను(అది మాఆవిడ బలవంతంగా పర్సులో పెట్టింది. నేను ఎక్కడున్నా వెదవ్వేషాలు వేయకుండాట). అబ్బే! భయం వెయ్యలేదు సరిగదా నవ్వువచ్చింది. ఏవిటో, ధైర్యం నిలువెల్లా విద్యుత్ లా ప్రవహిస్తోంది.

"స్వామీ, మీరు మానవమాత్రులు మాత్రం కారు. నాకు నమ్మకం కలిగింది. ఇన్నేళ్ళ నా బాధలు భయాలు తొలగించడానికి వచ్చిన దైవాంశ సంబూతులు."అని కళ్ళనీళ్ళతో ఆయన కాళ్ళమీద పడ్డాను.

"నాయనా! 'సంబూతులు కాదు..సంభూతులు..' పెద్దపదాలు రాకపోతే మాట్లాడకు నేను అర్థం చేసుకుంటాను అంతే కాని బూతులు మాట్లాడకు. అంతేకాదు నువ్వు అలా మాటిమాటికి నా కాళ్ళమీద పడకు. హడావుడిగా నిన్ను లేపడానికి వంగితే నా నడుం పట్టేయొచ్చు. ఆనక ఈ వృద్ధాప్యంలో నేను చాలా బాధపడాలి."అన్నాడు ఆందోళనగా.

"ఇన్నాళ్ళకి నన్ను అనునయించి, నాకో దారి చూపించే మహాత్ముడు కనిపించాడన్న ఆనందం స్వామీ నాది. మిమ్మల్ని ఇబ్బంది పెడదామని కాదు"అన్నాను తన్మయత్వంగా.

"పాపం, నిన్ను చూస్తుంటే భార్యచేతిలో ఎంత నరకం అనుభవించావో నాకు అవగతమవుతోంది. ఒకప్పుడు నేను కూడా భార్యాబాధితుడినే! నన్ను మా ఆవిడ పెట్టిన మానసికక్షోభ అంతా ఇంతా కాదు. దాందుంపతెగా, ఆఫీసుపనీ చేయాలి, ఇంటిపనీ చేయాలి, కాస్త సుఖపడాలని నా డబ్బుతో ఓ మిక్సీ, ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్ కొనుక్కుంటానన్నా వినేది కాదు. ఊళ్ళకెళ్ళినప్పుడైతే నేనచ్చం సామాను మోసే కూలీనే. కాదు వాడికన్నా హీనం. ఎందుకంటే వాడికి డబ్బిస్తాం. గొడ్డుచాకిరీ చేసినా విశ్వాసం వుండేది కాదు. మొగుడివల్ల ముత్తయిదవగా చెలామణి అవుతోందన్న గౌరవమూ లేదు. విరక్తితో చెప్పా పెట్టకుండా హిమాలయాలకి వెళ్ళిపోయాను. అక్కడ మహిమాన్విత తాపసులకి కొంతకాలం సేవలు చేసి మెప్పించి కొన్ని వరాలుపొందాను. మంత్ర తంత్రాలు నేర్చుకున్నాను. నా భార్య అంతు చూద్దామని మా ఊరు వెళ్ళాను. ఆవిడ ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయిందట. ఎక్కడికెళ్ళిందో కూడా తెలియదట. అక్కడివాళ్ళు చెప్పారు. నాకు తీవ్ర నిరాశ కలిగింది. ఏమీతోచని స్థితిలో పిచ్చిగా తిరుగుతున్న నాకు నువ్వు కనిపించావు. నీ మిర్రి మిర్రి చూపులు, ముఖంలో భయాందోళనలు చూసి 'నువ్వు ఖచ్చితంగా భార్యాబాధితుడివే' అని నిర్ధారణకు వచ్చాను. నిన్ను నీ కష్టాల్నుండి గట్టెక్కించడమే ప్రస్తుతం నా కర్తవ్యం."అన్నాడు.

"ధన్యుడ్ని స్వామీ! మీరేం చేస్తారు? మా ఆవిడకి పక్షవాతం వచ్చి కాలూ చెయ్యి పడిపోయేలా చేస్తారా? లేక నోరు పడిపోయేలా చేస్తారా? ఏదైనా నాకు ఓకేనే "అన్నాను హుషారుగా.

"నేనవేం చేయలేను నాయనా! కాకపోతే మీ ఆవిడ కోపానికి నువ్వు బలికాకుండా చూడగలను."

"ఎలా స్వామీ?"

"చెబుతాను. కాస్త ఓపికపట్టాలి. చెప్పేది శ్రద్ధగా వినాలి. దూకుడు పనికిరాదు. నువ్వు పరకాయ ప్రవేశం గురించి ఎప్పుడైనా విన్నావా?"

"కథల్లో చదివాను. సినిమాల్లో చూశాను స్వామీ"

"అయితే జాగ్రత్తగా విను నేను నీకు ఒక మంత్రం నేర్పుతాను. అది మూడుసార్లు పఠిస్తే నువ్వు దగ్గర్లో ఏ కళేబరం వున్నా అందులోకి ప్రవేశిస్తావు. కాని గుర్తుంచుకో నువ్వు మంత్రం చదివేటప్పుడు దగ్గర్లో ఏదైనా ఒక నిర్జీవి వుండాలి. అప్పుడే ఫలిస్తుంది. దాని శరీరంలోకి నీ ప్రవేశం

సాధ్యమవుతుంది. మీ ఆవిడకి నీ మీద తమాయించుకోలేని కోపం వచ్చినప్పుడు, ఏదైనా బరువైనది నీ మీదకి బలవంతంగా విసరాలనుకున్నప్పుడు, అమాంతం నువ్వు దూరంగా వెళ్ళిపోయి దాక్కుని ఏ దోమలోనో ఈగలోనో ప్రవేశించి తప్పించుకుని, మీ ఆవిడని గమనిస్తూ, నీ మీద ఆగ్రహం తగ్గిందని గ్రహించాక మళ్ళీ మనిషివవ్వచ్చు. ఇది తెలియక మీ ఆవిడ అయోమయంతో పిచ్చిదైపోతుంది. అన్నట్టు ఈ విషయం ఎప్పటికీ మీ ఆవిడకి తెలియకుండా జాగ్రత్త పడాలి మరి. తెలిసిందంటే నువ్వు హై ఓల్టేజ్ షాక్ కి గురైన కాకివవుతావు. జాగ్రత్త"అన్నాడు.

"చాలు స్వామీ చాలు. అసలు వింటుంటేనే థ్రిల్లుగా వుంది. ఇహ మా ఆవిడతో దొంగా పోలీసు ఆడతా, చూడండి నా తడాఖా!"అన్నాను ఆనందంగా.

"నేను నీకు చెప్పబోయే మంత్రంతో పాటు ఈ విషయాలన్నీ భద్రంగా, నీ బ్యాంక్ పిన్ నంబర్లు రాసుకునే చోట రాసుకో. అది మీ ఆవిడ కంట బడకూడదు సుమా. ఎప్పుడన్నా మంత్రం మర్చిపోతే ఆ పుస్తకం చదివి మననం చేసుకోవచ్చు"

"ఆహా ఏమి నా అదృష్టం. ముందు మంత్రం చెప్పండి స్వామీ నాకు తెగ ఆత్రంగా వుంది."

ఆయన చెవిలో నెమ్మదిగా చెప్పాడు.

నేను బాగా వల్లెవేసి" స్వామీ, ఒకసారి పరీక్షించుకోవచ్చా?"అని అడిగాను.

"మానవ జీవితమే అనుమానాలు, సమస్యల మయం అలాగే కానీయి"అన్నాడు.

మంత్రం చదువుతూ అక్కడే చచ్చిపడి వున్న చీమ శరీరంలోకి ప్రవేశించాను. చీమ కళ్లల్లోంచి ప్రపంచాన్ని, స్వామీజీని, ముఖ్యంగా నా పార్థివ శరీరాన్ని చూస్తుంటే నాకు ఆనందంగానూ గొప్ప ఆశ్చర్యంగాను వుంది. ఇదో గొప్ప అనుభూతి.

మళ్ళీ నా శరీరంలోకి వచ్చేశాను.

"నాయనా! నువ్వు పరకాయ ప్రవేశం చేస్తున్నప్పుడు, నీ కాయం భద్రంగా వుంటుందనుకున్న చోటనే దాన్ని విడవాలి. లేదంటే ప్రమాదం. ఆఁ"అన్నాడు.

"స్వామీ, నేనన్ని జాగ్రత్తలూ తీసుకుంటాను. మీరు నాకు చేసింది మహోపకారం. ఇహ సెలవియ్యండి. నే వెళతాను"అన్నాను.

"వెళ్ళిరా నాయనా..నేనెప్పుడైనా నిన్ను చూడడానికి వస్తాను"అని లేచి గాల్లో నడుస్తున్నట్టుగా అడుగులేస్తూ వెళ్ళిపోయాడు.

'ఇదంతా కలా? నిజమా? నేనేంటి? నాకింతటి వరమేంటి?' అని గిల్లి చూసుకున్నాను. గట్టిగా గిల్లుకున్నానేమో భరించలేక అరిచేశాను.

ఇంటికొచ్చాను.

మా ఆవిడ కసిమీదవున్న ఒంగోలు గిత్తలా ముక్కుపుటాలెగరేస్తూ రంకెలేస్తోంది.

"దేబ్యం ముఖమేసుకుని ఇప్పుడా వచ్చేది? ఇప్పటిదాకా ఎక్కడికి చచ్చావు? పొద్దుట్నుండి కాఫీ కలిపే దిక్కులేక, నాకా కాఫీ కలుపుకునే అలవాటు తప్పిపోవడం మూలానా, కలుపుకోలేక నానా అవస్తలూ పడ్డాను. వెళ్ళు..వంటిట్లోకి వెళ్ళి కాస్త కాఫీ తగలేసుకు రా..తల నొప్పితో చచ్చిపోతున్నాను" అంది అపర కాళికలా.

'ఇహనుండీ నీ పని అయిపోయిందిలేవే' అని మనసులో అనుకుంటూ'అలాగే!'అని వంటింట్లోకి వెళ్ళాను.

ఆ రాత్రి–

మేమిద్దరం మంచం మీద పడుకున్నాం.

తను నిద్రలో వుంది. నాకు నిద్రపట్టడం లేదు. దాని మీద మహా కసిగా వుంది. అప్పటికే నేను చంపి టేబుల్ మీద భద్రంగా వుంచిన దోమ శరీరం వుంది.

నేను దుప్పటి మొత్తం కప్పుకుని మంత్రం ఉచ్చరిస్తూ దోమ శరీరంలోకి ప్రవేశించాను. నెమ్మదిగా దోమ శరీరంతో ఒళ్ళు విరుచుకుని మా ఆవిడమీద దాడి మొదలెట్టాను. ముఖంమీద కుట్టిన చోటన మళ్ళీ కుట్టకుండా ఆమె దెబ్బలనుండీ అలవోకగా తప్పుకుంటూ కుట్టి కుట్టీ నా శరీరంలోకి ప్రవేశించాను.

మరుసటిరోజు దద్దుర్లతో ఉబ్బిపోయిన దాని ముఖాన్ని చూస్తూ ఏమెరగనట్టు "ఏమైంది?"అన్నాను జాలిగా.

"వెధవ దోమ రాత్రి తెల్లవార్లు కుడుతూనే వుంది. నిద్రపోకుండా చేసింది. అవునూ ఆ పాపిష్టి దోమ మిమ్మల్ని కుట్టలేదే..ఓహో మీరు దుప్పటి ముసుగేసుకుని చచ్చుంటారు. నేను దానికి దొరికిపోయాను"అంది విచారంగా.

మొట్టమొదటిసారి ఆమె ముఖంలో బాధ చూశాను. నా మనసులోని ఆనందం అంబరాన్ని తాకింది. శత్రువు బాధ మనిషికింత ఆనందం కలిగిస్తుందా? అందుకే ప్రపంచంలో యుద్ధాలు జరుగుతూనే వుంటాయన్నమాట.

ఒకనాటి సాయంత్రం "ఓయ్..నేనలా షాపింగ్ కి వెళ్ళొస్తాను, నిద్రమొహంతో వుండకు. దొంగలు ఇల్లు దోచేస్తారు. ఇంటిని కుక్కలా కాపలాకాయ్ జాగ్రత్త"అంది బయటకి వెళుతూ.

'అలాగే'అన్నట్టు వినయంగా తలూపాను.

అది వెళ్లాక, ఇంటికి తాళం పెట్టి కళేబరాల వేటకు వెళ్ళాను. మా ఇంటికి కొద్దిదూరంలో చచ్చిపోయిన కుక్క శరీరం కనిపించింది. నా ఆనందం అంతా ఇంతాకాదు. 'నేను ఇంటికి కుక్కలా కాపలా కాయాలా? నువ్వేమో బలాదూర్ గా తిరుగుతావా? చెబుతా నీ పని కుక్కగానే చెబుతా' అనుకుంటూ..

ఇంటికొచ్చి బెడ్రూమ్ లో పడుకుని మంత్రం చదువుతూ కుక్క శరీరంలోకి ప్రవేశించాను. సాటి కుక్కలనుండి తప్పించుకుంటూ.. మా ఆవిడను వెతుక్కుంటూ బయల్దేరి మొత్తానికి షాపింగ్ మాల్ లోంచి బయటకొస్తున్న మా ఆవిడ్ని చూసి మొరుగుతూ వెళ్ళి పిక్క పట్టుకుని గట్టిగా కొరికాను. "చచ్చాన్రోయ్"అని మా ఆవిడ అరచిన అరుపువిని సంతోషంగా తోకూపుతూ పరిగెత్తుకుంటూ సందులూ గొందులూ ఆఘమేఘాల మీద దాటుతూ..మా వీధిలోని ఖాళీ స్థలంలో కుక్క శరీరాన్ని వదలి మా ఇంట్లోని నా శరీరంలోకి ప్రవేశించాను.

కొద్దిసేపటికి ఆటోలో మా ఆవిడ కాలికి రక్తం కారుతూ వచ్చి "పొద్దున్నే నీ దరిద్ర ముఖం చూసుంటాను. నన్నో కుక్క కరిచింది. ఇంటికి తాళం వేసి రా హాస్పటల్ కి వెళదాం! కాస్త ఆటో ఎక్కించడానికి దింపడానికి సహాయం చేద్దువుగాని"అంది.

బాధని నటిస్తూ హడావిడిగా తనతో ఆటో ఎక్కాను.

అలా నేను నల్లిలా మారి రక్తం పీల్చాను. అన్నం తినేటప్పుడు బొద్దింకగా వచ్చి వికారం కలిగించాను. పాములా మారి మా ఆవిడ్ని భయపెడుతూ వైవాహిక జీవితాన్ని ఎంజాయ్ చెయ్యసాగాను.

ఒకరోజు నన్ను చూడడానికి మా ఇంటికి స్వామీజీ వచ్చాడు. మా ఆవిడ 'వీడెవడు' అన్నట్టు గుర్రుగా చూసింది.

'నా స్నేహితుడు పాపం భార్య పెట్టే బాధలు భరించలేక సన్యాసం తీసుకున్నాడు. నన్ను చూడడానికి వచ్చాడట..జస్ట్ కాసేపు కబుర్లు చెప్పి వెళ్ళిపోతాడంతే' అన్నాను.

తను ఏ కళనుందో 'సరే'అన్నట్టు చూసి వెళ్ళిపోయింది.

మేమిద్దరం మా బెడ్రూమ్లో కూర్చున్నాం. గట్టిగా తలుపు మూసి గడేసి నేను రకరకాల జంతువులుగా మారి మా ఆవిడ్ని ఎంత భయపెట్టింది, హింసపెట్టిందీ చెప్పి నవ్వసాగాను. ఆయనకూడా వాళ్ళావిడ్ని బాధపెట్టినట్టు ఊహించుకున్నాడో ఏమో? పగలబడి నవ్వసాగాడు.

"ఏమదృష్టమయ్యా నీది..మా ఆవిడ అలా భయపడుతుండగా నేను చూడలేకపోయాను..ప్చ్"అన్నాడు.

"అప్పుడే ఏమయిందండీ, ఇంకా ముందుంది ముసళ్ళ పండగ. పెళ్లయినప్పటినుండీ ఎంత బాధ పెట్టిందనుకున్నారూ, మహా మొండిఘటం దాన్ని అంత తేలిగ్గా వదులుతానా"

"అదిసరే కానీ ఇందాకా మీ ఇంట్లోకొస్తుంటే రెండు చచ్చిపోయిన ఎలకలు చెట్టు పక్కగా వుండగా చూశాను. ఒకసారి ఇద్దరం ఎలుకలుగా మారదామా? నువ్వు మీ ఆవిడ్ని భయపెడుతుంటే నేను ఎలుకరూపంలో చప్పట్లు కొడుతూ చూస్తాను, సరేనా!"

"అయ్యో ఎంతమాటండీ..తప్పకుండానూ..మీరే లేకపోతే నాకింత ధైర్యం, తెగింపూ, వచ్చేదా పదండి మరి"

ఇద్దరం డబల్ కాట్ బెడ్ మీద పడుకుని మంత్రం జపించాము. ఎలుకల్లోకి ప్రవేశించాము.

నేను మా ఆవిడ దగ్గరగా వెళ్ళి 'కాలివేలు కొరుకుతా' నన్నట్టుగా భయపెట్టసాగాను. అది భయంతో ఇల్లంతా ఒకటే పరుగు. నేను మా స్వామీజీ ఎలక వంక గర్వంగా చూశాను. అది నవ్వుతూ చప్పట్లు కొడుతోంది. నాకు హుషారు ఎక్కువై కేబుల్ వైరు మీదుగా పాకి మా ఆవిడమీద దూకడం, చీర మీదకు దూకి పైకి ఎక్కాలని చూడడం, ఆవిడ జుగుప్సగా విదిలించుకోవడం, నాకైతే నవ్వాగడం లేదు.

అంతలో మా ఆవిడ వంటగదిలోకెళ్ళి కిరోసిన్ డబ్బా తీసుకోవడం చూశాను. కొంపదీసి నా భయానికి 'తగలేసుకుంటుందేమో' అని ఆందోళన పడ్డాను.

కాని అనూహ్యంగా బెడ్రూమ్ లోవున్న మా శరీరాల దగ్గరకెళ్ళి "మీ ఇద్దరూ పరకాయ ప్రవేశం చేశారని నాకు తెలుసు. ఇందాక ఈ గడ్డమోడు వచ్చినప్పుడే అనుమానించాను. మీ మాటలు తలుపు చాటునుండి మొత్తం విన్నాను. మీరు పన్నిన కుట్ర తెలిసింది. ఇహ ఉపేక్షించను. హమ్మ! హమ్మ ఇన్నాళ్ళూ నన్నెంత హడలెత్తించావు? మీ ఇద్దరి శరీరాలమీద ఇప్పుడే కిరోసిన్ పోసి తగలేస్తాను. ఎలకల్లానే బ్రతికి చావండి." అని మా శరీరాల మీద కిరోసిన్ పోసింది.

మేమిద్దరం షాక్ అయ్యాము. ఇది మేమూహించని పరిణామం. ముఖ్యంగా మా గురువుగారు భయంతో ఎలుకరూపంలో నిలువుగుడ్లేయడం స్పష్టంగా కనిపిస్తోంది. ఆయనకొచ్చిన మంత్రాలేమయ్యాయో? బహుశా ఎలుకరూపంలో వుంటే మంత్రించలేడేమో?

మా ఆవిడ బొడ్లోనుండి అగ్గిపెట్టె తీసి అందులోంచి పుల్ల తీసింది. దాని సంగతి నాకు తెలుసు. అది అనుకుందంటే ఏదైనా చేయగలదు.

గబ గబ గురువుగారి దగ్గరకెళ్ళి దాని రాక్షసత్వం గురించి చెవిలో చెప్పా.

ఆయన గజ గజ వణకిపోయాడు.

ఇద్దరం దాని కాళ్ళమీద పడ్డాం. క్షమించమని.

"నేను అదృష్ట వంతురాల్ని కాబట్టి ఇవాళీవిషయం తెలిసింది. లేకపోతే నన్నెన్ని చిత్రహింసలకి గురిచేసేవాడివి? నీకు ఈ ముదనష్టపు పరకాయ ప్రవేశ విద్యనేర్పిన గురువుగాడొకడు. మిమ్మల్ని ఊరికే వదలకూడదు. ఈరోజుతో పీడ విరగడచేసుకుంటా"అని పుల్ల వెలిగించబోయింది.

నేను దాని కాళ్ళ మీద పొర్లి పొర్లి దండాలు పెట్టాను మమ్మల్ని వదిలేయమని.

ఎందుకోకాని మా ఆవిడ కాస్త శాంతించింది.

"సరే, మిమ్మల్ని క్షమిస్తా. కాని ఒక షరతు. ఈ గడ్డంగాడు ఇహ జీవితంలో నా కంట బడకూడదు. అలా అయితేనే" అంది.

మా గురువుగారు 'సరే' అన్నట్టుగా రెండు కాళ్ళమీద లేచినిలబడి తన రెండుచేతులూ దగ్గరకి చేర్చి తలూపుతూ మాటిచ్చాడు.

"అయితే నువ్వు మనిషిగా మారి ఇక్కడ్నించి పారిపో" అని హూంకరించింది.

ఆయన మనిషిగామారి మా ఇంటినుండి పరుగో పరుగు. ఆయనకెన్నో శక్తులున్నాయనుకున్నా, కానీ అవన్నీ మా ఆవిడ గయ్యాళితనం ముందు హుళక్కి అయిపోయాయి.

నా వంక చూసింది. "ఇహ నీ సంగతి. నువ్వు ఇలాగే పరకాయ ప్రవేశ విద్యతో నన్ను అలరించాలి. అదెలాగంటే? పక్కింటావిడ పట్టుచీర కొని గొప్పలకోసం ఊరంతా చూపిస్తోందిగా, ఇలా ఎలకలా వెళ్ళి దాన్ని నువ్వు చీలికలు పీలికలు చేసి రావాలి. అది లబో దిబో అని మొత్తుకోవాలి. అది చూసి నేను నవ్వుకోవాలి. ఏ జంతువు కళేబరముంటే ఆ జంతువులా నాకు ఉపయోగపడాలి. ఈ ఇంట్లో నువ్వు తోక ముడుచుకుని ఎలా వుంటావో అలా వీధి వీధంతా నాకు దాసోహమై వుండాలి. అలా నువ్వు చేయాలి. వింటున్నావా?"అని గదమాయించింది.

ఏం చేస్తాం. పెనంలోంచి పొయ్యిలోకి పడ్డట్లుగా వుంది నా పరిస్థితి. ఒప్పుకున్నట్టుగా తలూపాను.

"అయితే మనిషివిగా"అంది.

'బ్రతుకు జీవుడా' అనుకుంటూ మనిషినయ్యా. కాదు కాదు మళ్ళీ బానిసనయ్యా!

# ప్రాణం ఖరీదు ఆర్. శర్మ దంతుర్తి

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

ఛత్రపతి శివాజీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు. సాయంత్రం ఏ చర్చ్ గేట్ స్టేషన్ లోనో విక్టోరియా టెర్మినస్ స్టేషన్ లోనో వచ్చే పోయే జనాలతో గోలగోలగా ఉంది కానీ విమానాశ్రయంలా లేదు.. ఊరి కుర్రాళ్ళతో క్రికెట్ ఆడుతూ చిన్నప్పుడెప్పుడో ఊర్లో విమానం చప్పుడు వినిపిస్తే పైకి చూసేవాడు కిషోర్. అసలు విమానం ఎందుకలా ఎత్తుగా ఎగురుతుందో అందులో ఏముంటాయో తెలీని వయస్సు. చుట్టూ స్నేహితులడిగితే, ఏదో తెల్సినవాడిలా "అవి బొమ్మ విమానాల్లా అందులో ఏమీ ఉండవ్" అని చెప్పేవాడు ఏదో పెద్ద తెల్సినవాడిలాగా.

పదహారేళ్ళు ముందుకి తిప్పితే, ఇప్పుడు ఐ. ఐ. టి. డిగ్రీ చేత్తో పట్టుకుని మొదటి సారి విమానం ఎక్కబోతున్నాడు. ఇప్పట్నుంచి ఇంక వెనక్కి చూసుకునే అవసరం లేదు. డాలర్లే డాలర్లు సంపాదన. ఒళ్ళు గగుర్పొడుస్తోంది. కిషోర్ తండ్రి రామయ్య ఆత్రంగా చూస్తున్నాడు కొడుక్కేసి. నిన్నగాక మొన్న పుట్టిన వీడు ఇప్పుడో రెక్కలొచ్చిన పక్షి. ఎగరబోయే తాను ఆపగలడా?

కూడా తెచ్చుకున్న ఆవకాయ, కుక్కరూ వాటితో బరువుగా ఉన్న రెండు సూట్ కేసులూ లోపల చెకింగ్ లో ఇచ్చేసి బయటకొచ్చేడు కిషోర్. ఇంతకు ముందు మళ్ళీ ఎన్నో సార్లు చెప్పిందే అయినా రామయ్య అన్నాడు – – "జాగ్రత్త నాయనా, మన సంస్కృతి వేరూ , వాళ్ళది వేరూ. కంగారు పడి మతం మార్చుకోవడం, వేరే మతం వాళ్ళని పెళ్ళి చేసుకోవడం అనేవి చేయకు. నీకిష్టమైతే మేము చూసాకే......."

కిషోర్ నవ్వుతూ చెప్పేడు, "నాన్నా నేను ఎలాంటివాడినో నీకు తెలియదా? ఐ. ఐ. టి లో ఉన్నంతకాలం నా స్నేహితులందరూ నీకెప్పుడైనా నేను అలాంటి పనులు చేస్తున్నట్టు చెప్పేరా? ఏమీ కంగారు పడకు."

"సరే నీ కూడా వచ్చే స్నేహితులేరీ?"

"వస్తూ ఉంటారు. అందరం వెళ్ళేది ఒకే యూనివర్సిటీకి కదా? అయినా ఇంకా టైం ఉంది."

ఈ లోపులే బిలబిల్లాడుతూ ఓ పది మంది గుమికూడేరు కిషోర్ చుట్టూ. రామయ్య మొహం వికసించింది, " మొత్తం మీద మళ్ళీ అందరూ ఓ చోట చేరేరన్నమాట."

కాసేపు కబుర్లయ్యేక కుర్రాళ్ళందరూ విమానం ఎక్కడానికి లోపలకెళ్తూంటే రామయ్య చెప్పేడు, "వెళ్ళగానే ఫోన్ చేయడం మర్చిపోకండేం?"

"అలాగే" ముందుకి సాగిపోయింది బృందం.

రెండు మూడు గంటల తర్వాత అనేకానేక మెటల్ డిటెక్టర్ల లోంచి కదులుకుంటూ మొత్తం మీద విమానం ఎక్కే గేటు దగ్గిరికొచ్చేరు. ఇంతకు ముందున్న హుషార్లో తెలీని ఆకలీ దాహం ఒక్కసారి బయటకొచ్చేయి తన్నుకుంటూ – సూట్ కేసులు మోయడమా మజాకా? అక్కడే దొరికిన ఏదో గడ్డి తిని బేంక్ కౌంటర్లో చేతిలో ఉన్న రూపాయలు మార్చుకుంటే చేతిలోకి వచ్చింది పదిహేను డాలర్లు. వెళ్ళేక మొదటి నెల స్టూడెంట్ జీతం ఎనిమిది వందలూ

చేతిలో పడ్డానికి ఇంకో మూడు రోజులు పడుతుంది. బేగ్ లో ఉన్న వెయ్యి డాలర్ల చెక్కూ ఓహైయో వెళ్ళేదాకా మార్చడం అనవసరం. ఈ లోపుల విమానంలో పెట్టే తిండి సరిపోతుంది ఎలాగానూ. ఆ తర్వాత చూసుకోవచ్చు.

మొదటిసారి అమెరికా వెళ్తున్నందుకూ, కేస్ వెస్టర్న్ యూనివర్సిటీ లాంటి మంచి స్కూల్లో స్కాలర్ షిప్ వచ్చినందుకూ అందరితోపాటు ఒకే స్కూల్ కి వెళ్తున్నందుకూ కుర్ర మనసు ఉరకలు వేస్తోంది. కుర్రాళ్లందరూ కబుర్లలో పడ్డారు.

"రెండేళ్ళనగా ఎంతరా? కొంచెం కష్టపడితే నాలుగేళ్ళలో మన సీనియర్లు సంపాదించినట్టూ ఎం. ఎస్, పి.హెచ్.డి రెండూ కొట్టేసి ఏదో యూనివర్సిటీలో ప్రొఫెసర్ ఉద్యోగం సంపాదించామంటే ఇంక వెనక్కి చుసుకునే అవసరం లేదు."

"అవును ఇరవై ఐదేళ్ళకి అసిస్టెంట్ ప్రొఫెసర్, ముప్ఫై లోపునే అసోసియేట్, తర్వాత నలభైలోపున ప్రొఫెసర్. రెండు మూడు ప్రపోజల్స్ రాసి డబ్బులు రాబట్టామంటే టెన్యూర్ గేరంటీ. మొన్న మొన్నటిదాకా మనతో పాటు హాస్టల్ ఉండిన రామారావ్ ఇప్పుడు శాన్ డియాగోలో ప్రొఫెసర్ అవలే?"

కిషోర్ అన్నాడు, "ఇవన్నీ అంత బెంగపడేవి కాదు కానీ, ఓ సారి టీచింగ్ లోకి వెళ్ళేక ప్రొపోజల్ రాసి పేటెంట్లు సంపాదించామంటే ఇంక తిరుగులేదు."

పక్కనున్న ఇంకో కుర్రాడు చెప్పేడు, "ఎందుకొచ్చిన గోలరా ఇదంతా. ఎం. ఎస్ అవగానే గూగిల్ లోనో మైక్రోసాఫ్ట్ లోనో జేరిపోతే ఏడాదిన్నరలో ఓ బెంజ్ కారేసుకు తిరగొచ్చు కదా?"

"అలా చేయచ్చనుకో కానీ టీచింగ్ లో చేరితే ఎప్పుడు వస్తున్నాడు, ఎప్పుడు పోతున్నాడనేవి ఎవరికీ అక్కర్లేదు. ఏదో కంపనీలో చేరితే మెడలు వంచి పని చేయిస్తారోయ్"

"అదీ నిజమే. టీచింగ్ లో ఉంటే గ్రాడ్యుయేట్ అసిస్టెంట్ల చేత పని చేయించుకుంటూ తీరిగ్గా ఎంజాయ్ చేయొచ్చు. అదీగాక ప్రపోజల్స్ రాస్తే అందులో వచ్చే జీతం యూనివర్సిటీ ఇచ్చేదానికి తోడౌతుంది. ఎన్ని ప్రపోజల్స్ రాస్తే అన్ని డబ్బులు. ఆకాశమే హద్దు సంపాదనకి. ఏదైనా కంపెనీలో జేరితే అలా కుదురుతుందా?"

"మన రవి గూగిల్లో చేరాక వారానికో రోజు తన సొంతానికి పనిచేసుకోవచ్చని చెప్పేడే?"

"అలా చేసుకున్నా టీచింగ్ లో ఉన్న సౌలభ్యం కంపెనీ లో ఉండదు బాసూ. టీచింగ్ లో పుస్తకాలు రాసుకోవచ్చు, పేపర్లు పబ్లిష్ చేసుకోవచ్చు. క్లాసులు సాయంకాలం అయితే తీరిగ్గా మధ్యాన్నం స్కూలుకెళ్ళినా ఫర్లేదు."

రాబోయే డాలర్ల దగ్గిర్నుంచి సచిన్ టెండూల్కార్ దాకా కబుర్లు సాగేక లైన్లో నుంచుని విమానం ఎక్కేరు ఒక్కొక్కరూ. ఏదో పేపర్లో చూసి విమానంలో కాళ్ళు చాపుకు పడుకోవచ్చనుకున్నారు కానీ లోపలికెళ్ళేక తెల్సింది ఎకానమీ అంటే ఏమిటో. ఇంకో ఎనిమిది గంటలు కాళ్ళు ముడుచుకుని కూర్చోటమే. లండన్ లో దిగేక నాలుగ్గంటలు కూర్చుని మళ్ళీ ఎనిమిది గంటలకి షికాగో. అక్కణ్ణుంచి క్లీవ్ లేండ్ ఇంకో గంటన్నర.

కిషోర్ ఇలా క్లీవ్ లేండ్ చేరేసరికి రామయ్య బొంబాయి నుంచి రైల్లో ఒంగోలు చేరేడు. ఇంటికెళ్ళిన రెండు మూడు గంటల్లో అమెరికానుంచి ఫోన్ వచ్చింది కొడుకు దగ్గిర్నుంచి, క్షేమంగా చేరినట్టూ. హమ్మయ్య.

క్లీవ్ లేండ్ జేరగానే స్కూల్లో అన్ని పనులూ పూర్తిచేసుకునే సరికి లేబర్ డే వీకెండ్! నలుగురు రూమ్మేట్లూ అద్దెకో కారు తెచ్చుకుని పిట్స్ బర్గ్ వెళ్ళడానికి నిర్ణయం అయిపోయింది. నలుగురి ముందూ అడగడం బావుండదు కాబట్టి ఒక రూం మేట్ ని తర్వాత అడిగేడు కిషోర్, డ్రైవింగ్ ఎవరు చేస్తారు, డ్రైవింగ్ ఫర్వా లేదా, రానూపోనూ దారి ఖర్చులెంతవుతాయి, తన దగ్గిర ఇంకా జీతం రాక డబ్బులులేవు కనక తర్వాత ఇవ్వొచ్చా అనే విషయాలు.

ఎంత దాచి అడిగినా అందరికీ తెలియనే తెల్సింది. నవ్వేరు. నెల జీతం వచ్చేక ఇవ్వచ్చు. ఇంక పోతే డ్రైవింగ్ కి ఏమీ ఢోకా లేదు. కిషోర్ కి తప్ప మిగతా ముగ్గురికీ కార్లు లేకపోయినా డ్రైవింగ్ లైసెన్స్ ఉంది. ఒకడి తర్వాత ఒకళ్ళు డ్రైవింగ్ చేసేయగలరు! అదీకాక రాత్రి పూట డ్రైవింగ్ మరీ బావుంటుంది. ఐ ఐ టి లో పరీక్షలప్పుడు ఆల్ నైట్ చదూకున్నట్టే ఇది కూడా. కిషోర్ కి ఒక్కసారి హుషారు పుట్టుకొచ్చింది. అయితే కార్లో నలుగురైతే ఒక్కొక్కళ్ళకీ జేబులోంచి ఎక్కువడబ్బులు పడతాయ్. ఇంకో కుర్రాణ్ణి సంపాదించామంటే డబ్బులు ఆదా చేయొచ్చు. ఎవరున్నారా అని విచారిస్తే ఓ శంకర్రావు దొరికేడు.

శంకర్రావు ది విశాఖపట్నం. ఐ ఐ టి కుర్రాడు కాదు కానీ అందర్లాగే ఎలోగాలా క్లీవ్ లేండ్ లో దిగినవాడే. వచ్చి ఓ సంవత్సరమౌతోంది కానీ ప్రతీదీ నిశితంగా చూస్తూ అన్ని రకాల ప్రశ్నలూ అడుగుతూ ఉంటాడేమో, నిత్యశంకితుడని పేరు తెచ్చుకున్నాడు. కిషోర్ వాళ్ళ టీం "వస్తావా మా కూడా" అని అడిగితే ప్రశ్నలు అడగడం మొదలుపెట్టేడు. మొత్తం ఖర్చు ఎంతౌతుంది? డ్రైవింగ్ లైసెన్స్ మాట సరే హైవే మీద వీళ్ళకి డ్రైవింగ్ అల వాటుందా, రాత్రికి వచ్చేయడం కంటే పగటిపూట డ్రైవింగ్ బావుంటుంది కదా? ఇత్యాది.

కిషోర్ రూమ్మేట్ రమేష్ కి వళ్ళు మండిపోయింది. "వస్తే రా లేకపోతే మానెయ్ కానీ ఇలా చెధవ ప్రశ్నలతో మమ్మల్ని ఏడిపించుకు తినకు." ఖరాఖండీగా చెప్పేసాడు. నిత్య శంకితుడికి ఇంకనోరుమూసుకోక తప్పలేదు. కిషోర్ కి అయితే క్లాసులు మొదలు పెట్టలేదు కానీ మిగతా వాళ్ళకున్న పనుల వల్ల శుక్రవారం సాయంకాలం దాకా కారు అద్దెకి తీసుకోవడం కుదర్లేదు.

అసలే లేబర్ డే వీకెండేమో కారు అద్దెకీ, ఇన్సూ రెన్సుకీ బాగానే వదిలింది చేతి చమురు. శుక్రవారం సాయత్రం బయల్దేరి రాత్రి పదింటికి పిట్స్ బర్గ్ జేరిపోయేరు ఎలాంటి ఆవాంతరాలు లేకుండా. రమేష్ కి తెల్సున్న పెన్ స్టేట్ యూనివర్సిటీ కుర్రాడింట్లో రాత్రికి మకాం. శనివారం కొండమీద వెంకన్న దర్శనం. పెన్ హిల్స్ చిన్నదైనా దాదాపు అవే వంకర్లు ఉన్న చిన్న సైజు తిరుపతే. అక్కడ్నుంచి చూస్తే పక్కనే ఉన్న హైవే మీద కార్లు నున్నగా జారిపోతున్న చిత్రం. వావ్! ఊరంతా తిరిగి ఆదివారం రాత్రి పన్నెండింటికి మళ్ళీ క్లీవ్ లేండ్ వచ్చేయడం కిషోర్ కి అద్భుతంగా అనిపించింది. డభ్భై మైళ్ల స్పీడుతో వెళ్తున్నప్పుడు కూడా ఏ ఒడిదుడుకులూ లేని రోడ్లూ, ఎక్కడపడితే అక్కడున్న రెస్ట్ ఏరియాలూ, పద్దెనిమి చక్రాల ట్రక్కులూ, ఓహ్ ఏం అమెరికా!

సెప్టెంబర్ నుంచి కిషోర్ కి క్లాసులు మొదలయ్యేయి. హై స్కూల్లో ఇచ్చినట్టూ రోజూ హోం వర్క్ ! మూడు వారాలు తిరిగేసరికి కిషోర్ కి తెలిసొచ్చింది ఎంత పని చేయాలో. వారానికి ఇరవై గంటలు లేబ్ లో పని చేయాలన్నారు సరే. ఇరవై గంటలు మాత్రం చేస్తే పనయ్యేదెప్పుడు? తనకి డిగ్రీ వచ్చేదెప్పుడు? అపార్ట్ మెంట్ – డిపార్ట్ మెంట్, ఎడ్వైసర్ – బడ్ వైజర్ అన్న సామెత గుర్తుకొచ్చింది.

కాస్త దక్షిణంగా ఉంటే అక్టోబర్ దాకా కోటు అక్కర్లేదేమో కానీ ఇప్పుడున్నది క్లీవ్ లేండ్. అసలే చలి అని ఛస్తూంటే సంధి మంత్రం అన్నట్టూ క్లీవ్ లేండ్ ఉండేది సముద్రమా అన్నట్టుంటే లేక్ ఈరీ పక్కన. అక్టోబర్ నాటికి కాస్త స్నో పడడం మొదలింది. నవంబర్ దాకా స్నో రాదనుకుంటే ఇప్పుడే వచ్చిందేమిటా అని కిషోర్ న్యూస్ అంతా ఆసక్తిగా చదవడం మొదలుపెట్టేడు. అప్పుడు తెల్సింది – లేక్ ఎఫెక్ట్ స్నో అంటే ఏమిటో. ఉత్తరోత్తరా తెల్సింది ఏమిటంటే క్లీవ్ లేండ్ లాంటి ప్రదేశాల్లో ఉండేది దాదాపు ఒకటే వాతావరణం – తొమ్మిది నెలలు వణికించే చలీ, మరో మూడు నెలలు మామూలు చలీను. ఇలంటి ఊళ్ళల్లో ఉంటే గానీ ఇంగ్లీషులో కూల్ అనే పదానికీ కోల్డ్ అనే పదానికీ అర్ధం తెలియదేమో.

ఇండియా నుంచి మొదటిసారి అమెరికా వచ్చిన అందరికీ తగిలే వాతావరణం షాక్ కిషోర్ కీ తగిలింది. ఇక్కడ వర్షాకాలం అనేదే లేదు. సంవత్సరంలో ఏ రోజైనా వర్షం పడొచ్చు. అక్టోబర్ నుంచి దాదాపు మార్చ్ దాకా న్యూస్ లో వాతావరణం చూసినా చూడకపోయినా ఒక్కటే. క్రమం తప్పకుండా చెప్పగలిగేది ఏమిటంటే – ఈ రోజు మబ్బు కమ్మి ఉంటుంది. సూర్యుడు పాక్షికం. ఇరవై నుంచి ముప్ఫై శాతం వర్షం గానీ స్నో గాని పడొచ్చు.

నవంబర్ వస్తూనే మళ్ళీ కుర్రాళ్లందరూ థేంక్స్ గివింగ్ కి ఎక్కడికెల్దామా అని ఆలోచనలో పడ్డారు. ఈ సారి శంకర్రావు చెప్పేడు, "న్యూయార్క్ లో మా మావయ్య ఉన్నాడు. నన్ను రమ్మని ఏడాదిగా అడుగుతున్నాడు. మీరు వస్తానంటే మాట్లాడి చూస్తాను."

"న్యూయార్క్ చూడ్డానికి బావుంటుంది కానీ మనం వెళ్ళేది అయిదుగురం. అంతమంది దాడి చేసినట్టు వెళ్తే బావుండదేమో." కిషోర్ అన్నాడు.

"అడుగుతానని చెప్పేను కదా. వద్దు అన్నాడనుకో ఇంకోసారి వెళ్ళొచ్చు."

రమేష్ అడిగేడు, "న్యూ యార్క్ సిటీలో ఉంటారా లేకపోతే దగ్గిరున్న సబర్బ్ లోనా?"

"న్యూ జెర్సీ, ఎడిసన్ లో"

"సబర్బ్ అన్నమాట. అక్కడైతే న్యూ జెర్సీ, న్యూ యార్క్ రెండూ చూసి రావొచ్చు."

"అట్లాంటిక్ సిటీ కూడానా?" కాస్త తెగింపున్న ఇంకో కుర్రాడు పక్కనుంచి అడిగేడు.

"అట్లాంటిక్ సిటీ సమ్మర్ లోరా నాయనా. సముద్రం పక్కన ఈదురుగాలిలో చలిలో పెద్దగా తిరగడం కష్టం."

"మీ మావయ్యకి పిల్లలున్నారా?"

"ఇద్దరమ్మాయిలు."

"ఏం చేస్తున్నారేం?"

"ఓ అమ్మాయి కాలేజీలో న్యూరో సైన్సు చదూతోంది. రెండో అమ్మాయి ఎనిమిదిలోనో తొమ్మిదిలోనో"

"అదన్న మాట సంగతి. మనోడికి కాబోయే పెళ్ళాన్ని చూడ్డానికెల్దామని సర్దా," ఆట పట్టించేడు రమేష్. శంకర్రావు సిగ్గుపడిపోయేడు, "ఆ అమ్మాయ్ ఇక్కడ పుట్టిందోయ్, నేను ఆనతానా వాళ్ళకి?"

"సరే మీ మావయ్యని అడిగిచూడు.ఏమంటాడో చూసి ఆలోచిద్దాం."

రెండ్రోజుల తర్వాత మావయ్యతో మాట్లాడిన శంకర్రావ్ చెప్పేడు, "మావయ్యకేమీ ఇబ్బంది లేదు. గురువారం రాత్రి టర్కీ వండుతున్నాను తప్పకుండా రండి అన్నాడు. న్యూ యార్క్, న్యూ జెర్సీ అన్నీ చూసేసి ఆదివారం వెనక్కొచ్చేయచ్చు."

"సోమవారం నాకో టెస్ట్ ఉంది. శనివారం రాత్రికి వచ్చేస్తే ఆదివారం చదువుకుని టెస్ట్ కి వెళ్ళొచ్చు." కిషోర్ చెప్పేడు.

"అదో పెద్ద పనా. నీ పుస్తకాలు తెచ్చుకోవోయ్, దారిలో చదూకోవచ్చు. మేం డ్రైవ్ చేస్తూంటే నువ్వు చదువుకో."

ఒక్కసారి మొదటి లేబర్ డే నాటి ప్రయాణం గుర్తొచ్చింది కిషోర్ కి. ఎంత స్పీడ్ గా వెళ్ళినా ఒడిదుడుకులు లేకుండా ఉండడం అవన్నీను. వెంఠనే ఒప్పేసుకున్నాడు.

థేంక్స్ గివింగ్ ముందురోజు బుధవారం సాయంత్రం. ఐదుగురూ చిన్న చిన్న బేగ్గుల్తో బయల్దేరేరు. పక్క అపార్ట్ మెంట్లో కుర్రాళ్లు కాస్త అసూయగా చూసిన మాట వాస్తవం. ఇండియా నుంచి కిషోర్ కూడా వచ్చిన కొంతమంది కారు దాకా వచ్చేరు కబుర్లు చెప్పడానికి. ఎవరు ముందు డ్రైవ్ చేస్తున్నారు, ఎలా సర్దుకుంటారు, ఇలా కలగాపులగంగా కబుర్లు. ఐదింటికే చీకటి పడిపోవడంతో లైట్లు వెలుగుతున్నాయ్ రోడ్డుమీద. బండి బయల్దేరుతూండగా పక్క అపార్ట్ మెంట్ కుర్రాడొకడు చెప్పేడు డ్రైవ్ చేసే రమేష్ తో "జాగ్రత్తగా డ్రైవ్ చేయండి. వచ్చేటప్పుడు న్యూయార్క్ నుంచి మా అందరికీ తలో టి.షర్ట్ తెచ్చిపెట్టండి. హేపీ జర్నీ."

రమేష్ థేంక్స్ చెప్పి నవ్వుతూ చేయూపేడు. టయోటా కామ్రీ మెత్తగా రోడ్డుమీదకి జారిపోయింది.

అదృష్టవసాత్తూ వెళ్ళేటప్పుడు దారిలో స్నో పెద్దగా లేదు హైవే ఎనభై మీద కానీ మరెక్కడా కానీ. ఎనిమిది గంటల్లో వెళ్ళిపోవచ్చు ఏమీ ట్రబుల్ లేకుండా. శంకర్రావ్ మావయ్య ఇంటికెళ్ళేసరికి రాత్రి రెండు కావస్తోంది. తలుపు కొట్టగానే వచ్చి తలుపు తీసేడాయన. కుశల ప్రశ్నలయ్యేక బేస్ మెంట్ లోపలున్న రెండు బెడ్రూములూ ఓ బాత్రూమూ వీళ్ళకి కేటాయించి పైకెళ్ళి పడుకున్నాడు. డ్రైవ్ చేసిన రమేష్ మరో ఇద్దరికీ అప్పటికే నిద్ర వస్తూంది. ఒళ్ళు తెలీకుండా నిద్ర. లేచేసరికి మర్నాడు పదకొండు.

గురువారం పొద్దున్న లేచాక శంకర్రావు అత్తయ్య పలకరించి మెత్తగా చివాట్లు పెట్టింది, అంత రాత్రిదాకా మేలుకుని ఉండడం ఎందుకో, అలా డ్రైవ్ చేయడం ఎందుకు మంచిది కాదో చెప్తూ. ఈ ప్రహసనం అలా ఆగకుండా పోయేసరికి రమేష్ అందుకున్నాడు, "ఫర్లేదండి, మేం ముగ్గురం డ్రైవ్ చేస్తున్నాం కదా?" దాంతో ఆవిడకి నోరుమూసుకోక తప్పలేదు.

మధ్యాహ్నం అలా ఊర్లో తిరిగొస్తామని చెప్పి దగ్గిర్లో ఉన్న బెస్ట్ బై, వాల్ మార్ట్ దుకాణాలన్నీ చూస్తూంటే చలిలో మూసేసిన షాపులముందు గుడారాలేసుకుని కూర్చున్న జనాల్ని చూసి కిషోర్ అడిగేడు ఆశ్చర్యంగా, "ఇదేమిటి గురూ వీళ్ళు షాపులముందలా నుంచున్నారు?"

"రేప్పొద్దున్నే నాలుగింటికి తీస్తారు షాపులన్నీ. టి.వి.లు, కంప్యూటర్లూ చవగ్గా దొరుకుతాయ్. అవి కొనడానికి ఈ లైన్లు."

"తీరిగ్గా పదింటికి రావొచ్చు కదా శెలవు రోజున?"

"అప్పటికి రేట్లు మారిపోతాయ్ బాసూ. ఈ లైన్లో నుంచుంటేనే దొరుకుతాయో లేదో చెప్పలేం."

సాయంత్రం టర్కీ డిన్నర్ అయ్యేక కబుర్లు చెప్పుకుంటూ, మర్నాటికి న్యూ యార్క్ సిటీ ప్రయాణం, ఎలా వెళ్తే మంచిదీ అవన్నీ మాట్లాడుకున్నాక మళ్ళీ యధావిధిగా లేటు నిద్రే.

శుక్రవారం అంతా న్యూ యార్క్ చూడ్డంలో అయిపోయింది. వరల్డ్ ట్రేడ్ సెంటర్ దగ్గిర్లో పది డాలర్లకి ఐదు షర్ట్ లు అమ్ముతుంటే రమేష్ మర్చిపోకుండా కొన్నాడు పక్క అపార్ట్ మెంట్ స్నేహితులకి. శనివారం న్యూజెర్సీ చూడ్డానికీ, ఎడిసన్ లో ఉన్న ఇండియన్ షాపులకీ తిరిగాక సాయంత్రం ఇంటికొచ్చి చెప్పేడు శంకర్రావ్ మావయ్యతో, "సోమవారం మా కిషోర్ కి టెస్ట్ ఉంది. అంచేత ఈ రాత్రి బయల్దేరి వెళ్ళిపోదాం అనుకుంటున్నాం. రేప్పొద్దున్న దాకానే కార్ అద్దెకి తీసుకున్నాం. ఇప్పుడు బయల్దేరితే రాత్రి రెండూ మూడు లోపుల వెళ్ళిపోవచ్చు. పొద్దున్నే లేచి కార్ ఇచ్చేసి టెస్ట్ కి తయారౌవచ్చనీ.....”

మావయ్య ఏదో అనబోతూంటే అత్తయ్య అందుకుంది. "అసలు మీకు బుద్ధుందా? వచ్చేటప్పుడు రాత్రి రెండింటికి వచ్చేరు. మళ్ళీ ఇప్పుడు రాత్రి. థేంక్స్ గివింగ్ కి వేరే ఊరువెళ్ళిన వాళ్ళందరూ ఆదివారం పొద్దున్నే బయల్దేరుతారు. రాత్రి డ్రైవింగ్ అంత మంచిది కాదు కూడా..."

రమేష్ అందుకుని చెప్పేడు, "మీరే చెప్తున్నారుగా ఆదివారం అందరూ బయల్దేరతారని? ఆ రష్ తప్పించుకుందుకే ఇప్పుడు వెళ్దామనుకుంటున్నాం"

"రష్ మాట అలా ఉంచు బాబూ. రాత్రి పూట ట్రక్కులూ అవీ ఎందుకొచ్చిన గోల అసలే చలికాలం. తీరిగ్గా రేప్పొద్దున్న బయల్దేరవచ్చు. ఇప్పుడు వద్దు."

"అదీ నిజమే. మీకు మహా అయితే ఈ రోజు పోతుంది. కానీ దార్లో ఏ ప్రమాదమైనా జరిగితే ఎందుకొచ్చిన గోల, రేపు పొద్దున్నే బయల్దేరండి." మావయ్య చెప్పేడు.

"అలా కాదండి వెళ్ళాలి. కార్ రేపటి పొద్దున్న వరకే తీసుకున్నాం. టైం కి ఇవ్వకపోతే తర్వాత ఎక్కువ ఛార్జ్ చేస్తారు."

"ఎంత ఎక్కువ ఛార్జ్ చేస్తాడు? యాభై డాలర్లా? మీ జీవితం కంటే ఎక్కువా అది? వద్దని చెప్తూంటే మాట వినిపించుకోరేం?" అత్తయ్య అరిచింది.

"అంత కోపం ఎందుకండీ? మేము ముగ్గురం డ్రైవర్లం ఉన్నాం. ప్రతీ వంద మైళ్ళకీ ఆగి డ్రైవర్ మారుతూ వెళ్ళిపోగలం. ఇప్పటి వరకూ చాలా సార్లు ఇలాగే చేసాం కూడా. కావలిస్తే ఈ మధ్యనే అమెరికా వచ్చిన కిషోర్ ని అడగండి. అసలు టెస్ట్ ఉన్నది అతనికే"

అత్తయ్య కిషోర్ కేసి చూసింది. కిషోర్ నవ్వుతూ తలూపుతూ చెప్పేడు, "అవునండి. వీళ్ళు ముగ్గురూ బాగా డ్రైవ్ చేస్తారు. నేను చదువుకోవడం కూడా ఇప్పుడు క్లీవ్ లేండ్ వెళ్తూ కార్లోనే."

“టివిలో రెండు మూడు అంగుళాల స్నో పడుతుందని చెప్తున్నారొరే” మావయ్య చెప్పేడు.

రమేష్ నవ్వేసాడు, "క్లీవ్ లేండ్ లొ రెండు మూడు అంగుళాల స్నో రోజూ పడుతుందండి. మేమున్నదే లేక్ ఈరీ పక్కన. దానికేనా ఇంత భయపడ్డం?”

శంకర్రావ్ మావయ్య అడిగేడు, "మీకు ట్రిపుల్ ఏ మెంబర్ షిప్ ఉందా? కారు ఏదైనా ట్రబుల్ ఇస్తే వాళ్ళని పిలవొచ్చు."

"లేదండి. కారు కొత్తదే. రెంటల్ కారు వాడు నెంబరిచ్చేడు ఏదైనా ప్రోబ్లెం వస్తే ఫోన్ చేయమని. అవి చాలవా?"

మావయ్యకేమనాలో తోచలేదు. రాజుకన్నా మొండివాడు బలవంతుడు. వీళ్ళతో ఎంత చెప్పినా వినరే? అత్తయ్య వద్దు వద్దంటున్నా రాత్రి ఎనిమిదింటికి భోజనాల తర్వాత కారెక్కేసింది మిత్ర బృందం. బండి బయల్దేరుతూంటే శంకర్రావ్ మావయ్య చెప్పేడు, "ఏదైనా అవసరం వస్తే ఫోన్ చేయండి ఎంత రాత్రైనా ఫర్వా లేదు." శంకర్రావ్ తలాడించేడు.

శనివారం రాత్రి. తానా ప్రెసిడెంట్ కుమార్ కి వారాంతంలో అందరూ పడుకున్నాక టివీలో ఇంగ్లీష్ సినిమాలు చూడ్డం అలవాటు. పగలు ఎలాగా టివీ అంతా పెళ్ళాం పిల్లచేతుల్లో చేతుల్లో ఉంటుంది. ఆ తెలుగు సినిమాల్లో తింగరి డేన్సులూ అవీ తాను చూళ్ళేడు. ఈ తానా ప్రెసిడెంట్ పదవొచ్చాక అసలు టివి చూడ్డమే గగనమై పోతోంది. రోజూ ఎవరో పిలవడం, ఏక్సిడెంటో మరోటో అనడం. దాంతో ఫోన్ మీద గంటల తరబడి మాట్లాడుతూ తెలిసున్న జనాల్ని పోగుచేసి వీళ్ళకి హెల్ప్ చేయడం. ఎప్పుడో ఓ సారి అయితే అనుకోవచ్చు కానీ ఇది ఈ మధ్య సర్వ సాధారణం అయిపోయింది. ఒకాయన

ఈత రాకుండా పూల్ లో దిగి మునిగిపోయేడు. ఇంకో ఆయన రాత్రి తొంభై మైళ్ళ వేగంతో వెళ్తుంటే పోలీస్ పట్టుకున్నాడు. తీరా చూస్తే అమెరికన్ డ్రైవింగ్ లైసెన్స్ లేదుట. ఉన్నది ఇంటర్నేషల్ డ్రైవింగ్ లైసెన్స్. పోలీసుల్తో మాట్లాడి జైలు శిక్ష పడకుండా చూసేసరికి తల ప్రాణం తోక్కొచ్చింది. ఇలా రోజుకో తంటా.

టీవీ ఆన్ చేసి కేబుల్లో వచ్చే సినిమాలు వెదకడం మొదలుపెట్టేడు.మరో ఐదు నిముషాల్లో మొదలయ్యే "వాట్ డ్రీంస్ మే కం" అనే రాబిన్ విలియంస్ సినిమా ట్యూన్ చేసి సెల్ ఫోన్ దగ్గిర్లో పెట్టుకుని సినిమా చూడ్డం మొదలుపెట్టాడు. హీరో వాళ్ళావిడ చచ్చిపోతే స్వర్గానికి వెళ్తుందనుకున్న వాళ్ళావిడ నరకంలో ఉందని తెలిసి అక్కడకెళ్ళీ ఆవిడ స్పిరిట్ ని వెదకడం, అలా జరుగుతోంది కథ. దాదాపు సినిమా అయిపోవస్తూంటే విలియంస్ వాళ్ళావిడ అడుగుతోంది.

"మళ్ళీ నేను పుడితే న్యూ జెర్సీలో నన్ను గుర్తు పట్టుకోగలవా?"

"నిన్ను నరకం అంతా వెతికి పట్టుకోగా లేంది న్యూ జెర్సీలో పట్టుకోలేనా?" చెప్తున్నాడు రాబిన్ విలియంస్.

మంచి సినిమా చూసానన్న తృప్తితో లేచి టివి కట్టేసి లేచేడు కుమార్. సరిగ్గా అప్పుడే ఫోన్ మోగింది. "తానా ప్రెసిడెంట్ కుమార్ ఉన్నారా?" అడుగుతున్నారెవరో అమెరికన్ ఏక్సెంట్లో. ఇది మరో డేంజరస్ కేసే ఏమీ అనుమానం లేదు.

"అవును చెప్పండి"

"మీరెక్కడుంటారు?"

"పిట్స్ బర్గ్, పెన్సిల్వేనియా లో"

"నేను ఓహైయో స్టేట్ పోలీస్ ట్రూపర్ ని. హైవే 80 మీద కారు ఏక్సిడెంట్ అయింది, ఆక్రాన్ నుంచి కొంచెం దూరంలో హడ్సన్ అనే ఊరి దగ్గిర. కార్లో ఐదుగురున్నారు. ఇండియన్స్ అని తెలుస్తోంది కానీ ఎవర్నీ గుర్తు పట్టలేకపోతున్నాం. నలుగురు ఏక్సిడెంట్ జరిగిన చోటే పోయారనీ, అయిదో అతనికి మెడా, నడుం విరిగాయనీ పారామెడిక్స్ అంటున్నారు. ఐ.డిలు చూస్తే కేస్ వెస్టర్న్ స్కూల్ స్టూడెంట్స్ అని తెలుస్తోంది. మీ ఫోన్ నెంబర్ ఇక్కడ ట్రాఫిక్ లో ఆగిన ఇంకో ఇండియన్ ఇచ్చారు. ఆయనతో మాట్లాడతారా? వీళ్ళవాళ్లని ఎలా కంటేక్ట్ చేయడం?"

కుమార్ కి వెన్నులోంచి వణుకు పుట్టింది. "సరే ఆ ఇండియన్ కి ఫోన్ ఇవ్వగలరా?"

ఆ ఇండియన్ తెలుగులోనే మాట్లాడుతున్నాడు, "మన కుర్రాళ్ళేనండి. పాపం నలుగురూ పోయేరు. నేను చూసాను. ఐదో కుర్రాడు దాదాపు పోయినట్టే. చివరి సారిగా చెక్ అప్ కోసం హాస్పిటల్ కి తీసుకెళ్తున్నారు హెలికాప్టర్ లో. ఇక్కడంతా అయోమయంగా ఉంది...."

"అసలు ఏక్సిడెంట్ ఎలా జరిగిందో మీకు తెలుసా?" కుమార్ అడిగేడు.

"వీళ్ళు చెప్పడం ప్రకారం, కుర్రాళ్ళదే తప్పు. డ్రైవ్ చేస్తూంటే మీడియన్ దాటి అటు వేపు వెళ్ళిపోయింది కారు. ఎదురుగా వచ్చే ట్రక్కుని గుద్దేసారు. ఇక్కడ అసలే స్నో పడుతోంది. రోడ్లు జారుతున్నాయి కూడా. నలభైల్లో వెళ్ళడమే గగనంగా ఉంది. డ్రైవర్ నిద్రలోకి జారిపోయాడేమో అని నా అనుమానం."

"చెప్పలేం లెండి, ఐస్ మూలాన కూడా అలా అవ్వొచ్చు కదా?"

"తప్పకుండా అవ్వొచ్చు. మీరేమైనా సహాయం చేయగలరా?"

"నేను క్లీవ్ లేండ్ ఇండియన్ స్టూడెంట్ అసోసియేషన్ తో మాట్లాడి వాళ్ళలో ఎవర్నో హాస్పిటల్ కి వెళ్ళమని చెప్తాను. ఆ తర్వాత తెలుగు అసోసియేషన్ వాళ్ళతో చెప్పి ఏదో చేస్తానని చెప్పండి. ఇప్పుడు అక్కడకి రావడం అనవసరమూ, కుదరదూ. క్లీవ్ లేండ్ నుంచి ఎవరో ఒకరు వస్తారు హాస్పిటల్ కి. ఆ తర్వాత ఎలా జరగాలో అలా చేద్దాం."

ఇదే విషయం మళ్ళీ పోలీస్ తో ఇంగ్లీషులో చెప్పి ఫోన్ పెట్టేసిన కుమార్ స్థబ్దుగా ఉండిపోయేడు. ఇది ఎన్నో సారి ఇలా అవడం? రాత్రి డ్రైవ్ చేయడం మంచిది కాదని ఎన్ని సార్లు చెప్పాలి? అమెరికా రాగానే ఇంత తెగువ ఎలా వస్తోంది వీళ్ళకి? దేశం అంతా పరీక్షలు పెట్టి సెలెక్ట్ చేసుకున్న మేధావులైన కుర్రాళ్ళు ఇలా ఎందుకు చేస్తున్నారు? పోయినవాళ్ళందరికీ ఇరవై ఐదులోపే ఉండొచ్చు. ఎంత వేస్ట్? ఇదంతా ఒక ఎత్తైతే ఇప్పుడు ఇండియాలో ఉన్న వీళ్ళ తల్లితండ్రులెలా తీసుకుంటారు దీన్ని? తల బద్దలు కొట్టుకున్నా సమాధానాలు రాని ప్రశ్నలు అన్నీను. తానా ప్రెసిడెంట్ అయ్యేక తన బతుకు

దాదాపు చావుల్తోటీ, శ్మశానాల్తోటీ ఓ ఫ్యూనరల్ డైరక్టర్ ఉద్యోగంలా తయారైంది. ఇదంతా చేస్తే ఇదో థేంక్ లెస్ జాబ్. ఫోన్ చేసి మీ అబ్బాయ్ ఇలా చచ్చిపోయాడనీ, శవాన్ని ఇంటికి పంపిస్తున్నామనీ చెప్పాలి. శెభాషైన ఉద్యోగం.

ఆ తర్వాత మూడు గంటలు నిముషమో యుగంలాగా గడిపేడు కుమార్. క్లీవ్ లేండ్ తెలుగు అసోసియేషన్ తోటీ, తోటి కుర్రాళ్లతోటి మాట్లాడి ఒకరు హాస్పిటల్ కి వెళ్ళేలా చూసేడు. అయితే ఎవరూ హాస్పిటల్ కి వెళ్ళకముందే జరిగిన విషయమేమంటే, కొన ప్రాణాలతో కొట్టుకుంటూన్న శంకర్రావుని హెలికాప్టర్లో హాస్పిటల్ కి తీసుకెళ్తూంటే దార్లోనే అతని ప్రాణం కూడా పోయింది. ఎంతో కంగారుగా వద్దంటున్నా బయల్దేరిన అతి గొప్ప మేధావుల జీవితాలు అర్ధాంతరంగా అలా తెల్లారిపోయేయి. కారు మర్నాడు ఇవ్వకపోతే కట్టాల్సిన వందో, నూట యాభయ్యో డాలర్ల కోసం అర్థరాత్రి – అదీ రాత్రి డ్రైవింగ్ ఎంతో మజా అనుకుంటూ – డ్రైవ్ జేసిన కుర్ర మేధావులు ప్రాణాలే పోగొట్టుకున్నారు. ప్రాణాలెక్కువా, డాలర్లెక్కువా?

చిత్తుగా స్మాష్ అయిపోయిన కా ర్లో బేగ్గులు మాత్రం ఏమీ అవలేదు. ఆ సామానంతా పక్క అపార్ట్ మెంట్లో ఉన్న కుర్రాళ్ళకిచ్చేసారు – చనిపోయిన వాళ్ళ ఫేమిలీలకి ఇవ్వమని. పక్క అపార్ట్ మెంట్లో కుర్రాళ్ళు సరదాగా తెమ్మన్న న్యూ యార్క్ టి. షర్ట్ లు మాత్రం చెక్కుచెదరకుండా వచ్చేయి ఇంటికి.

ఏదో ఒకరోజు డాలర్లు బాగా సంపాదించి విమానం ఫస్ట్ క్లాసులో వెనక్కి వద్దామనే కోరికతో అమెరికా వెళ్ళిన ఐదుగురు కుర్రాళ్ళు విగతజీవులగా పేక్ చేసిన పెట్టెల్లో విమానం వెనకభాగంలో కోల్డ్ స్టోరేజ్ లాంటిదానిలో ఉంచి వెనక్కి తీసుకురాబడ్డారు. అక్కడ్నుంచి ఐదు శరీరాలు వాళ్ల వాళ్ల ఊర్లకి జేరవేయబడ్డాయ్. శరీరాలని దహనం చేయడానికి శ్మశానం దాకా వెళ్ళిన స్నేహితులూ, చుట్టాలూ – వేరు వేరు ఊర్లలోనే అయినా సరే ఒకే మాట మాత్రం అనుకున్నారు – “ఏక్సిడెంట్లో నుగ్గు నుగ్గుగా ఐపోయి వెనక్కొచ్చిన శవాన్ని తమ కుర్రాడని పోల్చుకోవడం అసాధ్యం.”

(ఈ మధ్య కాలంలో కారు ఏక్సిడెంట్లూ, గేస్ స్టేషన్లో కాల్పుల వల్ల పోయేవారూ, ఈత రాక పూల్ లో మునిగి చనిపోయేవారూ, ఒక్కసారి డ్రైవింగ్ లైసెన్స్ రాగానే విజయగర్వంతో హైవే మీదకి వెళ్ళి పోయినవాళ్ళు ఇలా ఎంతో మంది ఉన్నారు. వీళ్ళలో సరైన ఇన్సూరన్స్ లేని వాళ్ళూ ఎంతమందో. ఎన్ని జాగ్రత్తలు చెప్పినా రాత్రి డ్రైవింగ్ చేయడం ఒక ఫేషన్ అనుకోవడం, రాత్రంతా మేలుకుని ఉంటే అదో పెద్ద ఘనకార్యం అనుకోవడం. ఇది స్టూడెంట్స్ కే కాక పిల్లా పాపల్తో ఉన్నవాళ్ళకీ వర్తిస్తోంది. నా ఇద్దరు రూమ్మేట్లు డ్రైవింగ్ చేస్తూ నిద్ర పట్టేస్తే మీడియన్ దాటి వెళ్ళడం, అదృష్టవశాత్తూ ఏమీ కాకపోవడం జరిగింది. మరో ఫేమిలీ కూడా టైర్లు ఐస్ మీద జారితే దెబ్బలు తగలకుండా తప్పించుకున్నారు. కానీ తానా నుంచి రోజూ వచ్చే మెయిల్స్ చూస్తూ ఉంటే రోజూ ఎంతమంది పోతున్నారో తెలిస్తే ఆశ్చర్యం, కోపం కలగక మానవు. ఇంత జరుగుతున్నా ఈ చావులూ అవీ మాత్రం అప్రతిహతంగా సాగిపోతున్నాయి. నేను చెప్పినది నమ్మకం లేకపోతే తానా వార్ని నిరభ్యరంతరంగా అడగండి. ఈ కథ ఏ ఒక్కరికి ఉపయోగపడినా అంతకన్నా కావాల్సింది ఏమీలేదు.)

# నిర్ణయం

## అప్పరాజు నాగజ్యోతి

ఆదివారం మధ్యాహ్నం భోజనాలై పనంతా ముగించుకుని ఇలా సోఫాలో నడుం వాల్చానో లేదో ఫోన్ మ్రోగింది. అక్క కూతురు శృతి నుండి . “పిన్నీ మేము ఫ్లాట్ కొనుక్కున్నాము, ఇక్కడే హైటెక్ సిటీలో, మా ఆఫీస్‌కి దగ్గరలో. ఈ నెల పద్దెనిమిదిన , రాత్రి రెండు గంటలకు గృహ ప్రవేశం. నువ్వు, బాబాయి, పిల్లలూ తప్పకుండా రావాలి. నాల్గురోజులముందే వచ్చేయండి “ ఇదీ ఆ ఫోన్ సారాంశం.

రెండు సంవత్సరాల క్రిందట దాని పెళ్ళి ఆహ్వానం కూడా ఇలానే ఫోన్‌లో అందిన విషయం జ్ఞప్తి కి వచ్చి మనసు గతంలోకి జారింది.

★★★

శృతి మా అక్కయ్య ఒక్కగానొక్క కూతురు. ఎంతో గారాబం గానూ, మరెంతో పద్ధతిగానూ పెరిగింది. మంచి ర్యాంకు తెచ్చుకుని ఇంజనీరింగ్ కాలేజీలో చేరి క్యాంపస్ సెలక్షన్‌లో ఉద్యోగం తెచ్చుకుంది. ట్రైనింగ్ తరవాత హైదరాబాద్‌లోనే పోస్టింగ్ వచ్చేసరికి యిక ఇంట్లో పెళ్ళి ప్రయత్నాలు మొదలయ్యాయి.

బావా వాళ్ళది రిచ్ ఫ్యామిలీ. అక్కా, బావా ఇద్దరూ గవర్నమెంట్ ఆఫీసర్స్‌గా పని చేస్తున్నారు. పరువు, ప్రతిష్ఠ, సాంప్రదాయం వీటన్నింటికి పెద్ద పీట వేసే మనస్థత్వాలే ఇద్దరివీనూ.

చక్కటి సాంప్రదాయిక కుటుంబం నుండి వచ్చిన అబ్బాయితో శ్రుతి పెళ్ళి నిశ్చయం అయ్యింది. అబ్బాయి అందగాడు. స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో చదివాడు. ఒక్కడే కొడుకు. రావ్ అండ్ రావ్ గ్రూప్ ఆఫ్ కంపనీస్‌కి ఏకైక వారసుడు. ఎంగేజిమెంట్ ఎంతో ఘనంగా స్టార్ హోటల్లో జరిగింది.

అందమైన జంటకి ఊరందరి దిష్టి తగిలిందేమో అన్నట్లు నెల రోజుల్లో జరగాల్సిన పెళ్ళి ఆగిపోయింది. కారణం శృతికి పెళ్ళికొడుకు ప్రవర్తన నచ్చలేదు. అక్కా బావా ఎంత నచ్చచెప్పటానికి ప్రయత్నించినా శృతి మొండికేయటంతొ పెళ్ళి క్యాన్సిల్ అయ్యింది. అక్కా, బావా చాలా అప్సెట్ అయ్యారు. పరువు పోయిందని బాధ పడ్డారు. కాలం అన్ని గాయాలనీ మానుపుతుంది కదా. కొన్నాళ్ళకి మళ్ళీ పెళ్ళి ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇంతలో మరో అవాంతరం. శృతి తన కోలీగ్ అంటూ మనోజ్‌ని ఇంటికి తీసుకువచ్చి అమ్మా , నాన్నా లకి పరిచయం చేసింది. అతన్నే పెళ్ళి చేసుకుంటాననీ , ఇక తనకి వేరే పెళ్ళి సంబంధాలు చూడొద్దనీ చెప్పింది. సాంప్రదాయానికీ, కట్టుబాట్లకీ ప్రాణమిచ్చే అక్కా బావా యీ కులాంతర వివాహాన్ని ఆమోదించలేకపోయారు. నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. వాళ్ళని ఒప్పించటానికి తను చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కాగా చివరకి ఫ్రెండ్స్ సాయంతొ ఆర్య సమాజంలొ పెళ్ళి చేసుకుంది శ్రుతి. ఆ రోజూ ఇలాగే దాని దగ్గరనుండి ఫోన్ – “ పిన్నీ , నా పెళ్ళి వచ్చే శుక్రవారం, తప్పకుండా రండి “ అని.

ఎంతో ఆర్భాటంగా జరగవలసిన దాని పెళ్ళి సింపుల్‌గా దాని స్నేహితుల అధ్వర్యంలో జరిగిపోయింది. అక్కా, బావా, నేనూ, అమ్మా, నాన్నా కేవలం అతిథుల్లాగా దాని పెళ్ళి చూసి వచ్చాము. మా కుటుంబంలో మొట్టమొదటి అమ్మాయి పెళ్ళి అలా జరగడం మా అందరికీ ఎంతో బాధగా అనిపించింది. కానీ ఏదీ మన చేతుల్లో లెదు. పిల్లలని పెంచడం, పెద్ద చేయడం వరకే మన బాధ్యత, కర్తవ్యం. ఆ తరవాత వాళ్ళ అభిప్రాయాలూ, నిర్ణయాలూ వాళ్ళవే. తరాల అంతరాలు ఎప్పుడు వుంటూనే వుంటాయి.

మళ్ళీ ఇన్నాళ్ళకి, పెళ్ళైన రెండేళ్ళకి శృతి నుండి గృహప్రవేశ ఆహ్వానం. చాలా సంతోషమేసింది, మా కళ్ళ ముందు పెరిగిన పిల్ల అప్పుడే పెళ్ళి చేసుకుని, స్వంత యిల్లు కట్టుకుందంటే.

పిల్లలకి పరీక్షలు, యింకా టెన్నిస్ సెలక్షన్స్ వుండడంతో మా శృతి కోరినట్టుగా నాల్గు రోజులు ముందుగా వెళ్ళలేకపోయినా, పనన్నీ తెముల్చుకుని , పిల్లల బాధ్యత మా వారి మీద పెట్టి గృహప్రవేశం రోజుకి వెళ్ళగలిగాను.

ఇల్లు చాలా బావుంది. పెద్ద గేటెడ్ కమ్యూనిటీలో ఏడవ అంతస్థులో వున్న త్రీ బెడ్రూం ఫ్లాట్. అన్ని బెడ్రూముల్లోనూ అటాచ్డ్ బాత్రూంస్, విశాలమైన బాల్కనీలతో ఇల్లెంతో ముచ్చటగా వుంది. గృహప్రవేశం బాగా జరిగింది. రెండు రాత్రులు వరసగా నిద్ర తక్కువైనందుకో ఏమో గాని భోజనాలైన తరవాత అలా కుర్చీలో కూర్చోగానే కునుకు పట్టేసింది.

గిన్నెలు సర్దుతున్న శబ్దానికి మెలుకువ వచ్చి చూస్తే, అతిధులంతా వెళ్ళిపోయినట్టున్నారు, క్యాటరింగ్ వాళ్ళు సామాన్లు సర్దుకుంటున్నారు. ఇంక నిద్ర తేలిపోయింది. ఏదో చిన్నపిల్లల మాటలా వినిపిస్తే గుమ్మం బయటకొచ్చి చూసా. బూరెల్లాంటి బుగ్గలతో ముద్దులు మూటగట్టే పాప. మూడేళ్ళుంటాయేమో. తొంగి, తొంగి లోపలకి చూస్తుంటే ‘ఎవరు కావాలి పాపా “ అని అడుగుతుండగానే, పాపని వెతుక్కుంటూ వచ్చిన స్త్రీని చూసి వెంటనే పోల్చుకున్నా.

ఆనందంతో “ విద్యా, నువ్వేనా!? “ అంటూ దాదాపుగా అరిచేసాను.

తనూ అంతే ఆనందంతో "ఎన్నాళ్ళకి నిన్ను చూసాను స్వాతీ , ఐనా నువ్వేంటీ ఇక్కడ? " అని అడిగింది.

"ఇది మా అక్క కూతురి ఫ్లాట్, దాని గృహప్రవేశానికి వచ్చాను" అని చెప్పగానే

" ఔనా, మా అమ్మాయిది ఈ పక్క ఫ్లాటే , ఇది నా మనవరాలు అనన్య " అని చెబుతూ పాపని ఎత్తుకుని " రావే మా ఫ్లాట్ కి వెళ్దాం " అంటూ నన్ను తీసుకు వెళ్ళింది.

★★★

నేనూ, విద్యా ఫోర్త్ క్లాసు నుండి టెంత్ వరకూ తెనాలిలో ఒకే స్కూల్లో ఒకే సెక్షన్‌లో కలిసి చదువుకున్నాము. బెస్ట్ ఫ్రెండ్స్‌మి. ఎప్పుడూ కలిసేవుండేవాళ్ళం. మా స్నేహాన్ని చూసి టీచర్స్ అంతా ముచ్చటపడితే , మా క్లాస్‌మేట్స్ చాలా మంది ఈర్ష్యతో మమ్మల్ని విడదీయాలని ఎన్నో ప్లాన్స్ వేసి విఫలమయ్యేవారు. టెంత్ తర్వాత మా నాన్నకి హైదరాబాద్‌కి ట్రాన్స్ఫర్ కావడంతో , కొన్నాళ్ళపాటు మా మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగినా, ఆ తరవాత స్టడీస్ , కోచింగ్స్‌తో ఇద్దరమూ బిజీ కావడంతో మా మధ్య కమ్యూనికేషన్ తగ్గుతూ వచ్చింది. ఇప్పటిలాగా అప్పట్లో సెల్‌ఫోన్లూ, ఈమెయిల్స్ లేవు కదా. అడప దడపా తన నుండి వచ్చిన ఉత్తరాల వల్ల , తనకి మ్యారేజ్ అయిందనీ, ఒక పాప పుట్టిందనీ మాత్రం తెలుసు. నా పెళ్ళి తరవాత నేను బెంగళూరుకి షిఫ్ట్ అయ్యాక తనతో కాంటాక్ట్స్ పూర్తిగా కట్ అయాయి. మళ్ళీ యిన్నేళ్ళ తరవాతే కలిసాము.

విద్యా, నేనూ ఎన్నో కబుర్లు చెప్పుకున్నాము. మా చిన్ననాటి సంగతులన్నీ గుర్తు చేసుకుని నవ్వుకుని మళ్ళీ చిన్నవాళ్ళమైపోయాము ఇద్దరమూ కొంతసేపు. "అన్నట్టు, మీ అమ్మాయి పేరు కీర్తి కదే , తనెలా వుందీ, ఏం చేస్తోందీ, మీ అల్లుడు ఏం చేస్తున్నాడూ "' అన్న నా ప్రశ్నకి దాని మొహం కళ తప్పడం గమనించాను. కొంతసేపటికి సర్దుకుని " అంతా మా ప్రారబ్దమే స్వాతీ " అంటూ చెప్పుకొచ్చింది.

★★★

కీర్తి మా అమ్మాయని కాదే స్వాతీ, చిన్నతనం నుండీ ఎంతో పొందిగ్గా వుండేది, చెప్పిన మాట వినేది, క్లాస్‌లో ఎప్పుడూ ఫస్టు ర్యాంకు తెచ్చుకునేది. ఐఐటి చెన్నైలో కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో సీట్ తెచ్చుకుని, క్యాంపస్ సెలక్షన్‌లో అమెజాన్‌లో జాయిన్ అయింది. ఆ తరవాత దానికి సంబంధాలు చూడడం మొదలు పెట్టాము. ఒక సంబంధం నాకూ, మా వారికీ ఎంతో నచ్చింది. అబ్బాయి అందగాడు, కోట్లల్లో వున్న బిజినెస్‌కి వారసుడు. మంచి సాంప్రదాయికమైన కుటుంబం. దాదాపు ఖాయం చేసుకుందాం అనుకునేంతలో , కీర్తి " మా కోలీగ్" అంటూ రోహిత్‌ని ఇంటికి తీసుకుని వచ్చి , తనూ, అతనూ ప్రేమించుకున్నాము అని చెప్పగానె, మా వారు అంతెత్తున ఎగిరారు. కులాంతరానికి ససేమిరా అన్నారు. నేనెంత కన్విన్స్ చేయాలని చూసినా మా వారు ఒప్పుకోలేదు. వారి బీపీ రైజ్ అయి హార్ట్ అటాక్ రావడంతో , కీర్తి వాళ్ళ నాన్న కోసం తన ప్రేమని వదిలేసి, మేము చూపించిన సంబంధమే చేసుకుంది.

మా అల్లుడు కార్తీక్ మంచివాడే, దీనిని మొదట్లో బాగానే చూసుకునేవాడు. కానీ తనతో చాలా తక్కువగా మాట్లాడేవాడు. ఏ విషయమూ కీర్తితో షేర్ చేసుకునేవాడు కాదు. ఇదే ఏదైనా కల్పించుకుని మాట్లాడబోయినా రెస్పాండ్ అయ్యేవాడు కాదు. మొదట్లో అతను రిజర్వుడు టైపేమో అందుకే ఎక్కువగా మాట్లాడడులే అనుకుని ఇదే సర్దుకుంది. ఆతని మనస్థత్వం అర్థం చేసుకునేంతలోనే పాప పుట్టింది. పాపతోనూ అతనికి అంతగా అటాచ్‌మెంట్ వుండేది కాదు. పాపని పెద్దగా దగ్గరికి తీసేవాడు కాదు. రాను రాను అతని విపరీత స్వభావం భరించడం కష్టం ఐపోయింది. నిర్ణయాలన్నీ తనే తీసుకునేవాడు. రోజుకి ఎన్ని పాల ప్యాకెట్లు కావాలి అనే చిన్న విషయం మొదలు ఏ లొకాలిటీలో ఎలాంటి ఇల్లు కొనాలి అనే వరకూ కీర్తితో ఏ విషయమూ సంప్రదించకుండా తనే నిర్ణయించేసేవాడు.

ఆతని దృష్టిలో భార్య అంటే కేవలం తన కోర్కె తీర్చి తనకి వారసులనిచ్చేందుకే. భార్యకి ఒక వ్యక్తిత్వం అంటూ ఉండకూడదన్నట్టు ఉండేది అతని ప్రవర్తన. తను ఎక్కడికి వెళ్ళేది, ఎప్పుడు వచ్చేది కూడా కీర్తికి చెప్పేవాడు కాదు. చివరకి అతను టూర్స్‌కి వెళ్ళినా దీనికి తెలిసేది కాదు. ఇండిపెండెంట్‌గా , చక్కటి వ్యక్తిత్వంతో పెరిగిన కీర్తికి ఇదంతా ఎంతో కష్టంగా ఉండేది. ఇవన్నీ నాతో చెప్పుకుని బాధపడేది. ఇదంతా విన్నాక , అమ్మగా కంటే కూడ , ఒక ఆడదానిగా ఎంతో బాధేసింది. ఏ ఆడపిల్లైనా భర్తనుండి కోరుకునేది ఏమిటి స్వాతీ – మంచి కంపానియన్‌షిప్‌ని, ఏ అరమరికలూ లేకుండా అన్నింటినీ పంచుకుంటూ , కలిసి, మెలిసి వుండాలనేగా. అలాంటి దాంపత్యంలో అడపాదడపా గొడవలు, అలకలూ వున్నా మళ్ళీ ఈజీగా

కలిసిపోగలుగుతారు. అంతే కాని యిలా ఏవీ పంచుకోకుండా , మాటలే లేకుండా , మౌనంలో గడపాల్సి రావడం ఏ అమ్మాయికైనా పెద్ద శాపమే కదూ స్వాతీ. అప్పటికీ మా వారూ, నేనూ ఒకసారి వెళ్ళి మా వియ్యంకుడు, వియ్యపురాలితో మాట్లాడాము, వారేమైనా వాళ్ళ అబ్బాయికి కాస్త నచ్చజెబుతారేమోనని. కాని వారి నుండి వచ్చిన సమాధానం " మేం మా ఇంట్లో ఒకరి విషయంలో మరొకరు జొక్యం చేసుకోము " అని.

అతనితో కలిసి ఒకే ఇంట్లో వుంటున్నా, మానసికంగా ఒంటరితనంతొ క్రుంగిపోయింది కీర్తి. వేళకి తిండి, నిద్ర అన్నీ మానేసి డిప్రెషన్‌లో పడిపోయినా అతనేమి పట్టించుకోకపోయేటప్పటికి యింక ఊరుకోలేకపోయాము. మా వారి ఫ్రెండ్ సైకాలజిస్ట్. ఆతని వద్దకి కీర్తిని తీసుకుని వెళ్ళి , విషయమంతా చెప్పి సలహా అడిగాము.

ఈ రకమైన విపరీత స్వభావం ఒక మానసిక రోగమనీ, ఏదో నోరు తిరగని వ్యాధి పేరు చెప్పి, ఇలాంటి వ్యక్తితో కలసి జీవించేవాళ్ళు మానసికంగా క్రుంగిపోయి జీవచ్ఛవాలుగా మారుతారనీ, విడాకులు తీసుకోవడమే మంచిదనీ చెప్పాడు.

కీర్తితో విడాకులకి అప్ప్లై చేయించాము. కార్తీక్ ఒక పట్టాన విదాకులు ఇవ్వడానికి ఒప్పుకోలేదు. ముప్పుతిప్పలు పెట్టించాడు. నీకు తెలుసుగా, మా వారు ఐపియస్ ఆఫీసరని. పోలీస్ ఇన్‌ఫ్లుయెన్సు, పవరూ చూపిస్తేగాని లొంగలేదతను. ఆలా విడాకులు మంజూరయి దాదాపు సంవత్సరం కావచ్చింది. ఇప్పుడిప్పుడే కీర్తి కొద్ది కొద్దిగా కోలుకుంటొంది.

ప్రాజెక్ట్ పని మీద లండన్ వెళ్ళిన రోహిత్, అదే, కీర్తి పెళ్ళికి ముందు ప్రేమించిన అబ్బాయి, ఆర్నెళ్ళ క్రిందట ఇండియాకి తిరిగి వచ్చాదు. కీర్తి ఇక్కడే వుందని, ఎవరో చెబితే వచ్చి, విషయం అంతా తెలుసుకొని చాలా బాధపడ్డాదు. ఆతను కీర్తిని గాఢంగా ప్రేమించాడేమో ఇంకా పెళ్ళి చేసుకోకుండా ఒంటరిగానే వుండిపోయాడు. ఆతని మోరల్ సపోర్ట్ వల్లే కీర్తి కొద్దిగా తొందరగా కోలుకోగల్గుతోంది. ఆతను కీర్తిని పాపతో పాటు స్వీకరించడానికి సంసిద్ధతని వ్యక్తం చేసాడు. ఇలాంటి ఆణిముత్యాన్నా తను కులం, పరువు, ప్రతిష్టల పేరుతో కాదన్నది అని మా వారు పశ్చాత్తాపంతో , క్షమించమని అతని చేతులు పట్టుకున్నారు.

ఒక పెళ్ళి అనుభవం వల్ల కలిగిన విరక్తి నుండి కీర్తి ఇంకా పూర్తిగా బైటపడకపోవడం వల్ల మళ్ళీ పెళ్ళి అంటే ఆలోచిస్తోంది. కానీ , రోహిత్ తన ప్రేమతో కీర్తిని త్వరలోనే పెళ్ళికి తప్పకుండా ఒప్పించగలడనే మా నమ్మకం. ఆ ఆశతోనే జీవిస్తున్నామే స్వాతీ " అని ముగించింది.

"మీ ఆశ తప్పకుండా నిజమౌతుంది విద్యా " అని దానికి ధైర్యం చెప్పి, "అన్నట్టు విద్యా, ఈ కార్తీక్ వాళ్ళ బిజినెస్ ఏంటి? " అని అడిగాను , ఏదో అనుమానం నాలో లీలగా మెదలుతుండగా.

" అదా, రావ్ అండ్ రావ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అని , చాలా ఫేమస్ కంపెనీ వాళ్ళది, పేరు వినే వుంటావు " అని చెప్పింది విద్య.

అంతే , ఇందాకటినుండీ మనసులో బిగుసుకుంటున్న చిక్కు ముడి వీడినట్టైంది. ఇది మా శృతికి తప్పిపోయిన సంబంధమే. ఆనాడు శృతి , వాళ్ళ అమ్మా, నాన్నల యిమోషనల్ బ్లాక్‌మెయిల్‌కి కనక లొంగిపోయి వుంటే ఈరోజు కీర్తి స్థానంలో శృతి వుండేది. శృతి తీసుకున్న తెలివైన నిర్ణయమే దాన్ని కాపాడింది.

విద్యా, నేనూ సెల్ నంబర్లు ఎక్స్చేంజ్ చేసుకున్నాక " యింక వెళ్ళొస్తానే " అని దానికి చెప్పి గుమ్మం బయటకి రాగానే, గుమ్మం ప్రక్కనే అక్క, దాని కంట్లో నీళ్ళు – చూడగానే అర్థమైంది మా సంభాషణంతా తన చెవులపడిందని. "మన శృతికి ఎంత ప్రమాదం తప్పిందే స్వాతీ! " అని తను నాతో అంటుండగానే " అమ్మా, పిన్నీ ఇక్కడున్నరా మీరు, మీ కోసం అంతా వెతుకుతున్నాను " అంటూ శృతి వచ్చింది.

అక్క "అమ్మా శృతీ " అంటూ దాన్ని ఆప్యాయంగా దగ్గరకి తీసుకుంది. పెళ్ళైన ఈ రెండేళ్ళనుండీ అక్క, బావా తనతో అంటీముట్టనట్టుంటున్నారేమో , మునుపటి ఆప్యాయత మళ్ళీ ఒక్కసారిగా దొరికేటప్పటికి శృతి ఆనందానికి అంతు లేదు.

తల్లీ కూతుళ్ళ గాఢ పరిష్వంగాన్ని చూస్తూ అనుకున్నాను "పిల్లలు పెద్దై స్వతంత్ర్య నిర్ణయాలు తీసుకుంటుంటే వాళ్ళ నిర్ణయాలని సరైనవా , కావా అని పెద్దవాళ్ళు వాళ్ళ అనుభవంతో బేరీజు వేసి చూడాలే కానీ గుడ్డిగా కాదనకూడదూ " అని.

నాకూ పెళ్ళీడుకొచ్చిన ఇద్దరు పిల్లలున్నారు మరి..!!

# మాతృత్వం చిలకలపూడి సత్యనారాయణ

ఆ రోజు ఆ కోర్టులో జడ్జిమెంట్ డే.

ఆ జడ్జిమెంట్ వినడానికి పత్రికా విలేఖరులతో సహా మామూలు జనం కూడా పోగయ్యేరు.

ఆ కోర్టు హాలు ఇంతకుముందెప్పుడూ అంతమంది జనంతో నిండలేదు. ఆ రోజు ఆ కోర్టులో ప్రముఖ రాజకీయ నాయకుడిదో లేక ప్రముఖ సెలెబ్రెటీ కి చెందిన కేసులోనో జడ్జిమెంట్ ఇవ్వటంలేదు.

మరి అక్కడ అంతమంది జనం ఎందుకు గుమికూడున్నారో నన్న ప్రశ్న మీకనిపించవచ్చు. దానికో ముఖ్య కారణం ఉన్నది. ఆ కోర్టులో ఆ రోజు అత్యంత విన్నూతమైన, కొత్తరకం కేసుకు సంబంధించిన జడ్జిమెంట్ ఇవ్వబడుతోంది. జడ్జిమెంట్ ఎలా ఉంటుందో తెలుసుకోవలన్న ఆత్రుత, ఇంట్రస్టే అక్కడ అంతమంది జనం పోగవడానికి అసలు కారణం.

"జరగండి...జరగండి" ...ఇద్దరు పోలీసులు గుంపును పక్కకు జరుపుతుంటే నిండు గర్భిణి అర్చన ఒక చేతిని నడుం మీద మరొక చేతిని తన స్నేహితురాలు గౌరి భుజం మీద వేసుకుని నిదానంగా అడుగులో అడుగు వేసుకుంటూ కోర్టు హాలులోకి వచ్చి అక్కడున్న బెంచి మీద కూర్చుంది. పక్కనే ఆమె భర్త కిషోర్ కూర్చున్నాడు. కిషోర్ పక్కన అతని ప్రాణ స్నేహితుడు వెంకట్ కూర్చున్నాడు. అతని పక్కన అతని భార్య గౌరి కూర్చుంది.

వీరు నలుగురూ కలిసిరావటం, పక్కపక్కనే కూర్చోవడం చూసి అక్కడ గుమికూడిన జనం ఆశ్చర్యపోయేరు. ఎందుకంటే కోర్టులో ఆరోపణ పిటిషన్ వేసి న్యాయం కోసం పోరాడుతున్నది ఆ ఇద్దరు దంపతులే. ఎప్పుడు కోర్టుకు వచ్చినా వేరు వేరుగా వచ్చి, వేరు వేరు చోట్లలో కూర్చునే ఆ రెండు జంటలూ ఆ రోజు కోర్టుకు కలిసి రావడం, పక్క పక్కన కూర్చోవడం అక్కడ గుమికూడిన జనాన్ని ఆశ్చర్యానికి లోను చేసింది.

"ఇదేమిటి!...ఎప్పుడూ పిల్లి-ఎలుకల్లా దూర దూరంగా ఉండే వీళ్ళు ఈ రోజు ఒకరి భుజం మీద ఒకరు చేయివేసుకుని కలిసి వచ్చేరు...పకపక్కనే కూర్చున్నారు" గుమికూడిన జనంలో ఎవరో తమ ఆశ్చర్యాన్ని గట్టిగా అందరికీ వినబడేలా వెలిబుచ్చేరు.

అక్కడ గుమికూడిన జనం ఆ విషయం గురించే చర్చించుకుంటున్నారు. వారి మాటలు ఆ కోర్టు హాలును మార్కెట్టులా మార్చింది.

ఇంతలో "సైలన్స్" అన్న కేక వినబడింది.

ఒక్కసారిగా కోర్టు హాలులో నిశ్శబ్ధం చోటు చేసుకుంది.

కోర్టు హాలులోకి ప్రవేశించేరు జడ్జి.

కూర్చున్నవారందరూ లేచి నిలబడ్డారు...జడ్జి తన సీటులో కూర్చుంటూ అందరినీ కూర్చోమన్నారు.

గుమాస్తా జడ్జికి ఒక కేసు కట్టను అందించేడు.

కేసు కట్టను తీసుకున్న జడ్జి అందులోని పేజీలను ఒక సారి తిరగేసి కేసు కట్టను తన టేబుల్ మీద ఉంచుతూ "గౌరీ వాసస్ అర్చన ఆరోపణ కేసులో జడ్జిమెంట్ ఇవ్వబోయే ముందు...చివరి సారిగా ఈ కోర్టుకు ఏమైనా చెప్పదలచుకుంటే చెప్పుకోవచ్చు" అన్నారు.

వెంటనే గౌరి తరపు వాదనను సమర్ధించే లాయర్ లేచి నిలబడి "ఎస్...యువర్ ఆనర్" అని గౌరవంగా అన్నాడు.

"ప్రొసీడ్" అన్నారు జడ్జి.

"యువరానర్...ఈ కేసులో మీరు జడ్జిమెంట్ ఇవ్వవలసిన అవసరంలేదు. ఎందుకంటే గౌరి-అర్చనలు అవుట్ ఆఫ్ ద కోర్ట్ సెటిల్ మెంట్ చేసుకున్నారు. నా క్లయంట్ గౌరి తన ఆరోపణను ఉపసంహరించుకోవాలని నిర్ణయించుకున్నారు...మా ఈ రిక్వెస్టును మీరు దయచేసి అంగీకరించాలని కోరుతున్నాను" అంటూ ఒక కవరును జడ్జికి అందించేడు.

ఒక్క నిమిషం తన ఆశ్చర్యాన్ని వెలిబుచ్చిన జడ్జి ఆ కవరు తీసుకుని, కవరులో ఉన్న కాగితాన్ని తీసి అందులో రాసున్న విషయాలను చదివి ఆశ్చర్యం, సంతోషం కలిగిన ముఖంతో "మీరేమంటారు?" అర్చన తరపు లాయర్ను అడిగేరు.

"నో అబ్జెక్షన్ యువరానర్... ఆ కవర్లో రాసున్న విషయాలన్నీ గౌరీ-అర్చనలు ఒకటిగా చెప్పినవే...అందులో ఇద్దరూ సంతకాలు చేసేరు. దయచేసి దాన్ని మీరు అంగీకరించి ఈ కోర్టు సమయాన్ని వృధా చేసినందుకు మమ్మల్ని, గౌరి-అర్చనలను క్షమించవలసినదిగా కోరుతూ ఈ కేసును ఇంతటితో ముగించవలసినదిగా కోరుతున్నాను" అర్చన తరపు లాయర్ తలవంచి కోర్టును గౌరవించేడు.

"ఇట్స్ ఆల్ రైట్...మీరందరూ దీనికి అంత బాధ పడవలసిన అవసరంలేదు. ఈ కవరులోని విషయాలు చదివిన తరువాత నాకూ చాలా సంతోషం కలిగింది. అసలు ఇలాంటి కేసులు కోర్టుకు రాకూడదు. ఎందుకంటే ఇలాంటి కేసులలో జడ్జిమెంట్ ఇవ్వడం చాలా కష్టం. ఆ కష్టం నుండి ఈ కోర్టును గౌరి-అర్చనలు బయటపడేసేరు....దిస్ కేస్ ఈజ్ డిస్మిస్సుడ్ అండర్ మ్యూచువల్ అండర్ స్టాండింగ్ అండ్ కన్సెంట్ ఆఫ్ బోత్ పెటీషనర్ అండ్ రెస్పాండంట్" అని చెప్పి కేసు కట్టపై పెద్ద ఇంటు మార్క్ వేసి సంతకం పెడుతూ "ద కోర్ట్ ఈజ్ అడ్జరండ్" అని చెప్పి వెళ్ళిపోయేరు.

వెంటనే కోర్టు హాలంతా గుస గుసల శబ్ధంతో మోగిపోయింది. జడ్జిమెంట్ ఎలా ఉంటుదో తెలుసుకోవాలనుకుని వచ్చినవారందరూ నిరాశపడ్డారు.

"కవరులో ఏం రాసేరు...ఎలా ఇద్దరూ ఒకటయ్యేరు" అని పత్రికా విలేఖర్లు గౌరి-అర్చనలను ప్రశ్నలతో ముంచెత్తేరు. వారి తరపున వాదించిన లాయర్లను వేధించేరు.

"అది గౌరి-అర్చనల ప్రైవసీకి సంభందించినవి. అవి మేము బయట పెట్టకూడదు" అంటూ లాయర్లు సమాధానం ఇస్తూంటే పోలీసుల బందోబస్తుతో గౌరి-అర్చన దంపతులు కోర్టు బయటకు వచ్చి అక్కడున్న గౌరి వాళ్ళ కారులో కూర్చున్నారు.

కారు వేగంగా కోర్టు బయటకు వెళ్లిపోయింది.

కడుపులో సీతాకోకచిలుకలు ఎగురుతున్నట్లు అనిపించడంతో భావోద్వేగానికి గురి అయిన అర్చన తాను పడుకున్న మంచం నుండి క్రిందకు దిగి తన పొత్తి కడుపును తడిమి చూసుకుని ఆనందపడింది.

ఎదురుగా ఉన్న బీరువా తలుపుకు ఉన్న అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకుంది. "గర్భం దాల్చి ఐదు నెలలు కూడా పూర్తిగా నిండలేదు...అప్పుడే పొట్ట పెద్దదిగా ఎందుకు కనబడుతుంది?"...తనలో తానే అనుకుంటున్న అర్చన కడుపులో ఏర్పడిన చిన చిన్న కదలికలకు మరింత ఆనందపడింది.

ఇదేమీ ఆమెకు కొత్త కాదు. ఎందుకంటే అంతకు ముందు అర్చన ఒక బిడ్డను కన్నది. అప్పుడు కూడా బిడ్డ కదలికల అనుభూతి ఆమెలో ఆనందం ఏర్పరచింది. ఎంతమంది బిడ్డలను కన్నా ప్రతి తల్లీ గర్భం దాల్చినప్పుడల్లా కడుపులోని బిడ్డ కదలికలు ఎప్పటికప్పుడు కొత్త అనుభూతిని, ఆనందాన్ని ఏర్పరుస్తాయి. అలాంటి ఆనందమే అర్చనలో ఇప్పుడు చోటుచేసుకుంది.

కానీ ఆ ఆనందాన్ని అర్చన ఎక్కువసేపు అనుభవించలేకపోయింది. కారణం అర్చన గర్భంలో ఉండే బిడ్డ అర్చన బిడ్డ కాదు. పది నెలలు బిడ్డను మోసి ఆ బిడ్డను కన్న తరువాత ఆ బిడ్డను గౌరికి ఇచ్చేయాలి. ఆమె ఆనందానికి అడ్డుకట్ట వేసేది, ఆమెను నీరసానికి గురిచేసేది ఈ ఆలోచనే.

మెల్లగా వెళ్ళి మళ్ళీ మంచం మీద పడుకుంది అర్చన.

మొదటిసారి గర్భం దాల్చినప్పుడు "ఇది నా బిడ్డ! నా పోలికలతోనో లేక నా భర్త పోలికలతోనో బిడ్డ పుడుతుంది. నాలాగా తెలుపుగా పుడుతుందా? లేక ఆయనలాగా చామన చాయ రంగులో పుడుతుందా?...మా ఇద్దరిలో ఎవరో ఒకరి పోలికలతో, ఏదో ఒక రంగుతో పుడుతుంది. ఎలా ఉన్నా సరే...పరవలేదు" అనే ఆలోచనలతో ఎంతో ఆనందపడేది.

కానీ ఈ సారి..."బిడ్డకు తండ్రి నా భర్త కదే? తల్లి నేను కాదే? కడుపులో బిడ్డ రూపం దాల్చినప్పటి నుండి బిడ్డను పది నెలలు మోయడం, ప్రశవ నొప్పులు అనుభవించి ఆ బిడ్డను కనబోయేదెమో నేనే...నేను తినే బలమైన ఆహారాన్ని బొడ్డుపేగు మూలంగా అందుకుని బలంగా, ఆరోగ్యంగా పెరుగుతున్నది నా బిడ్డ కాదే...బిడ్డ పుట్టిన వెంటనే బిడ్డకూ, నాకూ ఉన్న బంధం తెగిపోతుందే...పది నెలల బంధానికి ముగింపు చుక్క పెట్టేస్తారే...పుట్టిన బిడ్డను కనులారా చూసుకుని, ఆ బిడ్డను పువ్వులాగా మెల్లగా చేతుల్లోకి తీసుకుని, చిన్నగా ముద్దుపెట్టుకుని, హృదయానికి హత్తుకుని ప్రేమతో తల్లి పాలు ఇవ్వలేనే" అన్న ఆలోచనలతో కడుపులో బిడ్డ పెడుతున్న తుంటరి కదలికలకు అర్చన ఆనందపడలేకపోతోంది.

ఒక అగ్రిమెంట్ మూలంగానే ఈ పది నెలల బంధం అర్చనకు ఏర్పడింది. దాని ప్రకారం బిడ్డను కన్న వెంటనే...ఆ బిడ్డను గౌరి-వెంకట్ దంపతులకు అప్పగించేయాలి. "బిడ్డను పది నెలలు మోసింది, నొప్పులతో కనింది నేనే" అన్న మాటను అర్చన అక్కడితో మర్చిపోవాలి. ఆ బాధే అర్చన మనసును అనుక్షణం వేధిస్తున్నది. కానీ తప్పదు. అగ్రిమెంటుకు కట్టుపడాలి. అసలు ఆ అగ్రిమెంట్ సలహా గౌరి-వెంకట్ దంపతులకు ఇచ్చింది అర్చనే.

వెంకట్, అర్చనకు తెలియని వ్యక్తి కాదు. వెంకట్ అర్చన భర్త కిషోర్ కి ప్రాణ స్నేహితుడు. చిన్నప్పటి నుండి కిషోర్-వెంకట్ ఇద్దరూ కలిసి చదువుకున్నారు.

కిషోర్ బుర్రకు చదువు సరిగ్గా ఎక్కలేదు. పదో తరగతితోనే చదువుకు సెలవు చెప్పేడు. వెంకట్ పెద్ద చదువులు చదివి, పెద్ద పదవితో ఉద్యోగం చేస్తున్నాడు.

వెంకట్ అతని కంపెనీలోనే, అతనికి సరిసమంగా చదివి, అతనిలాగే పెద్ద పదవిలో ఉన్న గౌరిని అప్పుడప్పుడూ కలుస్తూ, చివరికి అమెనే ప్రేమ వివాహం చేసుకున్నాడు.

ఆఫీసుకు వెళ్ళడానికి కారు, బ్రహ్మాండమైన ఇల్లు, పనివాళ్ళు లాంటి వసతులతో దర్జాగా జీవితం గడుపుతున్న వెంకట్ తన బాల్య స్నేహుతుడైన కిషోర్ని ఏనాడు మర్చిపోలేదు. నెలకి రెండు మూడు సార్లు భార్య గౌరితో కలిసి కారులో కిషోర్ ఇంటికి వెళ్లి ఒక రోజంతా గడిపి వస్తాడు...కిషోర్ ఇంట్లో నేల మీద కూర్చుని, విస్తరాకులో అర్చన వడ్డించే భోజనాన్ని హక్కుతో కడుపు నిండుగా తిని, చీకటిపడే సమయానికి తన ఇంటికి తిరిగి రావడం వెంకట్ కు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది.

ఎనిమిదేళ్ళు గడిచినా వెంకట్-గౌరి దంపతులకు సంతాన భాగ్యం కలగలేదు. ఎంతో అన్యోన్యంగా దాంపత్య జీవితం గడుపుతున్న ఆ దంపతులకు పిల్లలు పుట్టలేదనే బాధ ఉండేది కాదు.

రోజులు గడుస్తున్న కొద్దీ ఆఫీసులోనూ...పెళ్లిళ్లు, బర్త్ డే ఫంక్షన్లకు వెళ్ళినప్పుడు కుళ్ళు మనసున్న కొందరు కావాలనే పిల్లలు లేరనే విషయాన్ని గౌరికి ఎత్తి చూపే వారు. గుస గుస లాడుకుంటూ గౌరి మనసును గాయపరిచేవారు.

"ఏం సమాజమండీ ఇది! అవతలివారి అంతరంగిక విషయాలలో కలుగజేసుకోవడానికి వీళ్ళకు హక్కు ఎవరిచ్చేరు?...మీకు నేను బిడ్డను, నాకు మీరు బిడ్డ అనుకుని జీవితాన్ని ఆనందంగా గడుపుతున్న మన గురించి వీళ్ళకెందుకో? మనకు పిల్లలు పుట్టకపోతే వారికెందుకంత బాధ?....వాళ్ళకోసమైనా, వాళ్ళ నోరు మూయించటానికైనా మనం బిడ్డను కనాలి...వెంటనే మనం డాక్టర్ను కలిసి ఆలోచన తీసుకుని ట్రీట్ మెంట్ తీసుకుందాం" కళ్ళ నుండి కారుతున్న కన్నీటిని తుడుచుకుంటూ భర్త కిషోర్తో చెప్పింది గౌరి.

గౌరి-వెంకట్ దంపతులు మరునాడే డాక్టర్ను కలిసేరు.

"మిస్టర్ వెంకట్! మీలో ఏలోపమూ లేదు...మీ భార్య గర్భ సంచీ చాలా బలహీనంగా ఉంది. పిండాన్ని మోసే బలం ఆమె గర్భ సంచీకి లేదు. మీకు తెలియకుండానే రెండు-మూడు సార్లు అబార్షన్ అయ్యుంటుంది" చెప్పేడు డాక్టర్.

ఆ మాట వినగానే గౌరికి ఏడుపు ముంచుకొచ్చింది..."డాక్టర్! నేను తల్లినే అవలేనా? చివరిదాకా గొడ్రాలు అనే పిలుపుతో, దుఃఖంతో చచ్చిపోవాలా?" గౌరి నిరాశతో అడిగింది.

"నిరాశపడకమ్మా! నువ్వు తల్లి అవటానికి ఒకే ఒక మార్గముందమ్మా...మీ అండాన్ని, మీ భర్త వీర్యకణాలతో ఫలదీకరించి... పిండాన్ని మరో స్త్రీ గర్భంలో ప్రవేశపెట్టే పద్దతి ద్వారా నువ్వు బిడ్డను పొందగలవు. ఒక్క మాటలో చెప్పాలంటే సరోగసీ ద్వారా, అంటే అద్దె తల్లి మూలం నువ్వు తల్లివి కావచ్చు" వివరించి చెప్పేడు డాక్టర్ .

గౌరి మొహంలో ఉత్సాహం పొంగుకు వచ్చింది..."డాక్టర్! మేమిద్దరం లక్షలు సంపాదిస్తున్నాము. ఎంత ఖర్చు అయినా పరవాలేదు. మాకు బిడ్డ పుడితే చాలు...అద్దె తల్లికి వెంటనే ఏర్పాటు చేయండి" చెప్పింది గౌరి.

"మంచి అద్దె తెల్లి దొరికిన వెంటనే కబురు చేస్తాను ...మీరు సంతోషంగా వెళ్ళి రండి" చెప్పేడు డాక్టర్.

గౌరి-వెంకట్ దంపతులు ఆనందంగా అక్కడి నుండి బయలుదేరేరు.

ఆ ఆదివారం స్నేహితుడింటికి వెళ్ళిన గౌరి-వెంకట్ దంపతులు విషయాన్ని అర్చన-కిషోర్లకు చెప్పేరు.

అర్చనకు ఆలోచన వచ్చింది.

"గౌరీ! ఎందుకు ఎవరికోసమో కాచుకోవటం...అద్దె తల్లిగా ఉండి, మీకు బిడ్డను కని ఇచ్చేందుకు నేను రెడిగా ఉన్నాను! వెంటనే డాక్టర్ దగ్గర చెప్పి ఏర్పాట్లు చేయండి"

గౌరి-వెంకట్ దంపతులు ఆనందం పట్టలేకపోయేరు.

అర్చన మాటలకు ఆశ్చర్యపోయిన ఆమె భర్త కిషోర్, భార్య దగ్గరగా వచ్చి, ఆమె భుజం తట్టి "శభాష్" అంటూ అర్చనను అభినందించేడు.

ఏర్పాట్లు జరిగినై.

ఐదు నెలలు గడిచిపోయేయి.

మూడు రోజులకొకసారి అర్చన ఇంటికి వచ్చి వెళ్ళే గౌరి-వెంకట్ దంపతులు వారం రోజులుగా అర్చన ఇంటికి రాలేదు. కనీసం ఫోను కూడా చేయలేదు. అర్చనే వాళ్ళకు ఫోను చేస్తోంది. కానీ ఇద్దరి ఫోన్లు బిజీ అని చెబుతున్నాయి.

ఐదు నెలలు గడిచిపోయేయి. అర్చనకు కడుపులో బిడ్డ కదలికలు తెలుస్తున్నాయి. మూడు రోజులకొకసారి అర్చన ఇంటికి వచ్చి వెళ్ళే గౌరి-వెంకట్ దంపతులు వారం రోజులుగా అర్చన ఇంటికి రాలేదు. కనీసం ఫోను కూడా చేయలేదు. అర్చనే వాళ్ళకు ఫోను చేస్తోంది. కానీ ఇద్దరి ఫోన్లు బిజీ అని చెబుతున్నాయి.

ఉండబట్టలేక ఆ రోజు రాత్రి అర్చన తన భర్తతో " ఏమండి...గౌరి బిడ్డ నా కడుపులో పడినప్పటి నుండి వాళిద్దరూ వారానికి రెండు-మూడు సార్లు మనింటికి వచ్చేవారు. ప్రతి రోజూ ఫోన్లు చేసి కష్ట సుఖాలు అడిగి తెలుసుకునే వాళ్ళు...ఎందుకనో పది రోజుల నుండి మనింటికీ రాలేదు, ఫోనూ చేయలేదు. నేను ఫోన్ చేస్తే ఇద్దరి ఫోన్లూ బిజీ అంటున్నాయి...మీకేమైనా ఫోను చేసేరా" భర్తను అడిగింది అర్చన.

"లేదు... ఫోన్ చెయ్యలేదు...బహుశ ఆఫీసు పనులతో బాగా బిజీగా ఉండుంటారు" అని కిషోర్ చెప్పిన మాటలు అమెకు తృప్తిని ఇవ్వలేదు.

ఆ రోజు రాత్రి గౌరి దగ్గర నుండి ఫోన్ వచ్చింది. ఫోన్ చేసిన వెంటనే బిడ్డ కదలికలు ఎలా ఉన్నాయి, బలమైన ఆహారం తీసుకుంటున్నావా, మందులు వాడుతున్నావా...అని ఎన్నో ప్రశ్నలు వేసే గౌరి ఆరోజు అవేమి అడగలేదు.

"వెంకట్ కి-నాకు చిన్న మనస్పర్ధ. మొగవాడిననే అహంభావంతో పొగరెక్కి ఆడుతున్నాడు. భార్యంటే బానిస అనుకుంటున్నాడు. ఇక వెంకట్ తో కాపురం చెయ్యలేను...విడిపోవాలని నిర్ణయించుకున్నాం...డైవర్స్ కి అప్లై చేసేము...ఆ బిడ్డ వద్దు అర్చనా! ఆ బిడ్డ పుడితే సమస్యలు ఎక్కువ

అవుతాయి. బిడ్డ ఎవరి దగ్గర పెరగాలి అనే పోట్లాటతోనే జీవితం గడిచిపోతుంది...వెంకట్ నే వద్దనుకున్న తరువాత...వెంకట్ బిడ్డ మాత్రం ఎందుకు....అర్చనా... ఆ బిడ్డను ఎలాగైనా తీయించేసుకో"

షాక్ తిన్న అర్చన" గౌరీ...నేను చెప్పేది విను. ఆవేశపడకుండా నిదానంగా ఆలొచించు. వెంకట్ బిడ్డ అని చెబుతున్నావే...ఏం...ఆ బిడ్డ నీది కాదా? నీ రక్తం కాదా? నీ గర్భ గుడ్డు నుండి అభివృద్ధి చెందిదే కదా? ఆ ప్రేమ నీకు లేకుండా పోయిందే...ఐదు నెలల తరువాత బిడ్డను ఎలా తీయించుకోను...పుట్టనీ గౌరీ...ఆ బిడ్డ పుడితే అదే మిమ్మల్ని కలుపుతుందని నమ్ముతున్నాను"

"మిమ్మల్ని కలుపుతుందని నువ్వే చెబుతున్నావు చూసేవా! అందుకే వద్దంటున్నాను. నాకు తెలిసిన ఒక లేడీ డాక్టర్ ఉన్నది...మూడు లక్షలు ఖర్చుపెడితే చాలు...ఐదు నెలల గర్భాన్నైనా తీసి పారేసి పంపుతుంది. అక్కడికి వెళ్ళి తీయించుకుంటావా అర్చనా!?"

ఒక్క నిమిషం కూడా ఆలోచించ కుండా "వద్దు...మా సొంత ఊరు ఒక గ్రామమే కదా! అక్కడ ఒక మొరటు డాక్టరమ్మ ఉంది...ఇలాంటి వాటికి పేరుమోసిన డాక్టర్...ఆమె దగ్గరకు వెళ్ళి తీయించుకుంటాను" చెప్పింది అర్చన.

" గుడ్...అలాగే చేసేయ్. ఏ సహాయం కావాలన్నా మొహమాటపడకుండా నన్ను అడుగు...సరేనా" అని ఫోన్ కట్ చేసింది గౌరి.

అప్పుడే ఇంట్లోకి అడుగుపెట్టిన అర్చన భర్త "అర్చనా! వెంకట్ నాకు ఫోన్ చేసేడు. అన్ని విషయాలు నాకు చెప్పేడు...బిడ్డను తీయించుకోవడానికి, దాని తరువాత నీకు అయ్యే మందుల ఖర్చులకు కలిపి నా పేరు మీద మూడు లక్షల రూపాయలు నా బ్యాంకు ఖాతాలో వేసేడట..." అంటూ ఇంకా ఏదో చెప్పబోతుంటే అర్చన అడ్డుపడింది.

"ఆపండి...ఈ బిడ్డను నేను తీయించుకోను. ఈ బిడ్డను కూడా మన బిడ్డ అనుకుని పెంచుదాం. ఐదు నెలలు మోసినందువలన ఈ బిడ్డపై నాకు అభిమానం, ప్రేమ ఏర్పడింది. అయ్యో...పదో నెలలో ఈ బిడ్డ నుండి విడిపోవాలే అని బాధపడ్డాను...అయితే ఇప్పుడు వాళ్ళు బిడ్డను వద్దంటున్నారు. ప్రాణాలు తీయటం తప్పని అంత పెద్ద చదువులు చదువుకున్న వాళ్ళకు తెలియదేమో...ఐదు నెలలుగా బిడ్డను మోసేది నేను....ఇక మీదట ఈ బిడ్డ...." చెప్పలేక ఆగిపోయింది.

"ఇక మీదట ఈ బిడ్డ మన బిడ్డ! నీ ఇష్టాన్ని నేను కాదనను" అంటూ ఏడుస్తున్న తన భార్యను కిషోర్ దగ్గరకు తీసుకున్నాడు. అతని ఆప్యాయతకు అతని కౌగిలిలో ఒదిగిపోయింది అర్చన.

మరో నాలుగు నెలలు గడిచింది. కనే రోజులు దగ్గర పడటంతో అర్చన కాళ్ల వాపులతో బాధపడుతూ, నడవలేక నడుస్తోంది.

సెల్ ఫోన్ మోగింది. ఫోన్ తీసిన అర్చన "హలో" అన్నది.

"హలో అర్చనా! బాగున్నావా?...ఆరోజు నువ్వు చెప్పిన మాటలు నేను వినలేదు. వెంకట్ మీద కోపమూ, నాలోని అహంకారమూ కలిపి నన్ను మూర్ఖురాలిగా చేసి అలా నిర్ణయం తీసుకునేటట్లు చేసింది. స్నేహితులందరూ కలిసి ఒత్తిడిచేస్తే మొన్ననే నేను-వెంకట్ ఇద్దరం కలిసి ఒక చోట కూర్చుని నిదానంగా మాట్లాడుకున్నాం. మాకేర్పడిన మనస్పర్ధలు ఒక్క సెకెండులో మాయమైపోయినై అంటే నమ్ము...డైవర్స్ వాపస్ తీసుకున్నాము. కలిసి జీవించాలని నిర్ణయించుకున్నాం. అవసరపడి బిడ్డ వద్దని చెప్పేమే...అదెంత పెద్ద తప్పో ఇప్పుడు మాకు అర్ధమైయ్యింది"

"అవసరపడి మొగవాడు ఎన్ని నిర్ణయాలైనా తీసుకోవచ్చు. కానీ ఆడది నిదానంగా ఉండొద్దా! ఆ నిదానం నీకెందుకు లేకుండాపోయింది... మాతృత్వం పొందటం మనకు దేముడిచ్చిన వరం. అది నువ్వెలా గ్రహించలేకపోయేవు...ఆ ఫీలింగ్ నీలో ఎందుకు కలగలేదు. ఊర్లో అందరూ నిన్ను గొడ్రాలు అని చెబుతేనే నువ్వు తల్లినౌవుదామనుకున్నావా?....బిడ్డను తీయించేసుకో అని ఎంత ఈజీగా చెప్పేవో నీకు గుర్తుందా?...ఆ బిడ్డ నీ రక్తం పంచుకుని పెరుగుతున్న బిడ్డేనని నీకు తెలియదా? కడుపులో పెరుగుతున్న బిడ్డను బలవంతంగా తీయించుకోవటం హత్య చేసినంత నేరం...ఇప్పుడు కూడా స్నేహితులు ఒత్తిడి చేస్తే కలిసి కాపురం చేద్దామనుకున్నరు కాని...ఇద్దరూ మీ తప్పులు తెలుసుకుని ఒకటౌదామనుకోలేదు. ఏ రక్త సంబంధమూ

లేకపోయినా మాతృత్వం ఎంత గొప్పదో నాకు తెలుసు కాబట్టి మరో ఆడదాన్ని తల్లి చేయాలనే ఆశతో నీకు అద్దె తల్లిగా ఉండటానికి అంగీకరించేను. ఈ బిడ్డకు నేను అద్దే తల్లినే! కడుపులో పెరుగుతున్న బిడ్డను తీయించుకోవటం హత్యతో సమానమని నాకు తెలుసు కాబట్టి ఆ బిడ్డను నేను తీయించుకోలేదు."

"నిజమా అర్చనా! నేను ఎంత అదృష్టవంతురాలినో....." అంటూ మాట్లడబోతున్న గౌరితో..."ఆగు...నేనింకా ముగించలేదు. నేను చెప్పేది పూర్తిగా విను. ఇంకో వారం, పది రోజులలో బిడ్డ పుడుతుంది...అది మా బిడ్డ. ఆ బిడ్డను మేమే పెంచుకుంటాము. మీకు ఇవ్వను...ఎందుకంటే స్నేహితులు వొత్తిడిచేస్తే ఈ రోజు ఒకటిగా చేరిన మీరు రేపే విడిపోరని ఏమిటి గ్యారంటీ? ఏ తప్పూ చేయని ఈ బిడ్డ అప్పుడు అటు, ఇటూ తిరుగుతూ అల్లల్లాడిపోవాలా? ...లేక ఏ అనాథశరణాలయంలోనైనా చేరుస్తారా?...ఎవరికి తెలుసు! వద్దు...అలాంటి పరిస్థితి నా కడుపులో పెరుగుతున్న ఈ బిడ్డకు రాకుడదు. ఈ బిడ్డకు నేనే తల్లిని-తండ్రిని...ఇకమీదట ఈ విషయంగా నాతో మాట్లాడకు" అని చెప్పి ఫోన్ కట్ చేసింది అర్చన.

తమ బిడ్డకోసం..."అర్చన కడుపులో పెరుగుతున్న బిడ్డ తమ బిడ్డే నని, అర్చన అద్దె తల్లి మాత్రమే నని, బిడ్డను కన్న వెంటనే మాకు బిడ్డను ఇచ్చేస్తానని అర్చన అగ్రిమెంట్ కూడా సంతకం చేసి ఇచ్చిందని, ఇప్పుడు బిడ్డని ఇవ్వనని చెబుతోందని...కాబట్టి అర్చన బిడ్డను కన్న వెంటనే మా బిడ్డను మాకు ఇప్పించమని"...కోర్టు సహాయం కొరుతూ కోర్టులో పెటీషన్ పెట్టుకున్నారు గౌరి-వెంకట్ దంపతులు.

కేసు పూర్తి అవకుండానే, జడ్జిమెంటుకు ముందే గౌరి-అర్చనలు రాజీ పడ్డారు. ఎలా...ఎలా! ...ఏమని రాజీ పడుంటారు. అనే ప్రశ్న అందరి మదిలోనూ మెదులుతోంది. జడ్జిమెంటుకు ముందు జడ్జికి అందించిన కవరులో రాసున్నదేమిటి! జడ్జి కూడా దానికి ఒప్పుకున్నారే! ఆ కవరులోని కాగితంలో రాసున్నదేమిటో...మనం కూడా తెలుసుకుందాం.

"క్షమించు అర్చనా! నిన్ను మేము ఎంతో బాధ పెట్టేము. మాకోసం బిడ్డను మోస్తున్న నీ గురించి ఒక్క క్షణం కూడా ఆలొచించ కుండా పిచ్చి నిర్ణయాలు తీసుకుని, వాటిని నీ మీద రుద్దేము. నువ్వు తీసుకున్న నిర్ణయం చాల గొప్పదని మేము లేటుగా అర్ధంచేసుకున్నాము. మాతృత్వానికి నువ్విచ్చిన ప్రాముఖ్యత మమ్మల్ని సిగ్గుపడేట్లు చేసింది...ఇకమీదట మేము అవసరపడి తప్పుడు నిర్ణయాలు తీసుకోము. ఏ కారణంగానూ మాలో ఈగోకి చోటివ్వం. మేము ఎలాంటి ప్రామిస్ చేయమన్నా చేస్తాము. మేము అన్యోన్యంగా, సంతోషంగా కాపురం చేస్తున్నట్లు ఏ రోజైతే నీ మనసుకు అనిపిస్తుందో ఆ రోజు నువ్వు మా బిడ్డను మాకిస్తే చాలు. అంతవరకు నిన్ను మేము బలవంతం చేయం...అది ఎన్ని సంవత్సరాలైనా సరే కాచుకోనుంటాము...కానీ ఒక్కటి మాత్రం నువ్వు గ్రహిస్తే చాలు...నువన్నావే మాతృత్వం అని...అది ఇప్పుడు నాలో ప్రవాహంలా ప్రవహిస్తోంది...బిడ్డ కావాలని తహ తహ లాడిస్తోంది...అది నువ్వు నమ్మితే చాలు....ఇట్లు గౌరి-వెంకట్"

# బలపరిధులు

## ఎల్లక్టాన్

**"నీటిలో ఉన్న మొసలి బలం** ముందు ఏనుగు బలం ఎందుకూ కొరగాదని గజేంద్ర మోక్షం భాగవతగాథ మనకి చెబుతుంది. కానీ ఈ హాలీవుడ్ సినిమావాళ్ళు నీళ్ళలోని మొసళ్ళు గట్టునున్న యిళ్ళలోకి కూడా వచ్చి నానా బీభత్సమూ చేస్తాయని ఒకటి, రెండు, మూడు అని వరస సినిమాలు తీసేస్తున్నారు. అనుశ్రుతంగా వస్తున్న సూక్తులకీ, నమ్మికలకీ యిది విరుద్ధంకాదా?" నారాయణ ఫెన్నీతో

పెదాలు తడుపుకుంటూ అన్నాడు. నారాయణ బావమరిది గోవా వెళ్ళినప్పుడు బావగారి ప్రీత్యర్థం జీడిమామిడిపళ్ళతో తయారుచేసే ఫెన్నీని ఓ హాఫ్ బాటిల్ తీసుకొచ్చాడు.

సాధారణంగా విస్కీప్రియుడైన విశ్వం కూడా ఫెన్నీతో పెదాలు తడుపుకుని, "అదోలా ఉంది. హాలీవుడ్ వాళ్ళు మొసళ్ళకీ యిలాంటి మద్యాలు పట్టించేసి సినిమాలు తీసేస్తారనుకుంటాను."

"అవన్నీ బొమ్మలు. కెమేరాల మాయాజాలంతో భయంకరంగా తీసేస్తారు. యిక ఈ డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం బక్కపల్చటి వాళ్ళని కూడా మహాబలులుగా రాక్షసాకారాలతో చూపించేస్తున్నారు."

"అంతదాకా ఎందుకు? ఎటువంటి మహారూపాలూ ధరించకుండానే మనదేశ సినీనాయకులందరూ బక్కపల్చగా ఉండి కూడా ఒక్క గుద్దుతో పదిమందిని ఆకాశంలోకి ఎగరేసి పల్టీలు కొట్టించేస్తున్నారు. మౌలికంగా వ్యక్తులు సమాజంలో గుర్తింపు కోసం అందంగా ఉండాలనీ, అఖండమైన పరిజ్ఞానంతో విద్యార్హతలు సాధించాలనీ, ఉన్నత పదవులు పొందాలనీ, అధికారం చూపించాలనీ, ఆటల్లోనూ కళల్లోనూ నైపుణ్యం ప్రదర్శించాలనీ యిలా ఎన్నెన్నో అంశాలలో ప్రజ్ఞ సాధించాలని కలలు కంటారు. ఈ విజయ ప్రదర్శనలలో తన బలిమీ, స్థాన బలిమీ అనేవి రెండు ఉప అంశాలు. ఈ రెండూ మానసికమైనవి. స్వంతగడ్డమీద జరిగే ఆటల పోటీలలో, యితర ప్రదర్శనలలో స్థానికుల అధిక శాతం విజయాలకి స్థానిక ప్రేక్షకుల ప్రోత్సాహం కాని, కొన్ని సందర్భాల్లో న్యాయ నిర్ణేతల పక్షపాత వైఖరి కాని కారణాలు కావొచ్చు. ఈ మనస్తత్వం జీవితంలోని అనేక విషయాలకి వర్తిస్తుంది" అన్నాడు బాలకృష్ణ నిమ్మరసంలో కాస్త మిరియాలపొడి జల్లుకుంటూ.

"అత్తింట్లో అణిగి మణిగి ఉన్న కోడలు పుట్టింట్లో అడుగుపెట్టగానే ఆడపడుచు అధికారం చెలాయిస్తుంది. హాస్టల్లో పెట్టే గడ్డి తిండి నోరుమూసుకుని తినే విద్యార్థి యింటికొస్తే నాయనమ్మ చేసే వంట బాగోలేదని విసుక్కుంటాడు. ఆఫీసు గదిలో పులిలా అధికారం చెలాయించే పెద్దమనిషి పడగ్గదిలో పిల్లిలా మారిపోతాడు" అన్నాడు నారాయణ.

"చివరి మాటని తిప్పి చెప్పావు. అది ఎంతవారలైనా కాంతదాసులే అన్నదానికి ఉదాహరణ. అనాల్సిందేమిటంటే ఇంట్లో పులులూ, బయట పిల్లులూ అని. స్థానబలిమికి మరో ఉదాహరణ కుర్చీకున్న అధికారం కూడా." అన్నాడు విశ్వం.

"చెప్పాను కదా? పరిస్థితులకు అనుగుణంగా రంగులు మారిపోయే మనస్తత్వమిదని. 'కొండ అద్దమందు కొంచెమై యుండదా?' అన్న వేమనగారి ఉవాచ కూడా దీని వెనువెంటనే ఉంటుంది." అన్నాడు బాలకృష్ణ.

"కానిచోట జూదమాడి ధర్మరాజు అడవుల పాలైయ్యాడు. శ్రీమహావిష్ణువు ద్వారపాలకులు మహాబుషులను కూడా వైకుంఠంలోకి అడుగు పెట్టనీయలేదు." అన్నాడు విశ్వం.

బాలకృష్ణ మొదలు పెట్టాడు.

"నీళ్ళలో మొసలిలాంటివాడే ట్రాఫిక్ కానిస్టేబుల్ వెంకటస్వామి. జగదాంబా సెంటర్, కొత్త బస్‌స్టాండ్, ఎమ్.విపిలాంటి కూడళ్ళు వెంకటస్వామికి సరస్సుల్లాంటివి. ఆ జంక్షన్లలో డ్యూటీ పడాలంటే తెరవెనక భాగోతాలుకూడా చాలానే ఉంటాయి. కొన్ని చికాకులూ ఉంటాయి. వారానికి కనీసం యిన్ని కేసులు బుక్ చెయ్యాలని ఓ నియమం. యిది ట్రాఫిక్ పోలీసుల అప్రమత్తతకి నిదర్శనంగానూ లేదా, ట్రాఫిక్ పోలీస్ విభాగానికి తద్వారా లభించే జరిమానా సొమ్ములు ప్రభుత్వాదాయంగానూ పరిగణించవచ్చు. అంటే ట్రాఫిక్ ఉల్లంఘనలు నాగరికులు చేస్తూనే ఉండాలన్నమాట. అదీకాక ట్రాఫిక్ పోలీసు కేరియర్ గ్రాఫ్‌కి కూడా కేసులు బుక్ చెయ్యడం చాలా అవసరం. నిజాయితీగల ట్రాఫిక్ పోలీసులకి యిది లక్ష్యమైతే, జేబులు నింపుకుని, తను తిని, పై వాళ్ళకి తినిపించే అవినీతిపరులకు కూడా సాధ్యమైనన్ని కేసులు బుక్ చెయ్యడం చాలా చాలా అవసరం. నిజాయితీపరులకు ట్రాఫిక్ రద్దీలేని చిన్న జంక్షన్లలో డ్యూటీ పడితే,

వెంకటస్వామిలాంటి వాళ్ళకి పెద్ద పెద్ద జంక్షన్లలో డ్యూటీ పడ్తుందన్నమాట వారాంతాలలోనూ, మాసాంతరాలలోనూ బుల్లి బుల్లి వంకలు కూడా భూతద్దంలోలా పెద్దవైపోతాయి.

ఆ శనివారం వెంకటస్వామి చాలా చికాకుగా ఉన్నాడు. ఆ రోజు ఎందుకో కలెక్షన్లు బాగా రాలేదు. పెద్దాయనకి కిలో చికెన్ కొని యివ్వాలి. ఆ రాత్రికి కురుపాం మార్కెట్ వెనక గొందుల్లో ఉంటున్న పంకజానికి కొత్త చీరనిచ్చి, కట్టించి మురిపించి, ఆ తర్వాత తాను మురిసిపోవాలి. కురుపాం మార్కెట్లో పక్కన నిల్చున్నవాళ్ళు బేరాలాడి ఆమె దగ్గర కూరలు కొంటుంటే, తన మట్టుకు ఆమె ఎంత ధరలు చెబితే అంతకు కొని నెలరోజులుగా తంటాలు పడి చివరికెలాగైతేనే ఆహ్వానం అందుకున్నాడు. యిచ్చిన అవకాశం చేజార్చుకోకుండా ఆదివారమంతా కూడా ఆమెతో చక్కర్లు కొట్టాలి. ఎందుకంటే సోమవారమయ్యేటప్పటికి పుట్టింటికి పోయిన భార్య తిరిగి వచ్చేస్తుంది.

హఠాత్తుగా ఓ ఆటో ఎర్రలైటు ఆరి పసుప్పచ్చ లైటు వెలిగిన వెంటనే ముందుకు పోవడంతో వెంకటస్వామి గట్టిగా విజిల్ ఊది బండినాపి ఓ పక్కగా నిలిపించాడు.

'అంతవరకూ ఆగినవాడివి పూర్తిగా ఆకుపచ్చ సిగ్నలు రాకుండా దూసుకుపోయావు. ఏదైనా వాహనమొచ్చి గుద్దేస్తే ఏమయ్యేది? బండి లైసెన్సూ, నీ డ్రైవింగ్ లైసెన్సూ చూపించు' అని వెంకటస్వామి ఆటో డ్రైవర్ మీద ఎగరసాగాడు. డ్రైవరు నిమ్మకు నీరెత్తినట్టు ఉలుకూ పలుకూ లేకుండా ఉండిపోయాడు. అతగాడి పేరు అప్పలాజు.

ఆటోలో ఓ భార్యాభర్తలూ, కడుపుతో ఉన్న వారమ్మాయీ ఉన్నారు. ప్రయాణీకుడికి ఆందోళన మొదలైంది. 'అమ్మాయి నొప్పులు పడ్తోంది. అర్జంటుగా కె.జి.హెచ్‌కి తీసుకుపోవాలి, దయచేసి వెళ్ళనీయండి. మీరు రిక్షాని ఆపుచేసేస్తే నాకింకో రిక్షా యింత తక్కువ దూరానికి దొరకదు. దయచేసి వదిలేయండి' అని ఆటోలోని ప్రయాణీకుడు వెంకటస్వామినుద్దేశించి అన్నాడు. ఆయన పేరు రాజారావు.

'ఏదో మీ సొంత రిక్షాలా మాట్లాడతారేమిటి? మీరు కలగచేసుకోకండి. నా లావాదేవీలన్నీ డ్రైవర్‌తోనే' అన్నాడు వెంకటస్వామి గదమాయింపు స్వరంతో.

అప్పలాజు వందనోటు తీసి వెంకటస్వామి చేతిలో కుక్కాడు. 'అమ్మాయి బాధలో ఉంది కాబట్టి వదిలేస్తున్నాను. లేకపోతే నీ దగ్గర లైసెన్స్ లేదని నాకు తెలుసు. పో' అని కర్కశంగా అన్నాడు.

హాస్పిటల్ చేరిన తర్వాత రాజారావు అమ్మాయిని దింపి, భార్య దిగిన తర్వాత, ఎక్కేటప్పుడు బేరమాడుకొన్నట్టుగా వంద నోటు తీసిచ్చాడు.

'మరో వందివ్వు' అన్నాడు అప్పలాజు పొగరుగా.

'ఎందుకని? మనం బేరమాడుకున్నది వందకే కదా! మీటరు మీద ఏభై దాటని దూరానికి వంద తీసుకున్నది చాలక మరో వందా?' ప్రయాణికుడన్నాడు.

'పోలీసుకిచ్చిన వందా ఎవరిస్తారు? మీ అమ్మాయి నొప్పులతో బాధపడుతోందని నేను జంక్షన్ దగ్గర ఒక్క సెకను ముందు బండిని వదలడం మీ అమ్మాయి క్షేమాన్ని గురించి ఆలోచించే. ఆ పోలీసోడి చేతి తడుపును మీరు భరించాల్సిందే'

'ఆటో ఎక్కిన తర్వాత గతుకుల్లోంచి పోకుండా నెమ్మదిగా తీసుకువెళ్ళమని చెప్పానా లేదా? ఎర్రలైటు నలభై సెకన్లు వెలిగి ఉన్నప్పుడు బండిని రూలు ప్రకారమే ఆపావు. అంతసేపూ నోరు మెదపకుండా కూర్చున్నవాడిని ఆ ఒక్క సెకన్లోనూ నేను నిన్ను కంగారు పెట్టలేదే. ఎర్ర సిగ్నలు పసుప్పచ్చగా మారిన వెంటనే బండిని పోనివ్వడం మీకలవాటైపోయింది. ఆకుపచ్చ సిగ్నలు వచ్చేవరకూ ఆగకపోవడం నీదే తప్పు. నువ్వు డ్రైవింగ్ లైసెన్స్ కనక చూపించి వుంటే, ట్రాఫిక్ పోలీసు మా అమ్మాయి పరిస్థితి చూసి వదిలేసేవాడు.

నువ్వు ట్రాఫిక్ పోలీసు చేతులు తడిపింది నీ దగ్గర లైసెన్స్ లేకపోవడం మూలానే కానీ నా కూతురు పరిస్థితి చూసికాదు' అన్నాడు రాజారావు.

'అంటే నువ్వుకూడా నా లైసెన్స్‌ని గురించి ప్రశ్నిస్తావా? యికనుంచీ ఆటోలు ఎక్కేటప్పుడు డ్రైవర్ల దగ్గర లైసెన్స్ ఉందో లేదో తెలుసుకుని బండెక్కు. మరో వందా యిచ్చి తీరాల్సిందే' అప్పలరాజు వాదనకి దిగాడు. హాస్పిటల్ గేటు దగ్గర స్టాండ్‌లో ఉన్న ఆటో డ్రైవర్లందరూ గుమికూడి సంగతి తెలుసుకుని మరో వంద యిచ్చి తీరాల్సిందే అని తీర్మానం చెప్పేశారు. రాజారావు భార్య బొడ్లో ఉన్న గుడ్డసంచీ తీసి ఓ నలిగిన వందనోటు తీసి ఆటో అతనికిచ్చి 'పదండి' అని కూతురు చేయిపట్టుకుని ముందుకు కదిలింది.

కూతురు పెళ్ళికని చేసిన అప్పులు యింకా తీరకముందే, అయిదోనెల గర్భంతో ఉన్నప్పుడే కూతుర్ని పుట్టింటికి పంపేసిన అల్లుణ్ణి తలుచుకుని 'ఈ కాలపు పిల్లలయ్యుండి కూడా వీళ్ళకింత కంగారేమిటో?' అని మనసులో అనుకుంటూ కె.జి.హెచ్‌లోని ప్రసూతి విభాగంవైపు దారి తీశాడు.

పెట్రోలు ధరలు రోజురోజుకీ ఆకాశాన్నంటుతూంటే, మోటారు సైకిలు మీద ఒకరు కాదు, నలుగురు ప్రయాణం చేసే రోజుల్లో ట్రాఫిక్ కేసులకి కొదవేలేదు. యిద్దరకన్నా ఎక్కువ ప్రయాణం చేస్తున్నందుకూ, నడిపేవాడికే కాక అందరికీ హెల్మెట్లుండాలన్న మహానగరాల నియమాల ప్రకారమూ ఏవో కేసులు దొరుకుతునే ఉంటాయి. అంతకు క్రితం రోజునే విడుదలైన ఉమేష్ బాబు చలన చిత్రం చూడ్డం కోసం మోటారు సైకిలు మీద జగదాంబ సినిమాహాలుకి వెళ్ళే ఓ నలుగురి మిత్రబృందం వెంకట స్వామి చేతికి చిక్కింది. ఫలితంగా జేబు నాలుగువందలతో బరువెక్కింది. ఉమేష్ బాబుతో మొదటిసారిగా నటిస్తున్న నడుంలేని ఉత్తరాది నాయికిని చూడాలన్న ఆ మిత్రబృందం కుతూహలం రామకృష్ణా బీచ్‌లో ఎగిసిన తరంగం విరిగినట్టు విరిగిపోయింది. ఉసూరుమంటూ టిక్కట్లు కొనడానికే కాదు, సాదరు చెయ్యడానికి కూడా డబ్బులు లేకపోవడంతో యిళ్ళకు పోయారు. వెంకటస్వామి పవరు ముందు వారి పొగరు ఎందుకూ పనికి రాకుండా పోయింది. ఖాకీ రంగు బుష్‌కోటు ధరించకుండా భుజం మీద వేసుకుని ఆటో నడుపుతున్న మరో ముగ్గురు బక్రాగాళ్ళు కూడా వెంకటస్వామి చేతికి చిక్కారు.

నైట్ షిఫ్ట్ చేసే బాబూరావు రాగానే డ్యూటీ అప్పగించి, శిల్క్‌పేలస్‌లో నాలుగు వందలకి చీర కొని ఆ రొందల స్టిక్కర్ అంటింపచేసి, మస్తాన్ షాపులో కిలో చికెన్ కొని పెద్దయ్యకి అప్పగించి, క్వార్టర్స్‌కి పోయి, స్నానం చేసి, మంచి దుస్తులు వేసుకుని, ఇంటిదగ్గరే సెంటు కొట్టుకుని బయలుదేరితే కాలనీవాసులు పసికట్టి భార్య తిరిగిరాగానే చెవిలో ఊదేస్తారన్న భయంతో సెంటు సీసాని జేబులో పెట్టుకుని, ఓ పాత సంచిలో పంకజానికి కొన్న కొత్త చీరనుంచి ఏదో పనిమీద పోతున్నట్టుగా పోలీసు కాలనీ బయట అడుగు పెట్టాడు వెంకటస్వామి. దారిలో యిద్దరు ముగ్గురు పలకరించారు కూడా.

అప్పటికే రాత్రి తొమ్మిది దాటి పదికావస్తోంది. తలుపు మీద నెమ్మదిగా తట్టగానే పంకజం తలుపు తీసింది. సాయంత్రం అరకు కుంకుడు కాయలతో తలస్నానం చేసిన పంకజం విరబూసిన జుట్టుతో, రవికలేని జబ్బలతో, పయిట చాటు అందాలతో పిటపిటలాడుతూ కనబడ్డంతో వెంకటస్వామికి ఆ నాటు అందాలతో మతిపోయింది. సంచిలోంచి చీర తీసి చేతిలో ఉంచాడు. ఆమె లోపలికి వెళ్ళగానే తాను వీధితలుపు వేశాడు. అయిదు నిముషాల్లో పంకజం కొత్త చీరలో దర్శనమిచ్చింది. 'రెండు సున్నాలతోటే సరిపెట్టేశావ్, మూడు సున్నాల చీర దొరకలేదా ఏంటి?' అంటూ కుర్చీలో కూర్చున్న వెంకటస్వామి ఒళ్ళో కూర్చుంది. సెంటు సీసా తీసి యిద్దరి మీదా స్ప్రే చేశాడు. గదంతా ఘుమఘుమ లాడిపోయింది. అంతట్లో వీధి తలుపుమీద దబదబా చప్పుళ్ళు వినిపించాయి. పంకజం ఒక్క ఉదుటున వెంకటస్వామి ఒళ్ళోంచి లేచి వెనక దొడ్లోకి పొమ్మని సంజ్ఞ చేసి తాను వీధితలుపు వైపు అడుగులేసింది. వెంకటస్వామి వెనక దొడ్లోకి పోయి నీళ్ళగదిలో దాక్కున్నాడు.

యిద్దరు దుక్కలాంటి మనుషులు లోపల అడుగుపెట్టారు.'సెంటువాసనలు ఘుమ్మంటున్నాయి కొత్తాడెవడైనా వల్లో చిక్కాడేమిటి?' అన్నాడొకడు.

'ఊహ! అలాంటిదేమీలేదు. నిన్న మా చెల్లాయి వచ్చింది. అదిచ్చి పోయింది.' అంది పంకజం.

'నీ వాలకం చూస్తే అలా అనిపించటల్లేదు. ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్టుగానో, లేదా ఎక్కడికో బయలుదేరుతున్నట్టుగానో కనబడ్తున్నావ్' అన్నాడు రెండోవాడు.

'ఎలాగూ సిద్ధంగా ఉన్నావ్ కదా! పద. హైదరాబాదునుంచి సినిమా షూటింగ్‌కని వచ్చిన ముఠా ముడసరలోవ దగ్గర డేరాలేసింది. డాన్స్ డైరెక్టర్ నాటు అందాల మనిషి కావాలన్నాడు,' అన్నాడు మొదటివాడు.

'నాకు రావడానికి కుదరదు' అంది బెదురుగా పంకజం.

'రానంటే కుదరదు. రాత్రికి రెండువేలు. రేపు ఎగ్స్ట్రా కింద వేషమిస్తాడు. అప్పుడో వెయ్యి. మొత్తం సొమ్ములో ఏభైశాతం మా కమిషన్. పద పద' అన్నాడు రెండోవాడు.

అప్పటికే కుతూహలం కొద్దీ పిల్లిలా వంటగదిలోకి దూసుకు వచ్చాడు.

'అంటే ఆ సెంటుగాడు వీడేనన్నమాట. నువ్వెవడివో మాకనవసరం. మాకొచ్చే కమిషన్ పదిహేను వందలు. ఆ సొమ్మిచ్చేస్తే మిమ్మల్ని మీ మానాన్న వదిలేసిపోతాం. సెంటుసీసాలిచ్చి, కొత్త చీరలిచ్చి ఎంతకాలం ఈవిడ చుట్టూ తిరుగుతావ్? ఈమెకు వచ్చే సినిమా అవకాశానికి అడ్డురాకు. మా కమిషన్ వ్యాపారానికి అడ్డొస్తే మక్కలిరగదీస్తాం' అన్నాడు మొదటివాడు.

వెంకటస్వామికి గొంతు తడారిపోయింది. ఘర్షణపడితే తను రోడ్డున పడ్తాడు. బిక్కమొహం వేసుకుని మౌనంగా బయటకు దారి తీశాడు. వెంకటస్వామి బయటకు వెళ్ళిన వెంటనే ముగ్గురూ పగలబడి నవ్వారు. పంకజం యింటికి తాళం వేసి వాళ్ళు తీసుకొచ్చిన వ్యాన్‌లో ఎక్కింది. సందు మొగలో నిల్చున్న వెంకటస్వామి వెళ్ళిపోతున్న వ్యాన్ వైపు చూస్తూ గుడ్డివెల్తుర్లో నెంబరు చూసి, పదేపదే వల్లించుకున్నాడు. అవకాశం వస్తే ఏ ట్రాఫిక్ కేసులోనే యిరికించేయాలి అనుకుంటూ యింటి దారి పట్టాడు.

సోమవారం ఉదయం వెంకటస్వామి భార్య పుట్టింటి నుంచి దిగింది. గదిలో గోడకి తగిలించిన చొక్కా నుంచి సెంటువాసన లీలగా తగిలింది. చూస్తే డ్రెస్సింగ్ టేబుల్ మీద ఆ సెంటు సీసా లేదు. 'సెంటు రాసుకుని ఎవరితో పూసుకు తిరుగుతున్నావనీ, సీసా ఏదనీ' నిలదీసింది. శనివారం రాత్రి పంకజం యింట్లో ఆసెంటు సీసాను కంగారులో వదిలేసిన సంగతి గుర్తుకొచ్చి వెంకటస్వామి తన్ను తాను లోలోన కసురుకున్నాడు.

'శనివారం డ్యూటీ చేసిన తర్వాత పెద్దయ్యగారికి కొని యివ్వడానికి వెళ్ళినప్పుడు ఏదో చొక్కామీద స్ప్రే జల్లుకున్నాను. 'సెంటువాసన బావుందే? ఏ బ్రాండేమిటి?' అని ప్రశ్నించాడు. మా బావమరిది కార్గో షిప్‌లో పనిచేస్తాడు. పదిరోజుల క్రితం ఓడ పోర్ట్‌లో ఆగినప్పుడు చూడ్డానికి వచ్చి వాళ్ళప్పగారికి ఫ్రెంచ్ పెర్ఫ్యూమ్ సీసా యిచ్చిపోయాడు. దానిదే సార్ ఈ సువాసన' అని చెప్పాను. ఆయన్ని మంచి చేసుకోవడం మనకే మంచిదికదా అని నిన్న ఉదయం పోయి సెంటుసీసా ఆయనకిచ్చేశాను. నీకింకోటి కొనిస్తాను' అని అతికినట్టు అబద్ధమాడాడు.

'మొన్న మాల్‌లో అడిగితే యిదే బ్రాండ్ రెండువేలు చెప్పాడు. పట్టిన కేసుల్లో గుంజిన డబ్బుల్ని వాటాలిచ్చుకుంటూ పోతే ఎప్పటికని కొంటావ్? అయినా బుద్ధిలేకపోతే నా తమ్ముడు ఓడల్లో పనిచేస్తాడని ఎందుకు చెప్పావ్? ఇకనుంచీ అవీ, యివీ తెప్పించమని నసపెట్టేస్తాడు. కానిచోట గొప్పలు చెప్పుకోకు' మొగుడి మాటలు నమ్మిందో లేదో తెలియదు కాని వెంకటస్వామి భార్య భర్త అవివేకాన్ని ఎద్దేవా చేసింది. బతుకు జీవుడా అనుకుంటూ వెంకటస్వామి ఓ దీర్ఘనిశ్వాసం వదిలాడు.

వెంకటస్వామికి వంద సమర్పించుకున్న ఆటో డ్రైవరు అప్పల్రాజు యింటికి సోమవారం ఉదయం అనకాపల్లినుంచి అతగాడి పెద్దమ్మ కొడుకు వచ్చాడు. పంటల నష్టపరిహారం కోసం అతను చేసుకున్న విన్నపం చాలాకాలంగా కలెక్టర్ గారి ఆఫీసులో ఓ మూల పడుంది. అతనితో అర్జీలు పెట్టుకున్నవారికి అప్పటికే వేలలో సొమ్ములు ముట్టాయి. అప్పల్రాజూ, అతగాడి పెద్దమ్మ కొడుకూ కలెక్టరాఫీసుకు పోయి, సంబంధితశాఖ ఎక్కడో కనుక్కుని అక్కడికి వెళ్ళారు. సెక్యూరిటీ గార్డు వారిని ఒకపట్టాన లోపలికి పోనీయలేదు. ఎలగో ఒప్పించి, లోపలికి కష్టం మీద అడుగు పెట్టారు. 'అయిదో నెంబరు బల్లదగ్గర రాజారావుగారని ఉంటారు. ఆయన్ని కలుసుకోండి. మీ పని జరిగిపోతుంది' అని ఆ గార్డు చెప్పాడు.

యిద్దరూ ఆ బల్లదగ్గరకు పోయి, 'నమస్కారం సార్' అన్నారు. దస్త్రాల్లో తలదూర్చి పనిచేసుకుంటున్న రాజారావన్నాయన తలెత్తి 'ఏం కావాలి?' అని అడిగాడు. అప్పల్రాజుకి ఒక్కసారిగా పై ప్రాణాలు పోయాయి. ఎందుకంటే శనివారం సాయంత్రం కడుపుతో ఉన్న కూతుర్ని కె.జి.హెచ్‌కి తన ఆటోలో తీసుకువెళ్ళిన ప్రయాణీకుడాయనే. తను పెద్దమ్మ కొడుకు వెంటరాకుండా ఉండాల్సింది. ఆయన తనని గుర్తిస్తే వ్యవహారం బెడిసి కొట్టినట్టే.

అనకాపల్లి ఆసామీ తన గోడు వినిపించుకున్నాడు. వినిపించుకున్న తర్వాత 'సార్! సొమ్ములు త్వరగా వచ్చేటట్టు చూడండి సార్. మీ ఋణం తీర్చుకుంటాను' అన్నాడు లోగింతులో.

రాజారావు తన ముందునున్న ఓ దస్త్రం తీసి అనకాపల్లి ఆసామీకి అందచేసి, 'మీరు చదవగలరనుకొంటాను. ఆఖరిపేజీ చూడండి,' అన్నాడు.

'కలెక్టరుగారు నష్టపరిహారానికి అంగీకరించినట్టు ఉంది సార్'

'తేదీ?'

'ఈ రోజే సార్.'

'మరి? మీ ఎమ్.ఎల్.ఏ గారు సిఫారసు చేసిన అర్జీలనన్నింటినీ పెద్దాయన ముందుగా క్లియర్ చేసేశారు. అవేవీ నా దగ్గరకు రాకుండానే నా పై ఆయన వాటిని కలెక్టరుగారి వద్దకు పంపేశాడు. మీలాంటివారి పదిమంది అర్జీలని వాటిలో మీరు తెలియబర్చుకున్న కష్టాలన్నీ నిజమనే నమ్మికతో నేను రెండేసి పేజీల నోట్సు రాసి పంపిస్తే, పెద్దాయన నా మీద నమ్మికతో క్లియర్ చేశారు. వెళ్ళండి. మీకు ఉత్తర్వులు రెండు రోజుల్లో అందుతాయి' అన్నాడు.

'సార్! మరి మీ...?'

'నేనలా కనబడ్తున్నానా? కళ్ళెదురుగా కష్టపడుతున్న వారిని చూసి కనికరం చూపడం నేర్చుకోండి చాలు' అన్నాడు రాజారావు.

అప్పల్రాజుకి సూటిగా గుచ్చుకుంది. రాజారావు తన్ను గుర్తించాడని తెలుసుకున్నాడు. నెమ్మదిగా చెంపలు వాయించుకుని నమస్కారం చేశాడు.

బాలకృష్ణ కథ ముగించాడు. 'కుర్చీ పవరుతో రాజారావు సొమ్ములు చేసుకుని ఉంటే అప్పుల్లో పడేవాడు కాదు. నైతిక బలమనేది అన్ని బలాలకీ మించినది కాదా?'

'మరి వెంకటస్వామి సంగతి?' నారాయణ అడిగాడు.

'వెంకటస్వామిని బురిడీ కొట్టించిన పంకజం డాన్స్ డైరెక్టర్ దగ్గరకు పోయిందికదా? వాడు అరచేతిలో ఆకాశం చూపించి, డేరాలో అవకాశం వాడుకుని మర్నాడుదయం పంకజానికి నాయకి పక్క నృత్యం చేసే వారిలో ఒకరిగా మేకప్ చెయ్యమన్నాడు. ఆమెను

చూసిన నాయకి మొరటు అందాల పంకజానికి వేషం యివ్వడానికి వీల్లేదంది. అది స్టార్ బలం. వెంకటస్వామి భార్య కురుపాం మార్కెట్‌కి కూరలు కొనడానికి వెళ్ళినప్పుడు పంకజం రాసుకున్న సెంటు వాసనని గుర్తించింది' బాలకృష్ణ ఆగాడు.

'ఆ తర్వాత?' విశ్వం కుతూహలంగా అడిగాడు.

'గృహిణి బలం ఎంతో తెలుసుకోవాలంటే వెంకటస్వామిని పలకరించాల్సిందే' అన్నాడు బాలకృష్ణ నవ్వుతూ.

# మది రుచిత మందిరమే! చింతలచెరువు సువర్చల

సూర్యుని బంగారు బాల కిరణాలు ఆయనకన్నా ముందే జగతిని పలకరిస్తూ, దోబూచులాడుతూన్న ఓ ఉదయాన, ఓ చిన్ని బంగళా ముంగిటిలో చిత్రకారుని కుంచెకు పనిబెట్టేలా ఉందా దృశ్యం. ఆ ప్రాంగణంలోనే చిన్న తోటలో పచ్చని మెత్తల పై కూర్చుని ఆ చిన్న కుటుంబం! భానుని నునువెచ్చదనాన్ని ఆస్వాదిస్తూ ఊగుతున్న చిరుకొమ్మలకు మల్లేనే వాళ్లు కూడా వెచ్చని కాఫీని ఆస్వాదిస్తూ ఆనందిస్తున్నారు.

అక్కడ నలుగురూ కాఫీ తాగుతున్నారనుకొని పొరబడేరు. ముగ్గురే మరి! ఆ జంట, వారి కుమారుడున్నూ!

కాఫీని ఇంతకుమున్నెన్నడూ చూడని పానీయంలా సేవిస్తున్నారు. (తమతమ వయసులబట్టి కొన్నేళ్లుగా తాగుతున్నప్పటికిన్నీ)

ఇక అసలైన పాత్ర వారి కుమార్తె మరియు ఇప్పటి ఈ మన కథానాయిక చారుమతి! ఆ అమ్మాయి బాదంపాలు తాగుతోంది మరి!

తనకు కాఫీ అంటే పడదు. పడదు అంటే..సరిపడదు అనుకోవచ్చు కానీ, మనమందరం 'కాఫీ' అని వినిపిస్తే దుబ్బున కిందపడతాం కదా ఎక్కడా ఎక్కడా అంటూ! అలా ఈ అమ్మాయి పడదన్నమాట!

కాఫీ వాసన నచ్చదు అందుకే కాఫీ తాగదు. అయితే కాఫీగింజల ఆరోమా, కాఫీ పూల బ్లోజంస్ ఆమెకు నచ్చుతాయి!

ఆమెకు పద్దెనిమిదో ఏడు రాగానే ఇక నీవు మేజరువు అన్న చందాన ..బలవంతాన వాళ్ల నాన్న ఓ గుక్క కాఫీని తాగించి ఆమె చేత కూడా ఓ హత్య చేయించి తమ టీంలో కలుపుకోవాలని చూసే హంతకుల ముఠా నాయకుడిలా వ్యవహరించబోయాడు. ఆమె ఈ పాతకము నేను చేయనని తీవ్రంగా ఎదురుతిరిగింది. కారణం ఆమెకు రుచించకపోవటమే!(రుచి తెలియకపోవటమే!)

"కాఫీ రుచి నిజంగా నీకు తెలియదు" అన్నాడు గోపాలం

"దాన్ని రుచి అంటారా? బాబోయ్ చేదు. మీరెలా తాగుతారోగానీ"

"నువ్వూ తాగిచూడు. ఆ ఆనందం మిస్ అవుతున్నావనిపిస్తుంది"

"నేను తాగక గాక తాగను నాన్నా!" ఖండితంగా చెప్పింది పద్దెనిమిదేళ్ల చారుమతి.

“ముందుముందు కాఫీ మొక్కను ఇంట్లో వేసుకొని మరీ పండిస్తావు చూస్తుండు”

“తోటలూ లేవు పంటలూ లేవు” అంటూ ముఖమ్మీద వాలబోతున్న ఈగల్ని విసురుకుంది.

“ఓ..బాదంపాల వాసనకేమో ఈగలు! అదే కాఫీ తాగితే ఇలా ఈగలు రావు” అన్నాడు అభి .

“బాదంపాలు కాబట్టే వాలుతున్నాయ్. కాఫీ వాసనకి ఈగలు చస్తాయి” చారు అంతే వేగంగా బదులిచ్చింది.

గోపాలం నవ్వు ఆపుకోలేకపోయాడు. భామ కూతురి వాదనకు మెచ్చుకోలుగా చిరునవ్వు నవ్వింది.

“అమ్మానాన్నా చెప్తే వినవా ?” కొద్దిపాటి చిరాకుతో అభి అన్నాడు.

“షటప్..నీకా హక్కులేదు. నీవు వాళ్ల ఒక్కమాటా వినలేదు. కాలేజ్, బ్రాంచ్ అన్నీ నీ ఇష్టమే! చిన్న చిన్న పనులు మాత్రం వినయంగా భలే చేస్తావ్. అమ్మకు తలనెప్పి లేనప్పుడు కూడా తలనెప్పా అమ్మా అంటూ ఒకటే అడిగిమరీ తలనెప్పి తెప్పిస్తావ్. ఇదంతా మాట వినటం కిందకిరాదు. నేను..నాన్న చెప్పిన కాలేజీలో చేరా. నాన్న ఐటీ తీసుకో అంటే ఒప్పుకున్నా. నీవు ఏ ఒక్కటీ అమ్మా వాళ్ల మాట పాటించలేదు. నీకు ఈ విషయమై మాట్లాడే హక్కులేదు” అంటూ అన్నతో వాదనకి తిరిగింది. చారుమతి పోట్లాడటం తీవ్ర స్థాయికి వెళ్లేకొద్దీ తెలుగు పదాలు ఎక్కువ దొర్లుతుంటాయ్.

“అదంతా వదిలేయ్ చారు! విషయం పక్కదారి పట్టించకు. కాఫీ తాగుతూ ముచ్చట్లు చెప్పుకుంటుంటే ఆ ఆనందమే వేరు”

“నేనూ మీ కబుర్లలో భాగం పంచుకుంటూనే ఉన్నానుగా నాన్నా!”

“కాఫీ మరింత దగ్గరచేస్తుందమ్మా!”

“అదేమీలేదు. కబుర్లే దగ్గరచేస్తాయ్! అయినా..నువ్వు చెప్పింది కాఫీ యాడ్ కి భలేగా పనికొస్తుంది నాన్నా!” అంది నవ్వుతూ.

తానూ నవ్వుతూ ”అది నీకు అర్థమయ్యే విషయం కాదులే. కాఫీకబుర్లు వేరు”

“కాఫీ కబుర్లా! అంటే అమ్మా, నువ్వూ కాఫీ పుట్టుపూర్వోత్తరాలు మాట్లాడుకుంటారా!? అలాగైతే గొప్ప కామెడీనే!” పకపక నవ్వింది.

సూరీడు కిరణాలు ఆకులపై వెలుగులు చిమ్మినట్లుగా తోచింది ఆ నవ్వుచూసి గోపాలానికి.

“చెప్పాగా కాఫీ అంటే నీవు ఇష్టపడే రోజు వస్తుంది చూడు చారూ! ఇప్పుడు నీవు ఒప్పుకోకపోయినా పర్లేదు!”

“అలా ఎప్పటికీ కాదు కాదు కాదు” అంటూ లేచింది చారుమతి. అందంగా కదిలిన పూలతీగలా ఉంది తాను.

ఉల్లాసంగా నడుచుకుంటూ వెళ్లి మధ్యహాల్లో ఉయ్యాలబల్లమీద కూర్చుని ఊగుతూ ఆస్కార్ వైల్డ్ "The importance of being earnest", యద్దనపూడి సులోచనా రాణి "మీనా" రెండూ కలిపి చదువుతూ..

బారెడు జడని ముందుకు వేసుకుని, లంగావోణీతో ఎంతో పొందికగా కనిపించింది.

చదువుతున్నప్పుడూ మధ్యమధ్యలో ఆమె మోమున విరిసే చిరునవ్వు, ఆశ్చర్యం, ప్రశాంతమైన హాయి..ఉన్నట్లుండి విరగబడే నవ్వు..ఎంత ముగ్ధ సౌందర్యమో!

పుస్తకాలు చదువుతుంటే ప్రతి అమ్మాయీ అంత అందంగానే ఉంటుంది కాబోలు!

చక్కని ఉదయం అది!

★★★★★

ఆ సాయంకాలం.. దొడ్లోకి ఉన్న వంటింటి మెట్లపై కూర్చుని ఉన్నారు భామ, చారుమతి. కింది మెట్టుపై కూర్చున్న కూతురికి జడవేస్తోంది భామ. వెదురు పుల్లలని బాణాలుగా చెక్కుతున్నాడు అభి. అరటిపాదులు తవ్వుతున్న గోపాలం పని ఆపేసి వచ్చి మామిడి చెట్టుకింద అరుగుపై కూర్చుని..

"చారూ! ఒక పాట పాడు"అన్నాడు.

“ఇప్పుడు పాడను” అంది పెంకిగా చారు.

“నాకు వినాలని ఉంది మరి” అన్నాడు.”

"నాకు పాడాలనిలేదు కదా!” అంది.

కొద్దిసేపు బతిమాలించుకొని రవీంద్రుని సంగీతం పాడటం మొదలుపెట్టింది. బాలాంత్రపు రజని గారి తెలుగు అనువాద గీతమది.

“వందనమయ్యా నీ వాణికీ
అతిసుందర రసబంధుర సామ్రాజ్య దురంధరా!
తపోవనీ తరుచ్ఛాయ తారాడే హరిణికి
ఉపనిషంత్ర తంత్ర మధువు లాలి పాడు అళినికీ

ఎపుడు నిదురమాని తిరిగే గంగా నిర్ఝరిణికి

వందనమయ్యా నీ వాణికీ..”

తడి నిండిన మది ఆమెది. ఆ ఆర్ద్రత ఆమె గొంతునా నిండుగానే పలికింది.

ఆ కంఠరవానికి ఎంతటి మూఢులైనా కరిగిపోతారు.

భావుకత నిండుగా ఉన్న వారి మానసిక స్థితిగురించి వేరే చెప్పాలా? తెలియని గుబులు మనస్సంతా ఆక్రమించుకుని చేతకాని అవస్థలో కన్నీరొలికిస్తారు. అదిగో, ఇక్కడా అదే జరిగింది.

"ఇక అరటిపాదులకి నీళ్లు ప్రత్యేకం పట్టక్కర్లేదు. మీరిద్దరూ ఉన్నారు చాలు. చారుతో రోజూ పాట పాడిస్తే సరి" అన్నాడు అభి అమ్మానాన్నల కంటిచేమని గమనించి.

అమ్మచేతిలోనుంచి దువ్వెన లాక్కుని వాడిపై విసిరేసింది చారు.

నిర్మలత్వం, ప్రశాంతత పుష్కలంగా ఉన్న మనస్సు ఆమెది.

ఆ అమ్మాయి సాంగత్యంలో ఎటువంటి జడులైనా ఉత్తేజం పొందుతారు.

ఎంత అందమైన సాయంత్రమది!

★★★★★

అలా ఉదయసంధ్యలు వీణానాదంలా మృదువుగా దొర్లిపోతున్నాయి .

ఉదయాలు విభాస్ రాగం, సాయంకాలాలు నీలాంబరి రాగం ఆ ఇంటిని కాంతిరాగ తరంగాలను ప్రజ్వలింపచేస్తున్నాయి.

కృతులా, తరంగాలా, అష్టపదులా, కృష్ణశాస్త్రి గేయాలా, రవీంద్రుని గీతాలా, తులసీ,సూరదాసుల భజనలా ఒకటేమిటి

ఆమె ఆలాపనలు ఆమె ముగ్ధమోహనరూపాన్ని మరింత మనోహరంగా తీర్చిదిద్దుతున్నాయి.

★★★★★

మరలా సాగుతుండగా..అరె! ఈ పదాన్ని అలాగే చదివేస్తున్నారా? మరలా "మరలా" అనే పదాన్ని చదవరూ!?

ఎలా అనుకుంటున్నారా?

"మరి అలా.."అన్నమాట!

మరి అలా అప్రమేయానంద వీచికా నర్తనం ఆ ఇంట సాగుతుండగా.. ఆ నర్తనానికి నేపథ్యగానం వారి జీవనశైలి అయితే, దానికి తోడు , కనిపించక వినిపించే ఆర్కెస్ట్రా లా చారుమతికి ఓ మాంచికాఫీ లాంటి సంబంధం వచ్చింది.

మంచి కాఫీ అంటే నిజంగా మంచే కాఫీ, కాఫీయే మంచి అనుకునే సంప్రదాయమన్నమాట! మరి ఆ మంచివారింట కాఫీయే వారి మనుగడ, వారి జీవనం, అదే వారి ప్రపంచం! ఇంతెందుకు వారి జీవితమే కాఫీతో ముడిపడి, ఎన్నడూ విడిపడనంత గాఢ అనుబంధం అను బంధం తో చిక్కడిపోయి, చిక్కనంత చిక్కదనాన్ని ఎంచక్కా పొదువుకొని మూడు మిరియాలు, ఆరు యాలకులతో సమ్మేళితమై అలరారుతున్నది.

అల్లవారి సంబంధం అల్లాటప్పా కాదండోయ్! అసలుసిసలు తెలుగువారైన కన్నడ సంప్రదాయం!

సన్నజాజికి చందనం తోడైనట్లు, జవ్వాజికి కస్తూరి కలగలసినట్లు ....అల్లవారు, మీరప్పుడే గ్రహించినట్లు..అల్లదిగో ఆ కూర్గ్ నుంచే వచ్చారు!

అల్లసాని పెద్దన కృష్ణాయల కొలువులో నెలవైనట్లు, తెనాలి రామలింగడు రాయల సభకి శోభను పెంచినట్లు

ఈ చారుమతి అనెడి కొమ్మ విరాజమానమైన(అవునండీ..విరాజ్ పేట నే)ఆ వినీతుని(వినీత్) ఇంట సౌరభాన్ని "విరి"జిమ్మబోతోంది!

★★★★★★

వినీతునిది వ్యవసాయ కుటుంబం. కూర్గ్ లో పాతిక ఎకరాల కాఫీతోట ఉంది. తాను ఎన్విరన్మెంటల్ సైన్సెస్ లో పట్టభద్రుడైన తర్వాత తండ్రికి విశ్రాంతినివ్వాలన్న ఆలోచనైతేనేమి, తనకూ వ్యవసాయం పట్ల ఉన్న ఆసక్తి ఐతేనేమి కాఫీ పొలాలు, అందులో వేసే మిరియం, యాలకుల పంటనూ సేంద్రీయ పద్ధతిలో పండిస్తున్నాడు. అందుకు అవసరమైన శాస్త్రీయ అంశాలను, పరిశోధనలనూ అనుసరిస్తూ "ఆర్గానిక్ కాఫీ" అని ఒక సంస్థను నడుపుతున్నాడు. అందులో తోటి చిన్న రైతులకు ,తండ్రి సాయంతో తగు సలహాలను ఉచితంగా అందిస్తాడు. ఇంటి ఆవరణలో పదహారు ఆవులు కూడా ఉన్నాయి. వందేళ్ల నాటి పన్నెండు గదుల లోగిలి. ఇల్లంతా టేకు స్థంభాలు, దూలాలతో ఇప్పటికీ దిట్టంగా ఉంది! తల్లి వీణా విద్వాంసురాలు. చెల్లెలు బెంగుళూరులో ఈస్టరన్ ఫేర్ మ్యూజిక్ స్కూల్లో మ్యూజిక్ కంపోజర్. దేశ, విదేశాల్లో తన టీం "స్వరాత్మ" తో ఎప్పుడూ ఏవో ప్రోగ్రాంస్ లో ఉంటుంది. వినీతుడికి కాస్త సంగీత పరిజ్ఞానం ఉంది. వేణువు ఆలపించటంలో అతను ఆనందాన్ని పొందుతాడు.

కానీ ఈ సంబంధానికి చారుమతి ఎలా స్పందిస్తుందోనని ఒకింత చింతనలో పడ్డారు భామ, గోపాలం. కాఫీనే సహించని అమ్మాయికి మంచి కాఫీలాంటి సంబంధం అనిచెప్తే ఏంలాభం? అందునా కాఫీ వ్యవసాయం చేసే అబ్బాయి అంటే ఒప్పుకుంటుందా అంట!? కాఫీ మొక్కను ఇంట్లోనే పండిస్తావు ముందు ముందు అని ఒకసారి సరదాగా అంటేనే తోటలూ లేవు, పంటలూ లేవు అని అననే అంది. అసలు తనకసలు ఎటువంటి వరుడు కావాలనుకుంటుందో అనే సందిగ్ధంలో పడిపోయారు. అడిగితే చెప్పే మనస్తత్వం కాదాయె! మరెలా కనుక్కోవటం? ఒకవేళ ఈ సంబంధం విషయం చెప్పేస్తే ఏమాత్రం ఆలోచించకుండానే ఒక్కసారిగా కాదు పొమ్మనేస్తే! వాళ్లా తమకు తెలిసినవాళ్లు. మన్నన ఉన్నవాళ్లు. మాటాతీరూ భావాలూ తమతో కలిసినవాళ్లు. ఇక అబ్బాయిని చూస్తే బహు ముచ్చటేస్తుంది. ఎప్పుడూ చైతన్యంగా ఉంటాడు. తండ్రికి కుడిభుజంలా ఉంటాడు. తల్లిని కూతురులా చూసుకుంటుంటాడు. చెల్లెలికితోడుగా నిలబడతాడు. రైతులకు అండగా ఉంటాడు. నిస్సహాయులను ఆదరిస్తాడు. చిన్నవారితో ఆడిపాడతాడు. పెద్దలపట్ల వినయం, విధేయత ఉన్నవాడు. కష్టం, సుఖం తెలిసినవాడు, భేషజాలకు పోనివాడు! ఇంతకన్నా ఒక వరుడికి ఉండాల్సినవేముంటాయి! ఉంటాయ్! వధువు మనసుకు నచ్చాలి. ఆమెకు తన ఆత్మ బంధువులా తోచాలి !

మరి.. అబ్బాయిని అమ్మాయి చూసినప్పుడు, మాటాడినప్పుడే కదా తెలుసుకోవటం సాధ్యం? పెళ్లి సంబంధం అని చెప్తే చారుమతి మొండికెయ్యొచ్చు. వాళ్లను పిలిపించి అమ్మాయిని చూపిస్తే రాట్ పొమ్మని అంటే! ఈ భయమూ లేకపోలేదు వారికి.

"ఊర్కెనే..ఒక్కసారి ఈ అబ్బాయిని చూడు, మాట్లాడు" అంటే ఎంత హేయంగా ఉంటుంది!

మరెలా వీరిద్దరినీ కలిసేలా, మాట్లాడేలా చేయటం! భామ, గోపాలం ఎంత ఆలోచించినా ఏమీ పాలుపోలేదు. అభి ని అడిగితే ఇటువంటి విషయాలలో అంతగా నాకు ఐడియాస్ రావన్నాడు. అదేదో సాపేక్ష సిద్ధాంతాన్ని అయితే వాడే కనిపెట్టినట్లు!

ఇంతలోనే ఆపద్బాంధవుడిలా జగన్నాధమే ఫోన్ చేశాడు. అసలు ఈ సంబంధం చెప్పినవాడు అతనే! "జగ్గాయి" అని పిలవబడే జగన్నాథం, భామకు పెత్తల్లి కొడుకు. అతని భార్య జ్యోతికి తోబుట్టువు సావిత్రి. స్వయానా అక్క. సావిత్రి భర్త ఆనందరావు, జగన్నాధమూ షడ్డకులే కాదు మంచి మిత్రులు కూడా. సావిత్రి ఆనందరావులే వినీతుని అమ్మానాన్నలు. మైసూరులో స్థిరపడిన జగన్నాధము, కూర్గ్ లో స్థిరపడిన ఆనందరావు..ఈ రెండు కుటుంబాల మధ్య రాకపోకలు, ఆత్మీయత ఉన్నాయి. వినీతుని చిన్నప్పట్నుంచీ చూస్తుండటంచేత జగన్నాధానికి, తన మేనకోడలు చారుమతి వినూతుడికి సరైన జోడి అని తోచింది. జ్యోతి కూడా ఆ అభిప్రాయం బలపరచటంతో భామకు ఫోన్ చేశాడతను. గోపాలంతో కూడా మాట్లాడాడు.

"బావగారూ! వాళ్లూ మీకు తెలుసు కదా! ఫంక్షన్స్ లో ఒకట్రెండుసార్లు మీరూ చూశారు. పైగా మీకూ పరిచయమే కదా! మొన్న పల్లవి పెళ్లిలో(జగన్నాథం వాళ్ల అమ్మాయి పెళ్లిలో)చారుని చూశారట వాళ్లు. బాగా నచ్చింది వాళ్లకి. ఒక్కసారి మీరిద్దరూ మైసూరు వస్తే కూర్గ్ వెళ్దాం. పిల్లాడు బుద్ధిమంతుడు. మీరూ చూద్దురుగానీ. మీకు నచ్చితే ఆనక చారు కి చెబుదురుగానీ. ఒకమాట అభి చెవిలో మాత్రం వెయ్యండి" అన్నాడు.

వెళ్లి చూసివచ్చారు కూడాను. సావిత్రి, ఆనందరావుల తీరు చాలా ఆదరంగా ఉంది. వినీత్ వీళ్లు వెళ్లినప్పటికిలేడు. భోజన సమయానికి వచ్చాడు. మైసూరులో జరిగిన ఆపెళ్లికి వినీత్ కూడా వచ్చాడట కానీ రిసెప్షన్ టైంకి వచ్చి కనబడి, బెంగుళూరులో వూఫ్ కి సంబంధించిన ఫారెన్ డెలిగేట్స్ ని ఉదయాన్నే కలవాలని హడావుడిగా వెళ్లిపోయాడట. అందుకే అప్పుడు వినీత్ ని చూడలేదు వాళ్లు. వినీత్ కి భామా గోపాలం లను తమ బంధువులుగానే

పరిచయం చేశాడు జగన్నాథం . వినీత్ ముఖ వర్చస్సు ఆకట్టుకునేలా ఉంది. మాట గౌరవంగా ఉంది. ఆ ఇంట చారుమతి ఆనందంగా ఉంటుందన్న నమ్మకం కలిగింది వాళ్లకి. ఇప్పుడు సమస్యల్లా చారుమతి కి నచ్చుతుందా లేదా ఇంత మంచి సంబంధం అనే.

జగన్నాథం ఫోన్ చూడగానే ప్రాణంలేచొచ్చింది ఇద్దరికీ. మనసులో ఉన్న సంశయం చెప్పి ఏదన్నా ఉపాయం చెప్పమన్నారు.

"ఓస్ ఇంతేనా! పోయినసారి నేను ఫోన్ చేసి నప్పుడు హోం టూర్స్ గురించి స్టడీ చేద్దామనుకుంటున్నా అంది. ఇప్పుడు మీరడిగాక నాకు గుర్తొచ్చింది. కూర్గ్ లో హోం స్టేల పై చేయమని చెప్పండి. ఒప్పుకుంటుంది. మీరొచ్చి దించినా సరే, లేదూ నేను మైసూరులో దాన్ని పిక్ చేసుకుంటా. నేనూ, జ్యోతి వెళ్లి కూర్గ్ లో వాళ్లింట్లో దించి వస్తాం. హోం స్టే లకు వినీత్ తోడు వెళ్తాడు. ఆ రకంగా ఒకరినొకరు తెలుసుకునే అవకాశం" అన్నాడు.

ఓర్నీ జగ్గాయివన్నీ హడావుడి పనులే అని అనుకుంటూ

"కూర్గ్ లో బాగానే ఉంది కానీ, వాళ్లింట్లో అమ్మాయిని దించటం.." మాట ఇంకా పూర్తికాకుండానే

"నీది మరీ చాదస్తమే" అని కొట్టిపారేయబోతూ "ఇదిగో జ్యోతి మాట్లాడుతుందట" అంటు జ్యోతికి ఇచ్చేశాడు.

జ్యోతి ఎంతో అనునయంగా చెప్పింది"భామా! నీవేమనుకుంటున్నావో నాకర్థమైంది. నీవేమీ కంగారు పడకు. సావిత్రి అక్క చాలా బాధ్యతగా ఉంటుంది. పైగా వినీత్ కి ఇంకా చెప్పలేదు వాళ్లు. వాడు చారుని చూశాక వాడికి ఇది నచ్చితేనే అసలు విషయం చెప్పాలనుకున్నారు. వాడు మంచి ఫ్రెండ్లీ నేచర్. అలాగని హద్దులుదాటే వాడు కాదు" అంటూ భరోసా ఇచ్చింది.

★★★★★

టెక్నికల్ గ్రాడ్యుయేషన్ పూర్తవుతూనే చారుమతి మేగజైన్స్ కి ఆర్టికల్స్ రాయటంలో బిజీ అయిపోయింది. హడావుడి పరుగుల ఉద్యోగం వద్దనుకొంది. నింపాదిగా లైఫ్ ని ఆస్వాదించాలనేది చారు అభిమతం. బుక్ రివ్యూస్, రాగ కర్తలు పేరుతో పూర్వ-పాశ్చాత్య మ్యూజిక్ బ్యాండ్స్ పై ఆర్టికల్స్ రాస్తోంది. హోం టూర్ ఆర్టికల్స్ "ఇంటీరియర్" అనే ఇంగ్లీష్ మేగజైన్ కి పంపించాలని అనుకుంటోంది. అందుకు చాలా ప్రదేశాలు తిరగాల్సి ఉంటుంది. అయితే, ఇంట్లో ఇప్పుడే ఒప్పుకోకపోవచ్చు. సరైన అవకాశం కోసం చూస్తోంది.

ఒకరోజు పొద్దున్నే " హోం స్టే అయితే నీ రీసెర్చ్ ఎలా ఉంటుంది?" అభి అడిగాడు చారు ని.

" బ్రహ్మాండంగా ఉంటుంది" ఉత్సాహంగా బదులిచ్చింది.

"అయినా ఇప్పుడు హోంస్టేలంటే కేరళ వెళ్లొద్దూ! అంతదూరం నన్ను పంపిస్తారా? పంపించరుగాక పంపించరు" నిష్కర్షగా చెప్పేసింది

"ఒకవేళ పంపిస్తే?"

"అబ్వియస్లీ వెళ్తాను. కానీ పంపించరు"

"పంపిస్తే అంటున్నానుగా!"

"పంపించరు అంటున్నానుగా"

"నేను అమ్మా నాన్న ని ఒప్పిస్తే?" నేర్పుగా నటిస్తున్నాడు అభి.

"నీచేతకాదులే గానీ వదిలేయ్"

"ఒప్పిస్తానంటున్నా! నీవు రెడీ నా కాదా చెప్పు" అన్నాడు అభి.

"అరె! వెళ్తానన్నానుగా! ఒక్కదాన్నీ అక్కడుండటానికి ఒప్పుకోరు అంటున్నా" విసుక్కుంది చారు.

"అయినా నామీద ఇంత ప్రేమేంట్రా నీకు? ఉన్నట్లుండి ఇంత ఫేవర్ చేయాలని నీకెందుకనిపించింది!?నేను కేరళ వెళ్తే నీకుపయోగం ఏముంది? " నిలదీసింది చారుమతి.

"అమ్మో దీని గురించి తెలిసీ ఎందుకు ఒప్పుకున్నానీ విషయం మాట్లాడుతానని! దొరికిపోం కదా కొంపతీసి!" అనుకున్నాడు అభి.

"ఏంలేదులే! ఒకసారి కేరళ టూర్ లో హోం స్టే లు చూసి చాలా ఇంప్రెస్స్ అయ్యావ్ గా. హెరిటేజ్ బంగ్లాలు, మండువాలోగిళ్లు చూసి కొబ్బరితోట మధ్యలో ఇలాంటి ఇంట్లో మనం ఉంటే భలే ఉంటుందన్నావుగా. అది గుర్తొచ్చి అన్నానులే. ఇన్ని ప్రశ్నలా మరీ!"విసుక్కున్నట్లు నటించాడు.

"అయితే విను. నాకు లేని ఆలోచన పొరబాటున తెప్పించావ్ గా. అమ్మానాన్నలకి చెప్పి ఒప్పించు. లేదా నీ పని చెబ్తా!" బెదిరించింది.

"చూస్తాన్లే. అయినా నాన్న ఒప్పుకున్నా, అమ్మని ఒప్పించటం మహా కష్టం" అన్నాడు.

రెండ్రోజుల తర్వాత భామ "అభి హోం స్టే లైతే బాగుందన్నాడు. నాకు, నాన్నక్కూడా బాగుంటుందనిపించింది. నీవు రాయబోయే ఆర్టికల్ కి ఇది ఉపయోగపడుతుందేమో! అయితే కూర్గ్ లో బాగుంటుందని నాన్న అన్నారు. జగ్గు మామయ్యకి ఫోన్ చేస్తే వాడు వాళ్ల బంధువులున్నారని, వాళ్లింట్లో ఉండొచ్చని, ఇబ్బంది గానీ, కంగారు గానీ లేదని చెప్పాడు. మరి నీకు కూర్గ్ అయితే ఓకేనా?" అని కూతుర్ని అడిగింది.

సంబరంగా ఒప్పుకుంది చారుమతి.

"ఆఇంట్లో వాళ్లని ఇబ్బంది పెట్టొద్దు. వాళ్లతో పద్ధతిగా మసలుకో. పొద్దున్నే నిద్రలేచి స్నానం చేయ్. తిని, కంచం ముందు నుంచి లేచివెళ్లిపోకు. ఆవిడకు సాయంచేయ్" ఇలా ఎన్నో బోధించింది భామ.

పదేపదే ఇలాంటివే చెప్తూవుంటే వినీ వినీ చిర్రెత్తుకొచ్చింది చారు కి.

"అబ్బబ్బ అస్తమానూ చెప్తావేం. అలాగే అన్నానుగా "అంటూ విసుక్కుంది.

భామకి ఒకవైపు కంగారుగానే ఉంది. పెంకిపిల్ల. ఎలా మసలుకుంటుందో అక్కడ అని. సంబంధం కోసమనే కాదు. ఎక్కడైనా సరే మన పిల్లలు ఉండాల్సివస్తే ఎలా మసలుకోవాలో తెలిసుండాలికదా అనేది భామ అభిమతం.

"దానికెలా వుండాలో తెలుసులే" అని సర్దిచెప్పాడు గోపాలం.

వారం రోజుల్లో చారుమతిని బెంగుళూరు ఫ్లైట్ ఎక్కించారు. ఎయిర్ పోర్ట్ కి జగన్నాధం వచ్చాడు కారేసుకుని. మైసూరులో రెండ్రోజులూ రాగిణితో సరదాగానే గడిచింది. రెండ్రోజులున్నాక, జ్యోతి, జగన్నాధం ఇద్దరూ కూర్గ్ లో దించి వెళ్లారు చారుమతిని.

పెద్ద గేటుదాటి కొబ్బరితోట మధ్య బాగా లోపలికి వెళ్తే పెద్దలోగిలి . ఆ ఇంటికి పక్కగా పెద్ద వసారా. అందులో ఆవులు, దూడలు. చుట్టూ పెంకు వసారాలు. చుట్టూ డాబాల మీదకు వాలుతున్న పచ్చని కొబ్బరిమట్టలు. నిజ్జంగా ఇలాంటి ఇంట్లో బంధువులుండటం, తాను కొన్నిరోజులుండగలగటం "గ్రేట్ చారు" అనుకుంటూ ఉప్పొంగిపోయింది చారుమతి. సావిత్రి, ఆనంద్ లు మనసారా ఆహ్వానించారు చారుమతిని. వాళ్ల అపురూపతతో బిడియం తగ్గి ఇల్లంతా సావిత్రితో తిరగటం మొదలుపెట్టింది. పొద్దున్నే ఆరింటికి లేచి, స్నానం చేసి బయటికి వచ్చిన చారుమతికి ఎప్పుడు స్నానంచేసిందో తెలియదు కళకళలాడుతూ సావిత్రి కనిపించింది.. ఆపాటికే సంధ్యవార్చి మండువాలో ఉయ్యాలబల్ల మీద కూర్చొని హిందూ పేపర్ తిరగేస్తున్నాడు ఆనంద్. సావిత్రి కంచు గ్లాసులతో నురుగులుగక్కే కాఫీని ఆనందుకి అందించి తానూ పక్కనే కూర్చొని తాగింది. కాఫీ తాగటం పూర్తయ్యాక ఆవుల కి పచ్చగడ్డి వేసింది. అక్కడ సహాయంచేసేవారు ఇద్దరున్నప్పటికీ, ఉదయం మాత్రం తనచేతులతోనే వేయటం ఇష్టం అంది. ఇంటి ప్రాంగణంలో బోలెడన్ని తులసి మొక్కలున్నాయ్. వాటి దళాలను కోసి, సువర్ణగన్నేరు పూలనీ కోసి కదంబమాల అల్లి హాలులో నాలుగడుగుల వేణుమాధవుని కాంస్య విగ్రహానికి వేసింది.

"పూజగదిలో విడిపూలతోనే అర్చించినా మాల మాత్రం ఈ విగ్రహం కోసం అల్లుతాను. భక్తికన్నా మురిపెం ఎక్కువ మామయ్యకి. రోజూ, దండవేసిన విగ్రహాన్ని చూడటం ఇష్టం" అని ఆనందు గురించి చెప్పింది సావిత్రి.

తను నిద్రలేచేసరికి వీణ వినిపించటం గుర్తొచ్చి, "మీరు పొద్దున్నే వీణ వాయించారా అత్తయ్యా?" అని అడిగింది చారుమతి.

“అవును. పూజలో భాగమే వీణపై ఓ కీర్తన వినిపించటం” అంటూ వంటింటివైపుకు నడిచింది సావిత్రి..

అప్పటికే ఫలహారం తయారై ఉంది. వంటమామ్మ ఇత్తడి ఇడ్లీ పాత్రలో వేడి వేడి ఇడ్లీలు చేసి, గ్రైండర్లో కొబ్బరిపచ్చడి రుబ్బి, కరివేపాకు తిరగమాతతో ఘుమఘుమలాడిస్తోంది వంటింటిని. అక్కడ కాఫీ ఫిల్టర్, బిందెలు మరిన్ని గిన్నెలు ఇత్తడి, రాగి, కంచు వే ఉండటం, ఇనుప బాండీలు, రాచ్చిప్పలు కూడా వుండటం చారుమతి గమనించి,

"అన్నీ వాటిలోనే చేస్తున్నారెందుకని?" సావిత్రిని అడిగింది.

"ఇటువంటి పాత్రల్లో ఆహారపు పౌష్టికత పెరుగుతుంది "అని జవాబిచ్చింది సావిత్రి.

హిందూ పేపర్ తర్వాత తెలుగు, కన్నడ పేపర్లనీ తిరగేసిన ఆనందుని చూసి "అన్నింటిలోనూ ఒకే న్యూస్ ఉంటాయి కదా, ఇన్ని చదవటమెందుకు మామయ్యా? "అని అడిగింది.

"ఏ పేపర్ విశిష్టత దానిదే చారుమతి! నిజానికి హిందూ పేపర్ లో నిన్నటివి కాదు, మొన్నటి వార్తలుంటాయి. అయినా వార్తలకోసం కాకుండా విజ్ఞానం కోసం చూడాలి ఈ పత్రికని. తెలుగు పేపర్ ఎందుకు చూస్తానంటే, మన అసలు భాషని పోగొట్టుకోకుండా వుండటానికి. ఇక కన్నడ పత్రిక నేను ఇక్కడి భాషని మరింతగా నేర్చుకోటానికి చదువుతాను" వివరించాడు.

చారుమతికి తన మనసు విశాలమైనట్లు తోచింది సావిత్రిని, ఆనంద్ ని చూసి.

మధ్యాహ్నం దాకా ఎవరో వచ్చి ఆనందుతో మాట్లాడివెళ్ళారు. వారికి ఏవో సలహాలు చెప్పటం వాళ్లు సంతృప్తి ముఖాలతో తిరిగి వెళ్లిపోవటం గమనించింది. అక్కడి వాతావరణం కొత్తగా తోచినా ఏదో సరికొత్త చైతన్యాన్ని తనలోకి ఒంపిన అనుభూతిని పొందింది చారుమతి.

వాళ్లంతా ఎవరని సావిత్రిని అడిగితే "కాఫీ రైతులు"అని చెప్పింది . అర్థం కానట్లు ముఖంపెట్టిన చారుమతికి అర్థమయ్యేలా చెప్పింది.

"మామయ్య కాఫీతోటల వ్యవసాయం చేస్తారు. పూర్తిగా ఆర్గానిక్ పద్ధతిలో. తోటి రైతులకు వాటికి సంబంధించిన సమాచారాన్ని అందిస్తారన్నమాట" అంటూ.

"ఏంటీ మీకు కాఫీ తోటలున్నాయా?" హాశ్చర్యపడిపోయేసింది చారుమతి. నవ్వుతూ తలూపింది సావిత్రి.

"భలే! నేను చూడొచ్చా వాటిని?" సంబరంగా అడిగింది. అంతలోనే బిడియపడింది అలా చొరవగా మాట్లాడకూడదేమోనన్నట్లు.

"ఓ తప్పకుండా చూడొచ్చు. అన్నట్లు నువ్వు హోం స్టేలను చూడాలని వచ్చావు కదా! మరి అవి కాఫీ తోటల్లోనే కదా ఉంటాయ్! వినీత్ బెంగుళూరు వెళ్లాడు. రేపు వస్తున్నాడు. వాడు నీకివన్నీ దగ్గరుండి చూపిస్తాడు"అంది.

వి..నీ..త్ పేరు ఎక్కడో విన్నట్లు అనిపించింది చారుమతికి.

మరుసటిరోజు ఉదయం తలారా స్నానం చేసి తాను వేసుకోవాల్సిన డ్రెస్ కోసం బ్యాగ్ వెతికింది. భామ చుడీదార్స్ తోబాటుగా ఒక లంగావోణీ సెట్ కూడా పెట్టినట్లుంది. చారుమతికి అవే వేసుకోవాలనిపించి చిటికెలో తయారై సావిత్రి దగ్గరికి పరిగెట్టింది.

"అత్తయ్యా! ఇవాళ నేను మాల అల్లనా?" అని ఉత్సాహంగా అడిగింది. చిరునవ్వుతోనే అనుమతి ఇచ్చింది సావిత్రి.

ఆకుపచ్చని లంగావోణీలో వనకన్యలా మెరిసిపోతున్న చారుమతిని చూసి ముగ్ధులయ్యారు సావిత్రి, ఆనందులు. ఎక్కువ ఆశించకూడదేమో అని అనిపించకపోలేదు వారికాక్షణంలో! అదేమీ తెలియని చారుమతి తులసిదళాలు, సువర్ణగన్నేరు పూలు కోసుకొని, వరండా అరుగుపై కూర్చొని మాల అల్లింది. ఇంట్లో పూలమాలలు అల్లిన అనుభవం వుండటంవల్ల చకచకా పూమాలని కూర్చి హాల్లో వేణుమాధవుని విగ్రహానికి వేయటానికి దండను గుండ్రంగా చుట్టి సరిచూసుకుంటూ వెళ్తోంది. గుమ్మం దాటగానే ఇంతలోనే ఎవరో ఎదురొచ్చేశారు చూసుకోకుండా. ఒక్కసారిగా ఆగిపోయి పట్టి వుంచిన మాలలోనుంచే చూసింది. ఎదురొచ్చిన వ్యక్తిని చూసి తడబడింది. ఆరోజు పల్లవి పెళ్లిలో పన్నీరు ఇతనిపైనే కదా చిలకరించింది!? హఠాత్తుగా గుర్తొచ్చింది. ఓ నిన్న వినీత్ అని వినగానే పేరు విన్నానే అనుకున్నా. ఇతని పేరు అదే కదా..రాగిణి చెప్పింది కదూ అనుకుంటూ..

"హాయ్" అంటూ పలకరించింది వెంటనే. బదులుగా తడబడుతూ నవ్వాడతను.

"మీరిక్కడ.."ఏదో అడగబోయాడు.

"సర్ప్రైజ్ కదూ నేనూ షాక్ అనుకో. సో..నేను మీ ఇంట్లోనే అన్నమాట ఉన్నాను" అంది.

"రాగిణి కజిన్ అని చెప్పింది అమ్మ. మీరేనా?"

అవునన్నట్లు కనురెప్పలు ఆడించింది.

"ఆర్టికల్ రాయటానికి వచ్చారా అయితే!"అన్నాడు.

బదులుగా నవ్వి "మీరు అనొద్దు. నువ్వు అను. కజిన్ కి కజిన్ నువ్వుగాక మీరు ఎలా అవుతుంది?" అంది తమాషాగా. హాయిగా నవ్వాడతను.

"ఇవాళే వెళ్దాం. పదింటికి రెడీగా ఉండాలి "అంటూ వెనుదిరిగి వెళ్తున్న అతన్ని పిలిచి

"అవునూ! నువ్వేంటి ఆవేళ పన్నీరు చల్లుతుంటే అడ్డుపడ్డావ్. ఈవేళ దండేస్తుంటే అడ్డొచ్చావ్! ఏంటీ కో ఇన్సిడెన్స్!?" అడిగింది.

సమాధానం ఏంచెప్పగలడు వినీత్ మాత్రం!

"అదే అర్ధంకావటంలేదు. ఆరోజు పన్నీరు జల్లావ్. ఈరోజు దండెయ్యబోయావ్. చూస్తుంటే ముందు ముందు సన్మానమే మిగిలింది" అన్నాడు భయం నటిస్తూ.

"యూ ఫన్నీ" అంది నవ్వుతూ.

పల్లవి పెళ్లి రిసెప్షన్ సమయానికి వస్తోన్న బంధుమిత్రులకు ముఖద్వారం దగ్గర నుంచుని గులాబీలు, గంధం అందిస్తూ పన్నీరు చిలకరిస్తున్నారు పల్లవి చెల్లెలు రాగిణి,చారుమతి. కుంకుమ వన్నె అంచుపై జరీపూలున్న లేతతెలుపు పట్టు పరికిణి-జాకెట్టు, దానిపై బంగారు జరీ బూటాలున్న కుంకుమ ఛాయ జార్జెట్ వోణీ, జడగంటలతో బారెడు జడ ముందుకువేసుకుని, చెవులకు అందంగా ఊగుతున్న కెంపులజూకాలతో బాల సరస్వతిలా వెలుగుతోంది చారుమతి. మధ్యమధ్యలో అల్లరిలో భాగంగా, సరదాగా రాగిణిపై మరింతగా పన్నీరు చిలకరిస్తున్న చారుమతి ఒక్కసారిగా ఎదురుగ్గా అత్యంత సమీపంగా వచ్చేసిన యువకుడిని చూసి ఉలిక్కిపడింది. రాగిణిని పలకరించటానికి వచ్చిన ఆ యువకుడు హఠాత్తుగా తనపై కురిసిన పన్నీటిజల్లుకు అదిరిపడ్డాడు. ముగ్గురికీ విషయం అర్ధమైంది, రాగిణి తప్పుకునేసరికి అక్కడికి వచ్చిన అతనిపై పన్నీరు పడిందని. చిరునవ్వు తో క్షమాపణలడుగుతున్న ఆ అమ్మాయి కాటుక కన్నుల కాంతులు చూసి ఒక్క క్షణం కలవరపడినా అదే క్షణంలో తన చూపుల్ని మరల్చుకున్నాడతను. "చారుమతి.." పరిచయంచేసింది రాగిణి అతనికి. చారుమతివైపు క్షణంలో వెయ్యోవంతు చూసి హలో అని తలూపి, రాగిణికి బై చెప్పి మళ్లీ కలుస్తానని అంతే హడావుడిగా వెళ్లిపోయాడతను.

"వినీత్ అన్నయ్య..మా ఆమ్మ కొడుకు" నెమ్మదిగా చెప్పింది రాగిణి అతను వెళ్లిపోయాక.

అతను కలవరపడి చూపులు మరల్చుకోటం తను గమనించింది. అదే క్షణంలో ఏ భావమూ కనబడనీయనంత జాగ్రత్త పడటం, చూసీచూడని పలకరింపు ఎందుకో !? అర్ధంకాలేదు చారుమతికి.

★★★★★

ఆరోజు లంగావోణీలో, ఈరోజూ లంగావోణీలో చారుమతిని చూసి విలక్షణంగా వుందీ అమ్మాయి అనుకున్నాడు వినీత్. ఈ అమ్మాయిని మళ్లీ కలవటం అనుకోనిది. అది అతనికి ఆనందాన్నిచ్చినా బయటికి వ్యక్తపరచలేదు.

కాకతాళీయమే కావొచ్చు, వారిద్దరి కలయిక దివ్య పరిణామం లా తోస్తుంది మనకు. ఆరోజు మెరూన్ అండ్ ఆఫ్ వైట్, ఈరోజు వర్డంట్లీ కలర్. మొదట చూసిందే వధువు ధరించే మధుపర్కాల వన్నెలో! ఇప్పుడు వనకన్యలా అతని ప్రవృత్తికి సరిపోలే హరిత వర్ణంలో! ఆనాడు పన్నీరు చల్లింది. గంధమూ పూసింది అనుకోకుండా. ఈనాడు దండలోనుండి వరుణ్ణిగాంచి, జయమాల వేయబోయింది.

★★★★★

పదింటికి తయారై ఉన్న చారుమతితో తన జీపులో బయలుదేరాడు వినీత్. ముందుగా గ్రీన్ హిల్స్ ఎస్టేట్ కి తీసుకెళ్లాడు. కాఫీతోటల మధ్య ఉన్న ఈ బంగ్లా స్వర్గధామంలా అనిపించింది చారుమతికి.

"ఇది 19 సెంచరీలో స్విస్ మిషనరీస్ కట్టించిన బంగ్లా. ఇది కాఫీ ప్లాంటర్ బంగ్లా. దీని కో- ఓనర్ చెంగప్ప అనే ఆయన. దీన్ని చెంగప్ప పూర్వీకులు ఆరు తరాలుగా జాగ్రత్తగా చూసుకుంటున్నారు" అని చెప్పి లోపలికి తీసుకెళ్లాడు.

"లగ్జూరియస్ ఎక్సిస్టెన్స్" అప్రయత్నంగా అనేసింది చారుమతి ఆ బంగ్లా విలాసాన్ని చూసి.

"నీక్కావల్సిన ఫొటోస్ తీసుకో మరి" అన్నాడు.

ఫొటోస్ తీసుకోగానే బయటకు వస్తూ "చిన్న చిన్న ప్లాంటర్స్ కూడా తమ ఇళ్లను ఇందుకు ఉపయోగిస్తున్నారు. 90 లలో పడిపోయిన కాఫీపంట ధరలకు సప్లిమెంటరీ ఎర్నింగ్స్ గా వీటిని నడపటం మొదలుపెట్టారు ఇక్కడ ఫ్యామిలీ ఓన్ డ్ ఎస్టేట్సే కాదు. టాటా వారి కాఫీ ఎస్టేట్స్, హాస్పిటాలిటీ వెంచర్స్ కూడా ఉన్నాయి "అని చెప్పాడు.

కబ్బే హాలిడేస్ అనే హోంస్టే లో ఓనర్తో మాట్లాడటం కుదిరింది చారుమతికి.

"హోం స్టే లు మాకు ప్రపంచంతో అనుబంధాన్ని ఏర్పరుస్తాయి. ఎంతోమందిని కలిసే, మాట్లాడే అవకాశాన్ని ఇస్తాయి" అన్నాడు. కూర్గ్ లోని మరిన్ని గృహవసతుల గురించి చెప్తూ ఎంతో సమాచారాన్ని అందించాడాయన. చెప్పిందంతా ఉత్సుకతతో విని అవసరమైన పిక్చర్స్ తీసుకొని ధన్యవాదాలు చెప్పి బయటకు వచ్చింది. వినీత్ ఆమెను అనుసరించాడు.

కూర్గ్ టూరిజం అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, కర్ణాటక కల్చర్ ఇన్ ఫర్మేషన్ సెక్రటరీ లతో అపాయింట్మెంట్ తీసుకున్నాడు వినీత్. మరుసటిరోజు వాళ్లతో మాట్లాడింది. ఆ తర్వాతరోజు మరికొంతమంది హోం స్టే ఓనర్స్ ని కలవటానికి తీసుకెళ్లాడు. వాళ్లతో మాట్లాడాక, కొంతమంది ట్రావెలర్స్ అనుభవాల్ని అడిగి తెలుసుకుంది .

నాలుగురోజులపాటు ఇదే సరిపోయింది చారుమతికి. తాను సేకరించిన సమాచారాన్ని నోట్ చేసుకోవటం, ఆపై తన నోట్ ప్యాడ్ లో కంపోజ్ చేయటం, తగిన ఫొటోస్ ని జతపరిచి తన ఆర్టికల్ ని దాదాపు పూర్తిచేయటమైంది. ఫెయిర్ చేసి పంపటమే ఇక. హైదరాబాద్ కి వెళ్లాక చెయ్యొచ్చులే అని సర్దివుంచింది. మరుసటిరోజు ఉదయం అందరూకల్సి అల్పాహారం చేస్తున్నప్పుడు సావిత్రి అడిగింది వినీత్ ని, "అమ్మాయికి మన కాఫీతోటలు చూపించావా ఇంతకూ" అంటూ. లేదమ్మా ఇవాళే తీసుకెళ్తానని చెప్పాడు. "ఇప్పుడిక వెళ్లండి మధ్యాహ్నం భోజనం టైముకి రావొచ్చు" అని చెప్పిందామె.

వినీత్ జీపు ఆపగానే దిగి చుట్టూ పరికించి చూసింది చారుమతి. "వావ్..కాఫీ పూల వాసనా ఇది?" అంది.

"రోజూ చూస్తూనే ఉన్నావుగా. ఇవాళే చూస్తున్నట్లు మాట్లాడుతున్నావేం" అన్నాడతను.

"లేదు వినీత్! పనిలో పడితే చుట్టూ పరిసరాలు గమనించటమే తెలియదు నాకు. నిజంగా ఇప్పుడే వీటి సువాసనని ఎంజాయ్ చేస్తున్నా. అచ్చం మల్లెపూల వాసనే కదూ?" అని అడిగింది వినీత్ సమాధానాన్ని ఆశించకుండానే.

తోటలమధ్యకు నడిచాక , తోటని తడుపుతున్న నీటితుంపరలతో ఆడింది కొద్దిసేపు.

"అన్నట్లు మీకిక్కడ హోం లేదా" అని అడిగింది.

"అటుచూడు..ఆ చిన్న కుటీరం ఉంది కదా అది మాకోసమే కట్టుకున్నాం. మా బంధువులు, ఫ్రెండ్స్ ఎప్పుడైనా సరదాగా స్పెండ్ చేయాలంటే ఇక్కడికే వస్తాం. ఎప్పుడైనా వూఫర్స్ వస్తే వాళ్లకి అకామిడేషన్ ఇదే" అంటూ అటు దారితీశాడు.

చారుమతి వినీత్ వెంటే నడుస్తూ "వూఫర్స్ అంటే ?" అడిగింది.

"వరల్డ్ వైడ్ అపర్చునిటీస్ ఆన్ ఆర్గానిక్ ఫార్మ్ స్ ..ఇదో గ్లోబల్ కమ్యూనిటీ. ఆస్ట్రియా, ఇజ్రాయిల్, స్విస్, స్వీడన్, అమెరికా, పోర్చుగల్, జర్మనీ..ఇలా ప్రపంచవ్యాప్తంగా పనిచేస్తుందిది. ఆర్గానిక్ వ్యవసాయం పై అవగాహన, వారి అనుభవాలు షేర్ చేసుకుని, తగిన సలహాలిచ్చే స్వచ్ఛంద సంస్థ. వీళ్లంతా ఆర్గానిక్ కాఫీ పంటల కోసం కలిసి కృషిచేసేందుకు ఐడియాస్ ఇస్తారన్నమాట. ఈ వాలంటీర్స్ కి మనం చెల్లించేదేమీ ఉండదు. ఆహారం, వసతి ఏర్పాటుచేస్తే చాలు. వీళ్లని ఎకో-ఫ్రెండ్లీ యాక్టివిస్ట్స్ అనొచ్చు. ఒకరకంగా ఎకొలాజికల్లీ సౌండ్ గ్రోయింగ్ మెథడ్స్ ని ప్రచారంచేస్తారు. నేనూ ఈ వూఫ్ లో సభ్యుడ్నే. ఇంతకుముందు స్విట్జర్లాండ్, స్వీడన్ వెళ్లొచ్చా. మేము రైతుల్ని కలుస్తాం. మాట్లాడుతాం. ఒకరి భావాల్ని మరొకరు ఎక్చేంజ్ చేసుకుంటాం. "వివరించాడు.

వినీత్ వ్యవసాయం చేస్తాడని చారుమతికి ఇప్పటికి తెలిసింది. ఇప్పటిదాకా అడగాలన్న ఆలోచనే రాలేదు.

"ఓ! నీవు అగ్రికల్చర్ ఎమ్మెస్సీనా?" అంది వెంటనే.

"ఎన్విరన్మెంటల్ సైన్సెస్" అని చెప్పాడతను.

"వెరీ నైస్" అంది అప్రయత్నంగా.

"అయితే నువ్వు పూర్తిగా ఆర్గానిక్ మెథడ్ లో వ్యవసాయం చేస్తావా?"

"అవును. పెస్టిసైడ్స్ కి బదులుగా మేమే కంపోస్ట్ తయారుచేస్తాం. కాఫీ బీన్స్ ద్వారా వచ్చే వ్యర్థాలతో. మరిక నీటికోసం భూమిని డ్రిల్ కూడా చేయం. అటుచూడు అదే మేము వర్షపునీటిని స్టోర్ చేసే రింగుబావి. ఆనీటితోనే తోటలకు నీరు పడ్తాం. నీరు వేస్ట్ అవకుండా అలా స్ప్రింకిల్ చేస్తాం. ఇందాక నువ్వు ఆడుకున్నావుగా ఆ తుంపరలతో" నవ్వాడు గుర్తుతెచ్చుకొని.

తానూ నవ్వి "ఇంట్రెస్టింగ్" అంది.

తోట మధ్యలోని బాటవెంట నడుస్తూ ఆ కుటీరం మెట్లు ఎక్కారిద్దరూ. చిన్న వరండాతో, ఒక హాలు, వంటగది తో చాలా సింపుల్ గా ఉంది. సెల్లార్ వదిలి ఫస్ట్ ఫ్లోర్ పై కట్టారు. పైకి వెళ్లాక వరండానుంచి చూసినా, హాలులోనుంచి చూసినా చుట్టూ కూర్గ్ అంతా కనిపించేలా ఉంది. ఆ హాల్లో ఓ చిన్న సిడి ప్లేయర్ కూడా వుంది. అక్కడున్న సిడిలు అన్నీ ఒకమారు ఆసక్తిగా చూసింది. అందులో ఒకటి వినీత్ బొమ్మతో వున్న సిడి కంటబడటంతో

"వావ్ వినీత్! నువ్వు ఫ్లూట్ వూదుతావా? గ్రేట్!" అంటూ ఆ సిడి ఆన్ చేసింది.

" మా చెల్లెలు స్వర రికార్డ్ చేసింది" అని స్వర వివరాలు చెప్పగానే

"ఓ!స్వర! తనని తప్పకుండా కలవాల్సిందే" అంది ఉత్సాహంగా.

ఇంతలో మెల్లగా మొదలైన వేణునాదం లోయల్లో వున్న భ్రాంతిని కలుగచేస్తోంది. అది సమ్మోహనమై చారుమతి హృదయాన్ని వశపరుచుకొన్న మాట నిజం. పద వరండాలో కూర్చుందామంటూ వినీత్ బయటికి నడిచాడు. అక్కడి నిశ్శబ్దపు ఉనికిని పెంచుతూ సన్నగా వినిపిస్తున్న వేణునాదం వింటూ కూర్చున్నారిద్దరూ.

చుట్టూ గాలిని గుండెలనిండుగా పీలుస్తూ కన్నులనిండా పచ్చదనాన్ని నింపుకొని

" ఈ వేణువు గుండెలనిండుగా గాలిని తీసుకుని దాన్ని గొప్ప పాటగా మారుస్తుంది కదూ? ఇది వింటుంటే ఇక్కడే ఉండిపోతే బాగుండనిపిస్తోంది వినీత్! చాలా ఎనర్జిటిక్ గా ఉంది " మృదువైన స్వరంతో పలికింది.

"అలా అంటావ్ గానీ ఎందుకు ఉండిపోతావ్ చారుమతీ!" స్థిరంగా పలికాననుకున్నాడుగానీ, కొద్దిగా వణికిన గొంతుని దాచుకోలేకపోయాడు.

"నిజమే" నిట్టూర్చింది అదేమీ గమనించని చారుమతి. "ఏ దేవతలో కనికరించి వరమివ్వాలి కానీ ఇక్కడుండే అదృష్టం ఎలా వస్తుంది?" అంది.

"నిజమే కొన్ని దేవతలు ఇవ్వాల్సిన వరాలే!"అనుకుంటూ వినీత్ తన కళ్లలోకి చొరవగా చొరబడుతున్న సువర్ణ సుందర స్వప్నాన్ని మనసులోనే నిక్షిప్తంచేశాడు. అతని జీవితంలోకి ఓ నీలికళ్ల అమ్మాయి అమాయకంగా ప్రవేశించింది మరి!

చుట్టూ పచ్చదనాన్ని ఉల్లాసంగా పరికిస్తున్న చారుమతి కి చిగురాకా కదలకే పాట గుర్తొచ్చింది . హం చేస్తున్న ఆరాగానికి వినీత్

"ఈ పాట నాకు తెలుసు. అమ్మ పాడుతుంది" అన్నాడు.

"అవునా ?" అంది చిరునవ్వు మోమున కొద్దిపాటి ఆశ్చర్యాన్ని పులుముకొని.

"నాకు ఇందులో నచ్చే చరణం –కాటుక కన్నుల్లో కరిగే నును సిగ్గు తడి– ఎందుకో ఈ లైన్ నన్ను బాగా ఆకట్టుకుంటుంది" అన్నాడు.

అతనలా అనటానికి కొన్ని నెలలుగా అతనిని వెంటాడుతున్న కాటుక కన్నులే కారణం కావొచ్చు.

"భలే . నాకైతే –గోరింటపొదరింట్లో జడగంటల సందళ్ళు, తోటచెరువు నీడలో తోడుండి చూడవే– బాగా నచ్చేది" అంది.

ఉలిక్కిపడ్డాడు వినీత్. ఇందాకే కాఫీ మొక్కల మధ్య తామిద్దరి నీడల్ని చూసినప్పుడు ఏ జన్మనుంచో పరిచితమైనట్టు అనుభూతి కలిగిందతనికి. "తోట చెరువు నీడలో తోడుండి చూడవే.".. . ఎన్నిసార్లో విన్నప్పటికీ ఇవాళెందుకో ఈ వాక్యంలో సరికొత్త అర్థాలు, రాగాలు

ముసురుకున్నాయి వినీత్ మనసునిండా. ఇప్పుడు ఆమె పాడి వినిపించిన ఆ చరణం అతడి మదిలో జేగంటలు మోగించింది. అదేమీ పట్టని చారుమతి ఏదేదో మాట్లాడుతూనే ఉంది..

అప్పుడే రెండు కాఫీ కప్పులతో ప్రత్యక్షమయ్యాడు అక్కడ పనిచేసే చిన్నప్ప. కాఫీటేబుల్ మీద పెట్టి వెళ్ళిపోయాడు. అందించిన కాఫీ కప్పుని విచిత్రంగా చూస్తూ ఎందుకు అంది చారుమతి. అరె కాఫీ తాగు అన్నాడతను.

"కాఫీనా! నేనా! నో వే "అంది.

"కాఫీ తాగవా!" ఆశ్చర్యపోయాడు.

"అవును నాకు సహించదు" అంది.

"ఎప్పుడైనాతాగి చూశావా సహించకపోటానికి "అడిగాడు.

"ఆ వాసనే పడదు నాకు. తాగి చెప్పక్కర్లేదు మరి!"అంది.

ఈనాలుగురోజులూ హోం స్టే లలో కాఫీ ఆఫర్ చేస్తుంటే తాగలేదు. బయట తాగదేమో అనుకున్నాడు కానీ అస్సలు తాగదని తెలియదు. ఇంట్లో కూడా అంత అబ్జర్వ్ చేయలేదు.

" కాఫీ తాగకపోవటం నీ ఇష్టం. కానీ నేను తాగితే నీకిప్పుడు అభ్యంతరం లేదుగా ?"అడిగాడు.

"నాకెందుకుంటుంది?" అంది.

దూరంగా కాఫీ గింజల ప్రొసెసింగ్ జరుగుతోంది. కాఫీగింజల గుబాళింపు నాసికాపుటాలకు తగుల్తోంది. కాఫీ పూల పరిమళం మత్తెక్కిస్తోంది ఆ వాతావరణాన్ని. కాఫీగింజల ఆరోమా, కాఫీ పూల బ్లోజంస్ నచ్చాయి చారుమతికి ! ఇవే చారుమతి మనస్థితిలో మార్పు తెచ్చాయేమో మరి వినీత్ వైపు ఎందుకో చూసింది.

కాఫీ ని సేవిస్తున్న వినీత్ కళ్ళల్లో వింతకాంతిని చూసింది చారుమతి. ఎక్కడలేని వెలుగూ, ఉత్తేజం కనిపించాయి ఆ కళ్లలో.చారుమతి తనని గమనించిందని అర్ధమైంది వినీత్ కి. కొద్దిసేపు ఒకరికి మరొకరు ప్రభావితమయ్యారు. ఎదుటివారు ఆ వేవ్ లెంగ్త్ ని పట్టేసుకుంటే ఎలా అనుకొని ఎవరికివారే ఏమీ ఎరుగనట్లు ఒకరినొకరుచూసుకొని చిరునవ్వుతో అప్పటి సమయాన్ని తేలికపరిచారు.

అయితే వినీత్ కి తెలియని విషయం ఒకటుంది. అదీ..చారుమతిని చూసేటప్పుడు తన కళ్లల్లో కనిపించే వెలుగు ని చారుమతి ఏనాడో కనిపెట్టేసిందని. ఆమె గుండెలో అతనిపట్ల స్నేహం ఉందో లేదో ఇంకా తెలియదు వినీత్ కి. తెలుసుకునేంత శక్తి అతనికి ఉందా లేదా అని కాదు మనమిక్కడ చర్చించాల్సిన విషయం. చారుమతి అంత సులువుగా తన మనసుని పరిచే అమ్మాయికాదు. తనకిష్టంలేని వ్యక్తులకు ఎంత త్వరగా విసుగునీ, అయిష్టతనీ తెలియచేస్తుందో తాను ఇష్టపడిన వారికి ఒక పట్టాన దాన్ని వ్యక్తపరచని లోతైన గాఢత ఉంది. నిజానికి అలాంటి సందర్భం వచ్చిందే ఇప్పుడు ! చారుమతి మనసులో వినీత్ పై ప్రియ భావనలు మోసులెత్తాయన్నది వాస్తవం. అతను ఆ అమ్మాయి మదిని వికాసము కలిగించిందీ వాస్తవమే! అయితే, వినీతే కాదు, చారుమతి కూడా ఎరుగదా విషయం! అందుకు సరైన సమయం రావాలి.

ఇద్దరూ లేచి కిందకువచ్చారు. మధ్యమధ్యలో ఉన్న వేరే మొక్కల్ని చూసి అవేంటని అడిగింది. మిరియాల మొక్కలని చెప్పాడు.

"ఓ! మిరియాల పంట కూడా ఉంటుందా మధ్యలో "అని ఆశ్చర్యపోయింది చారుమతి.

"యాలకులు కూడా" అన్నాడు.

ఇంతలోనే పచ్చి మిరియం గింజని నమిలింది.

"అబ్బ..ఖారం..బాబోయ్" అంది.

"నీ నోరు తీపిచేస్తానుండు "అంటూ ముందుకు కదిలాడు వినీత్.

"అదెలా?"అడిగింది.

"ఇక్కడ ఈ ఎత్తైన చెట్లకు తేనెపట్లు ఉన్నాయిగా" అన్నాడు.

"తేనె కూడా పండిస్తారా ?"అంది.

నవ్వొచ్చింది అతనికి.

"తేనెటీగల పెంపకం అన్నమాట. తేనె ని సహజంగా ప్రొడ్యూస్ చేస్తాం. "

"అదీ బిజినెస్ చేస్తారా మీరు?" అనడిగింది.

"మన వాళ్లందరికీ కొంత పంచుతాం. మిగిలింది బిజినెస్ చేస్తాం అంటే ఎక్స్ పోర్ట్ చేస్తామన్నమాట " అంటూ అక్కడ పనిచేస్తున్న వాళ్లలో ఒకరిని పిలిచి తాజా తేనె పట్టుకు రమ్మన్నాడు. అక్కడ అందరితో వినీత్ ఆత్మీయతతో మాట్లాడటం గమనించింది చారుమతి.

"నీకు వ్యవసాయమంటే అంతిష్టమా" అడిగింది.

"ఇష్టం అని చెప్తే సింపుల్ గా చెప్పటమే అవుతుంది. ఈ తోటలు చూసావుగా? ఇది నిజంగా నా కలల కలబోత." గుండెనిండిన పలుకులవి.

"కలబోత! అవును..కనిపిస్తూనే ఉంది. యాలకులు, మిరియాలు, తేనె..అన్నింటినీ మించి నీ కిష్టమైన కాఫీ!" నవ్వింది. వినీత్ కూడా నవ్వాడు.

"అవునూ ఈ మిరియాలకు అంత డిమాండ్ ఎందుకు?" అడిగింది.

"మిరపకాయలకంటే ఆరోగ్యానికి ఇవే మంచివి. వీటిని చూసేకదా పోర్చుగీసువాళ్లు అట్రాక్ట్ అయింది ఇండియాకి? నీకో విషయం తెలుసుకదా! మిర్చి మన పంట కాదు. బ్రెజిల్ నుంచి వచ్చిందని?" అడిగాడు.

"నాకు తెలియకపోవటమేమిటి? నేను గుంటూర్ లో పుట్టాను. గుంటూరు మిరపకాయలకు, గోంగూరకూ ఫేమస్ కదా!" అంది వెంటనే!

"అవునవును" అన్నాడు.

"ఏంటి అవునవును. నేను గుంటూరులో పుట్టినట్లు నీకు తెలుసా?" అంది ఆటపట్టిస్తూ.

"భలేదానివే చారూ! మిర్చి, గోంగూర ఫేమస్ అన్నావని అవునన్నాను" అన్నాడు.

"నన్ను చారూ అనకు మా నాన్న పిలుస్తారలా. ఇంకెవ్వరూ పిలవకూడదు" కయ్యిమంది. అమ్మో కష్టమే ఈ అమ్మాయితో అనుకున్నాడు.

ముందుకు పరుగులుతీస్తూ కూనిరాగాలు తీసుకుంటూ తోటంతా కలయతిరుగుతున్న చారుమతిని చూస్తే బహు ముచ్చటేసింది అతనికి.

కూనిరాగం కూడా గాలిలో పూల పరాగాలను తోడు తెచ్చుకున్నట్లుంది.

"చారుమతీ! పాట పైకే వినిపించకూడదూ నీలో నువ్వే పాడుకోకపోతే" అన్నాడు.

తలతిప్పకుండానే కళ్లను తిప్పి నిశితంగా చూసింది. "నేను నాకోసం పాడుకుంటున్నానిప్పుడు" అంది

"అమ్మో మిర్చి ఘాటు!"అనుకున్నాడతను.

"అలాంటప్పుడు ఎదుటివారికి వినిపించకుండా పాడుకోవాలి" అన్నాడు శాసిస్తున్నట్లు.

"అబ్బో చేదు కాఫీ!" అన్నట్లు చూసింది అతన్ని

ఇద్దరూ సరిపోయారు.

ఇంతలో ఆకు దొనెలో తేనె వచ్చేసింది.. అది రుచి చూశాక చారుమతికి నిజమైన తేనె రుచి ఏంటో తెలిసింది.

"సూపర్ మార్కెట్స్ లో కొనే తేనెకి దీనికీ బోలెడంత తేడా ఉంది టేస్ట్ లో" అంది.

"అవును. దాంట్లో బెల్లం, పంచదార పాకాన్ని కలుపుతారు " అంటూ.."ఎక్కువగా తినకు. నాలుక కోసినట్లు అవుతుంది "అని వారించాడు.

అతనివైపు చూసి "నువ్వు తినవా?" అని అడిగింది. "లేదు. నేను కాఫీ తాగానుగా ఇప్పుడే "అన్నాడు.

" కాఫీ తాగితే ఆరోగ్యం పాడవదా?" అంది తాను చదివిన ఆర్టికల్స్ గుర్తొచ్చి.

"ఎక్కువసార్లు తాగితే కదా! రోజుకు రెండు లేదా మూడు సార్లు. పైగా ఇది ఆర్గానిక్ అండ్ ప్యూర్ హాని ఉండదు" అన్నాడు.

ఆ అమ్మాయి కాఫీ తాగని విషయాన్ని అసలు వదలదల్చుకోలేదు వినీత్. కావాలనే "అయితే కాఫీ రుచి ఎప్పటికి తెలుసుకుంటావ్? అన్నాడు.

"దాన్ని రుచి అంటారా ఫన్నీ" అంది.

"ఇంత గొప్ప ఆరోమా నచ్చకపోవటం ఫన్నీ" అన్నాడు

కోపమొచ్చేసింది చారుమతికి.

"యూ కాంట్ సే దట్. అన్నీ అందరికీ నచ్చాలని లేదు"

"కావొచ్చు కానీ కొన్ని గొప్ప విషయాల్ని మిస్ అవుతున్నావని చెప్తున్నా"

"నచ్చేవి దొరకనప్పుడు మిస్ అవటం అంటారు"

"అదేమీ కాదు కొన్నింటి విలువ తెలుసుకోలేనప్పుడు కూడా అనొచ్చు"

"అంత విలువైనదేంటీ? నాకాశ్చర్యం అనిపిస్తుంది "అంది

"అవును కలిసి కూర్చొని కాఫీ తాగితే తెలుస్తుంది ఆ విలువ" అన్నాడు.

"ఒకవేళ ఆ విలువ తెలియని అమ్మాయి నీకు భార్యగా దొరికితే ఏంచేస్తావ్?"అంది విసురుగా

"అలాంటి టేస్ట్ లేని అమ్మాయిని నేను అస్సలు చేసుకోను" అన్నాడు

టేస్ట్ లేని అనటం కోపం తెప్పించింది చారుమతికి.

ఏమనుకుంటున్నాడు? కాఫీ తాగకపోవటం టేస్ట్ లేనివాళ్లకిందకొస్తుందా! అంతమాట అంటాడా బుస్సున లేచింది వినీత్ మీదకి.

"నీకసలు కాఫీ తాగని అమ్మాయే వస్తుంది చూసుకో"

"నేనసలు కాఫీ తాగని అమ్మాయిని చేసుకోను గాక చేసుకోను" అన్నాడతను పంతంగా .

"నీకలాంటి అమ్మాయే వస్తుంది..వచ్చితీరుతుంది"అని గట్టిగా అరిచింది.

ఏదో సరదాగా మాట్లాడబోతే విషయం సీరియస్ గా మారిందే అనుకున్నాడు వినీత్. ఇక సమాధానమేదీ ఇవ్వలేదు.

సూర్యుని బంగారు బాల కిరణాలు ఆయనకన్నా ముందే జగతిని పలకరిస్తూ, దోబూచులాడుతూన్న ఓ ఉదయాన, ఓ చిన్ని బంగళా ముంగిటిలో చిత్రకారుని కుంచెకు పనిబెట్టేలా ఉందా దృశ్యం. ఆ ప్రాంగణంలోనే చిన్న తోటలో పచ్చని మెత్తల పై కూర్చుని ఆ చిన్న కుటుంబం! భానుని నునువెచ్చదనాన్ని ఆస్వాదిస్తూ ఊగుతున్న చిరుకొమ్మలకు మల్లేనే వాళ్లు కూడా వెచ్చని కాఫీని ఆస్వాదిస్తూ ఆనందిస్తున్నారు.

అక్కడ నలుగురూ కాఫీ తాగుతున్నారనుకొని పొరబడేరు. ముగ్గురే మరి! ఆ జంట, వారి కుమారుడున్నూ!

కాఫీని ఇంతకుమున్నేన్నడూ చూడని పానీయంలా సేవిస్తున్నారు. (తమతమ వయసులబట్టి కొన్నేళ్లుగా తాగుతున్నప్పటికిన్నీ)

ఇక అసలైన పాత్ర వారి కుమార్తె మరియు ఇప్పటి ఈ మన కథానాయిక చారుమతి! ఆ అమ్మాయి బాదంపాలు తాగుతోంది మరి!

తనకు కాఫీ అంటే పడదు. పడదు అంటే..సరిపడదు అనుకోవచ్చు కానీ, మనమందరం 'కాఫీ' అని వినిపిస్తే దుబ్బున కిందపడతాం కదా ఎక్కడా ఎక్కడా అంటూ! అలా ఈ అమ్మాయి పడదన్నమాట!

కాఫీ వాసన నచ్చదు అందుకే కాఫీ తాగదు. అయితే కాఫీగింజల ఆరోమా, కాఫీ పూల బ్లోజంస్ ఆమెకు నచ్చుతాయి!

ఆమెకు పద్దెనిమిదో ఏడు రాగానే ఇక నీవు మేజరువు అన్న చందాన ..బలవంతాన వాళ్ల నాన్న ఓ గుక్క కాఫీని తాగించి ఆమె చేత కూడా ఓ హత్య చేయించి తమ టీంలో కలుపుకోవాలని చూసే హంతకుల ముఠా నాయకుడిలా వ్యవహరించబోయాడు. ఆమె ఈ పాతకము నేను చేయనని తీవ్రంగా ఎదురుతిరిగింది. కారణం ఆమెకు రుచించకపోవటమే!(రుచి తెలియకపోవటమే!)

"కాఫీ రుచి నిజంగా నీకు తెలియదు" అన్నాడు గోపాలం

"దాన్ని రుచి అంటారా? బాబోయ్ చేదు. మీరెలా తాగుతారోగానీ"

"నువ్వూ తాగిచూడు. ఆ ఆనందం మిస్ అవుతున్నావనిపిస్తుంది"

"నేను తాగక గాక తాగను నాన్నా!" ఖండితంగా చెప్పింది పద్దెనిమిదేళ్ల చారుమతి.

“ముందుముందు కాఫీ మొక్కను ఇంట్లో వేసుకొని మరీ పండిస్తావు చూస్తుండు”

“తోటలూ లేవు పంటలూ లేవు” అంటూ ముఖమ్మీద వాలబోతున్న ఈగల్ని విసురుకుంది.

“ఓ..బాదంపాల వాసనకేమో ఈగలు! అదే కాఫీ తాగితే ఇలా ఈగలు రావు” అన్నాడు అభి .

“బాదంపాలు కాబట్టే వాలుతున్నాయ్. కాఫీ వాసనకి ఈగలు చస్తాయి” చారు అంతే వేగంగా బదులిచ్చింది.

గోపాలం నవ్వు ఆపుకోలేకపోయాడు. భామ కూతురి వాదనకు మెచ్చుకోలుగా చిరునవ్వు నవ్వింది.

“అమ్మానాన్నా చెప్తే వినవా ?” కొద్దిపాటి చిరాకుతో అభి అన్నాడు.

“షటప్..నీకా హక్కులేదు. నీవు వాళ్ల ఒక్కమాటా వినలేదు. కాలేజ్, బ్రాంచ్ అన్నీ నీ ఇష్టమే! చిన్న చిన్న పనులు మాత్రం వినయంగా భలే చేస్తావ్. అమ్మకు తలనెప్పి లేనపుడు కూడా తలనెప్పా అమ్మా అంటూ ఒకటే అడిగిమరీ తలనెప్పి తెప్పిస్తావ్. ఇదంతా మాట వినటం కిందకిరాదు. నేను..నాన్న చెప్పిన కాలేజీలో చేరా. నాన్న ఐటీ తీసుకో అంటే ఒప్పుకున్నా. నీవు ఏ ఒక్కటీ అమ్మా వాళ్ల మాట పాటించలేదు. నీకు ఈ విషయమై మాట్లాడే హక్కులేదు” అంటూ అన్నతో వాదనకి తిరిగింది. చారుమతి పోట్లాడటం తీవ్ర స్థాయికి వెళ్లేకొద్దీ తెలుగు పదాలు ఎక్కువ దొర్లుతుంటాయ్.

“అదంతా వదిలేయ్ చారు! విషయం పక్కదారి పట్టించకు. కాఫీ తాగుతూ ముచ్చట్లు చెప్పుకుంటుంటే ఆ ఆనందమే వేరు”

“నేనూ మీ కబుర్లలో భాగం పంచుకుంటూనే ఉన్నానుగా నాన్నా!”

“కాఫీ మరింత దగ్గరచేస్తుందమ్మా!”

“అదేమీలేదు. కబుర్లే దగ్గరచేస్తాయ్! అయినా..నువ్వు చెప్పింది కాఫీ యాడ్ కి భలేగా పనికొస్తుంది నాన్నా!” అంది నవ్వుతూ.

తానూ నవ్వుతూ ”అది నీకు అర్థమయ్యే విషయం కాదులే. కాఫీకబుర్లు వేరు”

“కాఫీ కబుర్లా! అంటే అమ్మా, నువ్వూ కాఫీ పుట్టుపూర్వోత్తరాలు మాట్లాడుకుంటారా!? అలాగైతే గొప్ప కామెడీనే!” పకపక నవ్వింది.

సూరీడు కిరణాలు ఆకులపై వెలుగులు చిమ్మినట్లుగా తోచింది ఆ నవ్వుచూసి గోపాలానికి.

“చెప్పాగా కాఫీ అంటే నీవు ఇష్టపడే రోజు వస్తుంది చూడు చారూ! ఇప్పుడు నీవు ఒప్పుకోకపోయినా పర్లేదు!”

“అలా ఎప్పటికీ కాదు కాదు కాదు” అంటూ లేచింది చారుమతి. అందంగా కదిలిన పూలతీగలా ఉంది తాను.

ఉల్లాసంగా నడుచుకుంటూ వెళ్లి మధ్యహాల్లో ఉయ్యాలబల్లమీద కూర్చుని ఊగుతూ ఆస్కార్ వైల్డ్ "The importance of being earnest", యద్దనపూడి సులోచనా రాణి "మీనా" రెండూ కలిపి చదువుతూ..

బారెడు జడని ముందుకు వేసుకుని, లంగావోణీతో ఎంతో పొందికగా కనిపించింది.

చదువుతున్నప్పుడూ మధ్యమధ్యలో ఆమె మోమున విరిసే చిరునవ్వు, ఆశ్చర్యం, ప్రశాంతమైన హాయి..ఉన్నట్లుండి విరగబడే నవ్వు..ఎంత ముగ్ధ సౌందర్యమో!

పుస్తకాలు చదువుతుంటే ప్రతి అమ్మాయీ అంత అందంగానే ఉంటుంది కాబోలు!

చక్కని ఉదయం అది!

★★★★★

ఆ సాయంకాలం.. దొడ్లోకి ఉన్న వంటింటి మెట్లపై కూర్చుని ఉన్నారు భామ, చారుమతి. కింది మెట్టుపై కూర్చున్న కూతురికి జడవేస్తోంది భామ. వెదురు పుల్లలని బాణాలుగా చెక్కుతున్నాడు అభి. అరటిపాదులు తవ్వుతున్న గోపాలం పని ఆపేసి వచ్చి మామిడి చెట్టుకింద అరుగుపై కూర్చుని..

"చారూ! ఒక పాట పాడు"అన్నాడు.

“ఇప్పుడు పాడను” అంది పెంకిగా చారు.

“నాకు వినాలని ఉంది మరి” అన్నాడు.”

"నాకు పాడాలనిలేదు కదా!” అంది.

కొద్దిసేపు బతిమాలించుకొని రవీంద్రుని సంగీతం పాడటం మొదలుపెట్టింది. బాలాంత్రపు రజని గారి తెలుగు అనువాద గీతమది.

“వందనమయ్యా నీ వాణికీ
అతిసుందర రసబంధుర సామ్రాజ్య దురంధరా!
తపోవనీ తరుచ్ఛాయ తారాడే హరిణికి
ఉపనిషన్మంత్ర తంత్ర మధువు లాలి పాడు అళినికీ
ఎపుడు నిదురమాని తిరిగే గంగా నిర్ఝరిణికి
వందనమయ్యా నీ వాణికీ..”

తడి నిండిన మది ఆమెది. ఆ ఆర్ద్రత ఆమె గొంతునా నిండుగానే పలికింది.

ఆ కంఠరవానికి ఎంతటి మూఢులైనా కరిగిపోతారు.

భావుకత నిండుగా ఉన్న వారి మానసిక స్థితిగురించి వేరే చెప్పాలా? తెలియని గుబులు మనస్సంతా ఆక్రమించుకుని చేతకాని అవస్థలో కన్నీరొలికిస్తారు. అదిగో, ఇక్కడా అదే జరిగింది.

"ఇక అరటిపాదులకి నీళ్లు ప్రత్యేకం పట్టక్కర్లేదు. మీరిద్దరూ ఉన్నారు చాలు. చారుతో రోజూ పాట పాడిస్తే సరి" అన్నాడు అభి అమ్మానాన్నల కంటిచెమని గమనించి.

అమ్మచేతిలోనుంచి దువ్వెన లాక్కుని వాడిపై విసిరేసింది చారు.

నిర్మలత్వం, ప్రశాంతత పుష్కలంగా ఉన్న మనస్సు ఆమెది.

ఆ అమ్మాయి సాంగత్యంలో ఎటువంటి జడులైనా ఉత్తేజం పొందుతారు.

ఎంత అందమైన సాయంత్రమది!

★★★★★

అలా ఉదయసంధ్యలు వీణానాదంలా మృదువుగా దొర్లిపోతున్నాయి .

ఉదయాలు విభాస్ రాగం, సాయంకాలాలు నీలాంబరి రాగం ఆ ఇంటిని కాంతిరాగ తరంగాలను ప్రజ్వలింపచేస్తున్నాయి.

కృతులా, తరంగాలా, అష్టపదులా, కృష్ణశాస్త్రి గేయాలా, రవీంద్రుని గీతాలా, తులసీ,సూరదాసుల భజనలా ఒకటేమిటి ఆమె ఆలాపనలు ఆమె ముగ్ధమోహనరూపాన్ని మరింత మనోహరంగా తీర్చిదిద్దుతున్నాయి.

★★★★★

మరలా సాగుతుండగా..అరె! ఈ పదాన్ని అలాగే చదివేస్తున్నారా? మరలా "మరలా" అనే పదాన్ని చదవరూ!?

ఎలా అనుకుంటున్నారా?

"మరి అలా.."అన్నమాట!

మరి అలా అప్రమేయానంద వీచికా నర్తనం ఆ ఇంట సాగుతుండగా.. ఆ నర్తనానికి నేపథ్యగానం వారి జీవనశైలి అయితే, దానికి తోడు , కనిపించక వినిపించే ఆర్కెస్ట్రా లా చారుమతికి ఓ మాంచికాఫీ లాంటి సంబంధం వచ్చింది.

మంచి కాఫీ అంటే నిజంగా మంచే కాఫీ, కాఫీయే మంచి అనుకునే సంప్రదాయమన్నమాట! మరి ఆ మంచివారింట కాఫీయే వారి మనుగడ, వారి జీవనం, అదే వారి ప్రపంచం! ఇంతెందుకు వారి జీవితమే కాఫీతో ముడిపడి, ఎన్నడూ విడిపడనంత గాఢ అనుబంధం అను బంధం తో చిక్కడిపోయి, చిక్కనంత చిక్కదనాన్ని ఎంచక్కా పొదువుకొని మూడు మిరియాలు, ఆరు యాలకులతో సమ్మేళితమై అలరారుతున్నది.

అల్లవారి సంబంధం అల్లాటప్పా కాదండోయ్! అసలుసిసలు తెలుగువారైన కన్నడ సంప్రదాయం!

సన్నజాజికి చందనం తోడైనట్లు, జవ్వాజికి కస్తూరి కలగలసినట్లు ---.అల్లవారు, మీరప్పుడే గ్రహించినట్లు..అల్లదిగో ఆ కూర్గ్ నుంచే వచ్చారు!

అల్లసాని పెద్దన కృష్ణాయల కొలువులో నెలవైనట్లు, తెనాలి రామలింగడు రాయల సభకి శోభను పెంచినట్లు

ఈ చారుమతి అనెడి కొమ్మ విరాజమానమైన(అవునండీ..విరాజ్ పేట నే)ఆ వినీతుని(వినీత్) ఇంట సౌరభాన్ని "విరి"జిమ్మబోతోంది!

★★★★★★

వినీతునిది వ్యవసాయ కుటుంబం. కూర్గ్ లో పాతిక ఎకరాల కాఫీతోట ఉంది. తాను ఎన్విరన్మెంటల్ సైన్సెస్ లో పట్టభద్రుడైన తర్వాత తండ్రికి విశ్రాంతినివ్వాలన్న ఆలోచనైతేనేమి, తనకూ వ్యవసాయం పట్ల ఉన్న ఆసక్తి ఐతేనేమి కాఫీ పొలాలు, అందులో వేసే మిరియం, యాలకుల పంటనూ సేంద్రీయ పద్ధతిలో పండిస్తున్నాడు. అందుకు అవసరమైన శాస్త్రీయ అంశాలను, పరిశోధనలనూ అనుసరిస్తూ "ఆర్గానిక్ కాఫీ" అని ఒక సంస్థను నడుపుతున్నాడు. అందులో తోటి చిన్న రైతులకు ,తండ్రి సాయంతో తగు సలహాలను ఉచితంగా అందిస్తాడు. ఇంటి ఆవరణలో పదహారు ఆవులు కూడా ఉన్నాయి. వందేళ్ల నాటి పన్నెండు గదుల లోగిలి. ఇల్లంతా టేకు స్థంభాలు, దూలాలతో ఇప్పటికీ దిట్టంగా ఉంది! తల్లి వీణా విద్వాంసురాలు. చెల్లెలు బెంగుళూరులో ఈస్టరన్ ఫేర్ మ్యూజిక్ స్కూల్లో మ్యూజిక్ కంపోజర్. దేశ, విదేశాల్లో తన టీం "స్వరాత్మ" తో ఎప్పుడూ ఏవో ప్రోగ్రాంస్ లో ఉంటుంది. వినీతుడికి కాస్త సంగీత పరిజ్ఞానం ఉంది. వేణువు ఆలపించటంలో అతను ఆనందాన్ని పొందుతాడు.

కానీ ఈ సంబంధానికి చారుమతి ఎలా స్పందిస్తుందోనని ఒకింత చింతనలో పడ్డారు భామ, గోపాలం. కాఫీనే సహించని అమ్మాయికి మంచి కాఫీలాంటి సంబంధం అనిచెప్తే ఏంలాభం? అందునా కాఫీ వ్యవసాయం చేసే అబ్బాయి అంటే ఒప్పుకుంటుందా అంట!? కాఫీ మొక్కను ఇంట్లోనే పండిస్తావు ముందు ముందు అని ఒకసారి సరదాగా అంటేనే తోటలూ లేవు, పంటలూ లేవు అని అననే అంది. అసలు తనకసలు ఎటువంటి వరుడు కావాలనుకుంటుందో అనే సందిగ్ధంలో పడిపోయారు. అడిగితే చెప్పే మనస్తత్వం కాదాయె! మరెలా కనుక్కోవటం? ఒకవేళ ఈ సంబంధం విషయం చెప్పేస్తే ఏమాత్రం ఆలోచించకుండానే ఒక్కసారిగా కాదు పొమ్మనేస్తే! వాళ్లా తమకు తెలిసినవాళ్లు. మన్నన ఉన్నవాళ్లు. మాటాతీరూ భావాలూ తమతో కలిసినవాళ్లు. ఇక అబ్బాయిని చూస్తే బహు ముచ్చటేస్తుంది. ఎప్పుడూ చైతన్యంగా ఉంటాడు. తండ్రికి కుడిభుజంలా ఉంటాడు. తల్లిని కూతురులా చూసుకుంటుంటాడు. చెల్లెలికితోడుగా నిలబడతాడు. రైతులకు అండగా ఉంటాడు. నిస్సహాయులను ఆదరిస్తాడు. చిన్నవారితో ఆడిపాడతాడు. పెద్దలపట్ల వినయం, విధేయత ఉన్నవాడు. కష్టం, సుఖం తెలిసినవాడు, భేషజాలకు పోనివాడు! ఇంతకన్నా ఒక వరుడికి ఉండాల్సినవేముంటాయి! ఉంటాయ్! వధువు మనసుకు నచ్చాలి. ఆమెకు తన ఆత్మ బంధువులా తోచాలి !

మరి.. అబ్బాయిని అమ్మాయి చూసినప్పుడు, మాటాడినప్పుడే కదా తెలుసుకోవటం సాధ్యం? పెళ్లి సంబంధం అని చెప్తే చారుమతి మొండికెయ్యొచ్చు. వాళ్లను పిలిపించి అమ్మాయిని చూపిస్తే ఠాట్ పొమ్మని అంటే! ఈ భయమూ లేకపోలేదు వారికి.

"ఊర్కెనే..ఒక్కసారి ఈ అబ్బాయిని చూడు, మాట్లాడు" అంటే ఎంత హాయంగా ఉంటుంది!

మరెలా వీరిద్దరినీ కలిసేలా, మాట్లాడేలా చేయటం! భామ, గోపాలం ఎంత ఆలోచించినా ఏమీ పాలుపోలేదు. అభి ని అడిగితే ఇటువంటి విషయాలలో అంతగా నాకు ఐడియాస్ రావన్నాడు. అదేదో సాపేక్ష సిద్ధాంతాన్ని అయితే వాడే కనిపెట్టినట్లు!

ఇంతలోనే ఆపద్బాంధవుడిలా జగన్నాథమే ఫోన్ చేశాడు. అసలు ఈ సంబంధం చెప్పినవాడు అతనే! "జగ్గాయి" అని పిలవబడే జగన్నాథం, భామకు పెత్తల్లి కొడుకు. అతని భార్య జ్యోతికి తోబుట్టువు సావిత్రి. స్వయానా అక్క. సావిత్రి భర్త ఆనందరావు, జగన్నాథమూ షడ్డకులే కాదు మంచి మిత్రులు కూడా. సావిత్రి ఆనందరావులే వినీతుని అమ్మానాన్నలు. మైసూరులో స్థిరపడిన జగన్నాథము, కూర్గ్ లో స్థిరపడిన ఆనందరావు..ఈ రెండు కుటుంబాల మధ్య రాకపోకలు, ఆత్మీయత ఉన్నాయి. వినీతుని చిన్నప్పట్నుంచీ చూస్తుండటంచేత జగన్నాథానికి, తన మేనకోడలు చారుమతి వినూతుడికి సరైన జోడి అని తోచింది. జ్యోతి కూడా ఆ అభిప్రాయం బలపరచటంతో భామకు ఫోన్ చేశాడతను. గోపాలంతో కూడా మాట్లాడాడు.

"బావగారూ! వాళ్లూ మీకు తెలుసు కదా! ఫంక్షన్స్ లో ఒకట్రెండుసార్లు మీరూ చూశారు. పైగా మీకూ పరిచయమే కదా! మొన్న పల్లవి పెళ్లిలో(జగన్నాథం వాళ్ల అమ్మాయి పెళ్లిలో)చారుని చూశారట వాళ్లు. బాగా నచ్చింది వాళ్లకి. ఒక్కసారి మీరిద్దరూ మైసూరు వస్తే కూర్గ్ వెళ్దాం. పిల్లాడు బుద్ధిమంతుడు. మీరూ చూద్దురుగానీ. మీకు నచ్చితే ఆనక చారు కి చెబుదురుగానీ. ఒకమాట అభి చెవిలో మాత్రం వెయ్యండి" అన్నాడు.

వెళ్లి చూసివచ్చారు కూడాను. సావిత్రి, ఆనందరావుల తీరు చాలా ఆదరంగా ఉంది. వినీత్ వీళ్లు వెళ్లినప్పటికిలేడు. భోజన సమయానికి వచ్చాడు. మైసూరులో జరిగిన ఆపెళ్లికి వినీత్ కూడా వచ్చాడట కానీ రిసెప్షన్ టైంకి వచ్చి కనబడి, బెంగుళూరులో వూఫ్ కి సంబంధించిన ఫారెన్ డెలిగేట్స్ ని ఉదయాన్నే కలవాలని హడావుడిగా వెళ్లిపోయాడట. అందుకే అప్పుడు వినీత్ ని చూడలేదు వాళ్లు. వినీత్ కి భామా గోపాలం లను తమ బంధువులుగానే పరిచయం చేశాడు జగన్నాథం . వినీత్ ముఖ వర్చస్సు ఆకట్టుకునేలా ఉంది. మాట గౌరవంగా ఉంది. ఆ ఇంట చారుమతి ఆనందంగా ఉంటుందన్న నమ్మకం కలిగింది వాళ్లకి. ఇప్పుడు సమస్యల్లా చారుమతి కి నచ్చుతుందా లేదా ఇంత మంచి సంబంధం అనే.

జగన్నాథం ఫోన్ చూడగానే ప్రాణంలేచొచ్చింది ఇద్దరికీ. మనసులో ఉన్న సంశయం చెప్పి ఏదన్నా ఉపాయం చెప్పమన్నారు.

"ఓస్ ఇంతేనా! పోయినసారి నేను ఫోన్ చేసి నప్పుడు హోం టూర్స్ గురించి స్టడీ చేద్దామనుకుంటున్నా అంది. ఇప్పుడు మీరడిగాక నాకు గుర్తొచ్చింది. కూర్గ్ లో హోం స్టేల పై చేయమని చెప్పండి. ఒప్పుకుంటుంది. మీరొచ్చి దించినా సరే, లేదూ నేను మైసూరులో దాన్ని పిక్ చేసుకుంటా. నేనూ, జ్యోతి వెళ్లి కూర్గ్ లో వాళ్లింట్లో దించి వస్తాం. హోం స్టే లకు వినీత్ తోడు వెళ్తాడు. ఆ రకంగా ఒకరినొకరు తెలుసుకునే అవకాశం" అన్నాడు.

ఓర్నీ జగ్గాయివన్నీ హడావుడి పనులే అని అనుకుంటూ

"కూర్గ్ లో బాగానే ఉంది కానీ, వాళ్లింట్లో అమ్మాయిని దించటం.." మాట ఇంకా పూర్తికాకుండానే

"నీదీ మరీ చాదస్తమే" అని కొట్టిపారేయబోతూ "ఇదిగో జ్యోతి మాట్లాడుతుందట" అంటు జ్యోతికి ఇచ్చేశాడు.

జ్యోతి ఎంతో అనునయంగా చెప్పింది"భామా! నీవేమనుకుంటున్నావో నాకర్థమైంది. నీవేమీ కంగారు పడకు. సావిత్రి అక్క చాలా బాధ్యతగా ఉంటుంది. పైగా వినీత్ కి ఇంకా చెప్పలేదు వాళ్లు. వాడు చారుని చూశాక వాడికి ఇది నచ్చితేనే అసలు విషయం చెప్పాలనుకున్నారు. వాడు మంచి ఫ్రెండ్లీ నేచర్. అలాగని హద్దులుదాటే వాడు కాదు" అంటూ భరోసా ఇచ్చింది.

★★★★★

టెక్నికల్ గ్రాడ్యుయేషన్ పూర్తవుతూనే చారుమతి మేగజైన్స్ కి ఆర్టికల్స్ రాయటంలో బిజీ అయిపోయింది. హడావుడి పరుగుల ఉద్యోగం వద్దనుకొంది. నింపాదిగా లైఫ్ ని ఆస్వాదించాలనేది చారు అభిమతం. బుక్ రివ్యూస్, రాగ కర్తలు పేరుతో పూర్వ-పాశ్చాత్య మ్యూజిక్ బ్యాండ్స్ పై ఆర్టికల్స్ రాస్తోంది. హోం టూర్ ఆర్టికల్స్ "ఇంటీరియర్" అనే ఇంగ్లీష్ మేగజైన్ కి పంపించాలని అనుకుంటోంది. అందుకు చాలా ప్రదేశాలు తిరగాల్సి ఉంటుంది. అయితే, ఇంట్లో ఇప్పుడే ఒప్పుకోకపోవచ్చు. సరైన అవకాశం కోసం చూస్తోంది.

ఒకరోజు పొద్దున్నే " హోం స్టే అయితే నీ రీసెర్చ్ ఎలా ఉంటుంది?" అభి అడిగాడు చారు ని.

" బ్రహ్మాండంగా ఉంటుంది" ఉత్సాహంగా బదులిచ్చింది.

"అయినా ఇప్పుడు హోంస్టేలంటే కేరళ వెళ్లొద్దూ! అంతదూరం నన్ను పంపిస్తారా? పంపించరుగాక పంపించరు" నిష్కర్షగా చెప్పేసింది

"ఒకవేళ పంపిస్తే?"

"అబ్వియస్లీ వెళ్తాను. కానీ పంపించరు"

"పంపిస్తే అంటున్నానుగా!"

"పంపించరు అంటున్నానుగా"

"నేను అమ్మా నాన్న ని ఒప్పిస్తే?" నేర్పుగా నటిస్తున్నాడు అభి.

"నీచేతకాదులే గానీ వదిలేయ్"

"ఒప్పిస్తానంటున్నా! నీవు రెడీ నా కాదా చెప్పు" అన్నాడు అభి.

"అరె! వెళ్తానన్నానుగా! ఒక్కదాన్నీ అక్కడుండటానికి ఒప్పుకోరు అంటున్నా" విసుక్కుంది చారు.

"అయినా నామీద ఇంత ప్రేమేంట్రా నీకు? ఉన్నట్లుండి ఇంత ఫేవర్ చేయాలని నీకెందుకనిపించింది!?నేను కేరళ వెళ్తే నీకుపయోగం ఏముంది? " నిలదీసింది చారుమతి.

"అమ్మో దీని గురించి తెలిసీ ఎందుకు ఒప్పుకున్నానీ విషయం మాట్లాడుతానని! దొరికిపోం కదా కొంపతీసి!" అనుకున్నాడు అభి.

"ఏంలేదులే! ఒకసారి కేరళ టూర్ లో హోం స్టే లు చూసి చాలా ఇంప్రెస్స్ అయ్యావ్ గా. హెరిటేజ్ బంగ్లాలు, మండువాలోగిళ్లు చూసి కొబ్బరితోట మధ్యలో ఇలాంటి ఇంట్లో మనం ఉంటే భలే ఉంటుందన్నావుగా. అది గుర్తొచ్చి అన్నానులే. ఇన్ని ప్రశ్నలా మరీ!"విసుక్కున్నట్లు నటించాడు.

"అయితే విను. నాకు లేని ఆలోచన పొరబాటున తెప్పించావ్ గా. అమ్మానాన్నలకి చెప్పి ఒప్పించు. లేదా నీ పని చెబ్తా!" బెదిరించింది.

"చూస్తాన్లే. అయినా నాన్న ఒప్పుకున్నా, అమ్మని ఒప్పించటం మహా కష్టం" అన్నాడు.

రెండ్రోజుల తర్వాత భామ "అభి హోం స్టే లైతే బాగుందన్నాడు. నాకు, నాన్నక్కూడా బాగుంటుందనిపించింది. నీవు రాయబోయే ఆర్టికల్ కి ఇది ఉపయోగపడుతుందేమో! అయితే కూర్గ్ లో బాగుంటుందని నాన్న అన్నారు. జగ్గు మామయ్యకి ఫోన్ చేస్తే వాడు వాళ్ల బంధువులున్నారని, వాళ్లింట్లో ఉండొచ్చని, ఇబ్బంది గానీ, కంగారు గానీ లేదని చెప్పాడు. మరి నీకు కూర్గ్ అయితే ఓకేనా?" అని కూతుర్ని అడిగింది.

సంబరంగా ఒప్పుకుంది చారుమతి.

"ఆఇంట్లో వాళ్లని ఇబ్బంది పెట్టొద్దు. వాళ్లతో పద్ధతిగా మసలుకో. పొద్దున్నే నిద్రలేచి స్నానం చేయ్. తిని, కంచం ముందు నుంచి లేచివెళ్లిపోకు. ఆవిడకు సాయంచేయ్" ఇలా ఎన్నో బోధించింది భామ.

పదేపదే ఇలాంటివే చెప్తూవుంటే వినీ వినీ చిర్రెత్తుకొచ్చింది చారు కి.

"అబ్బబ్బ అస్తమానూ చెప్తావేం. అలాగే అన్నానుగా "అంటూ విసుక్కుంది.

భామకి ఒకవైపు కంగారుగానే ఉంది. పెంకిపిల్ల. ఎలా మసలుకుంటుందో అక్కడ అని. సంబంధం కోసమనే కాదు. ఎక్కడైనా సరే మన పిల్లలు ఉండాల్సివస్తే ఎలా మసలుకోవాలో తెలిసుండాలికదా అనేది భామ అభిమతం.

"దానికెలా వుండాలో తెలుసులే" అని సర్దిచెప్పాడు గోపాలం.

వారం రోజుల్లో చారుమతిని బెంగుళూరు ఫ్లైట్ ఎక్కించారు. ఎయిర్ పోర్ట్ కి జగన్నాథం వచ్చాడు కారేసుకుని. మైసూరులో రెండ్రోజులూ రాగిణితో సరదాగానే గడిచింది. రెండ్రోజులున్నాక, జ్యోతి, జగన్నాథం ఇద్దరూ కూర్గ్ లో దించి వెళ్లారు చారుమతిని.

పెద్ద గేటుదాటి కొబ్బరితోట మధ్య బాగా లోపలికి వెళ్తే పేద్దలోగిలి . ఆ ఇంటికి పక్కగా పెద్ద వసారా. అందులో ఆవులు, దూడలు. చుట్టూ పెంకు వసారాలు. చుట్టూ డాబాల మీదకు వాలుతున్న పచ్చని కొబ్బరిమట్టలు. నిజ్జంగా ఇలాంటి ఇంట్లో బంధువులుండటం, తాను కొన్నిరోజులుండగలగటం "గ్రేట్ చారు" అనుకుంటూ ఉప్పొంగిపోయింది చారుమతి. సావిత్రి, ఆనంద్ లు మనసారా ఆహ్వానించారు చారుమతిని. వాళ్ల అపురూపతతో బిడియం తగ్గి ఇల్లంతా సావిత్రితో తిరగటం మొదలుపెట్టింది. పొద్దున్నే ఆరింటికి లేచి, స్నానం చేసి బయటికి వచ్చిన చారుమతికి ఎప్పుడు స్నానంచేసిందో తెలియదు కళకళలాడుతూ సావిత్రి కనిపించింది.. ఆపాటికే సంధ్యావార్చి మండువాలో ఉయ్యాలబల్ల మీద కూర్చొని హిందూ పేపర్ తిరగేస్తున్నాడు ఆనంద్. సావిత్రి కంచు గ్లాసులతో నురుగులుగక్కే కాఫీని ఆనందుకి అందించి తానూ పక్కనే కూర్చొని తాగింది. కాఫీ తాగటం పూర్తయ్యాక ఆవుల కి పచ్చగడ్డి వేసింది. అక్కడ సహాయంచేసేవారు ఇద్దరున్నప్పటికీ, ఉదయం మాత్రం తనచేతులతోనే వేయటం ఇష్టం అంది. ఇంటి

ప్రాంగణంలో బోలెడన్ని తులసి మొక్కలున్నాయ్. వాటి దళాలను కోసి, సువర్ణగన్నేరు పూలనీ కోసి కదంబమాల అల్లి హాలులో నాలుగడుగుల వేణుమాధవుని కాంస్య విగ్రహానికి వేసింది.

"పూజగదిలో విడిపూలతోనే అర్చించినా మాల మాత్రం ఈ విగ్రహం కోసం అల్లుతాను. భక్తికన్నా మురిపెం ఎక్కువ మామయ్యకి. రోజూ, దండవేసిన విగ్రహాన్ని చూడటం ఇష్టం" అని ఆనందు గురించి చెప్పింది సావిత్రి.

తను నిద్రలేచేసరికి వీణ వినిపించటం గుర్తొచ్చి, "మీరు పొద్దున్నే వీణ వాయించారా అత్తయ్యా?" అని అడిగింది చారుమతి.

"అవును. పూజలో భాగమే వీణపై ఓ కీర్తన వినిపించటం" అంటూ వంటింటివైపుకు నడిచింది సావిత్రి..

అప్పటికే ఫలహారం తయారై ఉంది. వంటమామ్మ ఇత్తడి ఇడ్లీ పాత్రలో వేడి వేడి ఇడ్లీలు చేసి, గ్రైండర్లో కొబ్బరిపచ్చడి రుబ్బి, కరివేపాకు తిరగమాతతో ఘుమఘుమలాడిస్తోంది వంటింటిని. అక్కడ కాఫీ ఫిల్టర్, బిందెలు మరిన్ని గిన్నెలు ఇత్తడి, రాగి, కంచు వే ఉండటం, ఇనుప బాండీలు, రాచ్చిప్పలు కూడా వుండటం చారుమతి గమనించి,

"అన్నీ వాటిలోనే చేస్తున్నారెందుకని?" సావిత్రిని అడిగింది.

"ఇటువంటి పాత్రల్లో ఆహారపు పౌష్టికత పెరుగుతుంది "అని జవాబిచ్చింది సావిత్రి.

హిందూ పేపర్ తర్వాత తెలుగు, కన్నడ పేపర్లనీ తిరగేసిన ఆనందుని చూసి "అన్నింటిలోనూ ఒకే న్యూస్ ఉంటాయి కదా, ఇన్ని చదవటమెందుకు మామయ్యా? "అని అడిగింది.

"ఏ పేపర్ విశిష్టత దానిదే చారుమతి! నిజానికి హిందూ పేపర్ లో నిన్నటివి కాదు, మొన్నటి వార్తలుంటాయి. అయినా వార్తలకోసం కాకుండా విజ్ఞానం కోసం చూడాలి ఈ పత్రికని. తెలుగు పేపర్ ఎందుకు చూస్తానంటే, మన అసలు భాషని పోగొట్టుకోకుండా వుండటానికి. ఇక కన్నడ పత్రిక నేను ఇక్కడి భాషని మరింతగా నేర్చుకోటానికి చదువుతాను" వివరించాడు.

చారుమతికి తన మనసు విశాలమైనట్లు తోచింది సావిత్రిని, ఆనంద్ ని చూసి.

మధ్యాహ్నం దాకా ఎవరో వచ్చి ఆనందుతో మాట్లాడివెళ్ళారు. వారికి ఏవో సలహాలు చెప్పటం వాళ్లు సంతృప్తి ముఖాలతో తిరిగి వెళ్లిపోవటం గమనించింది. అక్కడి వాతావరణం కొత్తగా తోచినా ఏదో సరికొత్త చైతన్యాన్ని తనలోకి ఒంపిన అనుభూతిని పొందింది చారుమతి.

వాళ్లంతా ఎవరని సావిత్రిని అడిగితే "కాఫీ రైతులు"అని చెప్పింది . అర్థం కానట్లు ముఖంపెట్టిన చారుమతికి అర్థమయ్యేలా చెప్పింది.

"మామయ్య కాఫీతోటల వ్యవసాయం చేస్తారు. పూర్తిగా ఆర్గానిక్ పద్ధతిలో. తోటి రైతులకు వాటికి సంబంధించిన సమాచారాన్ని అందిస్తారన్నమాట" అంటూ.

"ఏంటీ మీకు కాఫీ తోటలున్నాయా?" హాశ్చర్యపడిపోయేసింది చారుమతి. నవ్వుతూ తలూపింది సావిత్రి.

"భలే! నేను చూడొచ్చా వాటిని?" సంబరంగా అడిగింది. అంతలోనే బిడియపడింది అలా చొరవగా మాట్లాడకూడదేమోనన్నట్లు.

"ఓ తప్పకుండా చూడొచ్చు. అన్నట్లు నువ్వు హోం స్టేలను చూడాలని వచ్చావు కదా! మరి అవి కాఫీ తోటల్లోనే కదా ఉంటాయ్! వినీత్ బెంగుళూరు వెళ్లాడు. రేపు వస్తున్నాడు. వాడు నీకివన్నీ దగ్గరుండి చూపిస్తాడు"అంది.

వి..నీ..త్ పేరు ఎక్కడో విన్నట్లు అనిపించింది చారుమతికి.

మరుసటిరోజు ఉదయం తలారా స్నానం చేసి తాను వేసుకోవాల్సిన డ్రెస్ కోసం బ్యాగ్ వెతికింది. భామ చుడీదార్స్ తోబాటుగా ఒక లంగావోణీ సెట్ కూడా పెట్టినట్లుంది. చారుమతికి అవే వేసుకోవాలనిపించి చిటికెలో తయారై సావిత్రి దగ్గరికి పరిగెట్టింది.

"అత్తయ్యా! ఇవాళ నేను మాల అల్లనా?" అని ఉత్సాహంగా అడిగింది. చిరునవ్వుతోనే అనుమతి ఇచ్చింది సావిత్రి.

ఆకుపచ్చని లంగావోణీలో వనకన్యలా మెరిసిపోతున్న చారుమతిని చూసి ముగ్ధులయ్యారు సావిత్రి, ఆనందులు. ఎక్కువ ఆశించకూడదేమో అని అనిపించకపోలేదు వారికాక్షణంలో! అదేమీ తెలియని చారుమతి తులసిదళాలు, సువర్ణగన్నేరు పూలు కోసుకొని, వరండా అరుగుపై కూర్చొని మాల అల్లింది. ఇంట్లో పూలమాలలు అల్లిన అనుభవం వుండటంవల్ల చకచకా పూమాలని కూర్చి హాల్లో వేణుమాధవుని విగ్రహానికి వేయటానికి దండను

గుండ్రంగా చుట్టి సరిచూసుకుంటూ వెళ్తోంది. గుమ్మం దాటగానే ఇంతలోనే ఎవరో ఎదురొచ్చేశారు చూసుకోకుండా. ఒక్కసారిగా ఆగిపోయి పట్టి వుంచిన మాలలోనుంచే చూసింది. ఎదురొచ్చిన వ్యక్తిని చూసి తడబడింది. ఆరోజు పల్లవి పెళ్లిలో  పన్నీరు ఇతనిపైనే కదా చిలకరించింది!? హఠాత్తుగా గుర్తొచ్చింది. ఓ నిన్న వినీత్ అని వినగానే పేరు విన్నానే అనుకున్నా. ఇతని పేరు అదే కదా..రాగిణి చెప్పింది కదూ అనుకుంటూ..

"హాయ్" అంటూ పలకరించింది వెంటనే. బదులుగా తడబడుతూ నవ్వాడతను.

"మీరిక్కడ.."ఏదో అడగబోయాడు.

"సర్ప్రైజ్ కదూ నేనూ షాక్ అనుకో. సో..నేను మీ ఇంట్లోనే అన్నమాట ఉన్నాను" అంది.

"రాగిణి కజిన్ అని చెప్పింది అమ్మ. మీరేనా?"

అవునన్నట్లు కనురెప్పలు ఆడించింది.

"ఆర్టికల్ రాయటానికి వచ్చారా అయితే!"అన్నాడు.

బదులుగా నవ్వి "మీరు అనొద్దు. నువ్వు అను. కజిన్ కి కజిన్ నువ్వుగాక మీరు ఎలా అవుతుంది?" అంది తమాషాగా.  హాయిగా నవ్వాడతను.

"ఇవాళే వెళ్దాం. పదింటికి రెడీగా ఉండాలి "అంటూ వెనుదిరిగి వెళ్తున్న అతన్ని పిలిచి

"అవునూ! నువ్వేంటి ఆవేళ పన్నీరు చల్లుతుంటే అడ్డుపడ్డావ్. ఈవేళ దండేస్తుంటే అడ్డొచ్చావ్! ఏంటీ కో ఇన్సిడెన్స్!?" అడిగింది.

సమాధానం ఏంచెప్పగలడు వినీత్ మాత్రం!

"అదే అర్థంకావటంలేదు. ఆరోజు పన్నీరు జల్లావ్. ఈరోజు దండెయ్యబోయావ్. చూస్తుంటే ముందు ముందు సన్మానమే మిగిలింది" అన్నాడు భయం నటిస్తూ.

"యూ ఫన్నీ" అంది నవ్వుతూ.

పల్లవి పెళ్లి రిసెప్షన్ సమయానికి వస్తోన్న బంధుమిత్రులకు ముఖద్వారం దగ్గర నుంచుని గులాబీలు, గంధం అందిస్తూ పన్నీరు చిలకరిస్తున్నారు  పల్లవి చెల్లెలు రాగిణి,చారుమతి.  కుంకుమ వన్నె అంచుపై జరీపూలున్న లేతతెలుపు పట్టు పరికిణీ-జాకెట్టు, దానిపై బంగారు జరీ బూటాలున్న కుంకుమ ఛాయ జార్జెట్ వోణీ, జడగంటలతో బారెడు జడ ముందుకువేసుకుని, చెవులకు అందంగా ఊగుతున్న కెంపులజూకాలతో బాల సరస్వతిలా వెలుగుతోంది చారుమతి. మధ్యమధ్యలో అల్లరిలో భాగంగా, సరదాగా రాగిణిపై మరింతగా పన్నీరు చిలకరిస్తున్న చారుమతి ఒక్కసారిగా ఎదురుగ్గా అత్యంత సమీపంగా వచ్చేసిన యువకుడిని చూసి ఉలిక్కిపడింది.  రాగిణిని పలకరించటానికి వచ్చిన ఆ యువకుడు హఠాత్తుగా తనపై కురిసిన పన్నీటిజల్లుకు అదిరిపడ్డాడు. ముగ్గురికీ విషయం అర్ధమైంది, రాగిణి తప్పుకునేసరికి అక్కడికి వచ్చిన అతనిపై పన్నీరు పడిందని.  చిరునవ్వు తో క్షమాపణలడుగుతున్న ఆ అమ్మాయి కాటుక కన్నుల కాంతులు చూసి ఒక్క క్షణం కలవరపడినా అదే క్షణంలో తన చూపుల్ని మరల్చుకున్నాడతను. "చారుమతి.." పరిచయంచేసింది రాగిణి అతనికి. చారుమతివైపు క్షణంలో వెయ్యోవంతు చూసి హలో అని తలూపి, రాగిణికి బై చెప్పి మళ్లీ కలుస్తానని అంతే హడావుడిగా వెళ్లిపోయాడతను.

"వినీత్ అన్నయ్య..మా ఆమ్మ కొడుకు" నెమ్మదిగా చెప్పింది రాగిణి అతను వెళ్లిపోయాక.

అతను కలవరపడి చూపులు మరల్చుకోటం తను గమనించింది. అదే క్షణంలో ఏ భావమూ కనబడనీయనంత జాగ్రత్త పడటం, చూసీచూడని పలకరింపు ఎందుకో !? అర్ధంకాలేదు చారుమతికి.

★★★★★

ఆరోజు లంగావోణీలో, ఈరోజూ లంగావోణీలో చారుమతిని చూసి విలక్షణంగా వుందీ అమ్మాయి అనుకున్నాడు వినీత్. ఈ అమ్మాయిని మళ్లీ కలవటం అనుకోనిది. అది అతనికి ఆనందాన్నిచ్చినా బయటికి వ్యక్తపరచలేదు.

కాకతాళీయమే కావొచ్చు, వారిద్దరి కలయిక దివ్య పరిణామం లా తోస్తుంది మనకు. ఆరోజు మెరూన్ అండ్ ఆఫ్ వైట్, ఈరోజు వర్దంట్లీ కలర్. మొదట చూసిందే వధువు ధరించే మధుపర్కాల వన్నెలో! ఇప్పుడు వనకన్యలా అతని ప్రవృత్తికి సరిపోలే హరిత వర్ణంలో! ఆనాడు పన్నీరు చల్లింది. గంధమూ పూసింది అనుకోకుండా. ఈనాడు దండలోనుండి వరుణ్ణిగాంచి, జయమాల వేయబోయింది.

★★★★★

పదింటికి తయారై ఉన్న చారుమతితో తన జీపులో బయలుదేరాడు వినీత్. ముందుగా గ్రీన్ హిల్స్ ఎస్టేట్ కి తీసుకెళ్లాడు. కాఫీతోటల మధ్య ఉన్న ఈ బంగ్లా స్వర్గధామంలా అనిపించింది చారుమతికి.

"ఇది 19 సెంచురీలో స్విస్ మిషనరీస్ కట్టించిన బంగ్లా. ఇది కాఫీ ప్లాంటర్ బంగ్లా. దీని కో- ఓనర్ చెంగప్ప అనే ఆయన. దీన్ని చెంగప్ప పూర్వీకులు ఆరు తరాలుగా జాగ్రత్తగా చూసుకుంటున్నారు" అని చెప్పి లోపలికి తీసుకెళ్లాడు.

"లగ్జూరియస్ ఎక్సిస్టెన్స్" అప్రయత్నంగా అనేసింది చారుమతి ఆ బంగ్లా విలాసాన్ని చూసి.

"నీక్కావల్సిన ఫొటోస్ తీసుకో మరి" అన్నాడు.

ఫొటోస్ తీసుకోగానే బయటకు వస్తూ "చిన్న చిన్న ప్లాంటర్స్ కూడా తమ ఇళ్లను ఇందుకు ఉపయోగిస్తున్నారు. 90 లలో పడిపోయిన కాఫీపంట ధరలకు సప్లిమెంటరీ ఎర్నింగ్స్ గా వీటిని నడపటం మొదలుపెట్టారు ఇక్కడ ఫ్యామిలీ ఓన్ డ్ ఎస్టేట్సే కాదు. టాటా వారి కాఫీ ఎస్టేట్స్, హాస్పిటాలిటీ వెంచర్స్ కూడా ఉన్నాయి "అని చెప్పాడు.

కబ్బే హాలిడేస్ అనే హోంస్టే లో ఓనర్తో మాట్లాడటం కుదిరింది చారుమతికి.

"హోం స్టే లు మాకు ప్రపంచంతో అనుబంధాన్ని ఏర్పరుస్తాయి. ఎంతోమందిని కలిసే, మాట్లాడే అవకాశాన్ని ఇస్తాయి" అన్నాడు. కూర్గ్ లోని మరిన్ని గృహవసతుల గురించి చెప్తూ ఎంతో సమాచారాన్ని అందించాడాయన. చెప్పిందంతా ఉత్సుకతతో విని అవసరమైన పిక్చర్స్ తీసుకొని ధన్యవాదాలు చెప్పి బయటకు వచ్చింది. వినీత్ ఆమెను అనుసరించాడు.

కూర్గ్ టూరిజం అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, కర్ణాటక కల్చర్ ఇన్ ఫర్మేషన్ సెక్రటరీ లతో అపాయింట్మెంట్ తీసుకున్నాడు వినీత్. మరుసటిరోజు వాళ్లతో మాట్లాడింది. ఆ తర్వాతరోజు మరికొంతమంది హోం స్టే ఓనర్స్ ని కలవటానికి తీసుకెళ్లాడు. వాళ్లతో మాట్లాడాక, కొంతమంది ట్రావెలర్స్ అనుభవాల్ని అడిగి తెలుసుకుంది .

నాలుగురోజులపాటు ఇదే సరిపోయింది చారుమతికి. తాను సేకరించిన సమాచారాన్ని నోట్ చేసుకోవటం, ఆపై తన నోట్ ప్యాడ్ లో కంపోజ్ చేయటం, తగిన ఫొటోస్ ని జతపరిచి తన ఆర్టికల్ ని దాదాపు పూర్తిచేయటమైంది. ఫెయిర్ చేసి పంపటమే ఇక. హైదరాబాద్ కి వెళ్లాక చెయ్యొచ్చులే అని సర్దివుంచింది. మరుసటిరోజు ఉదయం అందరూకల్సి అల్పాహారం చేస్తున్నప్పుడు సావిత్రి అడిగింది వినీత్ ని, "అమ్మాయికి మన కాఫీతోటలు చూపించావా ఇంతకూ" అంటూ. లేదమ్మా ఇవాళే తీసుకెళ్తానని చెప్పాడు. "ఇప్పుడిక వెళ్లండి మధ్యాహ్నం భోజనం టైముకి రావొచ్చు" అని చెప్పిందామె.

వినీత్ జీపు ఆపగానే దిగి చుట్టూ పరికించి చూసింది చారుమతి. "వావ్..కాఫీ పూల వాసనా ఇది?" అంది.

"రోజూ చూస్తూనే ఉన్నావుగా. ఇవాళే చూస్తున్నట్లు మాట్లాడుతున్నావేం" అన్నాడతను.

"లేదు వినీత్! పనిలో పడితే చుట్టూ పరిసరాలు గమనించటమే తెలియదు నాకు. నిజంగా ఇప్పుడే వీటి సువాసనని ఎంజాయ్ చేస్తున్నా. అచ్చం మల్లెపూల వాసనే కదూ?" అని అడిగింది వినీత్ సమాధానాన్ని ఆశించకుండానే.

తోటలమధ్యకు నడిచాక , తోటని తడుపుతున్న నీటితుంపరలతో ఆడింది కొద్దిసేపు.

"అన్నట్లు మీకిక్కడ హోం లేదా" అని అడిగింది.

"అటుచూడు..ఆ చిన్న కుటీరం ఉంది కదా అది మాకోసమే కట్టుకున్నాం. మా బంధువులు, ఫ్రెండ్స్ ఎప్పుడైనా సరదాగా స్పెండ్ చేయాలంటే ఇక్కడికే వస్తాం. ఎప్పుడైనా వూఫర్స్ వస్తే వాళ్లకి అకామిడేషన్ ఇదే" అంటూ అటు దారితీశాడు.

చారుమతి వినీత్ వెంటే నడుస్తూ "వూఫర్స్ అంటే ?" అడిగింది.

"వరల్డ్ వైడ్ ఆపర్చునిటీస్ ఆన్ ఆర్గానిక్ ఫార్మ్ స్ ..ఇదో గ్లోబల్ కమ్యూనిటీ. ఆస్ట్రియా, ఇజ్రాయిల్, స్విస్, స్వీడన్, అమెరికా, పోర్చుగల్, జర్మనీ..ఇలా ప్రపంచవ్యాప్తంగా పనిచేస్తుందిది. ఆర్గానిక్ వ్యవసాయం పై అవగాహన, వారి అనుభవాలు షేర్ చేసుకుని, తగిన సలహాలిచ్చే స్వచ్ఛంద సంస్థ. వీళ్లంతా ఆర్గానిక్ కాఫీ పంటల కోసం కలిసి కృషిచేసేందుకు ఐడియాస్ ఇస్తారన్నమాట. ఈ వాలంటీర్స్ కి మనం చెల్లించేదేమీ ఉండదు. ఆహారం, వసతి ఏర్పాటుచేస్తే చాలు. వీళ్లని ఎకో-ఫ్రెండ్లీ యాక్టివిస్ట్స్ అనొచ్చు. ఒకరకంగా ఎకొలాజికల్లీ సౌండ్ గ్రోయింగ్ మెథడ్స్ ని ప్రచారంచేస్తారు. నేనూ ఈ వూఫ్ లో సభ్యుడ్నే. ఇంతకుముందు స్విట్జర్లాండ్, స్వీడన్ వెళ్లొచ్చా. మేము రైతుల్ని కలుస్తాం. మాట్లాడుతాం. ఒకరి భావాల్ని మరొకరు ఎక్స్చేంజ్ చేసుకుంటాం. "వివరించాడు.

వినీత్ వ్యవసాయం చేస్తాడని చారుమతికి ఇప్పటికి తెలిసింది. ఇప్పటిదాకా అడగాలన్న ఆలోచనే రాలేదు.

"ఓ! నీవు అగ్రికల్చర్ ఎమ్మెస్సీనా?" అంది వెంటనే.

"ఎన్వైరన్మెంటల్ సైన్సెస్" అని చెప్పాడతను.

"వెరీ నైస్" అంది అప్రయత్నంగా.

"అయితే నువ్వు పూర్తిగా ఆర్గానిక్ మెథడ్ లో వ్యవసాయం చేస్తావా?"

"అవును. పెస్టిసైడ్స్ కి బదులుగా మేమే కంపోస్ట్ తయారుచేస్తాం. కాఫీ బీన్స్ ద్వారా వచ్చే వ్యర్ధాలతో. మరిక నీటికోసం భూమిని డ్రిల్ కూడా చేయం. అటుచూడు అదే మేము వర్షపునీటిని స్టోర్ చేసే రింగుబావి. ఆనీటితోనే తోటలకు నీరు పడ్తాం. నీరు వేస్ట్ అవకుండా అలా స్ప్రింకిల్ చేస్తాం. ఇందాక నువ్వు ఆడుకున్నావుగా ఆ తుంపరలతో" నవ్వాడు గుర్తుతెచ్చుకొని.

తానూ నవ్వి "ఇంట్రెస్టింగ్" అంది.

తోట మధ్యలోని బాటవెంట నడుస్తూ ఆ కుటీరం మెట్లు ఎక్కారిద్దరూ. చిన్న వరండాతో, ఒక హాలు, వంటగది తో చాలా సింపుల్ గా ఉంది. సెల్లార్ వదిలి ఫస్ట్ ఫ్లోర్ పై కట్టారు. పైకి వెళ్లాక వరండానుంచి చూసినా, హాలులోనుంచి చూసినా చుట్టూ కూర్గ్ అంతా కనిపించేలా ఉంది. ఆ హాల్లో ఓ చిన్న సిడి ప్లేయర్ కూడా వుంది. అక్కడున్న సిడిలు అన్నీ ఒకమారు ఆసక్తిగా చూసింది. అందులో ఒకటి వినీత్ బొమ్మతో వున్న సిడి కంటబడటంతో

"వావ్ వినీత్! నువ్వు ఫ్లూట్ వూదుతావా? గ్రేట్!" అంటూ ఆ సిడి ఆన్ చేసింది.

" మా చెల్లెలు స్వర రికార్డ్ చేసింది" అని స్వర వివరాలు చెప్పగానే

"ఓ!స్వర! తనని తప్పకుండా కలవాల్సిందే" అంది ఉత్సాహంగా.

ఇంతలో మెల్లగా మొదలైన వేణునాదం లోయల్లో వున్న భ్రాంతిని కలుగచేస్తోంది. అది సమ్మోహనమై చారుమతి హృదయాన్ని వశపరుచుకొన్న మాట నిజం. పద వరండాలో కూర్చుందామంటూ వినీత్ బయటికి నడిచాడు. అక్కడి నిశ్శబ్దపు ఉనికిని పెంచుతూ సన్నగా వినిపిస్తున్న వేణునాదం వింటూ కూర్చున్నారిద్దరూ.

చుట్టూ గాలిని గుండెలనిండుగా పీలుస్తూ కన్నులనిండా పచ్చదనాన్ని నింపుకొని

" ఈ వేణువు గుండెలనిండుగా గాలిని తీసుకుని దాన్ని గొప్ప పాటగా మారుస్తుంది కదూ? ఇది వింటుంటే ఇక్కడే ఉండిపోతే బాగుండనిపిస్తోంది వినీత్! చాలా ఎనర్జిటిక్ గా ఉంది " మృదువైన స్వరంతో పలికింది.

"అలా అంటావ్ గానీ ఎందుకు ఉండిపోతావ్ చారుమతీ!" స్థిరంగా పలికాననుకున్నాడుగానీ, కొద్దిగా వణికిన గొంతుని దాచుకోలేకపోయాడు.

"నిజమే" నిట్టూర్చింది అదేమీ గమనించని చారుమతి. "ఏ దేవతలో కనికరించి వరమివ్వాలి కానీ ఇక్కడుండే అదృష్టం ఎలా వస్తుంది?" అంది.

"నిజమే కొన్ని దేవతలు ఇవ్వాల్సిన వరాలే!"అనుకుంటూ వినీత్ తన కళ్లలోకి చొరవగా చొరబడుతున్న సువర్ణ సుందర స్వప్నాన్ని మనసులోనే నిక్షిప్తంచేశాడు. అతని జీవితంలోకి ఓ నీలికళ్ల అమ్మాయి అమాయకంగా ప్రవేశించింది మరి!

చుట్టూ పచ్చదనాన్ని ఉల్లాసంగా పరికిస్తున్న చారుమతి కి చిగురాకా కదలకే పాట గుర్తొచ్చింది . హం చేస్తున్న ఆరాగానికి వినీత్

"ఈ పాట నాకు తెలుసు. అమ్మ పాడుతుంది" అన్నాడు.

“అవునా ?” అంది చిరునవ్వు మోమున కొద్దిపాటి ఆశ్చర్యాన్ని పులుముకొని.

“నాకు ఇందులో నచ్చే చరణం –కాటుక కన్నుల్లో కరిగే నును సిగ్గు తడి– ఎందుకో ఈ లైన్ నన్ను బాగా ఆకట్టుకుంటుంది” అన్నాడు.

అతనలా అనటానికి కొన్ని నెలలుగా అతనిని వెంటాడుతున్న కాటుక కన్నులే కారణం కావొచ్చు.

"భలే . నాకైతే –గోరింటపొదరింట్లో జడగంటల సందళ్ళు, తోటచెరువు నీడలో తోడుండి చూడవే– బాగా నచ్చేది” అంది.

ఉలిక్కిపడ్డాడు వినీత్. ఇందాకే కాఫీ మొక్కల మధ్య తామిద్దరి నీడల్ని చూసినప్పుడు ఏ జన్మనుంచో పరిచితమైనట్టు అనుభూతి కలిగిందతనికి. “తోట చెరువు నీడలో తోడుండి చూడవే.”.. . ఎన్నిసార్లో విన్నప్పటికీ ఇవాళెందుకో ఈ వాక్యంలో సరికొత్త అర్థాలు, రాగాలు ముసురుకున్నాయి వినీత్ మనసునిండా. ఇప్పుడు ఆమె పాడి వినిపించిన ఆ చరణం అతడి మదిలో జేగంటలు మోగించింది. అదేమీ పట్టని చారుమతి ఏదేదో మాట్లాడుతూనే ఉంది..

అప్పుడే రెండు కాఫీ కప్పులతో ప్రత్యక్షమయ్యాడు అక్కడ పనిచేసే చిన్నప్ప. కాఫీటేబుల్ మీద పెట్టి వెళ్లిపోయాడు. అందించిన కాఫీ కప్పుని విచిత్రంగా చూస్తూ ఎందుకు అంది చారుమతి. అరె కాఫీ తాగు అన్నాడతను.

"కాఫీనా! నేనా! నో వే "అంది.

"కాఫీ తాగవా!” ఆశ్చర్యపోయాడు.

"అవును నాకు సహించదు" అంది.

"ఎప్పుడైనాతాగి చూశావా సహించకపోటానికి "అడిగాడు.

"ఆ వాసనే పడదు నాకు. తాగి చెప్పక్కర్లేదు మరి!"అంది.

ఈనాలుగురోజులూ హోం స్టే లలో కాఫీ ఆఫర్ చేస్తుంటే తాగలేదు. బయట తాగదేమో అనుకున్నాడు కానీ అస్సలు తాగదని తెలియదు. ఇంట్లో కూడా అంత అబ్జర్వ్ చేయలేదు.

" కాఫీ తాగకపోవటం నీ ఇష్టం. కానీ నేను తాగితే నీకిప్పుడు అభ్యంతరం లేదుగా ?"అడిగాడు.

"నాకెందుకుంటుంది?” అంది.

దూరంగా కాఫీ గింజల ప్రాసెసింగ్ జరుగుతోంది. కాఫీగింజల గుబాళింపు నాసికాపుటాలకు తగుల్తోంది. కాఫీ పూల పరిమళం మత్తెక్కిస్తోంది ఆ వాతావరణాన్ని. కాఫీగింజల ఆరోమా, కాఫీ పూల బ్లోజంస్ నచ్చాయి చారుమతికి ! ఇవే చారుమతి మనస్థితిలో మార్పు తెచ్చాయేమో మరి వినీత్ వైపు ఎందుకో చూసింది.

కాఫీ ని సేవిస్తున్న వినీత్ కళ్లల్లో వింతకాంతిని చూసింది చారుమతి. ఎక్కడలేని వెలుగూ, ఉత్తేజం కనిపించాయి ఆ కళ్లలో.చారుమతి తనని గమనించిందని అర్థమైంది వినీత్ కి. కొద్దిసేపు ఒకరికి మరొకరు ప్రభావితమయ్యారు. ఎదుటివారు ఆ వేవ్ లెంగ్త్ ని పట్టేసుకుంటే ఎలా అనుకొని ఎవరికివారే ఏమీ ఎరుగనట్లు ఒకరినొకరుచూసుకొని చిరునవ్వుతో అప్పటి సమయాన్ని తేలికపరిచారు.

అయితే వినీత్ కి తెలియని విషయం ఒకటుంది. అదీ..చారుమతిని చూసేటప్పుడు తన కళ్లల్లో కనిపించే వెలుగు ని చారుమతి ఏనాడో కనిపెట్టేసిందని. ఆమె గుండెలో అతనిపట్ల స్నేహం ఉందో లేదో ఇంకా తెలియదు వినీత్ కి. తెలుసుకునేంత శక్తి అతనికి ఉందా లేదా అని కాదు మనమిక్కడ చర్చించాల్సిన విషయం. చారుమతి అంత సులువుగా తన మనసుని పరిచే అమ్మాయికాదు. తనకిష్టంలేని వ్యక్తులకు ఎంత త్వరగా విసుగునీ, అయిష్టతనీ తెలియచేస్తుందో తాను ఇష్టపడిన వారికి ఒక పట్టాన దాన్ని వ్యక్తపరచని లోతైన గాఢత ఉంది. నిజానికి అలాంటి సందర్భం వచ్చిందే ఇప్పుడు ! చారుమతి మనసులో వినీత్ పై ప్రియ భావనలు మొసులెత్తాయన్నది వాస్తవం. అతను ఆ అమ్మాయి మదిని వికాసము కలిగించిందీ వాస్తవమే! అయితే, వినీతే కాదు, చారుమతి కూడా ఎరుగదా విషయం! అందుకు సరైన సమయం రావాలి.

ఇద్దరూ లేచి కిందకువచ్చారు. మధ్యమధ్యలో ఉన్న వేరే మొక్కల్ని చూసి అవేంటని అడిగింది. మిరియాల మొక్కలని చెప్పాడు.

"ఓ! మిరియాల పంట కూడా ఉంటుందా మధ్యలో "అని ఆశ్చర్యపోయింది చారుమతి.

"యాలకులు కూడా" అన్నాడు.

ఇంతలోనే పచ్చి మిరియం గింజని నమిలింది.

"అబ్బ..ఖారం..బాబోయ్" అంది.

"నీ నోరు తీపిచేస్తానుండు "అంటూ ముందుకు కదిలాడు వినీత్.

"అదెలా?"అడిగింది.

"ఇక్కడ ఈ ఎత్తైన చెట్లకు తేనెపట్లు ఉన్నాయిగా" అన్నాడు.

"తేనె కూడా పండిస్తారా ?"అంది.

నవ్వొచ్చింది అతనికి.

"తేనెటీగల పెంపకం అన్నమాట. తేనె ని సహజంగా ప్రొడ్యూస్ చేస్తాం. "

"అదీ బిజినెస్ చేస్తారా మీరు?" అనడిగింది.

"మన వాళ్లందరికీ కొంత పంచుతాం. మిగిలింది బిజినెస్ చేస్తాం అంటే ఎక్స్ పోర్ట్ చేస్తామన్నమాట " అంటూ అక్కడ పనిచేస్తున్న వాళ్లలో ఒకరిని పిలిచి తాజా తేనె పట్టుకు రమ్మన్నాడు. అక్కడ అందరితో వినీత్ ఆత్మీయతతో మాట్లాడటం గమనించింది చారుమతి.

"నీకు వ్యవసాయమంటే అంతిష్టమా" అడిగింది.

"ఇష్టం అని చెప్తే సింపుల్ గా చెప్పటమే అవుతుంది. ఈ తోటలు చూసావుగా? ఇది నిజంగా నా కలల కలబోత." గుండెనిండిన పలుకులవి.

"కలబోత! అవును..కనిపిస్తూనే ఉంది. యాలకులు, మిరియాలు, తేనె..అన్నింటినీ మించి నీ కిష్టమైన కాఫీ!" నవ్వింది. వినీత్ కూడా నవ్వాడు.

"అవునూ ఈ మిరియాలకు అంత డిమాండ్ ఎందుకు?" అడిగింది.

"మిరపకాయలకంటే ఆరోగ్యానికి ఇవే మంచివి. వీటిని చూసేకదా పోర్చుగీసువాళ్లు అట్రాక్ట్ అయింది ఇండియాకి? నీకో విషయం తెలుసుకదా! మిర్చి మన పంట కాదు. బ్రెజిల్ నుంచి వచ్చిందని?" అడిగాడు.

"నాకు తెలియకపోవటమేమిటి? నేను గుంటూర్ లో పుట్టాను. గుంటూరు మిరపకాయలకు, గోంగూరకూ ఫేమస్ కదా!" అంది వెంటనే!

"అవునవును" అన్నాడు.

"ఏంటి అవునవును. నేను గుంటూరులో పుట్టినట్లు నీకు తెలుసా?" అంది ఆటపట్టిస్తూ.

"భలేదానివే చారూ! మిర్చి, గోంగూర ఫేమస్ అన్నావని అవునన్నాను" అన్నాడు.

"నన్ను చారూ అనకు మా నాన్న పిలుస్తారలా. ఇంకెవ్వరూ పిలవకూడదు" కయ్యిమంది. అమ్మో కష్టమే ఈ అమ్మాయితో అనుకున్నాడు.

ముందుకు పరుగులుతీస్తూ కూనిరాగాలు తీసుకుంటూ తోటంతా కలయతిరుగుతున్న చారుమతిని చూస్తే బహు ముచ్చటేసింది అతనికి.

కూనిరాగం కూడా గాలిలో పూల పరాగాలను తోడు తెచ్చుకున్నట్లుంది.

"చారుమతీ! పాట పైకే వినిపించకూడదూ నీలో నువ్వే పాడుకోకపోతే" అన్నాడు.

తలతిప్పకుండానే కళ్లను తిప్పి నిశితంగా చూసింది. "నేను నాకోసం పాడుకుంటున్నానిప్పుడు" అంది

"అమ్మో మిర్చి ఘాటు!"అనుకున్నాడతను.

"అలాంటప్పుడు ఎదుటివారికి వినిపించకుండా పాడుకోవాలి" అన్నాడు శాసిస్తున్నట్లు.

"అబ్బో చేదు కాఫీ!" అన్నట్లు చూసింది అతన్ని

ఇద్దరూ సరిపోయారు.

ఇంతలో ఆకు దొనెలో తేనె వచ్చేసింది.. అది రుచి చూశాక చారుమతికి నిజమైన తేనె రుచి ఏంటో తెలిసింది.

"సూపర్ మార్కెట్స్ లో కొనే తేనెకి దీనికీ బోలెడంత తేడా ఉంది టేస్ట్ లో" అంది.

"అవును. దాంట్లో బెల్లం, పంచదార పాకాన్ని కలుపుతారు " అంటూ.."ఎక్కువగా తినకు. నాలుక కోసినట్లు అవుతుంది "అని వారించాడు.

అతనివైపు చూసి "నువ్వు తినవా?" అని అడిగింది. "లేదు. నేను కాఫీ తాగానుగా ఇప్పుడే "అన్నాడు.

" కాఫీ తాగితే ఆరోగ్యం పాడవదా?" అంది తాను చదివిన ఆర్టికల్స్ గుర్తొచ్చి.

"ఎక్కువసార్లు తాగితే కదా! రోజుకు రెండు లేదా మూడు సార్లు. పైగా ఇది ఆర్గానిక్ అండ్ ప్యూర్ హాని ఉండదు" అన్నాడు.

ఆ అమ్మాయి కాఫీ తాగని విషయాన్ని అసలు వదలదల్చుకోలేదు వినీత్. కావాలనే "అయితే కాఫీ రుచి ఎప్పటికి తెలుసుకుంటావ్? అన్నాడు.

"దాన్ని రుచి అంటారా ఫన్నీ" అంది.

"ఇంత గొప్ప ఆరోమా నచ్చకపోవటం ఫన్నీ" అన్నాడు

కోపమొచ్చేసింది చారుమతికి.

"యూ కాంట్ సే దట్. అన్నీ అందరికీ నచ్చాలని లేదు"

"కావొచ్చు కానీ కొన్ని గొప్ప విషయాల్ని మిస్ అవుతున్నావని చెప్తున్నా"

"నచ్చేవి దొరకనప్పుడు మిస్ అవటం అంటారు"

"అదేమీ కాదు కొన్నింటి విలువ తెలుసుకోలేనప్పుడు కూడా అనొచ్చు"

"అంత విలువైనదేంటీ? నాకాశ్చర్యం అనిపిస్తుంది "అంది

"అవును కలిసి కూర్చొని కాఫీ తాగితే తెలుస్తుంది ఆ విలువ" అన్నాడు.

"ఒకవేళ ఆ విలువ తెలియని అమ్మాయి నీకు భార్యగా దొరికితే ఏంచేస్తావ్?"అంది విసురుగా

"అలాంటి టేస్ట్ లేని అమ్మాయిని నేను అస్సలు చేసుకోను" అన్నాడు

టేస్ట్ లేని అనటం కోపం తెప్పించింది చారుమతికి.

ఏమనుకుంటున్నాడు? కాఫీ తాగకపోవటం టేస్ట్ లేనివాళ్లకిందకొస్తుందా! అంతమాట అంటాడా బుస్సున లేచింది వినీత్ మీదకి.

"నీకసలు కాఫీ తాగని అమ్మాయే వస్తుంది చూసుకో"

"నేనసలు కాఫీ తాగని అమ్మాయిని చేసుకోను గాక చేసుకోను" అన్నాడతను పంతంగా .

"నీకలాంటి అమ్మాయే వస్తుంది..వచ్చితీరుతుంది"అని గట్టిగా అరిచింది.

ఏదో సరదాగా మాట్లాడబోతే విషయం సీరియస్ గా మారిందే అనుకున్నాడు వినీత్. ఇక సమాధానమేదీ ఇవ్వలేదు.

మరుసటిరోజే చారుమతి తిరిగి హైదరాబాద్ కి ప్రయాణం. మధ్యాహ్నం భోజనాలు అయ్యాక వరండాలో తిరుగుతుంటే వినీత్ తన గదిలోనే కనిపించాడు. తను రేపే ఊరికివెళ్తోంది కదా మళ్లీ కలవటం కుదరకపోవచ్చేమో ! నిన్నటి చిన్నపోట్లాట గుర్తొచ్చింది చారుమతికి. ఇక వెళ్లబోతూ అలా వెళ్లిపోవటం ఇష్టంలేదు. ఒక స్నేహపూర్వక వాతావరణాన్ని నింపుకొని వెళ్లాలనే ఉద్దేశంతో అతని గదివైపుకు నడిచింది. గది ముందుకు వచ్చి తలుపుపై తట్టింది. డ్రాయింగ్ టేబుల్ దగ్గర కూర్చొని ఏదో కంపోజ్ చేస్తున్నాడు వినీత్. తలుపు దగ్గర అలికిడికి తలెత్తి చూసి , నవ్వుతూ"రా చారుమతీ" అంటూ లేచాడు. చారుమతి మొదటిసారి అతని గదిలోకి రావటం. అడుగుపెడుతూనే విభ్రమంగా చూసింది. అతని గది అంతా యాంటిక్ లుక్ వచ్చేలా అమర్చుకున్నాడు . ఒక పెద్ద వుడెన్ వేజ్ లో బోలెడన్ని వేణువులు ఉన్నాయి. ఒక పురాతన అద్దాలబీరువా నిండా ఏవేవో పుస్తకాలు. "ద వన్ స్ట్రా రివల్యూషన్" మొదలుకొని "కంపెండియం ఆఫ్ కాఫీ రిసెర్చ్ ఇన్ ఇండియా", అమెరికా లోని మయన్ రైతుల "ఆర్గానిక్ కాఫీ","కాఫీ కల్టివేషన్ గైడ్", "బయో ఫర్టిలైజర్ అండ్ ఆర్గానిక్ ఫామింగ్" ఇంకా ఏవేవో వ్యవసాయానికి సంబంధించిన దేశ, విదేశీ గ్రంధాలు. ఒక చిన్న బుక్ రేక్ లో "రొబస్టా, అరబికా కాఫీ" రిసెర్చ్ జర్నల్స్. ఇవేమీ తనకి సంబంధించినవి కాదని అర్థమైంది చారుమతికి.

వేణువుల దగ్గరికి వెళ్లి వాటిని ఒక్కొక్కటీ తీసి పరీక్షగా చూస్తోంది. "నీకు కావాలంటే తీసుకోవచ్చు" అన్నాడు వినీత్.

"నాకు వేణువు పలకదు" అంది.

"నీకిష్టమైతేనే కదా పలికేది!?" అన్నాడు వినీత్. ప్రశ్నార్ధకంగా చూసిందతనివైపు.

కలవరపడి వెంటనే "నీకు నేర్చుకోవాలన్న ఇష్టం వుంటేనే కదా పలికేది అంటున్నా" అన్నాడు.

"అలాని ఏమీ కాదు. ఇదివరకు నాన్న వైజాగ్ బీచిలో ఏక్ తారలు అమ్మే అబ్బాయి అద్భుతంగా ఏక్ తారను మోగించటం చూసి, ఇష్టపడి రెండు కొనుక్కొచ్చారు. ఇంటికి వచ్చి చూడబోతే అవి నాన్నకి తీగ శబ్దాలే వచ్చాయి.

"ఆ అబ్బాయి మోగించాడుకదా అని తెచ్చుకుంటే ఎలా? కొంటేచాలు ఏవరైనా మోగించొచ్చా అనుకున్నారా? " అంది అమ్మ. "ఇది మోగుతుందన్న మాట నిజమే కానీ నాకూ మోగుతుందనుకోవటం ఏంటో!?" అన్నారు నాన్న" గుర్తుకుతెచ్చుకొని మరీ నవ్వింది చారుమతి. ఆ సన్నివేశాన్ని వూహించుకున్న వినీత్ కీ నవ్వాగలేదు.

నవ్వుతుంటే సొట్టలుపడిన అతని బుగ్గలని చూసి చారుమతి ఒక్క క్షణం ఒక మధుర భావనకి లోనై, మనసు పూలతీవె విరగపూచినట్లైంది .అదే క్షణంలో ఆ అమ్మాయి నవ్వుల్లో వెలుగుల్ని చూశాడు వినీత్.

ఆ నవ్వుల చాయల మధ్య "అలాగనికాదుగానీ, నీకు నచ్చితే తీసుకోమన్నాను. ఫ్లూటే కాదు, ఇక్కడున్న ఏ యాంటిక్ పీస్ అయినా నీవు తీసుకోవచ్చు "అన్నాడు.

"నేనేమడిగినా ఇస్తావా? "అంది తన హృదయం చేసే వింత స్పందన నుంచి బయటపడటానికి.

"నీకిక్కడ ఏది నచ్చినా తీసుకోవచ్చు" అన్నాడు ఆమె ధ్యానం లో పరధ్యానంగావున్న వినీత్.

ఆమె దృష్టి అద్దాలబీరువా పక్కన గోడకున్న అలమరలో ఓ నగిషీ చెక్కిన చెక్కపెట్టె పై పడింది.

"వావ్! భలే ఉంది ఈ బుజ్జి పెట్టె. అందులో ఏముంది !?"అని అడుగుతూ అటు కదిలింది.

అతను ఆదుర్దాగా "అది మాత్రం ఇవ్వను "అన్నాడు. ఆమెకన్నా వేగంగా ముందుకు కదిలాడు.

ఆ పెట్టె అందుకోబోతున్న చారుమతిని అడ్డుకున్నాడతను. ఆమెకి అందులో ఏముందో అన్న కుతూహలం కన్నా అతనిని ఏడిపించాలనిపించింది. అదాటున పెట్టెని అతని చేతిలోనుంచి లాక్కోవటంతో పెట్టె గొళ్లెం ఊడిపడి మూత వెనక్కి పడిపోయింది. ఆ పెట్టెనుంచి కస్తూరి పరిమళం వస్తోంది. కంగారుగా వినీత్ దాన్ని మూయాలని ప్రయత్నంచేస్తుంటే చారుమతి పెట్టె అందకుండా వెనక్కి దాచేయటంలో అందులోని వస్తువు కింద పడిపోయింది. ఇద్దరూ అటువైపు చూశారు. తెల్లని కుర్తా..గంధం మరకలతో. నెమ్మదిగా కదిలివెళ్లి ఆ కుర్తాని చేతుల్లోకి తీసుకుంది చారుమతి. ఒక చేత్తో గంధాన్ని తీసుకుని రాగిణి బుగ్గపై రాయాలన్న ప్రయత్నం, మరో చేత్తో పన్నీరుబుడ్డి తో విసురుగా చల్లిన పన్నీరు! ఇదిగో ఇప్పుడు ఈ తెల్లని కుర్తాపై నాలుగువేళ్ల గంధం చిహ్నాలు ప్రత్యక్షమయ్యాయి. సంభ్రమవిభ్రమాలతో అతనివైపు చూసింది. ఆరోజు పట్టనట్లు వెళ్లిపోయిన అతను ఇంత పట్టి ఉంచుకున్న ఈ అనుభూతి. ఏమనుకోవాలి? ఆమె చూపులకు అతను పట్టుపడ్డ దొంగలా తలదించుకున్నాడు. ఆ చొక్కాని అతనిచేతిలో పెట్టి ఆమె సందిగ్ధావస్థతో బయటికి వచ్చేసింది.

నిన్న తను పట్టుపడ్డప్పటినుంచి చారుమతికి ఎదురుపడటంలేదు. కారణం చారుమతికి తనపట్ల ఎటువంటి ఫీలింగ్స్ ఉన్నాయో తెలియదు. అలాంటప్పుడు తన మనసు తెలియచేసినవాడయ్యాడు కదా! దానికి ఆ అమ్మాయి ఎలా రియాక్ట్ అవుతుందో అనే వినీత్ కలవరపడుతున్నాడు. మనసులో ఇంత ఉంచుకొని ఏమీలేనివాడిలా నటించాడు అనుకోదా!? అసలు చారుమతి తనగదిలోకి వస్తే వచ్చింది. తను ఏమైనా తీసుకో అంటూ కోతలుకోయటమెందుకు అని తననితానే తిట్టుకుంటున్నాడు.

చారుమతి వూరికెళ్లేరోజు ఉదయం అందరూ మధ్యహాల్లో కూర్చుని తననీ పిలిచారు. ఆ ఉదయమే స్వర కూడా వచ్చింది. మలేషియా లో తన మ్యూజిక్ ప్రోగ్రాం గురించి, తన ఆల్బం అక్కడే రిలీజ్ చేశామని చారుమతికి చెప్తోంది. చారుమతికి తన మ్యూజిక్ ఆల్బం ఒకటి ఇచ్చింది. అప్పుడే సావిత్రి, ఆనంద్ పిలవటంతో వినీత్ కి అక్కడ కూర్చోక తప్పలేదు. ఇంతలో సావిత్రి చారుమతిని ఒక కీర్తన పాడమని అడిగింది. ఎక్కువ బతిమాలించుకోకుండా తూము నరసిం హ దాసు కీర్తన పాడింది. విచిత్రమేమోగానీ అది కాఫీ రాగము లో కూర్చిన కీర్తనే!

"దొరవలె కూరుచున్నాడు..మెరుగైన చేమంతి విరుల దండలు చాలా

ముఱియుచు ధరియించి ముదిత సీతను గూడి "

వినీత్ తప్ప మిగతా ముగ్గురూ అద్భుతంగా ఉందన్నారు. పాడుతున్నంతసేపూ , అందులో " మురియుచు ధరియించు ముదిత సీతను గూడి" అన్నప్పుడు , వాళ్లు వినీత్, చారుమతిని ఊహించుకున్నారు.

వినీత్ కీ అద్భుతమే! కానీ ఇప్పుడు తనని అభినందించే ధైర్యంలేదు. పాట మొదలుపెట్టేముందు చారుమతి, తనని చూసిన చూపు తనకి అర్థంకాలేదు. బెదిరింపు చూపులా కొంపదీసి అనుకున్నాడు. "దొరవలె .." అని తనసుద్దేశించి విరుపుగా పాడిందాయేం అని సందేహమొచ్చింది.

మరో పాట పాడమని సావిత్రి అడిగింది. కాదనకుండా వెంటనే "జగద్ధోద్ధారణ..అడిసిదళె యశోద" అంటూ జగదోద్ధారకుడైన కృష్ణుడిని యశోద తన చిన్నకొడుకుగా భావించుకుని ఆడిన వైనం! ఆ మాతృత్వపు మమకారం! చారుమతి చక్కగా ఆలపించింది. నిజంగా సావిత్రి తేరుకోలేకపోయింది. అక్కడ ఎవరికివారే స్తబ్ధులైపోయారు. ఒక దివ్యత్వం అలుముకున్నట్లైంది. ఇంతలో అక్కడికి వచ్చిన వంటమామ్మ చారుమతి బుగ్గలు పుణికింది.

చారుమతి బయలుదేరేముందు సావిత్రి మైసూరు సిల్క్ చీర పెట్టింది. చారుమతి సావిత్రి, ఆనందు పాదాలకి వంగి నమస్కారం చేసింది. సావిత్రి ఆ అమ్మాయి నుదుటిపై ముద్దుపెట్టుకుంది. ఆమె కళ్లు తేమతో నిండిపోయాయి. వున్నన్నాళ్లూ ఇంటినిండా ఎంత సందడిని చేర్చింది! మహాలక్ష్మి తిరిగినట్లు అనిపించింది ఈ కొద్దిరోజులూ. అన్నింటినీమించి చారుమతి ఆ ఇంటికోడలుగా రావాలన్న వారి ఆకాంక్ష నెరవేరుతుందా అనే చింతకూడా లేకపోలేదు. వెళ్లొస్తానని చెప్పిన ఆ అమ్మాయి ని దగ్గరికి తీసుకుంది వంటమామ్మ. ఇన్నాళ్లూ వెంటవెంట తిరిగి కబుర్లుచెప్పిన చారుమతి అంటే ఆపేక్ష కలిగిందామెకు.

“పిన్నీ వాళ్లు టూర్ లో ఉన్నారట. మైసూరులో రైలు ఎక్కించిరా చారుమతిని” అని చెప్పటంతో వెళ్లకతప్పలేదు వినీత్ కి. కారులో వినీత్, చారుమతి మాత్రమే బయలుదేరారు.

కూర్గ్ అంతా ఏదో రహస్యాన్ని దాస్తున్నట్లు నిశ్శబ్దంగా వుంది. దారి కూడా మౌనంగా పరిగెడుతోంది. ఏం మాట్లాడాలో ఇద్దరికీ అర్థం కాలేదు. వినీత్ కి ఎన్నో సంజాయిషీలు చెప్పాలని వుంది. కానీ ఎలా మొదలుపెట్టాలో తెలియలేదు. తాను ఇప్పుడు చెప్పకపోతే ఎప్పటికీ చెప్పలేడు. తన మనస్సుని విప్పి చెప్పాల్సిన సమయమిదే అని మనసెంత పోరుతున్నా అతని బుద్ధి మాత్రం మౌనంగానే వుండమని హెచ్చరించింది. ఎందుకంటే "ఆ అమ్మాయి వాటికెలా స్పందిస్తుందో మరి!"అంటూ. చారుమతి కి ఎన్నో ప్రశ్నలు అడగాలని వున్నా సరైన సమాధానాలు రాని పక్షంలో తనకి అవమానం. అందుకే మెదలకుండా వుంది. కారులో ఏదో మ్యూజిక్ రికార్డ్ పెట్టాడు. సరోద్ వినిపిస్తోంది. అదేదీ గుండెదాకా చేరటంలేదు. అలా ఎంతసేపని? తమింటికి వచ్చివెళ్తున్న చారుమతిని అంత నీరవంగా ఉంచటం ఇష్టంలేక వినీత్ మాట్లాడటం మొదలుపెట్టాడు. చారుమతి మేగజైన్స్ గురించి అడిగాడు. వాటి వివరాలతో క్లుప్తంగా బదులిచ్చింది. గలగలా మాట్లాడే అమ్మాయికాస్తా మౌనంగా, ముక్తసరిగా ఎందుకుందో తెలియనిది కాదు వినీత్ కి.

కొద్దిసేపైనాక "చారుమతీ! నిన్నేమైనా నేను ఇబ్బంది పెట్టి వుంటే రియల్లీ సారీ" అన్నాడు.

నవ్వింది చారుమతి. ఆ నవ్వు లో నిర్లిప్తత వుంది. వ్యంగ్యత వుంది. "అంతేకానీ ఇప్పటికీ నిన్ను నీవు ఆవిష్కరించుకోవన్నమాట!” అనే చురుకు వుంది.

సమయం పరిగెత్తుతోంది. కానీ, వారి ఆలోచనలు మాత్రం ఆగిపోయాయి. ఇంతలో రైలు రానేవచ్చింది. రైలు నెమ్మదిగా కదలటంతో జాగ్రత్తచెప్పి కదిలాడతను.

తిరిగి వచ్చేటప్పుడు జాజిపూల మాలల్ని తీసేసిన ఖాళీ బుట్టలా అయిపోయింది అతని మనస్సు. తిరిగి వెళ్లిపోయేటప్పుడు నీళ్లు జల్లిన చేమంతి పూలలా భారమైంది ఆమె మనస్సు.

ఇలా వీళ్లిద్దరూ విడిపోయి, ఒకరి ధ్యాసలో ఒకరు మునిగిపోయి , విరహపడిన వారం రోజులకు వీళ్లిద్దరినీ కలిపే శుభపరిణామం కోసం చర్చలు మొదలయ్యాయి ఇరు కుటుంబాలలో. మధ్యలో జగన్నాథం కుటుంబంకూడా ఉందనుకోండి.

నీకో సంబంధం వచ్చిందంటూ వినీత్ దగ్గర పెళ్లి ప్రస్తావన తెచ్చారు. ఇప్పట్లో పెళ్లి చేసుకోననిచెప్పాడతను. "వాళ్లమ్మాయిని మనింట్లో దించార్రా నీకా పిల్లనిస్తామంటూ" అన్నది సావిత్రి.

"అమ్మా! అలా ఎలా దించుతారు వాళ్లు? ముందు ఆ అమ్మాయిని వాళ్లింట్లో దించేయండి" విసుగ్గా అరిచాడతను. "మేము దించటమెందుకు? నువ్వే రైలెక్కించావుగా "అంది స్వర .

వినీత్ కి ఒక్క క్షణం ఏమీ అర్థంకాలేదు. నేను..రైలు అని నసగటం మొదలుపెట్టాడు

"అవును. నువ్వే మొన్న చారుమతిని రైలెక్కించావుగా" అంది స్వర మళ్లీ .

అయోమయంగా చూస్తున్న వినీత్ తో "వచ్చిన సంబంధం చారుమతే రా" అన్నాడు ఆనందు.

గుండె నూటానలభై వేగంతో కొట్టుకుంది వినీత్ కి.

" ఆ ఉద్దేశంతో ఇక్కడ దించారా ఆ అమ్మాయిని?" ఆశ్చర్యంగా అడిగాడు.

అవునని వాళ్లు తలూపగానే "మరి..చారుమతికీ తెలుసా ఈ విషయం?" అని అడిగాడు అత్యంత ఉద్రేకంతో.

లేదని తలూపారు.

"ఎందుకలా చేశారు వాళ్లు?" విస్మయంతో అన్నాడు.

"వాళ్లకి జ్యోతీ పిన్ని వాళ్లు ఈ సంబంధం ప్రపోజ్ చేశార్రా. జగన్నాధం బాబాయితో ఆరోజు వచ్చారే ఆయన చెల్లెలు, బావగారు అని చెప్పారు గుర్తుందా? వాళ్లే చారుమతి అమ్మా నాన్నలు. మా అందరికీ మీ ఇద్దరి కి పెళ్లి అయితే బాగుంటుందనిపించింది. మేము సంబంధం గురించి చెప్పినపుడు మీరిద్దరూ ఒప్పుకోరేమోనని, పైగా, పెద్దగా పట్టించుకోకుండానే, ఏమాత్రం ఆలోచించకుండానే కాదంటారేమోనని భయపడి పెళ్లిచూపులు ఇలా ఏర్పాటుచేశాం. వాళ్లు పాపం జ్యోతీ పిన్నివాళ్ల సలహాతో ఇక్కడ దింపారు. ఇప్పటి పిల్లలు మేము ఒకరినొకరు అర్థం చేసుకోవటం ముఖ్యం అంటున్నారు. పెళ్లి చూపుల తర్వాత కలిసి తిరిగి ఒకరికి ఒకరు నచ్చకపోతే ఆ సంబంధం వదిలేయాలిగా! మళ్లీ ఇంకో సంబంధం చూసి, మళ్లీ అర్థం చేసుకోవటానికి కలిసి తిరుగుతారా? నచ్చేవాళ్లు దొరికేదాకా అలా చేయటం కన్నా, ఇలా మా ఆలోచన క్షేమం కాదూ? ఒకవేళ మీరిద్దరూ ఒకరికి ఒకరు నచ్చలేదనుకోండి ఇంతటితో ఈ విషయం మనం మర్చిపోదాం. పెళ్లి భావనలతో మీరేమీ తిరగలేదుకదా! " అంది సావిత్రి.

చెప్పిందంతా పెద్దగా వినిపించుకోలేదుగానీ, చారుమతికి తెలియదు వీళ్ల ప్లాన్ అని విన్నాక రిలీఫ్ అనిపించింది వినీత్ కి. "అయినా నా పిచ్చిగానీ, ఇలా అని చెప్తే ఆ అమ్మాయి అసలు ఇక్కడికి వస్తుందా ఏంటి" అనుకున్నాడు వెంటనే. ఈ విషయం ఇప్పుడుకూడా చారుమతికి చెప్పొద్దని సూచించి

"ఇంతకూ నీకు చారుమతి ఇష్టమేనా?" అని అడిగారు వాళ్లు.

మదిలో పొంగిన ఆనందాన్ని కళ్లల్లోకి రానివ్వకుండా"మీకు ఇష్టమే కదా!?" తిరిగి వాళ్లనే అడిగాడు అతను. "మాకిష్టమైతే చేసుకుంటావా?" అన్నారు వాళ్లు.

" మీకిష్టమై మీరు చేసుకోమంటే చేసుకుంటా" అన్నాడతను దొరక్కుండా.

"సూటిగా ఏనాడూ సమాధానమివ్వవు కదా!" అంటూ మొట్టికాయ వేసింది తల్లి నవ్వుతూ.

తల్లితో అలా అన్నాడేగానీ వినీత్ మనసు నిలువలేదు. కారణం మీకు తెలియనిదేమీ కాదు..చారుమతికి తనపై ఎటువంటి భావన వుందో అన్న తలంపే! నాకిష్టమైనంత మాత్రాన సరిపోతుందా తనకీ ఇష్టమవాలికదా అని అనిపించి అతను తనని తాను సంబాళించుకున్నాడు. ఏదో పనిలో వున్న సావిత్రి దగ్గర చేరి

"అమ్మా! మీకు మీరు నిర్ణయాలు తీసుకుంటే సరిపో యిందా? ఆ అమ్మాయి నిర్ణయం ముఖ్యం కదా?" అన్నాడు అమ్మ కొంగు పట్టుకొని.

సావిత్రికి అర్థమై నవ్వుతూ"చారుమతికి ఇష్టమని తెలిశాకే నాన్నా నీ అభిప్రా యం మేము అడిగిందీ!" అంది.

మెరిసే కళ్లతో వున్న కొడుకు ముద్దుగా అనిపించాడామెకు.

★★★★★

ఇప్పుడు మీకు ఉత్సుకతగా వుంది కదూ చారుమతి గురించి!? వాళ్లింట్లో జరిగిన సంభాషణకోసం కొంచెం వెనక్కి వెళ్దాం. ఇంటికి చేరిన చారుమతి కొద్దిగా పరధ్యాన్నంగా వుండటం గమనించారు భామ, గోపాలం. ఎప్పటిలా అభి ఆటపట్టిస్తున్నా మునుపటిలా వుడుక్కోవటంలేదిప్పుడు. పోరా అని విసుక్కుంటోందంతే.

సావిత్రి ఫోన్ చేసింది. చారుమతి వెళ్లాక ఇల్లంతా బోసిపోయిందనీ చెప్పింది. చారుమతి వచ్చినది మొదలు, వెళ్లేదాకా అక్కడి విషయాలను చెప్పింది. ఆమె మాటలనుబట్టి చారుమతి అక్కడ ఉత్సాహంగానే వుంది. ఇప్పుడేమో ఉదాసీనంగా ఎందుకుందో అనుకుంటూ భామ కూతురిని కదిలించింది కూర్గ్ విశేషాలు చెప్పమంటూ. మధ్యలో,

"వినీత్ సాయం చేశాడా మరి ?"అని అడిగింది కూడా , చారుమతి ఎలా స్పందిస్తుందో చూద్దామని.

"ఆ..పెద్ద సాయం చేయకేంచేస్తాడు? జీపుందిగా. తీసుకెళ్లాడులే" అంది ఉక్రోషం మాటల్లో.

అలా ఎందుకున్నావని గోపాలం చిన్నగా బుజ్జగించి అడిగాక చెప్పేసింది గంధం అంటిన కుర్తా సంగతి, ఆ విషయమై వినీత్ మౌనంగా మారిన సంగతి. కలువ కన్నుల రెప్పలమాటున తడి.. కోమల కంఠస్వరం లో వణుకు! వినీత్ అలా వుండటం తనకి కోపంతెప్పించిందని చెప్పింది.

"చూడు చారూ! అతనికి నీవంటే ఇష్టం వుండొచ్చు. కానీ ఆ ఇష్టాన్ని ఎక్స్ ప్రెస్ చేయకపోవటం లోనే అతని విజ్ఞత తెలుస్తోంది. ఇక కుర్తా దాచుకున్న విషయం నీముందే బయటపడేసరికి అతనికి మాట్లాడాల్సిన అవసరమేలేదు. అతనేంటో నీకు తెలిసినట్లే! ఇక దానిగురించి ప్రత్యేకం నీముందేం చెప్పగలడూ? అదీన్నూ, నీ మనసేంటో అతనికి తెలియనప్పుడు? అలాగనీ నీవు నీ ఫీలింగ్స్ అతనికి ఆ సమయంలోనే చెప్పాల్సిన అవసరమూ లేదు. అలా చెప్పకుండా వుండటంలోనే నీ హుందాతనం కనిపిస్తోంది. మీ ఇద్దరి మౌనం ఒకరిపై మరొకరికి ఉన్న ఇష్టాన్ని పరోక్షంగా తెలియచేసుకున్నట్లే!" అన్నాడు.

"నేనా !ఆ మొండివాడిని నేనేమీ ఇష్టపడలేదు" కినుక ఆ గొంతులో!

"అవునా! మరి సావిత్రి, ఆనందు గారు మీ అమ్మాయిని మా వినీత్ కి చేసుకోవాలనుంది. మీ అభిప్రాయం ఏంటని అడిగారు. మరిప్పుడు చెప్పమంటావా మాకీ సంబంధం ఇష్టంలేదని?"

"అవునా? అడిగారా? ఎప్పుడు? నాకిప్పటిదాకా ఎందుకు చెప్పలేదు మీరు?" ఆశ్చర్యంగా అడిగింది.

"అవును. ఇప్పుడే అడిగారులేగానీ, నువ్వు నాన్న ప్రశ్నకు జవాబు చెప్పు. ఇష్టంలేదని చెప్పేయమా మరి?" అడిగింది భామ.

"అలా ఎలా చెప్తారు మీరు? అంతా మీ ఇష్టమొచ్చినట్లు మాట్లాడేయటమేనా?" అంది కోపంగా.

"మరి నువ్వే అన్నావుగా ఆ మొండివాడంటే ఇష్టం లేదని" ఎదురు ప్రశ్నించింది భామ.

"ఆ మొండివాడంటే ఇష్టంలేదని అన్నానుగానీ, సావిత్రి అత్తయ్య వాళ్లే అడిగితే ఆ సంబంధం వద్దని ఎలా చెప్తారు? వాళ్లని అవమానించినట్లవదూ?" అంది పైగా.

"అలాగైతే ఏంచేయాలిప్పుడూ? పోనీ నువ్వే చెప్పు" అన్నాడు గోపాలం.

"ఈ సంబంధం మీకిష్టమనే చెప్పండి" అంది పెద్దరికపు గొంతుతో.

"మాకిష్టమని ఎలా చెప్తాం? నీకూ ఇష్టమైతేనే కదా?" అంది భామ.

"సర్లే సావిత్రి అత్తయ్యవాళ్లు కాబట్టి నేనూ ఇష్టమనేచెప్తున్నా " అంది.

"అలాకాదు నీకు వినీత్ నచ్చాడా లేదా అన్నది ఇక్కడ ప్రధానం" అన్నాడు గోపాలం.

వినీత్ నచ్చాడన్న విషయం వాళ్లిద్దరికీ తెలుసు. అయినా చారు నోట ఆ మాట వినాల్సిన అవసరముంది కదా! అందుకే అంతలా అడుగుతున్నారు వాళ్లు.

"వినీత్ నచ్చాడని నేను చెప్పాలా మీకు? నేను నచ్చానని ముందు ఆ మహానుభావుడినే చెప్పమనండి. ఆ తర్వాత నేను ఆలోచించుకొని చెప్తా" అంది చారు.

"బాగా ఆలోచించుకొని సరే నని చెప్పు అని ఓ సినిమాలో డైలాగ్ ఉంది. గుర్తుందా నీకు?" అన్నాడు అభి ఏమీ మాట్లాడకుండా వుండలేక.

చారుమతి ఆ మాటకి నవ్వకుండావుండలేకపోయింది.

"ముందు నీకు ఇష్టమా కాదా మాకు చెప్పమ్మా. వాళ్లకి చెప్పమనటంలేదు కదా?" అన్నాడు గోపాలం.

"మీకు నచ్చాడా మరి? ముందు మీ సంగతి చెప్పండి" అంది చారు.

"మా ముగ్గురికీ నచ్చాడు. నీకే నచ్చాల్సినది మరి!" అన్నాడు గోపాలం.

"సరే. మీకోసం చెప్తున్నా. నాకు ఇష్టమేనని మీరు వాళ్లకి చెప్పాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా ఆ వినీత్ కి" అంది చారుమతి.

అదండీ సంగతి. ఈ పెంకిపిల్ల చెప్పకనే చెప్పేసింది. చెప్పించేసరికి తాతలు దిగిరాలేదుగానీ, చెప్పేశాక దగ్గరి బంధువులందరూ వచ్చేశారు, ఆనందమానందమాయెనూ అనుకుంటూ.

హాయిగా ఇంట్లోనే చేయండి పెళ్లి. చాలా కాలమైంది ఇళ్లల్లో పెళ్లిళ్లను ఎంజాయ్ చేసి అన్నారు మగ పెళ్లివారు. మహదానందంగా ఒప్పుకున్నారు ఆడ పెళ్లివారు. అత్యంత వైభవంగా కాదుగానీ, అత్యంత ఆత్మీయంగా పెళ్లి జరిపించారు.

మధూధయంలో మంచి ముహూర్తం –మాధవీ లతకు పెళ్లి

మాధవీలతకు మాధవదేవుడు మంగళసూత్రం కడతాడు– అన్నట్లుగా పెళ్లి సందడిగా జరిగింది.

ఇంటికి తెల్లని సున్నపు పూతలు, ఇంటిముందు చల్లని కొత్త తాటాకు పందిళ్లు, పందిట్లో సన్నని సన్నాయి మేళం, మామిడి తోరణాలు, మల్లెలు, మరువం వాసనలు, బంధువుల ఆప్యాయపు పెళ్లిపనులతో కళకళలాడిన పెళ్లిల్లు, సలక్షణంగా సాగిన మర్యాదలు, అరిటాకుల్లో అలరించిన విందుభోజనాలు, హాస్యోక్తులు, బువ్వపుబంతి పాటలు, పూలచెండ్లాటలు! అన్నీ అందరి కళ్లముందు కలకాలం కదలాడే కమ్మని జీవన మాధుర్యపు హేల!

ఈ మాధుర్యపు హేలలో ఒక్కటై శోభిల్లిన మన నూతన వధూవరుల గురించి చెప్పుకోవద్దూ మరి! ఒక్కసారి ఇంటి మేడమీదకి దృష్టి సారిద్దాం రండి.

★★★★★

ఉదయం ఆరింటికి..అప్పుడుగానీ విరామం లభించలేదు నవ దంపతులకి. నాగవల్లి, సదస్యం అయేసరికి తెల్లగా తెలవారింది.

కొద్దిసేపు చల్లగాలికి డాబామీదకు వెళ్లాడు వినీత్ . అతనికి పదేపదే చారుమతి మోము గుర్తుకువచ్చి హాశ్చర్యం అనిపిస్తోంది. తనవైపు చూడదు. పొరబాటున చూసినా కన్నులు కలవనీయదు. తనతో పెళ్లికి ఆమె విముఖత చూపిస్తోందా అంటే అదేమీ లేదన్నట్లు ఆమె కళ్లల్లో మెరుపులు కనిపిస్తున్నాయి. తోటివారి పరాచికాలకు ఉల్లాసంగా స్పందిస్తోంది.

హోమం చుట్టూ ప్రదక్షిణలప్పుడూ, ఏడడుగులు వేసేటప్పుడూ ఆమె పాణిగ్రహణం చేశాడు కదా! బిందెలో ఉంగరం వెతికేటప్పుడూ ఆమె చేతిని మృదువుగా నొక్కాడు కూడాను! అప్పటి ఆమె చేతిస్పర్శ ఆమె ఆనందమనసితగా తెలియచేస్తూనేఉంది. మరెందుకు అలా కినుక పూనినట్లు!? కారణం తెలుసుకోవాలి.

ఉదయంలేచిందే ఆడుకోవటానికే అన్నట్లు అక్కడే అల్లిబిల్లి ఆడుతున్న ఓ బుజ్జితల్లిని పిలిచి, చారు అక్క ని నేను పిలిచానని చెవిలో చెప్పు అన్నాడు.

ఆ చిన్నారి ఇంతెత్తున్న వినీత్ ని వంగమని ఆదేశించింది. ఏంటంటూ వంగిన వినీత్ చెవికి తన చిట్టిచెయ్యి అడ్డుపెట్టి "చారు అక్కని నేను పిలిచాను" అని రహస్యంగాచెప్పింది.

ఒక్క క్షణం నిశ్చేష్టుడై..మరుక్షణమే పెద్దగా నవ్వేశాడు వినీత్ .

"నాచెవిలోకాదు అమ్మలూ! చారు అక్క చెవిలో.."నేను...."అని చెప్పబోయి ..ఈ పిల్లకి చాలా జాగ్రత్తగా అర్ధమయ్యేలా చెప్పాలిరా బాబోయ్ అనుకుంటూ..

"చారూ అక్కా! పెళ్లికొడుకు నిన్ను డాబామీదకు రమ్మని పిలిచాడు" అని చారూ అక్క చెవిలో నీవు చెప్పాలి. తెలిసిందా? అంటూ సైగలుచేసి మరీ వివరించి హమ్మయ్య అనుకుని ఊపిరిపీల్చుకున్నాడు.

ఆ చిన్నది ఇంకా అర్ధంకానట్టు ముఖం పెట్టింది. "ఏంటీ ఇంకా అర్ధంకాలేదా?" అని ఉస్సురంటూ మరోమారు" మరీ.." అని చెప్పబోయాడు ."చెప్తాలే పో "విసుగ్గా అనుకుంటూ చక్కాపోయింది.

దాని గింగిరాల ఆటకు భంగమైంది మరి!

ఆ చిన్నమ్మాయి సరిగ్గా చారుమతికి చేరేస్తుందోలేదో! ఒకవేళ సరిగ్గానే చెప్పినా తెలియనికోపం ప్రదర్శిస్తున్న చారుమతి రావటానికి తిరస్కరిస్తుందేమో !

ఇలా పలుపలువిధాలుగా పలుమరు పలవరిస్తున్నాడు వినీత్ . మెట్లవైపు ఇప్పటికే చాలాసార్లు చూశాడు.

కనిపిస్తున్నమేరా ప్రతిమెట్టుకూ నోరున్నట్లూ, నాలుక బయటకుపెట్టి వెక్కిరిస్తున్నట్టే తొస్తోంది అతనికి. ఇలా నాలుకబయటపెట్టి వెక్కిరించటం చారుమతి అలవాటు కదూ! ఈ తిక్కపిల్ల వాళ్లింటిమెట్లకూ నేర్పినట్లుంది ఈ విద్య అనుకుని తనలోతాను నవ్వుకున్నాడు. తను తిక్కపిల్ల అనుకుంటున్నట్లు గ్రహిస్తే నా పని గోవిందా అనుకున్నాడు మళ్లీ!

ఉన్నట్లుండి పైమెట్టుపై ప్రత్యక్షమైంది చారుమతి. అతని గుండె వేగంగా కొట్టుకుంది.

మనసులో ఇష్టం ఉన్నా, పైకి మాత్రం లేనట్లు నటిస్తూ చారుమతి నెమ్మదిగా అడుగులువేసుకుంటూ అతనివైపుకు వస్తోంది.

తలంబ్రాల చీరలో, కొద్దిగా రేగిన జుట్టు, నిద్రలేమితో అలసిన కళ్లు, కళ్లనిండా అలదుకున్న కాటుకతో, వింతైన కర్పుర గంధమ్మతో పెళ్లికూతురి శోభతో కొత్తకాంతులీనుతున్నది చారుమతి.

ఆమె మెత్తని అడుగుల చప్పుడు సరీగ్గా అతని గుండెలపైనే పడుతున్న అనుభూతి కలిగింది వినీత్ కి. కాలిచిరుమువ్వల శబ్దం తన గుండెకు లయబద్ధంగా ఉన్నట్లనిపించింది.

ఎదురుగ్గా వచ్చినిలుచున్న ఆమెను చూడగానే ఒక్కసారిగా ఏం మాట్లాడాలో తట్టలేదు అతనికి.

అతనికి అభిముఖంగా నిల్చొని..ఏం అన్నట్లు కళ్లతో ప్రశ్నించింది.

అతను తడుముకుంటూ ఏవో పదాలు శబ్దాల రూపం లో చేయబోయేసరికి ఆమె నోటికి వేళ్లు అడ్డుపెట్టుకుంటూ ఆవులించింది. హతవిధీ! ఆవులింతతో మొదలైందా కొత్తజీవితం అన్న అర్ధంలేని ఆలోచన అతని పెదవులపై ఒక చిన్న నవ్వుని పుట్టించింది. ఆవులిస్తే పేగులు లెక్కపెట్టగలిగిన ఈ ధీరవనిత ఎంత అందంగా ఆవులించింది! అని కొద్దిసేపు ముగ్ధుడయ్యాడు.

"ఏంటీ రమ్మని పిలిచి నీలో నువ్వే నవ్వుకుంటే! నీ మైం చూడటానికి వేరే ఎవర్నైనా పిలవొచ్చుగా!నే వెళ్తున్నా " వెనుతిరిగింది బెదిరించటానికి.

కంగారులో చప్పున ఆమె జడను అందుకున్నాడు. ఆమె విసురుగా ఒకడుగు ముందుకువేయటంతో జడగంటలు అందాయి అతని చేతికి.

సత్యభామలా ఓరగా వయ్యారంగా చూసింది అతనివైపు. అతను వెంటనే జడను వదిలేశాడు. అతనిచేతికి జడలోని చిన్న మొగలిరేకు వచ్చింది.

దాన్ని భద్రంగా గుప్పిట బిగించి పట్టుకున్నాడు ఆమె చూడకుండా. కూర్చుందామా చారూ..మ..తి! అన్నాడు.

చారూ అని పిలిచేటప్పుడు కోరగాచూసి, మతి ని చేర్చటంతో "ఊ అలా పిలువ్" అన్నట్లు చూసింది. అంతకుముందూ ఒకసారి చారూ అని పిలవబోయినట్లు గుర్తు. అప్పుడు కయ్యిమంది. "మా నాన్న పిలుస్తారలా! ఇంకెవ్వరూ పిలవటానికిలేదు "అని ఖండితంగా చెప్పేసింది.

పిట్టగోడపై కూర్చుంది చారుమతి. వినీత్ పిట్టగోడని ఆశ్రయించి నుంచున్నాడు.

వెనుక కొబ్బరిఆకులు మధుపర్కాల్లో మెరిసిపోతున్న ఈ నవ దంపతులని దీవిస్తున్నట్లు ఊగసాగాయి. ఓ కొబ్బరీఆకుని తుంచి వాచీ చేస్తోంది చారుమతి.

" చారుమతీ! అలిగావా? అంటూ అడిగాడు సంభాషణకు ఉపక్రమిస్తూ.

"ఎవరిమీద?"అంది అతిసామాన్యంగా.

"ఇంకెవరిమీద? నామీదే!"

"ఎందుకు అలుగుతాను?" ఎదురు ప్రశ్నించింది.

"మరి ఎందుకు నాతో సరీగా ఉండటంలేదు? నేను నవ్వినా నువ్వు నవ్వటంలేదు. నేను పలకరించబోయినా నువ్వు పట్టించుకోనట్లు పక్కకుచూస్తున్నావ్. నిన్న పెళ్లివేళంతా ఇలాగే ఉన్నావు కదా?"

"నన్నెందుకు పెళ్లిచేసుకున్నావ్ మరి?" అమాయకంగా అడిగిన ఆ ప్రశ్న అతన్ని విస్తుపోయేలాచేసింది.

"అదేం చారుమతీ! అదేం పిచ్చి ప్రశ్న?" తేరుకుని అడిగాడు.

"మరి కాఫీ తాగని అమ్మాయిని చేసుకోను గాక చేసుకోను అని శపధం పట్టావుగా ఆరోజు నాముందు"

"నేనా!? శపథమా!?" ఆశ్చర్యపోయాడు. ఆ సంభాషణ గుర్తొచ్చింది అంతలోనే. ఫక్కున నవ్వేశాడు.

" ఓ అదా! తమాషాకి అన్నాను"

"తమాషాగా ఏమీ అనలేదు. చాలా సీరియస్ గానే అన్నావ్" ఆరోపించింది.

"లేదు చారుమతీ! ఆరోజు సరదాగానే అన్నాను"

" ఏంకాదు నిజంగానే అన్నావ్"

"లేదు..నిజం..నిన్ను ఆటపట్టించటానికే అలా అన్నాను ..నిజం!"

"ఆటపట్టించటానికా? నేనంత అలుసైపోయానా నీకు?" నిష్ఠూరమాడింది.

" నీవంటే అంత ఇష్టమైపోయావ్ నాకు.."

ఏదో అనబోయిందల్లా అతని మాటలకు ఒక్కసారిగా ఆగిపోయి..కనురెప్పలుమాత్రమే ఎత్తి అతనివైపు చూసింది.

అతని కళ్లనిండుగా తన పై ఇష్టం, నిజాయితీ కనిపించాయి ఆమెకు. అపురంపు సిగ్గు ఆమె పచ్చని మోముపై లీలగా తారట్లాడింది. దాన్ని వినీత్ అవలీలగా పట్టేసుకున్నాడు కూడాను.

అది గమనించిన చారుమతి ఏమి తెలియని మోముపెట్టి, చిన్నపిల్లలా చేతిని ముందుకు చాచి తను తయారుచేసిన కొబ్బరి వాచీని అతనికి అందించింది.దాన్ని అపురూపంగా అందుకున్నాడతను. తిరిగి ఆమెకు అతని గుండె పలికే ప్రతి మాటా విన్నవించుకున్నాడు.

"నీవంటే ఏదో తెలియని ఇష్టం! నీతో ఏదో ఒకటి మాట్లాడాలని, నీవు ఏవేవో కబుర్లు చెప్తుంటే వినాలన్న ఆకాంక్ష.

నీవు నాపై ఉక్రోషం చూపిస్తుంటే ముచ్చటగా ఉండేది. నాతో పోట్లాడుతుంటే, అలా నాపై నీవు అధికారం చూపించటం నీవు నాదానివన్న భావన కలిగించేది!"

"నీవు ఊహించలేని విషయం .. ఫస్ట్ మనం ఒకరికొకరు ఎదురుపడ్డప్పటి క్షణాలని మర్చిపోలేను నేను. నీవు చల్లిన పన్నీరు, పూసిన గంధం ఇంకా నా కుర్తా పై అలానే వుంది.. ఎందుకో ఆ సుగంధాన్ని నేను పోగొట్టదలుచుకోలేదు. ఆ అనుభవం అపురూపమనిపించింది. అందుకే దాన్ని దాచి వుంచా. నీ కాటుక కళ్లు నన్ను కొన్నాళ్లు వెంటాడిన మాట నిజం. అయితే దాన్ని నేను సీరియస్ గా తీసుకోదలుచుకోలేదు. ఎందుకంటే మనిద్దరికి కనీసం పరిచయం కూడా లేదు. మళ్లీ కలుస్తామన్న ఆలోచనే లేదు. దానికోసం నేను ప్రయత్నమూ చేయదల్చుకోలేదు. ఎందుకంటే నీవేంటో నాకు తెలీదుకదా! అలాంటప్పుడు నిన్ను కలిసే ప్రయత్నాలు అర్థంలేదని నా ఉద్దేశం. మళ్లీ నిన్ను కలవటం నేనూహించనిది. నీవొచ్చి వుండిపోయిన ఆ వారం రోజులూ నాపాలిటికి అపురూపమే! అలాగని నీవొచ్చావుకదా అని నీముందు నామనసు బయటపెట్టటం అవకాశం తీసుకున్నట్లౌతుందని నా భావన. "

వినీత్ మాటలు చారుమతికి ప్రియగానాలయ్యాయి. ఆమె మనస్సంతా ఇదీ అని చెప్పలేని పూర్ణ భావనతో నిండిపోయింది.

"నీవు నేనైతే నిను నాలోనే కందు, నేను నీవుగ ఉంటే నీలోనే ఉందు" అంటూ ఆమె మది ఆలపించింది.

ఆ గానం వినీత్ హృదయాన్ని తాకింది. ఆ భావం అతని మనస్సంతటినీ వ్యాపించింది. ఏదో తెలియని సాన్నిహిత్యం ఇరువురి మనస్సులను ఆవరించింది.

ఇంకా మొహమాటం, చొరవలేనితనం దోబూచులాడుతూనే ఉన్నాయి వారితో.

ఓవైపు కట్టిపడేసే రాగబంధం! మరోవైపు ఇంకా చేరువకానీయని బిడియం, బింకం!

ఈ అనుభూతిని వర్ణించటానికి ఇంతవరకూ భాష పుట్టలేదు. ఎవరికివారు తమ అనుభవంలో తెలుసుకుని తీరాల్సిందే! ముమ్ముందు అనురాగ సంసారంలో సైతం మళ్లీ ఎప్పటికీ సంప్రాప్తించని అమూల్యమైన ఒక వరం!

ఆ సమయాన ఇద్దరిచుట్టూ అల్లుకున్న మరువంలాంటి సుగంధబంధం, ఆ కొద్దిపాటి దూరాన్ని కొంగొత్త విరహపు గాలులతో నింపివేస్తోంది.

ఒకరికి ఒకరుగా, ఇరువురు ఒకరిగా అనిపించే ఆ అనుభూతి!

ఇంతలో డాబా మీదకు వచ్చి వినీత్ కి కాఫీ ఇచ్చివెళ్లారు.

కాఫీ తాగకుండా కప్పుని అలా చేతిలోనే ఉంచుకుని వినీత్ చారుమతి వైపు ఓరగా చూస్తూ..

"నీవు ఆరోజు నాకు శాపం పెట్టావ్ గా! అది నిజమైంది" అన్నాడు.

ఉలిక్కిపడి చూసింది చారుమతి. శాపమా? అయోమయంగా చూసింది.

"అవును. నీకు కాఫీ తాగని అమ్మాయే దొరుకుతుంది అన్నావుగా నాపై కోపంతో మరి అదే నిజమైంది"

బిక్కమొహంతో అన్నాడు వినీత్ .

చిన్నగా నవ్వింది చారుమతి. అతని బిక్కముఖం చూశాక ఆ నవ్వే పెద్దదిగా మారిపోయింది. అతనూ ఆమె నవ్వుతో శ్రుతి కలిపేసరికి పగలబడి నవ్వటం మొదలుపెట్టింది.

ఆపై అయిదునిముషాలవరకూ నవ్వుని ఆపుకోటానికి విశ్వప్రయత్నంచేసింది.

"ఏం నీకు అంత నవ్వులాటగా ఉందా మరి?" అన్నాడు తానూ అలక ప్రదర్శనచేస్తూ.

కాదన్నట్లు తల అడ్డంగా ఊపుతూ.. ఒకింత నవ్వుని కంట్రోల్ చేసుకుంది.

"మరి నాకు శాప విమోచన లేదా?" అమాయకంగా ముఖంపెట్టి అడిగాడు.

"లేదుగాక లేదు" అంటూ.."అయ్యో ఇంకా నువ్వు కాఫీ తాగనేలేదు. చల్లారిపోతాయ్ తాగు.." అంది.

ఊహూ నువ్వు శాపం నుండి నన్ను విముక్తుణ్ణి చేస్తేనేగానీ తాగుతాను. లేకపోతే ఇంతటితో నేనూ కాఫీ మానేస్తాను" నిశ్చయంగా అంటూ కాఫీ కప్పు పక్కన పెట్టేశాడు.

జాలి కలిగింది ఆమెకు. పాపం తన మూలాన కాఫీ మానేస్తాడా! అనుకుంటూ..

"అయ్యో తాగు వినీత్" అంటూ కాఫీ కప్పుని అందించింది.

"ఊహూ ముందు నా శాపం సంగతి"అన్నాడు మంకుపట్టుతో.

"ఏం చేయాలి నేను? " అంది అర్థంకానట్లు

ఆ కప్పుని ఆమె పెదవుల దగ్గర ఉంచాడు.

"ఒక్కసారి సిప్ చేయి చాలు. నా శాపం తొలగిపోతుంది" అన్నాడు.

కోపంగా చూసిన చారుమతికి అంతులేని ఆపేక్షతో చూస్తున్న కళ్లు, ఆ కళ్లలోని అద్భుతమైన అనురాగపు శక్తి ఆమెను కాదని అననీకుండాచేశాయి. కళ్లుమూసుకుని ఒక గుక్క తాగటానికి ప్రయత్నం చేద్దామనుకుంది. కప్పు అందుకోబోయింది. అతని చేయి కాఫీ కప్పుని విడలేదు. ఆమె పెదవులదగ్గర అలా పట్టుకునే ఉన్నాడు. ఒక గుక్క తాగింది. కాఫీ చేదుగనే వుందికానీ ఎందుకో చేదుగా అనిపించలేదు ఆమెకు. అతని సాంగత్య మహిమ వల్లనా ఏమో!

కూర్గ్ లో తాము తిరిగిన కాఫీతోటలు గుర్తొచ్చాయి. కాఫీ పూల పరిమళాల నడుమ, కాఫీ గింజల ఘుమఘుమల మధ్య మొలకెత్తిన లేతప్రేమ చివురుల జ్ఞాపకాలు స్ఫురణకు వచ్చాయి.

చెలి చెంతనుండగా, మది తేలిపోతుండగా ఇంతకన్నా సౌఖ్యమేమున్నదన్నట్లు వినీత్ మిగతా కాఫీని తాగటం మొదలుపెట్టాడు. సద్విమల హృదయాలు అద్వైతమైనప్పుడు చిరుచేదుకూడా మధురంగానే తోస్తుంది.. అని ప్రత్యేకంగా ఆమె గ్రహించక్కర్లేదు. ఆ భావనని ఆస్వాదిస్తుందిగా అదిచాలు!

"మరి హనీమూన్ ఎక్కడికి వెళదాం?" అడిగాడు వినీతుడు.

"కాఫీ పుట్టినదేశం.. ఇథయోపియా అయితే ఎలా ఉంటుంది?" అంది చారుమతి.

ఇద్దరి నవ్వులు కాఫీపువ్వుల్లా విచ్చుకుని కళకళలాడాయి.

చూశారుగా మరి ఈ చిన్ని బంగ్లా కూడా విస్తుపోయింది తన మారాము చారుమతి మారటం చూసి!!

ఇప్పుడు మీకు ఉత్సుకతగా వుంది కదూ చారుమతి గురించి!? వాళ్ళింట్లో జరిగిన సంభాషణకోసం కొంచెం వెనక్కి వెళ్దాం. ఇంటికి చేరిన చారుమతి కొద్దిగా పరధ్యాన్నంగా వుండటం గమనించారు భామ, గోపాలం. ఎప్పటిలా అభి ఆటపట్టిస్తున్నా మునుపటిలా వుడుక్కోవటంలేదిప్పుడు. పోరా అని విసుక్కుంటోందంతే.

సావిత్రి ఫోన్ చేసింది. చారుమతి వెళ్లాక ఇల్లంతా బోసిపోయిందనీ చెప్పింది. చారుమతి వచ్చినది మొదలు, వెళ్లేదాకా అక్కడి విషయాలను చెప్పింది. ఆమె మాటలనుబట్టి చారుమతి అక్కడ ఉత్సాహంగానే వుంది. ఇప్పుడేమో ఉదాసీనంగా ఎందుకుందో అనుకుంటూ భామ కూతురిని కదిలించింది కూర్గ్ విశేషాలు చెప్పమంటూ. మధ్యలో,

"వినీత్ సాయం చేశాడా మరి ?"అని అడిగింది కూడా , చారుమతి ఎలా స్పందిస్తుందో చూద్దామని.

"ఆ..పేద్ద సాయం చేయకేంచేస్తాడు? జీపుందిగా. తీసుకెళ్లాడులే" అంది ఉక్రోషం మాటల్లో.

అలా ఎందుకన్నావని గోపాలం చిన్నగా బుజ్జగించి అడిగాక చెప్పేసింది గంధం అంటిన కుర్తా సంగతి, ఆ విషయమై వినీత్ మౌనంగా మారిన సంగతి. కలువ కన్నుల రెప్పలమాటున తడి.. కోమల కంఠస్వరం లో వణుకు! వినీత్ అలా వుండటం తనకి కోపంతెప్పించిందని చెప్పింది.

"చూడు చారూ! అతనికి నీవంటే ఇష్టం వుండొచ్చు. కానీ ఆ ఇష్టాన్ని ఎక్స్ ప్రెస్ చేయకపోవటం లోనే అతని విజ్ఞత తెలుస్తోంది. ఇక కుర్తా దాచుకున్న విషయం నీముందే బయటపడేసరికి అతనికి మాట్లాడాల్సిన అవసరమేలేదు. అతనేంటో నీకు తెలిసినట్లే! ఇక దానిగురించి ప్రత్యేకం నీముందేం చెప్పగలడూ? అదీన్నూ, నీ మనసేంటో అతనికి తెలియనప్పుడు? అలాగనీ నీవు నీ ఫీలింగ్స్ అతనికి ఆ సమయంలోనే చెప్పాల్సిన అవసరమూ లేదు. అలా చెప్పకుండా వుండటంలోనే నీ హుందాతనం కనిపిస్తోంది. మీ ఇద్దరి మౌనం ఒకరిపై మరొకరికి ఉన్న ఇష్టాన్ని పరోక్షంగా తెలియచేసుకున్నట్లే!" అన్నాడు.

"నేనా !ఆ మొండివాడిని నేనేమీ ఇష్టపడలేదు" కినుక ఆ గొంతులో!

"అవునా! మరి సావిత్రి, ఆనందు గారు మీ అమ్మాయిని మా వినీత్ కి చేసుకోవాలనుంది. మీ అభిప్రాయం ఏంటని అడిగారు. మరిప్పుడు చెప్పమంటావా మాకీ సంబంధం ఇష్టంలేదని?"

"అవునా? అడిగారా? ఎప్పుడు? నాకిప్పటిదాకా ఎందుకు చెప్పలేదు మీరు?" ఆశ్చర్యంగా అడిగింది.

"అవును. ఇప్పుడే అడిగారులేగానీ, నువ్వు నాన్న ప్రశ్నకు జవాబు చెప్పు. ఇష్టంలేదని చెప్పేయమా మరి?" అడిగింది భామ.

"అలా ఎలా చెప్తారు మీరు? అంతా మీ ఇష్టమొచ్చినట్లు మాట్లాడేయటమేనా?" అంది కోపంగా.

"మరి నువ్వే అన్నావుగా ఆ మొండివాడంటే ఇష్టం లేదని" ఎదురు ప్రశ్నించింది భామ.

"ఆ మొండివాడంటే ఇష్టంలేదని అన్నానుగానీ, సావిత్రి అత్తయ్య వాళ్లే అడిగితే ఆ సంబంధం వద్దని ఎలా చెప్తారు? వాళ్లని అవమానించినట్లవదూ?" అంది పైగా.

"అలాగైతే ఏంచేయాలిప్పుడూ? పోనీ నువ్వే చెప్పు" అన్నాడు గోపాలం.

"ఈ సంబంధం మీకిష్టమనే చెప్పండి" అంది పెద్దరికపు గొంతుతో.

"మాకిష్టమని ఎలా చెప్తాం? నీకూ ఇష్టమైతేనే కదా?" అంది భామ.

"సర్లే సావిత్రి అత్తయ్యవాళ్లు కాబట్టి నేనూ ఇష్టమనేచెప్తున్నా " అంది.

"అలాకాదు నీకు వినీత్ నచ్చాడా లేదా అన్నది ఇక్కడ ప్రధానం" అన్నాడు గోపాలం.

వినీత్ నచ్చాడన్న విషయం వాళ్లిద్దరికీ తెలుసు. అయినా చారు నోట ఆ మాట వినాల్సిన అవసరముంది కదా! అందుకే అంతలా అడుగుతున్నారు వాళ్లు.

"వినీత్ నచ్చాడని నేను చెప్పాలా మీకు? నేను నచ్చానని ముందు ఆ మహానుభావుడినే చెప్పమనండి. ఆ తర్వాత నేను ఆలోచించుకొని చెప్తా" అంది చారు.

"బాగా ఆలోచించుకొని సరే నని చెప్పు అని ఓ సినిమాలో డైలాగ్ ఉంది. గుర్తుందా నీకు?" అన్నాడు అభి ఏమీ మాట్లాడకుండా వుండలేక.

చారుమతి ఆ మాటకి నవ్వకుండావుండలేకపోయింది.

"ముందు నీకు ఇష్టమా కాదా మాకు చెప్పమ్మా. వాళ్లకి చెప్పమనటంలేదు కదా?" అన్నాడు గోపాలం.

"మీకు నచ్చాడా మరి? ముందు మీ సంగతి చెప్పండి" అంది చారు.

"మా ముగ్గురికీ నచ్చాడు. నీకే నచ్చాల్సినది మరి!" అన్నాడు గోపాలం.

"సరే. మీకోసం చెప్తున్నా. నాకు ఇష్టమేనని మీరు వాళ్లకి చెప్పాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా ఆ వినీత్ కి" అంది చారుమతి.

అదండీ సంగతి. ఈ పెంకిపిల్ల చెప్పకనే చెప్పేసింది. చెప్పించేసరికి తాతలు దిగిరాలేదుగానీ, చెప్పేశాక దగ్గరి బంధువులందరూ వచ్చేశారు, ఆనందమానందమాయెనూ అనుకుంటూ.

హాయిగా ఇంట్లోనే చేయండి పెళ్లి. చాలా కాలమైంది ఇళ్లల్లో పెళ్లిళ్లను ఎంజాయ్ చేసి అన్నారు మగ పెళ్లివారు. మహదానందంగా ఒప్పుకున్నారు ఆడ పెళ్లివారు. అత్యంత వైభవంగా కాదుగానీ, అత్యంత ఆత్మీయంగా పెళ్లి జరిపించారు.

మధూదయంలో మంచి ముహూర్తం –మాధవీ లతకు పెళ్లి

మాధవీలతకు మాధవదేవుడు మంగళసూత్రం కడతాడు– అన్నట్లుగా పెళ్లి సందడిగా జరిగింది.

ఇంటికి తెల్లని సున్నపు పూతలు, ఇంటిముందు చల్లని కొత్త తాటాకు పందిళ్లు, పందిట్లో సన్నని సన్నాయి మేళం, మామిడి తోరణాలు, మల్లెలు, మరువం వాసనలు, బంధువుల ఆప్యాయపు పెళ్లిపనులతో కళకళలాడిన పెళ్లిల్లు, సలక్షణంగా సాగిన మర్యాదలు, అరిటాకుల్లో అలరించిన విందుభోజనాలు, హాస్యోక్తులు, బువ్వపుబంతి పాటలు, పూలచెండ్లాటలు! అన్నీ అందరి కళ్లముందు కలకాలం కదలాడే కమ్మని జీవన మాధుర్యపు హేల!

ఈ మాధుర్యపు హేలలో ఒక్కటై శోభిల్లిన మన నూతన వధూవరుల గురించి చెప్పుకోవద్దూ మరి! ఒక్కసారి ఇంటి మేడమీదకి దృష్టి సారిద్దాం రండి.

★★★★★

ఉదయం ఆరింటికి..అప్పుడుగానీ విరామం లభించలేదు నవ దంపతులకి. నాగవల్లి, సదస్యం అయేసరికి తెల్లగా తెలవారింది.

కొద్దిసేపు చల్లగాలికి డాబామీదకు వెళ్లాడు వినీత్ . అతనికి పదేపదే చారుమతి మోము గుర్తుకువచ్చి హాశ్చర్యం అనిపిస్తోంది. తనవైపు చూడదు. పొరబాటున చూసినా కన్నులు కలవనీయదు. తనతో పెళ్లికి ఆమె విముఖత చూపిస్తోందా అంటే అదేమీ లేదన్నట్లు ఆమె కళ్లల్లో మెరుపులు కనిపిస్తున్నాయి. తోటివారి పరాచికాలకు ఉల్లాసంగా స్పందిస్తోంది.

హోమం చుట్టూ ప్రదక్షిణలప్పుడూ, ఏడడుగులు వేసేటప్పుడూ ఆమె పాణిగ్రహణం చేశాడు కదా! బిందెలో ఉంగరం వెతికేటప్పుడూ ఆమె చేతిని మృదువుగా నొక్కాడు కూడాను! అప్పటి ఆమె చేతిస్పర్శ ఆమె ఆనందమనసితగా తెలియచేస్తూనేఉంది. మరెందుకు అలా కినుక పూనినట్లు!? కారణం తెలుసుకోవాలి.

ఉదయంలేచిందే ఆడుకోవటానికే అన్నట్లు అక్కడే అల్లిబిల్లి ఆడుతున్న ఓ బుజ్జితల్లిని పిలిచి, చారు అక్క ని నేను పిలిచానని చెవిలో చెప్పు అన్నాడు.

ఆ చిన్నారి ఇంతెత్తున్న వినీత్ ని వంగమని ఆదేశించింది. ఏంటంటూ వంగిన వినీత్ చెవికి తన చిట్టిచెయ్యి అడ్డుపెట్టి "చారు అక్కని నేను పిలిచాను" అని రహస్యంగాచెప్పింది.

ఒక్క క్షణం నిశ్చేష్టుడై..మరుక్షణమే పెద్దగా నవ్వేశాడు వినీత్ .

"నాచెవిలోకాదు అమ్మలూ! చారు అక్క చెవిలో.."నేను...."అని చెప్పబోయి ..ఈ పిల్లకి చాలా జాగ్రత్తగా అర్ధమయ్యేలా చెప్పాలిరా బాబోయ్ అనుకుంటూ..

"చారూ అక్కా! పెళ్లికొడుకు నిన్ను డాబామీదకు రమ్మని పిలిచాడు" అని చారూ అక్క చెవిలో నీవు చెప్పాలి. తెలిసిందా? అంటూ సైగలుచేసి మరీ వివరించి హమ్మయ్య అనుకుని ఊపిరిపీల్చుకున్నాడు.

ఆ చిన్నది ఇంకా అర్థంకానట్టు ముఖం పెట్టింది. "ఏంటీ ఇంకా అర్థంకాలేదా?" అని ఉస్సురంటూ మరోమారు" మరీ.." అని చెప్పబోయాడు ."చెప్తాలే పో "విసుగ్గా అనుకుంటూ చక్కాపోయింది.

దాని గింగిరాల ఆటకు భంగమైంది మరి!

ఆ చిన్నమ్మాయి సరిగ్గా చారుమతికి చేరేస్తుందోలేదో! ఒకవేళ సరిగ్గానే చెప్పినా తెలియనికోపం ప్రదర్శిస్తున్న చారుమతి రావటానికి తిరస్కరిస్తుందేమో !

ఇలా పలుపలువిధాలుగా పలుమరు పలవరిస్తున్నాడు వినీత్ . మెట్లవైపు ఇప్పటికే చాలాసార్లు చూశాడు.

కనిపిస్తున్నమేరా ప్రతిమెట్టుకూ నోరున్నట్లూ, నాలుక బయటకుపెట్టి వెక్కిరిస్తున్నట్టే తోస్తోంది అతనికి. ఇలా నాలుకబయటపెట్టి వెక్కిరించటం చారుమతి అలవాటు కదూ! ఈ తిక్కపిల్ల వాళ్లింటిమెట్లకూ నేర్పినట్లుంది ఈ విద్య అనుకుని తనలోతాను నవ్వుకున్నాడు. తను తిక్కపిల్ల అనుకుంటున్నట్లు గ్రహిస్తే నా పని గోవిందా అనుకున్నాడు మళ్లీ!

ఉన్నట్లుండి పైమెట్టుపై ప్రత్యక్షమైంది చారుమతి. అతని గుండె వేగంగా కొట్టుకుంది.

మనసులో ఇష్టం ఉన్నా, పైకి మాత్రం లేనట్లు నటిస్తూ చారుమతి నెమ్మదిగా అడుగులువేసుకుంటూ అతనివైపుకు వస్తోంది.

తలంబ్రాల చీరలో, కొద్దిగా రేగిన జుట్టు, నిద్రలేమితో అలసిన కళ్లు, కళ్లనిండా అలదుకున్న కాటుకతో, వింతైన కర్పూర గంధమ్ముతో పెళ్లికూతురి శోభతో కొత్తకాంతులీనుతున్నది చారుమతి.

ఆమె మెత్తని అడుగుల చప్పుడు సరీగ్గా అతని గుండెలపైనే పడుతున్న అనుభూతి కలిగింది వినీత్ కి. కాలిచిరుమువ్వల శబ్దం తన గుండెకు లయబద్ధంగా ఉన్నట్లనిపించింది.

ఎదురుగ్గా వచ్చినిలుచున్న ఆమెను చూడగానే ఒక్కసారిగా ఏం మాట్లాడాలో తట్టలేదు అతనికి.

అతనికి అభిముఖంగా నిల్చొని..ఏం అన్నట్లు కళ్లతో ప్రశ్నించింది.

అతను తడుముకుంటూ ఏవో పదాలు శబ్దాల రూపం లో చేయబోయేసరికి ఆమె నోటికి వేళ్లు అడ్డుపెట్టుకుంటూ ఆవులించింది. హతవిధీ! ఆవులింతతో మొదలైందా కొత్తజీవితం అన్న అర్థంలేని ఆలోచన అతని పెదవులపై ఒక చిన్న నవ్వుని పుట్టించింది. ఆవులిస్తే పేగులు లెక్కపెట్టగలిగిన ఈ ధీరవనిత ఎంత అందంగా ఆవులించింది! అని కొద్దిసేపు ముగ్ధుడయ్యాడు.

"ఏంటీ రమ్మని పిలిచి నీలో నువ్వే నవ్వుకుంటే! నీ మైం చూడటానికి వేరే ఎవర్నైనా పిలవొచ్చుగా!నే వెళ్తున్నా " వెనుతిరిగింది బెదిరించటానికి.

కంగారులో చప్పున ఆమె జడను అందుకున్నాడు. ఆమె విసురుగా ఒకడుగు ముందుకువేయటంతో జడగంటలు అందాయి అతని చేతికి.

సత్యభామలా ఓరగా వయ్యారంగా చూసింది అతనివైపు. అతను వెంటనే జడను వదిలేశాడు. అతనిచేతికి జడలోని చిన్న మొగలిరేకు వచ్చింది.

దాన్ని భద్రంగా గుప్పిట బిగించి పట్టుకున్నాడు ఆమె చూడకుండా. కూర్చుందామా చారూ..మ..తి! అన్నాడు.

చారూ అని పిలిచేటప్పుడు కోరగాచూసి, మతి ని చేర్చటంతో "ఊ అలా పిలువ్" అన్నట్లు చూసింది. అంతకుముందూ ఒకసారి చారూ అని పిలవబోయినట్లు గుర్తు. అప్పుడు కయ్యిమంది. "మా నాన్న పిలుస్తారలా! ఇంకెవ్వరూ పిలవటానికిలేదు "అని ఖండితంగా చెప్పేసింది.

పిట్టగోడపై కూర్చుంది చారుమతి. వినీత్ పిట్టగోడని ఆశ్రయించి నుంచున్నాడు.

వెనుక కొబ్బరిఆకులు మధుపర్కాల్లో మెరిసిపోతున్న ఈ నవ దంపతులని దీవిస్తున్నట్లు ఊగసాగాయి. ఓ కొబ్బరీఅకుని తుంచి వాచీ చేస్తోంది చారుమతి.

" చారుమతీ! అలిగావా? అంటూ అడిగాడు సంభాషణకు ఉపక్రమిస్తూ.

"ఎవరిమీద?"అంది అతిసామాన్యంగా.

"ఇంకెవరిమీద? నామీదే!"

"ఎందుకు అలుగుతాను?" ఎదురు ప్రశ్నించింది.

"మరి ఎందుకు నాతో సరిగా ఉండటంలేదు? నేను నవ్వినా నువ్వు నవ్వటంలేదు. నేను పలకరించబోయినా నువ్వు పట్టించుకోనట్లు పక్కకుచూస్తున్నావ్. నిన్న పెళ్లివేళంతా ఇలాగే ఉన్నావు కదా?"

"నన్నెందుకు పెళ్లిచేసుకున్నావ్ మరి?" అమాయకంగా అడిగిన ఆ ప్రశ్న అతన్ని విస్తుపోయేలాచేసింది.

"అదేం చారుమతీ! అదేం పిచ్చి ప్రశ్న?" తేరుకుని అడిగాడు.

"మరి కాఫీ తాగని అమ్మాయిని చేసుకోను గాక చేసుకోను అని శపధం పట్టావుగా ఆరోజు నాముందు"

"నేనా!? శపథమా!?" ఆశ్చర్యపోయాడు. ఆ సంభాషణ గుర్తొచ్చింది అంతలోనే. ఫక్కున నవ్వేశాడు.

" ఓ అదా! తమాషాకి అన్నాను"

"తమాషాగా ఏమీ అనలేదు. చాలా సీరియస్ గానే అన్నావ్" ఆరోపించింది.

"లేదు చారుమతీ! ఆరోజు సరదాగానే అన్నాను"

" ఏంకాదు నిజంగానే అన్నావ్"

"లేదు..నిజం..నిన్ను ఆటపట్టించటానికే అలా అన్నాను ..నిజం!"

"ఆటపట్టించటానికా? నేనంత అలుసైపోయానా నీకు?" నిష్టూరమాడింది.

" నీవంటే అంత ఇష్టమైపోయావ్ నాకు.."

ఏదో అనబోయిందల్లా అతని మాటలకు ఒక్కసారిగా ఆగిపోయి..కనురెప్పలుమాత్రమే ఎత్తి అతనివైపు చూసింది.

అతని కళ్లనిండుగా తన పై ఇష్టం, నిజాయితీ కనిపించాయి ఆమెకు. అపురంపు సిగ్గు ఆమె పచ్చని మోముపై లీలగా తారట్లాడింది. దాన్ని వినీత్ అవలీలగా పట్టేసుకున్నాడు కూడాను.

అది గమనించిన చారుమతి ఏమి తెలియని మోముపెట్టి, చిన్నపిల్లలా చేతిని ముందుకు చాచి తను తయారుచేసిన కొబ్బరి వాచీని అతనికి అందించింది.దాన్ని అపురూపంగా అందుకున్నాడతను. తిరిగి ఆమెకు అతని గుండె పలికే ప్రతి మాటా విన్నవించుకున్నాడు.

"నీవంటే ఏదో తెలియని ఇష్టం! నీతో ఏదో ఒకటి మాట్లాడాలని, నీవు ఏవేవో కబుర్లు చెప్తుంటే వినాలన్న ఆకాంక్ష.

నీవు నాపై ఉక్రోషం చూపిస్తుంటే ముచ్చటగా ఉండేది. నాతో పోట్లాడుతుంటే, అలా నాపై నీవు అధికారం చూపించటం నీవు నాదానివన్న భావన కలిగించేది!"

"నీవు ఊహించలేని విషయం .. ఫస్ట్ మనం ఒకరికొకరు ఎదురుపడ్డప్పటి క్షణాలని మర్చిపోలేను నేను. నీవు చల్లిన పన్నీరు, పూసిన గంధం ఇంకా నా కుర్తా పై అలానే వుంది.. ఎందుకో ఆ సుగంధాన్ని నేను పోగొట్టదలుచుకోలేదు. ఆ అనుభవం అపురూపమనిపించింది. అందుకే దాన్ని దాచి వుంచా. నీ కాటుక కళ్లు నన్ను కొన్నాళ్లు వెంటాడిన మాట నిజం. అయితే దాన్ని నేను సీరియస్ గా తీసుకోదలుచుకోలేదు. ఎందుకంటే మనిద్దరికి కనీసం పరిచయం కూడా లేదు. మళ్లీ కలుస్తామన్న ఆలొచనే లేదు. దానికోసం నేను ప్రయత్నమూ చేయదల్చుకోలేదు. ఎందుకంటే నీవేంటో నాకు తెలీదుకదా! అలాంటప్పుడు నిన్ను కలిసే ప్రయత్నాలు అర్థంలేదని నా ఉద్దేశం. మళ్లీ నిన్ను కలవటం నేనూహించనిది. నీవొచ్చి వుండిపోయిన ఆ వారం రోజులూ నాపాలిటికి అపురూపమే! అలాగని నీవొచ్చావుకదా అని నీముందు నామనసు బయటపెట్టటం అవకాశం తీసుకున్నట్లౌతుందని నా భావన. "

వినీత్ మాటలు చారుమతికి ప్రియగానాలయ్యాయి. ఆమె మనస్సంతా ఇదీ అని చెప్పలేని పూర్ణ భావనతో నిండిపోయింది.

"నీవు నేనైతే నిను నాలోనే కందు, నేను నీవుగ ఉంటే నీలోనే ఉందు" అంటూ ఆమె మది ఆలపించింది.

ఆ గానం వినీత్ హృదయాన్ని తాకింది. ఆ భావం అతని మనస్సంతటినీ వ్యాపించింది. ఏదో తెలియని సాన్నిహిత్యం ఇరువురి మనస్సులను ఆవరించింది.

ఇంకా మొహమాటం, చొరవలేనితనం దోబూచులాడుతూనే ఉన్నాయి వారితో.

ఓవైపు కట్టిపడేసే రాగబంధం! మరోవైపు ఇంకా చేరువకానీయని బిడియం, బింకం!

ఈ అనుభూతిని వర్ణించటానికి ఇంతవరకూ భాష పుట్టలేదు. ఎవరికివారు తమ అనుభవంలో తెలుసుకుని తీరాల్సిందే! మున్ముందు అనురాగ సంసారంలో సైతం మళ్లీ ఎప్పటికీ సంప్రాప్తించని అమూల్యమైన ఒక వరం!

ఆ సమయాన ఇద్దరిచుట్టూ అల్లుకున్న మరువంలాంటి సుగంధబంధం, ఆ కొద్దిపాటి దూరాన్ని కొంగొత్త విరహపు గాలులతో నింపివేస్తోంది.

ఒకరికి ఒకరుగా, ఇరువురు ఒకరిగా అనిపించే ఆ అనుభూతి!

ఇంతలో డాబా మీదకు వచ్చి వినీత్ కి కాఫీ ఇచ్చివెళ్లారు.

కాఫీ తాగకుండా కప్పుని అలా చేతిలోనే ఉంచుకుని వినీత్ చారుమతి వైపు ఓరగా చూస్తూ..

"నీవు ఆరోజు నాకు శాపం పెట్టావ్ గా! అది నిజమైంది" అన్నాడు.

ఉలిక్కిపడి చూసింది చారుమతి. శాపమా? అయోమయంగా చూసింది.

"అవును. నీకు కాఫీ తాగని అమ్మాయే దొరుకుతుంది అన్నావుగా నాపై కోపంతో మరి అదే నిజమైంది"

బిక్కమొహంతో అన్నాడు వినీత్ .

చిన్నగా నవ్వింది చారుమతి. అతని బిక్కముఖం చూశాక ఆ నవ్వే పెద్దదిగా మారిపోయింది. అతనూ ఆమె నవ్వుతో శ్రుతి కలిపేసరికి పగలబడి నవ్వటం మొదలుపెట్టింది.

ఆపై అయిదునిముషాలవరకూ నవ్వుని ఆపుకోటానికి విశ్వప్రయత్నంచేసింది.

"ఏం నీకు అంత నవ్వులాటగా ఉందా మరి?" అన్నాడు తానూ అలక ప్రదర్శనచేస్తూ.

కాదన్నట్లు తల అడ్డంగా ఊపుతూ.. ఒకింత నవ్వుని కంట్రోల్ చేసుకుంది.

"మరి నాకు శాప విమోచన లేదా?" అమాయకంగా ముఖంపెట్టి అడిగాడు.

"లేదుగాక లేదు" అంటూ.."అయ్యో ఇంకా నువ్వు కాఫీ తాగనేలేదు. చల్లారిపోతాయ్ తాగు.." అంది.

ఊహూ నువ్వు శాపం నుండి నన్ను విముక్తుణ్ణి చేస్తేనేగానీ తాగుతాను. లేకపోతే ఇంతటితో నేనూ కాఫీ మానేస్తాను" నిశ్చయంగా అంటూ కాఫీ కప్పు పక్కన పెట్టేశాడు.

జాలి కలిగింది ఆమెకు. పాపం తన మూలాన కాఫీ మానేస్తాడా! అనుకుంటూ..

"అయ్యో తాగు వినీత్" అంటూ కాఫీ కప్పుని అందించింది.

"ఊహూ ముందు నా శాపం సంగతి"అన్నాడు మంకుపట్టుతో.

"ఏం చేయాలి నేను? " అంది అర్థంకానట్లు

ఆ కప్పుని ఆమె పెదవుల దగ్గర ఉంచాడు.

"ఒక్కసారి సిప్ చేయి చాలు. నా శాపం తొలగిపోతుంది" అన్నాడు.

కోపంగా చూసిన చారుమతికి అంతులేని ఆపేక్షతో చూస్తున్న కళ్లు, ఆ కళ్లలోని అద్భుతమైన అనురాగపు శక్తి ఆమెను కాదని అననీకుండాచేశాయి. కళ్లుమూసుకుని ఒక గుక్క తాగటానికి ప్రయత్నం చేద్దామనుకుంది. కప్పు అందుకోబోయింది. అతని చేయి కాఫీ కప్పుని విడలేదు. ఆమె పెదవులదగ్గర అలా పట్టుకునే ఉన్నాడు. ఒక గుక్క తాగింది. కాఫీ చేదుగనే వుందికానీ ఎందుకో చేదుగా అనిపించలేదు ఆమెకు. అతని సాంగత్య మహిమ వల్లనా ఏమో!

కూర్గ్ లో తాము తిరిగిన కాఫీతోటలు గుర్తొచ్చాయి. కాఫీ పూల పరిమళాల నడుమ, కాఫీ గింజల ఘుమఘుమల మధ్య మొలకెత్తిన లేతప్రేమ చివురుల జ్ఞాపకాలు స్ఫురణకు వచ్చాయి.

చెలి చెంతనుండగా, మది తేలిపోతుండగా ఇంతకన్నా సౌఖ్యమేమున్నదన్నట్లు వినీత్ మిగతా కాఫీని తాగటం మొదలుపెట్టాడు. సద్విమల హృదయాలు అద్వైతమైనప్పుడు చిరుచేదుకూడా మధురంగానే తోస్తుంది.. అని ప్రత్యేకంగా ఆమె గ్రహించక్కర్లేదు. ఆ భావనని ఆస్వాదిస్తుందిగా అదిచాలు!

“మరి హనీమూన్ ఎక్కడికి వెళదాం?” అడిగాడు వినీతుడు.

“కాఫీ పుట్టినదేశం.. ఇథయోపియా అయితే ఎలా ఉంటుంది?” అంది చారుమతి.

ఇద్దరి నవ్వులు కాఫీపువ్వుల్లా విచ్చుకుని కళకళలాడాయి.

చూశారుగా మరి ఈ చిన్ని బంగ్లా కూడా విస్తుపోయింది తన మారాము చారుమతి మారటం చూసి!!

# నిజమే.. కానీ! గుడ్లదొన సరోజినీదేవి

కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

విశ్వాసానికి తర్కానికి ఆమడ ఎడం

★ ★ ★

ఆగకుండా కురుస్తోంది వర్షం. ఇవాళ్టికి మూడో రోజు.

పెనుగాలుల మూలకంగా కరెంటు లేక.. మధ్యాహ్నం మూడింటికే సాయంత్రం ఆరుదాటినట్లుంది వాతావరణం. శలవులకని ఇంటికి వచ్చిన మూర్తికీ హౌస్ అరెస్టు చికాకుగా ఉంది.

కాలుగాలిన పిల్లిలాగా లోపలికి, బైటికి తిరిగే కొడుకును చూసి చిన్నగా నవ్వుకుంది సుభద్రమ్మగారు. 'పట్నం కులాసాలకి అలవాటు పడ్డ ప్రాణం. ముసలాళ్ళకి మల్లే ఇంటి పట్టునుండాలంటే చిరాకే మరి. పొద్దుపోయే సాధనాలేవీ కొంపలో లేకపాయ. బొమ్మల పెట్టున్నా ఏం లాభం.. కరెంటు లేకపోతే అది వట్టి బొమ్మపెట్టే. రేడియాలో బ్యాటరీలు లేవు. అవి కావాలన్నా ముందు పట్నందాకా పోయి రావాలి'.

" చదివిన పేపరే ఎన్ని సార్లు చదువుతారు గానీ అబ్బాయిని కూర్చోబెట్టుకుని కాస్తేదన్నా కాలక్షేపం చెయ్యరాదూ! పొద్దు గడవక పాపం పిల్లాడెట్లా గిలగిలలాడిపోతున్నాడో! మీకేదీ పట్టదాయ!" అంటూ ముందు గదిలో పేపరు తిరగేస్తున్న సుందరయ్య దగ్గరికొచ్చి మొత్తుకుంది సుభద్రమ్మ

సుందరయ్య చదివే పేపరు పక్కన పారేసి "మూర్తీ!" అని లోపలికి కేకేసాడు.

మూడో పిలుపుకి గానీ మూర్తి ఊడి పడలేదు.

"చదరంగం ఆడదామురా కాస్సేపు.. నీతో ఆడి చాలా కాలమైంది" అనడిగాడు సుందరయ్య.

"ఒద్దులే నాన్నా! ఓడిపోతే చాలా ఫీలైపోతావు" అన్నాడు మూర్తి అదోలా నవ్వి.

"ఓడటమా? నీతోనా? అదీ చూద్దాం.. బోర్డు సర్దరా ముందూ" అన్నాడు సుందరయ్య తెల్లటి మీసాలు దువ్వుకుంటూ.

"వట్టి ఆటైతే బోరు. ఏదైనా పందెం కాయండి. ఇంటరెస్టుగా ఉంటుంది" అన్నాడు మూర్తి కాయలు సర్దుతూ.

"పందేలు కాస్తావురా.. ఇదెప్పట్నుంచీ? అంత పెద్దాడివై పోయావేం అప్పుడే!" అంటూ మందలింపులకి దిగబోయింది సుభద్రమ్మ. సుందరయ్యే అడ్డొచ్చాడు "అందులో తప్పేముందిలేవే. ఇంట్లో మనతోనేగా ఆడేదీ! కాకపోతే అబ్బాయిగారికీ సొంత సంపాదన ఎప్పట్నుంచో.. ఆ సంగతి కనుక్కో ముందు. నా డబ్బులతో నా మీదే పందెం కాయడం.. ఆహా.. ఇదో కొత్త తరహా పందెం కాబోలు ఈ కాలం పిల్లలకి!"

తండ్రి వెటకారం ఆ మాత్రం అర్థం చేసుకోలేనంత పసిపిల్లాడేం కాదు మూర్తి. బెంగుళూర్లో థర్డియర్ ఎమ్.టెక్ చేస్తున్నాడు.

"డాడీ! మర్చిపోయారేమో కానీ.. మీరు నాకో బైకు బాకీ. పోయిన బర్త్ డేకే రావాల్సిన బండి.. పంటలు బాగా లేవని వాయిదా వేసాం. సుమారు అరవై వేలు. బెస్టాఫ్ త్రీలో నెగ్గండి.. ఆ డిమాండును స్వచ్ఛందంగా వదులుకుంటా.. ఓకేనా" అన్నాడు మూర్తి రోషంగా.

"సరేలేరా.. ముందు ఓడించు చూద్దాం" అని నవ్వుకుంటూ తన తెల్లబలగంలోని పావుని రెండు గడులు ముందుకు దూకించాడు సుందరయ్య.

వెంటనే మూర్తీ తన వంతు ఎత్తువేసి తల్లి వేపు సాభిప్రాయంగా నవ్వుతూ చూసాడు.

మొదలు పెట్టడమే కష్టం. మొదలైంతరువాత ఆపడం అంతకన్నా కష్టం.. చదరంగం తీరే అంత. స్వయంగా ఆడలేదు కానీ సుభద్రమ్మగారికి భర్త ఆటల పిచ్చితో పెళ్ళినాటినుంచీ పరిచయమే. ఆయన గవర్నమెంటు హైస్కూల్లో డ్రిల్లు టీచరు. ఈ మధ్యనే పదవీ విరమణ చేసాడు. తండ్రి తర్ఫీదులో మూర్తీ బాగానే పుంజుకున్నాడు. ప్రస్తుతం అతనే వాళ్ళ యూనివర్సిటీ చెస్ చాంపియన్.

ఐదు నిమిషాల్లోనే తండ్రీ కొడుకులిద్దరూ ఆటలో లీనమై పోయారు.

మరో మూడు గంటల దాకా ఇద్దరూ గుళ్లో విగ్రహాలే.

చీకటి చిక్కపడుతోంది.

'దీపాలు సిద్ధం చెయ్యకపోతే ఎంత రాద్ధాంతమవుతుందో తెలుసు. పిల్లాడికీ, ఆయనకీ ఇలాంటి వేళ వేడి వేడి పకోడీలంటే ఎంతో ఇష్టం.'

ఆ తయారీకని వంటింట్లోకి వెళ్ళిపోయింది సుభద్రమ్మగారు. హాల్లోనుంచీ తండ్రీ కొడుకుల మాటలు వాన హోరు మధ్య వింటూ పనిలో పడిపోయింది.

"తోసి రాజు".. మూర్తి గొంతు. సుందరయ్య గొణుగుడు. ఏదో కాదని గట్టిగా వాదులాడుతున్నాడు కొడుకుమీద.

మొత్తానికి అబ్బాయి చేతిలో ఆయనగారికేదో గట్టి దెబ్బే తగిలినట్లుందీ! ఆ గిజగిజలు వింటుంటే అర్థవవడంలా!

మూర్తి కొత్త బుల్లెట్ మీద తండ్రి నెక్కించుకుని ఊరి మధ్యనుంచి దర్జాగా పోతున్నట్లు ఓ ఊహ తటాలుమని బుర్రలో మెరిసింది. సుభద్రమ్మగారి పెదాల మీద చిరునవ్వు విరిసింది.

'పందెం సంగతెలా ఉన్నా ఈ ఏడాది మాత్రం మూర్తికి తప్పకుండా బండి కొనివ్వాలి. ఒక్కగా నొక్క నలుసు. ఇంటికి వెలుగు. పంటల బాగోగులతో నిమిత్తం పెట్టుకోకూడదీసారి. అంతగా ఐతే చేతి గాజులైనా సరే..'

హాల్లోనుంచి కొత్త గొంతు వినిపించే సరికి సుభద్రమ్మ ఆలోచనల చైన్ తెగిపోయింది.

చేస్తున్న పని ఆపి బైటికి తొంగి చూసింది.

★ ★ ★

ఎవరో కొత్త మనిషి. ఎప్పుడూ చూడని మొహం. ఆకారం ఒకింత వింతగానే ఉంది.

భుజం చుట్టూ కాషాయం రంగు శాలువా.. కిందేమో అబ్బాయి వేసుకునే లాంటి ఇరుకు ప్యాంటు. భుజానికి ఓ జోలెలాంటిది వేలాడుతున్నది. సగం సన్యాసి.. సగం సంసారి లాగుంది వేషం.

గలగలా మాట్లాడుతున్నాడు. 'ఏట్లో పోటు మహా ఉద్ధృతంగా ఉంది స్వామీ. అక్కడికీ మొండికేసి సగం దూరందాకా వెళ్లా . నా వల్ల కాలా. ఊళ్లోకి వస్తుంటే మొదటగా మీ ఇల్లే కనబడింది. వాన వెలిసిందాకా తల దాచుకోక తప్పదు కదా! ఈ వరండాలో కూర్చుంటా.. మీకెవ్వరికీ ఇబ్బంది కలిగించను' అని చెప్పుకొస్తున్నాడు.

'పాపం' అనిపించింది సుభద్రమ్మ గారికి. తలుపులు బిడాయించుకుని లోపల కూర్చుంటేనే చలిగాలికి వళ్ళు గజగజలాడి పోతున్నది. నడి వయసు మనిషికి.. ఎంత కష్టం.. రాత్రంతా బైట వరండాలో అంటే'

వాకిలి తలుపులు బార్లా తీసుండటం వల్ల జల్లు లోపలికి కొట్టి గదంతా రొచ్చు రొచ్చవుతున్నది.

"మూర్తీ! ముందా తలుపులు వేసేయరా.. ఆయన్నొచ్చి లోపల కూర్చోమను" అంది సుభద్రమ్మగారు వంటింటి గుమ్మాని కవతలే నిలబడి.

మూర్తి తలుపులు మూసి వచ్చి కూర్చున్నాడు.

వేసిన తలుపులకు పక్కనే గోడకు చేరగిలబడి కూర్చుండి పోయాడా కొత్త మనిషి. సుభద్రమ్మవంట పనిలో కెళ్ళిపోయింది.

ఆటాడుతూనే ఆ మనిషితో మాటల్లో పడ్డాడు సుందరయ్య.

ప్రసంగ వశాత్తూ చాలా కొత్త విషయాలే తెలిసాయి. ఆ సన్యాసి పూర్వ నామం భైరవయ్యట. పొద్దుటూరు నివాసి. కాశీ విశ్వేశ్వరుని దర్శనానికని పోయి భార్యా బిడ్డలిద్దర్నీ గంగలో పోగొట్టుకున్నాట్ట. ఆ వైరాగ్యంతో చేసే బంగారం వ్యాపారం చాలించుకుని ఇట్లా దేశాలు పట్టి తిరుగుతున్నానని చెప్పాడు. 'కైలాసగిరి నుంచి కన్యాకుమారి దాకా తిరగని పుణ్యక్షేత్రం లేదు స్వామీ! మనశ్శాంతి కోసం ఆరాటం. నీడలా వెన్నంటుండే ఇల్లాలు, బిడ్డా.. ఇద్దరూ ఒకేసారి కనుమరుగయిపోయాక గానీ .. జీవితంలోని డొల్లతనం బైట పడలేదు.' అంటూ ఓ మెగా సీరియల్ కి సరిపడా కథాగానం చేసాడా సెమీ సన్యాసి.

ఇంట్లో వాళ్ళతోపాటే వేడి వేడి పకోడీలు ఒక ప్లేటులో పెట్టిస్తే ఇంత వేదాంతమూ వల్లించిన సన్యాసి 'ఉల్లివి కదా వద్ద'నలేదు సరికదా.. ఒక్క పలుక్కూడా మిగలకుండా ప్లేటు మొత్తం నిమిషంలో లాగించేసాడు.

ఆరగింపుల పర్వం అలా కొనసాగిస్తూనే ఓ కంట తండ్రీ కొడుకుల ఆటమీద కన్నేసీ వుంచాడు.

ఒక రౌండు అప్పటికే మూర్తి గెలిచి ఉన్నాడు. రెండో రౌండు చివర్లోకొచ్చి అడ్వాంటేజిలో ఉన్నాడు. సుందరయ్య తన రాజుని అన్ని రకాలా ఇరకబెట్టుకుని తప్పించుకునే దారి తోచక తన్నుకులాడుతున్న తరుణంలో..

అమాంతం బల్ల ముందుకు దూకేసి " ఈ కుడి వైపు ఏనుగుని బలిచ్చేయండి స్వామీ.. రాజు తప్పుకొనే తోవ అదే ఏర్పడుతుంది!" అని సలహా పారేసాడు. సుందరయ్య శషభిషలు చూసి తనే చొరవగా ఏనుగుని ఎదుటి పక్షం ఏనుగు ముందు మోహరించేసాడు. 'హుమ్' అని మూలిగాడు సుందరయ్య మరో మార్గమేదీ తోచక.

'ఇదొక ఎత్తా' అనుకుంటూ అమాంతం ఆ బలగాన్ని తన ఏనుగుతో ఎత్తికుదేసే ఉత్సాహంలో తన రాజు అరక్షణ గోతిలో పడిపోవడం గమనించనే లేదు మూర్తి కూడా.

ఏనుగు ఖాళీ చేసిన ఆ స్థానంలోకి వెంటనే మంత్రిని తోసేసి 'షా' అని సుందరయ్య బిగ్గరగా అరవడం.. మూడే మూడు నిమిషాలపాటు సంపూర్ణ ధ్యానంలోకి వెళ్ళినా లాభంలేక.. మూర్తి పూర్తిగా చేతులెత్తేయడం.. క్షణాల్లో జరిగి పోయాయి.

ఆట గెలిచిన సుందరయ్య ఆనందం అంతా ఇంతా కాదు.

ఆశ్చర్యంగా సన్యాసి వైపు చూసి "బంటును ఏనుగని.. మంత్రిని రాజని అంటుంటే బేసిక్సు కూడా తెలీవని పొరబడ్డా స్వామీ! మీరు ఇంతాట పెట్టుకుని.."

తలడ్డంగా ఊపాడా సన్యాసి నవ్వుతూ " నిజంగానే నాకీ ఆట 'అ ఆ' లు కూడా తెలీవు స్వామీ! మీరాడే తీరు చూసి తోచిన సూచన చేసానంతే. ఇదంతా నా గొప్పతనమా?.. దీనిది కానీ" అంటూ మెడలో వేలాడే గొలుసు వంక చూపించాడు.

మెరుపు తగ్గిన బంగారపు గొలుసది. లాకెట్ స్థానంలో ఏదో ఎర్రరంగు రాయి వేలాడుతున్నది.

సుందరయ్యమొహంలో అయోమయం. మూర్తి మొహంలో చిరునవ్వు. సన్యాసి మెళ్లో బంగారపు గొలుసంటే నవ్వు రాదా మరి హేతుబద్ధంగా ఆలోచించే బుద్ధిమంతుల కెవరికైనా! ఎంగిలి ప్లేట్లు ఎత్తు కెళ్ళటానికని వచ్చిన సుభద్రమ్మగారు సన్యాసి మాటలు శ్రద్ధగా వింటో అక్కడే నిలబడి పోయింది.

"ఇది వంటిమీద గుండెల్ని తాకుతున్నంత సేపూ మనసులో వున్నదంతా వాస్తవమై తీరుతుంది. ఆటలో మీకు సాయం చేసేటప్పుడు నా మనసులో ఉన్నది ఒక్కటే కోరిక 'ఈ అబ్బాయి ఎట్లాగైనా ఆ ఏనుగుమీద ఆశతో రాజు కాపుగడిని ఖాళీ చేసెయ్యాల'ని. మీ కళ్లతోనే చూసారుగా.. ఏం

జరిగిందో! అదీ ఈ రాయి మహత్యం. మీ ఇంటి గుమ్మం ముందు తడిబట్టలతో నిలబడున్నప్పుడు నన్ను లోపలికి రానీయాలా.. వద్దా అని మీమాంస పడ్డారు మీ అబ్బాకొడుకులిద్దరూ. ఎక్కడో లోపల వంటింట్లో పని చేసుకునే ఈ తల్లి పనిమాలా వచ్చి మీ చేత లోపలికి పిలిపించింది. అదీ ఈ రాయి మహిమే"

మూర్తి మొహం చూసి మళ్లీ అన్నాడా సన్యాసి " మీరు నమ్మడం లేదని తెలుస్తూనే ఉంది. మీ వయసుకది సమంజసమే! దీని శక్తిని మరో సారి నిరూపిస్తా.. చూడండి. మూడు రోజుల బట్టీ ఈ ప్రాంతంలో కరెంటు నిలకడగా ఉండటం లేదు కదా! "

" కొంప తీసి ఇప్పుడుగానీ కరెంటు పుట్టిస్తానంటారేమిటి?" అన్నాడు మూర్తి. ఎంత వద్దనుకున్నా గొంతులో హేళన దాగడం లేదు. పట్టించు కోలేదా సన్యాసి.

" శ్రీ మల్లికార్జున స్వామివారి సుప్రభాతం చదువుకుంటూ పోతుంటా స్వామీ ఒక వరసలో. ఈ లోపలొక ఐదారు నిమిషాలపాటైనా విద్యుద్దీపాలు వచ్చిపోతే ఈ రంగురాయిలో శివసత్తువ ఉన్నట్లే లెక్క" అంటో చప్పట్లు కొట్టుకుంటో శ్లోకాలు చదవడం ఆరంభించాడు.

"ప్రాతస్మరామి గణనాథమనాథబంధుం
సింధూరపూరపరిశోభితగండయుగ్మమ్
ఉద్దండవిఘ్నపరిఖండనచండదండ
మాఖండలాదిసురనాయకబృందవంద్యమ్।
కలాభ్యాం చూడాలంకృతశశికలాభ్యాం నిజతపః
ఫలాభ్యాం భక్తేషు ప్రకటిత ఫలాభ్యాం భవతు మే
శివాభ్యామస్తోకత్రిభువనశివాభ్యాం హృది పున
ర్భవాభ్యామానందస్ఫురదనుభవాభ్యాం నతిరియమ్।.."

ఆశ్చర్యం!

"..నమస్తే నమస్తే మహాదేవ శంభో! నమస్తే నమస్తే దయాపూర్ణ సింధో!
నమస్తే నమస్తే ప్రపన్నాత్మబంధో! నమస్తే నమస్తే నమస్తే మహేశ!.." అంటూండగానే తటాలుమని గదిలో దీపాలు వెలిగాయి.

ఎప్పుడు ఆన్ చేసుందో టీవీ స్పోర్ట్స్ చానెల్.. ఒన్-డే చివరి ఓవర్ లాస్ట్ బట్ ఒన్ డెలివరీకని జడేజా స్టంప్స్ వైపు దూసుకొచ్చేస్తున్నాడు. చూస్తుండగానే అతగాడు విసిరిన బాలుని గేల్ ఎదురెళ్లి బలంకొద్దీ బాదడం.. గాల్లోకి లేచిన బంతి సరిగ్గా బౌండరీ లైనుకి ఇంచికిటుగా నిలబడ్డ ఫీల్డరు పట్టిన దోసిట్లో.. పడినట్లనిపించడం! స్లిప్పయినట్లూ ఉంది.. 'సిక్సర్'అని కామెంటేటర్ల అరుపులు వినిపించడం. గ్యాలరీ జనాల గోల మధ్య .. విన్ అయిందో విండీసో.. చాంపియనయిందో ఇండియన్సో.. క్లియరయే లోపలే.. మళ్ళా తప్పుమని కరెంటు పోనే పోయింది.

పూర్తిగా మతి పోయినంత పనయింది సుందరయ్య దంపతులకు.

మూర్తీ ఆలోచనలో పడ్డాడు. పూర్తిగా నమ్మడానికి హేతువాదం అడ్డొస్తున్నది.

"నాకంతా అర్థమవుతూనే ఉంది. నీకింకా పూర్తివిశ్వాసం కలగనే లేదు కదా స్వామీ.. పోనీ వదిలేయండి" అన్నాడా అర్థసన్యాసి అదో రకమైన నిర్వేదంతో.

సుభద్రమ్మగారు అప్పుడే విస్తరి నిండా భోజనం తెచ్చి సన్యాసి ముందుంచింది. "తల్లీ! మీరింత అభిమానం చూపిస్తున్నారు. చీకటని కూడా చూడకుండా ఓపిగ్గా ఇన్నేసి అనుపాకాలు కమ్మంగా చేసి తెచ్చారు. తినే ప్రాప్తం ఈ నోటి కుండద్దూ?" అన్నాడు అదే మూడులో.

"ముందు తినండి స్వాములూ! ఇంటికొచ్చిన అతిథిని ఖాళీ కడుపుతో ఉంచి మేం మాత్రమే భోంచేయడం.. అదేమంత మంచీ మర్యాదా!"అన్నాడు సుందరయ్య. అప్పటికే అతనికా సన్యాసిమీద అపరిమితమైన గురి ఏర్పడిపోయుంది.

పెదవి విరిచాడా సన్యాసి " అభోజనం రాసిపెట్టుంది స్వాములూ ఈ పూట. ఒక్క నాకే కాదు.. ఇంటిల్లిపాదికీ. అమ్మా! ఒకసారి మీరా లాంతరు వంటింటిదాకా పట్టుకెళ్లి పొయ్యి మీది చూడండి. మీకే అర్థమవుతుంది జరిగిన అనర్థమేమిటో?"

వింత పడుతూ దీపం బుడ్డితో లోపలకి వెళ్ళింది సుభద్రమ్మగారు. అక్కడినుంచే ఒక్క గావుకేక వినబడింది. కంగారుగా లోనికి పరుగెత్తికెళ్ళిన మూర్తి.. సుందరయ్యలకు గిన్నెలో అన్నం మెతుకులతో సహా ఉడికి ఉబ్బిన ఇంత లావు బల్లి కనబడింది. వళ్ళు జలదరించింది అందరికీ.

"ఇదీ తమరి రంగురాయి మహత్తేనంటారా మహానుభావా?"అనడిగాడు మూర్తి సాధ్యమైనంత వెటకారంగా. వెళ్ళిపోయే మూడ్ లో జోలె సర్దుకుంటున్న సన్యాసి నుంచి బదులే లేదు.

అప్పటికి వర్షం కాస్త తగ్గు ముఖం పట్టింది.

లేచి నిలబడి సుందరయ్యకు నమస్కారం చేసి అన్నాడు సన్యాసి" దారి ఖర్చులకు చేతిలో తైలం బొత్తిగా లేదు. ఈ గొలుసు తమరి దగ్గరుంచుకుని కాస్త నగదు ఇప్పిస్తారేమోనని ఆశతో వచ్చాను. అసలు మీ ఇంటి తలుపు తట్టిన కారణం కూడా అదే స్వామీ!"

వెంటనే అందుకున్నాడు మూర్తి "అదేం.. మీ దగ్గరే మహత్తుగల రాయుందిగా! కావాల్సినంత సొమ్ము తమరే సృష్టించుకోవచ్చు కదా?"

సన్యాసి మొహంలో చిరునవ్వు"ఈ రాయికి మహత్తుందన్నానే కానీ.. శూన్యంలోంచి శివలింగాలనీ.. గాల్లోంచీ కరెన్సీ నోట్లను రాలుస్తుందనన్నానా? ఆ తరహా మహత్తే గనక ఈ రాయికుండుంటే ప్రాణానికన్నా మిన్నగా ప్రేమించిన వాళ్లను గంగమ్మతల్లి ఒడికి వదిలి వస్తానా? వ్యాపారం వద్దని వదిలేసుకునే నాటికి నా స్థిర చరాస్తుల విలువ సుమారు పది కోట్ల పైమాట. కొంత ఊరి అనాథ శరణాలయానికి, కొంత చెన్నకేశవస్వామివారి ఆలయానికి రాసిచ్చేసాను. ముందే చెప్పాను.. నేనూ మీ అందరిలాంటి వాడినే అని. ఈ రాయుండట మొక్కటే నా ప్రత్యేకత. తాకట్టు వ్యాపారం చేసే రోజుల్లో నా చేతికొచ్చిందీ గొలుసు. కుదవబెట్టిన మనిషే స్వయంగా చెప్పుకొచ్చాడు దీని మహిమలు. నమ్మలా అప్పట్లో. విడిపించుకోడానికి అతగాడు మళ్ళీ ఎందుకు రాలేదో.. తరువాత తరువాత గానీ తెలిసిరాలేదు. గంగపాలయినప్పుడిది నా భార్య మెడలోనే ఉంది. తన గుర్తుకోసమనే ఇంతకాలం నావెంట తిప్పుకుంది. మామూలు బంగారమని చెప్పి వదిలించుకోవడం తేలికే. నమ్మి కొన్నవాడిని మోసగించినట్లవుతుందది. ఉన్న విషయమేదో చెప్పి.. దృష్టాంతాలు చూపిస్తున్నదందుకే. మీ లాగానే చాలామంది కాశీ మజిలీ కథలని కొట్టి పారేసారు. ఈ పెద్దయ్యలాగా కాస్త నమ్మకం కుదిరినవాళ్ళు గ్యారంటీ అడిగారు. దారి ఖర్చులకోసం రొక్కం అత్యవసరం పడింది. కనకే ఇంతలా మీకు చెప్పుకోవాల్సొస్తోంది. ఆ పైన మీ ఇష్టం. నా ప్రాప్తం" అంటూ సుభద్రమ్మగారికి నమస్కారం చేసి వీధి వాకిలి వైపుకి అడుగులేశాడు సన్యాసి.

మూర్తి ఏదో అనబోయాడు కానీ.. 'వద్దన్న'ట్లు వారించింది సుభద్రమ్మ గారు.

వీధిలో దాకా సన్యాసి వెనకనే వెళ్లొచ్చిన సుందరయ్యను చూసి "పాపం.. ఆయన చేతిలో కాస్తేదన్నా పెట్టకపోయారా?" అంది సుభద్రమ్మగారు సానుభూతితో.

"ఒక వెయ్యి రూపాయలు ఇచ్చేలేవే. పోతూ.. పోతూ.. తొందరలోనే మనకు పెద్ద మొత్తంలో ధనప్రాప్తి కలగబోతున్నట్లు చెప్పాడోయ్" అన్నాడు సుందరయ్య గుప్పెట్లోని గొలుసును హుషారుగా ఊపుకుంటో.

"పెద్ద మొత్తమంటే?" సుభద్రమ్మగారి ఆరా.

"సుమారు ఐదారు లక్షలు" సుందరయ్య గొంతులో ఉత్సాహం.

కనుబొమలు ముడిపడ్డాయి అప్రయత్నంగా మూర్తికి. "ఆ సన్నాసి మాటకూ నా బైకుకూ ముడిపెట్టొద్దు డాడీ" అన్నాడు హెచ్చరికగా!

'చూద్దాం లేరా బాబూ! మూడో రౌండు వేద్దాం పట్టు.. అమ్మ మళ్లీ అన్నం వండటానికి ఎటూ టైం పడుతుంది!" అన్నాడు సుందరయ్య.

" మూడ్ పోయింది డాడీ.." అని లేచి గదిలోకి వెళ్ళిపోయాడు మూర్తి.

"పిల్లాడినింక వదిలేద్దురూ! రేపు తెల్లారగట్లే వాడి ప్రయాణం. " అంది సుభద్రమ్మ గారు వంటింట్లోకి పోతూ.

"అయ్యో.. గ్యాసూ ఇప్పుడే ఐపోవాలా!" అని లోపల్నుంచీ ఆమె అరుపు.

సన్యాసి చెప్పిన 'అభోజనం' గుర్తుకొచ్చింది సుందరయ్యకి.

★★★

తెల్లారు ఝామునే వెళ్ళి పోయాడు మూర్తి.

పట్నం దాకా తండ్రి తోడొస్తానంటే " రోడ్డంతా రొచ్చుగా ఉంది.. నా తంటాలేవో నేను పడతాగానీ పెద్ద మొత్తాలొస్తే మాత్రం కాల్ చెయ్యండి. కొనాల్సిన లిస్టు చాలా పెద్దదే ఉంది నా దగ్గర " అని హాస్యాలు పోయాడు మూర్తి పోతూ పోతూ.

"ముందు రానివ్వరా బాబూ.. చూద్దాం" అని వద్దు వద్దంటున్నా కొడుకు మెళ్ళో రంగురాయి గొలుసు వేసేసాడు సుందరయ్య ముసిముసి నవ్వులు నవ్వుతూ.

మూర్తి తీసేయబోతుండే అడ్డుతగిలింది తల్లి " బోసి మెడతో తిరగడం ఫ్యాషనా ఏందిరా? ఉండనీయ్ మా తృప్తి కోసమన్నా" అంటో.

తల్లికి కష్టం కలిగించడం ఇష్టం లేక గమ్మున ఊరుకుండిపోయాడు మూర్తి.

పట్నం బస్సు స్టాండు నుంచీ కాల్ చేసాడు మూర్తి " రైల్వే లైన్లు సరిగ్గా లేవంటున్నారు. అన్ని బళ్లూ ఆలస్యంగా నడుస్తున్నాయి. అదృష్టం బాగుండి వోల్వా బస్సొకటి దొరికింది నాన్నా! దాంట్లో పోతున్నా! సిగ్నల్సు సరిగ్గా లేవు. మధ్యలో రెస్పాన్సు లేకపోతే కంగారు పడద్దు. చేరంగానే మళ్లీ కాల్ చేస్తా" అన్నాడు

అదే మూర్తి నుంచి తల్లిదండ్రులకు వినిపించిన చివరి మాటలు.

మూర్తి ఎక్కిన వోల్వా బస్సు దారిలో ఏదో కల్వర్టు దాటుతూ కాలవ నీళ్లల్లో జారి పడింది. అధునాతనమైన బస్సు. లోపల్నుంచీ అన్ని డోర్లు ఆటోమెటిగ్గా లాకయ్ ఉండటం.. యమర్జన్సీలో అన్ లాకవాల్సిన మెకానిజం అట్టర్ ఫ్లాపయిపోవడం వల్ల.. అంత అందమైన వాహనమూ ఎక్కిన ప్రయాణీకులందరి పాలిట సామూహిక జలసమాధిగా మారి కూర్చుంది.

రకరకాల కారణాలతో చనిపోయిన నలభై మందిలో మూర్తీ ఒకడు. అతని మృత్యుకారణం మాత్రం చాలా ప్రత్యేకం.

మెడలోని గొలుసు సీటురాడుకు చిక్కుబడిపోయి రంగురాయి అంగిటికి అడ్డుపడటం వల్ల ఊపిరాడక చనిపోయినట్లు పోస్టుమార్టంలో తేలింది.

లకీగా బస్సు ఓ ప్రముఖ నేతాశ్రీ ట్రావెలింగు ఏజెన్సీది.

'ఎన్నికలు ముంచుకొస్తున్నప్పుడే ఈ దారుణం జరగడం ఖర్మ. జరిగిన నష్టమేదో అణాపైసల్తో సహా ఎలక్షన్లయినాక వర్లుకోవచ్చు. ముందు.. పార్టీ టికెట్టు పోకుండా చూసుకోవడం ముఖ్యం. మీడియా ఆర్భాటం.. మృతుల సంబంధీకుల ఆగ్రహం చల్లబడాలంటే ఎవరూ ఊహించని భారీ మొత్తం నష్టపరిహారం కింద అచ్చుకోవడమే ఉత్తమం' నేతాజీ వ్యూహం ఆ లైనులో సాగబట్టి సహబాధితులందరికి మల్లే కొడుకు దుర్మరణానికి నష్టపరిహారం కింద సుందరయ్య దంపతులకు అందిన మొత్తం అక్షరాలా ఐదు లక్షలు!

సన్యాసి మాటలు అక్షరాలా సత్యమయ్యాయి..నిజమే!

కానీ...!

★★★

# న్యూ యాటిట్యూడ్ రాగ్ సావేరి

కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

ఐ మాక్స్ లో రెస్టారెంట్లో నేను కాఫీ తాగుతున్నా. నాకు కొంచెం దూరంలో ఒక జంట కూర్చున్నారు. మధ్య వయస్సు వుండచ్చు. నాకంటే ఓ పదేళ్ళు చిన్నేమో కూడా.... పక్కనే వాళ్ళ అమ్మాయి అనుకుంటా పద్దెనిమిది ఇరవై వయసు వుంటుంది. ఇంకో పక్కన అబ్బాయి కూర్చున్నాడు, పదిహేనేళ్ళు వుండచ్చు. టేబుల్ మధ్యలో పెద్ద ఐస్క్రీం కప్ అందులో తెరలు తెరలుగా రంగు రంగుల ఐస్క్రీం.

ఆయన స్పూనుతో ఐస్క్రీం పెదిమల ఎడ్జ్ లో చప్పరించి " బాగుందన్నట్టు " వాళ్ళావిడ నోట్లో పెట్టాడు కొంచెం. ఆవిడ పెదిమలతో ఐస్క్రీం ని టేస్ట్ చేస్తూ " ఐస్క్రీం బాగుంది" అన్నట్టు పెదిమలను అటూ ఇటూ నాలుకతో ఆ చివరనుంచి ఈ చివర వరకూ తడుముకుంది.

నా కళ్ళలో అనుకోకుండా గిర్రున కన్నీరు. ఏవో జ్ఞాపకాలు. నాకు పెళ్ళైన కొత్తలో నేను కూడా ఇలాగే చేశా. అప్పటికీ నాకు పిల్లలు లేరు. జ్ఞాపకాల ప్రవాహంలో యేదో యింకేదో కళ్ళముందు.... కంటి నీటి తెరలచాటున రంగుల గతం గుర్తుకు వస్తూంటే కంటి ఎడ్జ్ పల్లం చూసుకుని గిర్రున కంట్లోంచి జారబోతుంటే , నా చేతి రుమాలుతో బయట ప్రపంచానికి కనిపించకుండా అద్దేశాను. మొబైల్ లో టైం చూశా. ఇంకా సినిమాకి ఇరవై నిమిషాల టైం వుంది. ఈ మధ్య చేతికి వాచీలు పెట్టుకోవటం మానేశారు చాలమంది. వుదయం లేవగానే మొబైల్ కి మోకరిల్లి మెస్సెజ్స్ ,మిస్సుడ్ కాల్స్ , టైం ఇలా అన్నీ.... ఆఖరికి న్యుస్ పేపర్ కుడా మనకి జీ త్రీ జీ అంటూ అంతర్జాలపు కన్నెక్షన్స్ తో .

విచిత్రం కదా రోజు రోజుకి ప్రపంచం ఎలా ముందుకు వెళ్తోందో ......

నా ఎదురుగా అయిస్ క్రీం తినే జంట పిల్లలతో మూవ్ అయ్యారు అక్కడ్నుంచి.

నా మొబైల్ ఇంతలో మోగింది

" హల్లో అహల్యా"

" కాక..!? ఎలావున్నావు? మీ అమ్మాయిని ఎఫ్ బీ లో యాడ్ చేసుకోవటం కుదరలేదు " అంది అటు నుంచి అయిషా

" యెందుకని? "

" తను ఆప్షన్ బంద్ చేసింది"

" హుమ్మ్ మ్మ్ మ్మ్ " అన్నాన్నేను

" బట్ ఇంకో విషయం తెలిసింది కాకా "

" యేంటది?" క్యూరియాసిటీతో అడిగాను

" కాకా! మాట్రిమోనియల్ సైట్లో మీ అమ్మాయి డిటైల్స్ చూశా. షీ ఈస్ నియరలీ థర్టీ ఫోర్ నవ్ నా వయస్సే "

" అవును నాకే అరవై దాటాయి కదా!" అన్నాను.

" కాకా యెంచేస్తున్నావ్? "

" యేం లేదు అయిషా బోర్ కొడితే మూవీకి వచ్చాను "

" ఓ ఫ్ ఫ్ ఫ్ ఫ్ ఫ్ ఫ్ మళ్లీ ఐమాక్స్ కి పోయావా .... ఆ.... డబ్బులన్నీ యిలా తగలెయ్యి సినిమాలకి " నవ్వుతూ తిడుతున్నట్టుగా అంది . నేను సినిమాలకి వెళ్ళినప్పుడల్లా తను ఇలా మందలించటం మామూలే !

" తర్వాత మాటలాడుతాను కాకా.. వుంటా కాస్త పని వుంది " అంటూ ఫోన్ డిస్కన్నెక్ట్ చేసింది అటు నుంచి

అహల్య నాకు చాట్ ఫ్రెండు , వయసు ముప్పైయ్ దాటి వుండచ్చు. మా అమ్మాయి వయస్సే తనది కూడా. చాల తెలివైనది, లాజికల్ థింకింగ్ యెక్కువ. ఒక చాట్ ఫ్రెండ్ ద్వారా తను పరిచయం అయ్యింది. నేను అయిషూ ...అయిషూ అని పిలుస్తాను తనని. సెంట్రల్ గవర్నమెంట్ జాబ్ . మంచి పొజీషన్, స్వతహాగ మంచి తెలివితేటలు వున్న మనిషి. అమ్మ వుంది నాన్న చిన్నప్పుడే చనిపోయారు. కష్టపడి పైకి వచ్చిన మనిషి. మూక్కుసూటితనం , కాస్త జాలి , కొంచెం పెంకి....కొంచెం కాదు బాగానే పెంకి. సెలవల్లో బాగా లేజీ. పరిచయం అయిన కొద్దిరోజుల్లోనే నాకు బాగ క్లోస్ అయ్యింది. అప్పటినుంచి కాకా కాకా అని పిలుస్తూంది తను. పుట్టింది బందరు అయినా వుద్యోగ రీత్యా హైదరాబాద్ లో వుండటం తను. హైదరాబాద్ భాష అలవాటు అవ్వటం వల్ల " కాకా కాకా" అని ఫోన్ చేసినప్పుడల్లా కావ్ కావ్ మంటూ సందడి చేస్తూ వసపిట్టలా నాతో మాటాడటం తనకి అలవాటు అయ్యింది. వారానికి ఒకసారైనా తనతో మాటాడకపోతే నాకు తోచదు. కానీ ఆచీ తూచీ చాలా మెచ్యూర్డ్ గా మాటాడుతుంది. తనకీ నాకూ పరిచయం అయ్యి రెండేళ్ళు దాటింది.

తను మాటల్లో చెప్పింది చాల కాలం క్రితం తను ఒకళ్ళని పెళ్ళి చేసుకుందామని అనుకుని, అతనితో దాదాపు క్లోజ్ గా తిరిగిందిట. పెళ్ళి వరకూ వచ్చేసరికి అతనికి ఆల్రెడీ మారేజ్ అయ్యిందని తెలిసి కంగు తింది పాపం. ఆ విరక్తిలో స్లీపింగ్ పిల్స్ తిని సూయిసైడ్ అటెంప్ట్ చేసిందిట. డోస్ ఎక్కువై చావు తప్పి బయటపడింది. దాని ఎఫెక్ట్ కి ఒక వారం వరకు కడుపు మంట. ఆ తర్వాత చాలా కాలం వరకూ నార్మల్ కాలేకపోయింది. అప్పటి నుంచీ కొంచెం దిగులు , దిగులు వెంబడి గిల్టీ.

ఇంట్లో తల్లికి తెలిసి యేడ్పులూ, యేడుపుల వెక్కిళ్ళల్లో ఓదార్పులు అన్నీ అయిపోయాయి. ఇప్పుడు కొంచెం పెళ్ళి గురించి కాస్త తటపటాయిస్తోంది... ఆ దెబ్బకు మగవాళ్ళంటే చిరాకు వచ్చేసింది కాస్త.

ఇంత జరిగాక అతను పెళ్ళిచేసుకోలేను కాని వుంచుకుంటా అని ఇండికేషన్ ఇచ్చేటప్పటికికి అహల్యకి ఇంకా చిర్రెత్తు కొచ్చింది. వాడి ఆఫీసుకెళ్ళి ఒక రోజు చెప్పు తీసుకుని యెడా పెడా వాయించేసింది. ఇది జరిగి కుడా చాల రెండేళ్ళు పైనే అయ్యింది. ఇంక తను మామూలు మనిషి కావటానికి చాలా రోజులే పట్టింది. మధ్య మధ్య లో వేదాంత ధోరణి. ఇంకో పక్క పెళ్ళి గురించి వాళ్ళ అమ్మ తొందర పెడుతూ వుండటం, వీటిని తట్టుకుంటూ వుద్యోగం చెయ్యటం కొన్ని రోజులు ఇబ్బందే పడింది. ఒక్కోమనసు కి ఒక్కో చరిత్ర... ప్రతి మనిషి చరిత్ర వికిపీడియా వాడు ఇంకా పెట్టలేదు ...సోషల్ స్టేటస్ వున్న వాళ్ళవే ఇప్పుడు పెడుతున్నారు. కొన్ని సంవత్సరాలు తరువాత అందరి చరిత్రలు వికిపీడియా లో వుండవని గ్యారంటీ కూడా లేదు. అభివృద్దిని అలోచిస్తూ వుంటే ఎటువైపుకు పోతోందో అని ఒక్కోసారి అందోళన కలగక మానదు.

సినిమా హాల్లోకి ఎప్పుడు వచ్చానో.. సినిమా ఇంటర్వల్ ఎప్పుడు అయ్యిందో తెలియలేదు. నా ఆలోచనలతో సినిమా కూడా అలాగే అయిపోయింది. సినిమాని మనసు పెట్టి చూడలేదు. నన్ను నేను మర్చిపోవటానికి నేను సినిమాలకి వస్తాను. ఇక్కడకి వచ్చినా ఏవేవో అలోచనలు వెంటాడుతూనే వున్నాయి.....ఏవేవో మనసుని తాకుతూ అలజడి చేస్తూనేవున్నాయి. హాల్లోంచి పార్కింగ్ వైపుకు నడిచాను మెల్లిగా...

★ ★ ★

అలా అహల్య తో మాటాడి వారం రోజులు గడిచిపోయింది. మళ్ళీ ఆదివారం వచ్చేసింది. ఈ మధ్యలో అహల్యకి రెండు సార్లు ఫోన్ చేసాను కానీ తను చుట్టాలు అనీ ఆఫీస్ వర్క్ లో బిజీ తో మాటలాడటానికి కుదరలేదు. నా లంచ్ అయ్యింది.. ఆదివారం తను ఫ్రీ గా వుంటుందని ఫోన్ చేసాను.

" హలో కాకా.. చెప్పు " అటునుంచి అహల్య

" నువ్వే చెప్పాలి ఆ రోజు ఫోన్ చేసావు ....నేనేమో సినిమా కి వెళ్ళాను....నువ్వు మళ్ళీ ఫోన్ చెయ్యలేదు, యేంచెప్పలేదు " అన్నాన్నేను

"హుమ్మ్ మ్మ్" అంటూ "యేంలేదు కాకా మీ అమ్మాయిని ఎఫ్ బి లో యాడ్ చేసుకోవటం కాలేదు ... ఇంకో విషయం యేమిటంటే నేను గూగుల్ చేస్తూంటే మారేజ్ బ్యూరో సైట్ లో మీ అమ్మాయి డిటైల్స్ చూసాను"

"ఓకే" అన్నానేన్ను వింటూన్నట్టుగా

" ఆ డిటైల్స్ లో ఫాదర్ ప్లేస్ లో నీ నేం లేదు కాకా ... షీ మెంక్షన్స్ సం ఎవరో అంకుల్స్ గోత్రం"

" ఓకే"

"ఒకటి చెప్పాలా కాకా యెక్కువ బాధపడకు జరిగిన నష్టం జరిగిపోయింది .... దాని గురించి యెక్కువ అలోచించి హెల్త్ పాడుచేసుకోకు... ఆల్రెడీ నీకు స్ట్రోక్ కుడా వచ్చింది"

" అహల్యా ఒకటి చెప్పు నేను నిజం చెప్పి తప్పు చేశానా"

"అబద్దం చెప్పి సర్వైవ్ అవుతే లాభం ఏమిటీ? " అటు నుంచి అహల్య ప్రశ్న

" కలిసి వుండేవాడినేమో కదా" అన్నాను

" హ హ హ ... " చిన్నగా నవ్వి అహల్య అంది " మనిషి ఒక అబద్దం చెప్పి సర్వైవ్ అయ్యాక మళ్ళీ సర్వైవల్ కోసం ఇంకోసారి ఇంకోసారి అబద్దాన్ని ఆసారా చేసుకోవచ్చు. అప్పుడు అబద్దమే అలవాటుగా మారుతుంది. నువ్వు నిజం చెప్పే కరెక్ట్ చేసావు కాకా.. బట్ నష్టపోయావుయేమో అది వేరే విషయం. నువ్వు నిజం చెప్పి మంచిపనే చేశావు." అంది

" కానీ.... " అంటూ ఆగిపోయాను.

" కాకా! ఒక మాట చెప్పనా యేం అనుకోకు మనం చేసిన తప్పులకు మనం పదే పదే వర్రీ అవ్వటం వేస్ట్. తప్పు జరిగింది. తప్పుకి ఇంకోతప్పు చెయ్యటం ఒప్పు అనిపించుకోదు. నేను చెప్పింది కరక్టే నా? " అంటూ ప్రశ్నించింది.

"అయిషూ తెలిసి తప్పుచేయటం బాధపడటం ఒక్కోసారి వింతగా అనిపిస్తుంది. అదీ చదువుకున్న నా లాంటి వాళ్ళు తప్పు చేయటం. తప్పులు చేసేటప్పుడు చాల మంది విచక్షణ కోల్పోతారేమో దానికి నేను కూడా అతీతుడ్ని కాదేమో. ఇంకో విషయం ఏమంటే తను అన్నీ మరిచిపోయి సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేద్దాం అని అనటం, ఇంతలో నేను వుద్యోగ రీత్యా వేరే చోట కి రావటం, తన మనసు మారటం, నాకు లీగల్ నోటిస్ ఇవ్వటం అన్నీ జరిగిపోయాయి.. డైవోర్స్ కూడా అయిపోయింది "

" హుమ్మ్ "

" మా కొలీగ్ అండ్ మా ఫామిలీ ఫ్రెండ్ ఒకసారి మా వూరికి వెళ్ళి మా పిల్లల్ని చూసిరమ్మన్నా.. చూసింది నా పిల్లల్ని కాదు ఇంకో అతన్ని. అతన్ని మారేజ్ చేసుకుందా లేక రిలేషనా అని అలోచించటం లేదు. పిల్లలు నా నుంచి దూరం అయ్యారే అన్నదే నా బాధ"

"కాకా ఒక్కోసారి మనిషికి సర్దుకుపోదాం అని అనిపించచ్చు , ఇంకోసారి ఎందుకు సర్దుకుపోవాలి అని తనని తాను ప్రశ్నించుకోవచ్చు. మీ అవిడ ఎవర్నో పెళ్ళి చేసుకుందో లేక రిలేషన్షిప్ కంటిన్యూ చేస్తోందో నీకూ నాకూ తెలియదు. మోర్ ఓవర్ నమ్మకం మిస్ అవ్వకూడదు కాకా, అది మిస్ అవుతే ఎప్పుడూ అనుమానాలూ , అబద్దాలు దోస్తులు అవుతాయి మనిషికి. ఇది నిజం. కాకా.. వుండు ఇప్పుడే వస్తా. లైన్ లోనే వుండు " అంటూ ఆగింది

" అలాగే అయిషూ"

కరక్టే నమ్మకం మిస్ అయ్యింది నేనే మిస్ చేసుకున్నా. ఇప్పుడు అనుకుని లాభం లేదు. లేకపోతే పెళ్ళి అయ్యి బుద్దిలేక పక్కింటి ఆవిడతో ఫోన్లో ఫ్లిర్ట్ చేయటం యేమిటీ, అవిడ వచ్చి ఇంట్లో చెప్పటం, ఇరవై ఏళ్ళు సవ్యం గా వున్న మారీడ్ లైఫ్ తిరగబడడం, చెల్లాచెదురుకావటం... పక్కింటి ఆవిడ ఇంట్లో చెప్పినప్పుడు నేను ఫ్లిర్ట్ చెయ్యలేదు అని అబద్దం చెప్పాలనిపించింది. కానీ ఎందుకో మనసు ఒప్పుకోలేదు . అంతా ఏదో సినిమా చూస్తున్నంత ఫాస్ట్ గా జరిగిపోయింది. తను డైవోర్స్ తీసుకుని ఇప్పటికి పది ఏళ్ళు దాటింది. తను మొదటిసారి కోర్ట్ కి వెళ్ళినప్పుడు అమ్మాయిని కలవటం తను "నాతో మాటాడను " అని అనటం, అబ్బాయిని కలవటానికి స్కూల్ కి వెళ్తే వాడు "మీరంటే నాకు ఇష్టం లేదు" అంటూ మొహం మీద చెప్పటం వూహించని విధంగా అన్నీ జరిగిపోయాయి. తను పిల్లలకి యేం చెప్పి వాళ్ళని తనవైపుకు తిప్పుకుందో నాకు తెలియదు, కానీ వాళ్ళ

ముందు కూడా దోషిలా వుండాల్సి వచ్చింది. ఆ రోజు తను వెక్కి వెక్కి ఏడ్చాడు . మ్మ్ ..... కారణం ఎవరూ తనే కదా! ఇప్పుడూ మారేజ్ బ్యూరో లో ఫాదర్ నేంకి బదులు అంకుల్ నేం అని  వుండటం. కొన్ని తప్పులను తప్పించుకుని వొప్పులవైపు వెళ్ళే క్రమంలో ఇంకో తప్పు చకా చకా జరిగిపోతుందేమో?....

"కాకా! వున్నావా" అయిషా గొంతు అటునుంచి

"హా వున్నా"

" కాకా! మీ పిల్లల గురించి యెక్కువ అలోచించకు. తనకికూడా దాదాపు నా వయస్సే. బాగా మెచ్యూర్డ్ అయిన అమ్మాయి. ఆ అమ్మాయి గురించో మీ అబ్బాయి గురించో ఎక్కువ టెన్స్ పడకు. యెలా అయ్యేది అలా అవుతుంది. నువ్వు తప్పు చేశావ్.. రెపెంట్ అయ్యావ్ అన్నది వాళ్ళకి అనవసరం. మీ పిళ్ళల్ని వాళ్ళ మాం  అలా ప్రిపేర్ చేసింది. నువ్వు తప్పు చేశావ్ ... అటు ఆవిడ మారేజ్ ఆర్ రిలేషన్షిప్ తో అవిడ తప్పు చేసింది. బట్ పిల్లలు తల్లి వైపుకు మొగ్గారు. ఇంకో విషయం చెప్పాలా  కాకా?"

" చెప్పు" వింటున్నాను అని అన్నా.

“పిల్లలు అటువైపు మొగ్గటమే కరెక్ట్..  యెందుకంటావా ? నువ్వు తప్పు చేసి ఒక గీత గీసుకున్నావు. ఆవిడ ఇంకో తప్పు చేసిందో ఒప్పుచేసిందో ఇంకో గీత అవిడ గీసుకుంది. కాని పిల్లలు అవిడ దగ్గర వుండటం వల్ల సొసైటీ అవిడని రిసీవ్ చేసుకుంటుంది. చేసింది ఇద్దరూ తప్పు అయినా నిన్ను అందరూ తప్పు గా చూడచ్చు, లేదా అవిడని తప్పు పట్టచ్చు. పిల్లలు నీ దగ్గరకు వస్తే అవిడ మానసికంగా అలోన్ అవ్వచ్చు, సో అవిడ చేసిందే కరెక్ట్ .....రిలేషన్షిప్ మైంటైన్ చెయ్యకుండా లేదా మారేజ్ చేసుకోకుండా పిల్లల్ని పెంచచ్చు కదా అని నువ్వు అడగచ్చు. ఎందుకు పెంచాలి అని నిన్ను నేను అడుగుతాను .... నీ దగ్గర సమాధానం వుందా చెప్పు కాకా? "

" హుమ్మ్"

" చెప్పలేవు! ఎందుకంటే నువ్వు ఏదో తప్పు మాత్రమే చేశావు. నీలో అలోచనా శక్తి వుంది. ఐ నో దట్ . ఇంకో విషయం ఏమంటే అవిడకి ఆర్థిక కారణాలు కావచ్చు, లేదా బయోలాజికల్ నీడ్స్ కావచ్చు..  లేదా పిల్లల్ని వొప్పించి నీ మీద కసితో ముందుకు వెళ్ళలేనా అని కూడా చేసి వుండచ్చు.  యేది యేమైనా వాళ్ళు హాప్పీగా వున్నారు అని అనుకుని గడిపెయ్యి కాకా! అసలే నీ హెల్త్ అంతంత మాత్రం.." అని ఆగింది.

" అంతేలే .. అంతకంటే యేం చెయ్యలేను .... ఇంతకీ నీ మారేజ్ ఎప్పుడు అయిషూ? " అడిగాను

" హ హ హ " అంటూ నవ్వేసి " అడిగావా కాకా.. ఇంకా అడగలేదూ అని ఎదురు చూస్తున్నా. ఇక్కడ ఇంట్లో రోజూ అమ్మతో  ఆ విషయంలో యుద్ధాలే జరుగుతున్నాయి"

" మరి చేసుకోవచ్చు కదా"

" లేదు కాకా! చేసుకుంటాను.. నాకు కొంచెం టైం కావాలి. అదే అమ్మతో కూడా చెప్పాను. కాకా నువ్వు తెలిసి తప్పు చేశావ్ , నేను ఒక వ్యక్తి ని మనస్పూర్తి గా ప్రేమించాను, పెళ్ళి వరకూ వచ్చేసరికి నాకు తెలిసింది తనకు ఆల్రెడీ మారేజ్ అయ్యింది అనీ"

" ఇదివరకే అంతా చెప్పావు కదా అయిషూ! తెలుసు" అన్నాన్నేను

" అదీ కాకుండా నా దగ్గర అన్నీ దాచి నన్ను దోచుకున్నాక ఇంకా ఆశ చావక నన్ను అనఫీషియల్ గా వుంచుకుంటాననే ప్రపోజల్ చేసిన వాడిని యేం చెయ్యాలి చెప్పు"

" నేను యేం చెప్పలేను అయిషూ! నేను కుడా తప్పు చేసిన బోనులోనే వున్నా"

" లేదు కాకా నువ్వు చేసిన తప్పు మనసుకి సబంధించినదీ, ఒక బంధానికి సంబంధించినదీ, బట్ నా దగ్గర రెండేళ్ళు అన్నీ దాచి అనుభవించి చేసింది మోసం కాదా? "

" అలాగంటే నేను కుడా తనని మోసం చేసినట్టే కదా అయిషూ!?"

" లేదు కాకా! నీకు మారేజ్ అయ్యి కొన్ని యేళ్ళు గడిచిపోయాయి. నువ్వు ఫోన్లో ఫ్లిర్ట్ చేసావు ఇంకొకళ్ళని ... నీ విషయంలో బ్రాడ్ మైండ్తో ఎక్స్క్యూస్ చెయ్యచ్చు, చెయ్యకపోవచ్చు మీ అవిడలా, అది వేరే విషయం.  బట్ నా విషయంలో అతను కావాలని మోసం చెయ్యటమే కాకుండా ....

ఎలాగూ చెడ్డాను కాబట్టి చచ్చినట్టు వాడి ప్రపోజల్ వొప్పుకుని వుంపుడు కత్తెగా వుంటానని అనుకున్నాడు.  వాడి ఆఫీస్ కెళ్ళే చెప్పుతో కొట్టాను. నీకు చెప్పాను కదా ఇది వరకు ఈ విషయం "

" హా అయిషూ.. చెప్పావు "

" మా మేనమామే వున్నాడు, కాకా ఇంకా పెళ్ళి చేసుకోకుండా బ్రాడ్ మైండెడ్ ఈ విషయాలు అన్నీ తెలుసు.  అతన్నే చేసుకుంటా! అతనికి కూడా ఒకే. పుట్టే పిల్లలకి హెల్త్ ప్రాబ్లెంస్ వస్తాయి అని అలోచిస్తున్నా ఇన్నాళ్ళూ. బట్ దానికి కుడా సొల్యూషన్ దొరికింది. ఇప్పుడు అటు వైపే మొగ్గు చూపుతున్నా."

" మరి పిల్లలు పుట్టాక హెల్త్ ప్రాబ్స్ అంటున్నావ్ "

" అందరి విషయాల్లో ప్రాబ్లమ్స్ రావ్ కాకా , కొందరి పిల్లల విషయంలో హెల్త్ ప్రాబ్స్ రావచ్చు. అమ్మ ఒక్కత్తే వుంది అవిడ రెస్పాన్సిబిలిటీ నాదే. చుట్టాలు వున్నా ఎవరూ రారు.  కష్టాలు చెప్పుకోవటానికో కలిసి ఎడవటానికో ఒకరు కావాలి కదా "

" హా కరెక్టే "

" సొసైటీలో మళ్ళీ నేను ఒంటరి గా వున్నానని తెలిసి నా వెంటబడకుండా వుండటానికి, ఇంకా పచ్చిగా చెప్తే అప్పుడప్పుడు కావాలని అనిపించే ఫిజికల్ నీడ్స్ కి,  ఖచ్చితంగా పెళ్ళి చేసుకుంటాను. కానీ పిల్లల కోసం మాత్రం కాదు. రేపు వాళ్ళకి  జీన్స్ ఒకటే మూలాన ఎదైనా ప్రాబ్స్ వస్తే వాళ్ళతో కష్టం కాకా...... అందుకనే ఎవరినైనా పెంచుకుంటాను. పెంచుకున్న వాళ్ళని నాకంటే స్ట్రాంగ్ గా తయారు చేస్తాను కాకా! అద్దైతే డాం ష్యూర్ "

" ఒకే అయిషూ నీకు ప్రెసెంట్ పరిస్తితులు తెలుసు. నీకేం కావాలో తెలుసు. యేది  తప్పు యేది ఒప్పూ కూడా తెలుసు. ఒకరికి తప్పు అయినదీ ఇంకోరికి ఒప్పు కావచ్చు . నా వరకూ నీ నిర్ణయం బాగానే వుంది. మీ మేనమామ కి కూడా నీ సంగతి తెలుసు కాబట్టి ఇద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకోగలరు " అన్నాను.

" అదే అనుకుంటున్నాను కాకా ఇంకా మమ్మీ తో మాటడలేదు.  ఇంకో వన్ ఇయర్ అయ్యాక చేసుకుంటాను ... సరే కాకా! వుంటాను నేను నెక్స్ట్  వీక్ కాల్ చేస్తాను.. ఒకే నా!? మరి బై నవ్ "

" ఒకే.. బై "

అటు వైపు కాల్ కట్ చేసిన శబ్దం.

అయిషూ తో మాటాడుతూ వుంటే ఎక్కడికో తీసుకుని వెళ్ళిపోతుంది. చాల బోల్డ్ థింకింగ్. ఈ కాలపు ఆడ పిల్లలకి అది అవసరమేమో. తనకి అన్యాయం జరిగినా ఎదిరించి నిలిచి వెనక్కి తగ్గకుండా మళ్ళీ లైఫ్ లో నిలబడాలనే ధృకృథం చాలా గొప్పది. ఓ కొత్త తరాన్ని ఇరవై సంవత్సరాలు ముందుకు వెళ్ళి చూసినట్టు వుంది అయిషూ ని చూస్తుంటే.

★★★

# అనుబంధానికి ఆధారం శ్రీకళ అబ్బరాజు

"**ఒన్ వీక్ బెంగుళూర్** వెళ్ళాలిరా! తప్పదు. డాడీకి ఎన్నో సాకులు చెప్పి ఎగ్గొట్టాలని ట్రై చేశాను. కానీ, కుదిరేట్లు లేదు." అందమైన మొహం విచారంగా పెట్టి, లిప్‌స్టిక్ రాసిన పెదవుల్ని సున్నాలా చుట్టింది.

"ఫర్లేదు రమ్యా! ఒక్క వారమేగా? ఈ ఏడురోజులూ బీచ్‌కి సెలవిచ్చేద్దాం." ఆమె విచారం పోగొట్టడానికి సరదాగా అన్నాను.

నిజానికి రమ్యలేని సాయంత్రాలు ఊహించుకోవడానికే భయంకరంగా అనిపించింది.

"ఓ.కే... అయితే ఎప్పటికన్నా ఎక్కువగా నీకు ఫోన్లు చేసి విసిగిస్తూ వుంటాను. సరేనా? ఇక నేను బయలుదేరాలి. డాడీ వెయిట్ చేస్తూ వుంటారు." సుతారంగా చేయి నొక్కి వదిలింది.

వెళ్ళిపోతున్న ఆమెను కనుమరుగు అయ్యేదాకా చూస్తూ కూర్చున్నాను.

రూమ్‌కి వస్తూనే ఊరినుంచి నాన్న ఫోన్.

"శారద సంగతి ఏం ఆలోచించావురా?" అడిగాడు.

"నాన్నా! ఒక్కసారి చెప్పానుగా నాకు యిష్టంలేదని. మళ్ళీ మళ్ళీ అడక్కండి. ప్లీజ్..."

"అంటే, నీ మనస్సేమైనా మార్చుకున్నావేమోనని అడిగానురా! పోనీ, యింకోసారి ఆలోచించకూడదూ?" అనునయంగా అడిగాడు.

"నేనంత డైలమాలో లేను. ఈ విషయం యిక వదిలేద్దాం" గట్టిగా చెప్పాను.

ఈ శారదలో ఏ ప్రత్యేకతా లేదు. అందం అంతంత మాత్రం. చదువులోనూ పెద్ద చురుకైనది కాదు. ఆస్తిపాస్తులు లేవు. ఎలాగో తంటాలుపడి బాంక్ ఉద్యోగం సంపాదించింది. అంతే! అయినా, నాన్నకి శారద అంటే ఎందుకని అంత అభిమానమో, నాకు ఎప్పుడూ అర్థంకాదు. శారద నాన్నని ఎంతగా ప్రభావితం చేసిందంటే ఒక్కోసారి నాకే అనుమానం వస్తుంది. నాకంటే నాన్నకి శారదే ఎక్కువా? అని.

వారం రోజుల తర్వాత రమ్య నుంచి ఓ గుడ్‌న్యూస్ విన్నాను.

"యివ్వాళ ఈవినింగ్ బయలుదేరి రేపొద్దునకల్లా అక్కడ ఉంటాను. డాడీని ఒప్పించి నేనొక్కదాన్నే వస్తున్నా! పిక్ చేసుకోవడానికి రైల్వేస్టేషన్‌కి వచ్చెయ్" ఫోన్ చేసి చెప్పగానే గాల్లో తేలిపోయాను.

వెంటనే, నేల మీదకు లాగుతూ నాన్న ఫోన్.

"శారదని చూసి వెళ్ళినవాళ్ళు, సంబంధం వద్దన్నారా! నువ్వు కాదనుకున్నట్టేనా? " అంటూ.

ఎన్నిసార్లు చెప్పినా మళ్ళా అక్కడికే వస్తారు.

చెప్పిన సమాధానమే తిరిగి చెప్పి నిరాశపరచక తప్పలేదు.

అమ్మకూడా లేకపోవడంతో, నా పెళ్ళి వల్ల నాన్నకి కొంత యిన్‌సెక్యూరిటీ వుండవచ్చు. ముందు శారదకు పెళ్ళి కుదిరితే, నాన్న మానసికంగా సిద్ధపడి వుంటారు. అప్పుడు, చిన్నగా రమ్య సంగతి చెప్పాలి అనుకున్నాను.

ఆ రాత్రి ఎంతకీ, నిద్రపట్టలేదు. నాన్న అంతలా ఎందుకు బాధపడుతున్నారో. నాన్నకి శారదంటే ఎందుకంత యిష్టం? ఆలోచనలు రకరకాలుగా సాగాయి.

నాన్న, శారదా వాళ్ళ అమ్మ ఒకే ఆఫీసులో పనిచేసేవారు. ఆ రోజు జోరుగా వానపడుతోంది. అప్పుడు నేను నాన్న ఆఫీసులో నుంచి బయటకు వస్తున్నాను. శారద కూడా గొడుకు వేసుకుని అక్కడికి వచ్చింది. ఇంటికి వచ్చేటప్పుడు వాళ్ళమ్మ తుడవకుండా, యింకో గొడుగు చేతబట్టుకుని వచ్చింది.

"పిల్లలంటే యిలా వుండాలి. ఎంత మాతృభక్తి. మావాడు చూడండి సినిమాకి డబ్బు తీసుకుని పోతున్నాడు కానీ, ఎలాగూ వస్తున్నాం కదా! నాన్నకి ఓ గొడుగు తీసుకెళ్దాం అన్న జ్ఞానం కూడా లేదు" అని మా నాన్న అనడం నాకు బాగా గుర్తు. శారద మీద ఏర్పడిన మంచి అభిప్రాయం రాతిమీద చెక్కిన అక్షరాల్లాగా అలాగే నిలబడిపోయి ఉంటుంది.

ఆ తర్వాత అయినా, శారద సాధించినదేమీ లేదు. నేను ఎమ్‌సెట్‌లో రాంక్ కొట్టాను. MNC కంపెనీలో మంచి ఉద్యోగం సాధించాను. అయినప్పటికీ, సెలవులకి యింటికి వెళ్ళినప్పుడల్లా శారదనే పొగుడుతూ ఉంటాడు.

"శారద తమ్ముడిని దగ్గరుండి చదివిస్తుందట. పార్ట్‌టైమ్ జాబ్ చేసి వాళ్ళ నాన్నకి ఫీజుల ఖర్చు తగ్గిస్తుంది. శారద గుర్తుపెట్టుకుని నాకు ఏటిఎమ్ కార్డు యిప్పించిందిరా! దగ్గరుండి ఆపరేట్ చేయడం కూడా నేర్పించింది. " ఇలా చెబుతూనే ఉంటాడు.

అందులో అంత విశేషం ఏముందో నాకు అర్థంకాదు.

వయసైపోయే కొద్దీ నాన్నకి చాదస్తం ఎక్కువవుతుందనిపించింది. అలా ఆలోచిస్తూ ఎప్పటికో నిద్రపోయాను.

అలారం మ్రోగడంతో ఆరుగంటలకే మెలుకువ వచ్చింది. రమ్యకి యిష్టమైన బ్లూ కలర్ షర్ట్ వేసుకుని తయారయాను. హుషారుగా తలదువ్వి, స్ప్రే కొట్టుకుని క్రిందకి దిగేసరికి, యింటి ఓనర్ వాళ్ళ పాప వరండాలో వాళ్ళ నాన్న ఒడిలో కూర్చుని ఆడుతూ వుంది.

"హాయ్‌ ! పింకీ!" చిరునవ్వుతోనే వాళ్ళ నాన్నను కూడా విష్ చేసి, బైక్ తీశాను.

ట్రైన్ గంట లేటు. ముందురోజు రాత్రి వానపడడం వల్ల స్టేషన్ అంతా బురద, మట్టితో నిండిన చెప్పుల అచ్చులు పడి చీదరగా ఉంది. అయినా, రమ్యకోసం ఎదురు చూడడంలో విసుగనిపించలేదు.

ఇంకో పదినిమిషాల్లో ట్రైన్ వస్తుందనగా సెల్ రింగయ్యింది. ఎత్తకూడదనుకుంటూనే చూశాను. ఫోన్ చేసింది రమ్య.

"సారీ రా! అయామ్ ఎక్స్‌ట్రీమ్లీ సారీ.. ప్లీజ్... కోపం తెచ్చుకోవు కదూ!"

ఫోన్ ఎత్తుతూనే చెప్పింది.

"ముందు విషయం ఏమిటో చెప్పు" కంగారుగా అడిగాను.

"నిన్న ఈవినింగ్ బయలుదేరలేకపోయాను. సారీ! కోల్డ్ అండ్ ఫీవర్. నీకు నిన్ననే చెప్పాల్సింది. టాబ్లెట్స్ వేసుకుని మత్తుగా నిద్రపోయా! అయామ్.. సో...సారీ. ఊ... ప్లీజ్ కోపం పోయిందా?" గోముగా చెప్పింది.

"సరే! జాగ్రత్త. టేక్ కేర్"

"రెండు రోజుల్లో మామూలైపోతాగా. అప్పుడు వచ్చేస్తా. అన్నట్టు యింకో చిన్న హెల్ప్ కావాలి. ప్లీజ్."

"చెప్పు"

"నా ఫ్రెండ్ సుచీ ...సుచిత్ర నీకు తెలుసుగా, రాజ్ కజిన్. దాని బర్త్‌డే ఈరోజు. ఒక బొకే పంపించవా నా పేరుతో. ఎల్లో రోజెస్ అంటే దానికి చాలా యిష్టం. పంపిస్తావు కదూ. "

"ఓకే! లవ్ యూ!" ఫోన్ పెట్టేశాను.

దాదాపు రెండు గంటలు తిరిగి ఆ బొకే సంపాదించి, గంటలేటుగా ఆఫీసుకి వెళ్ళాను. రమ్యకోసం ఎంత చేసినా తక్కువే. నా దృష్టిలో.

రమ్య బెంగుళూరు వెళ్ళి పదిహేనురోజుల పైనే అయ్యింది. అయినప్పటికీ, చెప్పిన మాట ప్రకారం రోజుకి కనీసం మూడుసార్లన్నా ఫోన్ చేస్తూనే వుంది. మాట్లాడిన ప్రతిసారీ నన్నెంతలా మిస్సవుతుందో చెబుతూ వుంటే నాకు చాలా సంతోషంగా వుంటుంది.

బీచ్ దగ్గర రమ్యతో అందమైన సాయంకాలాలు అమాయకంగా, ముద్దుముద్దుగా వుండే ఆమె మాటలు నేనూ మిస్సవుతున్నాను.

నాన్నకూడా శారద సంగతులు మాట్లాడడం లేదు. ఇది నాకు హాయిగానే వుంది.

రమ్య తిరుగు ప్రయాణం ఏదో ఒక కారణం చేత వాయిదా పడుతూనే వుంది. ఆమెని చూసి దాదాపుగా ఒక నెల అయ్యింది.

ఆఖరికి, ఒకరోజు రమ్య తిరిగి వస్తున్నానని పక్కాగా చెప్పడంతో, నా ఆనందానికి అవధులు లేవు. "రమ్య వస్తోంది, అందుకే, రేపు ఆఫీసుకి రావడంలేదు. మీటింగ్స్ అన్నీ ఎల్లుండికి పోస్ట్‌పోన్ చేయమని మేనేజర్‌కి మెయిల్ పెట్టాను. ఒకవేళ నిన్నడిగితే, నీకూ ఓ.కె. అని చెప్పేయ్" కొలీగ్ సుధీర్‌కి చెప్పి అరగంట ముందే ఆఫీసు నుంచి బయటపడ్డాను.

పార్కింగ్ లాట్ నుంచి బైక్ తీస్తుండగా సుచీ ... సుచిత్ర కనిపించింది. సుచీ మొహం చూస్తే ఏదో టెన్షన్ పడుతున్నట్టుగా ఉంది. "ఒక్క నిముషం. నీతో మాట్లాడాలి. కాఫీ షాప్‌కి వెళదాం, పద" అడిగింది. విసుగ్గా అనిపించినా మర్యాద కోసం వెళ్ళాను. ఆర్డర్ చెప్పి, కార్నర్ టేబుల్ చూసి కూర్చున్నాము.

"అనిల్.. రమ్య గురించి ఒక విషయం చెప్పాలి" నసుగుతూ అంది.

"మళ్ళీ ప్రయాణం పోస్ట్‌పోన్ అయ్యిందా?" విసుగ్గా అడిగాను.

"లేదు.. రమ్య రాదు. దానికి నిన్ననే పెళ్ళయిపోయింది."

"వ్వాట్?" పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడ్డాను.

"ప్లీజ్... కూల్‌గా విను. నిన్ననే దానికి పెళ్ళయ్యింది. నువ్వనుకుంటున్నట్టు అది బెంగుళూర్ వెళ్ళలేదు. విజయవాడలో ఉంది."

"ఆర్ యూ ఓకె. నన్నేమైనా ఫూల్‌ని చెయ్యాలనుకుంటున్నావా? నిన్న రాత్రి కూడా నాతో ఫోన్‌లో మాట్లాడింది. రేపు ఉదయానికల్లా యిక్కడుంటానని చెప్పింది." వద్దనుకున్నా గొంతులో ఆవేశం వచ్చింది.

వెయిటర్ కాఫీ తేవడంతో నన్ను నేను కంట్రోలు చేసుకున్నాను.

"నా మాట నమ్ము. నిన్ననే దాని పెళ్ళి విజయవాడలో జరిగింది. ఈ విషయం నీకు చెప్పొద్దని నాతో ఒట్టు వేయించుకుంది కూడా. బెంగుళూర్ వెళుతున్నానని చెప్పడం అబద్ధం. రోజూ నీకు ఫోన్ చేయడం కూడా నిన్ను ట్రాక్ చేయడానికే. నీవల్ల పెళ్ళి ఆగిపోకూడదని. నువ్వెక్కడున్నావో ఏం చేస్తున్నావో ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి నిన్ను మాయలో ఉంచడానికి అలా తియ్యగా

కబుర్లు చెప్పింది. ఇవాల్టినుంచీ దానికా అవసరం లేదు. పెళ్ళేలాగూ జరిగిపోయింది. యింకో వారంలో అమెరికా కూడా వెళ్ళిపోతుంది. నిన్ను చూశాక నిజం చెప్పకుండా ఉండలేకపోయాను. అయామ్ సారీ!"

ఒక్క క్షణం నాకు ప్రపంచం ఆగిపోయినట్టైంది.

రమ్య సెల్‌కి కాల్ చేశాను. నంబర్ డిసేబుల్డ్ అని మెసేజ్ వచ్చింది. సోషల్ ఎకౌంట్స్ చెక్ చేశాను. ఫేస్‌బుక్, వాట్సప్ అన్ని ఎకౌంట్లూ క్లోజ్ చేసేసింది.

నేను ఎంత వెధవనో అర్థమైంది.

🦋🦋🦋

సుధీర్ ఫోన్ చేసి చెప్పడంతో నాన్న ఊరి నుంచి వచ్చారు.

ఒక్కగానొక్క కొడుకుని కదా!

రమ్యలాంటి అమ్మాయికోసం చనిపోయేంత పిచ్చిపని నేను చేయనని నాన్నకి మాటిచ్చాను.

నాలుగురోజులు ఉండి నాన్న వెళ్ళిపోయారు.

రమ్యని కోల్పోయానన్న బాధలేదు. కానీ, రమ్య మా రిలేషన్‌కి యిచ్చిన విలువ యిదేనా? అని తలుచుకుంటే మాత్రం బాధగా వుంటుంది. దాన్నుంచి కూడా త్వరగానే బయటపడ్డాను.

🦋🦋🦋

శుక్రవారం కావడంతో, ఆఫీసు నుండి త్వరగానే యింటికి వచ్చాను. టీ కాచుకుందామని వంటగదిలోకి వెళ్ళబోతుండగా, మూలనున్న బల్లమీద ఒక కవరు కనిపించింది. బహుశా, నిన్నటి పోస్టులో వచ్చిందనుకుంటా. చూడనేలేదు అనుకుంటూ తెరిచి చూశాను.

నా పుట్టినరోజుకి గ్రీటింగ్స్ తెలుపుతూ శారద పంపిన కార్డు. మా యిద్దరి కుటుంబాల మధ్య ఉన్న పరిచయానికి, స్నేహపూర్వకంగా నా ప్రతిపుట్టినరోజుకీ కార్డు పంపుతుంది. ఎప్పుడూ, ఒకటి రెండు రోజుల ముందుగానే నాకు చేరుతుంది. గత పదిహేను సంవత్సరాలలో శారద పంపే కార్డు పంపడం ఒక్కసారి కూడా మిస్సవ్వలేదు.

శారదలో ప్రత్యేకత ఏమిటి? అని సదా నన్ను వేధించే ప్రశ్నకి హఠాత్తుగా సమాధానం దొరికింది.

శారద ప్రతి రిలేషన్‌కి ఒక గౌరవం యిస్తుంది. కుటుంబసభ్యులు, స్నేహితులు, పరిచయస్థులు. యిలా ఎవరైనా సరే, వారితో గల బంధాన్ని సమర్ధవంతంగా నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తుంది.

ఆమె వారికోసం చేసే పనులు గొప్పవిగా ఉండకపోయినా, వాటిలో ఎదుటివారి పట్ల ఆమెకు గల శ్రద్ధ, అంకితభావం కనిపిస్తాయి.

మా నాన్నకి బాంకు పనుల్లో సహాయం చేసినా, వాళ్ళ నాన్నకు ఆర్థిక విషయాల్లో చేదోడుగా వున్నా. మరేదైనా సరే!

అదే రమ్యలో లోపించింది. శారదలో సహజంగా ఉన్నది.

అతి సాధారణంగా కనిపించే శారదలో, ఈ ప్రత్యేకతే నాన్నకి నచ్చిందేమో? ఇలా ఆలోచించుకుంటూ మేడమెట్లు దిగుతున్నాను.

నన్ను చూసి, పింకీ దోగాడుతూ వరండాలోకి వచ్చింది. నేనూ పలకరింపుగా నవ్వి, నా జేబులో నుంచి పెన్ను తీసి యిచ్చాను. ఒకసారి దానికేసి చూసి విసిరికొట్టింది.

నేను దాన్ని అందుకుని, తిరిగి జేబులో పెట్టుకోగానే, పెన్నుకావాలని చేయి చూపిస్తూ పెద్దగా ఏడుపు మొదలు పెట్టింది. ఎందుకో, ఆ క్షణం నేనూ, ఆ పసిపాప ఒక్కలాగే ప్రవర్తించినట్లు అనిపించింది.

పింకీ, ఏడుపు విని, వాళ్ళ నాన్న గబగబా వచ్చి, దగ్గరకు తీసుకున్నాడు.

నేనూ, ఎవరో చెప్పినట్లే మా నాన్నకి ఫోన్ చేశాను.

"శారదకి కూడా యిష్టం అయితే, పెళ్ళి సంబంధం మాట్లాడిరండి" అని చెప్పడానికి.

# డ్రైవర్ విద్యార్థి

"ఎక్కండి"

ఆలోచన లేదు, కల లాగా ఉంది. ఆ మాట వినగానే ఒక రకమైన మైకం కమ్మి మూడు మెట్లు ఎక్కాను.

రైలు ఇంజిన్ ఎక్కాను.

చిన్నప్పటి కోరిక. అప్పుడప్పుడూ రేగే కోరిక. పిల్లలతో రైలు ఆట ఆడుకుంటున్నప్పుడల్లా చెలరేగే కోరిక. రైలు ఇంజిన్ ఎక్కాలని.

నేను అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాను. శలవలకి ఇంటికి వచ్చాను. తిరుగు ప్రయాణం. మద్రాసు రైలులో వెళ్ళి మరుసటి రోజు విమానం ఎక్కాలి. ఫ్యామిలీ, సెండాఫ్‌కి వచ్చిన వాళ్లు, అందరమూ కలసి తెల్లవారే నాల్గింటికి విజయవాడ రైల్వే స్టేషన్ చేరాము. మేము ఎక్కవలసిన రైలు ఆలస్యమయ్యింది.

మా అత్తగారు బెంచి మీద కూర్చుని పెద్దవాడికి తల నిమురుతూ, రెండో పిల్లను ఒళ్లో పెట్టుకుని జో కొడుతున్నారు. పిల్లలు నిద్ర మొహంతో చిరాగ్గా నన్ను చూస్తున్నారు. మా మావగారు తీరికగా ఒక చేత్తో పలకల కళ్ల జోడు మడతబెట్టి, ఆ కళ్లజోడుని పిడికిట బిగించి, ఆ పిడికిలిని వయ్యారంగా నడుముకు సంధించి, రెండో చేత్తో మా ఆవిడ చేతి వేళ్లని లాలనగా పట్టుకుని, తల వంచి, అరమోడ్పు కన్నులతో మోడర్న్ కణ్వుడి ఫోజ్ పెట్టి, కాళ్ల దగ్గర ప్లాట్‌ఫారం మీద మచ్చలని పరిశీలిస్తూ నుంచున్నారు. సెంటిమెంటు గోదవరి వరదలాగా ఉప్పొంగి ప్రవహించే హెచ్చరికలు కొట్టొచ్చినట్టు కనబడినాయి.

నేను తప్పుకుని చాయ్‌వాలా కేకలని అనుసరిస్తూ పక్కన ప్లాట్‌ఫారం మీదికి వచ్చి ముందుకు నడిచాను. హైదరాబాదు వెళ్లే శాతవాహనా ఎక్స్‌ప్రెస్ బయలుదేరబోతున్నది. అలా ముందుకి వెళ్లి ఎలెక్ట్రిక్ లోకో ఇంజిన్ దగ్గర కాసేపు నిలబడ్డాను. ఇంకొంచెం ముందుకు వెళ్లి ఇంజిన్ ఎదురుగా నిలబడి మాంచి మహాఘనముగా, ఠీవీతో, అద్భుతంగా ఉన్న ఇంజినుని పై నుంచి కింద దాకా ఒళ్లు మరిచి చూస్తున్నాను.

చిన్నప్పుడు వేసవి శలవలకి మా ఊరు వెళ్లేవాడిని. సాయంకాలం పాలబండి వచ్చే సమయానికి తప్పకుండా స్టేషన్ చేరుకునేవాడిని. అది బొగ్గు ఇంజిను రైలు బండి. ప్లాట్‌ఫారం మొదట్లో నుంచునేవాడిని. వంగి వంగి, ముందుకు ముందుకు వంగి పట్టాల మీద నుంచి పక్క ఊరి వైపు చూసే వాడిని. పట్టాల మధ్యలోకి దూకి కళ్ల పైన అరిచేతిని పెట్టుకుని చూసేవాడిని. దూరంగా రైలు బండి పొగ నాకే ముందుగా కనబడేది. రైలు చాలా దగ్గరకు వచ్చేదాకా పట్టాల మధ్యలో రైలుకెదురుగా భయం ఏమాత్రం కనబడకుండా పోటుగాడల్లే నుంచునేవాడిని. రైలు దగ్గరుకు రాగానే ప్లాట్‌ఫారం

మీదికి ఉరికేవాణ్ణి. ఒక్కసారిగా పరిగెత్తి స్టేషన్ మాస్టర్ గదికి ఎదురుగుండా, ప్లాట్‌ఫారం అంచు దగ్గర సెక్షన్ టోకెన్ రింగు పట్టుకు నిలబడ్డ గ్యాంగ్‌మాన్ పక్కకు చేరే వాడిని. వాడు నాకు ఫ్రెండే. అప్పుడప్పుడూ ఇన్‌స్పెక్షన్ ట్రాలీ ఎక్కించేవాడు. మా వెనకే స్టేషన్ మాస్టర్ జెండా పట్టుకుని నిలబడేవాడు. ఆయనకి నాలుగు అడుగుల వెనుక టీ బండి వాడు కిరసనాయిల్ స్టౌకి గ్యాస్ కొడుతూ ఎగిరెగిరి పడేవాడు.

ఔటర్ సిగ్నల్ దగ్గర రైల్ ఇంజిన్ కూత మొదట వచ్చేది. రైలు రావటం కంటే ముందు ప్లాట్‌ఫారం కంపించేది. రైలు ఇంజిన్ మా దగ్గరకు దూసుకు వస్తుంటే, టీ బండి మీది గాజు గ్లాసులు ఎగిరి పడకుండా టీ వాడు చెయ్యేసి అదిమి పెట్టేవాడు. నాకు దడ పెరిగేది, కానీ ప్లాట్‌ఫారం అంచు మీద అలాగే నిలబడాలని పట్టుదల. ఈ లోపల రైలు ఇంజన్లోనుంచి డ్రైవర్ సెక్షన్ టోకెన్ రింగు విసిరేసేవాడు. ఆ క్షణములో నాకు తెలీకుండానే భయంతో ఆరడుగులు వెనక్కి దూకేవాడిని. రైలు ఇంజన్‌లో నుంచి ముందుకు వంగిన డ్రైవర్ వదుపుగా చెయ్యి చాచి గ్యాంగ్ మాన్ చెయ్యెత్తి పట్టుకున్న తరువాతి సెక్షన్ టోకెన్ రింగుని తగిలించుకుని పోయేవాడు. రైలు ఆగే లోపల నేను ప్లాట్‌ఫారం ఆ చివర దాటి ఇంజిన్ ఆగే చోటికి పరిగెత్తుకు వెళ్లేవాడిని. ఈ బొగ్గు ఇంజిన్ డ్రైవర్లు చాలా మంచి వాళ్లు. ఇంజిన్ ఆగే చోట పెద్ద పెద్ద బక్కెట్లతో కాచుకు కూర్చున్న గుంపులుఉండేవి. డ్రైవర్ ఒక్క ఉదుటున ఇంజన్ నుంచి దూకి కింద ఒక వాల్వు తిప్పితే ఇంజిన్ అడుగున ఉన్న గొట్టాలలో ఒక దానినుంచి వేణ్ణీళ్లు గట్టిగా కొట్టేది. డ్రైవర్ బక్కెట్ల గుంపు మీద గట్టిగా గర్జిస్తూ లైన్లో నిలబెట్టేవాడు. ఇంజిన్ కాబిన్లోకి ఎగిరి ఎక్కి బొగ్గు కళాసీ మీద మళ్లీ హూంకరించి. గబ గబా నాలుగు పలుగుల బొగ్గు వెనక నుంచి లాగి ముందు ఫైర్ బాక్సులోకి విసిరేసి చూపించేవాడు.

అప్పుడు చూడాలి డ్రైవర్ని. ఇంజిన్ కాబిన్లో నుంచి ముందుకు వంగి, వెనక గార్డు వైపు, క్రింద వేణ్ణీల కోసం బక్కెట్లతో కొట్టుకునే గుంపునీ మార్చి మార్చి చూసేవాడు. ఎర్ర కర్చీఫ్ నాలుగు వైపుల ముడులేసి తల పైన కట్టి వుండేది. మసి కొట్టుకున్న పసుపుపచ్చ కట్ బనీను. ఇంజిన్ పొగ గొట్టం లాంటి గొంతుకాయ కింద పెద్ద ఆంజనేయ స్వామి బొట్టు సుద్ద. నల్ల బండరాళ్ల వంటి గుండెల మీద గొలుసుకి వేలాడే శిలువ బొమ్మ. నల్లగా, తుమ్మ మొద్దులు లాంటి చేతులు, కుడి భుజానికి కట్టుకున్న తాయెత్తు. రెండో చేతి మీద కాలి మానిపోయిన బొబ్బలు , మీసాల పక్కన బుగ్గ మీద కాలి మానిన ఇంకో మచ్చ, సాయంకాలం నీరెండలో కారుతున్న చెమటతో మెరుస్తూ ఉండేది.

గార్డు విజిల్ వినిపించగానే డ్రైవర్ వెనక గార్డు వంక చూస్తూనే వెనక్కి చెయ్యెత్తి తాడు లాగి రైలు కూత మంచి వయ్యారంగా మోగించేవాడు. కళాసీగాడు ఒక్క గంతులో కింది దూకి క్షణంలో వేణ్ణీళ్ల పైపుని కట్టేసి ఎగిరి గంతేసి ఇంజిన్ కాబిన్ ఎక్కేవాడు. ఈ లోపల డ్రైవర్ బ్రేక్ పైపు వాల్వు ఎడం పక్కకి తిప్పి, స్టీం రెగ్యులేటర్ కుడి పక్కకి తిప్పేవాడు. అప్పుడు చూడాలి బొగ్గు ఇంజిన్ ప్రతాపం. పది రకాలుగా బుసలు కొడుతూ, యుద్ధానికి కాలుదువ్వుతూ, మావటీ అదుపులో పెడుతున్నా ఖాతర్ చెయ్యని మత్తగజము చేస్తున్న భీభత్సం లాగా బొగ్గు రైలు ఇంజిన్ చక్రాలు కొట్టుకునేవి. బక్కీట్ల గుంపు గుండెలు పగిలిపోయి బక్కీట్లను వదిలేసి పారిపోయేవి. నేను మాత్రం కదలకుండా అక్కడే నుంచునే వాడిని.

ఆ డ్రైవర్ నా హీరో.

ఇప్పుడు నన్ను నేను మరచిపోయి, కళ్లు బయటపడేలా శాతవాహనా ఎక్స్ ప్రెస్ ఇంజిన్ని చూస్తున్నాను, డ్రైవర్ పైకి ఎక్కమన్నాడు.

కొంత సేపటికి తేరుకున్నాను. ఇంజిన్లో అసిస్టంట్ డ్రైవర్ ఏదో చెపుతున్నాడు. డ్రైవర్ ఒక చిన్న క్లిప్ బోర్డ్ పట్టుకుని చిన్న చిన్న గీతలతో చెక్ మార్కులు పెడుతున్నాడు. సేఫ్టీ సర్క్యులరు, లోకో రిపెయిర్ బుక్, కాషన్ ఆర్డర్, ఎమెర్జన్సీ ప్రొసీజర్, రూట్ ప్లాను, టైమింగ్సు, ట్రాక్ మెయింటెనన్సు, ఎక్కడెక్కడ స్పీడు తగ్గించి ఎక్కడ పెంచాలో డ్రైవర్ చెపుతున్నాడు, అసిస్టంట్ డ్రైవర్ తిరిగి చెపుతున్నాడు. అంతా రైల్వే భాష.

ఈ లోపల ప్లాట్‌ఫారం మీద నుంచి ఎనౌన్స్ మెంట్. "అటెన్షన్ ప్లీజ్, ప్రయాణికులకు గమనిక. విజయవాడ నుండి సికిందరాబాదు వెళ్లే శాతవాహనా ఎక్స్‌ప్రెస్ మరికొద్ది నిమిషాలలో ప్లాట్‌ఫారం నంబర్ ఐదు నుంచి బయలదేరును". గార్డు విజిల్ వినిపించింది. డ్రైవర్ కిటికీలోనుంచి వెనుకకి చూసి, తలతిప్పి ఎదురుగా ఉన్న గ్రీన్ సిగ్నల్ చూసి, "స్టేషన్ గ్రీన్ సిగ్నల్ క్లియర్" చెప్పాడు. అసిస్టంట్ డ్రైవర్ "స్టేషన్ గ్రీన్ సిగ్నల్ క్లియర్" అని రిపీట్ చేసి, ఇంజిన్ హారన్ మోగించాడు. రైలు నెమ్మదిగా బయలుదేరింది.

డ్రైవర్, అసిస్టంట్ డ్రైవర్, ఇద్దరూ ట్రాక్ మీదకి , ట్రాక్ పరిసరాలని డేగల్లాగ చూస్తున్నారు. సిగ్నల్స్, సెక్షన్ స్పీడ్, ట్రాక్ ఇండికేటర్స్ డ్రైవర్ మొదట గట్టిగా చెపుతున్నాడు, అసిస్టంట్ డ్రైవర్ కన్‌ఫర్మ్ చేసుకుని రిపీట్ చేస్తున్నాడు.

"విజిల్ ఇండికేటర్"

"విజిల్ ఇండికేటర్". అసిస్టంట్ డ్రైవర్ విజిల్ లివర్ నొక్కాడు. అంత మైకంలో కూడా నాకు ట్రయిన్ విజిల్ మోగించటానికి ఒక ఛాన్స్ కావాలనిపించింది.




కొండపల్లి దాటాము.

"సెక్షన్ స్పీడ్ ఎయిటి"

"సెక్షన్ స్పీడ్ ఎయిటి"

పట్టణం పరిసరాలు దాటాం. చుట్టూ పొలాలు అనుకుంటా. దట్టమైన మంచు. నాకైతే ఏమీ ఎదురుగా కనపడటం లేదు. డ్రైవర్లిద్దరికీ కళ్లల్లో ఎక్స్‌రే ఉందేమో. అంత దట్టమైన మంచులో, అంత స్పీడులోను వాళ్లు మాత్రం నిమిషానికో, రెండు నిమిషాలకో ఏవో సిగ్నల్స్ చదువుతున్నారు, రిపీట్ చేస్తున్నారు.

చెరువు మాధవరం స్టేషన్ దాటాము. సరిగ్గా ముగ్గురు నుంచోటానికి సరిపడా ఉంది ఇంజిన్ కంట్రోల్ కాబిన్. రైలు వేగానికి మంచుతో కూడిన చలిగాలి గట్టిగానే కొడుతున్నది. డ్రైవర్ తను తెచ్చుకున్న పెద్ద ఫ్లాస్క్ లోనుంచి పెద్ద మూతలో నాకు టీ పోసి ఇచ్చి, చిన్న మూతలో తను కూడా టీ పోసుకుని చప్పరిస్తూనే ట్రాక్ సిగ్నల్స్ చెపుతున్నాడు.

ధైర్యం తెచ్చుకుని నేను డ్రైవర్ని అడిగా. "నన్ను ఇంజిన్ ఎందుకు ఎక్కమన్నారు"?

"మీరు ఏం చేస్తూ ఉంటారు"? డ్రైవర్ ఎదురు ప్రశ్న వేసాడు. అప్పుడు గుర్తుకు వచ్చింది, నేను మా ఆవిడనీ పిల్లలనీ ప్లాట్‌ఫారం మీద వదిలేసి వచ్చానని. "నేను అమెరికాలో కంప్యూటర్ ఇంజినీరు" అని చెప్పాను. ఇంకా చాలా వివరాలు గుచ్చి గుచ్చి అడిగాడు, ట్రాక్ సిగ్నల్స్ చదువుతూనే. నాకు చిన్నప్పటి నుంచి రైల్ ఇంజినంటే ఎంత ఇష్టమో చెప్పా. మా ఆవిడ పిల్లల గురించి మాత్రం దాచేశా. అయ్యిందేదో అయ్యింది, ఈ కోరిక పూర్తిగా తీర్చుకోవాలి.




డ్రైవర్ నవ్వాడు. "లెవెల్ క్రాస్సింగ్"

"లెవెల్ క్రాస్సింగ్"

డ్రైవర్ మళ్లీ నవ్వాడు. "సార్, ప్లాట్‌ఫారం మీద ఎందరినో చూస్తూ ఉంటాం. ఇంటి దగ్గర నుంచి పారిపోయి వచ్చిన పిల్లలూ, ప్రేమించినవాడు మోసం చేసాడని తెలుసుకున్న ఆడపిల్లలూ, తాగొచ్చిన మొగుళ్ల బాధలు పడలేక ప్లాట్‌ఫారం చేరే ఆడవాళ్లూ, అప్పులు చేసి బిజినెస్‌లో మునిగిపోయి మగవాళ్లూ, పిచ్చెక్కి తిరిగే మనుషులూ. ఆత్మహత్యలకి రైలు పట్టాలే ఎందుకో? మేం డ్యూటీ మొదల్లవక ముందే ఫ్లాట్‌ఫారం మీదకు రావాలి. ఇట్లా ఎవరన్నా కనిపిస్తే పిల్లలనీ, ఆడవాళ్లనీ అయితే హెల్ప్ లైన్‌కి అప్పచెపుతాను. మొగవాళ్లని పోలీసుల దగ్గరకు తీసుకు వెళ్తాను. వీళ్లందరినీ తేలికగా గుర్తు పట్టగలను. మిమ్మల్ని ఆఖరు నిమిషంలో చూసాను. చాలా అయోమయంగా కళ్లు బైర్లు కమ్మినట్టు చూస్తూ ఇంజిన్‌కి ఎదురుగా నిలబడ్డారు. కనుక్కునే టైం లేదు. ఇంజిన్లో ఎక్కించుకుని ఖమ్మంలో రైల్వే పోలీసులకి అప్పచెప్పుదామనుకున్నాను". నేను మామూలు మనిషినే అని నిర్ధారణ చేసుకున్న తరువాత డ్రైవర్ చెప్పాడు..

ముగ్గురం నవ్వుకున్నాం. సంభాషణ తేలికపడింది. మంచు పలచబతున్నట్టుంది. ట్రాక్ ప్రక్కన లీలగా మంచులోనుంచి ఒక చర్చి కంబడింది. డ్రైవర్ క్రైస్తవ పద్ధతిలో నుదురినీ, గుండెలకటూ, ఇటూ చేతి వేళ్లతో అద్దుకున్నాడు.

"మధిర గ్రీన్ సిగ్నల్, ప్రొసీడ్"

"మధిర గ్రీన్ సిగ్నల్, ప్రొసీడ్"

"మంచులో నాకేమీ కనబడటం లేదు, మీకెలా కనబడుతోంది?" అడిగాను.



"సారూ, ఫార్టీ ఇయర్స్ ఎక్స్‌పీరియెన్స్. బొగ్గు ఇంజిన్లో కళాసీగా చేరాను. ట్రాక్ ప్రతి అంగుళం తెలుసు. మనిషికి ఏం చూడాలో తెలిస్తే, అది తప్పకుండా కనిపిస్తుంది". పార్థసారథి ఉపదేశం లాగా బోధించాడు. నిజమే అన్నాను.

"ఇప్పుడు చాలా మెరుగు సార్, ఇది ఎలెక్ట్రిటిక్ లోకో. అదే స్టీం ఇంజిన్ అయితే హీటు, పొగ. కళ్లల్లో బొగ్గు నలకలు పడేవి. అయినా అన్ని సిగ్నల్‌స్‌నీ తప్పని సరిగా పాటించాలి"

"స్టీం ఇంజిన్ కూడా నడిపారా?" ఉత్సాహం పెరిగి అడిగాను.

"ఏంటి సార్ అట్లా అడుగుతారు, ఇలా చూడండి" అని గభాలున ఖాకీ కోటు ఊడ పెరికి, చొక్క లాగి అవతలపారేసి, ఛాతీ బిగపెట్టి ఒక విశ్వరూపం చూపించాడు. ఎప్పుడో కాలి మానిపోయిన గాయాలు. చాలా పెద్ద పెద్ద బొబ్బలతో కూడిన గాయాలు. మనిషి ఎలా బ్రతికాడు అనిపించే గాయాలు.

"ఇక్కడ కాలింది పాసింజర్ బండిలో, ఇది నాకు ఎక్స్‌ప్రెస్ రూట్ ప్రమోషన్ వచ్చిన తరువాత. మా సీనియర్ డ్రైవర్లందరికీ ఇవి తప్పకుండా ఉంటాయి సార్ర్ర్, కానీ మా శరీరం స్టీం ఇంజిన్ కంటే గట్టిది.  వాడు అసిస్టంట్ డ్రైవర్ని చూడండి సార్, బక్కగా ఎలాగ ఉన్నాడో, కుర్రాడు, పాలిటెక్నిక్ చదివాడు. కానీ మా లాగా ధమ్ ఎక్కడ?!" అసిస్టంట్ డ్రైవర్ నవ్వాడు.

"ఖమ్మం ఔటర్ సిగ్నల్"

"ఖమ్మం ఔటర్ సిగ్నల్"

"ఖమ్మం దిగుతారా సార్" అన్నాడు డ్రైవర్.

"కాజీపేట్లో దిగుతాను" అని అన్నాను. వచ్చిన అవకాశాన్ని నేను పోగొట్టుకో దల్చుకోలేదు. సికింద్రాబాద్ అంటే మరీ బాగుండదని మొహమాటం.

రైలు ఇంజన్ ప్లాట్‌ఫారం దాటుకుని ఆగింది. అసిస్టెంట్ డ్రైవర్ గబాల్న ఇంజిన్ నుంచి దూకాడు. ట్రాక్ ప్రక్కన తన పని కానిస్తున్నాడు. డ్రైవర్ నన్ను కూడా దిగమన్నాడు. మేమిద్దరమూ పైకెక్కిన తరువాత డ్రైవర్ తన పనికోసం దిగాడు. స్టేషన్ హాల్ట్ రెండు నిమిషాలు మాత్రమే. అన్ని పనులకీ ఈ రెండు నిమిషాలు మాత్రమే.

గార్డ్ విజిల్. అక్నాలెడ్జ్‌మెంట్ హార్న్.

"స్టేషన్ సిగ్నల్ గ్రీన్, క్లియర్"

"స్టేషన్ సిగ్నల్ గ్రీన్, క్లియర్"

"సెక్షన్ స్పీడ్ ఎయిటి"

"సెక్షన్ స్పీడ్ ఎయిటి"

ఇంకా పొగమంచు పూర్తిగా పోలేదు. సూరీడు తుమ్మ చెట్ల తలల మీద నుంచి, తాటి చెట్ల మొదళ్ల మధ్య నుంచి మా రైలుతో పాటు పరిగెడుతున్నాడు. పొగమంచుతో కలిసిన లేత ఎండ కళ్లల్లోకి కొడుతున్నది.  నాకు మళ్లీ ఏమీ కనబడటం లేదు. డ్రైవర్, అసిస్టంట్ డ్రైవర్ మాత్రం సిగ్నల్స్ చెప్పుకుంటూ పోతున్నారు.

"ఈ ఇంజన్ తయారు చేసిన గాడిదలకి స్పీడొక్కటే కావాలి సార్. కాజిపేట వెళితే కానీ పదిహేను నిమిషాల హాల్టు దొరకదు. మేము మనుషులం కాదా సార్? మాకు బాత్రూం అవసరముండదా? పాసింజర్లకి బాత్రూం పెట్టినప్పుడు, డ్రైవర్లకి బాత్రూం పెట్టాలని తెలీదా సార్?"

ఆ తెల్లవారు ఎండలోనే ట్రాక్ ప్రక్కగా చిన్న గుడి కనిపించింది. డ్రైవర్ గబాలున తల వంచి నమస్కారం పెట్టి కళ్లకి అద్దుకున్నాడు.

"పదేళ్ల క్రితం వరంగల్ దగ్గర డ్రైవరు, అసిస్టంట్ డ్రైవర్ ఒకేసారి దిగారు సార్. ఆ డ్రైవరు నేను ఒకే బాచ్, ఒకేసారి ఉద్యోగంలో చేరాం. వాడికి షుగరు. అందుకని ప్రతి స్టేషన్లో తప్పని సరిగా దిగుతాడు. గభాలున నక్సలైటులొచ్చి డ్రైవర్లిద్దరినీ పట్టుకున్నారు. గార్డుని కూడా పట్టుకొచ్చారు. డ్రైవర్నీ, గార్డునీ కుక్క లంకేసి కట్టేశారు. మేమేం చేసాం సార్? మేము కూడా ఉద్యోగం చేసుకునేవాళ్లమే కదా! మేము కూడా ఇంటికి వెళ్లి పెళ్లాం పిల్లలని చూసుకోవాలా లేదా? సాయంకాలానికి వదిలిపెట్టారంట సార్. నక్సలైట్లు వదిలేసి పోయిన తర్వాత రాత్రంతా పోలిసోళ్ల ఇంటరాగేషన్. ఆ డ్రైవర్ షుగర్ పేషంటు, ఆడు తెల్లవారు ఝాముకి పడిపోతే, రెండో రోజు మధ్యాహ్నానికి పోలీసు వాళ్లు విడిచిపెట్టారు. పోలీసులు పోటుగాళ్లయితే అసలు నక్సలైట్లు ఎందుకొస్తారు సార్?"

"మరి మీ రైల్వే వాళ్లు తర్వాత మిమ్మలిని కాపాడటానికి ఏమీ చెయ్యలేదా?" అని అడిగాను.

"ఏం చేస్తారు సార్, గార్డుకి నాకు ఒక వాకీ టాకి పడేసారు. చూస్తున్నారుగదా, మాకు ట్రాక్ మీద నుంచి కళ్లు తిప్పుకోటానికి క్షణం ఉంటుందా? గార్డుతో ఊసులాడుకోటానికా వాకీ టాకీలు? అయినా నక్సలైట్లు వాకీ టాకీ లు ఎత్తుకుపోతారు కదా, అవి వాళ్లకి ఎక్కువ ఉపయోగం".

నాకు మళ్లీ టీ పోసి ఇచ్చాడు. చలిగాలి. నాకు వద్దన్నాను. "ఏదైనా పంచుకోవలి సార్" అని చెప్పి తను కూడా టీ పొసుకుని చప్పరించడు. నేను కూడా టీ చప్పరించాను.




"విజిల్, లెవెల్ క్రాసింగ్"

"విజిల్, లెవెల్ క్రాసింగ్"

ఎదురెండ. ఇంకొంచెం గట్టిగా కళ్లల్లోకి పొడుస్తోంది. ట్రాక్ ప్రక్కన మసీదు కనిపించింది. డ్రైవర్ ముస్లిం పద్ధతిలో రెండు చేతుల్ని ప్రార్ధనగా పెట్టాడు.

"అందరు దేవుళ్లకీ దండం పెడుతున్నారు" అన్నాను.

ఒక్కసారిగా ఇంజిన్ కాబిన్లో నిశబ్దం. నేను ఊపిరి బిగపట్టాను.

ఎదురుగా క్రాస్సింగ్ దగ్గర రైలు గేట్ వేసి ఉంది. ఆ రైల్వే గేట్ కింద నుంచి ఒక పది, పన్నెండేళ్ల కుర్రాడు సైకిల్ వంచి లాక్కుని వస్తున్నాడు. సైకిలంత ఎత్తులేడు. రైలు ఇంజిన్ మంచి స్పీడులో ఉంది. ఆ కుర్రాడి సైకిల్ రైలు పట్టాల మధ్య పడింది. కుర్రాడు సైకిల్ హాండిల్ పట్టుకుని కుడి వైపు పట్టాకి అడ్డంగా పడ్డాడు. గభాలున లేచి సైకిల్ని అవతలి వైపుకి ఈడవటం మొదలు పెట్టాడు. నేను కళ్లు మూసుకున్నాను. అర క్షణం గడిచింది. అసిస్టంట్ డ్రైవర్ గట్టిగా నోటితో ఊపిరి వదిలి, ఈడియట్ అని అరిచాడు. నేను కళ్లు తెరిచేసరికి ప్రమాదం తప్పింది. నేను చిన్నప్పుడు ఆఖరి క్షణం దాకా రైలు పట్టాల మీద నుంచోవటం ఫ్లాష్ బాక్ లాగా మెదిలింది.

"అందుకు సార్, అన్ని దేవుళ్లకీ మొక్కుతాను. ఇంకెంతమంది దేవుళ్లున్నా మొక్కుతాను. ఈ రైల్లో వెయ్యి మంది ఉన్నారు. పండగ రోజుల్లో రెండు వేల మంది ఉంటారు. రైలు బయట వాళ్లని జాగ్రత్తగా చూడాలీ, రైలులోని వాళ్లనీ జాగ్రత్తగా చేర్చాలి. ఆ డ్యూటీ నాది. ఒక డ్యూటీ అయ్యిన తరువాత మళ్లీ మళ్లీ తిరిగి చెయ్యాలి. జాగ్రత్తగా చెయ్యాలి, ఓర్పుగా చెయ్యాలి, శాంతంగా చెయ్యాలి. నేను స్టీం ఇంజిన్ డ్రైవర్గా ఉన్నప్పుడు ఒకడు హడావిడిగా గొడ్లని ఇటునుంచి అటు తోలాడు సార్. ఓ గేద ట్రాక్ కంకర రాళ్లమీద కాలు మెలి తిరిగి పడిపోయింది. ఏమీ చెయ్యలేక పోయాను సార్. ఇప్పటికీ తలుచుకుంటే గుండె పిండేస్తుంది. అందుకని ఏ ఒక్క దేవుడిని ఒదిలి పెట్టకుండా మొక్కుతాను."



"న్యూట్రల్ సెక్షన్ ఎహెడ్"

"న్యూట్రల్ సెక్షన్ ఎహెడ్"

డ్రైవర్ చెప్పుకుంటూపోతున్నాడు. "ఇంకా పెళ్లిళ్ల సీజనయితే మహా భయం. దేశంలో రైల్వే గేటున్న క్రాస్సింగ్ ఒకటయితే, గేట్లు లేని క్రాస్సింగులు వంద. ఒక ట్రాక్టర్లో వంద మంది పెళ్లి వాళ్లు ఎక్కుతారు. ఒకొక్క జీపులో పాతిక మంది ఎక్కుతారు. పెళ్లికి వెళ్లేటప్పుడు రైలు వెళ్లేదాకా రెండు నిమిషాలు ఆగలేరా సార్? స్పీడుగా వచ్చే రైలు ముందు నుంచి వెళ్లిపోటం సినిమా స్టంటుల్లో చూస్తారు.



వీళ్లు డొక్కు ట్రాక్టర్లలో పెళ్లి వాళ్లని వేసుకుని సినిమా స్టంట్ చేద్దామనుకుంటారు. పైగా పెళ్లి సీజన్ రైలులో ఎక్కే రద్దీ. మేము కనురెప్ప వెయ్యకుండా ట్రాక్ చూడాలి, రైలుని టైముకి నడపాలి. ఊపిరి పీల్చుకోలేము. ఏది ఏమైనా అందరినీ క్షేమంగా చేర్చటం మా డ్యూటి. తర్వాత మేం మా ఇంటికి వెళ్లి మా ఇంటి వాళ్లను చూసుకోవాలి".

"కాషన్ ఇండికేటర్"

"కాషన్ ఇండికేటర్"

"ట్రాక్ మెయింటెనెన్స్"

"ట్రాక్ మెయింటెనెన్స్"

"సెక్షన్ స్పీడ్ 15”

"సెక్షన్ స్పీడ్ 15"




"విజిల్ ఇండికేటర్"

"విజిల్ ఇండికేటర్"




"నేను హార్న్ కొట్టొచ్చా?" ఆత్రంగా అడిగాను.

"హార్న్ కోడ్స్ ఉంటాయి సార్, ఇష్టం వచ్చినట్టు కొట్టకూడదు, ఇలా కొట్టండి" అని చూపించాడు. నేను రెండు సార్లు హార్న్ కొట్టాను. నాకు జీవితంలో ఇంకేమి కోరికలు మిగలలేదు. కానీ మితి మీరిన కోరికతో మూడో సారి హార్న్ కొట్టబోతే, ఇప్పుడు కాదని చెప్పాడు డ్రైవర్.

"డోర్నకల్ సౌత్ గ్రీన్"

"డోర్నకల్ సౌత్ గ్రీన్"

హాల్టు లేదు. కానీ రైలు స్లో అయ్యింది. ప్లాట్‌ఫారం మొదట్లో డ్రైవర్ తన బాగుని విసిరేసాడు. ఎవరో పదిహేనేళ్ల అమ్మాయి ఆ బాగ్ కోసం పరుగు పెట్టింది. ప్లాట్‌ఫారం మధ్యలో ఇంకో ఇరవయ్యేళ్ల అమ్మాయి ప్లాట్‌ఫారం అంచు మీద నుంచుని ఒక బాగ్ పైకి విసిరింది. డ్రైవర్ కిటికీలో నుంచి వంగి ఒడుపుగా పట్టుకుని లోపల పెట్టాడు.

"మా అమ్మాయిలు సార్, చిన్నది హై స్కూల్, పెద్దది డిగ్రీ. నాకు లేట్ మారేజ్ సార్. స్టీం ఇంజిన్లో చేసేటప్పుడు వళ్లు కాలి చాలా సీరియస్ అయ్యింది. కాలిన బొబ్బల్ని చూసి ఎవరూ పిల్లనివ్వలేదు. లేట్ మారేజ్ అయితే ఏం సార్, అన్నీ మన మంచికే కదా. మా ఆవిడ నేను రూట్లో ఉంటే ఎప్పుడూ ఇస్త్రీ బట్టలూ, రెండు పూటలకి సరిపడా భోజనం పంపిస్తుంది. పాపం, తెల్లారే నాల్గింటికి లేస్తుంది. నేను లైన్ దిగి ఇంటికి వచ్చే రోజున అర్ధ రాత్రైనా నిద్ర పోకుండా ఎదురు చూస్తూ ఉంటుంది. నేను రాగానే వేడి వేడిగా అన్నం పెడుతుంది. పాపం ఒక్కతే పాతికేళ్ల నుంచి నేనున్నా లేక పోయినా పిల్లలని పెట్టుకుని నడిపించుకొస్తుంది."

"సార్, పిల్లలని పెద్ద పెద్ద చదువులు చదివించాలని గట్టిగానే కోరిక ఉంటుంది. కానీ, నేనెప్పుడూ దగ్గర ఉండను. కానీ ఎక్కడ సార్, డ్యూటీ, డ్యూటీయే కదా. అందరు తండ్రుల్లాగా కోచింగులకీ, కాలేజీ సీట్లకీ తీసుకు వెళ్లాలనీ మాకూ కోరికలుంటాయి. అంతందెంకు సార్, మా పిల్లలని స్కూల్లో చేర్చినప్పుడు, స్కూల్ బాగేసుకుని బడికి పోతుంటే స్కూల్ దగ్గర దిగబెట్టాలని నాకు కూడా పెద్ద కోరిక ఉండేది. అర్ధరాత్రి డ్యూటీ టెన్షను, పగలు ఇంటికి చేరితే నిద్ర. అయితేనేం సార్ పిల్లలు బంగారం. చూడండి, వాళ్లు నాకు బాగ్ ఇచ్చి ఇప్పుడు బడికి వెళ్తారు. మా చిన్నది నాలాగా ట్రెయిన్ డ్రైవర్ అవుతానంటుంది. అది తప్పకుండా చెయ్యగలదు, కానీ చూసారు కద సారూ, ఇంజిన్లో బాత్రూములుండవు, మరి లేడీస్ ట్రయిన్ డ్రైవర్లెలా అవుతారు?"

"గుండ్రాతిమడుగు ఔటర్ గ్రీన్, ప్రొసీడ్"
"గుండ్రాతిమడుగు ఔటర్ గ్రీన్, ప్రొసీడ్"



డ్రైవర్ చెప్పుకుంటూ పోతున్నాడు. "నాల్గేళ్ల క్రితం నేను బల్లార్షా సెక్షన్లో ఉండేవాడిని. వర్షా కాలం. అర్ధరాత్రి భీభత్సంగా గాలి,వర్షం. నేను అప్ డ్యూటీ చేస్తున్నా. బెల్లంపల్లి దగ్గర ఎందుకో తెలీదు, అనుమానం వచ్చింది. అంత చీకటిలోనూ కల్వర్ట్ ఇండికేటర్ చూసి ట్రైన్ స్లో చేసి బ్రేక్స్ వెయ్యటం మొదలుపెట్టాను. వాగు ముందు ఆగి పోయా. తుఫాను లాంటి గాలి, వర్షం. డిల్లీ నుంచి వస్తున్న లింక్ ఎక్స్‌ప్రెస్ డౌన్ డ్రైవర్ రూల్స్ ప్రకారం చాలా స్లోగా వస్తున్నాడు. వాగు ఒక్కసారిగా పొంగింది. చూస్తుండగానే డౌన్ ట్రయిన్ మధ్యలోని భోగీలు కొట్టుకుపోయాయి. ఆలోచించటానికి కూడా టైం లేదు సార్. డ్రైవర్లు, గార్డులు అందరం కలిసి పరిగెత్తాం. ఈ లోపల ట్రయిన్లో ఉన్న మిలిటరీ పాసెంజర్స్ వచ్చారు. సారు, మిలిట్రీ వోళ్లు సామాన్యులు కాదు. అందరం కలిసి మూడు బోగీల్లోనుంచి వందలమందిని బయటకు లాగాం. తెల్లారేటప్పటికి ఊళ్లోనుంచి చాలా మంది వచ్చారు సార్, తాళ్లు తెచ్చిన వాళ్లు కొందరు, మందులు తెచ్చినాళ్లు కొందరు, ఒకడయితే వెల్డింగ్ మెషిన్ తెచ్చాడు. అప్పటికి వాగు పొంగు తగ్గింది. అందరినీ రక్షించలేక పోయాం. బయటకు తీసుకొచ్చి గట్టు మీద పరిచాం. మధ్యాహ్నానికి ఊళ్లో వాళ్లు భోజనాలు పట్టుకొచ్చారు. మార్వాడి సంఘం వాళ్లెంత హెల్ప్ చేశారు సార్? ఒకళ్లేంటి సార్, ఊళ్లో వాళ్లందరూ. అంత భీభత్సంలోనూ, మానవత్వం అంటే ఏమిటో తెలిసింది. సాయంకాలానికి సికిందరాబాద్ నుంచి జోనల్ ఆఫీసు సార్లు, రాజకీయ నాయకులు చేరారు. నిద్ర లేదు, వల్లు పులిసిపోయి ఏడుస్తుంటే, రాత్రికి వాళ్ల క్వశ్చనింగు. ఈ లోపల న్యూసు. ఢిల్లీలో మినిస్టర్ చెప్పాడంట, డ్రైవర్ ఓవర్‌స్పీడులో వెళ్తున్నాడని. అసలు డిల్లీలో కూర్చున్న మినిస్టర్‌గాడికి ఏం తెలుస్తుంది సార్, ట్రయిన్ డ్రైవర్ పడే బాధలు, టెన్షనూ? న్యూసు పేపర్లు వాళ్లు కూడా మినిస్టర్ చెప్పిందే వేస్తారు. ప్చ్"

"మహబూబాబాద్ సౌత్ సిగ్నల్ గ్రీన్"
"మహబూబాబాద్ సౌత్ సిగ్నల్ గ్రీన్"

ఒక్కటంటే ఒక్క నిమిషం ఆగింది రైలు మహబూబాబాద్ లో. అసిస్టంట్ డ్రైవర్ మళ్లీ కిందకు దూకి హడావిడిగా పని కానించుకుని ఎక్కడు. నేను కూడా. గార్డ్ విజిల్ వేసాడు. డ్రైవరికి టైం లేదు.

"గ్రీన్ సిగ్నల్"
"గ్రీన్ సిగ్నల్"

"సెక్షన్ స్పీడ్ ఎయిటీ"
"సెక్షన్ స్పీడ్ ఎయిటీ"

సూరీడు ఒక ప్రక్కనుంచి కళ్లలోకి పొడుస్తున్నాడు. వాకీటాకీ కరకరా మోగింది. డ్రైవర్ దాన్ని పట్టుకుని ఛానల్స్ తిప్పాడు. కరకరా ఎక్కువయింది. ఈ లోపల "డౌన్ ట్రైన్" అని అసిస్టంట్ డ్రైవర్ కేకేశాడు. డ్రైవర్ ఎక్కడనుంచో ఒక పచ్చ జెండా తీశాడు. కిటికీ లోనుంచి బయటికీ అడ్డంగా పెట్టి నన్ను పట్టుకోమన్నాడు. అంత స్పీడు, చలిగాలిలో పట్టుకోవటం కష్టమే అయ్యింది. అయితేనేం,మంచి హుషారుగా పట్టుకున్నా. జీవితం కూడా ఇంత

వేగంగానూ, పచ్చ జెండాతో సాగిపోతే ఎంత బాగుండును అనిపించింది. ఎదురగా వస్తున్న రైలు డ్రైవర్ కూడా పచ్చ జెండాను అడ్డంగా కిటికీలోంచి బయటకు పట్టుకున్నాడు.

వాకీటాకీతో డ్రైవర్ కుస్తీ పడ్డాడు. డాష్‌బోర్డ్ కేసి నాలుగుసార్లు కొట్టి, చివరకు బ్యాటారీలు తీసి తిట్టుకుంటూ బ్యాటరీలను కిటికీలోనుంచి విసిరికొట్టాడు.

"సార్, వాకీటాకీలు మంచివే ఇచ్చారు. బ్యాటరీలు మాత్రం ఆమ్యామ్యాలతో నాసి రకం ఇస్తారు. డౌన్ ట్రెయిన్ డ్రైవర్ పచ్చ జెండా అడ్డంగా పట్టుకుంటే, మనకు ముందు లైన్ అంతా బాగుంది అని అర్థం. మనం కూడా, ఆ డ్రైవర్‌కి మనం వచ్చిన లైన్ అంతా బాగుందని చెప్పాలి. వాకీ టాకీలు పని చేస్తే జెండా పట్టుకుని వంగాల్సిన అవసరం ఉండదు. ఇక్కడ అదృష్టం బాగుండి డౌన్ ట్రాక్ మనకు పది మీటర్ల దూరంలో ఉంది. దగ్గర దగ్గరైతే చేతులు తెగుతాయి".

"కేసముద్రం సౌత్ గ్రీన్"
"కేసముద్రం సౌత్ గ్రీన్"

ఒక నిమిషం మాత్రమే హాల్టు. డ్రైవర్ వాకీ టాకీలో కొత్త బ్యాటరీలు వేశాడు.

"గ్రీన్ సిగ్నల్"
"గ్రీన్ సిగ్నల్"

"సెక్షన్ స్పీడ్ ఏయిటీ"
"సెక్షన్ స్పీడ్ ఏయిటీ'

డ్రైవర్ ఒక్కసారిగా "రెడ్యూస్ స్పీడ్ టు జీరో" అని అరిచాడు. నాకు చెమటొచ్చినంత పని అయ్యింది. రెండు క్షణాల తరువాత ట్రాకుకి అటూ ఇటూ పది మంది కుర్రాళ్లు రాజకీయ పార్టీ జెండాలు పట్టుకుని ఊపుతూ కనబడ్డారు.

"డైనమిక్ బ్రేక్స్"
"డైనమిక్ బ్రేక్స్"

కొంచెం దూరంలో ట్రాక్ మీద కూర్చున్న మనుషులు కనిపించారు.

"ఎయిర్ బ్రేక్స్"
"ఎయిర్ బ్రేక్స్"

రైలు ఇంజిన్ రాజకీయ జెండాల గుంపులకి అంగుళం దూరంలో ఆగింది. రెండు పెద్ద పెద్ద గుంపులు ట్రాక్‌కి అటూ ఇటూ పట్టాల మీద కూర్చుని రాజకీయ పార్టీ జెండాలు ఊపుతూ "చలో హైదరాబాద్" అని అరుస్తున్నారు. రైలు ఆగగానే పట్టాల మీద గుంపులన్నీ పరిగెత్తుకుని వెనక కంపార్టుమెంటుల్లో ఎక్కాయి.

"గాడిద కొడుకులు, స్టేషన్లో ఎక్కలేరా సార్, ఇప్పుడే కదా కేసంద్రం నుంచి బయలుదేరింది. ఒక క్షణం చూడడం ఆలశ్యంమైతే గొప్ప నాశానానికి కారణమయ్యే వాడిని".

డ్రైవర్ వాకీ టాకీ పట్టుకుని గార్డుతో ఏదో చెబుతున్నాడు. గార్డు స్టేషనుకి మెసేజ్ పంపిస్తున్నాను అని అన్నాడు. రైలు బయలుదేరింది. కానీ క్యాబిన్లో కొంత టెన్షన్ వాతావర్ణం ముసురుకుంది.

"వరంగల్ సౌత్ గ్రీన్, క్లియర్"

"వరంగల్ సౌత్ గ్రీన్, క్లియర్"

డ్రైవర్ క్రిందకి దూకి ప్లాట్‌ఫారం మీద ఉన్న రైల్వే పోలీసులతో, రైల్వే స్టాఫ్‌తోనూ ఏదో అరవటం మొదలుపెట్టాడు. రెండు నిమిషాల్లో మళ్లీ రైలు ఎక్కాడు.

"గ్రీన్ సిగ్నల్"

"గ్రీన్ సిగ్నల్"

రైలు బయలుదేరింది కానీ వేగం అందుకోలేదు. ట్రాక్ సిగ్నల్స్ ఎక్కువయ్యాయి. డ్రైవర్ వాకీటాకీలో బయట ఎవరతోనో రైల్వే భాష మాట్లాడుతున్నాడు.

ఉన్నట్టుండీ డ్రైవర్, అసిస్టెంట్లు ఇద్దరూ కలిసి "మోటోర్ టూ, ఓవర్ హీటింగ్" అని అరిచారు.

"మోటార్ టూ, షట్ డౌన్"

"మోటార్ టూ, షట్ డౌన్"

డ్రైవర్ ఏవో నాల్గు మాటలు రైల్వే భాషలో చెప్పి కంట్రోల్స్ అసిస్టంట్ డ్రైవరికి అప్ప చెప్పాడు. కంట్రోల్ కాబిన్ వెనక ఉన్న సైడ్ డోర్లోనుంచి మెయిన్ ఇంజిన్ రూంలోకి మాయమయ్యాడు. తొంగి లోపలికి చూస్తున్న నన్ను అసిస్టంట్ డ్రైవర్ ఫర్వాలేదు, వెళ్లమన్నాడు. వేడి గట్టిగా కొట్టింది. అప్పటిదాకా తెల్లవారు ఝాము చలిలో స్పీడుగా వెళ్లుతుంటే, ఎదురు చలి గాలి కొట్టి బిగుసుపోయిన నాకు ఒక్కసారిగా కుంపటిలో పడినట్టయ్యింది. ఒకటే వేడి. డ్రైవర్ హడావిడిగా ఏదో చెక్ చేస్తున్నాడు. చివరకి సంస్కృతంలోకి దిగి లోకో మెయింటెనన్స్ వాళ్లని తిట్టటం మొదలుపెట్టాడు. "ట్రాక్షన్ మోటర్ నంబర్ టూ, బ్లోవర్ నాట్ వర్కింగ్, ఇంజిన్ ఓవర్ హీటింగ్" అని అరిచాడు.

"చూడండి సార్, లోకో షెడ్‌లో మేయింటెనన్స్ లాగ్‌లో అంతా బాగుందని రాస్తారు. రన్నింగ్ లో ఇంజిన్ ప్రాబ్లం ఏదయినా మాదే భాధ్యత. శ్రీ కృష్ణుడు యుద్ధంలో రథం తోలాడు కానీ, ఓ గంట రైల్ ఇంజిన్ నడపమనండి, తెలిసొస్తంది". గట్టిగా నవ్వి చెంపలేసుకున్నాడు.

లాగ్ బుక్ లో రాసి, కంట్రోల్స్ మళ్లీ తీసుకున్నాడు.

"కాజీపేట్ సౌత్ గ్రీన్"

"కాజీపేట్ సౌత్ గ్రీన్"

ఇంజిన్ స్పీడ్ తగ్గించ్చారు. రైలు బాగా నెమ్మదిగా వెళ్తున్నది.

"థాంక్ యూ సార్" అని అన్నాడు డ్రైవర్.

"నాకు థాంక్ యూ ఎందుకు, నేను చెప్పాలి గాని" అన్నాను.

"లేదు సార్, మా కథ ఎవడికి తెలుసు, ఎవరు వింటారు? ఓపికగా విన్నారు".

నాకు మాట రాలేదు.

ఓ నిమిషం తరువాత తేరుకుని, "చిన్నప్పుడు రైలు ఇంజిన్ డ్రైవర్ అవ్వాలని అనుకున్నా. మిమ్మల్ని ఇప్పుడు చూస్తే మళ్లీ ఇంజిన్ డ్రైవర్ అవ్వాలని కోరిక పుట్టింది" అని అన్నాను.

"సార్, ఎవరి డ్యూటీ వాళ్లు సరిగ్గా చేసుకోవాలి కానీ, ఇంకొకరి లాగా ప్రయత్నించ కూడదు", మళ్లీ గీతోపదేశం లోకి దిగాడు డ్రైవర్.

"మీరు కాజీపేట్ దిగండి సార్" అని చెప్పాడు డ్రైవర్.

"మరి మీరూ ..?." అని ఏదో అనబోయాను.

'ఈ రైలు నా అధీనంలో ఉంది. నేను మళ్లీ మళ్లీ రైలు నడపాలి. ఒక డ్యూటీ అయ్యిన తరువాత వెనక్కి తిరిగి మళ్లీ మళ్లీ నడపాలి. అందరినీ క్షేమంగా చేర్చాలి"

రైలు ఆగింది. ప్లాట్‌ఫారం మీద నుంచి ఏనౌన్స్‌మెంట్ "విజయవాడ నుండి సికింద్రాబాద్ వెళ్లు శాతవాహనా ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫారం నెంబర్ మూడు మీద వచ్చియున్నది"

కొంచెం భారంగానే రైలు ఇంజిన్ దిగాను.

కాజీపేటలో ఆగిన తరువాత, డ్రైవర్ ఎవరినో పిలిచాడు. "సార్ విజయవాడ ఫోన్ చేసుకోవాలి, తర్వాత విజయవాడ బండి ఎక్కించు" అని చెప్పాడు.

ఇంజిన్ ప్రక్కన చేరుకున్న మెయింటెనన్స్ వాళ్లతో గట్టిగా నాల్గు రైల్వే మాటలు చెప్పి ఇంజిన్లోకి పంపించాడు. రైల్వే పోలీసు ఎస్సైని పిలిచి గట్టిగా ఏదో మాట్లాడుతున్నాడు. ముందు ముందు ట్రాక్ మీద జెండాల వాళ్లను లేకుండా చూడమని డ్రైవర్ చెబుతున్నాడు. ఎస్సై తీరికగా టీ చప్పరిస్తూ తల ఎగరేసి వింటున్నాడు. ఈ లోపల అసిస్టంట్ డ్రైవర్ "మోటర్ టూ మెయింటెనన్స్" అని పిలిచాడు. డ్రైవర్ ఎస్సైతో మాట్లాడి లాభం లేదనుకుని ఇంజిన్లోకి మాయమయ్యాడు.

మా మావగారి ఇంటికి ఫోన్ డయల్ చేస్తూ నేను ఆలోచనలో పడ్డాను. అక్కడ చాలా గందరగోళంగానే ఉండి వుంటుంది. పొరపాటున రైలు ఇంజిన్ ఎక్కి కాజీపేట వచ్చానంటే ఎవరూ నమ్మరు. ఏదో కథ అల్లాలి.

ఫోన్ డయల్ చెయ్యటం ఆపాను.

"చిన్నప్పటినుంచి నా హీరో రైల్ ఇంజిన్ డ్రైవర్. నా హీరో నిజంగానే హీరో". మనసులోని మాట బయట వాళ్లకి గట్టిగానే వినబడినట్టుంది. అందరూ నా వైపు తిరిగి చూసారు.

# దాన సంస్కారం — జయంతి ప్రకాశ శర్మ

కామేశ్వరమ్మ భర్తపోయి తిరిగి పుట్టింటికి చేరేసరికి ఆ ఇంట్లో రోజూ కనీసం పది విస్తర్లు లేచేవి. తల్లి, తండ్రి, నాయనమ్మ, తాను కాకుండా చనిపోయిన తనచెల్లెలి అయిదుగురు పిల్లలు కలసి మొత్తం తొమ్మిది మంది ఆ ఇంట్లో ఉండేవారు. వీళ్ళు కాకుండా, రోజూకనీసం ఒకరో, ఇద్దరో చుట్టాలు భోజనాలకి ఉండేవాళ్ళు. కోనేరు గట్టుమీద రెండు వాసల ఇల్లు వాళ్ళదే. మూడు నాలుగు సంవత్సరాలకోసారి పెంకులు, వాసాలు మార్చుకునే పని ఉండేది. తండ్రి సోమయాజులు రాజుగారి దివాణంలో పని చేసేవారు.

గట్టు చివర మంచినీళ్ళ కుళాయి దగ్గరనుండి బిందెతో పిల్లలు తాగడానికి నీళ్ళు తెచ్చేవారు. పెరట్లో నూతినీళ్ళు ఇంట్లో వాడుకోడానికి సరిపోయేవి. బట్టలు ఊతకడం, ఇల్లు శుభ్రంగా ఉంచటం, బొంకులు దిబ్బకి వెళ్ళి కూరలు తెవటం, కిరాణ కొట్టు నుంచి ఇంటికి కావల్సిన కిరాణసామాను తెవటం వంటి పనులన్ని పిల్లలే చేసేవారు.

కామేశ్వరమ్మ ఆ ఇంట్లోఅడుగు పెట్టగానే దొడ్డమ్మగా మారిపోయింది. తండ్రి సోమయాజులు గారు గవర్నమెంటు ఉద్యోగం వదిలి వచ్చిసిన తర్వాత దివానాఫీసులో ఉద్యోగం చేసేవారు. జీతం అంతంత మాత్రమే వచ్చేది. తన పని తాను చేసుకుపోవాటమే గాని ఆ జీతం గురించి కూడా ఆయన ఎప్పుడూ పట్టించుకునేవారుకాదు. రాజుగారి రోజులు బావుంటే జీతం వచ్చేది. లేకపోతే లేదు. ఇంట్లో మాములు ఖర్చులతో పాటు చుట్టాల తాకిడి వలన వచ్చే అదనపు ఖర్చు కూడా ఎక్కువగానే ఉండేది. దానికితోడు ఇంట్లో అందరూ కర్ణుడుకి దగ్గర బంధువులే! లేదు, కుదరదు , వంటి మాటలు ఇంటా వంట లేవు! దాన ధర్మలకి ఆ ఇంట్లో లోటుఉండేదికాదు. వెరసి నెల తిరిగేసరికి ఖర్చులు తడిపి మోపుడైయేవి. ఇంటి విషయాలని సోమయాజులుగారు పూర్తిగా కామేశ్వరమ్మ మీద వదిలిసారు. జీతాలు అందినప్పుడు తీసుకొచ్చి చేతిలో పెట్టి, 'ఇంకా అవసరమయితే చెప్పమ్మా ' అంటూ అనేవారు. కాని కామేశ్వరమ్మ మాత్రం 'అయన ఎక్కడ తెస్తాడులే' అని సరిపెట్టుకునేది.

భర్త పోయిన తర్వాత కామేశ్వరమ్మకి అత్తవారి ఆస్తి పంపకాలలో తన వాట కింద ఓ ఇల్లు, ఓ పదితులాల బంగారం, ఓ రెండు వెండి కంచాలు, గ్లాసులు వచ్చాయి. ఇంట్లో ఖర్చులకి తండ్రి జీతం , తన ఇంటి మీద వచ్చే అద్దె కలిపి బొటబోటిగా సరిపెట్టేది.. కాని ఎప్పుడైనా అనుకోని ఖర్చులు వస్తే మాత్రం ఇబ్బంది వచ్చేది. చిన్న చితక వ్యావహరమైతే చేబదులు చేసి, ఫస్టుకి తండ్రి జీతం రాగానే తీర్చడం జరిగేది. అయితే ఒకొక్కప్పుడు ఆ అప్పులు కూడా పెరిగినప్పుడు బంగారం కరిగేది.

"ఆ బంగారం లేకపోతే ఇప్పుడేం జాతిలో వెలెయ్యరుకదా. అయినా అవేం గుడ్లు పెడతాయా? కాయలు కాస్తాయా? నాదృష్టిలో అక్కరాని చుట్టం, అవసరానికి పనికిరాని ఆభరణాలు ఉన్నా లేకపోయినా ఒక్కటే! వాటిని ధరించలేం, దాచుకోలేం. ఇంకేందుకు?" అంటూ కామేశ్వరమ్మ ఇష్టంగానే బంగారాన్ని బయటకి పంపించెది. కించిత్ బాధ కూడా ఉండేదికాదు. అలా మొత్తం బంగారం, వెండి వస్తువులన్ని కరిగిపోయి ఆ ఇంటి ఖర్చుల్లో కలసిపోయాయి. అయినప్పటికీ కామేశ్వరమ్మ బాధ పడలేదు. అసలు ఆవిడ బంగారం సంగతిగాని, వాటి కరిగింపులు సంగతిగాని ఎవరికి తెలియనివ్వలేదు. నారు పోసినవాడు నీరు పోస్తాడనే గట్టి నమ్మకం అవిడది.

ఆరోజు సోమయాజులు గారి దూరపుబందువోకయన ఉదయాన్నే రిక్షాలో ఇంటికి వచ్చేడు. గుమ్మంలోనే కామేశ్వరమ్మ ఎదురైంది.

"మదుపాడగ్రహారం నుంచి వస్తున్నానమ్మా! మా ఊరు ఇక్కడికి కొంచం దూరమే..కాని మనం దగ్గర బంధువులమే అమ్మడు. నన్ను ఎప్పుడూ చూసి ఉండవు! నేను, మీ నాన్నా పెద్దతండ్రి పిన్తండ్రి పిల్లలం!! మేం చిన్నప్పుడు ఒకే ఇంట్లో పెరిగాం. వాడు చదువు, ఉద్యోగం అంటూ ఇక్కడకు

వచ్చిసాడు. మేం ఆ ఊరినే నమ్ముకుని అక్కడే ఉండిపోయాం. ఏదో తిండికి,బట్టకి లోటు లేకుండా  కాలక్షేపం అయిపోతుందనుకో!" అంటూ ఆయన పరిచయం చేసుకున్నాడు .

"అదేమిట్రా..అలా గుమ్మంలో నిలబడే మాట్లాడుతూన్నావు. ఇంట్లోకి రా!" అంటూ సోమయాజులు గారు ఆయన్ని సాదరంగా ఇంట్లోకి తీసుకొచ్చి, కూర్చోపెట్టి కబుర్లలో పడ్డారు,

"నువ్వు చాలా కాలనికి కనబడ్డావు! మీ కబుర్లు తెలుస్తున్నాయి గాని, ఏమిటో మనకి రాకపోకలే కుదరటం లేదు! చాలా కాలం కిందట ఎదో పెళ్ళికి కలిసాం . మళ్ళీ ఇప్పుడే కలవటం!! బాగా పెద్దవాడివైపొయావు! మనవాళ్ళందరు ఎలా ఉన్నారు?" అంటూ కామేశ్వరమ్మ వైపు తిరిగి ..

"వీడు మనకి దూరంగా ఉన్న దగ్గర బంధువే. మేం ఇద్దరం ఒక తోటివాళ్ళమే. చిన్నప్పుడు ఒకే స్కూల్లో ఒకే తరగతి చదివే వాళ్ళం. వాడు ఆ ఊరుని నమ్ముకున్నాడు. నేను ఈ ఊరిని నమ్ముకున్నాం." అంటూ పరిచయం చేసారు.

అంతలో అర్జంటుగా రమ్మని , దివానం నుంచి కబురు రావటంతో "ఒరే నువ్వు భోజనం చేసి హయిగా రెస్టు తీసుకో. మొహమాటం పడకు. ఇది మీ ఇల్లే అనుకో. నేను దివాణం పని తొందరగా తెల్చుకుని వచ్చేస్తాను. అప్పుడు సావకాశంగా మాట్లాడుకుందాం!" అంటూ సోమయాజులుగారు బయలుదేరబోయారు.

"నాకు మొహమాటంలేదు లే!! భోజనం చేసి వెళతానురా! నాకు అక్కడ చాలా పనులున్నాయి. వెంటనే వెళ్ళాలి! ఓ చిన్న పనుండి నీతో మాట్లాడానికి వచ్చాను." అత ను అలా ప్రాధేయంగా అడిగేసరికి సోమయుజులు ఏం మాట్లాడలేకపోయారు.

"సరే చెప్పు."

"నీకు తెలుసుగా. నా సమస్యలు నీకున్న సమస్యలాంటి వే. మా అబ్బాయి కోడలు పోయిన తర్వాతా వాళ్ళ పిల్లలు నా దగ్గరే ఉన్నారు. ఆ పెద్ద మనవరాలికి సంబంధం కుదిరింది. పెళ్ళి చెయ్యాలి! నా పరిస్థితి అంతంతమాత్రమే కదా. ఆ కార్యం ఎలా చేస్తానా అని బెంగగా ఉంది. నాకేం పాలుపోక నీ దగ్గరకి వచ్చాను. మరి నీలాంటివాళ్ళు తలో చెయ్యి వేస్తే గాని కార్యం గట్టెక్కదు!!నువ్వే ఏదోకటి చెయ్యాలి! " ఉన్నవిషయం చెప్పాడు.

తనక్కూడా అలాంటి సమస్యలే ఉన్నాయి. కాని సోమయాజులుగారు ఎదుటివాడి సమస్యలు అంత కంటే పెద్దవాటిగా చూసేరెగాని తక్కువగా భావించ లేదు.

"సరే తప్పకుండా చూద్దాం! ఇంకా ముహూర్తానికి టైముందిగా. నువ్వేం బెంగ పెట్టుకోకు. అన్ని సవ్యంగా జరుగుతాయిలే! " అంటూ సోమయాజులు గారు ఆఫీసుకి వెళ్ళిపోయారు.

భోజనాలు అవగానే వచ్చిన చుట్టం ఇంట్లో అందరి దగ్గర శెలవు తీసుకుని బయలుదేరారు.

"నేను ఓ పదిరోజుల ముందే వస్తాను బాబయ్యగారు! పెళ్ళి పనులలో సాయంగా ఉంటుంది. మీరు నిశ్చింతగా ఉండండి! "అంటూ కామేశ్వరమ్మ ఆయన్ని సాగనంపింది.

అన్నట్టే, పెళ్ళికి పదిరోజులు ముందుగానే కామేశ్వరమ్మ ఆ ఊరు వెళ్ళింది. అక్కడ అలవాటుపడ్డ తర్వాత, ఓ రోజు "బాబయ్యగారు మీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలి" అంటూ అయన చేతిలో ఓ చిన్న పొట్లం పెట్టింది. ఎర్రకాగితం చుట్టిన ఆ పోట్లంలో రెండు తాళి బొట్టులు ఉన్నాయి.

"మంచో చెడో నాకు తెలియదు గాని, నిజనికి ఇది మా అయన నాకు కట్టిన తాళి! వాటిని సజీవంగా ఉంచాలనే ఇన్నాళ్ళు దాచాను. వీటిని అపురూపంగా చూసుకుని మొన్ననే మెరుగు పెట్టించాను. మీరు వీటిమీద పెట్టె ఖర్చు ఇంకో దానిమీద పెట్టుకోవచ్చును. మరోలా అనుకోకండి. ఇంకో విధంగా సహాయం చేయడానికి, మా ఇంట్లో ఇబ్బందులు మీకు తెలుసు. మీ అమ్మాయి తప్పకుండా యోగ్యురాలు అవుతుంది. ఇదో బహుమానమో,దానమో, ధర్మమో అని నేను అనుకోవటం లేదు. సాటి మనిషికి సహాయం చేయటమనే బావిస్తున్నాను." కామేశ్వరమ్మ మాటలకి ఆయనికి నోటంట మాట రాలేదు,

సోమయాజులు గారు అప్పటికే రెండురోజుల్నుంచి అప్పుకోసం తిరుగుతున్నారు. అమ్మాయికి కనీసం తాళిబొట్టు అయినా బంగారంతో చేయించాలి. లేకపోతే అబాసుపాలవుతుంది. సరిగ్గా ఆ సమయంలోనే కామేశ్వరమ్మ దేవుడిలా వచ్చింది. ఆయన కళ్ళలో నీళ్ళు తిరిగాయి. వర్షించిన కళ్ళతోనే అయన కామేశ్వరమ్మకి కృతజ్ఞతలు తెలిపాడు.

కామేశ్వరమ్మ దగ్గరుండి పెళ్లి పనులు చేసింది. పెళ్ళి వైభవంగా జరిగిపోయింది!

"నువ్వు లేకపోతే ఈ కార్యం ఇంత ఘనంగా జరిగి ఉండేది కాదమ్మా. మీలాంటి వాళ్ళతో బంధుత్వం పొందటం మా పూర్వజన్మ సుకృతం. మీరు తప్పకుండా మా ఊరు రావాలి. మీ అమ్మాయి సంసారం చూడాలి." అంటూ మగపెళ్ళివారు కూడా కామేశ్వరమ్మకి కృతజ్ఞతలు తెలిపారు.

కామేశ్వరమ్మ చాలా తృప్తిగా విజయనగరం వచ్చేసింది .

పాతిక సంవత్సరాలు కాలగర్భంలో కలిసిపోయాయి. సోమయాజులు గారు, అయన భార్య కాలధర్మం చేసారు. పిల్లలందరూ ఉద్యోగరీత్య పై ఊర్లల్లో స్థిరపడిపోయారు. కామేశ్వరమ్మ, దొడ్డమ్మ స్థాయి నుంచి నాయనమ్మ స్థాయికి ఎదిగి దత్తుడు గంగాధరం దగ్గరకి వెళ్ళిపోయింది. గంగాధరం బ్యాంకులో ఆఫీసరు. ఈ మధ్య ప్రమోషన్ వచ్చి వైజాగ్ నుంచి భువనేశ్వరం వచ్చాడు .

కామేశ్వరమ్మ కి సమయం గడిచేది కాదు. మనవళ్ళు స్కూలు నుంచి వచ్చిన తర్వాత, వాళ్ళకి ఏవో కధలు, కబుర్లు చెప్పేది.

"ఓరే గంగా... ఇరుగుపొరుగు లేని ఈ ఊరు ఏమిట్రా, వల్లకాడుదిబ్బలా ఉంది!! మా అమ్మకి బాలేదు మా ఊరు బదిలి చేయమని మీ బ్యాంకు వాళ్ళని అడక్కోడదుట్రా" అంటూ అప్పుడప్పుడు కామేశ్వరమ్మ వాళ్ళ అబ్బాయిని అడిగేది.

"అదేమిటే దొడ్డా! నాది బ్యాంకు ఉద్యోగం అనుకున్నావా, బడిపంతులనుకున్నావా.. అలాంటివి చెపితే ట్రాన్సఫర్ ఇవ్వరు.అయినా ఇక్కడ అన్ని సదుపాయంగానే ఉన్నాయిగా." గంగాధరం కూడా ఎప్పుడూ అదే జవాబు చెప్పేవాడు. గంగాధరం పేరుకి దత్తుడే కాని అలవాటుగా ఆవిడ్ని దొడ్డమ్మ అనే పిలిచేవాడు.

"అవుననుకో. కాని మాటామంతి లేకుండా ఉండటం కూడా కష్టమేరా! దానికి తోడు ఈ వడ్డిభాష వచ్చి చావదు. పోని ఊర్లో ఎవరైనా తెలసిన వాళ్ళు ఉన్నారా.. అంటే ఎవరు లేరు. ఎందుకో రోజూ మన కోనేరుగట్టు జ్ఞాపకం వస్తూందిరా! మనం కష్టల్లో ఉన్నప్పుడు రోజులు హాయిగా గడిచిపోయాయి..కాని ఇప్పుడు నిజంగా అన్ని విధాల సుఖంగా ఉన్నా సరే రోజు గడవటం చాలా కష్టంగా ఉందిరా! ఆ రోజులే వేరు. మీ తాతాగారు మంచం పట్టిన సరే పదేళ్ళు రాజాలా గడిపారు. ఆ వయస్సు నాకు వచ్చేస్తుంది, కాని ఆయన రోజులు నాకు రావులే" అంటూ అప్పుడప్పుడు ఆవిడ వాపోతూ ఉండేది.

"ఒరే!! నిన్న చిన్నమావయ్య ఫోన్ చేసాడురా. మన చుట్టాలు ఇక్కడ ఉన్నారుట! నేను పాతికేళ్ళ క్రితం మదుపాడగ్రహరం పెళ్ళికి వెళ్ళనులే. అప్పుడు మీరు బాగా చిన్న పిల్లలు!. ఆ భార్య,భర్తలే ఈ ఊర్లోనే ఉన్నారుట. అతని పేరు సుబ్బరావు. రైల్వేలో ఏదో పెద్ద ఉద్యోగమేట . వాళ్ళ గురించి కాస్త వాకబు చెయి నాయన! పాపం మనం అంటే చాలా అభిమానం. ప్రాణం పెడతారు.! ఆమ్మాయి నాన్న, మీ తాతా పెద్తండ్రి, పిన్తండ్రి పిల్లలురా. ఎక్కడకి పోతుంది రక్తసంబంధం. ఇక్కడ ఉన్నారని తెలిసినప్పట్నుంచి, వాళ్ళని చూడాలనిపిస్తోంది. ఆ అమ్మాయి పెళ్ళి నాకో తియ్యని అనుభూతిని, తృప్తిని ఇచ్చిందిరా." అంటూ కామేశ్వరమ్మ గారు ఆ రోజు ఉదయాన్నే కొడుకుని పిలిచి చెప్పింది.

"సుబ్బారావు, రైల్వే అంటే ఎవరికి తెలుస్తుందే. రైల్వే అంటే అదో సముద్రం! సంతకి చీటి,లచ్చికి గాజులు అంటే ఎలాగే ? ఎక్కడని వెతకను. సర్లే చూద్దాంలే!" అంటూ గంగాధరం ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం మళ్ళీ కామేశ్వరమ్మ విజయనగరంలో ఉన్న తమ్ముడికి ఫోను చేసి ఇంకేమైనా వివరాలు ఉన్నాయేమోనని అడిగి చూసింది. తాను వాకబు చేసి చెప్తానని అన్నాడు.

ఆ రోజాంతా కామేశ్వరమ్మ గారు అన్యమనస్కంగానే ఉన్నారు. సాయంత్రం స్కూలు నుంచి వచ్చిన మనవళ్ళతో కూడా సరిగా మాట్లాడలేకపొయింది.

రాత్రి భోజనాల దగ్గర మళ్ళీ ఆ ప్రస్తావనే తెచ్చింది.

"అదేమిటో! పెళ్ళి అయిన తర్వాత వాళ్ళకి మనం జ్ఞాపకం లేకపోవచ్చు...కాని నాకు జ్ఞాపకం రాకపోవడమే ఆశ్చర్యంగా ఉందిరా. వాళ్ళు బాగున్నారనే విషయం తెలిసి చాలా ఆనందం వేసింది. ఎలాగూ ఈ ఊర్లో ఉన్నరని తెలిసిందిగా .. ఓసారి చాడాలనిపిస్తోందిరా!"

"సర్లేవే.. చేప్పావుగా. ఆఫీసులోవాళ్ళకి పేరు గట్రా ఇచ్చానులే. రెండు, మూడ్రోజుల్లో ఎడ్రసు సంపాదిస్తారు. ఇన్నాళ్ళూ లేని అత్రుత ఇప్పుడు వస్తే ఎలా గే! అయినా వాళ్ళకుండాలి.. 'అయ్యో పెళ్లికి వచ్చి మనకి సహాయం చేసింది.. వాళ్ళని మరచిపోతే ఎలా.. ' అనే జ్ఞానం వాళ్ళకి ఉండాలి! అవసరం తీరగానే తెప్ప తగలేసే రకంలా ఉన్నారు." అంటున్న గంగాధరం మాటలకి అడ్డొచ్చి ఆవిడే అంది.

"చ..చ..అలాంటి వాళ్ళు కాదురా! పాపం .. ఏ పరిస్థితుల్లో వాళ్లు ఉన్నారో!! అయినా నాదీ తప్పేరా!వాళ్ళు జ్ఞాపకం ఉన్నా నేను కూడా పట్టించుకోలేదుగా!!" అవిడాలా భోజనం చేస్తూ ఎదో మాట్లాడుతునే ఉంది. గంగాధరం ఆఫీసు విషయాలు ఆలోచిస్తూ ఆ మాటలేం పట్టించుకొలేదు.

"మీకెవ్వరికీ తెలియని ఓ నిజం ఉందిరా. ఇన్నాళ్లు ఆ విషయం నాతోనే ఉండిపోయింది. వాళ్ళు హాయిగా ఉన్నరని తెలిసిన తర్వాత నాకు చాలా అనందం వేసింది! నేను చేసిన పని తప్పుకాదని రుజువైందిరా." కామేశ్వరమ్మ ఇంకా ఎదో చెప్పబోయింది.

"సర్లే దొడ్డా!. రాత్రి పది గంటలు దాటింది. పడుకో !! రేపు తప్పకుండా వాళ్ళని పట్టుకుంటానులే" అంటూ గంగాధరం తన గదిలోకి వెళ్ళిపోయాడు.

కాని అవే ఆవిడా అఖరి మాటలని తెల్లరితేగాని గంగాధరానికి తెలియలేదు!!

నిద్రలోనే ఆవిడ ప్రాణాలు పోయాయని ఉదయాన్నే డాక్టరు వచ్చి చేయ్యిచూసి చెప్పాడు. గంగాధరానికి ఒక్కసారిగా దుఖం ముంచుకొచ్చింది. ఏం చెయ్యాలో తెలియలేదు. అన్ని విషయాలలో సలహాలు ఇచ్చే దొడ్డమ్మ శాశ్వతం అనుకున్నాడే గాని .. ఇలా తనని ఒంటరిగా వదిలి వెళ్ళిపోతుందని ఊహించలేదు. ఏం చేయాలో తోచలేదు. గుండె రాయి చేసుకుని చుట్టాలందరికి ఫోన్లు చెసి చెప్పాడు. విషయం తెలిసిన ఆఫీసువాళ్ళు వచ్చి తర్వాత జరగవలసిన కార్యక్రమ ఏర్పట్లు చేస్తున్నారు. రావలసినవాళ్ళు వచ్చేసరికి మధ్యాహ్నం పట్టేస్తుంది. ఇంట్లో తన కుటుంబం, ఆఫీసువాళ్ళు నలుగురైదుగురు తప్ప ఎవరూ లేరు. 'మీ ఆచార వ్యవహరలు ఎమిటిని' ఎవరైనా అడిగిన తనకి తెలియవు.

అంతలో రెండు కార్లు తన ఇంటి ముందు ఆగి అందులోంచి ఓ దంపతులతోపాటు ఓ అరడజను మంది దిగారు. వారెవ్వరిని ఎప్పుడూ చూడలేదు.

" నా పేరు సుబ్బారావు, రైల్వే లో డి ఆర్ మ్ గా పని చేస్తున్నాను. రాత్రే మీరు ఇక్కడున్నారని తెలిసింది. ఉదయాన్నే ఈ వార్త మాకు చాలా షాకే" ఆయన గంగాధరం దగ్గర కొచ్చి, మాట్లాడుతూంటే గంగధరానికి రాత్రి దొడ్డమ్మ చెప్పిన విషయాలు గుర్తుకొచ్చాయి

"మా పెళ్ళికి వచ్చి సహాయం చేయడమే కాదు, ఆవిడ మాటలు ఇప్పటికి మాకు స్పూర్తిని ఇస్తాయి. ఆవిడని మళ్ళీ కలుసుకోడానికి చాలా ప్రయత్నాలు చేసాం. కాని కుదర్లేదు. రోజూ తలుచుకుంటూ, ఏదో ఓ రోజు ఆవిడ్ని కలుసుకుంటా మనుకున్నాను. గాని ఇలా నేను అభాగ్యురాలవుతానని ఊహించలేదు. మీరు ఇక్కడున్నారని రాత్రే తెలిసింది. ఎప్పుడూ తెల్లరుతుందా అని నేనెంతో ఎదురుచూసాను! కాని, నా ఎదురుచూపుకి ఇలాంటి ముగింపు ఉంటుందని ఊహించలేదు. నాలాంటి దురదృష్టజాతకలు ఎవరూ ఉండరేమో!!" అంటూ సుబ్బారావు భార్య గొంతుకనుంచి ఒక్కసారిగా దుఃఖం ముంచుకొచ్చింది.

ఆయనతోపాటు వచ్చిన వాళ్ళందరు నిశ్శబ్దంగా చేతులు కట్టుకుని ఆయన వెనుకే నిలబడి ఆయనేం హుకుం జారిచెస్తారో అని ఎదురు చూస్తున్నారు. వాళ్ళలో ఒకతను వెంట తెచ్చిన మంచి నీళ్ళ సీసా ఆవిడకిచ్చాడు. రెండు గుక్కలు నీళ్ళు తాగి మళ్ళీ ఆవిడే అంది.

"ఆ పదిహేను రోజుల్లోనే ఆవిడా మాకందరికి బాగా చేరువైపోయారు. పెళ్ళికి ముందురోజు, నాదగ్గర కొచ్చి ఓ మాట అన్నారు. 'ఒసే అమ్మాడు.. మా ఇంట్లో ఉన్నబంగారం అంతా కరిగి ఖర్చుల్లో కలసిపోయిందే. నాకు మా ఆయన మిగలకపోయిన, ఆయన గుర్తుగా నా దగ్గర మిగిలినవి ఈ తాళి మాత్రమే తల్లీ. అవి సజీవంగా ఉండలనేదే నా అలోచనమ్మ'" అవిడకి మాటల మధ్యలో దుఃఖం వచ్చేస్తున్నాది.

ఓ రెండు నిమిషాలు నిశ్శబ్ద వాతావరణం తర్వాత సుబ్బారావు అన్నాడు.

"సార్. మేం ఈ స్థాయిలో ఆనందంగా ఉండటానికి ఆవిడ దీవెనలే కారణం! ఇన్నాళ్ళు ఆవిడ్ని కలుసుకునే బాగ్యం కలగలేదు. ఇప్పుడిక ఆ అవకాశమూ లేదు.! మీకు చెప్పేటంత పెద్దవాడ్నికాను, కాని మాదో చిన్న విన్నపం! మనం గతంలో ఎప్పుడూ కలుసుకోలేదు. కాని మనం దగ్గర బంధువులమే. మీరు అన్యధా భావించకుండా కనీసం ఇప్పుడేనా ఆవిడా ఋణం తీర్చుకోడానికి మాకు అవకాశం ఇవ్వండి. "

ఊరుకాని ఊరులో ఎప్పుడూ కలవని కుటుంబం వచ్చి అలా చెపుతూ ఉంటే గంగాధరానికి నోటంటా మాట రావడంలేదు.దొడ్డమ్మఎంతమంది ఆప్తుల్ని సంపాదించిందో తలుచుకుంటే గంగాధరానికి దుఖం పొంగిపొర్లి వచ్చిసింది. సుబ్బారావు గంగాధరాన్ని ఓదార్చడానికి దగ్గరికి తీసుకున్నాడు.

సుబ్బారావు భార్య కొంచెం తమాయించుకుని అన్నది. "కాదనకండి అన్నయ్యగారు. ఆవిడకి మేం పైవాళ్ళం కాదు. నా పెళ్లికి దొడ్డమ్మ గారిచ్చిన దానం ఈ తాళి!! పదిలంగా నామెళ్ళోనేఉంది!! ఆవిడా పెద్దబ్బాయిగా భావించి, దహన సంస్కారానికి మా ఆయనికి అవకాశం ఇప్పించండి! "

ఆ మాటలు వింటూనే అందరు అశ్చర్యపోయారు.

తనక్కూడా తెలియని విషయం వినేసరికి గంగాధరానికి నోటంట మాట రాలేదు. పాడి ఎత్తి ముందుకు వెళ్తున్న సుబ్బరావుని అనుసరించాడు.

# బోను మల్లాది హనుమంతరావు

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

చిన్నప్పుడు ఆకాష్ కు తన తండ్రి అంటే పెద్ద సూపర్ మాన్ అని అభిప్రాయం ఉండేది. చిన్నపిల్లలు చాలామందికి అలాగే ఉంటుందిట. ఆ వయసులో తనకు అర్థమే కాని ఇంటి సమస్యలన్నీ తన కళ్ళెదుటే ఒంటిచేత్తో పరిష్కారం చేసే వ్యక్తిని చూస్తూ ఉండే పసివాడికి మరో అభిప్రాయం ఎలా కలుగుతుంది?

ఇంటికి కావలిసిన వస్తువులన్నీ ఎలా తెచ్చేవాడో నాన్నే తెచ్చేవాడు. ఇంటికి ఎవరొచ్చినా తనే ధైర్యంగా ఎదుర్కొని ఎలా మాట్లాడాలో అలా మాట్లాడి పంపేసే వాడు. స్కూల్లో తనకు అరివీర భయంకరులుగా కనిపించే టీచర్లతో నాన్న ఏ జంకూ గొంకూ లేకుండా మాట్లాడే వాడు. అప్పుడప్పుడు తన కోసం పోట్లాడే వాడు కూడా!మామిడి పళ్ళూ, సపోటాలూ, మిఠాయిలు ఏవయినా సరే, ఆయన కరుకుగా, నిక్కచ్చిగా, నిర్మొహమాటంగా బేరం చేసి, దబాయించి, మంచి మంచివి ఎంచుకొని కొంటుంటే, అయిదేళ్ళ వయసు లోనే ఆకాష్ కు ఆయనంటే ఓ ఆరాధన భావం లాంటిది ఏర్పడింది. ప్రయాణాలన్నా, డబ్బు వ్యవహారాలన్నా, బ్యాంకు పనులన్నా, సినిమా టికెట్లన్నా, చివరికి ట్రాఫిక్ పోలీసులతో తగాదాలన్నానారాయణకు నదురూ, బెదురూ ఉండేది కాదు.

ఆకాష్ కు నాన్న మీద ఆరాధన భావం బలపడటానికి కొంత కారణం అమ్మ 'బ్రెయిన్ వాషింగ్ ' కూడా. ఏ చిన్న సమస్య వచ్చినా, 'ఏడవకు, నాన్న

చూస్తారులే, నాన్న మాట్లాడుతారులే, నాన్న ఏర్పాటు చేస్తారులే' అని పాట పాడేది. అప్పుడప్పుడు, 'అమ్మో, అలా చేస్తే నాన్న తిడతారేమో! నాన్నకు తెలిస్తే ఇంకేమన్నా ఉందా! నాన్న వచ్చే వేళయింది, బుద్ధిగా ఉండు!' అంటూ హెచ్చరిస్తూ ఉండేది.

నారాయణ వార్తాపత్రికలకు వందల కొద్దీ ఉత్తరాలు రాసేవాడు. అవన్నీచక్కగా పత్రికల లోంచి కత్తిరించి, ఫైల్లో పెట్టుకొని బంధువులూ, మిత్రులూ వస్తే చూపించే వాడు. వాళ్ళింటికి బంధువులు రావటం తక్కువే, మిత్రులే కొందరు వచ్చే వాళ్ళు. ఒక్క బామ్మ మాత్రం రెండేళ్ళకోసారి వచ్చి నాలుగు రోజులు ఉండి వెళ్ళేది. నారాయణా, ఆయన భార్యా ఇద్దరూ ఉద్యోగస్తులు కావటాన, వాళ్ళు ఇద్దరూ కలిసి పొరుగూళ్ళలో చుట్టాలను చూడటానికి వెళ్ళే అవకాశం ఎక్కువ ఉండేది కాదు. పొరుగూరినించీ వాళ్ళింటికి బంధువులు రావటం ఇంకా అరుదు. దాదాపు ఎవరూ వచ్చే వాళ్ళు కాదు. నాన్నే ఏ ఆర్నెలలకో ఒకసారి తనొక్కడే పెళ్ళిళ్ళనో, మరొకటనో వాళ్ళ ఊరికి వెళ్లి వచ్చే వాడు. ఒంగోలు దగ్గిర చిట్టిపాలెం ఆయన స్వగ్రామం. ఆకాష్ ఆ ఊరు ఒక్క సారే చూశాడు.

కాలం గడిచే కొద్ది అందరు పిల్లలకు లాగే ఆకాష్ కు కూడా ఈ ఆరాధన భావం పలచబడి పోయింది. ఇప్పుడు ఆకాష్ కి ముప్ఫయి రెండేళ్ళు నిండాయి. పెళ్ళయి నాలుగేళ్ళు దాటింది. రేపో మాపో తండ్రి కావాలనే ఆలోచనలో ఉన్నాడు.

నారాయణ ఉద్యోగం నించి రిటైరై ఏడాది దాటింది. దురదృష్టం, రిటైరవటానికి ఆరు నెలలు ముందే ఆయన భార్య పోయింది. నారాయణ కూతురు చంద్రిక అమెరికాలో ఉంది. అక్కడ ఆమె, ఆమె భర్తా డాక్టర్లు. నారాయణ ఉద్యోగ విరమణ తరవాత అమెరికా కూడా వెళ్లి అక్కడ రెండు నెలలు ఉండి వచ్చాడు.

ఆకాష్ కు ఇప్పుడు తండ్రి మీద ఆరాధనా ప్రేమా కంటే కృతజ్ఞతా భావం ఎక్కువ. ఎంతైనా ఆయన పాపం తనని కన్నవాడు. అన్ని సౌకర్యాలూ అందజేసి, పెంచి, పెద్దచేసి, చదువు చెప్పించి ఇంతటి వాడిని చేశాడు. ఆయన శ్రద్ధా, అమ్మ శ్రమా, ప్రేమా లేకుంటే తను ఇప్పుడు ఎలా ఉండేవాడో! తన కోసం, తన భవిష్యత్తు కోసం అమ్మా నాన్నా ఎంత సమయం ఖర్చు పెట్టే వాళ్ళో, ఎంత వ్యయ ప్రయాసలకు గురయ్యే వారో, ఎంత తపన పడే వాళ్ళో ఆకాష్ కు బాగా గుర్తే. అందులో అమ్మ ఆకస్మికంగా పోవటం నాన్నకు ఎంత పెద్ద దెబ్బ!

'అమ్మకు నేనేమీ చేసే అవకాశం ఇవ్వకుండానే ఆమె వెళ్ళిపోయింది. నాన్నకన్నా వృద్ధాప్యంలో అంతో ఇంతో చెయ్యకపోతే, అటు నాన్న కష్టపడటం మాట అలా ఉంచి, పైనెక్కడో ఉన్న అమ్మ కూడా నన్ను క్షమించదు' అని ఆకాష్ అనుకొంటూ ఉంటాడు. కానీ ఈ రోజుల్లో ఉన్న పరిస్థితుల్లో తండ్రులకు కొడుకులు సేవ చేయటం, అందునా నగరాలలో, చాల కష్ట సాధ్యమైన విషయం అయిపోయింది.

అందుకే భార్య ఈషాతో తను ఏ విషయం చర్చించనంత వివరంగా నాన్న విషయం చర్చించి, ఆయన రిటైరవగానే ఆయనని తనతో బెంగుళూరు తెచ్చేశాడు. ఏ మాటకామాటే చెప్పాలి, అన్ని విషయాలలోనూ ఈషాది తన మతమేదో తనదే అయినా, మనదీ మనమను మాటకు కూడా కొంత అవకాశం ఇస్తుంది. ఇంట్లో నారాయణకు కావలసిన సౌకర్యాలన్నీ అమర్చే విషయంలో (వేరుగా గది, టీవీ, ఏసీ వగైరాలన్నీ) ఆకాష్ కంటే ఈషా చూపిన చొరవే ఎక్కువ. ఆమె ఉదాసీనంగా ఉండి ఉంటే ఆకాష్ ఏం చేయగలిగేవాడు, నిరుత్సాహపడి మనశ్శాంతి కోల్పోవటం తప్ప! ఆమె కడుపు చల్లగా ఈషా అలాంటి నిరుత్సాహానికి తావే ఇవ్వ లేదు.'అంకుల్'కు గౌరవ మర్యాదలలో ఆమెఎప్పుడూ ఏ లోటూ చేయలేదు. వ్యక్తిగత సపర్యలు ప్రస్తుతం ఆయనకు అవసరం లేదు.

సమయం అంటారా, అది వాళ్ళ దగ్గిర గూడా పరిమితంగా ఉండే పదార్థం కావటం వల్ల నారాయణతో విరివిగా పంచుకోలేక పోయారేమో గానీ, ఆ యువ దంపతులు నారాయణకు మిగిలినవన్నీ చక్కగా సమకూర్చారు అని నారాయణ కూడా మనస్ఫూర్తిగా ఒప్పుకొంటాడు.

నారాయణ ఎక్కువ చాదస్తాలు లేని 'ప్రాక్టికల్' మనిషి. కనకనే ఊరికే మీన మేషాలు లెక్కెట్టకుండా, తర్జన భర్జనలు లేకుండా, విశ్రాంత జీవితం కొడుకూ, కోడలుతో గడిపేందుకు వెంటనే ఒప్పేసుకొన్నాడు. మూడు బెడ్ రూమ్ ల విశాలమైన ఫ్లాట్ లో తండ్రీ ,కొడుకూ, కోడలూ పొరపొచ్చాలు పెద్దగా లేకుండా సహజీవనం చేస్తున్నారు. పని మనిషీ, డ్రైవరూ, వంట మనిషీ సహాయం ఉండనే ఉంది.

ఆకాష్, ఈషా ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో బయల్దేరి ఉద్యోగాలకు వెళ్ళిపోతారు. నారాయణ కొంచెం వ్యాయామం, యోగా చేసుకొని పుస్తకాలతోనూ, ఇంటర్నెట్ తోనూ, డీవీడీలతోనూ కాలక్షేపం చేస్తాడు. నాలుగు వార్తా పత్రికలూ సాంతం చదువుతాడు. నివాసం చాలా 'పోష్' ప్రాంతం

కనక ప్రశాంతంగా జనసమ్మర్దం లేకుండా ఉంటుంది. పక్క ఫ్లాట్లలో ఉన్న కొద్ది జనాభా కూడా ఎవరి గొడవలలో వాళ్ళు మునిగి ఉంటారు తప్ప ఇతరుల జోలికి వచ్చే వాళ్ళు కాదు.

ఈషా తన ఆఫీసులో సీనియర్ మేనేజరు. అటు ఇల్లూ ఇటు ఆఫీసూ చక్కగా నిర్వహించుకోగల విద్యాధికురాలు. అంకుల్ ను పల్లెత్తు మాట అనదూ, పడదూ. అయినా ఎంతో బాధ్యత గల ఉద్యోగాన్ని అలవోకగా నిర్వహించే ముప్పయి రెండేళ్ళ కోడలితో, అరవయి రెండేళ్ళ మామగారికి ఆరు నెలల సహజీవనంలో ఏమంత చనువు ఏర్పడుతుంది? ఇప్పటికీ నారాయణ కోడలితో మాట్లాడటం తక్కువే. మొహమాటంగా రోజుకో మూడు ముక్కలు కుశల ప్రశ్నల రూపం గా మాట్లాడుకొంటారు. నిజానికి ఈషాకు భర్తతో గడపటానికే ఆట్టే సమయం దొరకదు, ఇక మామగారితో కూర్చుని తీరుబడిగా మాట్లాడటం ఎక్కడ!

అయితే ప్రతి శనివారం ఆమె, అంకుల్ కోసం సంగీత కచేరీలకో, నాటకాలకో, సినిమాలకో టికెట్లు బుక్ చేసి, డ్రైవర్ ని ఏర్పాటు చేసి పంపుతుంది. ప్రతి నెలా ఆ కాలనీలో 'సీనియర్ సిటిజెన్'ల సమావేశం జరుగుతుంది. నారాయణ వాటికి తప్పకుండా హాజరవుతాడు. నారాయణకు ఆధ్యాత్మిక కార్యక్రమాలలో గానీ, తీర్థ యాత్రల లో గానీ, ఒంటరిగా ప్రయాణాలు చేయడంలో గానీ అంత ఆసక్తి లేదు. చిన్నప్పటిలా ఇప్పుడు చీటికీ మాటికీ స్వగ్రామానికి వెళ్ళే అవసరమూ లేదు, అవకాశమూ లేదు. ఇప్పుడక్కడ ఎవరున్నారు గనక! ఆయన బంధువులు, స్నేహితులు ఎక్కువ మంది ఆ గ్రామం ఎప్పుడో వదిలేశారు. కొందరు ఈ లోకమే వదిలేశారు.

ఒకసారి ఆ మాటే అంటే, కోడలు, 'పోనీలే అంకుల్, ఈ వయసులో ఇంకా ఎందుకొచ్చిన ప్రయాణాలు? అరవయ్యేళ్ళు కష్ట పడ్డారు. ఇప్పుడు హాయిగా పూర్తి విశ్రాంతి అనుభవించండి. నాకయితే మాత్రం ఈ పరుగులన్నీ ఎప్పుడెప్పుడు ఆగుతాయా, ఎప్పుడెప్పుడు చీకు చింతా లేని విశ్రాంత జీవితం అనుభవిస్తూ, పగలు పిట్టల పాటలు వింటూ, రాత్రులు చుక్కలు లెక్కెట్టుకొంటూ గడుపుతానా అనిపిస్తుంటుంది!' అన్నది.

'ఈ వయసులో మీరు....' అని ఎవరైనా సానుభూతిగా మాట్లాడితే నారాయణకు చాలా చికాకు. కోడలు అన్న మాట ఆకాష్ అని ఉంటే గట్టిగా సమాధానం చెప్పి ఉండే వాడు :' నాకేదో పెద్ద వయసు వచ్చేసిందని నాకయితే అనిపించట్లేదు. ఇంకా పదేళ్ళు హుషారుగా ఉద్యోగం చేసుకోగలను. చేసుకొనేవాడిని గూడా. కూతురుని అమెరికాలో, కొడుకుని బెంగుళూరులో ఉంచుకొని నువ్విక్కడ ఒంటరిగా కూర్చుని ఈ వార్ధక్యంలో గూడా గానుగెద్దులా పని చేసి ఎవరిని ఉద్ధరించాలి అని నలుగురూ నవ్వుతారని ఇక్కడికి వచ్చేశాను. ఇక పోతే, ఈ మీ మహానగరంలో హాయిగా వినేందుకు పాటలు పాడే తీరిక ఉన్నపిట్టలు లేవు, లెక్కెట్టేందుకు ఆకాశంలో చుక్కలు ఉన్నా కనబడవు' అని. కోడలితో వాదానికి దిగే చనువు లేక తల ఊపి ఊరుకొన్నాడు.

ఓ రకంగా ఆకాష్ అదృష్టమేనేమో, మామా కోడళ్ళ సంభాషణలు దీర్ఘంగా జరగకపోయినా, స్నేహ పూర్వకంగా జరుగుతాయి. ఇద్దరూ బాధ్యతగా, ఆచీ తూచీ మాట్లాడుకొంటారు. చెప్పాలంటే ఇంకా ఆకాష్ కే తండ్రితో సంభాషణ ఒక సమస్య.

ఆకాష్ కు తండ్రి తనతో ఉండటం ఎంతో తృప్తినిస్తుంది. ఆయన హాల్ లోనో, తన గది లోనో, హాయిగా ఊగే కుర్చీలో కూర్చుని ఏ పేపరో చదువుకొంటూ ఉంటే, ఇల్లంతా నిండుగా ఉన్నట్టుగా ఉంటుంది. అతని గుండె కూడా నిండుగా, ప్రశాంతంగా ఉంటుంది. కానీ ఆకాష్ మెలకువగా ఉండి ఇంట్లో ఉండే నాలుగయిదు గంటలలో నారాయణ అలా కూర్చోడు, కూర్చోలేడు. ఆకాష్ వెనకాలే మౌనం గానో, లేక ఏదో మాట్లాడుతూనో తిరుగుతాడు. ఆకాష్ ను ఆయన వెంబడించనిది బాత్రూం లోకీ, ఆ యువ దంపతుల మాస్టర్ బెడ్ రూమ్ లోకీ మాత్రమే. కనక ఆకాష్ ఆయనని వదిలించు కోవాలంటే ఒకటే మార్గం. తన బెడ్ రూమ్ లోకి వెళ్ళి కూర్చోటం.

అక్కడ ఈషా పోరు. ' నువ్వు ఇంట్లో ఉండి, అంకుల్ కి దొరకక పోతే ఆయన కాలు కాలిన పిల్లిలా తిరుగుతూ ఉంటాడు. నిన్ను బెడ్ రూమ్ లోంచి పిలవటానికి సందేహిస్తూ, ఎప్పుడు బయటికి వస్తావా అని చూస్తూ ఉంటాడు.' అంటుంది.

'అలా అని నేను బయటికి వెళితే, ఆ పిల్లి చెలగాటానికి ఎలుకలా బలై పోతాను! నాన్ స్టాప్ సంభాషణ! అదీ వన్ వే ట్రాఫిక్! 'మా కాలం అలా ఉండేది, ఇలా ఉండేది! ప్రపంచం రోజు రోజుకూ నాశనమౌతున్నది.' ఇదే థీమ్. నేనేదో ఇంకా అయిదేళ్ళ పిల్ల వాడినయినట్టు ఆయన సణుగుడు, ఉపదేశం సాగుతూనే ఉంటాయి. 'మీ కాలం కన్నా మా కాలం ఏమి తీసి పోయింది?' అని వాదిస్తే మాత్రం ఆయనకు ఇష్టం ఉండదు. మొహం చిన్నగా చేసుకొంటాడు. వాదం కొంచెం పెంచానా, 'ఆకాష్, నాకు హైదరాబాద్ వెళ్ళి అక్కడ నాలుగు రోజులు ఉండి వద్దామనిపిస్తున్నది' అని గునుపు మొదలు.'

'వాదాలు పెంచటం ఎందుకులే, వాటివల్ల ఎప్పుడు, ఎవరికి ప్రయోజనం కనక? ఒకటి మాత్రం ఎప్పుడూ బాగా జ్ఞాపక ముంచుకో. ఈ సంబంధం నీకు చాలా విలువైనది. ఆయన ఇక్కడి నించీ వెళ్ళిపోతే నీకెంతో బాధ కలుగుతుంది. విలువైన సంబంధాలను, గుడ్డి గవ్వకు కొరగాని వాదనలతో నాశనం చేసుకోవటం ఎందుకు?' అంటుంది ఈషా.

'ఎందుకంటే, ఆయన ధోరణీ దృక్పథం మారట్లేదు గనక.'

'ఎలా మారతాయి పాపం? మనిషికి మొదటి ఇరవయి ఏళ్ళ తరవాత శారీరకమైన పెరుగుదల ఎలా ఆగిపోతుందో, కళ్ళకు కనబడని భావ పరమైన పరిణామాలు కూడా అలాగే ఆగిపోతాయి. అప్పటివరకు తన ప్రపంచానుభవంతో ఏర్పరచుకొన్న విలువలూ, ఆదర్శాలూ, మంచీ-చెడు నిర్వచనాలూ, విధి నిషేధాలూ తెలియకుండానే మనసులో సిమెంట్ బొమ్మలా బిగుసుకు పోతాయి. లోకంలో, ప్రతి కొత్త తరంలోనూ అనివార్యంగా వచ్చే మార్పులను ప్రశాంతంగా స్వాగతించే శక్తి వయసు మళ్ళిన, మళ్ళుతున్న వాళ్ళలో చాలా అరుదు. ఏ తరంలో చూసినా, వయసు మళ్ళిన వాళ్ళకు గత కాలమే వర్తమానం కంటే మెరుగుగా అనిపిస్తుంది. ఇది ప్రకృతి సిద్ధం. మన విలువలూ, నమ్మకాలూ, దృక్పథాలూ బిగుసుకు పోయి, బాహ్య ప్రపంచంలో ప్రతి మార్పూ వినాశం లాగే కనిపిస్తుంది. రాబోయే కాలం మరింత భయంకరం అనే తోస్తుంది. ఇది లోకంలో సర్వ సాధారణం.'

'ఇన్ని వార్తాపత్రికలు చదువుతాడు. ఇన్ని ఛానల్స్ చూస్తాడు. ఇన్ని వార్తలు వింటాడు. మనం అవునన్నా కాదన్నా ప్రపంచానికి నిమిత్తం లేదు, అది అలా వేగంగా మారుతునే ఉంటుంది అని చూస్తూనే ఉంటాడు కదా ! మార్పును స్వాగతించ లేకపోతే జీవితం దుర్భరం అవుతుంది అన్న కామన్ సెన్స్ ఎక్కడికి పోతుంది అని నాకు ఆశ్చర్యం!'

'వయసు మీద పడుతున్న కొద్దీ అదొక సమస్య. నిత్య పరిణామ శీలమైన ప్రపంచాన్ని మనిషి తన మనసులో ఎప్పుడో ఏర్పడ్డ సిమెంట్ బొమ్మఆదర్శంతో పోల్చుకొని నిట్టూరుస్తూనే ఉంటాడు. ఎందుకంటే కాలం గడిచిన కొద్దీ లోకం మారిపోయి, వాస్తవిక ప్రపంచం నువ్వు నీ చిన్నతనంలో నీకుగా ఏర్పరచుకొన్న ఆదర్శాల బొమ్మతో సరిపోలదు. రోజు రోజుకూ వాటిమధ్య అంతరం పెరుగుతూనే ఉంటుంది. దాంతో పాటు అసంతృప్తీ పెరుగుతూనే ఉంటుంది. అది పోగొట్టుకోవాలంటే ఎంతో ప్రయత్నం, మనోబలం కావాలి. ఆ ఎదురీత చేయగలవారు నూటికి ఒక్కరుంటారేమో !'

'ప్రతీ దానికీ ఒక థీరీ చెప్తావు మొత్తానికి, ఎక్కడి నించీ తెస్తావో గానీ! థీరీ చెప్పటం గాదు, వెళ్లి ఆయనతో కాస్సేపు మాట్లాడు. తెలుస్తుంది' అంటాడు ఆకాష్.

'మాట్లాడతాను. నాకేమీ అంత అసహనం లేదు ఇంకా! ఆఫీసులో ఎంతమంది తోనో లేని ఆప్యాయతలూ, గౌరవాభిమానాలూ ఒలకబోస్తూ మాట్లాడటం లేదా? అయిన వాళ్ళతో ఓ అరగంట ఓపిగ్గా మాట్లాడలేమా? కానీ, అంకుల్ కు నాతో మాట్లాడటానికి చాలా మొహమాటం. ఆయనకు నువ్వు అయిదేళ్ళ పిల్లాడివిగా కనిపిస్తావు. నేను అలా కనిపించను. ఆయన నన్ను మొదట చూసేప్పటికే నేను 'పెద్ద' చదువు చదువుకొని, 'పెద్ద' ఉద్యోగం చేసుకొంటున్న ఆధునిక యువతిని. ఆయన నాతో పొడిపొడి మాటలే తప్ప, స్వేచ్ఛగా మాట్లాడ లేరు. ఇంకా కొన్నాళ్ళు అలవాటైతే తప్ప మా ఇద్దరికీ అంతగా మాటలు సాగవు.' అంటుంది ఈషా. అదీ నిజమే!

ఆకాష్ చేతిలో వార్తా పత్రిక పట్టుకొని అయిష్టంగా హాల్ లోకి నడుస్తాడు.

ఒక్క అర క్షణంలో నారాయణ హాల్ లోకి వచ్చేస్తాడు.

మరో క్షణంలో ఆయన ఉపన్యాసమూ మొదలవుతుంది. ఆయన ఉపన్యాసంలో చిన్న చిన్న మార్పులుంటాయేమో కాని, సారాంశం మాత్రం ఒకటే నని నారాయణకు తెలీదు. ఆకాష్ కు తెలుసు.

' ...ఏముందా పేపర్లో ? ఏ పేజీ చూసినా స్వార్థం, అడ్డ దార్లూ, అవినీతీ, దోపిడీలు. కాలం గడుస్తున్న కొద్దీ ఈ ప్రపంచంలో బతకటమే కష్టమై పోతున్నది. మాకు ఫరవాలేదు, జీవితం చాలా భాగం చూసేసిన వాళ్ళం కనక. మీకు కష్టమే!' అంటాడు నారాయణ. 'ప్చ్' అంటూ తలూపి ఊరుకొంటాడు ఆకాష్.

'మునుపు ఇలా ఉండేది కాదు. మేం చదువుకొనే రోజుల్లో లాగా ఈ రోజుల్లో విలువలకు విలువే లేదు!ఎవరికెంత తోస్తే అంత. అహం బ్రహ్మాస్మి! చెపితే వినిపించుకొనే సమయమూ లేదు, వినయమూ లేదు. అందరికీ తొందరపాటు. అహంకారం, ఆవేశం తప్ప ఆలోచన లేదు. ఒక పద్ధతి లేదు.

క్రమశిక్షణ అసలే లేదు.మేం ఒంగోలు లో చదువుకొనేప్పుడు...'అంటూ తన ఆత్మకథ మొదటి భాగంలో రెండో అధ్యాయాన్ని మరో సారి, (ఇప్పటికి ఏ నూరో సారో!), వినిపిస్తాడు.

'కాలం మారిపోతున్నది' అని గొణుగుతాడు ఆకాష్, ఏదో ఒకటి అనాలి కాబట్టి.

'పాప భీతి లేదు, సిగ్గూ లజ్జా లేవు, పెద్దా చిన్నా లేదు. పేపర్ చూసినా అంతే. టీవీ తిప్పినా అంతే. ఎటు పోతున్నామో తెలియదు. సమాజం కుళ్ళిపోయింది. ఆనాటి ఆప్యాయతలూ, అనుబంధాలూ, విలువలూ అన్నీ అంతరించిపోతున్నాయి.నా చిన్నప్పుడు మా బాస్ ఒకడు....' మళ్ళీ అనుభవాలు జ్ఞాపకాలూ!

నారాయణ వాడే ఉదాహరణలూ, వార్తా విశేషాలూ, చిన్ననాటి జ్ఞాపకాలూ( కొద్దిగా) మారుతుంటాయి కాని ముఖ్యాంశం మారదు. కొత్త తరాలకు వాళ్ళ తప్పులేమిటో ఎత్తి చూపి వాళ్ళను సరైన మార్గంలో పెట్టాలని ఆయన తాపత్రయం. అయితే, ఆ మహానగరంలో- ఆమాటకొస్తే ఈ విశాల విశ్వంలో- ఆయన మాట్లాడేందుకు అవకాశం ఉన్న కొత్త తరం ప్రతినిధి తన కొడుకొకడే! కొంతవరకూ కోడలు. ఇంకెవరూ లేరు.

కోడలితో చనువు లేదు. ఆమె తనని, అన్ని శక్తులూ ఉడిగి మృత్యువు కోసం ఎదురు చూస్తున్న వృద్ధ రోగిని నర్సు చూసినట్టు, సానుభూతితో, సేవాబుద్ధితో చూస్తుంది తప్ప సాటి మనిషిగా ఎంత ప్రయత్నించినా చూడ లేదు (అని నారాయణ నమ్మకం). కొడుకు పద్ధతి వేరు. బుద్ధావతారంలా, బెల్లం కొట్టిన రాయిలా కూర్చొని, చెప్పింది వినటమే వాడికి చిన్నప్పటినించీ అలవాటు (అని కూడా నారాయణ నమ్మకమే).

మూడు నాలుగు పేపర్లు క్షుణ్ణంగా చదివి, ఏడెనిమిది టీవీ చానెళ్ళు శ్రద్ధగా చూసిన తర్వాత, నారాయణకు ఇబ్బందిగా ఉంటుంది. దానితో పాటు సముద్రపు అలలలా నిరంతరం తోసుకోచ్చే జ్ఞాపకాలు. ఎవరితోనన్నా ఇవన్నీ పంచుకోవాలి, వాదించాలి. మాట్లాడకుండా తనను తను నిగ్రహించుకొని కూర్చోటం చాలా కష్టంగా, కడుపు ఉబ్బుతున్నట్టుగా ఉంటుంది.

కానీ ఎవరితో మాట్లాడాలి? బయటి వాళ్ళతో పరిచయాలు లేవు. ఈ దశలో, ఈ వయసులో, ఈ రోజుల్లో కొత్త పరిచయాలు ఓ పాళాన ఏర్పడవు. కొత్త పరిచయస్తులు మన అభిప్రాయాలు వినరు. (వాళ్లకు పుణ్య కాలమంతా వాళ్ళ అభిప్రాయాలు ఏకరువు పెట్టేందుకే చాలదు!) విన్నా గౌరవించరు. పైగా నిర్భయంగా, నిష్కర్షగా కొత్త వాళ్ళతో అభిప్రాయాలు ప్రకటించాలన్నా భయమే. ఎవరి మనోభావాలు ఎప్పుడు, ఎందుకు, ఎంతగా దెబ్బ తింటాయో చెప్పటం కష్టం. ఏ పేచీలు వస్తాయో చెప్పలేం. కనక, ఇలాంటి మాటలకు ఆకాషే తగిన శ్రోత.

కానీ పోను పోను ఈ సణుగుడు విని నిగ్రహించుకోవటం ఆకాష్ కూ కష్టమైపోతున్నది. అతనికి ఒక నిజం చెప్పాలనిపిస్తుంటుంది: 'ఎందుకు నాన్నా, ఎప్పుడూ ఈ నెగెటివ్ సణుగుడు? ఈ తరం అకస్మాత్తుగా ఆకాశం నుంచి ఊడిపడలేదు కదా? దాన్ని పెంచి పోషించి ఇలా తయారు చేసింది మీ తరమే. ఒక వేళ మీ తరం విలువలు ఈ నాటి విలువలకంటే గొప్పవైతే, అవి మీ ముందు తరాల నుంచి మీకు అందిన వారసత్వమే గాని, మీ గొప్ప గాదు. ఈనాటి విలువలంటే అవి మీరు మీ తరవాతి తరానికి అందజేసిన వారసత్వం కనక వాటి మంచి చెడ్డల బాధ్యత పూర్తిగా మీదే కదా?' అని. అలా అంటేముసలాయన నొచ్చుకొంటాడు

మరో నిజం చెప్తే అసలు నిభాయించుకోలేడు. పెద్ద యుద్ధమైపోతుంది. ' మాకాలమో, మా తరమో అంటావు. అసలు మీ తరంలో ఏముంది గర్వ కారణం? అసమానతలూ, అసూయలూ, అల్ప సంతోషాలూ, సంకెళ్ళూ, సంకుచితత్వాలూ. మీ తరానికి నాగరికతను, టెక్నాలజీని, కంప్యూటర్లనూ, సెల్ ఫోన్ లనూ, టీవీ ఛానెళ్ళనూ, సులువైన ప్రయాణ సాధనాలనూ, సుఖ జీవితాన్నీ నేర్పింది మా తరం! సాంఘిక న్యాయం, స్వేచ్ఛా, సమానత్వం, ఆర్థిక ప్రగతీ అన్నీ ఇప్పుడే మెరుగు. అసలు మా తరం శక్తి యుక్తులన్నీ మీ కాలం వాళ్ళు మాకిచ్చిన దుర్యోధన, దుశ్శాసన దుర్వినీత లోకాన్ని సంస్కరించటానికే సరిపోతున్నాయి. కనక మేమేదో గొప్ప అని సణుగుడు ఆపు. ఇప్పుడున్న సమాజంలో ఉన్న మంచికి చాలా వరకూమా తరానిదే బాధ్యత. చెడంతా మీతరం నుంచి సంక్రమించిన వారసత్వం. స్వార్థం, సంకుచితత్వం, డబ్బు పిచ్చీ మాకు నేర్పింది ఎవరంటావు?' అని అనబోయి తమాయించుకొని, పూర్తిగా తమాయించుకోలేక, బెడ్ రూమ్ లోకి వెళ్లి ఈషా ముందు కక్కేశాడు ఒకసారి.

'ఏమిటీ, ఈ మాటలన్నీ అంకుల్ తో అన్నావా/' అంది ఈషా నివ్వెరపోయి.

'అనలేదులే, కానీ నేడో రేపో అని తీరతాను. ఉన్నమాటకు ఉలుకెందుకు?'

'ఎందుకంటే , సింపుల్!, నేను చాలా సార్లు చెప్పాను, ఈ సంబంధం నీకు చాలా విలువైనది కాబట్టి. అయినా, గత కాలపు విలువల కళ్ళద్దాలతో ఈకాలాన్ని చూసినా, ఈకాలపు విలువల కళ్ళద్దాలతో గత కాలాన్ని చూసినా, ఆ చూపులో కొంత వక్రత తప్పదు, ఆకాష్! ముందు అది అర్థం చేసుకోవాలి. కాలం గడిచిన కొద్దీ, మార్పుల వేగం పెరిగిన కొద్దీ ఈ వక్రత మరింత పెరుగుతుంది. తరాల మధ్య అంతరాలకు అదే ముఖ్య కారణం. సాధారణ మానవుడు ఏదోఒక విలువల చట్రంలో ఇమిడి ఉంటాడు. సాధారణంగా తన కాలపు –అంటే, ముఖ్యంగా, తన బాల్య కౌమార దశల కాలపు – విలువల చట్రంలో ఉంటాడు. అది ఒక బోను. 1970 విలువల బోనులో ఉన్న వాడికి, 2015 నాటి ప్రపంచం, దాని విలువలూ, సాంఘిక పరిస్థితులూ అయోమయంగా, అయిష్టంగా, ఇరుకుగా, ఇబ్బందిగా కనిపిస్తాయి. ఈ ప్రపంచంలో వాళ్లకు ఆనాటి పరిస్థితులు అంత అధ్వాన్నం గానూ అనిపిస్తాయి.నేను నువ్వు 2000నాటి బోనులో ఉన్నామేమో కనక మనకు 2015 పరిస్థితులు తక్కువ అయోమయంగా అనిపించచ్చు.'

'మళ్ళీ మరో థీరీ మొదలెట్టావా!' అని తల పట్టుకొని, 'నాకు థీరీలు వద్దు. ఇప్పుడు నేనేం చెయ్యాలో సలహా ఇయ్యి, చేతయితే!' అన్నాడు ఆకాష్.

'ఎంత మాట! నువ్వు గ్రూప్ మేనేజర్ వి. నేను చిన్న సీనియర్ మేనేజర్ ని. నీకు నేను సలహా చెప్పగలనా? అయినా అడిగావు కనక నాకు తోచింది చెప్తాను. చూడూ! కాలగతిలో వచ్చేమార్పులతో, భిన్న దృక్పథాలతో , ముఖ్యంగా తరాల అంతరాలతో అసహనం చూపటం వార్ధక్య లక్షణం. వార్ధక్యంలో వచ్చే శరీర బాధలూ, వ్యాధుల లాంటిదే ఇదీ. దీనికి మందు లేదు. మందు లేని వ్యాధిని ఎలా మేనేజ్ చేస్తావు? ఉపశమనం ద్వారా, అవునా? సంఘంలో మార్పుల గురించీ, పతనాన్ని గురించి, క్షీణిస్తున్న విలువల గురించి, మానవ సంబంధాల గురించీ అంకుల్ మాట్లాడేటప్పుడు, అంకుల్ వయసును దృష్టిలో ఉంచుకొని, వీలయినంత ఓపిగ్గా విని ఊ కొట్టు. అవకాశం దొరికితే మాట మార్చు. వీలయితే నీ తరం, ఆయన తరం కాకుండా రెండు మూడు సహస్రాబ్దాలు వెనక్కి వెళ్లి శంకరాచార్యుల గురించో, గాంధార శిల్పం గురించో మాట్లాడితే, ఇద్దరికీ ఏకీభావం కుదిరే చర్చాంశాలు దొరక్క పోతాయా? ఓపిక బట్టు, సహనం చూపించు....'

'రోజు రోజుకూ ఆ సహనమే నాలో క్షీణించి పోతున్నది!'

'అవున్లే! నీకు మాత్రం రోజు రోజుకూ వయసు పెరగటం లేదా మరి !' అని నవ్వింది ఈషా. ' నా సలహా చెప్పాను. ఇక నీ ఇష్టం. సమస్య నీది. 'కాల్' నీది.' అంటూ తన ఈ–బుక్ పఠనంలో మునిగిపోయింది.

★★★★★★★★★

# అమ్మకావాలా? ఆటబొమ్మకావాలా?

## పోడూరి కృష్ణకుమారి

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

ఏదో తెలీని మనో వేదనతో రగులుకుపోతూ పచ్చని పొలంలో నిలబడున్నాడు డాక్టర్ సారథి. ఆ పొలం అతనిది కాదు. స్నేహితుడు ప్రభాకరానిది. ఇంకొన్నాళ్లలో అతనిదీ కాక పోవచ్చు! సారథికి తన స్నేహితుడి తోటలో, పొలంలో తిరిగితిరిగి ఆడుకున్న ఆటలు, చేసిన చర్చలు – ఒక తీయనైన బాల్యం, క్లిష్టమైన కౌమారం, నూనూగు మీసాల నూత్నయవ్వనం – చాలా మధుర స్మృతులున్నాయి. అంతకంటే ఎక్కువ – ఆ పచ్చని నేలంటే అంతులేని గౌరవాభిమానాలున్నాయి. అందుకే వేదన, దిగులు.

దారితప్పిన చిన్నపిల్లాడిలా నిలబడున్న సారధిని చూసి దగ్గరగా వచ్చి దండంపెట్టాడు సుందరం.

"నువ్వా...?"

"సుందరాన్నండి. రిటైర్డు మేష్టారు రామంగారబ్బాయిని".

"యా.యా. గుర్తొచ్చింది. ఎమ్మెస్సీ పాస్ అయ్యావు కదూ?"

"పిహెచ్ డీ లో చేరానండి ఏడాదయింది"

"ఓ! వెరీ గుడ్".

"కానీ, ఏంటోలెండి! నాకు ఎగ్రికల్చర్ రిసెర్చ్ మీద ఇంటరెస్టు. నేను చదివిందేమో బోటనీ ఎమ్మెస్సీ. అందుకని మా ప్రొఫెసరు నాకిష్టమైన టాపిక్ ఇవ్వలేదండి. వ్యవసాయానికి సంబంధించిన టాపిక్ ఇవ్వమని బతిమాలితే క్రోటను మొక్కలమీద పరిశోధన చెయ్యమన్నాడండి. నా అభిప్రాయంలో పనికి రాని పరిశోధన. ఏదో లాగిస్తున్నాలెండి" నిరాశగా చెప్పాడు సుందరం. సారధి వివరాలడిగాడు. సుందరం చెప్తుంటే వింటూ నడిచాడు. ఇద్దరూ మామిడితోట చేరి ఓ చెట్టుకింద కూచున్నా రు.

సుందరం ఘోషంతా ఓపిగ్గా విన్నాడు సారధి. అంతావిని,

"నీకు వ్యవసాయం మీద ఆసక్తి అంటున్నావు అసలు నీకు వ్యవసాయపద్ధతులు తెలుసా? నీకే బాధ్యత ఇచ్చి కొంత భూమి అప్పచెప్తే వ్యవసాయం చెయ్యగలవా?" అనడిగాడు.

"చెయ్యగలను సార్. నాకు వ్యవసాయం చాలా ఆసక్తి. నామీద నాకు విశ్వాసం ఉంది. నేను చెయ్యగలను". అన్నాడు సుందరం.

తన సమస్యకి కూడా పరిష్కారం ఇతని ఘోషలోనే ఉందనిపించింది సారధికి.

"సరే నీ సమస్య తీర్చగలనేమో చూస్తాను. రేపు రాత్రి ఎనిమిదిన్నరకి నా ఓపీ అయిపోతుంది. అప్పుడొచ్చి నన్నుకలుసుకో"అన్నాడు.

అశ్చర్యంతో మాట తడబడింది సుందరానికి "ష్యూర్ సర్. సర్..సరే సర్" నత్తిగా అన్నాడు.

సారధి హృద్రోగనిపుణుడు. ఒకప్పుడు మహానగరంలో కార్పొరేట్ హాస్పిటల్లో కన్సల్టెంటుగా ఓ పాతికేళ్ళపాటు లక్షలు గడించి, విసిగిపోయాడు. రోగిని 'రోగం'గాను, 'ఇన్సూరెన్స్ పేకేజ్' గాను తప్ప 'రోగగ్రస్తుడైనమనిషి'గా చూడలేని ఆధునిక వైద్య సంస్కృతి మొహం మొత్తేసి, సొంత ఊరికోసం వెంపర్లాడిపోతూ, సొంత ఊరికి తిరిగొచ్చే సాడు.

"కార్డియలజిస్టుకు అంతచిన్న ఊరిలో పనేం ఉంటుంది? దగ్గులు జరాలకి మందులివ్వడం తప్ప!" విమర్శించారు సాటి వైద్యులు. భూమ్మీది కుబేరులకొచ్చే దేవతారోగాలకి తప్ప సామాన్యజనాలకొచ్చే మామూలు రోగాలకి వైద్యం చెయ్యడం పరమ నామోషీ అయినట్టు! కన్నపిల్లలు మహానగరంలోనే ఆగిపోయారు. కట్టుకున్నఇల్లాలు కరుణించి కలిసొచ్చింది. ఆ సొంత ఊరిప్పుడు చిన్నపాటి పట్టణం. ఎప్పుడూ ఉండే రాజకీయాలూ, కుళ్ళూ, కుత్సితాలు ఇప్పటికీ ఉన్నాయి. అప్పుడు అలరించిన స్నేహాలు, అభిమానాలు ఇప్పటికీ ఉన్నాయి. అదొక్కటే సంతోషం.

అయితే, నాలుగురోజుల క్రితం ప్రభాకరం ఓ బాంబు పేల్చాడు.

"నాకున్న ఏడెకరాలకీ పదికోట్లిస్తామని వస్తున్నారోయ్ డెవలపర్స్. అమ్మేస్తా. ఇన్నాళ్ళూ కౌలు చేసిన నర్సన్న పోయాడు. నాకు వ్యవసాయం ఏమీ తెలీదు. నర్సన్న చెప్పింది విని ఇచ్చింది పుచ్చుకోడం తప్ప. ఆ పదికోట్లూ బేంకులో వేసుకుని నా ఇంట్లో నేను కూచుంటా. కావలసినప్పుడల్లా పిల్లల దగ్గరికి అమెరికా వెడతాను. వాళ్ళు టికెట్లు పంపాలి నేను వెళ్ళాలి అని చూడక్కర్లేదింక" అన్నాడు ప్రభాకరం.

"ఏంచేస్తారు డెవలపర్స్ ఆ భూమిలో?" లయతప్పిన గుండె గొంతుక్కడ్డం పడుతుంటే అడిగాడు సారధి.

"విల్లాసూ, రిసార్టులు కడతారుట. ఏవో క్లబ్బుల్ల పబ్బుల్ల....."

"ఆక్లబ్బులు పబ్బులు ఎవరికి అన్నం పెడతాయిట?" సారధి ముఖంలో కోపం చూసి ప్రభాకరం నవ్వాడు.

"ఆలోచించు ప్రభాకరం, నీ మామిడి తోటలో గుడిసె వేసుకుని కాపలాకాసి బాగోగులు చూసుకునే కుటుంబం ఏమవుతుంది? అలాగే అరటి తోట, పొలం వీటన్నిటి మీదా ఆధారపడి కొన్ని కుటుంబాలు బతుకుతున్నాయి. వీళ్లందరూ ఏమవుతారు?"

"ఏమవుతారు? ఆ రిసార్టుల్లోనే గార్డెన్లుంటాయిగా? ఆ తోటల పనులు చూసుకుంటూ అక్కడే ఉంటారు"

"అలా భ్రమ పడకు. లేండ్ స్కేప్ గార్డినర్స్, లేండ్ స్కేప్ ఆర్కిటెక్ట్స్ అంటూ రకరకాల ఫేన్సీ పేర్ల స్పెషలిస్టులను తీసుకొస్తారు డెవలపర్స్. మన నర్సయ్య, వెంకన్న ఇలాంటి వాళ్ళెవరూపనికిరారు. వీళ్ళని లేపేస్తారు. వాళ్ళకి తగిన పనివాళ్ళని తెచ్చుకుంటారు. నీమీద ఆధారపడి ప్రశాంతంగా బతుకుతున్న వీళ్లంతా నగరాలకు వలస పోవాల్సిందే. అదీ జరగబోయేది. అటువంటి పరిస్థితులు సృష్టించడం అమానుషం. రిసార్టులు, గోల్ఫ్ క్లబ్బులూ ఇటుపేదకే కాదు అటు ధనికుడికి కూడా అన్నం వండిపెట్టి ఆకలి తీర్చవు. కనక వర్షం కురిపిస్తాయంతే. కనకం తినడానికి పనికి రాదు. తెలుసుకదా?" కాస్త ఆవేశంగా అన్నాడు సారధి.

ప్రభాకరం వెర్రినవ్వొకటి నవ్వేసి, వెర్రివాడి కేసి చూసినట్టు చూసాడు.

"నేనిప్పుడు ఉన్నపళంగా అమ్మెయ్యట్లేదులే. ఆ కంపెనీ వాళ్లు నాకు ఆలోచించుకోడా నికి రెండునెలలు టైమిచ్చారు. ఇంకా మా పిల్లలతో మాట్లాడాలి. నువ్వు చెప్పిన మాటలు కూడా వాళ్ళతో చెప్తా" అన్నాడు.

ఆ తరవాత వారం రోజులపాటు పీడకలలు పీడించుకు తిన్నాయి సారధిని.

మనషులు మాతృగర్భంలోంచి శిశువులుగా జన్మించడం మానేసినట్టూ,

ఒకేసారి తాడెత్తు మనషులు ప్రయోగశాల అద్దాలు బద్దలుకొట్టి వందలకొద్దీ పుట్టుకొస్తున్నట్టు,

భూమిని బద్దలుకొట్టి, సముద్రాలు తాగేస్తున్నట్టూ

ఒకడినొకడు దోచుకుంటూ, వీలైతే పీక్కుతింటున్నట్టు,

ఆడ శరీరాలకి అంగుళానికింత అని వెలకట్టి వేలంవేస్తున్నట్టు!

అతిభయంకరమైన కలలు! నిద్రనుంచి వణుకుతూ లేచిపోయేలా కలలే కలలు!

ఇప్పుడు సుందరం మాటలతో చిన్న ఆశ. చిన్న ధైర్యం.

★★★★★★★

ఆరాత్రి ప్రభాకరం ఎదురుగా సుందరాన్ని కూచోబెట్టాడు సారధి.

"నాకు చెప్పినదే కాస్త వివరంగా మళ్ళీ చెప్పు" అన్నాడు సారధి. సుందరం గొంతు సవరించుకుని ప్రారంభించాడు.

"సార్, మన వ్యవసాయంలో సంప్రదాయ పద్ధతులు, సంప్రదాయ పంటలు, వంగడాలు చాలా ముఖ్యం. కొన్ని వ్యాపార సంస్థలు రకరకాల హైబ్రిడ్ విత్తనాలు డెవలప్ చేసి ప్రచారం చేసుకుని రైతులు సంప్రదాయ వరి వంగడా లను మర్చిపోయేలా చేస్తున్నాయి. నిజానికి హైబ్రిడ్ విత్తనం ఏ అవాంతరం రాకుండా పండితే చాలా దిగుబడినిస్తాయి. కానీ కేవలం వర్షాధారంగా నడిచే మన వ్యవసాయానికి హైబ్రిడ్ లు ఉపకారంకన్నా అపకారమే ఎక్కువ చేస్తున్నాయన్నది సైంటిస్టులుకూడా ఒప్పుకుంటున్నారు. ముఖ్యంగా హైబ్రిడ్ వరికోసం మొదట పెట్టుబడి చాలా ఎక్కువ పెట్టవలసి వస్తుంది. తగినంత వర్షం పడక పోతే రైతు భారీగా నష్టపోతాడు. నేను సాంప్రదాయ వరివంగడాల గురించి మరింత పరిశోధన చెయ్యాలనుకుంటున్నాను. నాకు చిన్న చెక్క భూమి, కొద్దిగా సహాయం చేస్తే రైతులకు నష్టం లేని వ్యవసాయం నేర్పించగలుగుతాను సార్. వ్యవసాయాన్ని కూడా వ్యాపారస్తులే అజమాయిషీ చేసి, చిన్నకారు రైతులను అప్పులపాలు చేసి దిక్కు తోచని పరిస్థితుల్లోకినెట్టేస్తున్నాయి".

ప్రభాకరం వింటూకూచున్నాడు ఏం మాటాడలేదు. "కేవలం వరే కాదు సార్. జొన్నలు రాగులు వంటి సంప్రదాయ పంటలను మనవాళ్ళు నిర్లక్ష్యం చేస్తున్నారు. నాకు ఒక్క రెండుమూడేళ్ళు ఎవరైనా అవకాశం ఇస్తే మన ప్రాంతం రైతులకు సాంప్రదాయ వ్యవసాయం వల్ల లాభాలు సాధించి చూపించి ఒప్పించ గలను. దీనికి పెద్ద జెనెటిక్ ఇంజనీరింగ్ నైపుణ్యం అక్కర్లేదు. ప్రకృతే జీన్ సెలెక్షన్ చేసి అందించిన వంగడాలున్నాయి. మనం అందుకోవాలి అంతే" అన్నాడు సుందరం.

"అదోయ్ ప్రభాకరం సంగతి. ఇతనికి ఒక అవకాశం ఇస్తే ఆ మాత్రం నర్సన్న ఇచ్చిన పాటి పండించి ఇవ్వగలడు. ఓ మూల తన పరిశోధన తను చేసుకుంటాడు" అన్నాడు సారధి.

“వరద ముంపుకు గురైనా, తట్టుకునే వంగడాలను తయారు చెయ్యాలన్నది నా లక్ష్యం. రోజుల తరబడీ వరదనీటి లో మునిగి ఉన్నా తట్టుకుని దిగుబడినిచ్చే రకాలు కొన్ని కొండ ప్రాంతాల్లో ఉన్నాయి. అటువంటి రకాలను మన ఆహార అవసరాలకు తగ్గట్టుగా డెవలప్ చెయ్యాలన్నదే నా లక్ష్యం సార్” సుందరం చెప్తున్నది విని, ప్రభాకరం కాసేపు ఆలోచిస్తూ కూచున్నాడు.

“నేను మా వాళ్లందరితోను సంప్రదించాలి. నాకు టైమ్ కావాలి” అన్నాడు.

“నీ ఇష్టం వచ్చినంత టైమ్ తీసుకో కానీ ఎప్పటికైనా మాపట్ల సానుకూలంగానే స్పందించి నిర్ణయంతీసుకో” అన్నాడు సారధి చిరునవ్వు చిందిస్తూ. ప్రభాకరం నవ్వేసాడు. కాసేపు సుందరాన్ని ఏవేవో ప్రశ్నలు వేసి అతని పరిజ్ఞానాన్ని పరీక్షించి, తనకున్న సందేహాలు తీర్చు కున్నాడు ప్రభాకరం.

ప్రభాకరం బంధుమిత్రులలో కలకలం రేగింది. ప్రభాకరానికున్న ఏడు ఎకరాలనూ పదిహేడుకోట్లు ఇచ్చి కొంటాం అని ఎవరో వస్తే సారధి తన చుట్టాలబ్బాయికి తక్కువరేటుకి ఇప్పించాలని పదిహేడుకోట్ల బేరం చెడగొట్టి పంపేసాడని పుకార్లు వ్యాపించాయి. “అమ్మో సారధి దుర్మార్గుడు!” అన్నారు కొందరు సన్మార్గులం అనుకుంటున్నవాళ్ళు. ప్రభాకరం ఈ వదంతులకేం చలించలేదు కానీ, తన ఆలోచనే ఎటూ తేల్చుకోలేక పోయాడు. పెద్దకొడుక్కి ఫోన్ చేసి సంగతి చెప్పాడు. “ఓ డాడ్! సారధీ అంకుల్ అస్సలు ప్రాక్టికల్ మనిషి కానేకాదు. చాలా ఇమోషనల్. నీకు తెలుసుగా? కార్డియాలజిస్టుగా మాంచి కెరీర్ డెవలప్ చేసుకుని, ఉత్తపుణ్యానికి అంతా రూయిన్ చేసుకొచ్చేసాడు. ఆయన సలహా విని మంచి బేరం వదులుకోకు” అన్నాడు. రెండోవాడు కూడా ఇంచుమించు అలాగే మాట్లాడాడు.

“వీళ్లబొంద! సారధి కెరీర్ రూయిన్ చేసుకోడమేంటి? అతనిక్కడ ఎంత పెద్ద నర్సింగ్ హోమ్ డెవలప్ చేసాడో, ఎంతమంది సామాన్య జనానికి ఉచిత సేవలందిస్తున్నాడో వీళ్ల ఊహక్కూడా అందదు. వీళ్లు కాదు నేనే నిర్ణయించు కోవాలి. సుందరం సమర్థుడా కాదా అన్నది చూసుకోవాలి” అనుకున్నాడు.

★★★★★★

“ప్రభాకరం గారు నాకు అనుకూలంగా నిర్ణయం తీసుకునేటట్టు కరుణించు స్వామీ!” అని గూట్లో కొలువై ఉన్న దేవుడి పటానికి దండం పెట్టుకుని, మళ్ళీ తను యూనివర్సిటీకి తిరిగెళ్ళేలోపు ఓసారి సారధికి కనిపించి వద్దామని బయల్దేరాడు సుందరం. సుందరం వెళ్లే టప్పటికి ఇంట్లోనే ఉన్నాడు సారధి. “రావోయ్” అని ఆహ్వానించాడు. “ఇవాళ బస్సుకి బయల్దేరి యూనివర్సిటీకి వెళ్లిపోతున్నానండి” అన్నాడు సుందరం.

“నువ్వేం దిగులుపడకు. ప్రభాకరం మంచివాడే. మనకి మద్దతునిస్తాడనే అనుకుంటున్నాను” అన్నాడు సారధి. సుందరం మనసు ఆశ నిరాశల మధ్య ఊగిసలాడడం అతని ముఖంలోనే తెలుస్తోంది.

“అతను మన ప్రపోజల్ ఒప్పుకున్నాకూడా నీ పిహెచ్.డి. సీటు వొదులుకోకు. నీకు నమ్మకంగా పని చేసిపెట్టగలిగే పనివాళ్ళతో ఒక టీమ్ ఏర్పాటు చేస్తా. నెలలో ఒకటి రెండుసార్లు వచ్చి పర్యవేక్షిస్తూ ఉండు. నిర్దుష్టంగా సూచనలిచ్చి వెడుతూ ఉండు. ఎందుకు పిహెచ్.డి సీటు వదులుకోవద్దంటున్నానంటే, నీ డాక్టరేటు నీకు కొంత అధికారాన్నీ, గౌరవాన్నీ ఇస్తుంది. నువ్వు చెప్పినదల్లా చేసి చూపిస్తే నువ్వు ప్రయోగం చేసిన పొలాన్నే పరిశోధనాకేంద్రంగానో, కనీసం రైతు శిక్షణా కేంద్రంగానైనా నడిపే సాధికారతని ఇస్తుంది” అన్నాడు సారధి. తనకన్నా ఎక్కువగా సారధే ఈ ప్రయోగం మీద ఆశ పెట్టుకున్నాడేమో అనిపించింది సుందరానికి.

“నేను ప్రభాకరం పొలం డెవలపర్స్ చేతుల్లోకి పోకూడదని ఎందుకింత తాపత్రయపడుతున్నానో తెలుసా సుందరం? ఆకుపచ్చగా కళకళలాడే పంటపొలాన్ని చూసినా, పళ్ళను మన చేతికందిస్తున్నట్టు పళ్ళ భారంతో కొమ్మలను వంచిన చెట్లున్న తోటలను చూసినా నాకెవరు గుర్తొస్తారో చెప్పనా? పిల్లల కడుపులో ఆకలిని కంటి చూపుతోనే కనిపెట్టి చకచకా అన్నం కలిపి పెట్టే అమ్మ గుర్తుకొస్తుంది. ఇవాళ వ్యాపార సంస్కృతి అలాంటి అమ్మలను కూడా ఆటబొమ్మలుగా మారుద్దామని చూస్తోంది. చేతనైనంతవరకూ అడ్డుకుందాం” అంటున్న సారధి మాటలు తన జీవితానికి ఒక దిశా నిర్దేశం చేస్తున్నట్టుగా వినిపించాయి సుందరానికి.

★★★

# సుందరి - సీతారామ్ కె.ఎస్.ఎం ఫణీంద్ర

1

సుందరి పేరుకి తగ్గట్టే అందంగా ఉంటుంది. "ఆ, అందాన్ని కొరుక్కు తింటామా ఏం!" అని రసికత లేని కొందరు తీసిపడేస్తూ ఉంటారు. అది నిజమే కావొచ్చు. కానీ కొరుక్కు తినాలనిపించేంత అందంగా ఉంటే తప్పులేదు! అంతటి అందం సుందరికి ఉంది. కానీ తప్పంతా ఆ పేరులోనే ఉంది. "అసలు ఏమాత్రం ఆలోచన ఉన్నా, కూతురుకి ఇలాంటి పేర్లు ఎవరైనా పెడతారా? కాలేజీలో అబ్బాయిలు ఎన్ని కామెంట్లు వేస్తారని?" అని అమ్మతో చాలా సార్లు గొడవ పెట్టుకుంది సుందరి. అమ్మ ఏమీ బదులిచ్చేది కాదు కానీ, పక్కనే ఉన్న బామ్మ ఒకసారిది విని – "త్రిపుర సుందరీ దేవి కృప వల్ల పుట్టావే నువ్వు! అందుకే ఆ పేరు పెట్టాం. ఆవిడే నీకింత అందాన్నిచ్చింది. ఇప్పుడు ఇలాగే అంటావులే! పెళ్ళయ్యాక తెలుస్తుంది అందంలో ఆనందం ఏమిటో!" అనేసింది. ఈ బామ్మలున్నారే! ఏమీ తెలియనట్టు ఉంటారు కానీ సిగ్గుపడే మాటలన్నీ సిగ్గు లేకుండా అనేస్తారు.

సుందరికి ఉన్న ఒక ప్రత్యేక అభిరుచి ఏమిటంటే పాటలు వినడం! ఇది చాలా మంది చేస్తారు నిజమే. కానీ పాటలోని సాహిత్యాన్ని ఆస్వాదిస్తూ, కవి కల్పనని జీవిస్తూ పాట వినడం అందరూ చేసేది కాదు. అలా సాహిత్యాన్ని మైమరచి వింటూ, తనను అమితంగా ఆకట్టుకున్న పాటలు రాసినది ఎవరా అని ఆరాతీస్తే తెలిసింది ఆయన పేరు "సిరివెన్నెల సీతారామ శాస్త్రి" అని. తన పాటల సిరివెన్నెలలో తేలి ఆడించిన కవి పేరు కూడా సిరివెన్నెలే కావడం ఎంత సముచితంగా ఉందో అని సుందరి సంబరపడి అప్పటినుంచి సిరివెన్నెలకి వీరాభిమానిగా మారిపోయింది. ఎంత అంటే పిచ్చిపిచ్చిగా అభిమానించేంతగా. తన ఈడు అమ్మాయిలు మహేష్ బాబుని ఆరాధించేంతగా!

"సిరితోనో, వెన్నెలతోనో ప్రేమలో పడాల్సిన వయసులో, ఇలా సిరివెన్నెల కవిత్వాన్ని వింటూ మైమరచిపోవడం ఏమిటే సుందరీ నాకర్థం కాదు! ఏ వయసుకా ముచ్చట అన్నారు. ముందో అబ్బాయిని చూసి కట్టేసుకుని అప్పుడు కావాలంటే ఇద్దరూ కలిసి ఆ సిరివెన్నెల పాటలు పాడుకోండి! ఆయన పాటల్లో ఇలాంటి పనికొచ్చే విషయాలేవీ చెప్పలేదా?" అని బామ్మ పదే పదే విసిగించి చంపేసినా సిరివెన్నెల పాటలు వినే కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తూనే ఉంది సుందరి. ఇలా సిరివెన్నెల ధారలో తడిసి ముద్దవుతున్న సుందరికి వెన్నెలరేడు, వన్నెలకాడు ఎవరూ తారసపడలేదనే చెప్పాలి, ఈ కథ మొదలయ్యేదాకా!

2

ఇప్పుడు ఈ కథకి హీరో సీతారాంని చిత్తగిద్దాం. పేరుకి తగ్గట్టే బుద్ధిమంతుడు, అందగాడు కూడా.

"నీ అంత హేండ్సమ్నెస్ నాకుంటే, కనీసం ఓ హండ్రడ్ అమ్మాయిలని వెంటేసుకుని హ్యాపీగా ఉందును కదరా!" అంటాడు దివాకర్. ఇతను సీతారాంకి బెస్ట్ ఫ్రెండ్. సినీ మాటల రచయిత, దర్శకుడు త్రివిక్రం అంటే పడి చస్తూ ఉంటాడు, అతని డైలాగులే ఇమిటేట్ చేస్తూ ఉంటాడు.

"కోటిమంది అమ్మాయిలెందుకురా, కోహినూర్ లాంటి ఒక్క అమ్మాయి చాలు కానీ! అలాంటి అమ్మాయి కోసం నేనూ నా వయసూ ఎదురుచూస్తున్నాం!" అంటాడు సీతారాం.

అతని మనసుని దోచుకున్న అమ్మాయి ఎవరూ దొరకలేదు మరి ఇప్పటిదాకా! అలాగని అతని మనసు ఖాళీగా లేదులెండి. అతని మనసులో స్థిరనివాసం ఏర్పరుచుకున్న మూర్తి ఒకరున్నారు. ఆయనే పాటల రచయిత "వేటూరి సుందరరామ్మూర్తి"! పాటలు వినడం ఇష్టమైన సీతారాం, తెలుగు పాటలు వింటూ వింటూ ఎప్పుడో ఎక్కడో ఒక వేటూరి పాట విని పుష్కరగోదావరిలా ఉప్పొంగాడు. ఆ శైలికీ, ఆ తెలుగు భాషకీ దాసోహమై వేటూరి పాటల పూదోటలో శాశ్వత తుమ్మెదగా మారాడు.

"ఒరేయ్! నీకాయన సూట్ అవ్వడ్రా. నువ్వా పక్కా జంటిల్మేన్ వి. ఆయనా మహా తుంటరోడు. ఆయన పాటలు నీకెలా నచ్చాయ్‌రా! ఏదో వినోదం కోసమని సగటు తెలుగు సినీ ప్రేక్షకుడు ఓ సినిమాకి వెళ్లి అందులో పాటలు విని రిలాక్స్ అవుదామనుకుంటే, అమ్మాయి చూసే ఓరచూపులా అర్థమయ్యీ అర్థమవ్వనట్టు, ఎంతో అర్థమున్నట్టు, అర్థానికే అందనట్టు, అసలు అర్థమే లేనట్టూ ఇలా రకరకాల తికమక పాటలు రాసే ఆ వేటూరి గారు నిన్నెలా మెప్పించాడ్రా! అసలు ఎలా జరిగిందిది, ఎందుకు జరిగిందిది? నాకు తెలియాలి!" అన్నాడు దివాకర్ ఒకసారి "అతడు" చిత్రంలో ఎమ్మెస్ నారాయణ పలికిన డైలాగుని ఇమిటేట్ చేస్తూ.

"ఒరేయ్, అతడు సినిమా డైలాగ్ కాపీ కొట్టావులే కానీ, అదే సినిమా డైలాగ్‌తో సమాధానం చెప్తాను. నేనూ ఆ సినిమాలో మహేశ్ బాబులా ఏవో పాటల్లో తిరుగుతూ ఎక్కడో ఉన్నాన్రా, ఓ రోజు అమ్మ చేతిముద్ద లాంటి పాటొకటి విన్నాను. వేటూరి పాటంత బావుంటుందని అప్పుడే తెలిసిందిరా. తెలిస్తే ఎప్పుడో వేటూరిని అంటిపెట్టుకునేవాడిని."! ఇదీ సీతారాం సమాధానం!

ఈ వేటూరి పాటే ఓ ఘాటైన వలపుకి దారితీస్తుందని సీతారాంకి తెలీదు.

3

సీతారాం ఓ రోజు హైటెక్ సిటీలోని ఓ సిటీ బస్ స్టాప్‌లో బస్ కోసం వైట్ చేస్తూ ఉండగా అసలు కథ మొదలైంది. బైక్ సర్వీసుకి ఇవ్వడంతో ఆ రోజు సిటీబస్ లో ఆఫీస్ కి వెళ్ళాల్సి వచ్చింది. అందమైన సాయంత్రం! కానీ చుట్టూ ట్రాఫిక్ రొద! దుమ్మూ ధూళీ! ఇలాంటి కఠిన వాస్తవాల నుంచి బయటపడడానికి సీతారాం ఎప్పటిలానే వేటూరి పాటని ఆశ్రయించాడు. హెడ్ ఫోన్స్ పెట్టుకుని ఒకరకమైన తాదాత్మ్యతలోకి వెళ్ళిపోయాడు, చుట్టూ లోకాన్ని మర్చిపోయేంతగా. కొంచెం మెలకువగా ఉండుంటే తన పక్కనే మెరిసిన మెరుపుని గమనించి ఉండేవాడు. కవిత్వాల్లో అందాన్ని వెతుక్కునే వాళ్ళెప్పుడూ ఇంతే, పక్కనున్న అందాన్ని గమనించి చావరు!

సుందరి పాపం ఆ రోజు ఆఫీస్ క్యాబ్ మిస్ అయ్యి సిటీబస్ ఎక్కాల్సి వచ్చింది ఇంటికి వెళ్ళడానికి. బస్ స్టాప్ లో జనాలు బానే ఉన్నారు, ఓ చివర కొంచెం డీసెంట్ లుకింగ్ అబ్బాయి కనిపించడంతో అతని పక్కన కొంచెం దూరంలో నిలబడింది. దగ్గరగా చూస్తే, డీసెంట్ లుకింగే కాదు, హేండ్సమ్ గానే ఉన్నాడు అనుకుంది. కానీ ఏదో మ్యూజిక్ వింటున్నాడు అనుకుంటా, తనని గమనించట్లేదు. చుట్టూ ఇంకొందరు కుర్రాళ్ళు తననే దొంగచూపులు చూస్తున్నారు. తన పక్కనున్న అబ్బాయి మాత్రం జంటిల్మేన్ లా డీసెంటుగా ఉండడం రిలీఫ్‌గా అనిపించింది సుందరికి.

సీతారాంకి ఉన్న ఒక పాడు అలవాటు ఏంటంటే, బాగా లీనమై పాటలు వింటున్నప్పుడు పల్లవిని బయటకి హమ్ చెయ్యడం. ఎక్కడ ఉన్నాం, ఆ పల్లవి ఎలాంటిది అని కూడా పట్టించుకోడు. ఆ రోజు అదే అతని కొంపముంచింది!

చూడచక్కని చూర్ణకుంతల, చూపుకందని హేల!
సందెవేళలో శకుంతల, వెన్నెలెందుకీ వేళ!
హోయి నవ్వుల సుహాసినీ! తేనె వెచ్చని కలా!
వాలుకన్నుల వరూధినీ, లేత హెచ్చరికలా?
చకోరి చంద్రికా చంచలా
మోహనాల మేఘమాల

సడన్‌గా తన పక్కనున్న కుర్రాడు ఈ లైన్లు హం చెయ్యడం చూసి సుందరి ఆశ్చర్యపోయింది! ఈ అబ్బాయిలతో వచ్చిన చిక్కు ఇదే! బావున్నారు అనుకునే లోపే ఏవో తిక్కవేషాలేసి మొత్తం ఇంప్రెషన్ పోగొట్టుకుంటారు! వాట్ ఎ పిటీ! కవిత్వం ఉన్న పాట పాడి టీజ్ చేస్తే సరసం అనుకున్నట్టు ఉన్నాడు వెధవ!

వెంటనే ఇంకో ఆలోచన వచ్చింది – ఒక వేళ తను అతనిని అపార్థం చేసుకుందేమో, అతను ఊరికే పాట వింటూ హమ్ చేశాడేమో! సరే బెనిఫిట్ ఆఫ్ డౌట్ ఇచ్చి చూద్దాం అనుకుంది, అబ్బాయిల గురించి ష్యూర్‌గా తెలిసినా! అతను పాడిన పల్లవిపై ఆలోచన పోయింది. "చూర్ణకుంతల" అంటే ఏమిటబ్బా? చక్కని జుట్టు ఉన్న అమ్మాయి అనా? ఏమో! ఆ మాటకొస్తే తన జుట్టు ఒత్తుగా, పొడుగ్గా ఉంటుంది. "నువ్వు మొగుణ్ణి కొంగుకి కాదే, జడకే కట్టేసుకోవచ్చు!" అంటుంది బామ్మ. "సందెవేళలో శకుంతల, వెన్నెలెందుకీ వేళ" – నువ్వు చందమామలా అందాల వెన్నెలని కురిపిస్తూ ఉంటే ఇక ఈ సందెవేళ మళ్ళీ వెన్నెలెందుకు దండగ! ఎంత అందమైన ఊహ!

ఇలా సుందరి తీయని తలపుల్లో ఉండగా, తనని ఉలిక్కి పడేలా చేస్తూ వినిపించింది ఇంకో పాట –

నిన్ను రోడ్డు మీద చూసినది లగాయత్తు
నేను రోమియోగ మారినది లగాయత్తు
నాకు గుండెలోన పుట్టుకొచ్చే "సెగా"యత్తు
అది భామ కాదు బాతు!

"ఛీ! డౌట్ లేదు. వీడు ఈవ్ టీజరే. బావున్నాడు అనుకున్నంత సేపు పట్టలేదు!". సుందరి కోపంతో పక్కకి తప్పుకుందాం అనుకునేలోపే బస్ వచ్చింది లక్కీగా.

ఏదో బస్ రావడంతో లోకంలోకి వచ్చిన సీతారాంకి కళ్ళు జిగేల్మన్నాయి! ఓ అమ్మాయి బస్ ఎక్కడానికి వెళుతూ కనిపించింది. వేటూరి పాటే అమ్మాయై పక్కనే ఉంటే తను పట్టించుకోలేదా ఇంత సేపూ! ఇంతకంటే అందమైన అమ్మాయిలనే చూశాడు కానీ, ఈసారి గుండె కలుక్కుమనడమే కొత్తగా ఉంది. ఎవరీ మనోహరి? ఇంతలోనే ఆ అమ్మాయి బస్ ఎక్కుతూ వెనక్కి తిరిగి తనని ఓ చూపు చూసింది. ఆ కళ్ళలో కోపం, చూపులో ఏహ్యభావం. వెంటనే జరిగింది అర్థమైంది సీతారాంకి. కానీ అంతలోనే బస్ వెళ్ళిపోయింది!

4

జరిగిన పొరబాటుని పదే పదే తలుచుకుని, తనని తానే నిందించుకున్నాడు సీతారాం. పనిలో పనిగా "ఎంత పని చేశావయ్యా!" అని వేటూరిని కూడా ఓ మాట అన్నాడు, ఆయన ప్రమేయమూ ఉంది కనుక. తన మనసు దోచుకున్న ఒక చిన్నది ఆఖరుకి కనిపించిందని ఆనందించాలో, తాను చేసిన పొరబాటు వలన ఆ చిన్నది బహుశా ఎప్పటికీ దక్కదని బాధపడాలో అతనికి అర్థం కాలేదు. "అందానికి అందం ఈ పుత్తడి బొమ్మ, అందరికీ అందనిదీ పూచిన కొమ్మ!" అంటే ఇదేనేమో!

ఆ అమ్మాయి చేజారిందన్న బాధ కన్నా, తనని అనుకోకుండా బాధ పెట్టానన్న విషయమే సీతారాంని కలతకి గురిచేస్తోంది. తన వెంట పడిన అమ్మాయిలే తప్ప, తాను వెంటపడిన అమ్మాయిలు ఎవరూ లేరు ఇప్పటి వరకూ. ఇప్పుడు ఈ అమ్మాయిని వెతికి, సారీ చెప్పి తరువాత కుదిరితే వెంటపడి ప్రేమించాల్సిన అవసరం ఏర్పడింది!

ఆ రోజు నుంచి కొన్ని వారాల పాటూ హైటెక్ సిటీ అంతా అణువణువూ గాలించాడు. తన బైకుని వదిలి రోజూ సిటీబస్సుల రద్దీలో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు, షేర్ ఆటోల ఝుంఝూటంలో పడ్డాడు, MMTS ప్లాట్ఫారాలన్నీ వెతికాడు. కానీ ఆమె కనిపించలేదు – "ఉత్తరాన లేవంది ధ్రువ నక్షత్రం, దక్షిణాన లేవంది మలయ పర్వతం" అన్న వేటూరి పాట గుర్తు రావడం తప్ప. కానీ అతనికో విషయం అర్థం అయ్యింది. హైదరాబాదులో అందమైన అమ్మాయిలు చాలా మందే ఉన్నారు, అమ్మ చూసే ఆ తెలుగు మాట్రిమోనీ సంబంధాల్లో కనిపించరు కానీ. అయితే ఎంత అందంగా ఉన్నా తన మనసు దోచుకున్న చిన్నదిలా ఎవరూ లేరు, ఇది నిజం!

ఇలా వెతికి వెతికి అలసి ఒక రోజు సాయంత్రం దివాకర్ దగ్గరకి వెళ్ళాడు రిలాక్స్ అవుదామని. దివాకర్ పనిచేసే కంపెనీ కూడా హైటెక్ సిటీలోనే ఉంటుంది, అతని కంపెనీ క్యాంటీన్లో అప్పుడప్పుడూ కలవడం అలవాటే ఇద్దరికీ.

"చూడు సీతారాం! అమ్మాయిలు నీ వెంట పడాల్సినోడివి, నువ్వే ఓ అమ్మాయి వెంట పడడం నీ మగతనానికే అవమానం!" – గంభీరంగా డైలాగ్ చెప్పాడు దివాకర్.

"ఊరుకోరా! నువ్వూ నీ కామెడీలు. మేటర్ సీరియస్ ఇక్కడ. అలాంటి అమ్మాయిని చూసి కూడా ప్రేమలో పడి, తన వెంటపడకపోతే అదీ నిజమైన అవమానం నా మగజన్మకి!"

"అప్పుడే ప్రేమ దాకా వచ్చిందీ! నేను అనుకుంటూనే ఉన్నాను. అమ్మాయిలతో అసలు ఏ మాత్రం టచ్ లేని నీ లాంటి వాడికి పెద్ద షాక్ ఇచ్చే అమ్మాయే ఏదో రోజు తగులుతుందని! నువ్వు మరీ అమాయకుడివి కాకపోతే తొలి చూపులోనే ప్రేమలో పడడాలు, తొలి అటెంప్ట్ లోనే తత్కాల్ టికెట్లు దొరకడాలూ ఉండవు!"

"దివాకరూ, ప్రేమలో పడ్డవాడికి కదా తెలిసేది ప్రేమ ఘాటూ, ప్రేమ కాటూ. నీకెలా తెలుస్తుంది. "తొలి చూపు తోరణమాయే, కళ్యాణ కారణమాయే" అన్న వేటూరి పాట అర్థం కావాలంటే నువ్వూ నాలా ప్రేమలో పడాలి!

"బాబూ! నన్నొదిలెయ్. నిన్నూ, ఆ వేటూరి కవిత్వాన్నీ అర్థం చేసుకోవడం నా వల్ల కాదు. కాఫీ తాగాం కదా, వెళ్దాం పద. నాకు వర్క్ ఉంది"

"ఒరేయ్ ద్రోహీ. నేను నువ్విచ్చే ఈ చెత్త కాఫీ తాగడానికి రాలేదు, నా మనసులో బాధ చల్లార్చుకోవడానికి వచ్చాను" అన్నాడు సీతారాం లేస్తూ

"అవునా! ఆ ముక్క ముందే చెప్పుంటే కోల్డ్ కాఫీ ఇచ్చేవాడిని కదా, హాట్ కాఫీ బదులు! చల్లగా ఉండేది"!

## 5

వాళ్లిద్దరూ ఆఫీస్ క్యాంటీన్ నుంచి బయటకు నడిచి లిఫ్ట్ దగ్గరకి వెళుతూ ఉంటే, అప్పుడే లిఫ్ట్ డోర్ మూస్కోవడం, మూసుకుంటున్న డోర్ లోంచి ఓ అందమైన రూపం ఓ క్షణం మెరిసి మాయమవ్వడం జరిగింది.

"తనే! తనే! " అంటూ మెట్ల వైపు పరిగెత్తడం మొదలెట్టాడు సీతారాం!

"ఒరేయ్! ఇదేమైనా సినిమా అనుకుంటున్నావ్ రా! ఈ రోజుల్లో లిఫ్టులు చాలా స్పీడుగా వెళ్తాయ్, మనం ఎంత పరుగెత్తి మెట్లెక్కినా అందుకోలేం. పైగా పది ఫ్లోర్లు ఉన్నాయ్ ఇంకా, లిఫ్ట్ ఎక్కడ ఆగుతుందో ఎవడికి తెలుసు? పక్క లిఫ్ట్ లో వెళ్దాం ఆగు" అని దివాకర్ చెబుతున్నా వినిపించుకునే స్థితిలో లేడు సీతారాం!

లక్కీగా ఆ లిఫ్ట్ పై ఫ్లోరులోనే ఆగింది. సీతారాం మెట్లు ఎక్కి వెళ్ళేటప్పటికి ఆ అమ్మాయి లిఫ్ట్ నుంచి పైకొచ్చి నడుస్తోంది, ఇంకో స్నేహితురాలితో. సీతారాం ఆనందానికి అవధులు లేవు. సుందరికి కనబడకుండా గోడ పక్కనుంచి తననే చూస్తున్నాడు – "కడగంటి కొలకుల్లో, తెలుగింటి వెలుగుల్లో, తెరతీసిన తేనె దీపం, తేనే కన్నా తీపి రూపం!" ఆహా!

కొద్ది సేపటికి రొప్పుతూ దివాకర్ కూడా వచ్చాడు, "బతికించింది ఈ అమ్మాయెవరో. ఇంకా ఎన్ని ఫ్లోర్లు ఎక్కాలా అని టెన్షన్ పడ్డాను రా బాబూ! అమ్మాయిల వెంట పడడం వలన కొలెస్ట్రాల్ తగ్గే చాన్సులు కూడా ఉన్నాయని ఇప్పుడే తెలిసింది"

రెప్పకూడా వేయకుండా సీతారాం చూస్తున్న అమ్మాయి ఎవరా అని చూసిన దివాకర్ – "వాట్! నీ మనసు దోచుకున్నది సుందరా!" అన్నాడు వెంటనే!

"వాట్! నీకా అమ్మాయి తెలుసా!"

"మా కంపెనీయే. మా ఆఫీసులో సుందరి తెలియని అబ్బాయిలు లేరు!"

"మా ఆఫీసులో అమ్మాయిలే లేరు, ఆఫీస్ కి వెళ్ళడానికి మోటివేషనే లేదు లాంటి డైలాగులు ఎలా కొట్టావురా, ఇలాంటి అమ్మాయిని పెట్టుకుని?"

"ఎగ్జాం పేపర్ లో ఒకే ఒక్క ప్రశ్నకి సమాధానం తెలిసినట్టు ఆఫీసులో ఒకే ఒక్క అందమైన అమ్మాయుంటే ఎలాగరా ప్రేమ పరీక్షలో నాలాంటి నవయువకులు పాసవ్వడం?"

"చందమామే ఉన్నప్పుడు ఇంక చుక్కలెందుకురా!"

"ఆ, చందమామే! అందని చందమామ. ఎంత మంది ట్రై చేశారో! అబ్బే! .... కానీ చాలా మంచి అమ్మాయి. ఈ ప్రేమలూ దోమలూ వంటి వాటి జోలికిపోకుండా ఎప్పుడూ ఆ సిరివెన్నెల పాటల లోకంలో ఉంటుంది"

"యూ మీన్, సిరివెన్నెల సీతారామ శాస్త్రి?"

"ఆ, ఆయనే! టీనేజ్ అమ్మాయిల దగ్గర నుంచీ పెళ్ళైన ఆంటీల దాకా ఆయన పాటలంటే పడి చచ్చిపోతూ ఉంటారు, ఎందుకో తెలీదు! ఇక్కడ ఒక్క అమ్మాయిని పడెయ్యలేక చస్తున్నాం!"

"ఆహా! రమేష్ నాయుడి ట్యూనుకి వేటూరి పాటలా ఎంత తియ్యని మాట చెప్పావురా! నా పెళ్ళి మొదటి శుభలేఖ నీకే ఇచ్చి నీ రుణం తీర్చుకుంటాను! సిరివెన్నెలే శరణం ఇక!"

"నువ్వు వేటూరికి కదా ఫ్యాన్‌వి?"

"పిచ్చివాడా! వేటూరి కొండపైన దేవుడు, మనమే ఎక్కి కొలుచుకోవాలి. సిరివెన్నెల మన కోసం తానే కొండ దిగొచ్చిన దేవుడు. ఇద్దరూ దేవుళ్ళే!"

"ఏంటో! ఒక్క ముక్క అర్థమైతే ఒట్టు!"

"నీకర్థం కాదులే గానీ, నాకో చిన్న హెల్ప్ చెయ్యరా! నీకో లెటర్ ఇస్తాను, ఆ అమ్మాయి క్యూబికల్‌లో పెడతావా, రేపు ఉదయం ఆఫీసుకి వచ్చినప్పుడు తను చూసేలా?"

"నువ్వు జనాలందరూ మరిచిపోయిన పాతకాలం తెలుగు మాటలన్నీ పాటల్లోకి తీసుకొచ్చి ప్రయోగాలు చేసే వేటూరికి అభిమానివి మాత్రమే అనుకున్నాను. నీ బుర్ర కూడా ఇంకా పాతగానే ఆలోచిస్తూ ఉందని ఇప్పుడే తెలిసింది. లేకపోతే ఈ రోజుల్లో లెటర్లు ఎవరు రాస్తున్నారురా?"

"అందుకే కదా నేను రాస్తున్నది! నువ్వు జాగ్రత్తగా లెటర్‌ని సుందరికి అందజెయ్యి చాలు"

“ఏదోకటి ఏడు! కానీ నీ లెటర్ సుందరికి ఇవ్వడం వల్ల HR వాళ్ళు నాకు టెర్మినేషన్ లెటర్ చేతికివ్వకుండా చూడు చాలు! అసలే ఆ HR లేడీస్ అందరూ ఫెమినిస్టులు!”

6

సుందరి పక్కరోజు ఆఫీసుకి వచ్చినప్పుడు కనిపించింది ఆ ఉత్తరం. తెల్లని కాగితంపై చక్కని తెలుగు అక్షరాలు...

సుందరి గారికి,

ట్రాఫిక్ రాగం హారెన్ల మోత పెడుతున్న వేళ, దుమ్మూ ధూళీ మసక మసకగా పరుచుకున్న వేళ, ఓ తప్పనిసరి ముహూర్తాన కొద్దిరోజుల క్రితం నేను హైటెక్ సిటీ బస్ స్టాపులో నిలుచున్నాను. అప్పుడే మీరు నా పక్కన నిలబడ్డారు! కానీ నేను మిమ్మల్ని చూడలేదు. అలా తొలిసారి మిమ్మల్ని చూడంది మొదలు మన కథ మొదలైంది.

తప్పే, నా తప్పే! పక్కనే వేటూరి పాటంత అందంగా మీరుంటే గమనించకుండా నేను హెడ్ ఫోన్ లో వేటూరి పాటలు వింటూ ఉండిపోవడం నా తప్పే! వేటూరి పాటల పల్లవులపై నా ఇష్టాన్ని దాచుకోకుండా, అవి ఎలాంటి పాటలని చూడకుండా పైకి హమ్ చెయ్యడం నా తప్పే! అందుకు మీరు నన్ను క్షమించాలి. మీరు బస్సెక్కుతూ నాకేసి తీక్షణంగా చూసిన చూపుల్లో నాపై కోపం కనిపించింది. కానీ అదే చూపుకి నాపై వెన్నెల వర్షం కూడా కురిసిందనీ, నా గుండె కలుక్కుమందనీ మీకు తెలుసా? అప్పటి నుంచీ "తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు, కదిలాయి మదిలోన ఎన్నెన్నో కథలు" అన్న వేటూరి పాట పల్లవి జానకి గొంతులో రిపీట్ మోడ్‌లో నాలో ప్లే అవుతూనే ఉందని మీకు తెలుసా? మిమ్మల్ని కలిసి సారీ చెప్పాలని ఎంతగా మీకై వెతికానో మీకు తెలుసా?

మీ ఆఫీసులోనే పనిచేసే మా దివాకర్ గాడి పుణ్యమా అని మీరు మళ్ళీ కనిపించారు. మీ పేరు సుందరనీ, మీరు సిరివెన్నెల అభిమాననీ వాడే చెప్పాడు. ఏ అబ్బాయీ మీ మెళ్ళో పూలమాల వెయ్యలేదనీ కూడా చెప్పాడు. మీలాంటి అందాన్ని ఎవరూ అందుకోవాలనుకోకపోవడం నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది. "అదెలా సాధ్యం" అని నా అనుమానానికి మీ సిరివెన్నెలే సమాధానం చెప్పారు తన పాటలో – "ఎందరు చూశారో కలగన్నామనుకున్నారో! అందుకనే ఏమో తను నిజం కాదనుకున్నారో" అంటూ. అవును! మీరు అందని కల అందరికీ. నాకు మాత్రం అందే నిజం అవుతారేమోనని చిన్న ఆశ!

వీడెవడు, నా గురించి ఏమీ తెలియకుండా, నా ఇష్టం తెలుసుకోకుండా, సరాసరి ప్రపోజ్ చేసేస్తున్నాడు? ఈడియట్! అమ్మాయిల్లో కేవలం అందాన్నే చూసే సెక్సిస్ట్! అని కోప్పడకండి ప్లీజ్! "విధాత తలపున" అనే ఒక్క పాట విని సిరివెన్నెల తలపునీ, ఆయన ఘనతనీ ఎలా చెప్పెయ్యొచ్చో, ఒక్క చూపులో మీ వ్యక్తిత్వం మొత్తం నాకు అర్థమైపోయింది. మీరు సిరివెన్నెల అభిమానని తెలియగానే మరింత రుజువైపోయింది. సిరివెన్నెల ఆడ అభిమానుల కంటే మంచి అమ్మాయిలు ఉంటారా చెప్పండి? పైగా నాకెక్కువ టైం లేదు. మా అమ్మ నేను త్వరగా తెలుగు మాట్రిమోనీ అమ్మాయిల్లో ఎవరో ఒకరిని ఓకే చెయ్యకపోతే మా దూరపు చుట్టాలమ్మాయిని కట్టబెట్టేస్తానని బెదిరిస్తోంది! అందుకే ఈ తొందర! అర్థం చేసుకుంటారని ఆశిస్తాను.

మనం మళ్లీ ఒకసారి కలిసి మాట్లాడుకుంటే బావుంటుంది కదూ? ఈ రోజు సాయంత్రం ఆరింటికి అదే బస్ స్టాపులో మీ కోసం ఎదురు చూస్తూ ఉంటాను! వస్తారు కదూ?

వేయి కన్నులతో వేచి చూస్తున్నా, తెరచాటు దాటి చేరదా నీ స్నేహం?

సీతారాం

లెటర్ చదివిన సుందరి సీతారాంని తిట్టుకుని “చస్తే వెళ్ళను!” అనుకుంది. తన సిరివెన్నెల వీక్నెస్ ని పట్టుకుని ట్రాప్ చేసేద్దామనే! అంత ఈజీనా అమ్మాయిలంటే?

కానీ రోజంతా సీతారాం ఆలోచనలు ఆమెను చుట్టముడుతూనే ఉన్నాయి! ఏదో ఉందా అబ్బాయిలో! ఏ మాత్రం తెలియని అబ్బాయిపై కొంచెం ఇష్టం లాంటిది కలగడం ఆమెను ఆశ్చర్యపరిచింది. "పోనీ సరదాగా వెళ్తే? వెళ్తే లవ్ చేసెయ్యాలి, పెళ్ళి చేసేసుకోవాలి అని లేదుగా! జస్ట్ కలవడమేగా!" అనుకుంది ఒకసారి. మళ్లీ "నో నో అస్సలు వెళ్ళకూడదు" అనుకుంది. సాయంత్రం ఐదయ్యినప్పుడు టైం చూడనట్టు నటించింది. ఐదున్నరకి – "వెళ్ళాలి. వెళ్లి వెధవని దుమ్ము దులపాలి!" అన్న ఆలోచన వచ్చింది. "యెస్! అందుకే, జస్ట్ అందుకే! ఇంకే కారణం లేదు" అని పదే పదే సర్దిచెప్పుకుంటూ వెళ్లింది చివరికి!

పాపం సుందరికి తెలీదు. ఈ ప్రేమ కూడా సిరివెన్నెల పాటలాటిదేననీ, కొంచెం కొంచెంగా మనసంతా కమ్ముకుంటుందనీ! కొంచెం కారంగా, కొంచెం గారంగా, కొంచెం కష్టంగా, కొంచెం ఇష్టంగా!

7

బస్ స్టాప్‌లో ఓ మూల బుద్ధిమంతుడిలా ఫోజ్ కొడుతూ కనిపించాడు సీతారాం సుందరికి! సుందరిని చూసి ఆనందంగా ఓ చిరునవ్వు నవ్వాడు!

"మీరొస్తారని తెలుసు!"

"అసలేంటండి? ఆ లెటర్ ఏంటి? ఈ కలవడమేంటి? ఎవరైనా బస్ స్టాపుల్లో అమ్మాయిలని కలవమంటారా?"

"అంటే, పార్కుల్లో కలవడానికి మనమేమీ ప్రేమికులం కాదు కదా!"

"యెస్! కాదు, అస్సలు కాదు. అది చెప్పడానికే వచ్చాను. మీతో కబుర్లు చెప్పడానికి కాదు"

"ఏంటండీ! నా తప్పుకు సారీ చెప్పాను కదా! ఇంకా అంత కోపమా! పోనీ మీ కాళ్ళ పైన పడమంటారా చెప్పండి"

"ఒకె! మీ సారీ ఆక్సెప్ట్ చేస్తున్నా! అయితే మీరు మరీ అమాయకుల్లా నటించి, సిరివెన్నెల పేరు చెప్పి నన్ను ఫ్లాట్ చెయ్యాలని చూడకండి. ఇంక నన్ను కాంటాక్ట్ చెయ్యకండి ఎప్పుడూ!"

"అంతే అంటారా?"

"అంతే!"

"చూడండి. మీకు ఇష్టమైన సీతారామ శాస్త్రి నా పేరులో ఉన్నారు, నాకు ఇష్టమైన సుందరామ్మూర్తి మీ పేరులో ఉన్నారు. అంటే మనకి ఏదో ముడి ఉన్నటేగా! చూశారా ఆ దేవుడి మహత్యం!

"మహత్యం లేదు గిహత్యం లేదు. అది కథ రాసినవాడి పైత్యం!"

"ఏదో ఒకటి. కానీ మీరే నాకు అగత్యం, మీరు తప్ప నాకు లేదు గత్యంతరం"

"పాతకాలం సినిమా హీరోల డైలాగులు కొడుతూ టూ మచ్ ఏక్ట్ చేస్తున్నారు!"

"లేదండి! నాకు అమ్మాయిలతో ఎలా మాట్లాడాలో అస్సలు తెలీదు, మీరు నమ్మాలి!"

"ఆహాహా! ఇదో కొత్త ట్రిక్కా!"

"లేదండి! అన్ని ట్రిక్కులే తెలిసుంటే.... ఈపాటికి మిమ్మల్ని బుట్టలో పడేసే వాడిని కదా!"

కొంచెం నెమ్మదిగా, నాటకీయంగా ఈ డైలాగ్ కొట్టి ఎందుకైనా మంచిదని ఓ చిరునవ్వు నవ్వాడు సీతారాం. సుందరి చురచురా చూసింది.

"అయినా మీతో నాకేంటండీ! నేను వెళ్తున్నా! బస్ కోసం వైట్ చేస్తున్నా అంతే! గుడ్ బై!" అంది!

"సరే! నేనూ బస్ కోసమే వైట్ చేస్తున్నాను లెండి! బై!"

సీతారాం హెడ్ ఫోన్స్ తీసి పెట్టుకుంటూ, సుందరి కేసి తిరిగి చూశాడు ఆఖరుసారి. సుందరి మూతి ముడిచి తల పక్కకి తిప్పుకుంది!

“తనకి అతనిపై నిజంగా కోపం ఉందా లేక కోపాన్ని నటిస్తోందా? అతనితో ఇంకా పోట్లాడాలని ఎందుకు అనిపిస్తోంది? ఈ పోట్లాటలో ఒక రకమైన సాన్నిహిత్యం ఉండడమేమిటి? ఏదో ముచ్చట కలుగుతోంది అతన్ని చూస్తే! ముచ్చటేనా, లేక ఇష్టం కూడానా?....”

సుందరి ఆలోచనలకి అంతరాయం కలిగిస్తూ వినిపించింది సీతారాం హమ్ చేస్తున్న పాట –

మువ్వలా నవ్వకలా ముద్ద మందారమా

ముగ్గులో దించకిలా ముగ్ధ సింగారమా....

సిరివెన్నెల పాట! కావాలనే ఈ పాట పెట్టుకుని హమ్ చేస్తున్నాడు! కానీ సుందరి తల తిప్పలేదు! ఇంతలో బస్ రానే వచ్చింది. సీతారామ్ కేసి అస్సలు చూడకుండా బస్ ఎక్కుతోంది..

నేలకే నాట్యం నేర్పావే నయగారమా!

గాలికే సంకెళ్ళేశావే....!

అతను ఇంకా పాడుతున్నాడా? పాడినా అంత ట్రాఫిక్ లోనూ తనకి వినిపిస్తోందా ఈ పాట? లేక తన ఊహా? ఓ సారి వెనక్కి తిరిగి చూసింది సుందరి. తననే చూస్తున్నాడు అభ్యర్థనగా, ముద్దొచ్చేలా. ఓ అందమైన చిరునవ్వు విరిసింది సుందరి పెదాలపై. ఎలా వచ్చిందది తనకే తెలియకుండా, తనని అడక్కుండా! సిగ్గుతో తల తిప్పేసుకుంది. సీతారామ్ కి తెలిసిపోయింది, ఇక ఆమె మనసుని తన వైపుకి తిప్పేసుకున్నానని. "యూరేకా!" అంటూ “నవ్వింది మల్లెచెండు” పాటలో చిరంజీవిలా అరుపు అరిచి, ఓ గెంతు గెంతాడు!

8

శోభనం గది అందంగా అలంకరించి ఉంది! గదిలో మంచం పైన కూర్చుని సుందరి ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్న సీతారామ్ నిరీక్షణకి తెరదించుతూ జంధ్యాల సినిమాలో వేటూరి ప్రేమగీతంలా సుందరి గదిలోకి అడుగుపెట్టింది.

“అదేంటి! పాలగ్లాసుతో వస్తావు అనుకున్నానే! ఈ మధ్య పద్ధతి గానీ మార్చారా?"

"ఆ! వచ్చి నీ కాళ్ళకి దణ్ణం కూడా పెడతానని ఎక్స్పెక్ట్ చేశావా ఏంటి?" అంది సుందరి అతని పక్కనే సర్దుకు కూర్చుంటూ...

“నేను కొంచెం ఎక్కువ ఊహించానులే!”

“ఆ! ఊహల్లో అన్నీ బానే ఉంటాయి. పెళ్లి గురించి కూడా సినిమా కవులు తెగ పొగిడేస్తే నేనూ చాలా ఊహించాను. కళ్యాణమనీ, వైభోగమనీ! చూస్తే పొగలూ, భగలూ, వ్రతాలూ, పూజలూ, గుళ్ల చుట్టూ తిరగడాలూ...అబ్బబ్బా అలిసిపోయాననుకో! కాళ్లు ఒకటే నొప్పులు! కొంచెం పట్టరాదూ! "ప్రేమాడే కృష్ణుడూ కన్నుకొట్టాల, పెళ్ళాడే కృష్ణుడూ కాళ్ళు పట్టాల" అన్నాడుగా మీ వేటూరి!

“వామ్మో! మంచి అమ్మాయిలా ఏక్ట్ చేసి, నన్ను నీ నవ్వుతో ఫ్లాట్ చేసి, ఇంత కుట్రా! దగా దగా!”

“నీకెన్నో సార్లు చెప్పాను! నేను ఆ రోజు బస్సెక్కుతూ నవ్వింది నీ మీద లవ్వు పుట్టి కాదు సిరివెన్నెల పాట సాహిత్యానికి అని! ఆ తర్వాత మూడు నెలల పాటూ నా వెంటపడి, నన్ను పెళ్ళి చేసుకో అని ప్రాధేయపడి, నానా తంటాలు పడి నన్ను ఒప్పించి, తర్వాత నువ్వే మా అమ్మానాన్నలతో మాట్లాడి, ఇదంతా నువ్వే చేసి ఇప్పుడు నన్నంటావా?”

“ఏదో సిరివెన్నెల వారి అమ్మాయివనీ, అందంగా ఉన్నావనీ మనసు పడితే నన్ను ముగ్గులోకి దించి కట్టేసుకున్నావుగా”

“అవును మరి! నువ్వు పెద్ద అమ్మాయకుడివి. ఎంగేజ్మెంట్ అయిన తర్వాత ముద్దు కోసం చిలిపిగా వేధించలేదూ?”

“ఆ! ఇచ్చినట్టు పెద్ద!”

"తీసుకోవడం ఎలాగో తెలీదని చెప్పు!"

కళ్ళతో చిలిపిగా చూసింది సుందరి! ఇద్దరూ అందంగా నవ్వుకున్నారు. సుందరి సీతారామ్ ఒళ్ళోకి తలవాల్చి ఒదిగిపోయి, గారంగా –

"నా ప్రియమైన శ్రీవారూ! మనం ఎప్పుడూ ఇలాగే సరదాగా ఆనందంగా ఉందామా? "నాలోనే నువ్వు, నాతోనే నువ్వు, నా చుట్టూ నువ్వు, నేనంతా నువ్వు", అవుతావా నువ్వు?"

"ఎప్పుడో అయిపోయానుగా!" అన్నాడు సీతారాం ఆమె జుట్టును నిమురుతూ!

"ఊ.."

"ఓ పాట పాడనా!"

"నువ్వు పాటలు కూడా రాస్తావా?"

"లేదు. ఊరికే ట్రై చేశాలే! ఫస్ట్ నైట్ కి ఏప్ట్ గా ఉంటుందని"

"ఆహా! నన్ను చూసి పాట పొంగింది అంటావ్ అనుకున్నానే!"

"ష్!..విను" –

"పెదవికి ముద్దిస్తే బుగ్గకి కోపం
బుగ్గకి ముద్దిస్తే పెదవికి కోపం
ఎలా తగువు తీర్చడం?
ఎలా సరసమాడడం?..."

ఇద్దరి మధ్యనా మౌనం ఓ క్షణం పాటూ. సీతారామ్ ఒడిలో ఉన్న సుందరి అతన్నే చూస్తూ చిలిపిగా నవ్వింది.

"సరసం తెలీదు అనుకున్నాను కానీ పర్వాలేదే! తర్వాత లైన్ నేను చెప్పనా?" అంది.

"చెప్పు"

"దగ్గరగా రా! చెవిలో చెప్పాలి"

"సరే!"

అప్పుడు సుందరి సీతారాం చెవిలో గుసగుసగా చెప్పిన మాట విని చీకటి సిగ్గుపడింది, జాబిలి ముసిముసిగా నవ్వుకుంది –

"మాటలతో సరిపెడితే శ్రీమతికి కోపం!!!"

అదండీ కథ! కథ కంచికి, ఈ జంట వలపు కౌగిలికి, మనం ఇంటికి!!

# నవనీతం పోడూరి వెంకటరమణ

ఏబీసీ ఇంటర్నేషనల్ లో వైస్ ప్రెసిడెంట్ 'ప్రాజెక్ట్స్' గా ఇవాళ తో నాకు అయిదు సంవత్సరాలు పూర్తి అవుతుంది. సౌత్ ఆఫ్రికా లో మా ప్రాజెక్ట్స్ అన్నీ ఇంచుమించు పూర్తి అయ్యాయి. కేప్ టౌన్ లో టేబుల్ మౌంటెన్ దగ్గరగా ఉన్న ఇరవయి నాలుగు అంతస్తుల భవనం లో ఇరవయి ఒకటవ అంతస్తులో ఉన్న నా చాంబర్స్ లోంచి సముంద్రం చాలా బాగా కనపడుతుంది. రోజూ పనిలో మునిగిపోయే ముందు ఒక పది నిమిషాలు సముద్రం కేసి చూస్తూ గడపడం నాకు అలవాటు. అందుకే నేను వచ్చిన పదిహేను నిమిషాల దాకా సెక్రటరీ 'మసేబొలా' ఏ కాల్స్ ఇవ్వదు. ఇవాళ నా మనసు ఎక్కువసేపు ప్రశాంతంగా సముద్రాన్ని ఎంజాయ్ చేయలేకపోయింది. దానికి కారణం లేకపోలేదు. జిఇ మల్టీ నేషనల్ లో చాలా పెద్ద జీతం తో వచ్చిన ఒక జాబ్ ని అంగీకరించడానికి ప్రస్తుత కంపెనీ సీఈఓ అడ్డుపడ్డాడు. దానికి కారణం ఇండియాలో ఒక ఓపెద్ద సివిల్ ప్రాజెక్ట్ టెండర్ ని ఏబీసీ గెలుచుకోవడమే. నేను వెళ్ళిపోతే ఆ ప్రాజెక్ట్ ని నిర్ణీత సమయంలో పూర్తి చేయడం కష్టమని సీఈఓ జాన్ భయం. జాన్ ని కాదని వెళ్లి పోవడం నాకూ కష్టమే. ఇద్దరం కలిసి ఏబీసీ లో చాలా సాధించాము. 'జిఇ' ఆఫర్ వదులుకుని ఈ ప్రోజెక్ట్ ని ఛాలెంజింగ్ గా తీసుకు ని చేయమని కోరాడు. జీతం నష్టం భర్తీ చేసి ప్రాఫిట్ షేరింగ్ కూడా ఆఫర్ ఇచ్చారు , ఇవన్నీ ముఖ్యం కాక పోయినా ఇండియాలో ప్రోజెక్ట్ అవడం వల్ల కాదన లేక పోయాను.

జీవితంలో వెనక్కి తిరిగి చూసుకుంటే నా ఉద్యోగ ప్రయాణం లో మలుపులు నన్ను ఇప్పటికీ చాలా ఆశ్చర్య పరుస్తాయి. 'ఎం ఏ' సోషల్ వర్క్ పూర్తి చేసిన వెంటనే ఎల్ ఎన్ టి అనుబంధ కంపెనీ లో పెర్సొనెల్ ఆఫీసర్ గా చే రాను. ప్రాజెక్ట్ మేనేజ్మెంట్ మీద కంపెనీ లో ఆఫీసర్లకి ఒక వర్క్ షాప్ నేను ఆర్గనైజ్ చేయవలసి వచ్చింది. యూనియన్ ప్రోబ్లెంస్ ఏమీ లేక పోవడంతో వర్క్ షాప్ లో ఎక్కువ భాగం ఫాలో అయినప్పుడు 'క్రిటికల్ పాత్' లాంటి కొన్ని టెక్నీక్స్ ఆకళింపు చేసుకుంటే ప్రాజెక్ట్స్ విజయవంతంగా పూర్తి చేయవచ్చు అనిపించింది. అప్పుడు నడుస్తున్న కొన్ని ప్రో జెక్ట్స్ ఎనాలిసిస్ లో నేను కూడా సరదాగా పాల్గొడం జరిగింది. వర్క్ షాప్ అయిపోయిన తరువాత ఒక రోజు ఇంజనీరింగ్ హెడ్ వేణుగోపాల్ గారు నన్ను తన చాంబర్స్ కి రమ్మన్నాడు. అవీ ఇవీ మాట్లాడిన తరువాత ఆయన ఒక సలహా ఇచ్చాడు. నన్ను వెంటనే క్యాట్ రాసి ఐఐఎం ట్రై చేయ మన్నాడు. అంతవరకూ అటువంటి ఊహ నాకు ఎప్పుడూ రాలేదు. ఆయన ఇంకొంచం వివరించాడు. మేనేజ్మెంట్ అనేది కొంత స్వతహాగా వ్యక్తి లో ఉండే స్కిల్ అనీ అది ఉన్నవాళ్లు తగిన ఖ్వాలిఫికేషన్ ఉంటె చాలా ఎదగొచ్చని చెప్పి అటువంటిస్కిల్ నాలో పుష్కలం గా ఉందని అందు చేత ఐఐఎం లాంటి చోట నుండి క్వాలిఫై అయితే తిరుగులేని కెరీర్ ఉంటుందని చెప్పాడు. అప్పటికి ఇంకా పెళ్లి కాలేదు కాబట్టి మా అన్నయ్య తో చర్చిస్తే, తాను సపోర్ట్ చేస్తానని వెంటనే క్యాట్ రా యమని వాడు కూడా ప్రోత్సహించాడు. ఆ తరువాత అంతా కలలోలా జరిగిపోయింది. క్యాట్ లో సెలెక్ట్ అవడం, ఐఐఎం క్యాంపస్ సెలెక్షన్ లో టెల్కో లో చేరి మూడు నాలుగు పెద్ద కంపెనీలు మారి అంచెలంచెలు గా నిచ్చెన ఎక్కడం జరిగిపోయింది. మధ్యలో వేణు గోపాల్ గారి అమ్మాయితో వివాహం, ఇద్దరు పిల్లలు మొదలయినవి కుటుంబ పరంగా ఇతర పరిణామాలు..!

పదిహేను నిమిషాలు అయిపోగానే మసేబొలా ఫోన్ చేసి ఇండియా లోని కొత్త ప్రాజెక్ట్ కి ఫీల్డ్ ఇంజనీర్స్ ని షార్ట్ లిస్టింగ్ చేయడం కోసం ఇవాళ్టి మొదటి మీటింగ్ అని. గుర్తు చేసింది. ఇంకో పది నిమిషాలకి హెచ్ ఆర్ సీనియర్ మేనేజర్ తన అసిస్టెంట్ తో లిస్ట్ తీసుకుని వచ్చాడు. అతని దగ్గర లిస్ట్ తీసుకుని పేర్లు ఒక్కొక్కటే చూస్తూ వెళ్లాను. కనపడ్డ రెండు తెలుగు పేర్లలో ఒక పేరు దగ్గర పెన్ను ఆగి పోయింది. 'హలాయుధరావు'. ఆ పేరు సాధారణంగా తక్కువమందికి ఉంటుంది . ఆ పేరుతో నా జీవితంలో ముఖ్య విషయాలు కొన్ని ముడిపడి ఉన్నాయి. అతనేనా అని అనుమానం వచ్చి అతని సీవీ ఫైల్ అడిగాను. అది చూడగానే సందేహం తీరిపో యింది. అతనే. ప్రస్తుతం హైదరాబాద్ లో పని చేస్తున్నట్టున్నాడు. ఎప్పటి మాట? పాతికేళ్ళు గడిచిపోయాయి. అతని పేరు చూడ గానే మాధురి మనసు లోకి రావడం ఒక తీయని బాధతో కూడిన భావం హృ దయాన్నిస్పృశించి వెళ్లడం అప్రయత్నంగా జరిగిపోయింది.కల్నల్ గారు ఇంకా బతికి ఉన్నాడా? ఆయన గుర్తుకు రాగానే ఎప్పుడో మరుగున పడిన గాయం మళ్ళీ రేగిన భావం కలిగింది . ఆయన బతికి ఉంటె, కాలిన పుండుకు నవనీతం రాయవచ్చేమో అన్న ఆలోచన మనసులో మెదిలింది. వెంటనే అలా ఆలోచించడం తప్పు, అది నా తత్వానికి విరుద్ధమని కూడా అనిపించింది

మిగతా లిస్ట్ లోంచి ఒక ఆరు  పేర్లతో పాటు హలాయుధరావు ని కూడా సెలెక్ట్ చేసి, డేట్ ఫిక్స్ చేసి ఆరుగురినీ ప్రిలిమినరీ ఇంటర్వ్యూ కి కలకత్తా కి రమ్మని మెయిల్స్ పెట్టమన్నాను.

వాళ్ళు వెళ్ళగానే 'మెసబోలా' కి రింగ్ చేసి, నా స్పెషల్ కాఫీ ఒకటి పంపమని, ఓ అరగంట  సేపు కాల్స్ ఏవీ ఇవ్వద్దని చెప్పి ఫోన్ పెట్టగానే, మనసు మాధురి మీదకి పోయింది.

అన్ని ప్రేమలూ పెళ్ళిళ్ళకి దారి తీయక పోయినా చదువుకునే రోజులలో చాలా మంది మగవాళ్ళు ఎవరో ఒక అమ్మాయి వైపు ఆకర్షించబడడం సహజమేమో. అది ఎందుకు ఎలా జరుగుతుందో ఒక పధ్ధతి, కారణాలూ  అంటూ ఉండవే మో. అటువంటి ఆకర్షణలకి లోనవడం, తరువాత జీవితంలో జరిగిన మార్పులతో అవి జ్ఞాపకాల మరుగున పడిపోవడం సహజమే. చదువుకునే రోజులలో అటువంటి ఆకర్షణ కి నేనూ లోనయ్యాను.

నరసాపురంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఎంఏ చేయడానికి వాల్తేరు చేరాను. హాస్టల్ రూమ్ అదీ అలాట్ చేసేదాకా మా ఊరినుంచే వెళ్లి అక్కడ ఇంజనీరింగ్ చేస్తున్న రాజారావు రూమ్ లో దిగాను. అడ్మిషన్ పూర్తి అయినా తరువాత హాస్టల్ రూమ్ కి అప్లికేషన్ ఇచ్చి రాజారావు తో యూనివర్సిటీ కాంటీన్ లో కాఫీ తాగుతుంటే అక్కడకి అతని క్లాస్ మేట్స్ కూడా వస్తే పరిచయం చేశాడు. వాళ్ళల్లో ఒకతను పేరు హలాయుధరావు. పేరు చెప్పగానే నేను కొంచెం ఆశ్చర్యం కనపరిస్తే అతనే అన్నాడు. 'మా నాన్నగారు విష్ణు భక్తుడు లెండి ' అన్నాడు నవ్వుతూ. మాటల సందర్భంలో హాస్టల్ రూంకి అప్లికేషన్ ఇచ్చానని చెప్పాను.

హలాయుధరావు వెంటనే "మీకు ఇప్పుడు షెడ్స్ లో ఫోర్ సీటర్ కానీ ఇవ్వరు. నేను ఇంకో ఇద్దరం కలిసి అప్ ల్యాండ్స్ లో మూడుగదుల ఇల్లు తీసుకుని ఉంటున్నాము. మాలో ఒకడు వేరే రూమ్ కి ళ్ళిపోయాడు. మీరు కావలిస్తే వెంటనే చెప్పండి" అన్నాడు.

రాజారావు కూడా అదే బాగుందని చెప్పడంతో ఆ సాయంత్రమే చేరతానని చెప్పాను.

చిన వాల్తేర్ లో లైట్ హౌస్ కి దగ్గరగా ఒక రిటైర్డ్ కల్నల్ గారి ఇంట్లో అవుట్ హౌస్ లో మేడ మీద హలాయుధరావు వాళ్ళూ ఉంటున్న ఇంట్లో ఆ సాయంత్రమే చేరాను.

మొత్తం నాలుగు రూములలో ఒకటి నాకు ఇచ్చారు. ఒక రూమ్ కిచెన్ గా వాడుతున్నారు. మిగతా రెండు రూముల్లో ఒకదాంట్లో హా.రావు ఇంకోదాంట్లో అతని మిత్రుడు మురారి ఉంటున్నారు. అవుట్ హౌస్ లో కింద భాగం ఇంటివాళ్లు స్టోర్ గా వాడుతున్నారని తెలిసింది

యూనివర్సిటీ అవుట్ గేట్ కి దగ్గరగా ఉన్న విద్యారామ్ అనే హోటల్ నుంచి క్యారియర్ తెప్పించుకునేఏర్పాటు వాళ్లకి ఉంది. నేను కూడా అందులో చేరాను.

నాకు ఇచ్చిన రూమ్ లోంచి కల్నల్ గారి  బ్యాక్ యార్డ్ బాగా కనపడుతుంది. నేను చేరిన మరునాడు ప్రొద్దున్నే స్నానం చేసి కిటికీ లోంచి సముద్రం కేసి చూస్తూ నుంచున్నాను. సూర్యోదయం, సముద్రం మీదుగా అద్భుతంగా ఉంటె అలాగే చూస్తూ నుంచున్నాను. అనుకోకుండా దృష్టి మరల్చి కల్నల్ గారి బాక్ యార్డ్ లోకి చూశాను.  బాక్ యార్డ్ లో ఒక వయపు గోడ వారగా కొన్ని గులాబీ మొక్కలు, వాటి పక్కన కొంచెం పెద్దవిగా ముద్ద మందారం మొక్కలూ పూలతో నిండి ఉన్నాయి. ఎక్కడినుంచో ఒక్క మాటుగా సన్నజాజి పూల వాసన గుప్పున కొట్టడం, వాళ్ళ ఇంటి వసారా తలుపు తెరుచుకుని ఒక అమ్మాయి బయటికి రావడం ఒకే మాటు జరిగింది. పద్దెనిమిది సంవత్సరాలు ఉండవచ్చు. ఎర్రటి పరికిణీ మీద చిలక ఆకుపచ్చ వోణీ వేసుకుంది. బయటికి వచ్చిన వెంటనే మందారం మొక్క దగ్గరికి వెళ్లి, ఓచిన్న ముద్ద మందారాన్ని తుంచి తలలో తురుముకుంది. చెట్టువైపు తిరిగినపుడు అప్పుడే స్నానం చేసినట్టు తెలుస్తున్న పొడవ పాటి జడ వయ్యారంగా కదిలింది. అన్నీ కలిపి బాపూ గారు తన బొమ్మకి ప్రాణం పోసి వదిలారనిపించింది. మళ్ళీ ఇంట్లోకి వెళ్ళడానికి వెనక్కితిరిగినప్పుడు ముఖం వివరంగా చూడడం జరిగింది. చక్కటి కను ముక్కు తీరు తో పెద్ద పెద్ద కాటుక కళ్ళతో, నుదిటి మీద ఉన్న కుంకం కొంచెం నాసిక మీద పడి చాలా అందంగా కనిపించింది. మా నరసాపురం లో కొందరు అందమయిన అమ్మాయిలిని చూసినా ఇంత అందమయిన అమ్మాయిని చూడడం అదే మొదటి సారి. ఆమె వెంటనే లోపలి వెళ్ళిపోయినా ఆమె రూపం నాలో చెరగని ముద్ర వేసింది. ఆమె గురించి నాకేమీ అప్పటికి తేలియదు కాబట్టి అప్పటి నా వయసులో ఉన్న ప్రతి యువకుడికీ కలిగే ఆకర్షణ లాంటిదే నాకూ కలిగిందేమో. కానీ అదివరకు ఎప్పుడూ

లేని విశేషమేమిటంటే, ఆ తరువాత రోజంతా ఆమె ఎప్పుడు గుర్తుకు వచ్చినా గుండెలు దడ దడా కొట్టుకోవడం నాకే ఆశ్చర్య మేసింది. అది ఒక చెప్పలేని భావన. అంద మయిన అమ్మాయిల్ని చూసినప్పుడు ప్రతి యువకుడికి అల్లాంటి భావనే కలుగుతుందా అన్నది నాకు అప్పుడు తెలియని విషయం.

మురారి ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. హా.రావు ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ముగ్గురి లోకీ చిన్నవాడిని నేనే. ఇద్దరికీ వాళ్ళ కాలేజీల ద్వారా మంచి హాస్టల్స్ ఉంటె ఇక్కడ ఎందుకు ఉంటున్నారో ఆవేళ తెలియలేదు కానీ కొద్దీ రోజు ల లోనే తెలిసింది.

ఒక వారం రోజులలో నాకు తెలిసిన మిగతా వివరాలు ఏమిటంటే కల్నల్ గారు స్వచ్ఛంద విరమణ తీసుకుని విజయ నగరం వద్ద తాతలనాటి కొద్దిపాటి భూమిని సాగు చేసుకుంటున్నారు. ఆయన ఎక్కువ కాలం అక్కడే ఉంటాడు. పిల్లల చదువుకోసం వాల్తేరు లోనే ఉన్న స్వంత ఇంట్లో ఏర్పరచిన మకాంలో భార్య, పిల్లలు, ఆయన చెల్లెలు ఉంటారు. ఆయనకి నలుగురు ఆడపిల్లలు. కొడుకులు లేరు. పెద్దపిల్లకి ఒక మిలిటరీ ఇంజనీర్ తో పెళ్లి అయింది. వాళ్ళు పూనా లో ఉంటారు. రెండవ అమ్మాయి వనజ మెడిసిన్ మూడో సంవత్సరం మూడో అమ్మాయి నీరజ ఎమ్మెస్సీ ఫైనల్ చేస్తున్నారు. నాలోగో అమ్మాయి మాధురి యూనివర్సిటీ లో స్పెషల్ బిఎ చేస్తోంది. ఆ వారం లో నాకు తెలిసింది వాళ్ళు చాలా సోషల్ గా ఉంటారు.

నేను వచ్చిన మూడో రోజే కిచెన్ లో క్యారియర్ భో జనానికి మేము ముగ్గురం కూర్చో బోతుంటే, మురారి " నారాయణ గారూ , కల్నల్ గారి భార్య నిర్మలమ్మ గారు ఏవో కూరలు ఇస్తానంది. కొంచెం వెళ్లి తెస్తారా?" అన్నాడు. అలాగే అని నేను కల్నల్ గారి ఇంట్లోకి వెళ్లాను. అదే మొదటి సారి వాళ్లింటికి వెళ్లడం. సిటవుట్ దాటి లోపలి హాలు లోకి వెళ్లాను.

పెద్ద హాలులో ముందు సోఫాలూ , కుర్చీలూ దూరంగా డైనింగ్ టేబుల్ ఉన్నాయి.

ఎవరూ అక్కడ లేకపోవడంతో నేను అక్కడే నుంచుని కొంచెం దగ్గాను.

వనజ కాబోలు బయటికి వచ్చి "ఓహో నారాయణ గారా కొత్తగా వచ్చారు కదా?" అని మళ్ళీ లోపలి వెళ్ళింది. నా రూమ్ మేట్స్ నా పేరూ అదీ చెప్పినట్టున్నారు అనుకున్నాను

వనజ మాటలు విని లోపలినుంచి ఒక పెద్దావిడ, మాధురి బయటికి వచ్చి ఓ పక్కగా నుంచున్నారు. మాధురిని దగ్గరగా చూడడం అదే మొదటి సారి. మొదటి రోజు పూల మొక్క దగ్గరా, ఆ తరువాత ఒక మాటు ఇంటిముందు కొంచెం దూరం నుంచీ చూడడం జరిగింది. ఎప్పట్లాగే చూడగానే గుండె దడ

ఒక మాటు నాకేసి చూసి ఏమీ మాట్లాడకుండా పలకరింపుగా నవ్వింది. నరసా పురం అనుభవాలతో పోల్చుకుంటే పరిచయం లేక పోయినా ఆమె అలా పలకరింపుగా నవ్వడం కొంచెం ఆశ్చర్య పరచినా చాలా సహజం గా అనిపించింది.

" నువ్వు ఏ సంవత్సరం లో పుట్టావు బాబూ?" అంది సడన్ గా మాధురితో బయటికి వచ్చిన పెద్దావిడ.

నేను ఆ ప్రశ్నకి కొంచెం తడబడే గానీ " మా అత్తయ్య శారదాంబ" అంది పరిచయం చేస్తూ మాధురి.

నేను పుట్టిన సంవత్సరం చెప్పాను.

ఆ విడ ముఖంలో ఒక్క మాటు ఒక విషాద ఛాయ చూసి కొంచెం ఆశ్చర్య పోయాను.

ఈ లోపులో వనజ ఓ బాక్స్ లో పెట్టి కూరలు తెచ్చి ఇవ్వడం తో అందరికీ ఒకే మాటు " వస్తానండి" అని చెప్పి వచ్చేశాను.

జరిగింది చెప్పినప్పుడు మురారి చెప్పాడు. శారదాంబ గారికి ఒకే ఒక్క సంతానం రెండేళ్ల వయసు వాడు పద్దెనిమిదేళ్ల క్రితం చనిపోవడం తో, నా లాంటి వాళ్ళు కనపడితే పుట్టి న సంవత్సరం అడిగి అది వాళ్ళబ్బాయి పుట్టిన సంవత్సర మయితే, వాడు బతికుంటే ఇంత వాడు అయ్యేవాడు కదా అని అనుకుని బాధ పడడం వీళ్ళు చాలా మాట్లు చూశారట. అది విన్న తరువాత నాకెందుకో ఆవిడని తలుచు కుంటే చాలా బాధేసింది.

సెలవు రోజులలో మురారి, హా. రావు ఇద్దరూ ఎక్కువ కాలం కల్నల్ ఇంట్లోనే గడిపే వారు. నన్ను కూడా తీసుకు వెళ్లేవారు. నేను వాళ్లతో రూం లో చేరే సమయానికి కల్నల్ గారు పెద్ద కూతురు దగ్గరికి పూనా వెళ్ళడంతో మూడు వారాలు ఆయన్ని చూడడం పడలేదు.

మురారి పెద్దమ్మాయి వనజతో చెస్ ఆడడం లేదా ఇద్దరూ చదువు విషయాలతోనో గడిపే వారు. హా. రావు, నిర్మలమ్మ గారూ, నీరజా ఒక చోట చేరి సినిమాల చూడడమో, వాటి గురించి చర్చ లో జరుపుతూ ఉండేవారు. మాధురి మటుకు ఇంటి పనులు అన్నీ చూసుకుంటూ ఓ పక్కాగా కూర్చుని ఎప్పుడూ ఎదో చదువుకుంటూ ఇందేది. అందరికీ కాఫీ ఫలహారాలు ఆమే పర్యవేక్షించేది. వాళ్ళ ఇంట్లో ఓ సోషల్ క్లబ్బులా వారాంతాలు బాగా గడిచేవి.

నాకు తెలియకుండానే నేను శారదాంబ గారికి దగ్గర అయ్యాను. మొదటి సారి కూరలకి వెళ్లి నప్పుడు కాకుండా రెండో మాటు వెళ్ళినప్పుడు ఆవిడ నన్ను పిలిచి దగ్గర కూర్చో పెట్టుకుంది. నా కుటుంబ విషయాలు ఆవిడ వివరాలు అడుగు తున్నప్పుడు మా నాన్నగారు తరుచు రమణాశ్రమం వెడుతూ ఉంటారని చెప్పడంతో ఆవిడ ఆధ్యాత్మిక విషయాలు నాతొ ఎక్కువ మాట్లాడేది. మా నాన్నగారి ప్రభావం వల్ల నాకు కొన్ని విషయాల మీద ఏర్పడిన అభి ప్రాయాలు ఆమె తో సంభాషణలు చేసినప్పుడు దొర్లేవి.

మొదటి రెండు వారాలూ గడిచేటప్పటికి నాకు అర్ధమయిందేమిటంటే, మురారీ, వనజ మధ్య, నీరజ, హా.రావు ల మధ్య మామూలు స్నేహం కంటే ఒంచెం ఎక్కువ అనుబంధం ఉన్నట్టే ఉంది. అది ఇంట్లో అందరికీ కూడా తెలిసినట్టే అనిపించింది. చదువులు పూర్తవ గానే వాళ్ళ పెళ్లిళ్ల జరుగుతాయని తరవాత తెలిసింది.

నేను అక్కడ చేరిన మూడో వారం ఎప్పటిలాగే వాళింట్లో చేరాము. మామూలు గానే శారదాంబ గారు ఏవో ఆధ్యాత్మిక విషయాలు మాట్లాడుతూ " అన్నీ భగవంతుడు నిర్ణయిస్తాడా లేక మన చేతుల్లో ఏమన్నా ఉందా ?అని అడిగారు నన్ను.

నేను ఎదో కొంత వివరణ ఇచ్చి "ఉచ్వాస నిశ్వాసాలు మనం నిర్ణయించి చేస్తున్నామా? లేదా అవి వాటంతట అవే జరుగుతున్నాయా?" అని అడిగాను.

నేను ఆ మాటలు అనగానే మాధురి సడన్ గా వచ్చి మా వద్ద కూర్చుంది. మా మధ్య సంభాషణలు ఓ చెవి వేసి ఆమె కూడా వింటోన్నదన్న విషయం అంతవరకూ నేను గమనించలేదు. గుండె దడ తో బాటు ఏదో ఉత్సాహం వచ్చింది నాకు.

" మనం ఏ పని చేసినా దానికి ఆధారం మన ఆలోచనే కదా ? "ఆలోచనలు మనకి వస్తాయా? లేక మనం వాటిని తెచ్చుకుంటామా?" అన్నాను మాధురి కేసి తిరిగి

" మనకి వస్తాయి" అంది ఆమె

" ఆలోచనలకి, మన ఉచ్వాస నిశ్వాసాలకి మూలం ఒకటే" అందు చేత మన పాత్ర ఏమీ లేదు అన్నాను.

"ఒప్పుకోవడం కష్టమే" అంది మాధురి.

" కానీ అదే నిజం కొంచెం ఆలోచించండి మీకే తెలుస్తుంది" అన్నాను నవ్వుతూ.

నేను శారదాంబ గారితో మాట్లాడుతూన్నప్పుడల్లా మాధురి కూడా వచ్చి చేరి మాటలు కలిపేది.

ఓ రోజు అలా మాట్లాడుతుండగానే కల్నల్ గారు ఊరినుంచి వచ్చి హాలులోకి వచ్చారు.

అందరూ ఆయన చుట్టూ చేరారు. మురారి నన్ను పరిచయం చేశాడు. ఆయన నన్ను ఒక మాటు పరిశీలనగా చూసి " ఓహో" అని " "మళ్ళీ కలుద్దాం" అని లోపలికి వెళ్లిపోయారు. మేము కూడా వచ్చేశాము. ఆ మర్నాడే కల్నల్ గారు విజయనగరం వెళ్లిపోయారు.

ఆ తరువాత మా ధురి అనుకోకుండా యూనివర్సిటీ లైబ్రరీ దగ్గర కలిసింది. ఆమె ఫిలాసఫీ స్పెషల్ బిఏ చేస్తోంది.

శారదాంబగారితో మాట్లాడిన విషయం లో ఆమె ఎందుకు ఆసక్తి చోపిందో అప్పుడు అర్ధ మయ్యింది.

ఆమె రోజూ మధ్యాహ్నం కాలేజీ అయినతరువాత లైబ్రరీ కి వస్తోందని తెలిసి నేను కూడా అక్కడికి వెళ్లడం ఆమెతో మాట్లాడడం జరిగేది. పరిచయం పెరిగిన కొద్దీ ఆమె మీద నాకు సదభిప్రాయం పెరుగుతూ వచ్చింది.

ఇంటి దగ్గర వాళ్ళ అక్కల ముందు నాతొ ఎక్కువగా మాట్లాడడానికి ఆమె ఇష్ట పడటం లేదని గ్రహించాను. అందుకే రోజూ లైబ్రరీ లో కలిసే వాణ్ని.

ఆమె కి నామీద ఎటువంటి అభిప్రాయం ఉందొ నేను గ్రహించడానికి ఆమె అవకాశం ఇవ్వలేదు.

నాన్నగారికి వంట్లో బాగోలేదని తెలిసి నరసాపురం రెండు రోజులు వెళ్ళవలసి వచ్చింది. వచ్చిన రోజునే లైబ్రరీ లో ఆమెని కలిసినప్పుడు ఆమె చూపిన ఆనందం నాకు మంచి ధైర్యం ఇచ్చింది. అప్పుడు పెళ్లిగురించి ఆలోచించే ఆర్ధిక స్వాతంత్ర్యం నాకు లేక పోయినా, మధురికీ వాళ్ళ వాళ్ళకీ అభ్యంతరం లేకపోతే మావాళ్లతో దెబ్బలాడయినా ముందుకు వెళ్ళడానికి మనసులో నిశ్చయం ఏర్పడింది. ఆవేళ మాటల సందర్భంలో అనుకోకుండా మాధురితో అన్నాను ప్రేమ వివాహాల గురించి అభిప్రాయం ఏమిటని ?.

నా ప్రశ్న విని కొంచెం ఆశ్చర్య పోయింది. " సినిమాల ప్రభావం బాగా ఉన్నట్టుందే మీ మీద " అంది నవ్వుతూ.

" సినిమాల ప్రభావం కాదు. కొందరిని మనకి తెలియకుండానే, ఇదీ అని కారణం లేకుండానే ఇష్ట పడడం నిజ జీవితం లో కూడా జరగవచ్చు కదా? "

" ఒక వేళ అలాటి ఇష్టాలు ఏర్పడినా కొన్ని అనుకూల విషయాల ప్రభావం ఉండకుండా ప్రేమలు ముందుకు వెళ్ళ వేమో!"

" ఉదాహరణకి ? " అడిగాను నేను ఆమె మాటల భావం పూర్తిగా అర్ధం కాక .

"సినిమా తారల పెళ్లిళ్లు చూడ లేదా మీరు? తారలు స్టూడియో ఓనర్ల కుర్రాళ్ళని కానీ, డబ్బు, ఆస్తులూ ఉన్న డైరెక్టర్లనే ప్రేమించి పెళ్లి చేసుకోవడం."

"అవును నిజమే. కానీ అన్ని సందర్భాల్లోనూ అలాగే జరగాలని లేదు కదా?" ఏమనాలో తెలియక.

" మిగతా విషయాల ప్రభావం కంటే, తల్లి తండ్రుల ఆశీర్వాదం లేకుండా నిజ జీవితంలో ప్రేమలు ఫలించడం కష్టమేమో " అంది వెళ్ళడానికి లేస్తూ .

★★ ★★★

కానీ ఆ తర్వాత జరిగిన సంఘటనలు సీన్ పూర్తిగా మార్చేసి నాకు చాలా కాలం మారని గాయాన్ని మనసులో ఏర్పరిచాయి.

వాటికి మొదటి సూచన ఓ రోజు రాత్రి భోజనాల సమయం లో మా కిచన్ లో అందింది. రోజూ లాగే ఆవేళ భోజనాలు చేస్తుండగా మురారి, హే.రావు తో "మన నారాయణ మాధురి మీద కొంచెం ఆసక్తి చూ పుతున్నట్టుదే!" అన్నాడు నాకేసి రావు కేసి మార్చి మార్చి చూస్తూ.

"బాగానే ఉంది కానీ మనవాడు ఇంజనీర్ కానీ, డాక్టర్ కానీ కాదె !" అన్నాడు నవ్వుతూ. అలా ఎందుకన్నాడో నాకు అప్పుడు అర్ధం లాలేదు.

మరో రెండురోజులకి కల్నల్ గారు విజయనగరం నుంచి పనులు ముగించుకుని వచ్చారు. ఆ తరువాత ఆదివారం ఎప్పటి లాగే మురారి, రావు లతో వాళ్ళ ఇంటికి వెళ్లాను. శారదాంబ గారు, మాధురి ఎందుకో బయటికి రాలేదు. మిగతా వాళ్ళం కల్నల్ గారి చుట్టూ చేరాము.

కొంత సేపు కల్నల్ గారు పూనా విశేషాలు, విజయనగరం విశేషాలు చెప్పారు. ఇంతలో మాధురి అందరికీ టీ తీసుకు వచ్చింది.

ఆమె రాగానే కల్నల్ గారు నన్ను చూసి "మీరు ఎన్నో సంవత్సరం? ఇంజినీరింగా, మెడిసినా ?" అన్నారు. వాళ్ళిద్దరికీ రూమ్ మెట్ ని కాబట్టి వాళ్ళు చదువుతున్న కోర్సే చదువుతున్నానని అనుకోవడం సహజమే.

లేదండి "ఎం ఏ సోషల్ వర్క్ చేస్తున్నానండి అన్నాను" జవాబుగా.

అది వినగానే ఆయన  ముఖంలో  కొంచెం నిరుత్సాహం లాంటి విస్మయం చూశాను.

“ఎం ఏ సోషల్ వర్క్ లోనా ? ఆ డిగ్రీ తో కెరీర్ ఏమి ఉంటుంది?”

ఆయన అడిగిన  పద్దతి చూసి నేను ఇంక ఏమీ వివరించడానికి ప్రయత్నించలేదు. ఆ తరువాత ఆయన ప్రవర్తనలో చెప్పుకోదగ్గ మార్పు వచ్చింది.

మరి కొన్నిమాట్లు మురారి తోటీ, రావు తోటీ వాళ్లింటికి వెడితే నన్ను పూర్తిగా విస్మరించడం, మాధురి  తో నేను మాట్లాడడం అదీ ఆయనకి అంత  ఇష్టం లేదనిపించి నేను వెళ్లడం బాగా తగ్గించి, ఆతరువాత పూర్తిగా మానేశా.

ఆయన ఊరు వెళ్ళినప్పుడు మాత్రం అప్పుడప్పుడు శారదాంబ గారి తో మాట్లాడి వచ్చేశాను.

గతం లో కిచన్ లో మురారి, రావు చేసిన కామెంట్ల అర్థం నాకు అప్పుడు బాగా అర్థమయ్యింది. నేను ఇంజనీరింగ్ కానీ, మెడిసిన్ కానీ చదువుతూ ఉండి ఉంటె ఆయన మురారీ, రావు ల కిచ్చే గౌరవమే నాకూ ఇచ్చేవారేమో.

మొదటి సంవత్సరం సెలవులు ఇవ్వగానే, నేను నరసాపురం వెళ్ళిపోయి, కాలేజీలు తెరిచిన తరువాత హాస్టల్ లో చేరిపోయాను. నేను ఫైనల్ ఇయర్ లో ఉన్నపుడు మాధురి ఎంఏ ఫిలాసఫీ ప్రీవియస్ చేసేది. ఒకటి రెండు మాటలు ఎదుట పడినా ఎక్కువ మాటలు జరిగేవి కావు. నేను శారదాంబ గారి క్షేమం అడిగి ముగించేవాడిని.

ఆఖరి సారిగా ఫైనల్  పరీక్షలు అయిపోయింతరువాత లైబ్రరీ పుస్తకాలు తిరిగి ఇస్తోంటే కలిసింది. మరునాడే వెళ్ళిపోతున్నాని చెప్పాను. రండి, వెళు దురుగాని అని ఆమె  లైబ్రరీ కి ఆర్ట్సు కాలేజీ కీ మధ్య ఉన్న పార్క్ లోకి నడిస్తే నాకు వెళ్ళక తప్పలేదు. మిగతా విషయాలు మాట్లాడుతూ, మురారి తోటీ, రావు తోటీ వనజ, నీరజల ప్రధానాలు

జరుగుతాయని చెప్పింది. మనస్ఫూర్తిగా ఆల్ ది బెస్ట్ చెప్పి, మాట వరసకి పెళ్ళిళ్ళకి వస్తానని చెప్పాను. నేను హర్ట్ అయ్యానని ఆమెకితె లుసునని ,  ఆమె అందుకు బాధపడుతున్నదన్న విషయం మాటలలో చెప్పలేదు కానీ కళ్ళతోటే చెప్పింది.

ఆ తరువాత నేను పెర్సొనెల్ ఆఫీసర్ గా కెరీర్ ప్రారంభించి చాలా బిజీ అయి పోవడం తో కల్నల్ గారి ఫామిలీ వాళ్లని  ని కానీ మురారీ, రావు లని కానీ కలవడం జరగ లేదు. ఇరవయి ఐదేళ్లు కాల గర్భం లో కలిసిపోయిన తరువాత, రావు అప్లికేషన్ చూడడంతో అన్నీ  గుర్తుకు వచ్చాయి. ఇప్పుడు నన్ను చూస్తే రావు గుర్తు పడతాడాని నమ్మకం లేదు. నన్ను చూసి ఎలా రియాక్ట్ అవుతాడో అనిపించింది. చూద్దాం అనుకుంటూ 'మొసంబోలా' కి రింగ్ ఇచ్చాను, నెక్స్ట్ మీటింగ్ బ్రీఫ్ కి రమ్మని.

★★★★★★★★

కలకత్తా లో ఒబెరాయ్ గ్రాండ్ లో ఇంటర్వ్యూలు ఫిక్స్ చేశారు మావాళ్లు. ప్రిలిమినరీ స్క్రీనింగ్ లో ఆరుగురినుంచి నలుగురిని సెలెక్ట్ చేసి అందులోంచి ఫైనల్ గా ఇద్దరినీ తీసుకుందామని నిర్ణయించాము. హెచ్ ఆర్ హెడ్ పార్కర్, ఇంజనీరింగ్ హెడ్ వలీ అహ్మద్, నేను,  ఇంటర్వ్యూ రూమ్ లో కూర్చుని స్క్రీనింగ్ ప్లాన్ వేసుకున్నాము. రావు ని ఆఖర్న పిలిచాము. రావు వచ్చి కూర్చోగానే పరిశీలనగా చూశాను ఏమన్నా గుర్తు పడతాడేమోనని. అటువంటి సూచనలు ఏవీ కనపడలేదు. అతను కూడా చాలా మారిపోయాడు. నా పేరు కూడా, కె. మురుగన్ నారాయణ అల్లా కే.ఎన్. మురుగన్  గా మార్పు  చేయడం వల్ల పేరు  ద్వారా గుర్తు పెట్టె అవకాశం లేకపోయింది.  వాళ్లందరికీ నారాయణ గానే తెలుసును కానీ మురుగన్ సంగతి తెలియదు.

మిగతా వాళ్ళిద్దరినీ మాట్లాడ నిచ్చి నేను చాలా కొద్దీ ప్రశ్నలు వేశాను. ఇంటర్వ్యూ అయినతరువాత అందరితో బాటు వెయిట్ చేయ మన్నాము. మేము మాలో చర్చించుకున్న తరువాత రావు ని, అభిజిత్ భట్టాచార్య అనే అతన్ని షార్ట్ లిస్ట్ చేసి వాళ్ళిద్దరినీ ఫైనల్ ఇంటర్వ్యూ కి ఢిల్లీ రమ్మని డా నికి  నిర్ణయించాము.  నేను ఏమీ సపోర్ట్ చేయ నవసరం లేకుండానే అతని ప్రోజెక్ట్ అనుభవాల దృ శ్యా మా వాళ్లిద్దరూ రావు ని సెలెక్ట్ చేశారు. సెలెక్ట్ చేసిన ఇద్దరితోటీ నేను కొంచం వివరంగా డిస్కస్ చేస్తానని చెప్పి మిగతా ఇద్దరినీ పంపించేశాను. భట్టాచార్య కి  ప్రోజెక్ట్  అవసరాలు బ్రీఫ్  చేసిన తరువాత ఫైనల్ ఇంటర్వ్యూ గురించి చెప్పి  రావు ని రమ్మని కబురు చేశాను.

మేమిద్దరమే ఉన్నాము.

" రావు గారు మీరు పనిచేసిన ప్రోజ క్ట్స్ లో మీరు సాధించిన ఫలితాలు మాకు నచ్చాయి. కానీ వాటి అన్నింటికంటే మాది చాలా ఛాలెంజింగ్ గా ఉంటుంది. ఆఫ్కోర్స్, మీ ప్యాకేజ్ కూడా చాలా బాగా ఉంటుంది." అన్నాను నవ్వుతూ తెలుగులో.

" సార్ నేను కూడా మీ కంపెనీ గురించి స్టడీ చేశాను. మీ కంపెనీ లో చేరితే కెరీర్ పరంగా నాకూ మంచిదే" అన్నాడు బాడీ లాంగ్వేజ్ లో వినయం చూపుతూ.

. "తెలుగు బాగానే మాట్లాడుతున్నారే! పేరు చూసి తమిళియన్ అనుకున్నా ను" అన్నాడు అతనే మళ్ళీ.

నేను సడన్ గా " కల్నల్ గారు బాగున్నారా ?" అన్నాను .

"ఎవరు మా మామయ్య గారా ? బాగానే ఉన్నారు ఆయన మీకు తెలుసా? " అన్నాడు ఆశ్చర్య పోతూ.

"అయితే మీరు నన్ను గుర్తు పట్టలేదు" అన్నాను నవ్వుతూ.

కాసేపు ముఖం లోకి తేరిపార చూశాడు. అయినా గుర్తు పట్టలేదు.

" నారాయణ –చినవాల్టేర్ లో కల్నల్ గారి ఇంట్లో అవుట్ హౌస్ లో ఉన్నాము కదా ?"

“ఓ! నారాయణ! గుర్తుపట్టలేదయ్యా బాబూ! సారీ గుర్తు పట్టలేదు సార్! అసలు పోలికలు లేవు. బాగా మారి పోయారు”

" నన్ను సార్ ని చేయకండి. మీరూ బాగా మారిపోయారు. 'సివి' చూడక పోతే నేనూ గుర్తు పట్టేవాణ్ణి కాదేమో!" అన్నాను ఇంకా తేరుకో ని అతని ఆశ్చర్యం కనపరుస్తున్న ముఖం లోకి చూస్తూ .

"అవును. ఇక్కడ ఎలా తేలారు? ఎక్కడ 'ఎం ఏ' సోషల్ వర్క్? ఎక్కడ ఈ ఇంటర్నేషనల్ కంపెనీ?" అన్నాడు కొంచెం తేరుకుని.

యూనివర్సిటీ వదలి నప్పటి నుంచీ జరిగిన వివరాలు చెప్పాను. మురారి , వనజ, లండన్లో స్థిరపడ్డారని, కల్నల్ గారి భార్య కాలం చేశారని, శారదాంబ గారూ, కల్నల్ గారూ హైద్రాబాద్ లో ఉన్నారని, వాళ్ళ కి దగ్గరగానే మాధురి కూడా ఉంటోందని వివరాలు చెప్పాడు.

కంపెనీ లో అతని జాబ్ వివరాలూ, దాదాపుగా ప్యాకేజ్ వివరాలూ అవీ చెప్పిన తరువాత, పాత విషయాలు అవీ చాలాసేపు మాట్లాడుకున్నాము. ఢిల్లీ లో ఫైనల్ ఇంటర్వ్యూ లో కలుద్దామని, అది ఫార్మాలిటీ యే కాబట్టి త్వరగా చేరడానికి తయారయి పోమన్నాను.

నాకు హైదరాబాద్ లో ముఖ్య మంత్రి తో అపాయింట్మెంట్ ఉందని, అందుచేత ఢిల్లీ నుంచి కలిసి హైదరాబాద్ వెడదామని, అప్పుడు కల్నల్ గారిని కలుస్తానని చెప్పాను. గుర్తు పడతారో లేదో చూద్దాం. అంతవరకూ చెప్పకండి అని రిక్వెస్ట్ చేసాను.

★★★★★★★★★

ఆంధ్రా 'సీఎం' తో మీటింగ్ లేక్ వ్యూ గెస్ట్ హౌస్ లో ఉండడంతో తాజ్ కృష్ణా నుంచి నేను అక్కడ కి వెళ్లి దిగి, రావు ని తీసుకు రమ్మని కారు పంపించాను అడ్రసు చెప్పి.

పోలవరం గురించి ఆంధ్రా 'సీఎం' చాలా పట్టుదల తో ఉన్నారు. ప్రోజక్ట్ కంప్లీషన్ లో అనుభవం ఉన్న తెలుగు వాళ్ళ సమాచారం ఆయన సేకరించి తగిన సలహాలు ఇమ్మని కోరడానికి నన్ను కూడా పిలిచారు.

'సీఎం' తో మీటింగ్ ముగించుకుని బయటికి వచ్చేటప్పటికి రావు రెడీ గా ఉన్నాడు. నీరజ పిల్లలతో పూనా వెళ్లిందని చెప్పడంతో అతని ఇంటికి వెళ్లకుండా నేరుగా కల్నల్ గారు ఉంటున్న ఇంటికి బయలుదేరాము.

మాధురి పక్క ఇంట్లోనే ఉంటోందని చెప్పాడు. మాధురి భర్త కూడా మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీస్ లో ఇక్కడే ఉన్నాడని, ప్రస్తుతం ఏదో క్యాంపు లో ఉన్నాడని చెప్పాడు.

కల్నల్ గారు వాళ్ళ ఇంటి హాల్ లో టీవీ కి ఎదురుగా ఉన్న సోఫాలో ఏదో ప్రోగ్రాము చూస్తున్నారు. ఇంకో వయపు ఉన్న సోఫాలో శారదాంబ గారు కూర్చున్నారు. నేను నేరుగా వెళ్లి ఆవిడ పక్కన కూర్చున్నాను.

ఆవిడ కేసి చూసి " గుర్తు పట్టారా?" అన్నాను. మళ్ళీ ఇంకోమాటు ఆవిడని బాధపెట్టవలసి వస్తుందేమో అనుకున్నాను.

కల్నల్ గారు రావు కేసి చూసి ఎవరు అన్నట్టు సైగ చేశారు?

మీరూ గుర్తు పట్టలేదన్నమాట. " మన నారాయణ వాల్తేర్ లో మాతో ఉండేవాడు కదా?" అన్నాడు నవ్వుతూ.

"శారదాంబ గారు నా ముఖం తడివి ఎంత మారిపోయావు బాబూ" అంది నవ్వుతూ. కళ్ళల్లో కదలాడిన బాధ నా దృష్టినుంచి తప్పించుకో లేకపోయింది.

“ఓ! నారాయణా ! ఇన్నాళ్లూ ఎక్కడున్నారు ఏం చేస్తున్నారు ?”

రావు ఒక్క మాటు అన్ని విషయాలూ గుక్క తిప్పుకోకుండా ఏకరువు పెట్టాడు. ఆఖరికి నా పే పాకెట్ ఒకటిన్నర కోట్లు అని కూడా చెప్పేశాడు.

రావు గారి ముఖం లో ఒక శ్రావణ మేఘం లాంటి ఒక మబ్బు తేర వచ్చి వెళ్ళిపోయినట్టు అనిపించింది. మూడు వందల రూపాయలకి ఇస్తానన్న MRF షేర్ వదిలేసి, ఇప్పుడది ఏభైవేలని తెలిస్తే వచ్చే భావం. అనుకున్నా. అది నా ఊహ మాత్రమేమో నాకు తెలియదు.

ఆయన వెంటనే చాలా ఆనందం వెలిబుచ్చాడు . "మా మిలిటరీలో సిపాయి ఎప్పుడూ జెనరల్ అవడు అనే భావం ఉంది కిందనుంచి ప్రమోషన్ల మీద వచ్చే వాళ్ళమీద. . నువ్వు ఆ అభిప్రాయం తప్పు అని నిరూపించావు. చాలా ఆనందంగా ఉంది.”

నా క్కూడా ఆయన చాలా సహజంగానే ఆనందం వెలిబుచ్చారని అనిపించింది.

ఇంతలో మాధురి వచ్చింది. ఆమె త్వరగానే గుర్తు పట్టింది. ఆమెని చూడగానే, గతం లో లా గుండె దాదా ఏమీ రాలేదు. వాస్తవానికి నాకు కల్యాణి తో వివాహం అయింతరువాత ఆ అనుబంధం లోని మాధుర్యం ముందు మాధురి గురించిన ఆలోచనలు ఎప్పుడో వెనక్కి వెళ్లిపోయాయి. ఎప్పుడయినా గుర్తు కు వచ్చినప్పుడు 'కల్నల్' గారి ప్రవర్తనే ముల్లు లా గుచ్చుకునేది.

కానీ ఇవాళ ఆయన వెలిబుచ్చిన నిష్కపటమయిన ఆనందం ఎప్పుడో ఏర్పడిన గాయానికి నవనీతం లా పనిచేసింది. ఒక మాటు ఆలోచిస్తే ఆయన తప్పేముంది అనిపించింది. ఎవరయినా తమ సంతానానికి పెద్ద స్థాయి లోనే పెళ్లిళ్లు చేయాలనుకోవడంలో తప్పని ఎవరన గలరు?

కాసేపు వాళ్ళతో గడిపి వచ్చేటప్పుడు కల్నల్ గారికి, శారదాంబ గారికి పాదాలకి నమస్కరించి వచ్చేసాను.

## మానసగంగ కానాల శారద

### కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

**ప్రతి సంవత్సరం** పరీక్షలైపోయిన ఆఖరి రోజున పిల్లలంతా మా పల్లెకు చేరుకోవడం ఎప్పట్నుంచో వస్తున్న ఆనవాయితీ. నాకు మాత్రం మధ్యాహ్నం పరీక్ష కావడం వల్ల అందరికన్నా కొంత ఆలస్యంగా పోవాల్సివచ్చింది. సాయంకాలం పూట ఒంటరిగా ప్రయాణం వద్దని అన్న ఎంత చెప్పినా వినేటట్లు లేను నేను. అందుకు కారణం మా పల్లె మేం చదువుకునే చోటికి చాలా దగ్గర. పైగా ఎప్పుడూ వచ్చేపోయే అలవాటుండే పల్లె కూడాను. నెలరోజులుగా రాత్రుళ్ళు నిద్ర మేల్కొని పరీక్షలకు చదవడం వల్ల బస్సులో కూర్చోగానే

చల్లటిగాలికి కళ్ళు మూతలు పడుతున్నాయి. బలవంతంగా టిక్కెట్ తీసుకోవడానికై మేలుకున్నా. టికెట్ తీసుకోవడమే ఆలస్యం బాగా నిద్రపట్టేసింది. తీరా మెలుకువ వచ్చి చూసేటప్పటికి అది మా ఊరుకాదు. అసలది ఊరేకాదు. నేను చేరాల్సిన మా పల్లె దాటిన తర్వాత వచ్చే ఒక మారుమూల కుగ్రామం. నా ఖర్మ కాకపోతే బస్సులో కండక్టరైనా నన్ను లేపకపోయాడు.

ఆ రోజున అమావాస్య అయి ఉండొచ్చు. చిక్కటి చీకటి పరుచుకుంది, కన్ను పొడుచుకున్నా ఏమీ కనబడటంలేదు. ఎంతో అభివృద్ధి జరుగుతోందనుకుంటున్న యీ కాలంలో కూడా వీధి లైట్లకు సైతం నోచుకోలేని పల్లెలున్నాయా అని ఒక్క క్షణం బాధకలిగింది.

ఆ చిక్కటి చీకటిలో బస్సు దిగాలంటేనే విపరీతమైన భయమేస్తోంది. నాతో పాటు యింకా నలుగురైదుగురు బస్సు దిగినట్లుంది. అందులో ఆడవాళ్ళు ఉన్నట్లు సూచనలేవీ లేవు. బస్సు దిగుతూనే ఒక్కసారి చుట్టూ కలయజూశాను. వచ్చేపోయే బస్సులు, కార్ల హెడ్‌లైట్ల వెలుతురులో కనిపించిన దృశ్యానికి గుండె గుభిల్లుమంది. బస్సు దిగిన వాళ్ళంతా అంతో యింతో మైకంలో ఉన్నవారే. అందులో ఒకాయన వేషం, దర్పం, ధోరణి చూస్తే ఆ ఊరి పెద్ద కామందులా తోచాడు. తక్కిన అందరూ అతని పాలేర్లేమో మరి. వాళ్ళ వేషభాషలు పూర్తి పల్లెవాటంగా ఉన్నాయ్. బాగా మత్తుతో నిండిన కళ్ళు తేలిపోతున్నాయ్. అడుగులు తడబడి తూలి, తూలి పడుతున్నారు.

''భగవంతుడా! ఈ వేళప్పుడు బయల్దేరవద్దని అన్న చెప్పిన మాట పెడచెవిని పెట్టినందుకు ఎంతటి దారుణమైన శిక్ష విధించావు తండ్రీ! ఇప్పుడింత భయంకరమైన ఊబిలో యిరుక్కుపోయానే, ఏమిటి నా పరిస్థితి? ఏది దారి?'' కళ్ళు మూసుకుని మనసులోనే వెయ్యి దేవుళ్ళకు మొక్కుకున్నాను.

రెండు, మూడు టెంకాయల మూటలు వాళ్ళవే ఉన్నట్లున్నాయ్. ఒక మూట సరిగా బిగించి కట్టినట్లు లేదు. మూటలు దింపేటప్పుడు పట్‌పట్‌మని చప్పుడు చేస్తూ టెంకాయలు రోడ్డంతా పరుచుకున్నాయ్. చీమ చిటుక్కుమన్నా వినపడేంత ఆ నిశ్శబ్ద నిశీధిలో వాటి శబ్దం మరింత భయంకరంగా తోచింది.

''రేయ్! బిర్నా టెంకాయలెత్తండ్రా మూటకు. దొంగనాయాల్లారా! మీ బతుక్కు మూటలు కట్టేది కూడా సరింగా రాదారా? హూ... హూ.. కానీండి. కానీండి బిర్నా.'' పాలేర్లను దబాయిస్తూ సిగరెట్టు వెలిగించాడు పెద్దాయన.

జోకులేసుకుంటూ, మధ్యమధ్యలో తిట్టుకుంటూ, వెకిలి నవ్వులు నవ్వుకుంటూ టెంకాయలు మూట కెత్తుతున్నారు పాలేర్లు. అంతవరకు నన్నెవరూ పట్టించుకోలేదు. అసలు చూడనైనా లేదు, అంతవరకు నన్ను గమనించని వాళ్ళు హెడ్‌లైట్ల వెలుతురులో నేను కనబడగానే వింతగా నావైపు చూశారు. రోడ్డువారగా నక్కి నిల్చుకున్న నన్ను ''ఏ ఊరు పాపా నీది? ఒంటిగా యియ్యాలప్పుడు యీడెందుకు నిలచున్నావు?'' మత్తు, మత్తుగా అతడు మాట్లాడిస్తుంటే పంచప్రాణాలు పైకి పోయినట్లయింది. కానీ జవాబివ్వక తప్పిందికాదు. ఎందుకంటే ఆ రాత్రి ఎక్కడో ఒక చోట తలదాచుకునే మార్గం చూసుకోవాలి మరి.

''కరణం శంకరప్ప మా చిన్నాయనప్పా. మా వూరెప్పుడొచ్చిందో ఎప్పుడు పోయిందో తెలీనంత నిద్రపట్టేసింది. మెలుకువొచ్చేసరికి యిక్కడున్నా. ఇది ఏ ఊరుప్పా?'' తప్పనిసరి ధైర్యం ప్రదర్శించాల్సి వచ్చింది.

''కరణమప్పా వాళ్ళ పాపవా నువ్వు? ఎంత పనైందీ? సరేలే, ఇంగేం చేసేది? బయపడద్దు. మేముండాము. నీకేం కాదు, మా యింటికి పద'' అసలే ఎర్రజీరలతో నిండిన కళ్ళు, మొరటున వున్న ఆ కంఠస్వరం ఏవేవో భయాలను అనుమానాలను రేపుతున్నాయ్.

''నేను మా వూరికి పోతానప్పా? ఇప్పుడేమైనా బస్సుందా?'' భయం బయట పడకుండా జాగ్రత్త పడుతున్నాను.

"ఈ యాలప్పుడు ఎట్లవుతాది? రేతరి పదిగంటలపై బడింది. పద, పద. మాయింటికి పోదాం. తెల్లారతానే నా మనుసులు నిన్ను మీ వూరికాడ దిగబెడ్తార్లే. నడు" స్వరం బాగా మొరటుగా అన్పించినా, సభ్యత లేకపోలేదు ఆ మాటల్లో. అసలు చెప్పాలంటే నన్నుగురించి అంత అఖ్ఖరగా పట్టించుకోనవసరమే లేదు. అంతలోనే ఎవరో ముక్కూ మొగమూ తెలీని వాళ్ళిల్లు అనగానే దిగులుగా వుంది. పోనీ యిల్లైనా దరిదాపుల్లో ఉందా అంటే అదీలేదు. ఆ నిశిరాత్రిలో వాళ్ళతో పాటు దాదాపు ఒక కిలోమీటరు దూరం నడిచిపోవాల్సిందే - తెలీని నిస్సత్తువ భయాన్ని మరింత పెంచుతున్నది.

వేరే దారిలేక వాళ్ళననుసరించాను. ముందర లాంతరు పట్టుకుని ఒకపాలేరు దారి చూపిస్తుంటే, మరో యిద్దరు టెంకాయల మూటలు, బ్యాగ్ పట్టుకుని నడవసాగారు. కారుచీకటి, గతుకుల రోడ్డు చుట్టూ తూలితూలి అడుగులేస్తున్న తాగుబోతులు. నా నరకయాతన ఏమని చెప్పను? కల్లోల సముద్రంలో ఎగసిఎగసి పడే కెరటాల్లాంటి ఆలోచనలు.

ఇంతలో పొలం గట్లపై నడవాల్సివచ్చింది. అట్లాంటి చోట్ల నడిచి అలవాటు లేదు. రెండు, మూడుసార్లు దొర్లి పడబోతే చెయ్యి పట్టుకుని లేపారు పాపం ఆ పాలేర్లు. కానీ, ఆ క్షణంలో నా మీద నాకే అసహ్యం కలిగింది. ఒంటరి ప్రదేశంలో ఎవరో పరాయి మనుష్యులు చేయి పట్టి లేపుతుంటే ఒళ్ళంతా తేళ్ళూ - జెర్రులూ పాకినట్లయింది. కానీ, ఏమీ చేయలేని పరిస్థితి. ఇంకా ఏమేం చవి చూడాల్నో మరి.

ఎలాగో గంటసేపు నానా అవస్థలు పడి గమ్యస్థానం చేరుకున్నాం. కోట్ల నక్షత్రాల్లో పొందికగా వెలిగే చందమామలా విద్యుద్దీపాలతో తళతళా మెరుస్తున్న పెద్ద భవంతి ముందు ఆగాము.

తలుపులు తట్టకనే లోపల్నుంచీ తలుపులు తెరుచుకున్నాయ్. పనిమనిషి తలుపు తీస్తూనే ఆ యింటి యిల్లాలు వచ్చి నిలబడింది.

"పద పాపా! లోపలికి పద" స్థాణువై నిల్చుకున్న నాతో గట్టిగా పలికింది అతని స్వరం. మత్తు నషాళానికంటినట్లుంది. ఉలిక్కిపడ్డాను.

"ఊహూ! నేనిక్కడ్నే ఉంటాను. ఈ లైట్ల వెలుతురులో కూర్చుంటాను. నాకిక్కడేం భయంలేదు. నేను లోపలికి రాను." నేను ఏ ధైర్యంతో మొండి చేస్తున్నానో నాకే తెలీదు.

"రాత్రంతా యాడనే కూసుంటావా? ఏమ్మో! నీకేమన్నా మతిపోయిందా ఏమో? అసలు నువ్వీడకు ఒంటిగా వచ్చిండేదే తప్పు. బస్‌లో నిద్దరపోయింది యింకా తప్పు. ఈ రాత్తిరి కాడ యాడ్నే ఒంటిగా ఉంటాననేది యింకా తప్పు. అసలే పల్లెకొంప. చెట్లూ - పొదలు, చీకట్లో పురుగూ - పుట్రా పారాడతావుంటాయి. ఏమనుకుంటూ వున్నారో? లెయ్. లెయ్మ్మా, లోపలికి పద" ఆజ్ఞాపించాడు అతడు.

ఆ పరిస్థితిలో నన్నిలా గర్జించినా మధ్యలో "అమ్మా" అనే కమ్మని మాట నాలోని భయాన్ని కొంతలో కొంత తగ్గించింది.

పాముల మాట చెవిని పడగానే, యింకేం మాట్లాడక లోపలికి పోవడానికి సిద్ధమయ్యాను. కానీ, ఆ కామందు మాట్లాడక గంభీరంగా నిలబడి నన్నే చూస్తోంది. ఆమె కళ్ళు నన్ను గురించి ఆరా తీస్తున్నట్లుగా అనిపించింది. పరిస్థితి అలాంటిది. సమయమలాంటిది. ఎవరికైనా, ఎట్లాంటి అనుమానమైనా కలగడం సహజం.

అంత పెద్ద భవంతి పెద్ద ద్వార బంధం, యింతెత్తుగడప పాతకాలపు కట్టడానికే అధునాతనమైన హంగులు తీర్చిదిద్దారు. గడపదాటి లోపలికి అడుగుపెడుతున్న వాడల్లా తూలిపడబోయాడు కామందు. ఎంతో ఆప్యాయతగా తనచేతినందిస్తూ "దిందినానికీ నీ దరిద్రిమలవాటు ముదిరిపోతావుండాది. ఒళ్ళు గుల్లయ్యేదంకా యిట్టానే పాట్లు పడతావుండు" ఆ కంఠంలో అతనిపట్ల అభిమానంతో కూడిన కోపం స్పష్టంగా తెలుస్తోంది.

''నీ కావిడి తగలెయ్య. అడ్డం తియ్యే'' చెయ్యి విదుల్చుకునిపోయేవాడల్లా వెనక్కు తిరిగి ''అన్సూ! ఏయ్ అన్సూ! యీ పాప మన కరణమోండ్ల పాపంట. నిద్దర్లో ఏమారిపోయి మనూరికాడ దిగిందిలే. ఏందన్నా తింటాదో తాగుతాదో కాంత యిశారించుకో'' అంటూ గదిలోకి వెళ్ళిపోయాడు, కానీ తలుపులేసుకోలేదు.

జరుగుతున్నదంతా జీర్ణించుకోలేక బిక్కు బిక్కు మంటూ నిలబడ్డాను నేను. ఆమె నన్ను, నా పరిస్థితినీ అంచనా వేసినట్లుంది.

''రామ్మా పాపా! ఏం బయపడద్దులేమ్మా. కరణమప్ప మాకు బాగా కావలసినోళ్ళేలే. తెల్లారతానే ఎల్లిపోదువుగానీ'' అంటూ తన గదిలోకి దారి తీసింది.

మూయని గది తలుపుల వైపు చూస్తూ అలాగే నిల్చున్న నన్ను చూసినట్లుంది.

''రా పాపా! ఏం బయపడొద్దు. మా రెడ్డి తాగుతాడే గానీ శానా మంచోడమ్మా''

''తీరా మునిగాక చలేమిటి? గాలేమిటి?'' అనుకుంటూ నేనూ గదిలోకి చేరాను.

అరటి పండ్లు, వేడివేడిపాలు తెచ్చియిచ్చిందా యిల్లాలు. బాగా శుభ్రంగా ఉతికిన దుప్పట్లు పరిచి పడుకొమ్మంది. తనూ నాతోపాటు కిందనే పడుకుంది. ఏమైనా మూయని ఆ గదితలుపులు మధ్యమధ్యలో బెదిరిస్తూనే ఉన్నాయ్. నా అవస్థ గమనించిన అనసూయమ్మ లేచి వెళ్ళి తలుపులు మూసి, నావంక చూసి నవ్వింది.

ఆ రోజు నిద్రలేని రాత్రి గడిపానేగానీ సమయం గడిచేకొద్దీ ఆ మనుషులలోని నీతీ - నిజాయితీ పట్ల గౌరవభావంతో నిండిపోయింది నా మనసు.

అచ్చు అడవిలాంటి నిర్జన ప్రదేశంలో తాగుబోతుల సమక్షంలో, తాము ఏం చేసినా అడిగే నాథుడులేని వాళ్ళ సామ్రాజ్యంలో వయస్సులో ఉన్న ఒంటరి ఆడపిల్ల యింత నిర్భయంగా, ఒక రాత్రి గడపగలిగిందంటే... ఓహ్, యీ మధ్యకాలంలో నమ్మలేని ఒక అద్భుత సత్యం.

అంచెలంచెలుగా పెరుగుతున్న టెక్నాలజీ వల్లకావచ్చు, గ్లోబలీకరణ పేరుతో జరుగుతున్న మార్పులావల్ల కావచ్చు, అసలు ఫలితాల మాటెలా ఉన్నా, జరుగుతున్న దుర్ఘటనలను తల్చుకుంటేనే ఒళ్ళు జలదరిస్తుంది. మానభంగాలు, హత్యలు, యాసిడ్ దాడులు, కిడ్నాప్‌లు, పైశాచిక ప్రేమలు, ఒకటేమిటి? ఆడపిల్లల కన్నా తలిదండ్రులు బతికుండగానే నరకం అనుభవిస్తున్నారు.

ఒక మనోహర్, ఒక రామ్‌సింగ్, ఒక శివకుమార్... యిలా ఎంతోమంది తమ కామదాహానికి ప్రత్యూష, శ్రీలక్ష్మి, ఆయిషా, మీరా నిర్భయలాంటి అభం శుభం తెలియని ఆడపిల్లల జీవితాలను బలిచేసి మొగ్గలోనే తుంచివేస్తున్నారు.

ఈ కామ పిశాచులంతా మంచి కుటుంబ నేపథ్యం ఉన్నవారే. ఉన్నత విద్యావంతులే. అయితే జీవితానికి అత్యవసరమైన నైతిక విలువలు మృగ్యమై తమను, తమతోపాటు ప్రేమించిన అమ్మాయిలను, కన్న తలిదండ్రులను జీవచ్ఛవాలుగా కడతేరుస్తున్నారు.

విద్యాహీనులు, అనాగరికులుగా ముద్రవేయించుకున్న ఆ పల్లెప్రజలలో ఎంత నిజాయితీ, ఎంత సఖ్యత, ఎంత సంస్కారం. చదువుకు, సంస్కారానికి ఏ సంబంధంలేదని నిరూపించింది నా జీవితంలోని యీ సంఘటన.

ఇవన్నీ ఆలోచిస్తూ, ఎప్పుడో నిద్రపట్టింది. ప్రొద్దున లేచేటప్పటికి ఏ మాత్రం, అలసట, బెదురు లేవు. పైపెచ్చు ఏదో తెలీని ఆనందం, మాటల్లో చెప్పలేని అనుభూతి. ఒకవేళ మాటల్లో చెప్పినా అర్థం చేసుకోలేని వారి అమాయకత్వం. స్వచ్ఛమైన గంగాజలంలా, తెల్లని పావురాలు అందించే శాంతి సందేశంలా మనసు ఎంతో హాయిననుభవించింది.

ఇంతలో పాలేర్లు నా సంచి ఒకరు, మామిడి పండ్ల గంప నొకటి చేతుల్లో పట్టుకుని.

''పదమ్మా! అప్పగారింట్లో యిడిసి పెట్టొస్తాం పద'' నన్ను తట్టిలేపినట్లయింది.

అనసూయమ్మ కుంకుమ బొట్టుపెట్టి, రవికెల బట్ట తాంబూలమిచ్చి వీడ్కోలు పలికింది.

అంతవరకు యువతలకు రాకుండా గదిలోనే ఉన్న రెడ్డితో "పోయి వస్తానప్పా. ఎంతగానో భయపడిన నన్ను మీరు ఎంతగానో ఆదరించినారు. మీరు చేసిన మేలు ఎప్పటికీ మరచిపోలేను" అంటూ సెలవు తీసుకుంటున్న నావైపు ఆప్యాయంగా చూశాడు రెడ్డి.

ఇంటి దగ్గర దిగబెట్టిన ఆ పాలేర్లకు కడుపు నిండా భోజనం పెట్టి, పర్సులోనుండి రెండు యాభై రూపాయల నోట్లు చేతిలో పెట్టాను. ఆ నోట్లను చూసి వాళ్ళ కళ్ళల్లో కనిపించిన వెలుగు ఎప్పటికీ మరచిపోలేనిది.

# అర్ధనారీశ్వరం

వి.పద్మినీదేవి

### కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

**"ఒరే గోపాలరావు..** మన శ్రీనుని పద్దూ చేసుకోనంటుందిరా. నీవు అర్జంటుగా వచ్చి ఒక్కసారి మాట్లాడు" అని ఆదివారం ప్రొద్దున్నే అన్నగారు ఫోన్ చేయగానే రెక్కున వాలిపోయాడు గోపీ.

"అదిరా సంగతి. చిన్నప్పటినుండి అనుకున్న సంబంధం. మీ వదినకు దగ్గర బంధువులు. ఇప్పుడీ సంబంధం కాదని క్రొత్త సంబంధం చూడాలంటే ఎంత కష్టం. పెళ్ళంటే మాటలా! ఎన్ని చూడాలి? పైగా దీనికి అమ్మ వత్తాసు" అని ధుమధుమలాడుతున్న అన్నగారిని,

"ఏదో మా శారదొదిన కోడలయితే ఇంటిప్రక్కన ఇల్లు, పిల్లవాడెలాగు అమెరికా పారిపోయాడు పిల్లన్నా కళ్ళెదురుగా వుంటుందంటే ఇది ఇట్లా అడ్డం తిరిగింది" అని కన్నీళ్ళు పెట్టుకుంటున్న అన్న భార్య మాలతిని

"నేను వచ్చాను. మాట్లాడతాను గద! వదినా.. మరేం ఫర్వాలేదు. చిన్నపిల్ల ఏదో తెలియక అంటే అయిపోయిందా!?" అని సముజాయించాడు.

"కానీ అత్తయ్యకూడా.." అంది మాలతి.

"అమ్మ సంగతి కూడా నే చూసుకుంటాను గద. నీవు హైరానాపడకు" అని ధైర్యం చెప్పి పద్దు అని పిలువబడే పద్మావతి దగ్గరకొచ్చాడు.

పద్దు ఉయ్యాల బల్ల మీద కూర్చుని కారప్పూస కరకరలాడిస్తూ దీక్షగా 'జానకివిముక్తి' నవల పటపటలాడిస్తున్నది.

"ఏవిటే పద్దూ! ఏదో రివల్యూషన్ లేవదీశావుట?" అన్నాడు విషయం కదుపుతూ.

పద్దు పుస్తకంలోంచి తలెత్తి బాబాయిని చూసింది "ఓహో బాబాయా ఎప్పుడొచ్చావు? ఏదీ ఇంకా రాలేదేవిటా అని ఎదురుచూస్తున్నా! పిన్ని ఎలా వుంది?"

"దిమ్మ చెక్కలా వుంది"

"ప్రవీణ్‌గాడు, ఉషాబేబి?"

"అందరూ నిక్షేపంగాని నీ సంగతి చెబుదూ!"

"ఏముంది చెప్పేందుకు? తరతరాలుగా జరుగుతున్న కథే! నేను ఉద్యోగం మానేసి అత్తమామల ఊడిగం ఆపైన పిల్లల సేవలూ చేసుకుని తరించాలట. ఐ హేట్ దిస్ మేల్ డామినేషన్ బాబాయ్. నాకేం గతిలేదా?" చేతిలోని పుస్తకం విసిరి కొట్టింది.

ఎఱ్ఱని పద్దు చెక్కిళ్ళు మరింత ఎర్రబారాయి. తెల్లని కళ్ళలో ఎర్రజీరలు దోబూచులాడాయి. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు పాము బుసల్లా ఉన్నాయి.

"ఆగవే ఆగు. అంత స్పీడొద్దు. ఇందులో డామినేషనేమున్నది. హాయిగా ఇంట్లో కూర్చుని సుఖపడక ఎందుకా కంచిగరుడ సేవ?"

"షిట్! నేనూ, నా డిగ్రీ నా ఎఫిషియన్సి కమ్యూనికేటెడ్ స్కిల్స్ అన్నీ వంటింట్లో కూర్చుని గోంగూర పులుసు వండుకోవటానికా?"

"అబ్బ కాదులేవే! పిజ్జా, బర్గర్స్ కొనుక్కోవటానికిలేగాని మరి ఆ సంగతే శ్రీనుకు నచ్చచెప్పలేకపోయావా?!"

"నాకేం ఖర్మ బాబాయ్! వాడిని బ్రతిమిలాడటానికి నేను మాత్రం ఛస్తే ఉద్యోగం మానేదిలేదు. కావాలంటే నీవే పోయి చెప్పుకో అదే దూకుడుతో అన్నది."

"సర్లె! సర్లె. నేను వెళ్ళి శ్రీనుతో మాట్లాడివస్తా!" లేచాడు గోపాలావ్.

"రాకు.. అటునుండి అటే వెళ్ళి వేరే సంబంధాలు కనుక్కునిరా! మీ వదినకి తన పుట్టింటి తరఫు సంబంధం చేయాలనే తపన తప్ప పిల్ల మనసు తెలుసుకోవాలనే తపనలేదు" అంది అప్పుడే అటుగా వచ్చిన అన్నపూర్ణమ్మ.

"మాతా అన్నపూర్ణేశ్వరీ నీవు కూడానా!?"

"లేకపోతే ఏవిట్రా! ఆ శీనుగాడితో సమంగా బి.టెక్కు చదివింది. ఎమ్.టెక్కు చదివింది."

"వాటికంటే ఎక్కువగా 'జానకి విముక్తి' చదివిందిగాని అమ్మా! దాన్ని అలా ఎగదోయకే పద్దూ! నేను శ్రీనుతో మాట్లాడి వస్తా ఈలోపు పుస్తకం పూర్తి చేసుకో. "

అంటూ ప్రక్కయింటికి వెళ్ళాడు.

గేట్లోనే ఎదురు పడ్డాడు శ్రీను.

"ఏంటి మామయ్యోయ్! దారి తప్పివచ్చినట్లున్నావు. ఆ యింటి మీది కాకి ఈ యింటిమీద వాలట్లేదు గద ఇప్పుడు" అన్నాడు.

"ఎంత నలుపయినా నేను కాకిని కాదులేరా" అన్నాడు గోపాలరావు.

"గోపాలబాలుడు కూడా నలుపేకాని లోపలికి పదమామయ్యా"

"వద్దులేరా! ఇక్కడే బాగుంది చాలా! ఇల్లా సిమెంట్ బెంచీమీద కూర్చుందాం. పెళ్ళి కాన్సిల్ అన్నావట ఏమిటి సంగతి?" అన్నాడు గోపాలరావు బెంచీ మీద కూర్చుంటూ.

"నేను కాదు మావయ్యా! అదే అన్నది"

"మరి అది చెప్పేదాంట్లో కూడా కొంత న్యాయముంది కదరా!"

"నేను చెప్పేదాంట్లో పూర్తిన్యాయముంది మామయ్యా" అన్నాడు శ్రీను పట్టువదలని విక్రమార్కుడిలా.

"నీకు మాత్రం డబ్బు చేదటరా!"

"కరెన్సీకి రుచివుండదేమో మామయ్యా! అయినా నేనెప్పుడూ తిని చూడలేదు."

నవ్వి శ్రీను తలమీద చిన్నగా కొట్టి "నీ ముఖంలే కాని. నెలకు నలభైవేలు సంపాదించి పెడితే తిని సుఖపడటానికి దొబ్బిడాయా?" అన్నాడు గోపాలకృష్ణ.

"డబ్బు సంపాదన సుఖపడటానికే అయినపుడు మరి సుఖాన వున్న ప్రాణాన్ని కష్టపెట్టడమెందుకు మామయ్యా?" అన్నాడు శ్రీను.

"మరి ప్రతిభ సంగతి ఏమిటిరా! ఇది ఆడవాళ్ళ ప్రతిభను అణగద్రొక్కడమే అంటుంది పద్దు కాదంటావా!"

"ప్రతిభను ఎవరూ అణగదొక్కలేరు మామయ్యా! అది అణచిన కొద్దీ పైకి లేస్తుంది. పిల్లలను ఎవరి మీదో వదలకుండా సంస్కారవంతులుగా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటం ప్రతిభ. అత్తమామలను తల్లిదండ్రులను ముసలి వయసులో కష్టపడకుండా చూసుకోవటం ప్రతిభ. బంధువుల్ని, ఆశ్రితుల్ని ఆదరించటం ప్రతిభ. కంప్యూటర్ ముందు కూర్చుని నడుం నొప్పి తెచ్చుకోవడమొకటే ప్రతిభ కాదు. ఏమంటావ్?"

"మరి నేననేదానికి కోప్పడకు కాని, మరి ఇదంతా ఆడవాళ్ళే ఎందుకు చేయాలి? మగవాళ్ళు చేయవచ్చుకద. అహఁ పద్దు అలా అంటే?"

"ప్రకృతి అలా నిర్దేశించింది గదా మామయ్య!? నీవు నేనూ పిల్లల్ని కనలేముగా" నవ్వుతూ అన్నాడు శ్రీను.

"ఓరి పోరా మొండి ఘటమా! కానొరేయ్ దూడలకుమ్ములాటల మధ్య ఎద్దులు నలిగిపోతున్నాయి. అది ఆలోచించు" బాధగా అన్నాడు గోపాల్రావు.

శ్రీను నవ్వి అన్నాడు.

"సరె మామయ్య బాధపడకు. నీకు నేనొక ఉపాయం చెబుతాను దాంతో ప్రాబ్లమ్ సాల్వ్ అవ్వచ్చు. అన్నట్లు ఇది నేను పద్దుకే కాక అలాంటి మహిళామణులందరికి నేను చేస్తున్న ఛాలెంజ్."

"ఏమిటది?" గోపాల్రావ్ కుతూహలంగా చూశాడు.

మరుసటి ఆదివారం గోపాల్రావు పెళ్ళికొడుకుల లిస్టుతో పద్దు దగ్గరికి వచ్చాడు.

"ఇదిగోనే పద్దూ.. నువ్వు కూడా వినవే అమ్మా! నెట్ అంతా శోధించి, కళ్యాణ కల్పతరువులన్నీ గాలించి వాళ్ళనీ వీళ్ళనీ ఎంక్వైరీలు చేసి షార్ట్ లిస్ట్ చేసి తెచ్చిన పెళ్ళికొడుకులు. ఇదిగో ఇతడందరికన్నా బెస్ట్. కట్నం నాలుగు లక్షలిస్తే చాలు."

చర్రున లేచింది పద్దు.

"ఏమిటీ! నేను కట్నం యిచ్చి కొనుక్కోవటానికి వాడేం సంతలో గొడ్డా?"

"పోలిక బాగోలేదే పద్దూ! గొడ్డును కొంటే మనింటికి వచ్చి రెండుపూట్లా పాలిస్తుంది. వీడు తన జీతం మనకెందుకిస్తాడు. పైగా నీ జీతం కూడా లాక్కుంటాడు.

మిగతావి ఇంతకంటే ఘోరం.

ఒక సంబంధం వాళ్ళకి కట్నం అవసరం లేదటగాని లాంఛనాలు మూడు రెట్లడిగారు.

ఇంకోటి ఇరవై లక్షలు పెట్టి గ్రాండ్‌గా పెళ్ళి చెయ్యమన్నారు.

మరోటి పిల్ల మొదటినుండి సంపాదించినదంతా లెక్కగట్టి ఇవ్వాలన్నారు. "

"ఇవేం పాపిష్టి సంబంధాలురా వెధవా! ఒట్టి డబ్బు మనుషులు లాగున్నారూ! వీళ్ళు పిల్లనేం సెలక్టు చేస్తారు. వద్దులే మనకు" అన్నది అన్నపూర్ణమ్మగారు.

"ఇలాగ కాదు బాబాయ్. నా కండిషన్లు ముందే చెప్పి అందుకు యిష్టపడ్డ వాళ్ళనే తీసుకురా."

"ఏమిటో చెప్పు మరి" అన్నాడు గోపాలరావు.

"కట్నం కానీ, లాంఛనాలు కానీ ఇవ్వబడవు. పెళ్ళి ఖర్చులు చెరి సగం. ఇంట్లో పనులు చెరిసగం. జీతం ఎవరిది వారిదే ఇంటి ఖర్చులు చెరిసగం. బయోడేటా నచ్చితే పెళ్ళిచూపులు బయట ఎక్కడయినా.." ఖండితంగా చెప్పింది పద్దు.

మరుసటి ఆదివారం గోపాల్రావు ఒక సంబంధం తీసుకుని వచ్చాడు.

"ఇదిగో పద్దు అన్ని విధాలా నీకనుకూలమైన సంబంధం. నువ్వు చెప్పిన షరతులన్నింటికి ఓ.కె అన్నారు. అతనికి కూడా ఉద్యోగం చేసే అమ్మాయే కావాలట. అది అతని షరతు."

పద్దు ఉత్సాహంగా బయోడేటా అందుకుని ఒక్కసారి చూసి ఫోటోలో బాగానే వున్నాడు అనుకుని "ఇదిగోనే బామ్మా" అంటూ అన్నపూర్ణమ్మగారికి అందించింది.

ఆ తరువాత గోపాల్రావుకేసి తిరిగి "ఓ.కే బాబాయ్. పెళ్ళిచూపులు ఏదన్నా హోటల్లో ఏర్పాటు చెయ్యి" అంది.

అన్నపూర్ణమ్మగారు అడ్డం పడింది.

"ఓసి ఉండవే మొద్దు. నీ తొందర దొంగల్దోల. పిల్లాడి డేట్ ఆఫ్ బర్త్ చూశావా! తొంభై రెండు. నీది తొంభై ఒకటి. నీకంటే చిన్నవాడు."

పద్దు తెల్లముఖం వేసింది. తొందర్లో తను చూసుకోలేదు.

"అయితే ఏమిటి అమ్మా! సీతమ్మ రాముడి కంటే పెద్దది. డాక్టర్ అంజలీ టెండూల్కర్ సచిన్ కంటే ఐదేళ్ళు పెద్ద. ఐష్ కంటే అభిషేక్ బచ్చన్ చిన్న" గోపాల్రావు చెబుతుంటే

అన్నపూర్ణమ్మ గయ్‌మంది.

"చిన్నవాడయితే వరహీనం అవుతుందిరా వెర్రికుంకా! ఆయుక్షీణం అంటారు పెద్దలు."

"ఏమే పద్దూ నీవేమంటావ్?" అన్నాడు గోపాల్రావ్.

"ఏమిటో బాబాయ్ నాక్కూడా అదోకలా వుంది. పోనీ ఇంకోటి చూడరాదు."

"సరే నీకిష్టం లేకపోతే అలానే చేద్దాం" అంటూ లేచాడు గోపాల్రావ్.

మరుసటి ఆదివారం మరొక పెళ్ళిసంబంధం తీసుకుని ఉత్సాహంగా వచ్చాడు గోపాల్రావ్.

బయోడేటా ఇస్తూ "ఇదుగోనే అమ్మా! పద్దూ నీవుకూడా చూడు. ఈ పిల్లాడు పద్దూ కంటే మూడేళ్ళు పెద్దవాడు. చదువు, ఉద్యోగం అందం అన్నీ బాగున్నాయి."

"అట్లా అన్నావు బాగుంది." అన్నది అన్నపూర్ణమ్మ.

కానీ బాబాయ్. పద్దు ఆగిపోయింది.

"ఏమిటే?"

"ఇతని ఎత్తు నాలుగంగుళాలే. నేనేమో ఐదూ ఐదు"

"అయితే ఏమిటే అమితాబ్ బచ్చన్ ఆరు రెండు. జయబాధురి ఐదు. ఇంచక్కా లేరూ. మీ బామ్మా తాతయ్య అంటే మా అమ్మా నాన్నా కూడా అంతేగా."

దాంతో అన్నపూర్ణమ్మగారు రెచ్చిపోయింది.

"ఛీ నోరుముయ్యరా అంట్ల వెధవా! మగవాళ్ళు పొడవున్నా ఫర్వాలేదు. ఆడపిల్లకంటే మగవాడు పొట్టి అయితే ఏం బాగుంటుంది. ఈ వామనమూర్తి కాకపోతే మరోడు దొరకడా?" అని దులిపేసింది.

"సర్లేవే! మరి ఇవ్వన్నీ నాకు ముందే చెప్పొద్దా!"

"చెప్పేదేమిటిరా పిచ్చికొయ్యా! ఆ మాత్రం లోకజ్ఞానం ఉండొద్దూ. పెద్ద పెళ్ళి సంబంధాలు చూడటానికి బయల్దేరాడు మొనగాడప్పన్న" అంటూ దండకం ఎత్తుకుంది.

"సర్లేవే ఈసారి అన్నీ సరి చూసుకునే తెస్తాను" అంటూ జారుకున్నాడు.

కానీ ఈసారి గోపాలరావు వచ్చేసరికి నెలరోజులయ్యింది.

ఈలోగా మాలతమ్మకెందుకో బి.పి షుగరు వచ్చినాయి. కుడిచెయ్యి పడిపోయింది. మోకాళ్ళు పట్టుకు పోయాయి. నాలుగురోజులు హాస్పిటల్‌లో వుండి వచ్చింది.

అన్నపూర్ణమ్మగారికి వయసు పైబడటం వలన ఏ పనీ చేయలేదు. పైగా వణుకుడు రోగం.

ఇంక వంట పనంతా పద్మా నెత్తిన పడింది. పనిమనుషులు వున్నా కూడా వచ్చీ రాక సతాయించారు. తండ్రి చేతనైనంత సహాయం చేస్తూనే వున్నాడు కానీ ఆయనకు ఆఫీసు పని ఒత్తిడి పైగా భార్య అనారోగ్యం వలన ఆమెకు కావలిసినవి చూడ్డంతో ఎక్కువ సహాయం చేయలేక పోతున్నాడు. దాంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నది.

ఇలాక్కాదని ఇంట్లో వండకుండా కర్రీ పాయింట్స్‌నుండి కూరలు తెచ్చింది. కానీ అవి తినలేక ఇంటిల్లిపాది సిక్ అయిపోయారు. దాంతో లీవ్ పెట్టక తప్పలేదు.

కానీ ఇంతవరకు ఇవతల పుల్లతీసి అవతల పెట్టిన పాపాన పోలేదు. అంతా తల్లే చూసుకునేది. ఇప్పుడు ఇంట్లో ఇంత చాకిరి చేయాల్సి వచ్చేసరికి ఒళ్ళు హూనమైంది.

తల్లి మంచంలో కూర్చుని అన్నీ చేయించుకోవడమేగాక కాస్త ఉస్సు అస్సు అంటం ఆలస్యం. "ఏమిటే ఈ మాత్రానికే ఇట్లా ఆపసోపాలు పడతావు. రేపు పెళ్ళై పిల్లలు పుడితే ఏం చేస్తావే!?" అంటూ మండిస్తున్నది.

పైగా బామ్మ హాయిగా కూర్చుని అదిట్లా ఇదిట్లా అది అంటు ఇది సొంటు అని ఆజ్ఞలు జారీ చేస్తుంటే ఒళ్ళు మంట మరింత ఎక్కువవుతున్నది.

ఈ పెళ్ళి సంబంధాల గొడవ గురించి ఆగింది కానీ లేకపోతే ఈ మాయదారి ముసలమ్మని బాబాయి యింటికి తరిమెయ్యాలని లోలోపల పళ్ళు కొరుక్కుంటున్నది.

అలాంటి పరిస్థితులలో వచ్చాడు గోపాలావు. కానీ పద్మాకి అప్పటికి పెళ్ళిమీద ఇంట్రస్టు కూడా పోయింది.

"ఇన్నాళ్ళు ఏమైపోయావురా ఆగమ్మ కాకి!?" అంటూ వచ్చింది అన్నపూర్ణమ్మగారు.

"మరి వెతకొద్దేమిటే మనం కోరినలాంటి సంబంధం. చూడిది నిక్షేపంలాంటి సంబంధం. పెళ్ళికొడుకు వయసు, ఎత్తూ రంగూ అన్నీ పద్మా కంటే ఎక్కువే. ఇంట్లో సగం పనికాదు మొత్తం పని చేస్తాడు. ప్రైవేట్ స్కూల్లో టీచర్. జీతం ఎనిమిదివేలు."

"ఏమిటీ! ఎనిమిదివేలా? ఇంటద్దెకు సరిపోతుంది. ఉండటానికి ఓకె. మరి తింటానికో!?" వెటకారంగా అన్నది అన్నపూర్ణమ్మగారు.

"దీనికి నలభైవేలు వస్తుంది గదే! లక్షణంగా తింటారు."

"ఏమిటీ అంట్లు తోముతూ ఆడదాని సంపాదన మీద పడి తింటాడా ఆడంగి వెధవ?" ఉక్రోషంగా అన్నది అన్నపూర్ణమ్మగారు.

"అదేమిటే అట్లా అంటావు. మీరు మగవాళ్ళ సంపాదన తింటంలేదా మగవాళ్ళు అట్లా అనుకుంటారా?"

"నాకదేం తెలియదు. ఆడదాని సంపాదనకాశపడే వాడిని సన్నాసి, వాజమ్మ అంటారు. ఇంతకంటే శీనుగాడి సంబంధమే నయం గదరా! దీనికంటే రెట్టింపు జీతం, పైగా బోలెడంత ఆస్తి. ఇదింత ఒళ్ళు విరుచుకుని సంపాదించాల్సిన అవసరమేముందసలు?" అంది అన్నపూర్ణమ్మగారు.

"అవును బాబాయ్. నేనూ అదే ఫోన్ చేద్దామనుకున్నాను నీకు" అని ఠక్కున నాలుక కరుచుకుంది పద్దు.

"అంతలా కర్చుకోకే.. నాలుక తెగిపోగలదు" అంటూ హుషారుగా లేచాడు గోపాల్రావ్.

"ఇంకేమమ్మా వదినా! నీవు లేచి వినాయకుడికి ముడుపు కట్టి పెళ్ళి పనులు మొదలెట్టుకో. ఇవాళ దివ్యమైన రోజు వర్జ్యం కూడా లేదు" అని వదినగారితో చెప్పాడు.

ఆ మాట వినగానే అప్పటిదాకా ముక్కుతూ మూలుగుతున్న మాలతమ్మ ఛెంగున లేచి దొడ్లో వున్న చిన్నరోలు కడిగి అమాంతం లోపలికి తీసుకువచ్చి దేవుడి ముందుపెట్టి గౌరి కల్యాణ వైభోగమే, లక్ష్మి కల్యాణ వైభోగమే అని కూనిరాగాలు తీసుకుంటూ వినాయకుడికి ముడుపు కట్టటానికి తయారు చేసుకోసాగింది.

"మరి నేను హాలు మిగతా ఏర్పాట్లు చూస్తాను" అంటూ బయల్దేరాడు గోపాల్రావు.

ఆ ఇద్దర్నీ చూసి "ఆరి దొంగ భడవల్లారా! అందరూ కలిసి ఇన్ని దొంగనాటకాలాడతారా!?" బుగ్గలు నొక్కుకుంది అన్నపూర్ణమ్మ.

ఆ తరువాత శ్రీనివాస్‌ని కలిసినపుడు అతని భుజం మీద చరుస్తూ "అసాధ్యుడివిరా శ్రీనూ. సాధించావ్ మొత్తానికి. ఎలా ఊహించావ్?" అన్నాడు గోపాల్రావ్.

శ్రీనివాస్ నవ్వి అన్నాడు "పద్దు, అమ్మమ్మలాంటి సగటు స్త్రీలందరూ పురుషాధిక్యాన్నే కోరుకుంటారు మామయ్యా! అంతెందుకు. శివధనస్సు అవలీలగా ఎత్తగలిగిన సీత రాముడే వచ్చి రావణున్ని చంపాలని కోరుకుంది కద. సగటు స్త్రీ స్వభావాన్ని వాల్మీకి సీతలో ఆవిష్కరించాడు మామయ్యా! అయితే శక్తి స్వరూపాలైన మహిళామణుల సంగతి వేరు. ఆ స్త్రీ శక్తి ముందు ఏ పురుష శక్తి నిలువలేదు. ఇహ మిగతావారు, నా దృష్టిలో స్త్రీ పురుషులిరువురు పరిపూరకాలు. వారు సమానులు కారు. ఒకరే అర్ధనారీశ్వర తత్వం మనకదే కద బోధించేది మామయ్యా!"

తన కళ్ళముందు పుట్టిపెరిగిన శ్రీనుగాడు గీతాచార్యుడులా అనిపిస్తున్నాడు గోపాల్రావుకి.

## మతి మెరుపు - డా. డి.వి.జి శంకరరావు

**ఉదయాన్నే** పేపర్లో వాడి ఫోటో చూడగానే గుండెలో రాయిపడింది. పిల్లల దగ్గరకని అమెరికా వెళ్ళొచ్చి వారమే అయింది. నేను తిరిగి వచ్చేసినట్టు వాడికి తెలిసి ఉండదు కూడా. వైజాగ్‌లో ఉన్నన్నాళ్ళూ ఏదో హుద్ హుద్‌లూ, అవాంతరాలు ఆస్థాయివి వస్తే తప్ప మేంకలవని రోజుండదు. ఇద్దరికీ వేరే పనేం ఉంది గనక. విశ్రాంత జీవితాలు మావి. ఇంజనీర్‌గా నేను, డాక్టర్‌గా వాడు రిటైరయ్యి దశాబ్దమైంది.

ఫోటో క్రింద వార్త చూడగానే కాస్త నిమ్మళించాను. 'థాంక్‌గాడ్' అనుకుంటూ. నా చాదస్తానికి మీకు నవ్వు రావొచ్చుగానీ ఒక వయసు దాటాక పేపర్లో ఫోటో అంటే కీడు శంకించదూ! అయితే ఆ వార్త మాత్రం తక్కువ స్థాయి షాకేం ఇవ్వలేదు. అది ఇలా ఉంది.

"ప్రముఖ వైద్యులు మూర్తిగారికి మతిమరుపు వ్యాధి సోకింది. ఆయన ఇంట్లోనుంచి వెళ్ళిపోయి, కన్ఫ్యూజన్‌తో తిరుగాడుతుండగా ఆయన్ని తెలిసినవారు ఇంటికి తీసుకొచ్చారు. గతంలో కూడా ఇలానే రెండురోజులు ఎటో వెళ్ళిపోతే కష్టం మీద పట్టుకోగలిగామని వారి అబ్బాయి మనోహర్ తెలియజేసారు."

వార్త చూసి మనస్సు చివుక్కుమంది. ఎంత లైవ్లీ పర్సన్!? ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ ఉండేవాడు. చిన్నప్పటినుండీ స్నేహితులం మేం. సంవత్సరం క్రితం వాడి అర్ధాంగి కనుమూసిన పిమ్మట మాత్రం వాడిలో జోష్ పూర్తిగా తగ్గిపోయింది. బయటపడే వాడు కాదుకానీ దిగులూ, ఒంటరితనం ఛాయలు మాత్రం బాగా గమనించగలిగేవారికి అవగతమయ్యేవి. భార్యలేని లోటుని కొడుకూ, కోడలూ, మనమళ్ళూ భర్తీ చెయ్యలేరుగదా!

అయితే నాతో స్నేహంలో పెద్ద మార్పేమీ లేదు. నేను రోజులో ఏదో పూట వాడింటికి వెళ్ళడంగానీ, వాడు మా యింటికి రావడంగానీ జరగాల్సిందే. మూడునెలల క్రితం నేను అమెరికా వెళ్ళినపుడు మనిషి బాగానే ఉన్నాడు.

ఇప్పుడు నేనొచ్చినట్టు కూడా గుర్తుపట్టలేడేమో బహుశా. అంతకన్నా ముఖ్యమైన విషయం. వాడు నాకు లక్షరూపాయలు బాకీ. ఆ డబ్బు ఇప్పుడు నాకెంతో అవసరం. ఎంత వద్దన్నా ఆర్థిక అవసరాలు గుర్తురాకుండా మానవుకదా! పైగా పెన్షన్ మీద బ్రతుకుతున్న ఒంటరివాడిని. ఇప్పుడెలా? డబ్బుల సంగతి ఎలాగూ పిల్లలకు చెప్పి ఉండడు. వాళ్ళబ్బాయి మనోహర్‌తో ఈ విషయం ఎలా ప్రస్తావించడం?

అలా అని చెప్పకపోతే ఒడ్డెక్కలేను. మనసు పరిపరివిధాలా పోతోంది. కాసేపయ్యాక నామీద నాకే అసహ్యమేసింది. ఇలా ఆలోచిస్తున్నానేమిటి? మొదట పేపర్లో వాడి ఫొటో చూడగానే కీడు శంకించాను. అది కాదని తెలిశాక హమ్మయ్య అనుకున్నాను. వాడు వ్యాధిగ్రస్తుడయ్యాడని అయ్యో పాపం అనుకున్నాను. ఇంతలోనే మళ్ళీ నా అప్పుగురించి ఆలోచిస్తున్నాను. ఇదేనా స్నేహితుడిగా నా ధర్మం.!?

ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పెట్టి వాళ్ళింటికి బయలుదేరాను.

"రండి అంకుల్. అమెరికానుండి ఎప్పుడొచ్చారు?"

"వారమైంది మనోహర్. ఇల్లు సర్దుకోవడంలోనే టైమ్ గడిచిపోయింది. ఇంకో రెండురోజులాగి మీ యింటికి వద్దామనుకున్నాను. ఈలోగా పేపర్లో వార్త చూసి వచ్చేశాను."

మనోహర్ భార్య మంచి నీళ్ళందించి మాటలు కలిపింది.

"నెల్రక్రితం వరకు అంతా బాగుంది అంకుల్. ఒకరోజు లేవడం లేట్‌గా లేచారు. ఆ తర్వాత అలా డల్‌గా మౌనంగా ఉండడం మొదలైంది. డాక్టర్లకి చూపిస్తే అల్జీమర్స్ వచ్చింది. మతిమరుపు మరి తగ్గే ప్రసక్తి లేదు" అని చెప్పారు.

"అదేంటమ్మా. మతిమరుపు వ్యాధి అయితే రానానూ తీవ్రమౌతుంది కదా అలా ఒక్క ఉదుటున వచ్చేస్తుందా? నేను వెళ్ళేముందు వరకూ బాగానే ఉన్నాడు. చక్కగా నాకోసం ఏం తెస్తావోయ్ అమెరికా నుండి అంటూ నన్ను సాగనంపాడు."

"మన ఖర్మ అంకుల్. కొంతమందికి అలా అవుతుందట. ఉండండి కాఫీ తెస్తాను."

ఈలోగా మనోహర్ అందుకుంటూ చెప్పాడు "నేను ఆఫీసుకి బయల్దేరతానంకుల్. నాన్నగారు నిద్రపోతున్నారు. లేచాక మాట్లాడి లంచ్ చేసి వెళ్ళండి"

సరేనంటూ పేపర్లో తల దూర్చాను.

నేనెప్పుడు వచ్చినా మూర్తి ఫ్రెష్‌గా ఉండి నన్నాహ్వానించేవాడు. మధ్య మధ్యలో కొడుకూ, కోడలూ, పిల్లలూ నన్ను విష్ చేస్తుండేవారు. మాటల్లో పడినా, కేరమ్స్ ఆటలో పడినా మాకు టైం తెలిసేదికాదు. లంచ్‌కో, డిన్నర్‌కో పిలిచినప్పుడు లేవటమే. ఇలా వాడిని నిద్రపోతూ చూడడమే అరుదు. ఎలాటి మనిషి ఎలా అయిపోయాడు.!!

"మామయ్యా! ఎవరొచ్చారో చూడండి" మనోహర్ భార్య మూర్తిని తీసుకుని వస్తూ చెప్పింది.

అభావంగా నావైపు చూస్తూ "నమస్కారం. ఎవరు బాబు మీరు?" మూర్తి అడిగాడు.

నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "నేను మూర్తీ, నీ ఫ్రెండ్ జగన్నాధాన్ని. చిన్నప్పటినుండీ కలిసిపెరిగాం మర్చిపోయావా?"

మూర్తి మొహంలో మెరుపు కనపడింది.

"ఓరి జగన్నాధం నువ్వట్రా. ఈ రోజు కాలేజీకి వెళ్ళలేదా? సునంద ఎలా ఉంది?" మూర్తి వాక్ప్రవాహం మొదలైంది. నా అయోమయం పీక్స్‌లో ఉంది.

నా పరిస్థితి అర్థం చేసుకున్నట్టు మనోహర్ భార్య చెప్పింది "అల్జీమర్స్‌లో కొన్ని రిమోట్ జ్ఞాపకాలు గుర్తుంటాయట అంకుల్. ప్రస్తుతం మామయ్య కాలేజ్ డేస్‌కి వెళ్ళినట్టున్నారు. ఇంతకీ సునంద ఎవరంకుల్?"

ఈ అమ్మాయి క్యూరియాసిటీ తగలెయ్య అనుకుంటూ "వాడి క్రష్ లేమ్మా. మా కాలేజీలో ఉండేది. ఆ వంకన నాతో కాలేజీకి వస్తుండేవాడు."

"సరిపోయిందంకుల్. అత్తగారున్నప్పుడు ఈ సంగతి మాట్లాడాల్సింది."

వాతావరణం తేలికైంది. ఆ అమ్మాయి, పిల్లలూ అలవాటు పడినట్టున్నారు. మూర్తిని సంరక్షణగా చూసుకుంటున్నట్టు అనిపించింది.

"ఈ వెధవకి సునంద గుర్తొచ్చినట్టు నాకివ్వాల్సిన బాకీ గుర్తొస్తే బాగుణ్ణు" అనుకున్నాను.

వాడితో కాసేపు క్యారమ్స్ ఆడాను. తేరిపారా చూస్తే వాడి మొహం ఎంతో ప్రశాంతంగా ఉంది. ఏ బాదరా, బందీలేని చిన్నపిల్లవాడిలా అనిపించింది. భార్యా విహీనుడయినప్పటినుండీ మొహంలో తాండవించిన దిగులులాంటివి చేత్తో తీసేసినట్టు మాయమయ్యాయి.

ఎప్పుడూ అంటూండేవాడు అంతా మన మంచికే అంటూ. ఓ రకంగా చూస్తే ఇదీ మంచిదేనేమో? లేకపోతే తుదకంటూ దిగులు బరువు మోసేవాడు.

మనోహర్ ఆఫీసునుండి రాగనే, నేను మళ్ళీ రేపొస్తానంటూ బయల్దేరాను.

"ఒక్క నిమిషం అంకుల్" అంటూ బ్యాగ్‌లోంచి డబ్బున్న కవర్ తీసి నాకందించాడు.

నా ఆశ్చర్యంలో నేనుండగానే చెప్పాడు. "నాన్నగారు ఎవరిదగ్గర అప్పు తీసుకున్నా అంతమేరకు ఒక పోస్ట్ డేటెడ్ చెక్ వ్రాసి ఉంచేస్తారు. అది ఆయన అలవాటు. అయితే సంతకం చెయ్యరు. బాకీ తీర్చేయగానే చింపేస్తారు. ఆయన చెక్‌బుక్ చూస్తే మీ పేరుతో లక్షరూపాయలకు వ్రాసి ఉంది మీకేమైనా అవసరం పడొచ్చని డ్రా చేసి తెచ్చాను."

మూర్తివైపు తిరిగి బై చెప్పాను.

"ఏం. కాలేజీకేనా?" అంటూ అడిగాడు.

"కాదు. ఇంటికి రేపు కాలేజికి కలిసి వెళ్దాం. సునంద కూడా వస్తానంది" కన్నుకొట్టి చెప్పాను.

మనోహర్ బుర్రగోక్కున్నాడు.

మనోహర్ భార్య నవ్వుకుంది.

# గ్రాండ్ స్లామ్ ఉణుదుర్తి శ్రీనివాసు

"టూ స్పేడ్స్"--- ప్రభు, అలవాటు ప్రకారం--- ఫోర్సింగ్ బిడ్!! నా దగ్గర పాయింట్లున్నా లేకపోయినా రెస్పాండవ్వాలి, లేక పోతే పోష్టు ప్లే ఎనాలిసిస్ లో యుద్ధం తప్పదు. నేను నార్త్, ప్రభు సౌత్. ఎర్రగా నల్లగా కొంచెం కార్డ్సులెంగ్తు కనిపిస్తే చాలు ఉద్రేకపడిపోతాడు. ఈష్టు సుబ్బారావు బ్లాంక్ ఫేసుతో "పాస్ ". తొణకడు మొఖంలో ఫీలింగ్సు తెలియవు, పోకర్ ఫేసు. మూడు ముక్కలాటలో బాగా రాణించును. బాగా ఆలోచించి గాని యే పనీ చెయ్యడు,ఆఖరికి మందు కొట్టడంలో కూడా!! ఆలోచించి ఆలోచించి ఓ సిప్పు తీసుకుంటాడు.ఈ అయిదారు సంవత్సరాలలో మా సెకండు రౌండుకెప్పుడూ వెనకే ఉంటాడు.

నా మటుకు నేను కన్సర్వేటివ్ బిడ్డర్నే .

ఎనస్తటిస్ట్ యెప్పుడూ సేఫ్టీ ఫస్ట్ పద్ధతే,పేషంటుని ప్రాణాలతో బయట పడేయాలి. అదే ఫస్ట్ ప్రయారిటీ. ప్రభు టూ స్పేడ్స్.... కనీసం పంతొమ్మిది హైకార్డు పాయింట్స్ విత్ అయిదు స్పేదు కార్డ్స్.

నా దగ్గర రెండు స్పేడు బిట్ కార్డ్స్,ఓ క్లబ్బు జాకీ ,ఓ రాణీన్నూ.....

డినయాలైనా ఇవ్వాలి. “నో ట్రంప్... ”. అర్థం చేసుకున్నాడు.

మధ్యన వెష్టు కులకర్ణి “డబుల్”.మహా దిట్టవైన వాడు పైకి తేలడు.

త్రీ స్పేడ్స్ డబుల్స్ దగ్గర సెటిలయ్యాం.ఆటమొదలయ్యింది.....వన్ ఓ.టి...బోణీ బాగానే వుంది రబ్బరు మాదే.

నా భార్య, పిల్లల దగ్గరకెళ్ళడంతో నేనొక్కడ్నే వున్నాను. శనివారం,వీకెండు కావడంతో డిన్నర్ విత్ డ్రింక్సు. అడ్డా మా ఇల్లే !!!

ప్రభు, సుబ్బారావు,కులకర్ణి. నలుగురం మధ్యవయస్కులం. బ్రిడ్జి, లిక్కరు, సాహిత్యం, పాత హిందీ సినిమా పాటలు, ముఖ్యంగా సైగల్---కామన్ ఇంట్రెస్ట్సు.అంతో,యింతో మంచి ఉద్యోగాలు. మంచి సంపాదన ....నా డాక్టరు పొజిషన్ కొంచెం పైమెట్టయినా తక్కిన వాళ్ళతో కంపాటిబిలిటీ బాగానే వుంది. సుబ్బారావు ఆడిటరు, కులకర్ణి సైంటిష్టు, ప్రభు మెకానికల్ యింజినీరు. నెలకోసారి గెట్టుగెదర్. డిన్నర్ అండ్ బ్రిడ్జ్ . నో స్టేక్స్.

డ్రింక్స్---? ప్రొవైడెడ్--- అడ్డా దొరకాలి,లేపోతే ఓన్లీ బ్రిడ్జి అండ్ డిన్నర్ .

అవేళ వేగిరంగానే, సాయంత్రం ఏడున్నరకే మా పూజ మొదలు పెట్టేశాం. వంటవాడు రొట్టెలు చేసేసి హాట్ కేసులో పెట్టేశాడు. కూరేంచేసాడో..తిన్నప్పుడు తెలుస్తుంది.. నేను చెప్పకుండానే సొంత తెలివితో పకోడీలు, అప్పడాలూ వేయించి, కొంచెం జీడిపప్పు కూడా రెడీ చేసేశాడు,

సారు ఒక్కరే వున్నారు, అమ్మగారువూళ్ళోలేరు,పైగా శనివారం ...కార్యక్రమం వాడికి బాగా తెలుసు.

బ్రిడ్జి ఆడుతున్నానే, కానీ ఆట మీద దృష్టి కుదరటం లేదు.

సైకియాట్రిస్టవ్వుదామనుకొన్నఎనస్థటిష్టుని---యివాళ థియేటర్లో స్ప్లిట్ పెర్సనాలిటీస్ గురించి టాపిక్ వచ్చింది. రెచ్చిపోయాను ప్రతి మనిషికీ రెండుపార్శ్వాలుంటాయ్.

పైకి కనిపించేదొకటి,లోపలుంకోటీ. బొమ్మా,బొరుసూలాగ. ఏది ఎప్పుడు పై చెయ్యిగా ఉంటుందో, మనిషి తనకు తెలియకుండానే తన వ్యక్తిత్వాన్ని దాంతో ముడి పెట్టుకుంటాడు.

ఆ వ్యక్తిత్వం పైచెయ్యి ఉన్నంతకాలం అదే బహిర్గతమౌతూ వుంటుంది. ఆబ్సెషన్లా ప్రతిబింబిస్తుంది. కొంతమంది తమ ఊహాజనితమైన వ్యక్తిత్వాన్ని ఆపాదించుకొని, దాని డామినేషన్ కి లోబడి పోయి ఆ వ్యక్తిత్వం లోనే, జీవించడానికి అలవాటు పడిపోతారు.

ఆ సంకెళ్లు విడిపించుకోవడం చాలా కష్టం ..అసాధ్యం అంటే అతిశయోక్తి కాదేమో.

పేకాట ఓ రౌండయ్యింది. టైం టు స్టార్ట్ డ్రింక్స్. ఫస్ట్ రౌండ్ డ్రింక్స్ తేవడానికి లోపలికి వెళ్ళాను. టీచర్ విస్కీ ,సోడా, ఐసు క్యూబ్స్ ,మంచింగ్ మెటీరియల్ ...వంటవాడు రెడీగా పెట్టాడుగా..!!!.

సుబ్బారావుకి పెద్ద పెగ్గు, చిన్న సోడా ఎందుకంటే స్లోగా తాగుతాడు. హి ఈజ్ వెరీస్లో...!యునో...! బ్రిడ్జిలో కూడా స్లోవే. మాతో సమంగా కిక్కు రావాలంటే డ్రింకు స్ట్రాంగ్ గా ఉండాలి.రెండు పెగ్గులు లిమిట్ దాటడెప్పుడూ !!!

కులకర్ణి మామ్మూలు పెగ్గే. బట్ ..నో ఐస్.. ఆన్ ద రాక్స్ ..నీట్!!! అంతా వెస్టర్న్ కల్చర్..లిమిట్టా..?డిపెండ్స్ ఆన్ ది కంపెనీ ..?

నేనూ, సుబ్బారావూ సామాన్య మానవులం..ఆమ్ ఆద్మీ...మొదటిది ఒక లార్జ్ విత్ సోడా... ప్లెంటీ ఆఫ్ ఐస్. రెండోది స్మాల్ అండ్ సోడా అప్ టు ది బ్రిమ్ , లోడెడ్ విత్ ఐస్. మూడోదుంటే సెకండ్ రౌండ్ రిపీటే !!

ఎవ్వళ్ళూ రెండు పెగ్గులకి మించరు,తాగి పడిపోరు....!

సుబ్బారావడిగాడు "ఏంటి డాక్టరుగారూ మూడ్ ఆఫ్ లో వున్నట్టున్నారు,ఇప్పటి దాకా ఓకథ లేదు , ఓ జోకు లేదు...! ఏదయినా సైకాలజీప్రాబ్లమా,ఎనస్తీషియాకాంప్లికేషనా...?."

అందరికీ నా యిష్టాలు తెలుసు. సైకాలజీ అంటే నాలోని సైకియాట్రిస్ట్ గురించన్నమాట.

“అవును సుబ్బారావ్ ...!” ఓ గల్ఫ్ తీసుకుంటూ

“అన్నయ్య గురించి తెలుసు కదూ?!!”

“ఆ టీచరుగారేనా.... ఒక్కడే కొడుకు...?”

“యెస్ ..!! వాడి తోటే సమస్య. యేదో పనికిరాని సబ్జెక్టు, డబ్బులురాని స్పెషాలిటీ, రీసెర్చి, పొర్చుగల్లు,స్పెయినూ,లవ్వూ,కులాంతర వివాహం ...చాలా క్వాలిఫికేషన్సున్నాయిలెండి. గానీ తెలివితేటలు డబ్బునివ్వవుకదా!! మన తెలివిని ఇన్వెష్టు చేయాలి, కేష్ చేసుకోవాలి. లేపోతే విపరీతమైన తెలివి వికటిస్తుంది.”

చిన్న వర్షం పెద్దదిగా మారుతోంది.

“కోజీ వెదరు, యింటలెక్చువల్ కంపెనీ, కార్డ్స్ ఆన్ ది టేబుల్ విత్ డ్రింక్ ఇన్ హాండ్. కథకి సరిపడ్డా ఎంబియన్సు.మరి మొదలెట్టండి” అన్నాడు కులకర్ణి

సుబ్బారావింకా రెండో సిప్పు తీసుకోలేదు. సిగరెట్టు కాల్చాలని మహా కోరిగ్గా వుండెను, కానీ యీ మధ్య సిగరెట్టు వాసన పడటం లేదు. కిటికీ తలుపు బాగా తెరిచి తడి మట్టి వాసనని, తుప్పర్లతో కూడిన చల్లగాలినీ ఎంజాయ్ చేసి, ఇంకో గల్పు ...

“వాడికి యీమధ్య సీక్రెట్ ఏజెంటుగా “రా” లోనో, మరెందులోనో వుద్యోగమయ్యింది, చాలా రోజులయి దాన్లోనేనట జాబు. ఎవళకీ చెప్పలేదు. ఆమధ్య ఎవరో వీణ్ణి వాటర్ ఫాల్స్ దగ్గర ఎటాక్ చేసి తాళ్లతో కట్టేసి పారిపోయారుట. మోటారు సైకిల్ని పెట్రోలు పోసి కాల్చేశారట. వీడెలాగో ప్రాణాలతో బయట పడ్డాడు. ఆస్పత్రిలోఎడ్మిటయి ఇంటికి ఫోను చేసాడుట. అన్నయ్య ఫోను చేసి చెప్పాడు. దీంతో అందరికీ వర్రీ,ఆందోళన, బెంగానూ!!!”
“ఇదివరకు కూడా యిలాగే ఏదో అయిందని చెప్పారే ...”

"అవును అప్పుడు వీడి వుద్యోగం గురించి నాకు తెలియదు..!!"

"సరే...ఆ సంగతి వదిలేయండి. లెట్స్ గెట్ ఆన్ విద్దగేమ్. పూజ కి విఘ్నం రాకూడదు."

సెకండ్ రౌండ్ డ్రింక్స్.... అండ్ కార్డ్స్..... బిడ్,మళ్ళీ సౌత్స్ టర్న్ .

★★ ★★ ★★ ★★ ★★

ఆ సాయంత్రం తరువాత చాలా కాలానిగ్గాని మేం తీరికగా కూర్చోడానికి వీలుపడ లేదు. నాలుగు నెలల పైనే!! చలికాలం, మళ్ళీ మా ఆవిడ క్రిష్టమస్ శలవలకి పిల్లల దగ్గరకు.. మళ్ళీ శనివారం సాయంత్రం...వర్షంలేదు.చలికాలం! స్వెట్టర్లు, మంకీటోపీలు, విస్కీ, చికెనూ, జీడిపప్పూ.! రమ్మువుంటే బాగుంటుందని కులకర్ణి గొణిగాడు కానీ మెజారిటీ వోటు విస్కీకే .

కార్డ్స్ పంచకుండానే, "గురూగారూ. కిందటిసారి అన్నయ్యగారి అబ్బాయి గురించి చెప్పడం మధ్య లో ఆపేశారు. ఇవ్వాళ పూర్తి చేసేయండి"...ప్రభూ రిక్వెష్ట్ .మిగతా యిద్దరూ అవునవునని సపోర్టు.

వాళ్లకు తెలియదు గాని ఈ నాలుగు నెలల్లో చాలా విషయాలు జరిగాయ్. దీపుగాడేదో హడావుడి చెయ్యడం, ఆస్పత్రీ,ఆందోళనా,కుటుంబమందరికీ టెన్షనూను.

ఆవేళ బొంబాయిలో టెర్రరిష్టు ఎటాక్ లైవ్ టెలికాస్ట్ చూస్తున్నాం నేను,తనూ. ఫోను మోగింది

"..దీపూ!!."

"ఏవిరోయ్!!ఎక్కడనుండి..?బావున్నావా...?"అడిగాను.

"బాగానే వున్నాను బాబాయ్. కానీ ఎక్కడున్నానో అడక్కు.. నా వుద్యోగం తెలుసు కదా !!టీవీ చూస్తూండుంటావ్ ...ఊహించుకో..!? పిన్ని ఎలా వుంది. ఈమారు మీ దగ్గర కనీసం రెండు రోజులైనా గడపాలి. ..బతికుంటే..!!!"

"అవేం మాటలురా! యూ ఆర్ వెల్కమ్ .రెండ్రోజులు కాపోతే నాల్రోజులుండు. నీ ఆరోగ్యంజాగ్రత్తసుమా ..!!"

మా యిద్దరికీ నిజంగా చాలా ఆందోళన. అన్నయ్య కి వెంటనే ఫోను చేశాను. దీపూ గురించి ఏదో యాదాలాపంగా అడిగినట్టు అడిగాను, "ఎలా వున్నాడు" అని.

తాను పెద్ద ఆందోళనపడుతున్నట్టుగాఅనిపించలేదు. వదినెగారు కూడా!!. మనవలు,కోడళ్ల కబుర్లు.అస్సలు ఆదుర్దా పడుతున్నట్టనిపించలేద .ఓ విధంగా వాళ్లకి ఆందోళన లేకపోవడం నన్ను నిరుత్సాహపరిచింది. మంచి కబురు అంటే జెలసీ ఒక్కటే నిరుత్సాహానికి కారణం కాదు అని అవ్వాళ నాకు తెలిసింది. యితరుల విషయాల్లో కొన్ని మంచి వార్తలు కూడా నిరుత్సాహపరచడం ...వెల్! నాగరికత కాదేమో!! ఎవరైనా చనిపోయారో లేక జబ్బుగా వున్నారో అన్న వార్త ఉత్సాహం కలిగించడం..ఓ పుట్టుక ఓపెళ్ళి యింకేదేనా శుభవార్త విచారం కలిగించడం... ద్వేషాన్ని సూచిస్తుంది. ఇప్పుడు మాత్రం నా నిరుత్సాహం ద్వేషం కాదు. కుతూహలం అనొచ్చు, అన్నయ్యకి ఆందోళన ఎందుకు లేదా ....!!?

కాకపోతే అన్నయ్య, " నీతో ఓ ముఖ్యమైన విషయం మాట్టాడాలి,త్వరలో వస్తాను" అనడం నా కుతూహలాన్ని రెట్టింపు చేసింది. తాను వచ్చినప్పుడే అడుగుదామనుకున్నాను కానీ ఒక ఆశ్చర్యకరమైన విషయం వినబోతున్నాని యే మాత్రం వూహించలేదు.

ఇంకో గల్పు తీసుకుమని నా మిత్రుల మొహాలు చూశాను. వాళ్ళు కూడా నిరుత్సాహపడ్డట్టు అనిపించింది,కొంచెం విసుగ్గా కూడా కనిపించారు. కొందరి కుతూహలాలు,ఇంకొందరికి విసుగేమో!!!అప్పటికి నా నెరేషన్ ఆపి బ్రిడ్జి లో పడ్డాం.

★★ ★★ ★★★ ★★

ఇది జరిగి ఏడాదయింది.పండుగ వెళ్లి కనుమ నాడు అన్నయ్య వచ్చాడు. అన్నయ్య వస్తున్నాడంటే అంతా సందడే!! నవ్వులూ,జోకులూ .అవలీలగా హాస్యం,అలవోకగా నిర్వచనాలూ,రిపార్టీలూ. .ఆయనొక్కడే పదిమంది పెట్టు మా ఆవిడ కూడా బావగారు వస్తున్నారంటే కొన్ని నిబంధనల్ని పక్కకు పెట్టేస్తుంది.

మధ్యాహ్నం భోజనాలప్పుడు"తమ్ముడూ సరుకుందా, తెచ్చుకోవాలా"అని సాయంత్రం కార్యక్రమం ఖరారు చేసేశాడు అన్నయ్య.

"ఎచ్చుఁ లేదు కానీ మనిద్దరికీ సరిపోతుందిలే" అనేశాను.

ఈవూరు రాక ముందరే నేను సిగరెట్లు మానేశానని కోప్పడ్డాడు. తనొచ్చినప్పుడు మరదలు యెదురుగా ఒక్కడూ సిగరెట్టు కాల్చడం మర్యాదగా వుండదుట. అందుకని ఆయన వచ్చినప్పుడు తనని "లోన్ స్మోకర్ని" చెయ్యొద్దని వార్నింగ్ యిచ్చాడు. ఆ విషయం ఇప్పటికీ తను దెప్పిపొడుస్తూ వుంటుంది. ఆ సమస్య లేకుండా కొత్త సంవత్సరం నాడు మళ్ళీ స్మోకింగ్ మొదలెట్టేశాను.

చీర్లు యేవీ లేకుండానే మొదలుపెట్టాం. మా ఆవిడ కూడా వేడి టొమాటో సూపు పట్టుకుని కూర్చుంది.

"చెప్పు" అన్నాను.దేని గురించో మాకూ, తనకీ తెలుసు.

"అసలు దీపూ గురించి మాట్లాడదామనే యిప్పుడు రావడం" అన్నాడు సిగరెట్టూ ముట్టిస్తూ

"ఆ విషయం నేను గ్రహించాను, ఏమైనా ఎక్కా ప్రమాదమా..?"

" వాడిక్కాదు..మాకు..!!" అన్నాడు. నిర్ఘాంత పోయాం

"నీకు తెలుసుగా నా ఫ్రెండు ఛత్రపతి ఎస్పీనుండి ఐ.జి అయ్యాడు. వాడితో చెప్పి కిందటిసారి వాటర్ఫాల్ దగ్గర ప్రమాదం గురించి ఎంక్వయిరీ చేయించాను. అంతా వట్టి అబద్ధమని తేలింది."

"అంటే...!? " నిజంగానే నాకు బోధపడలేదు.

మా ఆవిడ మొహం కూడా ప్రశ్నార్థకంగానే వుంది.

"అంటే యేవిఁటి ..? ఇంతకాలం మనందరం శుద్ధ వెర్రి వెధవలమయ్యాం. "

"మై గాడ్..మద్రాసులో కత్తిపోట్లూ ,కలకత్తా కిడ్నాపూ ....!?"

"'అన్నీ కల్పితాలే"

"మరి ఆపరేషన్లూ,హాస్పటల్ రిపోర్టులో...?"

"అన్నీ సృష్టి రా బ్రదర్...నమ్ముతూన్నవాడిని యింకొంచెం నమ్మించడం కష్టం కాదు. అందులోనూ సెంటిమెంటు నమ్మకాన్ని యింకా పెంచుతుంది. అంతెందుకూ నువ్వు తాజ్ హోటల్ అట్టాక్ గురించి ఫోను చేసినప్పుడు వాడు ఊళ్ళోనే, మా దగ్గరే వున్నాడు. నువ్వో ఇడియట్ లాగ కంగారు పడిపోయావ్. మనం యెంత ఫూల్ అవుతే అంత ఆనందం వాడికి. తమాషా ఏవిటంటే యివన్నీఅబద్ధాలని నేను నమ్ముతున్నాను, గాని తక్కిన వాళ్ళెవ్వరూ నమ్మటం లేదు వీడి కెప్పుడు ఏమౌతుందోనని బెంగ"గొంతుక జీర పోయింది.

గ్లాసులు మళ్ళీ నింపాను.

"అన్నయ్యా నువ్వేమీ బెంగ పెట్టుకోకు. మంచి సైకియాట్రీ స్పెషలిస్టుకి చూపిద్దాం" అన్నాను,మరేమిటనాలో తెలియక !!

"అదీ అయ్యింది. ఆయనకే పాఠాలు చెప్పాడు వీడు. నువ్వొకసారి, వాడితో మాట్లాడి వాడి సంగతి కనుక్కో. నీ సైకియాట్రీ జ్ఞానం, ఎనస్థీషియా అనుభవం ఉపయోగ పడతాయేమో!!!"

సరేనన్నానేగాని నామీద నాకే నమ్మకం లేకుండెను .రెండు నెలల తరువాత , ఆ వూళ్ళోనే వొక పెళ్ళికి వెళ్ళవలసి వచ్చింది.

దీపూ కూడా వూళ్ళోనే వున్నాడు.మాటల సందర్భంలో వాడి వుద్యోగం, వ్యాపారం యధాలాపంగా అడిగినట్టు వాకబు చేశాను. చాలా బాగుందన్నాడు. ప్రస్తుతం కారుందిట డ్రైవరుతో సహా!!! ఎప్పుడు కావాలంటే అప్పుడు వస్తుందిట. వర్కింగవర్స్ అనీ, ఐదు నుండి తొమ్మిదీ అనీ లేదుట. వెళ్ళిన్నాడు వెళ్లడం ..అంతా వీడిష్టం ..పనిబట్టి వుంటుందిట. కంప్యూటర్ మీదే సగం పనయిపోతుందిట .

"మరి జీతం "..?

"దానికేం ఫరవాలేదు, ఇంత నుండి యింత లోపున మన యిష్టమొచ్చినంత యెప్పుడు కావలిస్తే అప్పుడు తీసుకోవచ్చుట".

ఎంతో మాత్రం చెప్పలేదు. లెక్క మాత్రం ఖచ్చితంగా వుండాలిట. రసీదులూ,బిల్లులూ జాగ్రత్తగా వుంచాలిట. లావాదేవీలన్నీ కేష్ లోనేనట,టాక్సు ప్రాబ్లెమ్ లేకుండా వుండడానికి ! అంతా జేమ్సుబాండు స్టైలు... పిస్టలొక్కటే తక్కువ. అది కూడా తీసుకుందామనుకున్నాట్ట కానీ పర్మిషన్ యివ్వలేదుట. బతికించారనుకొన్నాను.. పిస్టలుంటే అదో ఎక్స్ట్రా డేంజరు మన పీకల మీదకి!!!. మధ్యలో ఫ్రాయిడు ,యంగు...,ఎముకల్లో జీన్సు, డి. ఎన్. ఎ. ల గురించి ముచ్చటించాడు. కులప్రవృత్తుల జీన్సు కొన్ని వందల సంవత్సరాల దాకా వుండి పోతాయిట. కార్బన్ స్టడీస్ ద్వారా ఒక మనిషి పూర్వీకులు యే వృత్తిలో వుండేవారో, యేం పనిచేశేవారో కనుక్కోవచ్చుట. రాముడి వంశస్తులు, కృష్ణుడి వంశస్తుల జాడ కూడా తీయవచ్చుట. ఎక్కడికక్కడ నాకు అవకాశం యివ్వకుండా వాడే మాట్లాడాడు. నా వుద్దేశ్యం కనిపెట్టేశాడనుకుంటాను .!!!

మొత్తానికి ఓ రెండు గంటలు వాడి మాటలు విని, మాట్లాడి(?) వట్టి చేతులతో వచ్చేశాను.

ఆ సాయంకాలం అన్నయ్య కి విషయం చెప్పి,పెళ్లి కి వెళ్లి అట్నుంచటే యిక్కడికి వచ్చేశాను.

తరువాత బేరీజు వేసి చూస్తే దీపూ మాటల్లో వాడీ,వేడీ తగ్గిందనిపించింది.

ఈ విషయాలేవీ నా మిత్రబృందానికి చెప్పలేదు. కుటుంబ విషయాలు యింకా బహిర్గతం చెయ్యాలనిపించలేదు.

పై వాళ్ళ కుటుంబ విషయాలంటే కుతూహలం వుండడం సహజం. నా బ్రిడ్జీ బృందం కూడా అలాగే. మరోసారి మా బ్రిడ్జి బిడ్డింగు మధ్య విరామంలో, సుబ్బారావు ఆలోచనలకి ఓ రూపం వచ్చిందనుకుంటా,

"మీ అన్నయ్య గారి దీపూ విషయంలో ఆ అబ్బాయి భార్య మాట ఎక్కడా చెప్పలేదు మీరు. ఆవిడకి మీకన్నాబాగా తెలియడానికి అవకాశం వుంటుంది కదా!కొన్ని విషయాలు మంచంలోనయినా బయటపడతాయి కదా!!."

దానికి సమాధానం చెప్పకుండా దాటవేస్కాను విస్కీ గుటక వేస్తున్న మిషతో.

ఆ అనుమానం నాక్కూడా వచ్చింది. ఆ అమ్మాయిని అడిగాను కూడా .

"ఈ విషయాలు మీ యింట్లో మామ్మూలేనట కదా అంకుల్"అంది. అవాక్కయ్యాను.

మా ఫేమిలీలో మతిస్థిమితం (లేని) కేసులు ప్రతీ జనరేషన్ లోను ఒకటోరెండుండం నిజవేను!! తేనెతుట్టనెందుకు కదపడమని వూరుకున్నాను. అప్పటికే నాకో అభిప్రాయం యేర్పడడం మొదలయ్యింది.

"సరేలెండి. కొన్ని కుటుంబ సమస్యలు అందరికీ చెప్పకూడదు. నేనర్థం చేసుకున్నాను, కానీ యీ కథనం మాత్రం విషాదాంతం చెయ్యకండి సుమా" అన్నాడు మా థింకర్ సుబ్బారావు

"మనకిష్టమైన వాళ్ళ జీవితాలన్నీ కథల్లాగానే వుంటాయ్, మై డియర్ సోక్రటీస్ !"

"పోతే నిజ జీవితాల్లో ఆ ట్రాజడీలకి ప్రాముఖ్యత వుండదు. నవలల్లో, కథల్లో చదువుకోడానికి బాగుంటాయి. కొంతమంది జీవితాల్లో, కొద్దిమందికి ఫులుస్టాపు పడేది జీవితం పూర్తయ్యాకే ! అందాకా కామాలు పెట్టుకుంటూ పోవడమేను....!"

"అంటే మీ వుద్దేశం ..?"అప్పటి దాకా కులకర్ణి ఇందులో కలుగ చేసుకోలేదు,కానీ జాగ్రత్తగానే ఫాలో అవుతున్నాడన్నమాట. నా నేరేషన్ అతనిక్కూడా కుతూహలం కలిగించిందన్నమాట.

'మరేం... యింకో రెండు కామాలున్నాయ్.'

"జ్యోతిష్యమా!?,యింద్రజాలమా..? , సిక్సు సెన్సా!!!?"

"అవేమీ కావు. ప్యూర్ లాజిక్ ఎండ్ ఎనాలిసిస్ "

"వాడు (దీపు) ఈమధ్య చాలా మట్టుకు మారాడు . తరుచూ నాతొ ఫోన్లో మాట్లాడుతున్నాడు".

రెండు జనరేషన్స్ మధ్య వారధి లాంటి వాణ్ని నేను. నాతో చనువుగా వుంటారు. డబ్బుకిబ్బంది పడుతున్నాడేమోననిపిస్తోంది. ఆ మధ్యనోసారి నాతో బీరు తాగాడు కానీ వాడి మొహం లో చిన్నబుచ్చుకుంటున్నట్టు, యిన్ఫీరియారిటీ కాంప్లెక్సు వున్నట్టూ అనిపించింది.

"ఈ మధ్య ఉషారుగా ఉండటం లేదు బాబాయ్".

ఏంటి సంగతనడిగాను.

"యీ వుద్యోగం చికాగ్గా వుంది.ఏదయినా స్థిరవైన వుద్యోగం చూసుకోవాలనిపిస్తోంది బాబాయ్"" అన్నాడు.

పోన్లే, ఇన్నాళ్ళకి వాడి నోట ఓ సెన్సిబుల్ మాట విన్నాననుకున్నాను

★★★★★ ★★★★★ ★★★★

రాత్రి తొమ్మిది దాటింది.ఎవరో వచ్చినట్టు చప్పుడయింది. వీధి తలుపు తీశాను .

" దీపూ"...వాడికి షాకులివ్వడం అలవాటు యింకా పోలేదు. .

"ఏంటి బాబాయ్, సెషన్లో వున్నట్టున్నారు .పిన్ని వూళ్ళో లేదా?!!"

"నీ అసాధ్యం బంగారంగానూ, పోల్చేశావ్!! దా...నా స్నేహితుల్ని పరిచయం చేస్తాను " .

"ప్రభు ,కుల్కర్ణి ,సుబ్బారావ్"

"వీడు మా అన్నయ్య కొడుకు దీపాంకర్"

" నౌ ..చీర్స్ " ఫార్మాలిటీసయ్యాయ్.

పరిచయాలయ్యాక "ఓ గుటకేసి శుభ్రం అయి రా! అలసట తీరుతుంది. మా కంపెనీ తో ఓ పెగ్గు వెయ్యి తరువాత కొంచెం సేపట్లో భోజనం చేద్దాం " .

"ఈ అబ్బాయి ......?"ముగ్గురూ కుతూహలం ఆపుకోలేకపోతున్నారు.

"నా నేరేషన్లోని హీరోయే"

"క్వయిట్ ఎ హ్యాండ్సమ్ గై " కుల్కర్ణి ,

"'యస్ ,ఇంటెలిజెంట్ లుక్స్... "

"కటిట్ ...యార్"సుబ్బారావ్,

"ఎవరేమనుకుంటున్నారోగానీ... హి ఏడెడ్ కిక్"

విస్కీ ప్రభావం చూపిస్తోంది. వాళ్ళని వార్న్ చేశాను వీడికి ఆవులిస్తే పేగుల్లెఖ్ఖపెట్టే టేలంటుందని..

"కావలిస్తే పెగ్గుల్ని లెఖ్ఖ పెట్టుకోమను... పేగుల్ని కాదు" తన విట్టుకి తనే ఆనందిస్తున్నాడు సుబ్బారావు. ఎందుకయినా మంచిదని నాలుగు నిమ్మ బద్దలు కోసి పట్టుకొచ్చాను ..,నాలిక్కి రాసుకుంటే సైకలాజికల్ గా కిక్కు తగ్గి మాట నిమ్మళంగా వస్తుంది. స్నానం పూర్తి చేసుకొని, షరాయి లాల్చీలో ..దీపూ నిజంగా హీరోలానే వున్నాడు.

"ఓ స్మాల్ విత్ సోడా చాలు బాబాయ్, ఐసుందా ..!? ఓ నాలుగు క్యూబ్స్ పడేయ్".

ప్రస్తుతం ఆర్కియాలజీ డిపార్టుమెంటులో డెప్యూటీ డైరెక్టరుగా వున్నాడు.ఈ చుట్టుపక్కల ఎస్కవేషన్ పనులేవో వున్నాయి, ఓ వారం దాకా వుండాలిట. మా బ్రిడ్జి బృందంతో కబుర్లు మొదలుపెట్టాడు. వాడి ఫేవరేట్ సబ్జెక్టు(నాక్కూడా) డేనీ కెయిను "ఏలియన్స్ ఎండ్ స్టార్ వార్స్". కొన్ని వేల సంవత్సరాల క్రితం యింకో గ్రహం నుండి గ్రహాంతర వాసులు, తాము జీవించడానికి అనుగుణంగా వుండే వాతావరణాన్ని వెతుక్కుంటూ, మన భూమి మీద వాతావరణం వాళ్ళు జీవించడానికి సరిపోతుందని నిశ్చయించి మన భూగ్రహం (ఎర్త్)మీద దిగారనీ ,అప్పటికే భూమిమీద జనజీవనం వుండేదనీ ,ఆ ప్రజలకి కొత్త ఆధునిక నాగరికత నేర్పించి వెళ్ళిపోయి, మళ్ళీ మళ్ళీ వచ్చి నాగరికత అభివృద్ధి చేశారనీ డేనీకైన్ మహాశయుడు కొన్ని గ్రంథాలు, ఫోటోల సహితంగా ప్రచురించాడ .ఆ థియరీని చాలామంది కొట్టిపారేశారు కానీ దాన్ని నమ్మినవాళ్ళూ వున్నారు. నమ్మినవాళ్లల్లో నేను,దీపూ వున్నాం . వాళ్లనే యిక్కడి మానవులు దేముళ్ళన్నారు. ఆ దేముళ్ళు వారి సంస్కృతి, విజ్ఞానం, సంతానం భూమి మీద వదిలి వెళ్లారు .మనం పురాణాల్లో చదివిన కర్ణుడూ ,ధర్మరాజు ,పాండవులూ ఆ దేముళ్ళ సంతానమే అయ్యుండొచ్చు. కొండల మీద కోవెళ్ళు ,పిరమిడ్లు, విమానాలూ, పడవలు వాళ్ళు నేర్పించిన విజ్ఞానమే. పుష్పక విమానాలూ, విధ్వంసక అణ్వాస్త్రాలూ – బ్రహ్మాస్త్రం (ఆటంబాంబు), మోహినీఅస్త్రం (టియర్ గ్యాస్), వారుణాస్త్రం,( క్లౌడ్ సీడింగ్), యింకా ఎన్నెన్నో వాళ్ళ ఇ-విజ్ఞానమేనని నేను నమ్ముతాను. ఇప్పుడు ఈ కొండలలో అలాంటివే యేవో గుర్తులు వున్నట్లు శాటిలైట్ ఫోటోల్లో తెలిసిందిట. రాముల వారి దండకారణ్యవాసంలో (రాముల వారు కూడా ఆనాటి దేవుడే) కొన్ని నాగరికతా చిహ్నాలు వెళ్లి వుండ వచ్చుట. రాములవారు, సీతాదేవి అరణ్యవాసం లో సంతానం కలుగ కుండా ఏమి పద్ధతులు పాటించారు(?), ఈ అడవుల్లో చెట్ల చామల్లో, ఆకుల్లో,పళ్ళల్లో ఏమైనా గర్భ నిరోధక గుణాలున్నాయా?తదితర మెథడ్స్ అప్పటికే వాళ్లకు తెలుసా?ప్రస్తుతం మా వాడి ఇంటరెస్టు. ఈ విషయాలన్నీ వీడి స్వంత థియరీ.. అఫిషియల్ డ్యూటీ మాత్రం నిజం. ఈ కబుర్లన్నీ చెప్పి నా స్నేహితుల్ని మెప్పించి బాగా ఆకట్టుకున్నాడు. డిన్నరు చేసేసి వాళ్ళు ముగ్గురూ వెళ్లిపోయారు. వాడూ, నేనూ మిగిలాం. అప్పుడు బయట పడ్డాడు.

"చాలా థాంక్సు బాబాయ్. నా జీవితం యిప్పుడు హాయిగా వుంది. నాలో డాక్టరు జెకిల్ పోయాడు. నౌ ఐయామ్ మైసెల్ఫ్. డ్యూయాలిటీ నుండి విడుదలయ్యాను."

"మధ్యన నాకు థాంక్స్ ఎందుకురా? నువ్వు బాగుపడ్డావ్" అన్నాను.

"నేను యిలా భయంకర మానసిక స్థితి నుండి బయటపడడానికి నీ ప్రమేయం ఎంతుందో నాకు తెలిసి పోయింది. ఆ డిస్కుని ఇంకా దాచకు. నేను హాయిగా వున్నాను. అందర్నీ హాయిగా వుంచుతున్నాను. ఓ నూతన జన్మ . .... !"

కళ్లమ్మట నీళ్లు కనిపించాయి.

నాకూ కళ్ళు తడయ్యాయి. "చాలా సంతోషంరా నాన్నా..పడుకో,బాగా రాత్రయ్యింది.."

★★★★ ★★ ★★★★

చివరగా నా ప్రమేయమేమిటో చెప్పకపోతే కథ ముగియదు,ముడి విడదు. మన దేశం లో దేవత పూనడం,దెయ్యం పట్టడం విన్నాం, వింటున్నాం. భూత వైద్యులు ఈ పూనిన వాళ్ళని కొరడాలతో కొట్టడం, వేప మండలు, పొగలూ. ఈ పద్ధతుల గురించి వినడమే కానీ చూడడం తటస్థించలేదు. నమ్మకం లేక పోవడం ముఖ్య కారణం. ఆ మధ్య ఈ కార్యక్రమం చూడడం తటస్థించింది. ఎంత నమ్మకం లేకపోయినా, అసహ్యించుకున్నా, ఏదో కొంత ప్రయోజనం లేకపోతే ఈ ప్రక్రియ ఎందుకు జరుగుతోంది..? ఆలోచన మొదలయ్యింది. ఆ థియరీ బేసిస్ చేసుకుని, ఆ ప్రకారం వీడు నమ్ముతున్న ఆ జేమ్సుబాండ్ పర్సనాలిటీని, వాడికి బదులు మనమే హింసించి, భయపెడితే...!!! ఓ ప్రయత్నం చెయ్యడంలో తప్పులేదనిపించింది. మా అన్నయ్య ఫ్రెండు రిటైర్డు ఐజీ ఛత్రపతిగార్నీ, ఒక సీనియర్ సైకియాట్రిస్టుని సంప్రతించి, మొదట వీణ్ణి కిడ్నాపు చేశాం. ఆ సైకియాట్రిస్టుగారి నర్సింగుహోములోనే జైలు సీను సెట్టింగు మేనేజ్ చేసి, వీడి కాళ్ళూ, చేతులూ కట్టేసి థర్డ్ డిగ్రీ, సీక్రెట్ సర్వీస్ ఎలా ఉంటుందో నరకం చూపించారు ఛత్రపతి. ఓ లాయరు గారి సలహా మేరకు ఈ పద్ధతంతా ట్రీటుమెంట్ కోసమేనని, పేషంట్ మంచి కోసమేనని ఒక తెలిసిన నోటరీ దగ్గర సర్టిఫికెట్ తీసుకున్నాం. మొత్తం ప్రొసీజర్ వీడియో తీసాం.

ఆపని నేనే చేశాను. ఏదైనా జరగ కూడని ప్రాణాపాయం పరిస్థితి జరిగితే..నా సామగ్రి తో నేను రెడీగా వున్నాను. దెయ్యందిగింది.వాడు(దీపూ)బాగా భయపడిపోయాడు . ఆ జోలికి జీవితంలో పోనన్నాడు. నిజం తెలిసింది. రెండో వ్యక్తిత్వం తప్పుకుంది.

నెల్లాళ్ళ ట్రీట్మెంటు తో దీపూ మామ్మూలు మనిషయ్యాడు. చాలా హింసించమేమోనని నాకు బాగా బాధ కలిగింది. అన్నయ్య అనుమతితోనే యీ యిదంతా జరిగింది.

ఆ సీడీ అన్నయ్యకిచ్చేశాను. ఇదీ కథ కాని నిజం.

నా జీవితంలో ఇదో మరచిపోలేని గ్రాండ్ స్లామ్ ...!!!!

# LMP బోడపాటి రమేష్

**రుక్మిణమ్మ కాపురాని కొచ్చింది.**

ఆవిడ భర్త మాధవయ్య ఆ వూళ్ళో బాగా స్థితిమంతుడు. చెరువు కింద భూములు. పంటలు బాగానే పండుతాయి.

రుక్మిణమ్మ అదృష్టవంతురాలనుకున్నారు పుట్టింటివాళ్ళు.చాలా అణకువగా అత్త వారింట్లో మసలుకునేది. అత్త సీతమ్మ కూడా కోడల్ని బాగానే చూసుకునేది. కాపురానికొచ్చిన కోడల్ని ' త్వరలోనే మనవణ్ణివ్వమని' దీవించింది.

రుక్మిణమ్మ సిగ్గుల మొగ్గే అయింది. మాధవయ్య ముసిముసిగా నవ్వుకున్నాడు.

"ఏమిటమ్మాయ్ అన్నం సరిగా తినటం లేదు." అనడిగింది సీతమ్మ, ఒక రోజు కోడల్ని.

"బాగానే తింటున్నా నత్తయ్యా" అన్నది రుక్మిణమ్మ.

"పిల్లల్ని కని పెంచే వయసులో సుష్టుగా తింటే కానీ పుట్టే పిల్లలు ధృఢంగా ఉండరు." అన్నది సీతమ్మ.

అవున్నట్లు తలూపింది కోడలు.

రెండు మూడు రోజులు గడిచినా రుక్మిణమ్మ ఆహారంలో మార్పు కనబడలేదు. మనిషి నీరసించినట్లుగా ముఖ కవళికలు చెపుతున్నాయి.

సీతమ్మకు ఏదో అనుమానం పొడసూపింది. అదేదో రూఢి చేసుకుంటే గాని స్థిమితం ఉండదనుకుని,

"అవునమ్మాయీ ఈమధ్య నువ్వు వాకిట చేరినట్లు లేదు." అన్నది.

ఇప్పుడు రుక్మిణమ్మ అనుమానంలో పడింది. అవునన్నట్లు తలూపింది.

ఆ వూళ్ళో ఉన్న మంత్రసాని దగ్గరకు ఆ సాయంత్రమే ఇద్దరూ వెళ్ళారు. ఆవిడ పరీక్షలు చేసి 'మీరు నాయనమ్మ అవబోతున్నార'ని నవ్వేసింది.

"ఒరేయ్ మాధవా ఆగరా" అన్నది ఆ సాయంత్రం ఇంట్లోకి వస్తున్న కొడుకును చూస్తూనే.

"ఏమిటమ్మా?"

" మీ ఆవిడ ఒంట్లో బాగుండటం లేదురా"

"అయితే ఆచార్లు గారిని అడిగి మందు పట్టుకొస్తాను."

"ఒరేయ్ ఇది మందుల్తో తగ్గే రోగం కాదురా."

"ఏమిటమ్మా విషయం చెప్పవు. సర్లే. నువ్వూ,తనూ చూసుకోండి. మధ్యలో నాకెందుకు" ఉడుక్కున్నాడు, మాధవయ్య.

"ఓరి భడవా నేను నాయనమ్మను అవుతున్నానురా "అన్నది.

మాధవయ్య కళ్ళు మిలమిలా మెరిశాయి.నిజమా అనుకున్నాడు ఒక్క క్షణం. వెంటనే పరుగుపరుగున భార్య పడుకున్న గదిలోకి వెళ్ళాడు.

భర్తను చూస్తూనే ఆమె లేవబోయింది.

"అమ్మ చెప్పింది నిజమేనా!?"

అవునంటూ సిగ్గు పడిపోయింది రుక్మిణమ్మ.

★ ★ ★

సరోజ భర్తను ఆఫీసుకు పంపి ముందు గది తలుపు వేసుకుంది.

'అమ్మో నానేసిన బట్టలు చాలా ఉన్నాయి 'అనుకుంటూ బట్టల బకెట్ తీసుకుని బావి దగ్గరకు వెళ్ళింది.

భర్త శేషగిరి ఆ వూళ్ళో ఒక ఆఫీసులో గుమాస్తా. అతని తల్లిదండ్రులు తమ సొంతవూళ్ళో వ్యవసాయం చేసుకుంటూ ఉండటంతో, వీళ్ళ దగ్గరకు అప్పుడప్పుడు వచ్చి వెళుతూ ఉంటారు. సరోజ తల్లిదండ్రులు కూడా వేరే వూళ్ళో ఉండటంతో ఇంట్లో వీళ్ళిద్దరే ఉంటారు.

అమ్మా వాళ్ళ దగ్గరనుండి ఉత్తరం వచ్చి చాలా రోజులయ్యింది అనుకుంది సరోజ నూతిలో చేద వేస్తూ. తనీమధ్య వాళ్ళకు ఉత్తరం రాయనట్లుగా ఉందని కూడా అనుకుంది.

నీళ్ళు నిండిన చేద బావిలోంచి పైకి వస్తోంది. ఉన్నట్లుండి సరోజకు తల తిరిగినట్లయింది. ఒళ్ళు తూలుతోంది. తల పట్టుకుని చేద వదిలేసింది.

ఇంటావిడ రానే వచ్చింది 'అదేంటమ్మాయీ చేద మళ్ళీ బావిలో పడేసినట్లున్నావే' అంటూ.

"ఏంలేదు పిన్నిగారూ కాస్త ఒళ్ళు తూలినట్లయింది "అని సంజాయిషీ చెప్పుకుంది. ఆవిడ సణుక్కుంటూ ఇంట్లోకి వెళ్ళిపోయింది.

ఆ సాయంత్రమే డాక్టర్ దగ్గరకు వెళ్ళింది ఒక్కతే. ఆవిడ పరీక్ష చేసి మందులు రాసి తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పింది.

శేషగిరి ఇంటి కొచ్చేసరికి హుషారుగా భర్తకు ఎదురు వెళ్ళింది. అతని కిష్టమని చేసిన ఫలహారం అందించింది.

"ఏమిటి దేవిగారూ చాలా సంతోషంగా ఉన్నారు. మా వాళ్ళు ఇప్పట్లో రావటం లేదని ఉత్తరం రాసారా. లేక మీ వూరి కాకి ఏమయినా మనింటి మీద వాలిందా?" అన్నాడు నవ్వుతూ

. అదే ఇంకొక రోజయితే పోట్లాట మొదలయ్యేది. కానీ ఇవాళ "ఏమిటి విశేషం?" అన్నాడు.

"విశేషమే" అన్నది అంతకంటే గుంభనగా.

శేషగిరి ఆసక్తిగా భార్య ముఖంలోకి చూస్తున్నాడు.

"ఎవరూ వచ్చేది? ఉత్తరాలేవీ రాలేదన్నావు."

"ఇది ఉత్తరాల ద్వారా వచ్చేది కాదు."

"మరి?"

"ఛ. నేను చెప్పను బాబూ ఇదిగో మీరే చూసుకొండి " అంటూ డాక్టరిచ్చిన చీటీ చూపించింది.

విషయం తెలుసుకున్న శేషగిరి సంబరపడి పోయాడు.

"ఇంత మంచి వార్త చెప్పిన నిన్ను."

"నెమ్మది."

★ ★ ★

అనూషకు ఆ రోజు మొదటి రాత్రి.. వివాహం, రిసెప్షను కార్యక్రమాలు పూర్తయినాయి.

అవినాష్ కు ఎక్కువ రోజులు శలవు దొరకక పోవటంతో మర్నాడే వాళ్ళిద్దరూ వెళ్ళిపోవాలి, అతను ఉద్యోగం చేసే వూరికి.

ఇంట్లో పెద్ద ముత్తైదువులు ఆమెను అలంకరిస్తున్నారు. 'ఏమిటిదంతా!? 'అని సణుగుతోంది

'అంతేలేమ్మా ఇంక మేమెందుకు?' అన్నదొకావిడ..

ఆ మాటన్న వ్యక్తిని కొరకొరా చూసింది అనూష

"చాల్లే ఊరుకో. ఏమిటా దుడుకుతనం ఇలా అయితే ఆ అబ్బాయి ఊరుకోడు." అన్నది ఆమె తల్లి.

"ఊరుకోక ఏంచేస్తాడేం !?" రెట్టించింది అనూష.

"అది మీ అమ్మేం చెపుతుందే "అన్నది అనూష స్నేహితురాలు.

అందరూ గలగలా నవ్వుకున్నారు.

ఆమె గదిలోకి అడుగు పెట్టేసరికి అవినాష్ అసహనంగా అటూ ఇటూ తిరుగుతున్నాడు. చేతిలో సిగరెట్ అతనిలాగే ధుమధుమలాడుతోంది.

"చాలా సేపట్నుంచీ నా కోసం ఎదురు చూస్తున్నట్లున్నావే " అన్నది అనూష నవ్వుతూ.

"ఒక్కణ్ణే కూర్చుంటే విసుగు పుట్టదా మరి."

ఆమె నవ్వింది.

తనను దగ్గరకు తీసుకుంటున్న అతన్ని 'మనకు ఇప్పట్నుంచీ పిల్లలొద్దని' అంటూ దూరంగా నెట్టేసింది.

"ఆ మాత్రం జాగ్రత్తలు నేను తీసుకుంటున్నాలే "అన్నాడు నవ్వుతూ.

"నాకు అలాగ వద్దు." అన్నది స్థిరంగా.

తన LMP అమెకు గుర్తుంది మరి.

# అమ్మకో ఉత్తరం

గంటి భానుమతి

## కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో విశిష్ట బహుమతి పొందిన కథ

కవిత సిస్టం ముందు కూచోబోతూ, యధలాపంగా కిటికీలోంచి బయటికి చూసింది. వర్షం సన్నగా పడుతోంది. చల్లటిగాలి మొహానికి తగిలేసరికి హాయిగా అనిపించింది. కిటికీ రెండు రెక్కలూ పూర్తిగా తీసి, స్టాపర్ పెట్టి, కంప్యూటర్ వైపు చూసింది. ఆశ్రమం నుంచి వచ్చిన మెసేజ్ ని మరోసారి చదివింది.

"మీరు అడిగిన వైష్ణవి అనే మహిళ ఓ నాలుగేళ్ళ క్రితం వరకూ మాదగ్గరే ఉండేవారు. కాని ఇప్పుడు మా దగ్గర ఉండడం లేదు. మరో హోం లో ఉంటున్నారని తెలుసు..ఆ చిరునామా తెలుసుకున్నాకా మీకు పంపడానికి ఓ నాలుగు రోజులవుతుంది."

అంతే!! ఒకలాంటి ఉద్వేగం, సంతోషం కడుపులో చుట్టుకుంటోంది.ఎన్నో ఏళ్ళ తరవాత అమ్మని చూడబోతోంది. అమ్మ కనిపిస్తుంది. తన దగ్గరికి వస్తుంది. ఎన్నో విషయాలు చెప్తుంది, ఆ గొంతు వినాలి. అమ్మబాగా పాటలు పాడుతుందిట. పాడించుకోవాలి..ఆ గొంతుని వింటూ, ఆ మాటలు వింటూ ఇంతకాలం ఏం కోల్పోయిందో, అన్ని తిరిగి పొందాలి.

కానీ, అమ్మ పాత సంగతులు మాట్లాడడానికి ఇష్టపడుతుందా....!? అమ్మ తనతో మాట్లాడుతుందా...!? తప్పకుండా మాట్లాడుతుంది. సందేహంలేదు. తన చేయి అందుకోడానికి ఆమె ఎప్పుడూ సిద్ధమే కానీ తనే ఆ చేతిని వదిలించుకుంది. దూరం వెళ్ళిపోయింది ఆ ఇల్లు వదిలి బయటికి వచ్చేసింది. ఇది జరిగి పదేళ్ళయింది, అమ్మని అప్పుడే చివరగా చూసింది., ఐదేళ్ళ క్రితం తన పెళ్ళి శుభరేఖని పంపించింది. అంతే కానీ, అందులో రమ్మని రాయలేదు. జస్ట్ ఇన్ఫర్మేషన్ ఇచ్చింది. కానీ ఆమె రాలేదు. అమ్మ దగ్గరనుంచి సమాధానమూ రాలేదు... తన కోపానికి అర్థం లేదు. క్షమించమని అడగాలి. అమ్మ కదా క్షమించేస్తుంది.!

టైము చూసింది.. రాత్రి పది గంటలయింది...మోహన్ లోపలికి వచ్చాడు.

"ఉత్తరం రాస్తున్నావా..? ఇలా ఎన్ని రోజులు రాస్తావు....?"అంటూ కవిత దగ్గరికి వచ్చాడు. భర్తని చూసింది కవిత .

"ఎన్నిరోజులైనా ఫరవాలేదు. నా మనసులోని బరువు తగ్గే వరకూ యిలా రాస్తూంటాను. అమ్మని చూసే వరకూ ........రాస్తూనే ఉంటాను."

" అయినా ఆశ్రమం వాళ్ళకి మెయిల్ ఇచ్చాం కదా...ఏదో విషయం తెలుస్తుంది." అన్నాడు మోహన్.

"వాళ్ళ మెసేజ్ వచ్చింది. ప్రస్తుతం అక్కడ లేరుట, మరో చోటఉన్నారేమో కనుకుని చెప్తామని,"

"అలాంటప్పుడు ఈ ఉత్తరం రాయడం అదీ ఎందుకూ...?.ఆపేయచ్చు కదా....!"

"ఆపేయచ్చు, కాని ఆపను, ఎందుకంటే అమ్మ ఎదురుగా ఉంటే నా మనసులో ఉన్నది పూర్తిగా చెప్పలేక పోవచ్చు, అందుకని అమ్మ రాగానే దీని ప్రింటవుటు తీసి ఆమె చేతికి చ్చేస్తాను. ఆమె చదువుకుంటుంది. నా ప్రవర్తనకి బాధ పడదు. క్షమించేస్తుంది.మామూలై పోతుంది." కళ్ళు తుడుచుకుంది.

ఆమెని ఓసారి జాలిగా చూసి"నీ ఇష్టం.నాకు నిద్రొస్తోంది." అని వెళ్ళిపోయాడు మోహన్.

ఉత్తరం టైప్ చేయడం మొదలెట్టింది కవిత. కీబోర్డు మీద వేళ్ళు, మోనిటర్ మీద అక్షరాలు కదలడం మొదలెట్టాయి.

"అమ్మా..! పుట్టినప్పటి నుంచి నీ దగ్గర లేను. నీ చేతుల్లో పెరగలేదు. ఆ జ్ఞాపకాలు ఏమీ లేవు.. కారణాలు నాకు తెలీదు. అమ్మమ్మ దగ్గర నన్నుంచేసావు. నెలకోసారి వచ్చేదానివి, అంతే!! నువ్వెందుకలా చేస్తున్నావని అమ్మమ్మని అడిగాను, తనూ ఏం చెప్పలేదు. నేను డిగ్రీ చదువుతున్నప్పుడు అమ్మమ్మ నీ దగ్గరికి పంపింది... అదే మొదటిసారి నీ దగ్గర ఉండడం. అమ్మమ్మ దగ్గర నన్ను ఉంచేసి వదిలించుకున్నావని నువ్వంటే కోపం.ద్వేషం,అసహ్యం. నీ దగ్గర కూచుని, నీతో ఒక్కసారి కూడా మాట్లాడినట్లు గుర్తు లేదు. నువ్వు మాట్లాడడానికి ప్రయత్నిస్తే, ఏదో మిషతో గొడవ పెట్టే దానిని. నువ్వు నీ బాధ్యతలని మరిచిపోయావని దెబ్బలాడేదానిని. కాని ఓ కూతురిగా నా బాధ్యతలేవిటో నేను తెలుసు కోడానికి ప్రయత్నించలేదు. నాహక్కుల గురించి ప్రశ్నించే నేను, నీ బాధ్యతల గురించి మాట్లాడడం విడ్డూరం. నాకు మనుషుల్ని చదవడం తెలుసనుకున్నాను మనుషుల సైకాలజీ తెలుసనుకున్నాను, కానీ నాకేం తెలీదు..నిన్ను అర్థం చేసుకోలేకపోయాను"

వర్షం జోరు పెరిగినట్లుంది. రివ్వున వీస్తున్న గాలికి, కిటికీ రెక్కలు దానికున్న పరిధిలోంచే`కుంయ్ కుంయ్' మంటూ శబ్దం చేస్తున్నాయి. కిటికీ మూయడం కోసం కవిత, కంప్యూటర్ ముందు నుంచి లేచింది.. కిటికీ మూసెయ్యబోతూ, బయటికి చూసింది. వీధి దీపాల వెలుగు కింద మెరుస్తున్న కురుస్తున్న వెండి తీగెల వాన.

హోరున కురుస్తున్న వానని, లెక్క చెయ్యకుండా, గొడుగు వేసుకుని ఓ స్త్రీ గబగబా వెళ్ళిపోతోంది. వీధి దీపాల వెలుగులున్నా, ఆమె ఆకారం నల్లగా కనిపిస్తోంది. ఆ గొడుగు కింద ఎగురుతున్న చీరతో నడుస్తున్న ఆమెను చూస్తూ ఉండిపోయింది.

వర్షం, గొడుగు,స్త్రీ,..!! ఆ దృశ్యం!! వెంటనే అమ్మ గుర్తుకొచ్చింది. ఎందుకంటే అలాంటి, అదే దృశ్యాన్ని, అమ్మ తన పుస్తకంలో కళ్ళకి కట్టినట్లుగా రాసింది. అది డైరీ కాదు కానీ,డైరీలా ఓ పుస్తకం లో రాసింది.

ఆ పుస్తకం తన దగ్గర ఉందన్న విషయం అమ్మకి తెలీదు. అది తన దగ్గరుందని, తను కూడా చెప్పలేదు. దాన్ని అమ్మ వెతుక్కోలేదు. దాని గురించి అడగలేదు.తను చేసింది తప్పని కవితకి తెలుసు....అయినా ఏదో కతూహలం,అందులో ఏం ఉందోనని చదవాలని.

మళ్ళీ టైపు కొట్టడం ప్రారంభించింది.

" నేను నీదగ్గరికి వచ్చినప్పుడు, నీ అలమారలు వెతుకుతూంటే ఓ పుస్తకం కనిపించింది. పైపైనే చూసాను అందులో ఏదో రాసి ఉంది. ఏం రాసావో చూడడం కోసం దాన్ని తీసాను. ఆ పుస్తకం నా దగ్గరుంటే ఏదో ఓ రోజున నువ్వు చూస్తావేమో నన్న భయంతో, చదవకుండా దాన్ని ఓ సంచీలో పెట్టి నా లాకర్ లో దాచేసాను.. దాని సంగతి అప్పుడే మర్చిపోయాను. కాని ఈ మధ్య, ఇన్ని ఏళ్ళ తరవాత లాకర్ తీసి చూస్తుంటే ఈ పుస్తకం కనిపించింది. అసలు అదేంటో, దాన్ని ఎందుకు లాకర్లో దాచానో కూడా తెలీదు. ఆలోచిస్తే గుర్తొచ్చింది. నీకు కనిపించకూడదని అందులో దాచాను. తీసి చదివాను.

అది చదివాక నువ్వు కొంచెం అర్థం అయ్యావనిపించింది. ఆరోజే కాదు, ఆ తరవాత కూడా ఎన్నో సార్లు చదివాను. అందులో ఉన్నది నీ మనసు. అది నువ్వు ఎంత ఉద్వేగంతో రాసావో అదే లాంటి ఉద్వేగం చదివిన ప్రతీసారీ నాలో కూడా కలిగేది. నా కళ్ళ ల్లోంచి ఆగకుండా నీళ్ళు కారిపోతున్నాయి. చదివిన ప్రతీసారి అదే లాగ అయ్యేది. ద్వేషం తగ్గిపోయేది. నీకు నేనున్నానని చెప్పి, దగ్గరవ్వాలనుకునేదాన్ని. ఏదో బెరుకు ఆపేసేది..ఎక్కడో కనిపించని గీత.లక్ష్మణ రేఖ లాంటిది."

కవిత టైపు చేయడం ఆపి, ఒక్కసారి వెనక్కి వాలి, తలని ఇంకా వెనక్కి వాల్చింది. కళ్ళ ముందు ఆ దృశ్యం.వర్షం, గొడుగు పట్టుకున్న మహిళ.ఆమె అమ్మ. అలాగే వర్షంలో గొడుగు పట్టుకున్న అమ్మ , తడుస్తున్న అమ్మ..ఆ దృశ్యం అమ్మ తన నోటుపుస్తకంలో మనసులో నిలిచిపోయేలా రాసుకుంది.

కవిత కుర్చీలోంచి లేచి చీరల కింద ఉన్న సంచీ తీసింది. పదిలంగా దాచుకున్న ఆ పాత పుస్తకం. రంగు మారిన కాగితాలతో ఉన్నపుస్తకం.ముప్పై ఏళ్ళ వయసున్న పుస్తకం.

మంచం మీద పడుకుని,పక్కనున్న లైటు వెలిగించి, పుస్తకం తెరిచింది. అది అమ్మ మనసు. తనకు తెలియనిది, అమ్మ అందులో దాచుకుంది. దానికి అక్షర రూపాన్నిచ్చింది. అందులో ఏం ఉందో కవితకి తెలుసు. గుండెని పిండితే రాలిన అక్షరాలు. ఎన్నో సార్లు చదివింది. అయినా మరోసారి చదవడానికి తయారయింది. కళ్ళు అక్షరాల వెంట పరిగెడుతున్నాయి.

★★★★★

"ఆ రోజున పెద్ద వర్షం....ప్రకృతి కూడా నాలాగే ఉంది.వీధి తలుపు తెరిచి, అమ్మ పక్కనే గోడకి ఆనుకుని కూచుని బయట పడుతున్న వర్షాన్ని చూస్తున్నాను. జరిగింది కల అవుతే బాగుండును, అని ఎన్నో సార్లు అనుకున్నాను. కల కాదు అని నిజం అని చెప్పడానికే అంత వర్షంలో బావగారు గిరి వచ్చారు. తెరిచి ఉన్న గొడుగుని మూయకుండా, నీళ్ళు కారుతున్న గొడుగు కింద అలాగే గుమ్మంలో నుంచున్నారు.

" అద్భుతం జరిగింది..హరి బతికి ఉన్నాడు" అని అంటారేమో ఆశగా చూస్తున్నాను..

"ఫార్మాలిటీస్ అన్నీ పూర్తయ్యాయి. హాస్పటల్ నుంచే తిన్నగా స్మశానానికి అంబులెన్స్ లో తీసుకెళ్ళిపోతున్నాం. అక్కడికి నువ్వు రానక్కర్లేదు. నీ ఆరోగ్యం చూసుకో..పైగా వర్షం..ఒకటి....అయినా నువ్వు వచ్చి చెయ్య గలిగేది ఏం ఉంది..ఏం లేదు..."

"ఎక్కడికి తీసుకెళ్తున్నారు......?

గిరి ఓ నిమిషం నన్ను చూసి,చెప్పాడు. అతనికి చెప్పడం ఇష్టం లేదేమోనిపించింది. ఏదో చెప్పాలి కాబట్టి చెప్పినట్టుగా చెప్పి,ఇంక మాట్లాడేందుకు ఏంలేదు కాబట్టి వెళ్ళిపోయాడు.

ఇకనేమాత్రం ఆలోచించకూండా నేనూ వెళ్ళడానికి తయారయ్యాను. మాకు యాక్సిడెంటు అయ్యి, సరిగ్గా ఒక్క రోజే అయింది. హరి అక్కడికక్కడే స్పృహ తప్పి పడిపోవడంతో వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్ళాను. కానీ అప్పటికే హరి ఈ లోకం విడిచివెళ్ళిపోయాడు. హరి ఇంటికి ఫోన్ చేసాను. వాళ్ళంతా వచ్చారు. నన్ను చూసి మొహాలు తిప్పుకున్నారు. తిట్టినతిట్టు తిట్టకుండా తిట్టారు. నా మూలంగా వాళ్ళబ్బాయి పోయాడని అన్నారు. వెంటనే వెళ్ళిపొమ్మన్నారు. ఇంక అక్కడికి నన్ను రావద్దన్నారు. హరి లేడు కాబట్టి నాతో వాళ్ళకి సంబంధం లేదన్నారు. కానీ నా కడుపులో ఉన్న పాప మాత్రం వాళ్ళదిట. డెలివరీ అవగానే హరి గుర్తుగా తీసుకుంటామన్నారు. నేనెలా స్తాను.? ఇవ్వను. ఆసుపత్రి నుంచి ఇంటికెళ్ళిపోయాను.. యాక్సిడెంటులో కింద

పడ్డ నాకు, ఒంటి నొప్పులు ఎక్కువే అయ్యాయి, తగ్గలేదు కాని కనపడని దెబ్బల బాధ ఇంకా ఎక్కువ. అందులో పాప గురించి. ఆమె భవిష్యత్తు గురించి, హరి గురించి, నా భవిష్యత్తు గురించి....

హరి ఆఖరి ప్రయాణం నేను చూడాలి, చూడకుండా ఎలా ఉంటాను. వెళ్తాను. అమ్మ వద్దన్నా ఓ గొడుగు తీసుకుని అక్కడికి వెళ్ళాను. నేను వెళ్ళేసరికి కార్యక్రమం దాదాపు పూర్తి కావొస్తోంది. ఏడుస్తున్న అత్తగారిని,ఆడపడుచులని ఎవరో ఆ గొడుగుల కిందే ఓదారుస్తున్నారు.

నా గొడుగుని నా దుఃఖాన్ని, నా బాధని, నేను ఎవరితో పంచుకోలేదు. ఆఖరి క్షణాన చెప్పినా స్థానం ఏఁవిటో గుర్తు చేసారు. వాళ్ళందరూ ఓ చోట, నేనొక్కదాన్ని మరో చోట...మా మధ్య ఓ రకమైన నిశ్శబ్దం, మా మధ్య ఉన్న దూరం తరుగుతుందో పెరుగుతుందో కాలం నిర్ణయించాలి.

కిందనుంచి పారుతున్న నీళ్ళు.. పాదాలని,చీర కుచ్చిళ్ళని తడిపేస్తూ పరుగెడుతున్నాయి. పక్కనుంచి పడుతున్న పెద్ద పెద్ద చినుకులు శరీరాన్ని తడిపేస్తున్నాయి. అవేవి నేను పట్టించుకోవడం లేదు. జరిగినది, జరుగుతున్నది, జరిగిపోయిన నష్టం, నన్ను ఓ మొద్దులా చేసాయి. స్పర్శలేదు. జరుగుతున్న తతంగం కనిపించడంలేదు మంత్రాలు వినిపించడంలేదు. మనుషులు, రేకుల షెడ్డు కింద జరుగుతున్నది, వాన.. ఏదీ కనిపించడం లేదు. నేల నుంచి నింగి దాకా శూన్యం...అన్నీ మాయం అయిపోయాయి.!!

క్షణక్షణం అంతకంతకూ గుండె బరువెక్కి పోతోంది. ఆ బరువు అమ్మ దగ్గర మాత్రమే తగ్గుతుంది. అమ్మ భుజాన్ని ఆసరా చేసుకుని దింపుకోవాలి. గొంతులో అడ్డు పడుతున్న ఉండలు, కళ్ళల్లోంచి బయటికి రావాలి. ఈ నొప్పి,ఈ బాధ,ఈ ఏడుపు,అన్నీ ఇంటికెళ్ళాక.....ఇక్కడి కార్యక్రమం అయిపోతే, వెంటనే జిబ్రాల్టర్ రాక్ లాంటి అమ్మని పట్టుకోవాలి. ఎన్నో ఆటుపోట్లని ఎదుర్కొన్న అమ్మ సలహా తీసుకోవాలి.

గొడుగు కింద వర్షపు గాలి శరీరాన్నికోసేస్తోంది. వెంటనే అమ్మ వెచ్చటి ఒడిలోకి చేరాలి.

ఆ నేల మీద హరి, జీవితాంతం తోడుంటానని పెళ్లి చేసుకున్న హరి, తన వాళ్ళందరినీ ఎదిరించి పెళ్ళి చేసుకున్న హరి , నిప్పుతో ఏకమై, గాలిలో ధూళిలో, నీటితో కలిసి నింగికి యెగిసిపోతున్నాడు.

అయిపోయింది. ఇంటికెళ్ళిపోవాలి. కన్నీటిని బలవంతంగా రెప్పల వెనకాల ఎంతసేపని అదిమి ఉంచగలనూ..! నీళ్ళకుండ నెత్తిమీద అంతకంతకూ నిండిపోతోంది. ఇక్కడ వీళ్ళ ముందు బద్దలయిపోతే ...!.ఉహూఁ మెల్లిగా వెనక్కి తిరిగాను. ఎవరివో మాటలు వినిపిస్తున్నాయి.

"యాక్సిడెంటు ఇద్దరికీ జరిగింది కానీ పాపం! హరి దురదృష్టవంతుడు ..పోయాడు"

ఆ మాటలకి అర్థం ఏఁవిటీ...నేను అదృష్టవంతురాలినా.!! ఇప్పుడు జరిగినదాని అదృష్ట దురదృష్టాలని ఎవరు నిర్ణయిస్తున్నారు.! వీళ్ళా!.లేకపోతే ఆ దేవుడా.! బతికి ఉన్న నేనా.! ఇంకా ఈ లోకం చూడని కడుపులో పెరుగుతున్న పాప.! .పైలోకానికి ప్రయాణం అయిన హరి.!ఎవరు..!!??

“అస్సలు ఏడవలేదు. అదేం మనిషమ్మా.!? ఒక్క చుక్క రాల్చలేదు.ఉత్త రాయి.”

“కాదు ,కాదు...నేను రాయిని కాదు. సజీవ స్పందనలున్న మనిషిని.” అని అరవాలనిపించింది. కాని అరవలేదు. నా కన్నీళ్ళు విలువైనవి.. వీళ్ళ ముందు చూపించి వాటి విలువ తగ్గించదలుచుకోలేదు..

నేనేం పోగొట్టుకున్నానో...నా కడుపులోని పాప ఏం నష్టపోయిందో...వీళ్ళకి అక్కర్లేదు...!.

“నువ్వు చాలా ధైర్యవంతురాలివి.” అని ఎప్పుడూ అనే హరి పక్కన లేకపోతే, నేను బలహీను రాలినైపోతానా...!లేదు. నాకు అమ్మ ఉంది. అమ్మ నాకు అన్నివిధాలా స్ట్రాంగ్ సపోర్టర్. నేను అన్ని విధాలుగా నమ్మే ఓ మంచి స్నేహితురాలు. అమ్మ నాకు ధైర్యం ఇస్తుంది. నాకు మాట్లాడడం నేర్పించిన అమ్మ మూగబోతున్న నాకు, ఓదార్పునిస్తుంది....అమ్మకి ఆ శక్తిఉంది. అమ్మ అంటే అర్థం అదే....!!.

గబ గబా బయటికి వచ్చేశాను. కనపడ్డ ఆటో ఎక్కేసాను. ఆటోలో కాళ్ళు పెట్టుకునే దగ్గర అంతా నీళ్ళు.సీటు పూర్తిగా తడిసి ఉంది.

“తుడుస్తానమ్మా “ అంటూ తన సీటు కింద నుంచిఓ పాడి బట్టని తీయబోయాడు పరవాలేదు, నావి పూర్తిగా తడిసినబట్టలే అని అనాలనుకున్నాను కానీ అనలేకపోయాను.

వర్షాలకి రోడ్లన్నీ గతుకులూ గోతులూ, ఎగుర్తూ ఎత్తి పడేస్తు, వెళ్తున్నఆటో కుదుపులకి, పచ్చి పుండులా ఉన్న ఒళ్ళంతా ఇంకా నొప్పిగా ఉంది. లోపలి నొప్పి ముందు ఈ పై నొప్పి ఎంత..!”

★★★★

కవిత గబగబా పేజీలు తిప్పింది. ఏం లేదు. తనకి తెలుసు.. చదివిన ప్రతిసారీ, ఇంకేమన్నా ఉందేమోనన్న ఆతృత..! కానీ ఆ తరవాత ఏం రాయలేదు. ఖాళీ.. పేజీలన్నీ ఖాళీ. ఎందుకు రాయలేదో తెలీదు. రాయడానికి యేం లేదా.!.తను పుట్టడం,తన బాల్యం అదీ ఎందుకు రాయలేదు. ?

ఆ విషయాన్ని ...ఓ సారి అమ్మమ్మని అడిగింది

"మీ నాన్న పోయిన రెండో రోజునుంచే మీ నాయనమ్మ వాళ్ళు మీ అమ్మని వదలలేదు. ఎన్ని విధాలుగా ఏడిపించాలో అన్ని విధాలుగా ఏడిపించారు. కొడుకు పోయిన కోపంతో మీ అమ్మని చంపడానికి వచ్చారు. ప్రాణ భయంతో ఇంక మేము అక్కడి నుంచి వెళ్ళి పోయాము. అంతలో అమ్మకి వేరే సిటీలో ఉద్యోగం వచ్చింది. అది తెలుసుకున్నారు. నిన్ను తీసుకెళ్ళి పోడానికి మీ నాన్న వైపు వాళ్ళు ప్రయత్నించారు నిన్ను రక్షించుకోడం కోసం నేను నిన్ను తీసుకుని మా ఊరు వచ్చాను. మీ అమ్మ మాత్రం అక్కడే ఉంది. నువ్వు కాలేజీకి వచ్చాక నిన్ను పంపాను. కానీ నువ్వు ఉండలేకపోయావు." అని అంది అమ్మమ్మ.

అవును అక్కడ ఉండలేక పోయింది, ఎందుకంటే అమ్మంటే కోపం కాబట్టి. అమ్మని, ఆ ఇంటిని వదిలి హాస్టల్ లో చేరింది. వెళ్ళిపోతున్నప్పుడు అమ్మ అన్న మాటలు ఇంకా గుర్తున్నాయి!!

"ప్రాణం పోయే స్థితిలో కూడా తల్లి తన పిల్లల్ని కాపాడు కుంటుంది. నేను కూడా అంతే. నిన్ను రక్షించుకోడం కోసం నీకు దూరంగా ఉండిపోవాల్సి వచ్చింది. అది నీకు అర్థం అయిన రోజున నా దగ్గరికి వచ్చెయ్యి. నీ కోసం ఎదురు చూస్తుంటాను."అని. నిజమైన అమ్మ ఇప్పుడు అర్థం అయింది.

మళ్ళీ పుస్తకం తీసి చదివింది కవిత. అమ్మ చేసింది త్యాగమే. తనకే అర్థం కాలేదు. అర్థం అయ్యే సరికి అమ్మ ఎక్కడుందో తెలీదు. అమ్మమ్మని అడుగుదామంటే ఆమె ఈ లోకంలో లేదు. అంత వరకూ మనసులోని బరువు దించుకోడం కోసం ఉత్తరం రాసుకుంటోంది.

కవిత పుస్తకం మూసేసి, సంచీలో పెట్టేసి లోపల పెట్టేసింది. ఓ పావుగంట వరకూ మామూలు మనిషి కాలేకపోయింది. ఆ తరవాత మెల్లిగా లేచి,మళ్ళీ,కంప్యూటరు ముందు కూచుంది. ఉత్తరం రాయడం కొనసాగించింది. వేళ్ళు కదలడం మొదలెట్టాయి.అక్షరాలు కనిపిస్తున్నాయి.

"అమ్మా..!! అమ్మమ్మ తనలో ఉన్న శక్తిని , ధైర్యాన్నీ, ఉన్నగుణాలని అన్నీ కూడా ఓ లేత అరిటాకులో మల్లెపూలల్లా, మెట్ట తామరాకుల్లో సంపెంగల్లా ఉంచి, సందర్భం వచ్చినప్పుడల్లా వాటిని, ఎంతో జాగ్రత్తగా, ఒబ్బిడిగా,వినయంతో ప్రేమతో నీకు ఇస్తే నువ్వు,తీసుకుని నీలో, నరనరాల్లో దాచుకున్నావు. అందుకే అన్ని ప్రతికూల పరిస్థితుల్లో కూడా ధైర్యంగా ఉండి, ఎదుర్కొన్నావు.

కానీ నేను,మాత్రం, అవి అన్నీ ఉన్న నీచేయిని నీ నుంచి అందుకోలేకపోయాను. నీ చేయి కాదు కదా,నీ వేలుకూడా పట్టుకోలేకపోయాను .అది మైకేల్ ఏంజిలో పెయింటింగ్ ,ద క్రియేషన్ ఆఫ్ ఏడం లో లాగా దేవుడి వేలు ఎడం వేలు మధ్య ఉండిపోయిన గ్యాప్ లా మన మధ్య ఆ దూరం ఉండిపోయింది. జ్ఞానోదయం అయి నీ మీద ప్రేమ కలిగే సమయానికి, నేను ఎక్కాల్సిన రైలు వెళ్ళిపోయినట్లు నువ్వు వెళ్ళిపోయావు...నాకు మిగిలింది పశ్చాత్తాపం!! మరేం లేదు.!! నిన్ను వెతుకుతాను నా దగ్గరికి తీసుకొస్తాను. మరోసారి చిన్నపిల్లని అయిపోతాను." అలసటగా కళ్ళు మూసుకుని, రేపు మిగిలింది రాయచ్చు,అనుకుంది.

సిస్టం షట్ డౌన్ చేసి,కుర్చీని కాస్త వెనక్కి జరిపింది..

★★★

రెండు రోజుల తరవాత ఆశ్రమం వాళ్ళ దగ్గరనుంచి అమ్మ చిరునామా ఇస్తూ మెసేజ్ వచ్చింది. ఆ చిరునామా చదివి ఆశ్చర్య పోయింది. అమ్మ ఉన్న హోం దగ్గర్లోనే ఉంది. సగం కష్టం తీరిపోయింది. ఇంక వెళ్ళి తీసుకు రావడమే బాకీ. మనసు తేలిక అయింది. పొద్దున్న కోసం, అమ్మని చూడడంకోసం ఎదురుచూస్తూ రాత్రి నిద్ర పట్టలేదు.

తెల్లారగానే త్వరత్వరగా తయారై మోహన్ తో వెళ్ళింది. ఎముకలని నామ మాత్రంగా కప్పిన పలచటి చర్మంతో మంచానికి అతుక్కుపోయి ఉన్న తల్లిని చూడగానే శిలే అయింది.!! ఓ అరగంట వరకూ మామూలు మనిషి కాలేక పోయింది. అంతే వెక్కి వెక్కి ఏడ్చేసింది. మాట పడిపోయి, లేవలేని స్థితిలో ఉన్న ఆమెని వెంటనే ఇంటికి తెచ్చింది.

"సరి అయిన సమయానికే వచ్చారు.ఆమె ఇంక ఎన్నో రోజులు బతకరు.ఫోర్త్ స్టేజ్ లో ఉన్నారు.."అని హోం లో వాళ్ళు అన్నారు.ఇంటికి తీసుకొచ్చే వరకూ ఏడుస్తూనే ఉంది.

" నేను చాలా దురదృష్టవంతురాలిని, నీతో మాట్లాడుతూ గడిపే అవకాశం నేను పోగొట్టుకున్నాను. నువ్వు చేయిని అందిస్తే అందుకోలేదు. ఇప్పుడు నా చేయి నీకు అందిస్తున్నాను."

కవిత మాటలు ఆమెకి అర్థం అయిందో లేదో తెలీదు, కాని అలాగే చూస్తుండి పోయింది. గుండె బరువు అంతకంతకూ పెరిగి పోతోంది. ఎలా తగ్గుతుంది.? మనసులోది చెప్పుకోవాలి, అంటే రాసుకోవాలి. ఇప్పుడు కూడా బరువు దించుకోడానికి రాసుకోవాలి. అప్పుడు కనపడని అమ్మ కోసం,చెప్పుకోలేనేమో,తన గొంతు పెగల్దేమో నని ,రాసుకుంది. ఇప్పుడు మాట, చలనం కోల్పోయిన అమ్మకోసం చదివినా చదవకపోయినా.......

★★★

# నవనీతం డా.జ్ఞానేశ్వర రావు కె.వి.ఎస్

ఆడ కావచ్చు, మగ కావచ్చు. మనుషుల్లో మంచీ చెడూ కుప్పలుపోసి ఉండవు. రెండూ కలిసే ఉంటాయి. ప్రపంచంలో ఎక్కడా పూర్తిగా మంచివాడుగాని, పూర్తిగా చెడ్డవాడుగాని ఉండడు. ఒకే మనిషిలొ మంచీ చెడూ దేశకాల పరిస్థితులనుబట్టి మారుతూ ఉంటాయి.

అరవై ఏళ్ళ కిందటి మాట! అంటే ఈనాటి పరికరాలుగాని, సౌలభ్యాలుగాని అప్పట్లో అందుబాటులోలేవు. మూడో ఫారం చదువుతున్న నాకు పదకొండేళ్ళు. అమ్మమ్మ ఎక్కడికి వెళ్ళినా దూడలా నేనూ వెంటపడేవాడిని. ఆవిడకి నేనంటే తెగముద్దు. రాజమహేంద్రవరంలో గోదావరి పుష్కరాలు ముగించుకుని మేము బండి దిగుతూవుంటే రెండిళ్ళ అవతల ఒక ఒంటెద్దుబండి వచ్చి ఆగింది. ఒక నడి వయసు ముత్తైదువు ముతకనూలు చీరలో నుదుట రూపాయికాసంత *బొట్టు*తో ఆ గూడుబండిలోంచి పిల్లలకోడిలా దిగింది. బిలబిల్లాడుతూ ఐదుగురు పిల్లలు తోసుకుంటూ దిగారు. ఆవిడ పెట్టెబేడా లోపలపెట్టించి పైసలు ఇవ్వగా బండివాడు మరో బేడా అడిగాడు.

"ఏవిఁరా వెధవా! నీకు ఆరణాల పరక సరిపోలేదూ? బస్టాండు ఎంతదూరం గనక? బేరమాడుకునే వచ్చాము కదా? ఫో ఫో." అని గద్దించి అద్దె ఇంట్లోకి పోయింది. [ అర్థ రూపాయి= ½రూపాయి; పావలా= ¼రూపాయి; బేడ=1/8 రు.; అణా=1/16 రు.; అర్థణా=పరక=1/32 రు.; కానీ==3 దమ్మిడీలు=1/64 రు.; డబ్బు=4 దమ్మిడీలు; ఏగాని=2 దమ్మిడీలు; దమ్మిడీకి కూడా విలువ వుండేది. ] వాడు బిక్క చచ్చి మారుమాటాడకుండా బండి తోలుకుపోయాడు. కొత్తపేట నాలుగు బ్రాహ్మణ వీధులూ ఆవిడగొంతుతో మారుమోగాయి.

అవి సత్తెకాలపు రోజులు.అప్పట్లో అన్నికులాలవారూ ఒకే కుటుంబంలా కలిసిమెలిసి మెలిగేవారు.

ఆవిడ పేరు రత్నాలు- క్రమంగా మా మండపం వీధిలో అందరితో కలుపుగోలుగావుంటూ,అందరినీ కూడగట్టుకుని, ఎవరినీ చెయ్యిజాచకుండా పేద సంసారం గుట్టుగా నెట్టుకుంటూ వచ్చేది. భర్త శ్రీకాకుళంలో ఖాదీ భండారులో ఉద్యోగి, రెండు వారాలకి

ఒకసారి విజయనగరం వచ్చి కుటుంబాన్ని చూసుకుని పోతూ ఉండేవాడు.ఆయన సంపాదనతో ఇల్లు గడవడం జల్లెడతో నీరు తెచ్చినట్లే. అతనికి నోట్లో నాలికలేదు. ఆవిడకి నోరెక్కువ.

నాకు చిన్నప్పటినుంచీ మనుషుల ప్రవర్తన గమనించటం అలవాటు . ఆవిడ విశిష్ట వ్యక్తిత్వం పరిశీలించ సాగాను. ఆవిడ వద్ద చనువు సంపాదించాను.

రత్నాలుగారు ముక్కుసూటి మనిషి. ఆచారవ్యవహారాల్లో చాలా ఖరాఖండీగా ఉండేది. రెండునాలికల మనుషులను,దొడ్డిదారి సంపాదనపరులను, తలవాచేలా చివాట్లు పెట్టేది. నిర్హేతుకంగా ఒకరిపై బురదచల్లటంగాని, ఋజువర్తనంలేనివాళ్ళ మాటకి తాళంవెయ్యడంగాని చేసేదికాదు. ఆమె డేగచూపులకి ఇతరుల్లోని లోపాలు స్పష్టంగా కనిపించేవి. నోటిదురుసుగా పైకి కనిపించినా ఆవిడ విమర్శించేది వాళ్ళబాగు కోరి మాత్రమే. ("నిండుమనంబు నవ్య నవనీత సమానము –పల్కు దారుణాఖండల శస్త్రతుల్యము"– అనే మహాభారత సూక్తి గుర్తొచ్చేది నాకు) బుద్ధిమంతులు పొరపాట్లు దిద్దుకుని బాగుపడేవారు. గిట్టనివాళ్ళు వెనక పళ్ళు నూరుకునేవారు –ఆమె ఎదుట నిలబడే సాహసంచెయ్యలేక.

ఆవిడకి వీధంతా బంధువులే. కాని ఏం లాభం? అంతా నోటితో పలకరించి నొసటితో వెక్కిరించేవాళ్ళే.

రత్నాలుగారి పిలుపు –సుగ్రీవాజ్ఞ. "సుందరం(మా అమ్మ)! –కాంతం సాయంత్రం త్రినాథవ్రతం తలపెట్టింది. తప్పక రావాలి సుమా." కాంతం పేద బాపడు సీతారాముడి భార్య. పిల్లల తల్లి. వాళ్ళింట్లో ఇనపగజ్జెలతల్లి నిత్యం నాట్యం చేసేది. ఇల్లు సూర్య చంద్రులకు ఆటపట్టు. కాంతం పొయ్యిలో పిల్లి లేవనప్పుడు వ్రతం తలపెట్టేది. అమ్మలక్కలు నలుగురూపోగై పదీ పరకా దక్షిణ సమర్పించేవారు. అది ఆవిడకి ఒక వారంరోజుల గ్రాసం.

అప్పట్లో రేడియో –అదీ వీధికి ఒకటీ అరా మాత్రమే– కాలక్షేపం. అమ్మలక్కలందరూ రత్నాలు నాయకత్వంలో మధ్యాహ్నం కాశీభట్ల నారాయణమ్మ అరుగుమీద చేరే వారు. ఆవిడకి చదువను,వ్రాయను తెలుసు. పురాణాలు,ఇతిహాసాలు,కాశీ మజిలీ కథలు,భట్టివిక్రమార్క కథలు వగైరా అనర్గళంగా, రసవత్తరంగా వినిపించేది. కొందరికి ఆధ్యాత్మ రామాయణం,లలితాసహస్రం, శ్రీసూక్తం,స్తోత్రాలు ; కన్యలకి రుక్మిణీకల్యాణం, గజేంద్రమోక్షం ,పద్యాలు,పాటలు వంటివి నేర్పించేది.

వినాయక చవితి వచ్చింది. అందరూ ఉండ్రాళ్ళు, పిండివంటల నైవేద్యాలతో –యథా ద్రవ్యం, యథా శక్తి– భగవంతునికి నివేదించి ఆరగించేవారు. సాయంత్రం కనీసం మూడు ఇళ్ళలో ప్రతిమలను దర్శించేటందుకు రత్నాలు వీధిలో పిల్లలని వెంటేసుకుని తీసుకు పోయేది. (చందాలు పోగేసి పెద్ద ఎత్తున గణేశ ఉత్సవాలు అప్పట్లో లేవు).

ఒకరోజు సాయంసంధ్యవేళ నేను వెళ్ళేసరికి రెండిళ్ళవాకిట్లో ఆరుబయట తన పిల్లలని అర్థచంద్రాకారంగా కూర్చోబెట్టుకుని పెద్ద కంచంలో కందిగుండ(పొడి) వేరుశనగనూనెతో కలిపి చేతికో ముద్ద చొప్పున వడ్డించగా వాళ్ళు కిక్కురుమనకుండా తిన్నారు. తర్వాత చారు, మజ్జిగ. పనిపిల్ల కూతుర్ని అసింటా కూర్చోబెట్టి దాని చేతిలో ఓ ముద్ద పడేసేది. ఆ ప్రహసనం ఐపోగానే కిరసనాయిలు బుడ్డి దీపాలవద్ద ,లాంతరువద్ద చేరి రాత్రి పదిగంటలవరకూ పిల్లలు బిగ్గరగా చదవాలిసిందే! చదువుపట్ల ఆవిడ చండశాసనురాలు.

"రత్నాలుగారూ. నెయ్యివేసి పెట్టొచ్చుగా. అంత పెందరాళే భోజనం ఏమిటి?"

"బాబూ–నువ్వు పసివాడివి. ఊహ వచ్చాక అన్నీ తెలుస్తాయి.రేషన్ రోజుల్లో దీపాల నూనె తెచ్చి వేస్తున్నాను. మీ ఇంట్లో కరెంటు దీపాలు. మీ నాన్న గవర్నమెంటు ఉద్యోగి..." నాకు కొద్దిగా అర్థమైనట్లే అనిపించింది. మా ఊళ్ళో బుధవారం శలవు దినం. ఆ రోజు మా ఇంటికి రత్నాలు సిఫార్సుతో ఒక వారాల అబ్బాయి వచ్చేవాడు. మాకు సత్యం మాస్టారు ఇంటికి వచ్చి ప్రయివేటు చెప్పేవారు.

దసరా రాగానే బడి పిల్లలు విల్లంబులు (కాగితం గొట్టాలు) ధరించి పూలు జల్లుతూ ఇంటింటికి పోయి "అయ్యవారికి చాలు ఐదు వరహాలు; పిల్లవాళ్ళకి చాలు పప్పుబెల్లాలు;పావలా బేడిస్తె పట్టేదిలేదు- అర్థరూపాయిస్తె అంటేదిలేదు-ఇచ్చరూపాయిస్తె పుక్కుకుంటాము; జయవిజయీభవా జయరామ చంద్ర"; అంటూ ఆనందంతో గంతులేసి పెట్టినవి బొక్కేవారు.

రత్నాలు పండగలు పబ్బాలు, పెళ్ళిళ్ళు, పేరంటాలు వస్తే ఆబాలగోపాలాన్నీ హుషారుగా పరుగులెత్తించేది. ఆవిడ పర్యవేక్షణలో ఆడపిల్లలు వైభవంగా బొమ్మలకొలువులు పెట్టి పిల్లలందరినీ పిలిచి సరదాగా సంతోషించే వారు. దేవీ శరన్నవరాత్రులలో పూజలు హోరెత్తేవి. వెనువెంటనే అట్ల తదియ - ఆడపిల్లల పండగ! తెల్లారగట్లనే లేచి తలంట్లుపోసుకుని "అట్లతద్ది-ఆరట్లు-ముత్తిపిండాకు-మూడట్లు –పిడికెడు బియ్యం పిల్లల్లారా రారండోయ్!" అని మేలుకొలుపులు పాడుతూ నాలుగు వీధులు తిరిగేవారు. రత్నాలు ఆధ్వర్యంలో మహావృక్షాలకి మోకులతో ఉయ్యాలలుకట్టి ఊగేవారు. చిన్నచిన్న మగపిల్లలు సత్తరకాయల్లా వాళ్ళవెంట వేళ్ళాడేవాళ్ళు. పోతుపేరంటాళ్ళని తరిమికొట్టేవారు. ఆటపాటలతో రోజంతా గడిపి, చంద్రోదయంకాగానే ముత్తైదువలు వండి, నైవేద్యం పెట్టిన అట్లు,తిమ్మనం(వరిపిండి పాయసం) లాగించేసేవారు.

రత్నాలు అరుగుపై కూర్చుని వచ్చేపోయేవాళ్ళపై వ్యాఖ్యానము,ఆక్షేపణ,విమర్శలు, విసుర్లు విసిరేది. గంపలతో కూరగాయలవాళ్ళు, తోపుడు బళ్ళవాళ్ళు, కావిళ్ళతో వంట పాత్రలు వగైరా అమ్ముకునే వాళ్ళు, కొండ దొరలు, కోయ వాళ్ళు- ఒకరేమిటి, దగ్గర బంధువులను కూడా ఆవిడ మన్నించేదికాదు.

పక్కింటి సీత ఆవిడకి కూతురువరస.ఇద్దరికీ షష్టాష్టకం.( సీత మొగుడు పురోహితుడు. ఆతడే ఏమిటి? వీధంతా పౌరోహిత్యం, లేదా వంటవాళ్లు.) అశ్లీలాలు దొర్లిస్తూ అర్థరాత్రి వరకూ జగడం-మర్నాడు సయోధ్య!

కార్తీకమాసం కోటపక్కన మూడుకోవెళ్ళలో శివాలయాలు కలకలలాడేవి. ముత్తయిదువలు, పూర్వ సువాసినులు ప్రమిదల్లో నేతి దీపాలు వెలిగించి గూళ్ళలోపెట్టి నమస్కరించేవారు.

ఒక సాయంత్రం పిల్లలంతా(కిష్కింధాపురపు అగ్రహారీకులు) వీధిలోకి వచ్చి ఆకాశంవంక చూస్తూ గోల చెయ్యసాగారు. రత్నాలుగారు నన్నుపిలిచి "ఏమిటి బాబూ ఆ సందడి?" అని అడిగారు. "డియ్యెస్సార్ గారి మేడ పక్కన ఆకాశంలో ఒక చుక్క మెరుస్తోంది చూశారూ? అది రష్యావాళ్ళు ఎగరేసిన స్పుత్నిక్. అది వార్తాప్రసారాలకి ఉపయోగిస్తుంది."

"మరి అంతెత్తునుండి అది పడిపోదూ?"

"పడిపోకుండా నిలిచివుంటుందండి."

"ఎంత చోద్యం?" ఆవిడ ఆశ్చర్యపోయింది. అలాగే నయాపైసలు, గ్రాములు, మీటర్లు వచ్చిన కొత్తలో పాత నాణాలు, తూకాలు, దూరాల లెక్కలు నన్ను అడిగి నిర్ధారణ చేసుకునేది.

గ్రామదేవత అమ్మవారి జాతరలో మూడులాంతర్ల మీదుగా సిరిమాను, వల, ఏనుగు రాజుగారి కోటగుమ్మం వరకు పోయి ముమ్మారు తిరిగేవి. పులివేషాలు ప్రత్యేక ఆకర్షణ.

ధనుర్మాసంలో పుణ్య స్త్రీలు పూజలు చేసేవారు.

నేను,నేమానివాడు (ఇంటిపేరు) ఫిఫ్త్ ఫారంలో క్లాసులో ఖాళీ చిక్కినప్పుడల్లా పద్యాలతో కొట్టేసుకునేవాళ్ళం. వాడో కొంటె కోణంగి. "ఆచారి పప్పుచారా/కాచావా పప్పుచారు కడివెడునిండా/ చూచాను నీ మహత్వము/బాచాబూచులకు పెద్ద!భడవా! కుంకా!" అని ఒక సహపాఠిని ఏడిపిస్తే తెలుగుమాస్టారు సుతిమెత్తగా చివాట్లు పెట్టేరు-కవిత్వాన్ని మెచ్చుకుంటూ. ఎస్సెస్సెల్సీలో (ఆరో ఫారం) -కౌమారంలో-యౌవన ప్రాదుర్భావానికి ముందు- మా ప్రహసనాలు- నేమాని శ్రీనాథుని "మకరధ్వజునికొంప మరికొంత కనిపింప/చీరకట్టినదయా చిగురుబోడి" అని ఉదహరించగా, నేను ఆంధ్రనామసంగ్రహంలో "...గబ్బిగుబ్బల చెమటల యుబ్బదంచు/గబ్బి

నాౕజను మారుతాఖ్యలు మహేశ" అని కోట్ చేసి వినోదిస్తుండగా, పక్కపిల్లలు మానోట్స్ తెలుగు మాస్టారుకి చూపగా ఆయన నవ్వుతూ మాకు చెరొక మొట్టికాయ ప్రసాదించారు.

ముక్కోటి ఏకాదశి నాడు రాజగోపాలస్వామి ఉత్సవ విగ్రహాలు పల్లకిలో మూడు వీధుల్లో ఊరేగి పూజలందుకునేవి.

రత్నాలు పర్యవేక్షణలో ఆడపిల్లలు వాకిళ్లముందు రంగవల్లులు, రథం ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు వుంచి హడావుడి చేసేవారు. భోగిమంటలతో చలికాగి ,సంక్రాంతినాడు కొత్తబట్టలతొ ముస్తాబై సోకు చేసే వారు. అల్లుళ్ళ రాకతో పండుగ శోభించేది. డూడూబసవన్నల సన్నాయి మోతలు, హరిదాసుల కీర్తనలతో వీధులు మారుమోగేవి.

రథసప్తమికి చిక్కుడు కాయలతో సూర్యుని రథాలు, చిక్కుడు ఆకుల్లో పిడకలపై వండిన పరమాన్నం నైవేద్యం. ఆ రుచి ఏ రోజూ రాదు-మధురాతిమధురం!

మహాశివరాత్రికి ఉపవాసాలు,పూజలు. మా ఇంట్లో ఏకాహం.(ఒక పగలు, ఒక రాత్రి, భజన- భక్తి పాటలు,కీర్తనలు, గీతములు, జంత్రవాద్యములతో సంగీతం.)లాల్‌బాగ్ చిన్నపువ్వులతోటలో పూల సేకరణ.

ఉగాదికి కొత్తబట్టలు. ఉగాది పచ్చడి.

పూసపాటి రాజుల మా విజయనగరం విద్యల నిలయం. కళలకు కాణాచి. అడిదం సూరకవి*, హరికథా పితామహ అజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు,నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు ,పహిల్వాన్ కోడి రామ్మూర్తి, వయొలిన్ ద్వారం వెంకటస్వామి నాయుడు వంటి మహామహులు నడయాడిన నేల. సంస్కృతం, సంగీతం, సైన్స్,బోధన, కళాశాలలు విలసిల్లిన దివ్యభూమి. )

ఆ రాత్రి మండపంవద్ద రాజగోపాల్ భాగవతార్ గారి హరికథ. మైకులేకపోయినా పేటంతా వినబడేది. మనోహరమైన గంధర్వ గానం మైమరచి వింటున్నారు జనం అంతా. అంతటి మహత్తరమైనవేళ రత్నాలు జీవితవీణ అపశ్రుతి పలికింది- ఆమె భర్త దివంగతుడైనాడని. అచిరకాలంలో గోరుచుట్టుపై రోకటిపోటులా పిన్న వయసులో కూతురు విధవరాలై మనవడితో సహా ఇంటికి చేరింది. రత్నాలు ఇంటికి గ్రహణం పట్టింది.

ఒకరోజు రత్నాలు మా నాన్న గారితో "కృష్ణమూర్తిబాబూ! నాకున్న ఒక్క ఆధారం పోయింది. నా పెద్దకొడుకు సూర్యనారాయణ ఎఫ్ఫే(ఇంటర్మీడియెట్) చివరి ఏడు. మీరు నియోగి ప్రభువులు. గొప్పమనసుతో నలుగురికీ చెప్పి వాణ్ణి గట్టెక్కించండి. మీ మేలు మరిచిపోను." అని వేడుకుంది. ఆయన తన వంతు పది రూపాయలు (ఆ రోజుల్లో బియ్యం బస్తా ఖరీదు) చేతిలోపెట్టి తెలిసిన వర్తకుల చేత చందాలు ఇప్పించారు. వాడు కష్టపడి చదివి పాసయ్యాడు.

దాసన్నపేట చివర మచ్చకొండ చేరువన జగన్నాథ రథోత్సవం. బలరామ,సుభద్ర, కృష్ణుల విగ్రహాలతో రథాలు తిరిగేవి. గొప్ప తిరనాళ్ళు. మా పేటలోకూడా గుజ్జనగూళ్ళు, దశావతారాలు. చిన్న తరహా తిరునాళ్ళు.

శ్రీకృష్ణాష్టమికి ఉట్టెల పండుగ. మాఇంట్లో ఏకాహం.

అప్పట్లో రైల్వేలో రాత పరీక్షలు లేవు. పెద్ద అధికారుల చేతిలో ఉద్యోగాలు ఉండేవి.అందులో ఓ అధికారిని బతిమాలి బామాలి రత్నాలు టైపు,షార్ట్ హాండ్ కూడా పాసైన సూర్యనారాయణకి టిట్లాఘర్‌లో ఉద్యోగం వేయించి పంపింది.

రత్నాలు తన దుఃఖాన్ని దిగమింగుకుని కార్తీకమాసం వనభోజనాలు పెద్దపువ్వులతోటలో ఔత్థాన పక్కన మహోత్సాహంగా ఏర్పాటు చేయించింది. పెళ్ళివారిసందడితో నాలుగువీధులూ తిరగబడినాయి.

గ్రహణాలవంటి పర్వదినాల్లో ఎడ్లబళ్ళు వేసుకుని భీమిలి(భీమునిపట్నం) సముద్ర స్నానాలకి ఆవిడ జనాన్ని తీసుకువెళ్ళేది.

మూడో కొడుకు కృష్ణుడు (పరీక్షల్లో పర్యవేక్షకునిగా చూసీ చూడనట్లు వదిలేసిన) అప్పయ్య శాస్త్రులు దయవలన ఎస్సెల్సీ పాసయాడు. మళ్ళీ మరో రైల్వే ఉద్యోగి కాళ్ళు పట్టుకుని గాంగ్‌మన్ గా ఉద్యోగం తెచ్చి పెట్టింది. వాడికి జంషెడ్ పూర్‌లో పోస్టింగ్. చదువుకున్న కూలీగా, పనిమంతుడిగా పేరుతెచ్చుకుని వాడు స్వశక్తితో రైల్వేలో గుమస్తాగా పదోన్నతి పొందాడు.

నాకు అదృష్టంపై(సంభావ్యతపై) ఆధారపడే ఆటలంటే వైముఖ్యం. ఆ రోజు మూలావాడు (ఇంటి పేరు) గంటస్తభం దగ్గర నాచేత రూపాయిపెట్టి లాటరీ టిక్కెట్ కొనిపించాడు. ఇష్టం లేకపోయినా రత్నాలు జ్ఞాపకంవచ్చి ఆవిడ పేరున అది కొన్నాను- లాటరీ వచ్చినప్పుడు చూద్దాలే అని!

ఇల్లుచేరిన కూతుర్ని టీచర్ ట్రెయినింగ్‌కి పంపి, టీచరుగా పోస్టింగ్ వేయించి దాని బతుక్కి ఒక దారి చూపింది. బుద్ధిమాంద్యం మనవడు నరిసిగాడికి చదువు అబ్బేసరికి దండగడియం పట్టింది.

రెండొకోడుకు భగవడు షోకిల్లా . బియ్యే వెలగబెడుతున్నాడు తన అన్నయ్య సహకారంతో.

కోపరేటివ్ స్టోరు గుమస్తా తన కూతురు రాధ చెయ్యిపట్టుకున్నందుకు రత్నాలు చీవాట్లుపెట్టి వాడిని బదిలీ చేయించింది. రాధని ఇష్టపడి పైస కట్నంలేకుండా పెళ్ళిచేసుకుని అల్లుడు మెడ్రాస్ తీసుకు పోయాడు. పెద్దకొడుకు సూర్యానికి దగ్గర సంబంధం చూసి పెళ్ళి చేసింది. కోడలు చిదిమి దీపం పెట్టినట్లున్నదని తెగ మురిసిపోయింది. వాళ్ళతో టిట్లాఘర్ వెళ్ళి వారం రోజులుకూడా అక్కడ ఉండలేక తిరిగి వచ్చేసింది.

రోజులన్నీ ఒకేలా ఉండవు. సంసారభారం మోసి అలసిసొలసి విశ్రాంతి కోరే సమయంలో ఆమెకి దగ్గు, నీరసం పట్టుకుని ---(అప్పట్లో "గొంతు కేన్సర్" అనే మాట కూడ ఎవరూ విని ఉండరు. ) చిక్కి శల్యమయ్యింది. ఆవిడ కంచుకంఠం మూగ పోయింది.

నేను పై చదువులకి వైజాగ్(విశాఖపట్నం) పోవలసిన సమయం. ఒకనాడు చక్రం తిప్పిన ఆవిడ జరాభారంతో వీధి వసారాలో గుమ్మంపై ముగ్గుబుట్టలాంటి తల ఆనించి పడుకుని వుంది. నేను వెళ్ళి "రత్నాలుగారూ. ఒంట్లో ఎలా వుంది?" అని కుశలప్రశ్న వేశాను.

గాజుకళ్ళతో చూస్తూ- "నువ్వా బాబూ. ఈ దీనురాలిని పలకరిస్తున్నావా?"

'ఛఛ .అవేం మాటలండీ? "

" మీ అమ్మకన్న సంతానంలో నువ్వు మణిపూసవి. పెద్దలంటే నీకు ఎనలేని గౌరవం . వృద్ధిలోకి వస్తావు. పెద్ద ఉద్యోగం, గుణవతియైన భార్యతో పిల్లాపాపలతో వెయ్యేళ్ళు వర్ధిల్లు!" అని దీవించింది. — ఆరునెల్ల తర్వాత మావాళ్ళు చెప్పారు. ఆమె మనకికలేరని. కొవ్వొత్తిలా తాను కరుగుతూ అందరికీ వెలుగునిచ్చే రత్నాలు ఆరిపోయింది.

యాదాలాపంగా పేపరు చూస్తున్న నాకు ఎప్పుడో కొన్న లాటరీ టిక్కెట్ పేలిందని తెలిసింది. ఆ మొత్తంసొమ్ము రత్నాలుగారి మనవడు నరిసిగాడికి ఇవ్వ నిశ్చయించాను. మనసు తేలికపడింది. అదే నేను ఆవిడకి అర్పించే అశ్రునివాళి.

## శ్రీ హేవళంబ నామ సంవత్సర ఉగాది సందర్భంగా
## వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
## 21 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
## 'నా మొట్ట మొదటి కథ' విభాగం విజేత

# గోంగూర పురాణం

- ఉమా(వెంకట్ నాగం)

"ఏవండీ నేనేమన్నా మణులు అడిగానా? మాన్యాలు అడిగానా? గోంగూర కావాలన్నాను... అదీ కష్టమేనా" అన్న శ్రీమతి గద్దింపు తో ఫోను లో వాట్సాప్ మూసివేసి ఈ లోకం లోకి వచ్చాను.

"రెండు వారాల క్రితం మీరు తెచ్చిన ఒక కట్ట గోంగూర తో చేసిన పచ్చడి పెద్దవాడికి ఒక్క రోజు కూడా సరిపోలేదు, పోయిన వారం షాపుకు వెళ్లి గోంగూర తేకుండా ఉత్త చేతులతో వచ్చారు, త్వరగా వెళ్ళి రెండు కట్టలు పట్టుకురండి" మరోసారి శ్రీమతి చేసిన సూచనతో ఇక తప్పదు అన్నట్లు కారు తాళాలు తీసి జేబులో వేసుకొని బయలు దేరాను.

"ఏమిటండీ షాపు తీసే వేళ కంటే 5 నిమిషాలు ముందే వచ్చి ముందు నుంచున్నారు" పలకరించాడు అప్పుడే వచ్చిన ఒక ఆసామి.

"ఏమిచేస్తాం ఈరోజు గోంగూర లేకపోతే పొయ్యి మీద పిల్లి లేవదని మా ఆవిడ బెదిరించింది, తప్పుతుందా?" అని నిట్టూర్చాను.

నా ముందు క్యూలో ఉన్న మరో పదిమందిని చూసిన క్షణాల్లో అర్థం అయింది, అందరూ వచ్చింది గోంగూర కోసమేనని. ఒక్కొక్క క్షణం ఒక్కో యుగంలా గడుస్తుంది. సరిగ్గా పది గంటలకు షాపు తలుపులు తెరవగానే, దాదాపు పరిగెత్తుతూ గోంగూర ఉంచే ప్రాంతానికి వెళ్ళాను. రొప్పుతూనే తాజాగా ఉన్న రెండు కట్టలు ఏరుకొని సంచిలో వేసుకొన్న మరుక్షణమే ఇంకో ఆలోచన వచ్చింది. పోయినవారం గోంగూర తేలేనందుకు అసలే నెగటివ్ మైలేజ్ లో ఉన్నాను, ఇప్పుడొక కట్ట అదనంగా వేస్తే తప్పేమిటి? అని మనసులో అనుకోని తాజా గోంగూర కట్ట కోసం వెతికితే ఖాళీ గోంగూర డబ్బా కనిపించింది.

పరిస్థితి గమనిస్తున్న షాపు ఓనరు "ఇప్పటికే గోంగూర స్టాకు రెండింతలు చెయ్యమని సప్లయర్ కు చెప్పాను , అయినా సరిపోవడం లేదు" అని గొణగడం లీలగా వినిపించింది.

దక్కిందే దక్కుదల అనుకొంటూ రెండు కట్టల గోంగూర కు డబ్బు చెల్లించి బయట పడ్డాను.

విజిల్ వేసుకుంటూ ఇంటిలోకి వస్తున్న నాకు ద్వారం దగ్గరే తగిలాడు పక్క వీధిలో ఉంటున్న స్నేహితుడు, అతని చేతిలో ఉన్న పెద్ద సంచిలో గోంగూర.

"పోయినవారం షాపుకు వెళ్లి గోంగూర తేకుండా ఉత్త చేతులతో వచ్చావని రాధికాకు మీ ఆవిడ వాట్సాప్ మెసేజ్ ఇచ్చింది అంట, వీక్ డేస్ కదా కుదరలేదు, ఈరోజు పొద్దునే లేచి మా పెరడులో గోంగూర కోసి మీకు ఇచ్చి పంపే వరకు రాధికా ఊరుకుంటే ఒట్టు. ఇంద గోంగూర" అని పెద్ద సంచి నా చేతిలో పెట్టి చక్కా పొయ్యాడు స్నేహితుడు.

నోట మాట రాక నేను గుమ్మం వద్దే నిల్చుని ఉంటే, శ్రీమతి వచ్చి "ఆహా పెద్దోడికి ఈరోజు గోంగూర పండుగ" అంటూ నా చేతుల్లోనుండి గోంగూర సంచులు దాదాపు ఊడబెరికినట్లు లాక్కొని లోపలి వెళ్ళింది.

నీరసంగా ఇంటి లోపలికి వెళ్లి సోఫా లో కూలబడ్డాను. ఏంటబ్బా పొద్దున్నే గోంగూర దెబ్బ ఇలా తగిలింది అని అనుకొంటూఉండగా ఇంతలో గణ గణ మంటూ ఫోన్ రొద, "హలో ఎవరు?" అన్న నా మాట పూర్తికాకముందే,

"ఏవోయ్ నువ్వేదో షాపుకు వెళ్లి గోంగూర తేకుండా ఉత్త చేతులతో వచ్చావని మీ ఆవిడ వాట్సాప్ పోస్టింగు చూసి పెరడులో ఉన్న గోంగూర చివరి ఆకు వరకు కోసే దాకా మా ఆవిడ ఊరుకోలేదు, చిటికలో మీ ఇంటికి వచ్చేస్తున్నాను" అని టక్కున ఫోన్ పెట్టేసాడు మరో స్నేహితుడు.

ఫోను పెట్టేసానో లేదో కాలింగ్ బెల్ మోగిన శబ్దం. తలుపు తియ్యగానే సైకిల్ మీద ఉన్న అదే స్నేహితుడు... "హి హి చెప్పానా చిటికలో వచ్చేస్తానని" అని మాట్లాడుతూనే గోంగూర సంచి నా చేతిలో పెట్టి "ఇప్పుడు మొదలు పెడితేకానీ 5 కె సైక్లింగ్ పూర్తి అవదు, అది అయితేనే మా ఆవిడ చేతి మీదిగా నాకు ఈ రోజు భోజనం" అంటూ రివ్వున వెళ్ళిపోయాడు స్నేహితుడు.

డోర్ వద్ద నిలబడి స్నేహితుడు ఇచ్చిన గోంగూర సంచి వైపు నేను తదేకంగా చూస్తుండగానే, ఫోన్లో వాట్సాప్ మెసేజ్ ప్రత్యక్షమయింది "ఒరేయ్ బుజ్జి, నువ్వేదో షాపుకు వెళ్లి గోంగూర తేకుండా ఉత్త చేతులతో వచ్చావని మీ అత్తయ్యకు అమ్మాయి వాట్సాప్ లో చెప్పింది అంటరా, పొద్దున్నే కాఫీ కూడా ఇవ్వకుండా గోంగూర కొయ్యమని పెరడులోకి నన్ను నెట్టింది మీ అత్తయ్య, ఇప్పుడే రెండు సంచులు గోంగూర సిద్ధం చేశా నీ కోసం, నువ్వు వస్తావా, లేదా నన్నే రమ్మంటావా? ఇట్లు నీ మామయ్య".

పక్క ఊరిలో ఉండే మామయ్యకు ఈ విషయం చేరింది అంటే, ఇది గోంగూర దెబ్బ కాదు వాట్సాప్ దెబ్బ అని నిదానంగా అర్థం అయ్యింది నాకు. మామయ్యకు ఏంచెప్పాలా అని ఆలోచిస్తున్నాను, ఇంతలో మరో సారి గణగణ మంటూ ఫోన్, భయపడుతూ ఫోన్ ఎత్తానో లేదో, "గోంగూర రెడీ నీ డోర్" వద్ద అంటూ టక్కున ఫోన్ పెట్టేసిన మరో స్నేహితుడు. వెళ్లి డోర్ తెరచి చూస్తే, డోర్ మ్యాట్ మీద మూతి బిగించి కట్టి ఉన్న ఒక సంచీడు గోంగూర, తల ఎత్తి చూస్తే కారులో వెళ్తూ చెయ్యి ఊపుతున్న స్నేహితుడు.

అప్పుడు అర్థం అయ్యింది కనీసం కనీసం కారు దిగి కాలింగ్ బెల్ కొట్టే సమయం లేక న్యూస్ పేపర్ విసిరి వేసినట్లు గోంగూర సంచి విసిరి వేసాడని. నా వెనుకనే వచ్చి గోంగూర సంచి గుండెలకు హత్తుకొని నా శ్రీమతి "జై వాట్సాప్. ఇంక డీప్ ఫ్రీజ్ మొత్తం గోంగూరతో నింపివేయాలి" అని సంబరపడుతూ వంటగదికి వెళ్తుండడం చూసి నేను బుర్ర గోక్కోవడం పూర్తికాకముందే డింగ్ డింగ్ అంటూ ఫోన్లో "గోంగూర డెలివరీ" అంటూ మరో రెండు వాట్సాప్ మెసేజీలు. వాటికి ఏమి రిప్లై ఇవ్వాలా అని ఆలోచిస్తుంటే గణగణ మంటూ ఫోన్ మరోసారి మోగింది.

"మీరు అట్లా వెళ్లారో లేదో ఇట్లా కొత్త గోంగూర స్టాకు వచ్చింది, హి హి హి ఎన్ని కట్టలు పక్కకు తీసి ఉంచమంటారు సార్"? అన్న షాపు ఓనరు మాటలతో నాకు మూర్ఛ వచ్చినంత పని అయ్యింది. "నో" అంటూ పెద్దగా అరుస్తున్న నన్ను తట్టి లేపి "ఏమిటి పొద్దున్నే నో తో మొదలు పెట్టారు, త్వరగా బ్రష్ చేసుకొని షాపుకు వెళ్లి గోంగూర పట్టుకురండి" అన్న శ్రీమతి రుసరుసలతో అర్థం అయ్యింది "గోంగూర పురాణం" అంతా ఒక కల అని.

శ్రీ హేవళంబ నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
21 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
'నా మొట్ట మొదటి కథ' విభాగంలో ప్రశంసా పత్రం పొందిన కథ

# ఆ నవ్వుకి అర్ధం ఇదా...!

శ్రీకాంత్ విహారి

"అభి..అభి.. భోజనానికి రారా.. లేటు అవుతోంది..." అని అరిచింది వాళ్ళ అమ్మ.

స్నేహితులతో ఫేస్ టైమ్ చేస్తూ "నాకు ఆకలిగా లేదు. మీరు తినేయండి" అని అరిచాడు దూరంగా వున్న బెడ్ రూమ్ లోంచి , మళ్ళీ స్నేహితులతో కబుర్లలో నిమగ్నమైపోయాడు అభిరామ్.

రెండు రోజుల క్రితమే కొలంబియా విశ్వవిద్యాలయం లో మొదటి సంవత్సరం పూర్తి చేసుకుని వేసవి సెలవలకి ఎక్కడికి వెళ్ళాలా ? అని ఆలోచన లో పడ్డాడు స్నేహితులతో కలిసి. ఒకరి ఆరిజోనా వెళ్దాం అన్నారు. ఇంకొకడు ఫ్లోరిడా వెళ్దాం అన్నాడు. ఇలా ఒకటి ఒకటి ఆలోచించసాగారు. ఈలోగా "ఏరా !అభి ! భోజనానికి వస్తున్నావా ? లేదా ?" అని పిలిచారు వాళ్ళ నాన్నగారు.

వెంటనే స్నేహితులతో.. "మళ్ళీ మాట్లాడతా" అని చెప్పి టక్కున పరిగెత్తికెళ్ళాడు అభి .

"మీకు మీ నాన్నే మందురా. చెల్లిని పిలిచావా , లేదా ?" అని అంది. ఈలోపు 'వస్తున్నానమ్మా' అంటూ వచ్చింది రాధ .

రాధ ఇంకా 10వ తరగతి చదువుతోంది. సుబ్రమణ్యగోపాలశర్మ, శ్యామల వీళ్ళ తల్లితండ్రులు.

గోపాల్ న్యూయార్క్ నగరంలో ఒక పెద్ద అంతర్జాతీయ బ్యాంకులో పనిచేస్తున్నారు. వీళ్లు అమెరికా వచ్చి దాదాపు పదిహేను సంవత్సరాలు అవుతోంది. శ్యామల దేశం వచ్చిన కొత్తల్లో ఉద్యోగం చేసినా, తర్వాత పిల్లల చదువుల కోసమని మానేసింది.

పేరుకి వుంటోంది అమెరికా అయినా, జీవనం పూర్తిగా భారతీయం. అందుకే పిల్లలకి కూడా మనదైన పద్ధతులు, కట్టుబాట్లు తెలుస్తాయని తాతగారు అమ్మమ్మల దగ్గరికి పంపిద్దామని గోపాల్, శ్యామల ఇద్దరు గట్టిగా తలచారు. దీని గురించి ఇప్పటికే గత రెండు నెలలుగా ఆలోచిస్తున్నారు.

"రాధా ! ఇటు వచ్చి కంచాలు అవి పెట్టు" అంది అమ్మ.

"ఎప్పుడు నేనే పెట్టాలా? అన్నయ్యని పెట్టమను."

"అన్నయ్య చేసేవి అన్నయ్య చేస్తాడు. నీకు చెప్పినవి నువ్వు చెయ్యి... చూడు ఇప్పుడు వాడు భోజనం అయ్యాక బ్యాంకు పని చేసుకుని వస్తాడు."

"నేను ఏమీ చెయ్యను?" అంటూ విసుగ్గా భోజనం ముందు కూర్చున్నాడు అభి.

ఇంతలో గోపాల్ వచ్చే సరికి అందరు చకచకా భోజనం దగ్గర కూర్చున్నారు. భోజనం మొదలుపెట్టారు. ఇంతలో రాధా "అమ్మ! ఈ కూర నాకు వద్దు, ఇది నాకు ఇష్టం లేదని తెలిసి కూడా ఎందుకు చేసావ్ ?"

"అవును నువ్వు తింటే నాకు బలం వస్తుందని చేసాను." అని అంది "నోరు మూసుకుని తిను. "

"ఏరా అభి ! పరీక్షలు ఎలా రాసావ్ ?" అడిగాడు గోపాల్.

"బాగానే రాసాను నాన్నగారు. ఈ సారి ఖచ్చితంగా మంచి మార్కులు వస్తాయి గత సెమిస్టర్ కంటే" అని అన్నాడు.

"మరి సెలవుల్లో ఏమి చేద్దాం అనుకుంటున్నావు ?"

"నేను, మా ఫ్రెండ్స్ కలిసి ట్రిప్ కి వెళ్దాం అనుకుంటున్నాను."

"నువ్వు ఒక రెండు వారాల పాటు ఇండియా లో అమలాపురం లో మన తాతయ్యగారి వాళ్ళ ఇంటికి వెళ్తే బాగుంటుందని అమ్మ నేను అనుకుంటున్నాము."

"కాని నాన్నగారు, మా ఫ్రెండ్స్ తో కలిసి......."అని అంటూ ఉండగా "ఎప్పుడు ఉండేదే ఈ ఫ్రెండ్స్ ఈ సారి నాన్నగారి చెప్పిన మాట విని ఇండియా వెళ్ళిరా." అని చటుక్కున్న అంది వాళ్ళ అమ్మ.

"కాని నాన్నగారూ... ఎప్పుడో 5 ఏళ్ళ క్రితం వెళ్ళా... మళ్ళీ ఇప్పుడు అంటే..."

"నేను మాట్లాడతాను తాతగారితో... వాళ్ళు సంతోషిస్తారు. 2 వారాలకే కదా.. ఇట్టే గడిచిపోతుంది."

"టిక్కెట్టు బుక్ చేస్తాను. నాలుగైదు రోజుల్లో బయలుదేర్దుగాని."

"మరి నేను?" అంది రాధ.

"నీ పరీక్షలు అయ్యాక మనం అందరం కలిసి వెళ్దాం. ముందు అన్నయ్య వెళ్తాడులే." అంది అమ్మ.

భోజనం అయ్యాక రూంలోకి వెళ్ళి,అభి ఆలోచనల్లో మునిగిపోయాడు. 'రెండు వారాల పాటు అక్కడ ఏమి చెయ్యాలి ? అక్కడ వాతావరణం ఎలా ఉంటుందో ? చాలా ఏళ్ళ తరువాత వెళ్తున్నాం? తాతగారు ఏమి అంటారో ?' ఇలా ఎన్నో ప్రశ్నల మధ్య ఆలోచనలు సాగుతున్నాయి.

★★★

అమలాపురం లో పెద్ద డాక్టరు గారు శ్యామప్రసాద్ గారు. ఆ ఊళ్ళో ఆయన పేరు చెప్తే తెలియని వారు వుండరు. చాలా మంది "ఆయన డాక్టరు కాబట్టి ఆయనికి గౌరవాలు అన్నీ వస్తున్నాయి" అని అనుకుంటారు. కాని నిజంగా ఆయన గురించి తెలిసినవారికి మాత్రమే తెలుస్తుంది – ఆయనకు డాక్టరు ఉద్యోగం కాక మరేదో చేస్తూ వున్నా ఆ గౌరవమే లాభించేది అని. అటువంటిది ఆయన వ్యక్తిత్వం. చాలా వినయ స్వభావులు. ఆయన రిటైర్ అయ్యి రెండు ఏళ్ళు అవుతోంది, అది కూడా ఆయన ఊరిలో జరిగే పనుల మీద దృష్టికై 65వ ఏట తీసుకున్న నిర్ణయం. ఆయన భార్య గంగమ్మగారు. ఆవిడకి ఆయనే ప్రపంచం... ఆయనే లోకం... ఆయన మాటే ఆవిడ మాట.

ఊరికి మధ్యన ఒక శివాలయం వుంది. దానికి ఆనుకుని వున్న సందులో ఉండేవారు.

ఊరిలో జనం అంతా దాన్ని 'డాక్టరు గారి సందు' అని పిలిచే వారంటే అందరికి ఆయన ఎంత ఆత్మీయులో తెలుస్తుంది.

రాత్రి 7 గంటలు కావొస్తోంది. ఆయన, రాములు నడుచుకుంటూ వస్తున్నారు. రాములు చెప్పసాగాడు "అయ్యా ! మా అబ్బాయికి ఉద్యోగం వచ్చింది. ఇందాకలే ఫోను చేసాడు."

"చాలా మంచి వార్త చెప్పవోయ్ రాములు చాలా సంతోషంగా వుందిరా. వాడికి మొదటి నుండి కష్టపడే అలవాటు వుంది అదే వాడిని కాపాడుతుంది. అయినా వాడిని చూసి చాలా రోజులు అయ్యింది. ఒకసారి వచ్చి వెళ్ళమను."

"అలాగే అయ్యా! మరి ఇంకా సెలవు తీస్కుంటానండి." అని వెళ్ళిపోయాడు రాములు.

ఇంట్లోకి వస్తూనే అడిగింది ఆవిడ, "ఎలా జరిగింది దర్శనం ఇవాళ ?"

"ఇవాళ చాలా బాగా జరిగింది. ప్రసాదం అక్కడ టేబుల్ మీద పెట్టా చూడు. అన్నట్టు మరిచాను. రాములు అబ్బాయికి ఉద్యోగం వచ్చిందంట. తెలిసింది. ఇందాకే పార్వతి కనిపించి చెప్పింది. తెలిసిపోయిందా అప్పుడే! ఆ కంపెనీ వాడే మీ ఆడవాళ్ళకి ఫోన్ చేసి చెప్పిన చెప్తాడు" అంటూ చురక అంటించారు.

"సర్లేండి, వెళ్ళి పంచ కట్టుకుని రండి, భోజనం పెడతాను" చకచకా వెళ్ళి బట్టలు మార్చుకుని వచ్చారు.

ఇంతలో ఈవిడ భోజనం సిద్ధం చేసింది. "ఏమిటి అలా దీర్ఘంగా ఆలోచిస్తున్నారు తినండి ?"

"ఇందాక గోశాలలో ఎందుకో లక్ష్మి(ఆవు) దిగులుగా వున్నటుందే. రెండు రోజుల నుండి సరిగా తినను కూడా తినట్లేదు ?"

"రేపు నువ్వు ఒకసారి వచ్చి దానికి పెట్టు. వారం రోజులు అయ్యింది నువ్వు దానికి పెట్టి. అందుకే నేను పెడుతుంటే సరిగా తినట్లేదు.."

"అయ్యో ! అవునా... దానికి మందు వేయించి కూడా ఏడాది దాటుతోంది. సర్లేండి, రేపు నేను వస్తాను మీతో."

"అసలు సంగతి మార్చేపోయాను చూసారా.... సాయంత్రం అమెరికా నుంచి అమ్మాయి ఫోను చేసింది. మన అభి వచ్చే వారం బయల్దేరుటాడుట."

ఆ విషయం, వినగానే ఆయన మొహం... చెప్తూ ఆవిడ మొహం ఇద్దరివి వెలిగిపోయాయ్.

"ఎన్నాళ్ళు అయ్యిందే వాడిని చూసి. ఎప్పుడు దిగుతున్నాడు వాడు? "వచ్చే ఆదివారం విజయవాడ లో దిగుతాడు. మనం వెళ్లి తీసుకురావాలి." ఆయన ఈ వార్త వినగానే. చకచకా భోజనం చేసి ఇల్లు అంతా అటు ఇటు తిరుగుతూ అవి ఇవి సర్దేస్తున్నారు.

"ఏవండోయ్! అబ్బాయి వచ్చేది ఇవాళ కాదు ఆదివారం... ఎంతో ఈ హడావిడి" అని పైకి అంది కాని ఆవిడ కూడా వంటింట్లో సర్దుతూ "అవి చెయ్యాలి,ఇవి చెయ్యాలి" అని ఆలోచనల్లో మునిగిపోయింది.

"బ్యాగు సర్దావా ? టైమ్ అవుతోంది!" అని అడిగాడు అభి "ఎన్ని రోజుల ముందు నుంచి చెప్పినా చివర వరకు పెడతావు కదా! సర్దుతున్నా ఇదిగో చూడు ఇందులో వేడి నీళ్లు కాచుకునే కెటిల్ కూడా పెట్టాను. తాతగారికి ఇవ్వు, నేను ఇమ్మన్నానని." అని అంది అమ్మ.

"సర్లే అమ్మ. త్వరగా కాని టైం అవుతోంది".

"పదండి, పదండి. బోర్డింగ్ టైం దగ్గర పడుతోంది. బయలుదేరాలి" అన్నాడు గోపాల్.

చివరికి ఎయిర్ పోర్ట్ చేరుకున్నారు. చిరగా గోపాల్ అన్నాడు "అభి ! ఈ రెండు వారలు నీకు చాలా మంచి టైము. తాతగారితో, అమ్మమ్మతో క్వాలిటీ టైం గడుపు" అమ్మ ఏమో "జాగ్రత్త రా! అక్కడ నీకు అంతా కొత్త. ఏమి చేసిన తాతగారికి, అమ్మమ్మకి చెప్పి చేయి". "సరే ! సరే ! బాయ్ రాధా" అంటూ బయల్దేరాడు.

అభి విజయవాడ ఎయిర్ పోర్టులో దిగాడు. టెర్మినల్ నుండి బయటకు వస్తూనే ఎదురుగానే ఉన్నారు తాతగారు అమ్మమ్మ. అభిని చూడగానే ఒక్కసారిగా ఇద్దరికీ వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్టైంది .

అమ్మమ్మ "ఏరా! ప్రయాణం అంతా బాగానే అయ్యిందా?"

"ఆ! అంతా సాఫీగానే అయ్యింది" చెప్పాడు అభి .

తాతగారు "ఏరా నాయనా! ఎలా ఉన్నావు? చాలా రోజులు అయ్యింది చూసి." ఇలా మాటల్లో పడి కారులో అమలాపురం బయలుదేరారు.

మొత్తానికి రాత్రికి ఇంటికి చేరుకున్నారు. "ఒరేయ్! ఇవాళ త్వరగా పడుకో. ప్రొద్దునే లేచి బయటికి వెళ్దాం ఊరు చూద్దుగాని" అని తాతగారు గది లోకి వెళ్లిపోయారు.

అభి బ్యాగు, బట్టలు సర్దుతూ అమ్మమ్మ అభి కబుర్లలో మునిగిపోయారు. అమ్మ పంపించిన కెటిల్ తీసుకు వెళ్లి ఇచ్చాడు. "ఇదిగో అమ్మమ్మ అమ్మ నీ కోసం అని పంపించింది." దాన్ని తీసుకుని ఎంత మురిసిపోయిందో ఆవిడ. ఇంక ఆ తరువాత రాత్రంతా ఆ కబుర్లు చెప్పుకుంటూ నిద్రపోయారు.

ప్రొద్దున్నే లేచి రెడీ అయిపోయారు తాతగారు మనవడిని ఊరిలోకి తీసుకువెళ్లాలనే ఉత్సాహంతో. మెల్లగా లేచాడు అభి. లేచి మెల్లగా రెడీ అయ్యాడు. అంతా కొత్తగా ఉంది. వాతావరణం అంతా చాలా హడావుడిగా ఉంది. ఇంట్లో పనిమనిషి, పాలవాడు, పేపర్ వాడు ఇలా ఒకళ్ళ తరువాత ఒకళ్ళు వచ్చి 'మీ మనవడు వచ్చాడంట కదా' అని అడగటం, వెళ్ళటం. అతనికి అంతా భలే సరదాగా ఉంది. పక్కింటి వాళ్ళు వచ్చి మరీ పలకరించారు. ఒక పక్క అంత కొత్తగా ఉంటూనే లోపల మటుకు కొంచెం ఇబ్బందికి గురి అయ్యాడు. ఈ లోగా తాతగారు వచ్చి "ఏరా! రెడీ అయ్యావా, బయలుదేరుదామా?" అని అడిగారు. "సరే తాతగారు నేను రెడీ" అంటూ ఇద్దరూ బయలుదేరారు.

"మొదట శివాలయానికి వెళదాం. అక్కడ దర్శనం అయ్యాకా అప్పుడు ఊరిలోకి వెళ్దాం" అంటూ గుడిలోకి వెళ్లారు.

గుడిలో అభిపేరు మీద అభిషేకం చేయమని ముందే చెప్పి వుంచారు పూజారికి. వీళ్ళిద్దరిని చూడగానే ఆయన "ప్రొద్దునే అభిషేకం చేశాం , బాబు పేరు మీద. ఇదిగోండి ప్రసాదం. ఏరా నాయనా! ఏలా వున్నావు ?" అంటూ ప్రసాదం ఇచ్చారు. ఆ తరువాత దారిలో రాములు కనబడి "అయ్యా ! చినబాబుగారు వచ్చిన్నట్టున్నారు. బాగున్నారా బాబు ? అమ్మ నాన్న ఏలా వున్నారు ?" అని అడిగాడు!

అలా అటు తరువాత ఊరిలోకి వెళ్లారు. చెరువుగట్టు, కాలేజీ, స్వీట్ షాపు, పొలాలు, ఇలా తిరిగారు. మధ్యాహ్నం ఇంటికి చేరటం, మరల సాయంత్రం బయటికి. ప్రతిరోజు ఇదే తంతు. ఎన్నో విషయాలు చర్చించేవారు. అభికి మాత్రం ఈ క్రొత్త వాతావరణానికి అలవాటు పడటం కొద్దిగా కష్టం అయ్యింది. ఈ మనుషుల మధ్య వ్యవహారాలు అర్దమయ్యేవి కాదు. ప్రతి చిన్నదానికి "డిపెండెన్సీ" ఏంటో ? తోచేదికాదు. ఈ వారం తాతగారితో తిరగడంలో ఆనందం ఎంత అనుభవించాడో, ఒక రకమైన కన్ఫ్యూషన్ కి కూడా గురి అయ్యాడు. రోజు వారి ఏదో ఒక గొడవ.. పాల వాడు రాలేదనో, బ్యాంక్ లో పని జరగలేదనో, ఆటో వాడు ఎక్కువ డబ్బులు తీసుకున్నాడనో, హోటల్లో భోజనం బాగోలేదనో ఇలా రకరకాల కాన్ఫ్లిక్టు కూడా చూసాడు. చివరికి ఒక రోజున

"తాతగారు, మీరు ఇటువంటి చిరాకుల మధ్య వుండవలసిన అవసరం ఏమి వుంది ? నాతో వచ్చేయండి. మిమల్ని ఇద్దర్ని అమెరికా తీసుకుని వెళిపోతా. నాకు ఈ గొడవలు, చిరాకులు, ఈ డిపెండెన్సీలు ఏమి అర్థం కావట్లే. అమెరికా వచ్చేస్తే ఇంత గందరగోళం వుండదు. వచ్చేయండి" అని అన్నాడు.

తాతగారు అభి చెప్పిన మాటలు విని మురిసిపోయి...

"అమెరికా గొప్పతనం ఏమిట్రా ? అక్కడ ఏమి వుంది?" అని అడిగాడు.

అభి మొదలుపెట్టాడు.

"అక్కడ అన్ని పద్ధతిగా జరుగుతాయి. ప్రతీది చాలా ఈజీగా వుంటుంది. మీకు నచ్చినట్టు చేసుకోవచ్చు. ఇక్కడ లాగా బస్సులో సీటు కోసం పాటు పడక్కర్లేదు. అక్కడ ఎవరి కారు వారికి వుంటుంది. ఇక్కడ లాగా బ్యాంక్ లో క్లర్క్ తో పని అవలేదు అని ఏమి వుండదు. అంతా ఆన్ లైన్. ఇక్కడ లాగా పాల వాడు పాలు తేలేదనో, పని మనిషి రాలేదనో, ఆటో వాడు ఎక్కువ డబ్బులు తీస్కున్నాడనో వుండదు. ఎందుకంటే మన షాపింగ్ మనమే చేసుకోవచ్చు. మన పనులు మనమే ఎప్పుడు కావాల్సి వస్తే అప్పుడు చేసుకోవచ్చు.

కారు వాడికి రేట్ అంతా ఫిక్సడ్. ఇలా మీరు ఏది చూసిన చాలా పద్ధతిగా జరుగుతుంది. మీకు ఈ చిరాకులు ఏమి వుండవు. అక్కడ చాలా ఇండిపెండెంట్ గా బ్రతకవచ్చు. ఎవరికీ కావాల్సినట్టు వాడు వుండవచ్చు." ఇలా చెప్పాడు అభి.

ఇదంతా విని ఒక నవ్వు నవ్వారు తాతగారు. ఇంక ఏమి మాట్లాడలేదు. ఆ నవ్వు అర్ధం ఏమిటో అప్పటికి అభికి అర్థం కాలేదు. దీనికి ఏదో ఒకటి చెబుతారు అని అనుకున్నాడు. కాని దాని గురించి ఏమి చెప్పలేదు. ఒక రోజు గడిచింది. రెండో రోజు గడిచింది.

ఇది ఇలా వుండగా ఆ రోజు ఊరిలో పెద్ద వాన, కుంభవృష్టి కురిసింది. కరంటు పోయింది.

డాక్టరు గారి ఇంటికి చేరాలని చకచకా ఒక ముసలావిడ ఆ వర్షంలో నడవసాగింది. ఆ చీకట్లో సరిగా కనపడక, ఆవిడ జారి పడిపోయింది. ఆవిడ పడటం చూసి ఆ వీధిలో వారు చకచకా రావటం, ఆవిడని ఎత్తుకుని డాక్టరు గారి ఇంటికి తీసుకువచ్చారు. ఇదంతా పక్కనుంచి చూస్తున్నాడు అభి. తాతగారు చూసి 'దెబ్బ గట్టిగా తగిలింది' అనడంతో చకచకా చుట్టు పక్కల వున్న వారు హాస్పిటల్స్ కి ఫోన్ చేయడం, ఒకరు కార్ తీసుకురావడం అంత ఆగమేఘాల మీద జరిగిపోయింది.ఆవిడని కార్ ఎక్కించి, తాతగారు, అభి, రాములు, ఇంకా చుట్టు ప్రక్కన వాళ్ళు అందరూ హాస్పిటల్ కి వెళ్ళారు. ఇదంతా చూస్తున్న అభికి మొదట క్షణం అర్ధం కాలేదు. ఎవరో ఒకావిడ పడిపోతే వాళ్ళు మన ఇంటికి తీసుకురావటం ఏమిటి ? ప్రక్క ఇంటి వాడు కారు తేవటం ఏమిటి ?

హాస్పిటల్లో డాక్టర్ లేదని ఇంకొకరు, డాక్టర్ ఇంటికి వెళ్ళి డాక్టర్ని తీసుకురావడం ఏమిటి ? అసలు అంబులెన్సుకి ఫోన్ చేస్తే వాళ్ళే చూసుకుంటారు గా ?... అని ఇలా సాగిన మొదటి క్షణం ఆలోచనలు మెల్లగా తేరుకున్నాయి. వాళ్ళు అమెరికాలో వుండగా పక్కింటి అతనికి ఒంట్లో బాగోలేకపోతే అసలు మనం పట్టించుకునే పరిస్థితిలో కూడా లేమని అర్ధం అయ్యి బాధ అనిపించింది. నాకు కావల్సిన్నట్టు బ్రతకడంలో నేను మాత్రమే బ్రతకడం వుందని అదే నలుగురు కలిసి బ్రతకడంలో ఆనందం వుందని ఆ క్షణం అర్ధం అయ్యింది. ఇండిపెండెంట్ గా బ్రతకడంలో సుఖం వుందేమోగాని, ఇంటర్–డిపెండెంట్గా బ్రతకడంలో సంతోషం వుందని, అమెరికాలోది ఇండిపెండెంట్ సమాజం అని, అదే మన దేశంలో వున్నది ఇంటర్–డిపెండెంట్ మోడల్ అని అర్ధం అయ్యింది. ఇక్కడ పాలవాడితోనో, ఆటోవాడితోనో పడే గొడవని నేను చిరాకు కింద చూసాను కాని, తాతగారు దానిని ఒక మనిషితో వ్యవహారంగా చూసారు తప్పితే, ఆ చిరాకుకి డిటాచ్డ్ గా వున్నారని... ఇలా అర్థమైనట్టుగా ఆలోచిస్తూ తాతగారి వైపు చూసాడు.

ఆయన నవ్వారు అదే నవ్వు. మొన్న నవ్విన నవ్వుకి అర్ధం దొరికింది అభికి...

# భాస్కర్‌కి ఒక ఉత్తరం

పొత్తూరి విజయలక్ష్మి

## కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో బహుమతి పొందిన కథ

**తుఫాను** సమయంలో సముద్రంలా అల్లకల్లోలంగా వుంది అతని మనసు. తేనె తుట్టెమీద రాయి వేసినట్టు చుట్టుముడుతున్న జ్ఞాపకాలు, ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మనసులో ఏదో ఆవేదన. ఆందోళన.

కళ్ళుమూసుకుని కాసేపు శ్వాసమీద దృష్టి కేంద్రీకరించాడు. అలజడి కాస్త తగ్గింది. ఓ గ్లాసు చల్లటి మంచినీళ్ళు తాగాడు.

జేబులోంచి ఆ ఉత్తరం తీసుకుని చదవడం మొదలుపెట్టాడు.

ప్రియమైన భాస్కర్‌కి!

ఈ మెయిల్స్, సెల్‌ఫోన్ సంభాషణలూ, మెసేజ్‌లూ, వాట్సప్‌లో చాటింగ్‌లూ చలామణి అవుతున్న ఈరోజుల్లో ఇంత పెద్ద ఉత్తరం, అదీ నా దగ్గర్నుంచీ వచ్చిందంటే ఆశ్చర్యంగా ఉం దికదూ!

నీకేకాదు ఉత్తరం రాసిన నాకూ వింతగానే ఉంది. కాయితం మీద కలం పెట్టి నాలుగువాక్యాలు రాయడం పూర్తిగా అలవాటు తప్పిపోయిందేమో ఉత్తరం రాయడం శ్రమగానే అనిపించింది.

కానీ ఇంక దారిలేదు. నేను ఫోన్ చేస్తే నువ్వు తియ్యవు. మీటింగ్‌లో ఉన్నాను తర్వాత ఫోన్ చేస్తాను అని తప్పించుకుంటావు. ఒకవేళ తీసినా మనిద్దరికీ మాటలు దొరకవు. 'హాయ్! ఎలా వున్నావు? ఆ తర్వాత బై' అంతే. నాలుగో మాట మాట్లాడుకోలేం.

మనిద్దరి మధ్యా చెప్పలేనంత దూరం ఏర్పడిపోయింది. దాన్ని దాటుకు రావాలంటే చాలా కష్టమైన వ్యవహారం. ఆ అగాధం ఛేదించుకుని నా మనసులోని ఆలోచనలను నీతో పంచుకోవాలంటే ఇలా ఉత్తరం రాయడం ఒక్కటే మార్గంగా అనిపించింది నాకు.

అందుకే ఈ ఉత్తరం రాస్తున్నాను. అసలు కవరు తెరిచి చూస్తావా? నా పేరు చూడగానే చించి అవతల పారేస్తావా? చదవడం మొదలు పెట్టినా ఏవిటీ సొద అని విసుక్కోకుండా చివరిదాకా చదువుతావా? మనసుకి సందేహంగానే వుంది. దైవం మీద భారం వేసి రాస్తున్నాను. నువ్వు చదువుతావనే ఆశతో రాస్తున్నాను.

రాయాలని తపనతో మొదలుపెట్టాను గానీ ఏం రాయాలి? అసలు ఎక్కడనించీ ప్రారంభించాలో అర్థంకావడం లేదు.

ఎన్నో సంఘటనలు, ఎన్నో జ్ఞాపకాలు.

నాకంటే నాలుగేళ్ళు చిన్న నువ్వు. అమ్మా నాన్నలకు మొదట ఒక పిల్లవాడు పుట్టి రెండేళ్ళు పెరిగి ఏదో జబ్బు చేసి పోయాడుట. తర్వాత నేను. నా తరువాత పుట్టిన మగపిల్లవాడు పురిట్లోనే పోయాడు. నువ్వు ఆఖరువాడివి.

నాలుగు కాన్పులు కన్నా దక్కింది వాళ్ళిద్దరే. వాళ్ళిద్దరే మాకు రెండుకళ్ళు అని అమ్మ అందరికి చెప్పుకుని బాధపడడం నాకింకా గుర్తే.

మనకు పెద్దగా ఆస్తిపాస్తులు లేవు. మధ్యతరగతి కుటుంబం. నాన్నగారిది చిన్న ఉద్యోగం. అమ్మ ఓర్పునేర్పుకల ఇల్లాలు కాబట్టి చక్కగా సంసారాన్ని లాక్కొచ్చింది. మనిద్దరినీ అరిచేతుల్లో పెట్టుకుని పెంచారారు అమ్మానాన్నా. నాన్నంటే భక్తే తప్ప భయం వుండేదికాదు. ఇక అమ్మ మనకి బొమ్మ.

సముద్రస్నానాలకు, తిరునాళ్ళకూ, శుభకార్యాలకూ, సినిమాలకూ నలుగురం కలిసే వెళ్ళేవాళ్ళం. ఉన్నంతలో దర్జాగా వున్న మన కుటుంబాన్ని చూసి మురిసిపోయేవాళ్ళు అందరూ. అపురూపంగా గడిచింది మన బాల్యం.

ఇద్దరం చిన్నప్పటినుంచీ ఒకే చోట చదువుకున్నాం. ముందు ఒకే కాన్వెంట్‌లో తర్వాత ఒకే కాలేజీలో. నాకు సైకిల్ తొక్కడం నువ్వే నేర్పించావు.

నేను చదువు పూర్తిచేసి ఉద్యోగంలో చేరాను. ఆ తరువాత ఏడాదికే నా పెళ్ళి అయింది. మీ బావగారికి బాంబేలో ఉద్యోగం. పెద్దవాళ్ళని ఎవర్నో పట్టుకుని నన్ను బాంబే ట్రాన్స్‌ఫర్ చేయించారు. పెళ్ళయిన ఆరునెలల తర్వాత బాంబేకి ప్రయాణమయ్యాను.

"అక్క వెళ్ళిపోతే మనం ఎలా ఉంటాం? దాన్ని ట్రాన్స్‌ఫర్ చేయించే బదులు బావగారినే ఈ ఊరికి ట్రాన్స్‌ఫర్ చేయించివుంటే అక్క ఇక్కడే వుండేది. ఇప్పుడు అంత దూరం వెళ్ళిపోతోంది. ఎట్లా అమ్మా?" అని అమ్మని కావిలించుకుని నువ్వు ఏడవడం నాకింకా కళ్ళముందు మెదులుతుంది.

" ఆడపిల్ల కాపరానికి వెళ్ళక తప్పుతుందా? వస్తూపోతూ వుంటుందిలే" అని నిన్ను ఓదార్చింది అమ్మ.

నేను బాంబే వచ్చేశాను. క్రమం తప్పకుండా ఉత్తరాలు రాసుకునే వాళ్ళం. మొదటిసారి కడుపుతో వుండి పురిటికి వచ్చినప్పుడు నువ్వు చేసిన హడావిడి అంతా ఇంతాకాదు. దానితో సినిమాలకీ షికార్లకీ తిరిగితే నీ చదువు కాస్తా చెట్టెక్కుతుంది అని నాన్నగారు కోప్పడ్డా వినేవాడివికాదు. సుధీర్‌నీ, ఆ తర్వాత రెండేళ్ళకి పుట్టిన సుమంత్‌నీ తగని ముద్దుచేసేవాడివి.

నీ చదువు పూర్తికావటం, వెంటనే ఉద్యోగం, తర్వాత మూడేళ్ళకి నీ పెళ్ళి, నువ్వూ తండ్రివయ్యావు. ఆ సమయంలోనే నాన్నగారు రిటైరయ్యారు. " మాకున్నది వాడొక్కడు. వాడి దగ్గరే వుంటాం" అని నిర్ణయించుకున్నారు. ఆయన డబ్బు సగం, నీ డబ్బు సగం వేసి ఇల్లు కట్టుకున్నారు. అమ్మా నాన్నా సంతోషంతో పొంగిపోయారు.

"బాధ్యతలు తీరిపోయాయి. ఇక పిల్లలని, మనవలని చూసుకుంటూ హాయిగా కాలక్షేపం చేస్తాం" అని సంబరపడిపోయారు.

అయితే ఆ ఆనందం ఎక్కువకాలం నిలవలేదు. ఊహించని విధంగా మారిపోయింది వాళ్ళ జీవితం.

మనిద్దరి మధ్యా గొడవలు వచ్చాయి. అని ఎందుకు వచ్చాయి? కారణం ఎవరు? అని పరిశోధనలు అనవసరం. ఎవరిది తప్పులని ఆరాలూ అనవసరమే. ఎందుకంటే " నేను చేసింది ఒప్పు. తప్పంతా వారిదే" అనిపించటం మానవ సహజం. ఇందుకు ఇంకెవరో బాధ్యులు అని నేరం ఇంకెవరి మీదకో నెట్టడం అవివేకం.

అటువంటి క్లిష్టపరిస్థితుల్లో మనిద్దరం స్థిరంగా నిలబడకపోవటం మన తప్పు.

అలా నిలబడి వుంటే ఈ గొడవలన్నీ వచ్చేవే కాదు.

శకుని చెప్పిన చెప్పుడు మాటలు విని దుర్యోధనుడు పెడమార్గం పట్టాడుగానీ కన్నతల్లి కైక ప్రలోభానికి భరతుడు లొంగలేదు కదా!

కాలమహిమ అనాలో మన ఖర్మం అనుకోవాలో, అది మనకి గొడ్డలి పెట్టు అయింది.

ఇంత చదువుకున్నాం. ఇన్ని తెలివితేటలున్నాయి. అయినా సమయం వచ్చేసరికి అవేమీ మనకు ఉపయోగపడలేదు. ఇద్దరికిద్దరం మూర్ఖుల్లాగానే ప్రవర్తించాం.

మనిద్దరి మధ్యా దూరం ఏర్పడిపోయింది. మాట్లాడుకోడం మానేశాం. పోట్లాడుకోడం ప్రారంభించాం. తమలపాకుతో నువ్వొకటంటే తలుపు చెక్కతో నే రెండంటా అన్నట్లే తయారయ్యాం.

రాకపోకలు ఆగిపోయాయి. ఒకే తల్లి కడుపున పుట్టిన ఇద్దరం అకారణంగా వైరం పెంచుకుని దూరం అయిపోయాం.

"ఏం వాడు మాట్లాడకపోతే నాకు జరగదా!? " అని నేనూ, "దాన్ని బ్రతిమాలడానికి నాకేం ఖర్మ?" అని నువ్వూ బిగుసుకు కూర్చున్నాం.

అక్కడే మనం చాలా తప్పుచేశాం. మన పంతాలు పట్టింపులూ వీటి గురించే ఆలోచించాం గానీ " మన చుట్టూ మనవాళ్ళున్నారు. మన విరోధం ప్రభావం వాళ్ళమీద పడుతుంది. " వాళ్ళూ నష్టపోతారు అనే ఆలోచనైనా రాలేదు మనకి.

ఫలితం మన పిల్లలు జీవితంలో ఎన్నో సరదాలు కోల్పోయారు. నా పిల్లలు మేనమామ ఆప్యాయతకు దూరం అయ్యారు. నీ పిల్లలు మేనత్త ప్రేమనుండి వంచింపబడ్డారు.

మా పిల్లల చిన్నప్పుడు "అమ్మా! మా ఫ్రెండ్స్ అందరూ వాళ్ళ మామయ్య దగ్గరికి వెళ్తారు సెలవులకి. మనం ఎందుకు వెళ్ళం?" అని అమాయకంగా అడుగుతూ వుంటే ఏవో వున్నవీ లేనివీ కల్పించి కట్టుకథలు చెప్పి దాటేసేదాన్ని.

ఇదంతా నేను నీకు చెప్పడం అనవసరం. నేను ఎదుర్కొన్న పరిస్థితులే నువ్వూ ఎదుర్కొని వుంటావు. అత్తయ్య గురించి అడిగిన నీ పిల్లలకు నువ్వూ ఏవో కట్టుకథలు చెప్పేవుంటావు.

వాళ్ళు సరే.. పిల్లలు. నిముషంలో మర్చిపోతారు.

మన విరోధం వల్ల సర్వనాశనం అయిపోయారు అమ్మా నాన్నా. తలమీద పిడుగు పడినట్లు అయింది వాళ్ళకి.

మొదట్లో పెద్దరికం వహించి మనకు నచ్చచెప్పాలని వ్యర్థప్రయత్నం చేశారు కరవమంటే కప్పకు కోపం. వదలకుంటే పాముకు కోపం. అడకత్తెరలో పోక చెక్కలా అయిపోయింది వాళ్ళ పని.

ఏ తల్లితండ్రులకైనా పిల్లలమీద అపారమైన ప్రేమ వుంటుంది. పెద్ద వయసు వచ్చాక ఆ ప్రేమ మరింత ఎక్కువ అవుతుంది. ఆ వయసులో ఏ పనీ వుండదు కాబట్టి తీరిగ్గా కూర్చుని పిల్లలని తల్చుకోవడమే వాళ్ళకి కాలక్షేపం.

అమ్మానాన్నలకి ఆ అదృష్టం కూడా లేకుండా పోయింది. నీ దగ్గర నీ ఇంట్లో వుంటున్నారు. నీకు నేను బద్ధశత్రువుని. ఆ ఇంట్లో నా పేరెత్తడమే నిషిద్ధం. వాళ్ళకేమో కడుపుతీపి. దూరాన వున్న కూతురి మీద మమకారం. ఎంత నరకం అనుభవించామో తల్చుకుంటేనే ఒళ్ళు జలదరిస్తుంది.

నేను నీ ఇంటి గడప తొక్కను. కాబట్టి వాళ్ళిద్దరే నా దగ్గరకు వచ్చి నెలరోజులుండి వెళ్ళేవాళ్ళు. ఇక్కడా అదే పరిస్థితి. నీ ప్రసక్తి తెస్తే నాకూ ఒళ్ళుమండిపోయేది.

అలా ఓ సంవత్సరం తర్వాత మరో సంవత్సరం గడిచిపోయాయి.

మనిద్దరి ఇళ్ళల్లో ఎన్నో శుభకార్యాలూ వేడుకలూ జరిగాయి. వీలైనంతవరకూ శలవు దొరకలేదని వంకపెట్టి ఎగ్గొట్టాం. విధి ఖర్మకూ అని వచ్చినా మొదటి బంతిలో ఓ ముద్దతినేసి చల్లగా జారుకునేవాళ్ళం.

సుఖాల్లోనే కాదు కష్టం వచ్చినప్పుడు కూడా ఒకరినొకరు పలకరించుకుని సానుభూతి చూపించుకోలేదు మనం.

కిందటేడు నాన్నగారికి సుస్తీ చేసింది. హాస్పిటల్లో చేర్పించారు. ఆ విషయం పెద్దనాన్నగారి అబ్బాయి వాసు నాకు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే వచ్చి వాలిపోయాను. తిన్నగా హాస్పిటల్కే వచ్చాను. నువ్వక్కడే ఉన్నావు. పొడిగా పలకరించుకున్నాం.

నాన్నగారికి గుండెపోటు వచ్చింది. "ఆపరేషన్‌కి తట్టుకునే స్థితిలో లేదు ఆయన శరీరం. మందుల ద్వారానే తగ్గాలి" అన్నారు డాక్టరు.

రెండువారాలు హాస్పిటల్లో ఉన్నారు నాన్నగారు. కాస్త కోలుకున్నారు. ఆవేళ రేపు డిశ్చార్జ్ చేస్తాం. అన్నారు డాక్టర్.

నాన్నగారి మొహం పాలిపోయింది. "మరో వారం రోజులు ఇక్కడే వుండనివ్వండి డాక్టరుగారు" అన్నారు దీనంగా.

డాక్టరు ఆశ్చర్యపోయాడు. "పేషెంట్లు అందరూ ఎప్పుడెప్పుడు ఇంటికి వెళ్దామా అని ఆరాటపడతారు. డిశ్చార్జ్ చెయ్యండి అని మా ప్రాణాలు కొరుక్కు తింటారు. ఈసార్ ఇక్కడే వుంటానంటున్నారూ?" అన్నాడు.

"ఇంటికి వెళితే మళ్ళీ తిరగబెడితే మళ్ళీ పరిగెట్టుకు రావాలిగా! ఇక్కడే ఇంకో పదిరోజులు వుండి పూర్తిగా తగ్గాక వెళ్తాను." అని పసిపిల్లవాడిలా ప్రాధేయపడి అడిగారు.

ఆయన నవ్వేశారు "పూర్తిగా తగ్గింది. అందుకే పంపిస్తున్నాం. ఇంటికెళ్ళి మందులు వాడండి" అనేసి వెళ్ళిపోయాడు.

ఎవరూ లేకుండా చూసి నా చెయ్యిపట్టుకుని కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు నాన్నగారు "ఇక్కడున్నంతసేపూ నా దగ్గరే వుంటావమ్మా నువ్వు. ఇంటికి వెళితే నువ్వు అక్కడికి రావు. వస్తేగానీ వీల్లేదు అని బలవంతం చేసే స్థితిలో లేను నేను" అన్నారు.

నాకూ బాధవేసింది. "నా దగ్గరికి రండి నాన్నా. కొన్నాళ్ళు నా దగ్గరుండి రావచ్చు" అన్నాను.

"ఇన్నాళ్ళూ వచ్చాను. ఉన్నాను. ఇక ఆ ఆశకూడా లేదమ్మా. అంతదూరం ప్రయాణం చేసే శక్తిలేదు. ఈ సమయంలో కొడుకు నుంచీ దూరంగా వెళ్ళడం కూడా మంచిదికాదు. కానీ ఆ భగవంతుడి నిర్ణయం ఎలా వుంటే అలా జరుగుతుంది" అన్నారు.

నాన్న ఇంటికి వెళ్ళారు. నేను నా ఇంటికి వచ్చేశాను.

రోజూ పొద్దున డ్యూటీకి వెళ్తూ కారెక్కగానే నాన్నగారికి ఫోన్ చేసేదాన్ని. ఆఫీస్‌కి చేరేదాకా ఆ గంటసేపూ కబుర్లు చెప్పేదాన్ని.

ఎనిమిదిన్నరకి నా ఫోనొస్తుందని పెందలాడే లేచి స్నానం టిఫెనూ ముగించి మందులు వేసేసుకుని కుర్చీలో కూర్చునేవారుట నాన్నగారు.

ఎన్నో కబుర్లు చెప్పేవారు. అన్నీ నా చిన్నప్పటి కబుర్లే.

"తల్లీ నీకు గుర్తుందా! నీ చిన్నప్పుడు అట్లతద్దికి ఉయ్యాల వేయించేవాడిని. నాకు ప్రమోషన్ వచ్చినప్పుడు నీకు నాచురంగుకి దానిమ్మపువ్వు రంగు అంచువున్న కంచిపట్టు పరికిణీ కొనిపెట్టాం. అది కట్టుకుని మెళ్ళో పలకసరులు, చేతికి వంకీలు పెట్టుకుని బాలా త్రిపురసుందరిలా ఉండేదానివి." అంటూ ఎప్పటెప్పటి విషయాలో చెప్పేవారు. చెప్పిందే చెప్పి చెప్పిందే చెప్పి సంతోషపడేవారు.

"మీకు ఆయాసం వస్తోంది. ఇక చాలు" అని అమ్మ బలవంతాన ఫోన్ లాక్కునేది.

"అమ్మా! నాతో ఫోన్‌లో మాట్లాడ్డం నాన్నగారికి హైరానా అవుతుందేమో ఫోన్ చెయ్యడం తగ్గించనా?" అని అడిగాను.

" అయ్యో ..ఆ పని చెయ్యకు. ఈ వయసులో ఆయనకి ఈ మాత్రం సంతోషం తృప్తి అయినా కలగనివ్వు" అంది అమ్మ.

ఎనిమిది నెలలు అలా గడిచాయి.

బాబాయ్ దగ్గర్నుంచీ ఫోన్.. నాన్నలేరని.!! నాన్న ఆరోగ్యం బాగోలేదు. ఏదో రోజు అటువంటి వార్త వినాల్సి వస్తుంది అని మానసికంగా సిద్ధపడేవున్నా తెలియగానే భరించడం కష్టం అయిపోయింది. వెంటనే బయలుదేరాం.

చాలా ఏళ్ళ తర్వాత మళ్ళీ ఆ ఇంటి గడప తొక్కాను.

గుమ్మంలోనే ఎదురయ్యావు నువ్వు.

"బావగారూ! ఫ్లైట్ టిక్కెట్లు శ్రమపడకుండా దొరికాయా!?" అని నువ్వు అడిగావు.

"ఆ! భాస్కర్ మామయ్యగారిని ఇవ్వాళ తీసుకెళ్తారా! రేప్పొద్దున్నా?" అని మీ బావగారు నిన్నడిగారు.

ఒకే రక్తం పంచుకుని ఒకే తల్లికడుపున పుట్టిన మనిద్దరం, తండ్రిని పోగొట్టుకున్న ఆ విషాద సమయంలో ఎదురెదురుగా వుండి ఒకరినొకరం పట్టుకుని బావురుమని ఏడిచే సామరస్యం కూడా లేనంత అయిపోయాం. ఇప్పుడు తల్చుకుంటే గుండె మండిపోతుంది.

నాన్నగారి అంత్యక్రియలు జరిగిన మర్నాడే బయలుదేరారు మీ బావగారూ, పిల్లలూ. వాళ్ళతో నేనూ ప్రయాణం అయితే బంధువులంతా తిట్టిపోశారు. పన్నెండురోజులూ ఉండాల్సిందే అన్నారు.

నీకూ నాకూ కూడా అదో అగ్నిపరీక్ష. ముళ్ళమీద ఉన్నట్లే ఉన్నాం ఇద్దరం. నువ్వు కర్మ చేస్తున్నావు. ఇల్లు కదలకూడదు.

నాకేమో ఆ ఇంట్లో ఊపిరాడదు. అందుకే ఏదో పని కల్పించుకుని ఇంటిపట్టున ఉండకుండా పగలంతా రోడ్లమీదే వుండేదాన్ని.

క్షణమొకయుగంలా ఆ పన్నెండురోజులూ గడిపేశాను. పన్నెండోరోజు దీపం చూడకూడదు అన్నారు. అందుకే మా ఆఫీస్ గెస్ట్‌హౌవుస్‌కి మారిపోయాను. మర్నాడు ఇంటికొచ్చాను. "కొన్నాళ్ళు అమ్మని నాతో తీసికెళ్తాను" అన్నాను. " పుట్టింటివాళ్ళు తీసికెళ్ళి నిద్రచేయించాక తీసుకెళ్ళొచ్చు" అన్నారు. టిక్కెట్లు బుక్ చేసి ముంబై వచ్చేశాను.

నెల మాసికానికి వచ్చి ఆ రాత్రి గుళ్ళో నిద్రచేసి మర్నాడే అమ్మను తీసుకుని వచ్చేశాను. అమ్మలో ఎంత మార్పు వచ్చింది. స్తబ్దుగా తయారైంది. మౌనంగా కూర్చుంటుంది. మనం పలకరిస్తే ముక్తసరిగా సమాధానం చెప్తుంది. ఏ గుడికో " వెళ్దాం అమ్మా" అన్నా "నేను రాను" అంటుంది.

ఆవిడకి తగిలిన దెబ్బ సామాన్యమైనదికాదు. యాభైఏళ్ళు కలిసి జీవించిన జీవిత భాగస్వామిని పోగొట్టుకుంటే ఆవేదన భరించడం నరకమేకదా. ఆ గాయాన్ని కాలమే మాన్పాలి అనుకున్నాను.

అమ్మ నా దగ్గరికొచ్చి నెలదాటింది. నేను లేని సమయంలో నువ్వు అమ్మతో మాట్లాడావో లేదో నాకు తెలియదు. నేను అమ్మనీ అడగలేదు. నిన్నూ అడగలేదు. మాటలే మానేసిన తర్వాత ఇప్పుడు హఠాత్తుగా ఈ ఉత్తరం నీకు ఆశ్చర్యాన్ని కలిగిస్తూ వుండచ్చు. బలమైన కారణమే వుంది.

నిన్న జరిగిన ఒక సంఘటన నా మనసుని తూట్లుపొడి చేసింది. అందుకే ఈ ఉత్తరం రాస్తున్నా.

నిన్న నా కొలీగ్ సునీత వాళ్ళ అమ్మను వెంటబెట్టుకుని మా ఇంటికొచ్చింది. అమ్మని చూసి వెళ్దామని వచ్చిందిట. వాళ్ళు మరాఠీవాళ్ళు. అమ్మకు ఏవో నాలుగు ఇంగ్లీషు, హిందీ ముక్కలు తప్ప ధారాళంగా మాట్లాడలేదు. ఎందుకావిడ ఈవిడని చూడడం అని నవ్వొచ్చింది.

సర్లే వచ్చింది కదా అని ఆవిడని అమ్మ దగ్గర కూర్చోబెట్టి మేము హాల్లో కూర్చున్నాం. కాసేపయ్యాక టీ పెట్టుకుని ఆ గదిలోకి వెళ్ళాను. నాకు అడుగు ముందుకి పడలేదు.

భాస్కర్ అమ్మ స్వభావం నీకు తెలుసు. నాన్నగారైనా ఖాళీగా వుండేవారు గానీ అమ్మ లోతైన మనిషి. ఏనాడో ఏ విషయంలోనూ బయటపడేదికాదు. తోడబుట్టిన వారిదగ్గరా తోడికోడళ్ళ దగ్గరా కూడా ఏనాడూ తన మనసులోని మాట చెప్పుకునేదికాదు.

అటువంటి అమ్మ భాషరాని ఆ అపరిచితురాలి దగ్గర ఆవిడకు అర్థంకాకపోయినా తన గోడు వెళ్ళబోసుకుంటోంది.

"ఆయన పోయారని నాకే బాధలేదు. పోయారేమో సుఖపడ్డారు. ఇంకా వున్నా ఏం సుఖం? ఏ జన్మలో ఏం పాపం చేసుకున్నామో ఈ జన్మలో మాకి బాధ కలిగించాడు ఆ దేవుడు. అందరిలాగే మాకూ పిల్లలంటే తగని మమకారం. ఉన్న ఇద్దరూ ఎడమొహం. కోప్పడి దార్లో పెట్టడానికి చిన్నపిల్లలూ కాదు. మా అంత వాళ్ళయ్యాక మేమేం చెప్తాం?

కనిపించని కష్టం వచ్చిపడింది మాకు. ఏ ఆస్తి తగాదాలో కాదు. గోరంతలు కొండంతలు చేసి అకారణ వైరం. గుండెరాయి చేసుకుని భరించాం.

చివర చివర్లో ఆయన పడిన బాధ అంతా ఇంతాకాదు. వీళ్ళిద్దరూ కలిస్తే బావుండు. వచ్చేపండగకి వాళ్ళని రమ్మంటే వస్తారు. కొడుకూ కోడలూ, కూతురూ, అల్లుడూ మనవలూ, మనవరాళ్ళూ నట్టింట తిరుగుతూ వుంటే కళ్ళ చూసుకోవాలని వుంది. ఆడపిల్లను పుట్టింటికి తీసుకొచ్చి పసుపుకుంకాలు పెట్టి పంపించి ఎన్నేళ్ళయిందో. కలిగి ఖర్మం అంటే ఇదే అని బాధపడేవారు.

తెల్లవారి ప్రాణం పోతుందనగా "మనం అప్పుడెప్పుడో ఓ ఫేమిలీ ఫోటో తీయించుకున్నాం గుర్తుందా! అమ్మాయి, దాని కుటుంబం మనం అందరం అది ఏదీ? ఎక్కడుంది? ఓసారి తీసుకొస్తావా చూడాలని వుంది. " అన్నారు.

"ఏమో ఎక్కడున్నాయో! వాళ్ళనడిగితే అదో రాద్ధాంతం. రేపు మనవడినడుగుతా" అన్నాను. తెల్లారేసరికి మనిషే లేరు. వెళ్ళిపోయారు కోరిక తీరకుండానే."

ఆవిడ చేతులు పట్టుకుని దుఃఖపడుతూ తన మనసులోని బాధ బయట పెట్టుకుంటూ వుంటే నా గుండె పగిలిపోయిందిరా!

భాస్కర్ మనం చాలా తప్పు చేశాం. తప్పుకాదు పాపం చేశాం. పిల్లలున్న తల్లిదండ్రులు మాట్లాడుకుంటే వాళ్ళ మధ్యన పిల్లలు నలిగిపోతారు అంటారుకదా! అలాగే తల్లిదండ్రులున్న పిల్లలు కూడా పోట్లాడుకోకూడదు. అది ఆ తల్లితండ్రులకు రంపపు కోత.

భాస్కర్. జరిగిందేదో జరిగిపోయింది. తప్పు ఎవరిదైనా ఇద్దరం నష్టపోయాం. పెద్దదానిగా, నేను నిన్ను క్షమాపణ అడుగుతున్నాను జరిగిందంతా మర్చిపోయి మునుపటిలా కలిసుందాం. పోయిన నాన్ననెలాగూ తీసుకురాలేం. కనీసం అమ్మ సంతోషం కోసమైనా.

భాస్కర్‌కి కళ్ళు మసకలు బారిపోయాయి. ఉత్తరం మడిచి జేబులో పెట్టుకుని బేష్ రూమ్‌లోకి పరిగెట్టాడు. అప్పటికది ఆరోసారి. రాతికింద దాగిన నీళ్ళలా ఊరిపోతున్నాయి కళ్ళనీళ్ళు. కాసేపు బాధపడి మొహం కడుక్కుని వచ్చి సీట్లో కూర్చున్నాడు.

మరికొద్దిసేపట్లో మన విమానం ఛత్రపతి శివాజీ టెర్మినల్‌లో లాండ్ అవుతుంది అని అనౌన్స్‌మెంట్ వినిపించింది.

ప్లేన్ లాండ్ అయింది. భాస్కర్‌కి లగేజ్ ఏమీలేదు. మధ్యాహ్నం కొరియర్‌లో అక్క ఉత్తరం రాగానే చదివి వెంటనే ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకుని బ్రీఫ్ కేసుతోనే కారెక్కి ఎయిర్‌పోర్ట్‌కి వచ్చి విమానం ఎక్కాడు. బాస్‌కీ, భార్యకీ మెసేజ్‌లు పెట్టి సెల్ ఆఫ్ చేసాడు.

విమానం దిగాక నడుస్తూ సెల్ ఆన్ చేసి అక్కకి ఫోన్ చేశాడు. వెంటనే తీసింది. "భాస్కర్ నా ఉత్తరం అందిందా?"

"ఇప్పుడే ఫ్లైట్ దిగానక్కా. వచ్చేస్తున్నాను" చెప్తుంటే మళ్ళీ ఏడుపొచ్చింది.

"సర్లేరా! నేను గేటు దగ్గరే వెయిట్ చేస్తున్నా" అంది.

"ఇప్పట్నించీ ఎందుకు? నేనొచ్చేసరికి ఇంకా చాలా టైం పడుతుందిగా. ఇంటిదగ్గరకొచ్చాక ఫోన్ చేస్తా."

"నేను ఎయిర్‌పోర్టులోనే ఉన్నానురా. బావగారు ఢిల్లీ వెళ్తుంటే సీ ఆఫ్ చెయ్యడానికి వచ్చా. ఆయన్ని పంపించాక చూస్తే డిస్‌ప్లేలో హైదరాబాద్ నించి వచ్చే విమానం ఇంకాసేపట్లో వస్తుంది అని కనిపించింది. ఎందుకో నువ్వు వస్తావని అనిపించింది. చూసి వెళ్దాం అని ఆగిపోయా. ఎక్కడున్నావ్ రా నువ్వు. నేను అరైవల్ గేటు దగ్గరికి వస్తున్నా"

"వచ్చేస్తున్నా అక్కా!" అంటూ నడక వేగం పెంచాడు. గాజు తలుపులు తెరుచుకున్నాయి. మరోవందగజాలు నిషేధాజ్ఞలు. అది దాటితే ఇక కావలిసినంత స్వేచ్ఛ. ఎదురుగా వున్న జనంలో ఆత్రంగా వెతికాయి అతనికళ్ళు. ఎక్కువ శ్రమపడకుండానే కనిపించింది కావలసిన వ్యక్తి.

"పద్దక్కా" అంటూ పసిపిల్లాడిలా పరిగెట్టాడు.

తల్లి తర్వాత తల్లిలా తమ్ముడిని కావలించుకుంది పద్మ.

# జరగాల్సింది జరిగితీరాల్సిందే

కాశీభట్ల శశికాంత్

## కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో బహుమతి పొందిన కథ

**వాలుకుర్చీలో** కూర్చుని తీరికగా న్యూస్‌పేపర్ చదువుతున్నాను. అలా చదువుతుండగానే కొద్దికొద్దిగా కళ్ళుమూతలు పడుతున్నాయి. ఎందుచేతనో రాత్రిళ్ళు సరిగా నిద్రపట్టడంలేదు. కొద్దిసేపు అలాగే చదవడానికి ప్రయత్నించాను. కానీ రానురాను కనురెప్పలు లోపలికి రాబోయిన అక్షరాలను, సమయం మించిపోయాక వచ్చిన విజిటర్స్‌ను ఆపే కలెక్టర్‌గారి అటెండర్‌లా, అడ్డుకోసాగాయి. చేతుల్లోంచి జారిపడిన పేపర్ చప్పుడుకి ఉలిక్కిపడిలేచి, కుర్చీలోనే నిద్రలోకి జారుకుంటున్నానని అర్థమై, పేపర్ మడచి టీపాయ్ మీద పడేసి లేచాను. అంతలో కాలింగ్‌బెల్ మోగింది. వెళ్ళి తలుపు తీశాను. వచ్చింది పక్కింటి ప్రభాకర్.

"మా అబ్బాయిని హాస్పిటల్‌లో చేర్చాం. సమయానికి తీసుకువెళ్ళాం కనుక పెద్ద ప్రమాదం తప్పిందన్నారు డాక్టర్‌గారు. థాంక్స్" అన్నాడు ప్రభాకర్.

వాళ్ళ అబ్బాయికి ఏమయింది? హాస్పిటల్‌కు ఎందుకు తీసుకువెళ్ళారు.? మధ్యలో నాకు కృతజ్ఞతలు ఎందుకు చెబుతున్నాడు.?? అదే అడగబోతూండగా కారు తాళాలు ఇస్తూ "సమయానికి మీరు కారు ఇవ్వడం వలన మా అబ్బాయి ప్రాణం దక్కింది" అన్నాడు. అవి నా కారు తాళాలే. ఒక ప్రశ్నకు సమాధానం దొరికింది. కానీ.. అంతలోనే మరో ప్రశ్న పుట్టింది. ఇతనికి కారు తాళాలు ఎవరిచ్చారు? నా భార్య ఇంట్లో లేదే!?

"ఇంతకు మీ అబ్బాయికి ఏమయింది?" అని అడిగాను. అతను నా వైపు ఆశ్చర్యంగా చూశాడు.

"అదేమిటి అలా ఏమీ తెలియనట్టు అడుగుతున్నారు. మా చిన్నబ్బాయి చెట్టుమీదనుంచి పడ్డాడు కదా. తలకు పెద్ద దెబ్బ తగిలింది. చాలా రక్తం పోయింది" అన్నాడు. అతని కళ్ళల్లోని ఆశ్చర్యం తాళాల ప్రశ్నను ఉపసంహరించుకునేలా చేసింది.

"నేను తోడు రానా అని అడిగారు కూడా మీరు?" అన్నాడు. ఆ సంఘటన నాకు గుర్తుచేయడానికి అతను చేసే ప్రయత్నం ఇబ్బందికరంగా అనిపించింది. దానికన్నా ఆ విషయం తెలిసినట్టు ఉండటమే మంచిదనిపించింది.

"కారుతో పనేమీలేదు. హాస్పిటల్‌కు తిరుగుతూండాలి కదా. ఉంచుకోండి" అన్నాను.

"థాంక్సండి.. బైక్ ఉంది కదా. పరవాలేదు" అని వెళ్ళిపోయాడు.

అంతా అయోమయంగా ఉంది. అంత పెద్ద ప్రమాదం జరిగిన విషయం ఎలా మరిచిపోయానో అర్థం కాలేదు. వెళ్ళి మంచం మీద వాలి కళ్ళు మూసుకున్నాను. కానీ ఎంతసేపటికీ నిద్రపట్టలేదు. అప్పటివరకూ ముంచుకు వచ్చిన నిద్ర నాలాగే అయోమయంతో ఎటుపోయిందో. కొద్దిసేపు అటు ఇటు దొర్లాను. లేద్దామనుకుంటూనే కాలింగ్‌బెల్ శబ్దం, కిటికీలోంచి ఏవో మాటలు పెద్దపెద్దగా

వినబడటంతో లేచాను. లేద్దామనుకోవడానికి, లేవడానికి మధ్య పల్చటి నిద్రతెర చోటు చేసుకుందేమోనని అనుమానం. కిటికీ అవతలనుంచి ఎవరో గట్టిగా పిలుస్తున్నారు. వెళ్ళి చూస్తే పక్కింటి ప్రభాకర్.

"కాలింగ్ బెల్ ఎంత కొట్టినా తియ్యకపోతే ఇటొచ్చాం. మా అబ్బాయి చెట్టుమీదనుంచి పడ్డాడు. పెద్ద దెబ్బ తగిలింది" కంగారుగా అన్నాడు ప్రభాకర్. ఈ పిల్లలకు పనేమీలేదా. ఎందుకలా ఒకరి తర్వాత మరొకడు చెట్టెక్కి పడుతున్నారు.

"అరెరె.. మీ పెద్దబ్బాయి కూడా పడ్డాడా?" ఆదుర్దాగా అన్నాను.

"కాదండి.. చిన్నబ్బాయి" అన్నాడు. అదేమిటి వాడు హాస్పిటల్‌లో ఉన్నాడు కదా. ఇంటికి ఎపుడు వచ్చాడు. వచ్చాడు సరే.. అంత ప్రమాదం జరిగాక మళ్ళీ చెట్టు ఎందుకు ఎక్కాడు. అసలు ఎలా ఎక్కాడు. ఎలాగో ఎక్కాడు అనుకుందాం. మళ్ళీ ఎందుకు పడ్డట్టు. అన్నీ ప్రశ్నలే.

"మీ కారు ఇస్తారా.? హాస్పిటల్‌కు తీసుకువెళ్ళాలి." గబగబా అన్నాడు. నేను అయోమయంగా అలా చూస్తుండిపోయాను.

"మీకు కారుతో పనేమైనా ఉందా.? నేను జాగ్రత్తగానే డ్రైవ్ చేస్తాను" నాకు లేని ఏవేవో అభ్యంతరాలను ఊహించుకుని మరీ సమాధానం చెప్పేస్తాడు గబగబా. అతని కళ్ళలోని నీళ్ళు చూసి నేను కంగారు పడ్డాను. గబగబా వెళ్ళి కారు తాళాలు తీసుకుని వీధి తలుపు తెరిచాను. నేను ఇపుడో మాట అంటాను. ఆ మాట ఇంతకుముందు అనేసినట్టు అనిపిస్తోంది. కానీ మళ్ళీ అంటాను.

"ఈ పరిస్థితుల్లో డ్రైవ్ చేయగలరా.? పోనీ.. మీకు తోడుగా నేను రానా?" అన్నాను. విచిత్రంగా జరిగిన సంఘటనే మళ్ళీ జరుగుతోంది. అందుకే అతను ఇపుడు ఏమంటాడో కూడా నాకు ముందే తెలిసిపోయింది.

"పరవాలేదు. మా తమ్ముడున్నాడు" అంటాడు అనుకుంటుండగానే అదే మాట అని కారు తాళాలు తీసుకుని పరిగెత్తాడు. నేను అయోమయంగా లోపలకు వచ్చి కుర్చీలో కూర్చుని తల పట్టుకున్నాను.

ఇదేమిటి వెనక జరగాల్సిన సంఘటన ముందు, ముందుది వెనక జరిగాయి. ఇదెలా సాధ్యం? నిజంగా అలా జరిగాయా లేక నేనేమైనా భ్రమ పడుతున్నానా? ఎలా తెలుస్తుంది. ఇంట్లో నేను ఒక్కడినే ఉన్నాను. నా భార్య ఉండి ఉంటే విషయం తేలిపోయేది. ప్రభాకర్‌ను అడిగితే లాభం లేదు. అతను కూడా ఈ సంఘటనల్లో పాత్రధారే కనుక నా సందేహాన్ని తీర్చలేకపోవచ్చు. పైగా నన్ను పిచ్చివాడి కింద జమకట్టవచ్చు. ఆలోచిస్తే నాకే ఏదో ఒక ఆధారం దొరక్కపోదు అనుకుంటూండగానే చటుక్కున తట్టింది. కారు తాళాలు. అతను మళ్ళీ వచ్చి నా కారు తాళాలు ఇస్తే మొదట జరిగింది అని నేను అనుకుంటున్న సంఘటనలు తారుమారు అయినట్టే. మరి అపుడు కారు తాళాలు ఎక్కడుంటాయి. గబగబా వెళ్ళిచూశాను. హేంగర్‌కు కారు తాళాలు లేవు. ఇది గుడ్డిలో మెల్ల అనుకోవచ్చా.?

ఏమైతే అది అయింది. ఇక ఆలోచించి బుర్రపాడుచేసుకోకూడదు అనుకుని టి.వి ఆన్ చేసి ఏదో ప్రోగ్రాం వస్తుంటే చూస్తూ కూర్చున్నాను.

"ఏమిటి తలుపులు తెరిచి ఉంచి అలా నిద్రపోయారు" తట్టిలేపి అంది మా ఆవిడ.

"వాళ్ళ నిఖిల్ చెట్టుమీదనుంచి పడ్డాడటగా?" అంది.

"అవును. మన కారులో హాస్పిటల్‌కు తీసుకువెళ్ళారు. ప్రమాదం తప్పి ఉంటుంది" అన్నాను.

"అదేమిటి ఆయన మీకేమీ చెప్పలేదా? వస్తుంటే ఆవిడ కనబడి చెప్పింది. బాగానే ఉన్నాడట" అంది. చెప్పలేదని ఎలా అంటాను. కారు తాళాలు ఇస్తూ చెప్పాడు. అలా అని చెప్పాడని కూడా అనలేను. కారు తాళాలు ఇంకా నా చేతికి రాలేదు. అదే జరగనపుడు చెప్పడం మాత్రం ఎలా జరుగుతుంది. రెండూ కలసి ఒకేసారి జరగాలికదా.

ఇన్ని ఆలోచనల మధ్య ఏమనాలో తోచక "ఓహో... ఆయన వచ్చేశారన్నమాట" అన్నాను.

"మీకు కారు తాళాలు ఇచ్చారు కదా, ఏమీ తెలియనట్టు అడుగుతున్నారే?" ఆశ్చర్యంగా అంది.

"ఎప్పుడు ఇచ్చారు?" అన్నాను హేంగర్ వైపు చూస్తూ.

"ఇవేమిటి?" అంది టేబుల్ మీద ఉన్న కారు తాళాలను హేంగర్‌కి తగిలిస్తూ. " ఏవీ పెట్టాల్సిన చోట పెట్టరు. తర్వాత మళ్ళీ వెతుక్కుంటారు. కారు తాళాలు ఇచ్చిన సంగతికూడా గుర్తులేదంటే ఏమనాలి?"

"నాకేమీ అంత మతిమరుపులేదు" అన్నాను కారు తాళాలు అక్కడకు ఎలా ఎపుడు వచ్చాయా అని ఆలోచిస్తూ.

"నాకు చెప్పకండి. శ్యామలరావుగారు రెండేళ్ళుగా మన ఎదురింట్లో ఉంటున్నారు. వాళ్ళ అమ్మాయి మనింటికి చాలాసార్లు వచ్చింది. నిన్న మార్కెట్లో ఆ అమ్మాయితో మాట్లాడితే ఎవరీ అమ్మాయి అని అడగలేదు" నిలదీసింది.

నేనే అయోమయంలో ఉంటే ఈ ప్రశ్నలొకటి విసుక్కున్నాను.

ఫ్యాన్సీ షాపు ముందు బైక్ ఆపి లోపలకు వెళ్ళబోతూ ఆ పక్కనే ఉన్న కూల్ డ్రింక్ పార్లర్ ముందు నిలబడి ఎవరో అమ్మాయిలతో మాట్లాడుతున్న సందీప్‌ను చూశాను. అతను నా స్నేహితుడు సుదర్శనంగారి అబ్బాయి. ఆ అమ్మాయి ఎవరు అంత క్లోజ్‌గా ఉంది అనుకుంటూ షాపులోకి వెళ్ళి నాకు కావాల్సినవి కొనుక్కుని బయటకు వచ్చాను. అపుడు చూశాడు సందీప్ నన్ను. "హలో అంకుల్" అని నవ్వుతూ పలకరించాడు. ఆ అమ్మాయి "నమస్తే అంకుల్" అంది.

"ఈ అమ్మాయి..?" అని ఆపి వివరం చెప్పమన్నట్టు చూశాను.

"అదేమిటి అంకుల్ లాస్యను రెసెప్షన్‌లో చూశారుకదా. అపుడే మరచిపోయారా?" ఆశ్చర్యంగా అన్నాడు సందీప్.

"ఎవరి రెసెప్షన్‌లో?" అయోమయంగా అడిగాను.

"ఇంకెవరిది. మాదే" అని నా మొహంలో అయోమయం గమనించి "ఈ వాచీ మీరు ఇచ్చిన గిఫ్టే" చేతికి ఉన్న వాచీని చూపిస్తూ అన్నాడు. అతని మాటకు నేను ఇబ్బందిగా చూశాను.

అతని చేతిమీద ఉన్న దెబ్బమీద పడింది నా దృష్టి.

"ఇదెలా తగిలింది?" మాట మార్చడానికి అన్నాను.

"ఈ రోజు మార్నింగ్ మెట్లమీదనుంచి దిగుతుంటే జారిపడబోయి చేతిమీద ఆనాను. అప్పుడు తగిలింది." అన్నాడు. నేను ఇంకేమీ మాట్లాడలేక "వస్తాను" అని బైక్ స్టార్ట్ చేశాను. వెనకనుంచి వాళ్ళ నవ్వులు నన్ను వెక్కిరించాయి.

మార్కెట్లో కూరలు తీసుకుని వస్తుంటే ఫోన్ రింగైంది. "రాత్రి రెసెప్షన్‌కు వెళ్ళాలి కదా. ఏదైనా మంచి గిఫ్ట్ తీసుకురండి" అంది మా ఆవిడ.

"రెసెప్షన్ ఎవరిది?"

"అనుకున్నాను మరచిపోతారని. సుదర్శనంగారి అబ్బాయి రెసెప్షన్ ఈ రోజే కదా?!" అంది. నాకు మతిపోయింది.

"అది ఎపుడో అయిపోయింది కదా..!?"

"ఎపుడు... ఈ రోజే రెసెప్షన్" అంది విసుగ్గా. నేను ఒకరోజు సందీప్ తన భార్యతో సహా కనబడిన విషయం చెప్పాను. "ఎవర్ని చూసి ఎవరనుకున్నారో" అంది తేలికగా. నేను వివరంగా చెప్పబోయాను. తను వినిపించుకోలేదు. "మీరు గిఫ్ట్ తీసుకురండి" అని ఫోన్ పెట్టేసింది. తను అంత ఖచ్చితంగా చెబుతోంది. నాకు కూడా రెసెప్షన్‌కు వెళ్ళిన గుర్తులేదు. అంటే సందీప్ రెసెప్షన్ ఈరోజే

అయుంటుంది. రిసెప్షన్ అయిపోయిందని సందీప్ ఆరోజు చెప్పింది అబద్ధమైనా అయుండాలి లేదా సంఘటనలు తారుమారు అయుండాలి. అన్ని ప్రశ్నలకు సమాధానం రిసెప్షన్‌లో దొరుకుతుంది. ప్రస్తుతం ఏదైనా గిఫ్ట్ కొనాలి.

ఏం కొనాలా అని ఆలోచిస్తూ వస్తుంటే వాచీల షోరూం పెద్దది కనబడింది. ఇదేమిటి ఏం కొనాలా అని ఆలోచిస్తున్నాను. వేరే గిఫ్ట్ ఎలా కొంటాను. వాచీయే కొనాలి కదా అనుకుని వాచీ షోరూంలోకి నడిచాను.

నేను ఆ షోరూంకి వెళ్ళడం అదే మొదటిసారి. కానీ అంతకుముందు ఎపుడో ఆ షోరూంకి వెళ్ళినట్టు, అందులోని సేల్స్‌మెన్‌ని ముఖ్యంగా ఆ గద్దముక్కు అతన్ని చూసినట్టు అనిపించింది. అతను చాలా వాచీలు చూపించాడు. నా కళ్ళు మాత్రం ఆ రోజు సందీప్ చేతికి చూసిన మోడల్ వాచీకోసం వెతికాయి. అన్ని మోడల్స్‌లో ఆ వాచీ మాత్రంలేదు. ఇపుడెలా? ప్రపంచం దృష్టిలో ఇంకా జరగకపోయినంత మాత్రాన, నా వరకు జరిగిపోయిన సంఘటనను మార్చడానికి నేను ఎవర్ని.

"ఇంకేమీ లేవా?" అన్నాను నిరాశగా.

"ఇందాక కొత్తమోడల్స్ వచ్చాయి కదా. అవి చూపించావా?" అన్నాడు అపుడే అటుగా వచ్చిన షాపు ఓనర్.

"చూపిస్తున్నానండి" అని అవి చూపించడం మొదలుపెట్టాడు గద్దముక్కు. అలా చూస్తూండగా ఒక వాచీని చూసి నా కళ్ళు మెరిసాయి.

"ఎస్....ఇదే" అనుకుంటూ ఆ వాచీని చేతుల్లోకి తీసుకున్నాను. ఇపుడు ఆ వాచీ నా చేతుల్లోంచి జారుతుందని ఎందుకో అనిపించింది. అనుకున్నట్టే చెయ్యిజారింది. కానీ కిందపడదు గద్దముక్కు పట్టుకుంటాడు అనుకున్నాను. సరిగ్గా అలాగే జరిగింది. ఇదంతా ఎప్పుడో జరిగిపోయిన సంఘటనే మళ్ళీ జరుగుతోంది. అలా ఆలోచిస్తూనే వాచీ తీసుకుని డబ్బు చెల్లించి షోరూం బయటకు నడిచాను.

రిసెప్షన్ ఏర్పాట్లు ఘనంగా చేశారు. పెద్దపెద్దవాళ్ళు చాలామందే వచ్చారు.

"డెకరేషన్ చాలా బాగా చేయించారు" అన్నాను సుదర్శన్‌కి షేక్‌హ్యాండ్ ఇస్తూ

"అదంతా మా అన్నయ్యే చూసుకున్నాడు. పెళ్ళి అయ్యాక మేము అటునుంచి అటే తిరుపతి వెళ్ళి ఈరోజు మధ్యాహ్నమే వచ్చాం" అన్నాడు. అనుకోకుండా ఒక ప్రశ్నకు సమాధానం దొరికింది. సందీప్ లాస్యలను పార్లర్ దగ్గర నేను చూడటమనేది సంఘటనలు తారుమారు అయితే తప్ప జరిగే అవకాశం లేదు. ఇక పెళ్ళికూతురు అప్పుడు చూసినట్టే ఉండాలి. ఒక వేళ లేకపోతేనో... అనుకుంటూ ముందుకు వెళ్ళాను. ఆ అనుమానం కూడా తీరిపోయింది. ఆ అమ్మాయి అచ్చం అలాగే ఉంది. దీనికి సంతోషించాలా, విచారించాలా.

ఆ జంటకు అక్షింతలు వేస్తూ చూశాను. సందీప్ చేతికి వేరే మోడల్ వాచ్ ఉంది. అవున్లే నేను ఇంకా ఇవ్వకుండా ఎలా పెట్టుకుంటాడు అనుకుంటూ గిఫ్ట్‌ప్యాక్ అతని చేతికి ఇచ్చి, షేక్ హ్యాండ్ ఇస్తూ చేతిని అటూ ఇటూ తిప్పి చూశాను. చేతికి దెబ్బలేదు. ఎలా ఉంటుంది? ఇంకా తగల్లేదుగా.

"ఏమిటంకుల్ అలా చూస్తున్నారు?" అన్నాడు సందీప్.

"మెట్లు దిగేటప్పుడు జాగ్రత్త" అన్నాను. అతను నా అసందర్భ సలహాకు ఆశ్చర్యంగా చూశాడు. రేపు మెట్లమీదనుంచి జారిపడ్డప్పుడు నా సలహా గుర్తొచ్చి మరింత ఆశ్చర్యపోతాడు. భవిష్యత్తును ఊహించాననుకోవచ్చు కూడా.

"పెళ్ళికూతురు ఫోటోలోకన్నా చాలాబాగుంది. చక్కని జంట" అని ఇంకా ఏదో చెప్పుకుపోతున్న మా ఆవిడ సడన్‌గా ఆపి "మీరేమిటి అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు?" అంది. ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో అర్థంకాక నిస్సహాయంగా చూశాను.

''ఇదంతా వింటే నీకు ఏమనిపిస్తోంది?.'' అన్నాడు రమేష్. వాడు, నేను డిగ్రీలో క్లాస్‌మేట్స్. డిగ్రీ అయిపోయాక వాడు బిజినెస్‌లో దిగాడు. నేను ఎకౌంటెంట్‌గా కెరీర్ ప్రారంభించి ఆఫీసర్ని అయ్యాను. ఇద్దరం ఆ ఊళ్ళోనే సెటిలయ్యాం. అపుడపుడు ఫోన్లు చేసుకుంటూంటాం. ఒకోసారి వాడి ఇంటి దగ్గరో మా ఇంటి దగ్గరో కలుస్తూంటాం. ఎప్పుడూ బైక్ మీద వచ్చేవాడు ఆ రోజెందుకో కారుమీద వచ్చి పద అలా వెళ్దాం అని తీసుకువెళ్ళి దారిలో ఇదంతా చెప్పుకొచ్చాడు.

''ఇంత వింత అనుభవం గురించి నువ్వు ఎప్పుడైనా విన్నావా?'' నేను ఏమీ మాట్లాడకపోవడంతో కళ్ళు పెద్దవి చేసి మరీ అన్నాడు.

''ఇందాక నువ్వు వాడిన పదాలు నాకు బాగా నచ్చాయి. ఏమన్నావు? సంఘటనలు తారుమారయ్యాయి అనేకదూ'' నవ్వు ఆపుకుంటూ అన్నాను.

''నువ్వు ఇదంతా నమ్మట్లేదు కదూ?'' సీరియస్‌గా అన్నాడు.

''నీది చిన్న సైకలాజికల్ ప్రాబ్లం. నువ్వు కన్ఫ్యూజ్ అయి దానిని పెద్దగా ఊహించుకుంటున్నావు.''

''సైకాలజీ గురించి నీకు ఏం తెలుసని పెద్ద. చెప్పేస్తున్నావు'' కోపంగా అన్నాడు.

''నిజమే. నాకు తెలిసింది గోరంతే. కానీ, నీ సమస్యను విశ్లేషించడానికి అది సరిపోతుంది'' అన్నాను. వాడు మాట్లాడకుండా సీరియస్‌గా డ్రైవ్ చేస్తున్నాడు.

''మొదటి సంఘటనలో ... అంటే... తారుమారై ముందుగా జరిగింది అని నువ్వు అనుకుంటున్న కారుతాళాలు నీ చేతికి ఇవ్వడం అనేది నీకల కావచ్చు. దానిని నువ్వు యదార్ధమని భ్రమపడటంతో వచ్చింది చిక్కు''

''అంటే... నిఖిల్‌కి ప్రమాదం జరిగినట్టు తెలియకుండానే వాళ్ళు కారు తాళాలు తిరిగి ఇవ్వడానికి వచ్చి, చెట్టుమీదనుంచి వాళ్ళ అబ్బాయి పడ్డాడని, మా కార్లో తీసుకెళ్ళి హాస్పిటల్‌లో చేర్పించి వచ్చారనేంతవరకు కలగనేశానంటావు.. ఊరుకోరా చెప్పావుగానీ'' వ్యంగ్యంగా అన్నాడు.

''సరిగ్గా జరిగింది అదే. కిటికీలోనుంచి వినబడిన మాటలలో ప్రమాదం గురించి ఉండి ఉండొచ్చు. వాటి ఆధారంగా నీ మెదడు వేగంగా ఒక కలను అల్లేసింది. ఎంత వేగంగా అంటే మాటలు వినబడటానికి, నిద్ర లేవడానికి మధ్యనున్న కాస్త వ్యవధిలో. ఇది వినడానికి విచిత్రంగా ఉండొచ్చు. కానీ నిజ. మనం కలలో గంటల తరబడి నడిచినట్టు అనిపించినది కేవలం కొన్ని సెకన్లలో పూర్తవచ్చు. రోడ్‌మ్యాప్‌లలో కొన్ని కిలోమీటర్లను ఒక సెంటీమీటర్‌గా చూపిస్తారు చూడు. ఇదీ అలాగే. కాకపోతే అక్కడ దూరం, ఇక్కడ కాలం. అంతే తేడా'' అన్నాను.

''మరి తిరిగి తాళాలు?'' అని అడగబోయి ఏం జరిగి ఉండొచ్చో తనకే తట్టిందేమో మాట మార్చి అయితే ''లాస్య, సందీప్‌లను పార్లర్ దగ్గర కలవడం కూడా కలేనంటావా?''

''ముమ్మాటికీ, మన కోరికలు, భయాలే ఎక్కువగా కలలో వస్తూంటాయి. నీ మతిమరుపు గురించి మా అందరికీ తెలుసు. తెలిసిన మనిషినే ఒకోసారి సరిగా పోల్చుకోలేననే భయం నీలో ఉండిఉండొచ్చు. ఫోటోలో చూసిన లాస్యను పార్లర్ దగ్గర గుర్తుపట్టక నవ్వుల పాలైనట్టు కల రావడం దీనినే సూచిస్తుంది. రిసెప్షన్, గిఫ్ట్స్, చేతికి దెబ్బ ఇవన్నీ కల కల్పించిన కొసర్లు. ఆ కొసరు ముక్కను పట్టుకుని అదే మోడల్ వాచీ కోసం చూసి, చూసి మరీ కొన్నావు.''

''ఆ వాచీ కొత్త మోడల్. నేనెపుడూ చూడలేదు. ఎన్నడూ చూడనిదానిని కలగనడం అసాధ్యం.''

"ఏ టి.వి యాడ్ లోనో చూసి మనసులో రిజిస్టర్ అయిపోయి ఉండొచ్చుగా. అదలా ఉంచితే డెజావు అనే మాట ఎప్పుడైనా విన్నావా?"

"ఓహో... నా జబ్బులన్నిటికీ కలిపి నువ్వు పెట్టిన పేరన్నమాట" వ్యంగ్యంగా అన్నాడు.

"కాదు. జరుగుతున్న సంఘటన గతంలో ఎప్పుడో జరిగిపోయి, రిపీట్ అవుతున్న ఫీలింగ్ కలగడాన్ని అలా అంటారు. ఇది చాలామందికి ఎపుడో ఒకసారి అనుభవంలోకి వచ్చేదే" అన్నాను. వాడు ఏమీ మాట్లాడలేదు. ఊరి బయటకు వచ్చేశాం.

"ఎక్కడకు వెళ్తున్నాం?" అని అడిగాను.

నా ప్రశ్నను పట్టించుకోకుండా "చిన్న తప్పు పెద్ద ప్రమాదానికి దారితీసి ఎందరికో విషాదాన్ని మిగిల్చింది. అందరి ముందూ దోషిలా నిలబడాల్సి వచ్చింది" అన్నాడు బాధగా.

"ఏ ప్రమాదం?" అన్నాను అర్థంకాక.

"అది ఇంకా జరగలేదు. జరుగుతుంది" అన్నాడు గంభీరంగా. అంటే ... ఇది డ్రీమ్ సీక్వెల్ అన్నమాట అనుకున్నాను.

"ఎప్పుడు జరుగుతుంది?" అన్నాను భయంగా.

"ఇప్పుడే మన కారుకే" అన్నాడు మామూలుగా. కారువేగం, నా గుండె వేగం ఒకేసారి పెరిగాయి.

"అదిగో ఆ మలుపు దాటాక" అన్నాడు కళ్ళతో చూపిస్తూ.

"నెమ్మదిగా పోనివ్వచ్చుకదా" అన్నాను. వాడు వినిపించుకోలేదు.

"కారు ఆపరా బాబు. దిగి నడిచి వెళ్ళిపోతాను" అని బతిమిలాడాను. వాడు హిప్నటైజ్ అయిన మనిషిలా డ్రైవ్ చేస్తున్నాడు.

కారు మలుపు తిరిగింది. అప్పటిదాకా నిర్మానుష్యంగా ఉన్న రోడ్డుమిద కొద్దిదూరంలో ఒక పెద్దాయన సైకిల్ మీద ఎదురు వస్తున్నాడు.

"కంగారులో ఆయన సైకిల్ని ఎడమవైపునుంచి పూర్తిగా రోడ్ కుడివైపుకి తిప్పేస్తాడు. ఇంత వేగంలో కారుని కంట్రోల్ చెయ్యడం కష్టంకదా" అని నిట్టూర్చాడు రమేష్. అమ్మయ్య.. చచ్చేది నేను కాదన్నమాట.

పాపం పెద్దాయన అనుకున్నాను.

"కారు స్లో చెయ్యి. పాపం పెద్దాయన" అని అరిచాను.

"ఆయనకేమీ కాదు"

"మరి చచ్చేది ఎవరు?"

"నువ్వే" అన్నాడు జాలిగా. నిర్ఘాంతపోయాను.

"స్టీరింగ్ కంట్రోల్ తప్పి కారుకి ఏక్సిడెంట్ అవుతుంది"

"దుర్మార్గుడా. చేజేతులారా స్నేహితుడ్ని చంపుతావా?" భయంతో అరిచాను.

"నాకూ ఇష్టంలేదు. కానీ జరగాల్సిన దానిని మార్చడానికి నేనెవర్ని. అయాం సారీ" అన్నాడు. కారు సైకిల్కి బాగా దగ్గరగా వచ్చేసింది. ఆ పెద్దాయన, రమేష్ అన్నట్టుగానే సైకిల్ని ఒక్కసారిగా రోడ్డు ఈ చివరినుంచి ఆ చివరకు తిప్పేసాడు. రమేష్ కళ్ళల్లో ఏదో ఆనందం. స్టీరింగ్ని చటుక్కున కుడివైపు తిప్పాడు. కారు వేగంగా పల్లంలోకి దూసుకుపోవడం, చెట్టుని ఢీకొట్టడం, నేను పెద్దగా అరవడం క్షణాలలో జరిగిపోయాయి. తర్వాత ఏమయిందో నాకు తెలియదు.

కళ్ళు తెరిచేసరికి హాస్పిటల్‌లో ఉన్నాను. ఒళ్ళంతా కట్లు, బాధతో మూలిగాను. మా ఆవిడ గబగబా దగ్గరకు వచ్చింది. తన కళ్ళనిండా నీళ్ళు. "అదృష్టం.. ప్రాణాపాయం తప్పింది. ఆ రోజు చాలా భయపడిపోయాం. వంటినిండా దెబ్బలు, కాళ్ళు విరిగాయి" అంది ఏడుస్తూ

"రమేష్?" అన్నాను బలహీనంగా.

"అక్కడే పోయారు" అంది. నిట్టూర్చాను. నేను స్పృహలోకి వచ్చిన సంగతి తెలిసి పోలీసులు వచ్చారు. సైక్లిస్ట్‌ను తప్పించాలన్న కంగారులో జరిగిన ప్రమాదం అని అబద్ధమాడాను. మానసికలోపంతోనైనా సరే స్నేహితుడే నన్ను చంపడానికి ప్రయత్నించాడని చెప్పడానికి మనసొప్పలేదు.

అందరూ వెళ్ళిపోయాక మా ఆవిడకు జరిగింది వివరించి చెప్పాను. నిర్ఘాంతపోయింది.

"మన అదృష్టం కల నిజమవలేదు" అంది.

"ప్రయత్నించాడు. కాకపోతే.. పాత్రలు మారాయి"

"ఒకవేళ ఆ పెద్దాయన ఎదురుకాకపోయుంటే రమేష్ ఏం చేద్దుడు?" అంది. నిజమే ఏం చేద్దుడో అనుకుంటుంటే మరొకటి తట్టింది. ఊరు దాటాక అంతదూరం మానవమాత్రుడన్నవాడు ఎదురుకాలేదు. ఆ మలుపు దాటాక ఆ పెద్దాయన ఊడిపడటం మాత్రం చిత్రంగా ఉంది. అది యాధృచ్ఛికమేనా.!!??

# చిరిగిన గాలిపటాలు — కృష్ణవేణి

తిరుగుమొహం పడుతున్న శీతాకాలపు ఉదయం. బాల్కనీ అంతా ఆక్రమించుకున్న నులివెచ్చటి ఎండలో,

'స్నానం చేయాలి, చేద్దామనుకుంటూ' రెండు గంటలు గడిపేసిన బద్ధకపు పొద్దు. చదువుతున్న ఆదివారపు పేపర్ని పక్కకి పెడుతూ ఉంటే, తారా ఫోన్.

"నీలిమా, ఏమ్వే లో యాభై శాతం సేల్ ఉంది. బాడీ వాష్, షాంపూ కావాలన్నావు. తేనా?"'

"ఏవో కొనుక్కున్నానులే, కానీ నువ్వు రా. అవీ పట్రా. పనికొస్తాయి." చెప్పాను.

"మెట్రోలో రావాలి. కారు లేదు. బయల్దేరతాను."

"కాఫీ సీసా ఖాళీ. కొత్తదెక్కడ పెట్టావు?" నన్నడుగుతున్న అర్జున్ గొంతు వినిపించినట్టుంది.

"అరే, అర్జున్ ఇంట్లోనే ఉన్నాడా! అరవింద్ కలుసుకుంటాడట. తీసుకురమ్మన్నావా?" కొంచం ఆశగా, ఆత్రంగా అడిగింది.

కారణం తెలుసు నాకు, మా ఇద్దరికీ స్నేహితురాలైన పూజా, "తల్లీ, నువ్వంటే పాత స్నేహితురాలివి. నీతోపాటు, నీ అరవిందునీ భరించడం మావల్ల కాదమ్మా." అన్న అల్టిమేటమ్ ఎప్పుడో ఇచ్చింది తనకి. "ఉండు, కాఫీ పొడి ఇచ్చొస్తాను." చెప్పి ఫోన్ మూసి, "అరవింద్ కూడా వస్తాడట." కళ్ళెగరేశాను అర్జున్ వైపు చూసి.

"'రానీ. మనదేం పోయింది!" ఉత్సాహమూ కనపడలేదు. తృణీకారమూ ధ్వనించలేదు.

"త్వరగా రండైతే." తారాతో చెప్పాను.

"బయల్దేరుతున్నాం. అన్నట్టు, మీ ఇంట్లో బకార్డీ కానీ వోడ్కా కానీ ఉన్నాయా అని అడగమన్నాడు."

"మొత్తం బార్ ఉంది కానీ, పగటిపూటొద్దు." ఖరాఖండిగానే చెప్పి, స్నానానికి వెళ్ళబోతుంటే, "వాళ్ళొచ్చే లోపల, ఒక కునుకు తీసి లేస్తాను." అంటూ, అర్జున్ నిద్రకి ఉపక్రమించాడు.

★★★

షాంపూ, కండిషనర్ అన్నీ యాంత్రికంగా ఉపయోగిస్తున్నానే తప్ప, బుర్రలో తారా తిష్ట వేసింది.

నేను కొత్తగా ఉద్యోగంలో చేరినప్పుడు, కంపాషనేట్ గ్రౌండ్స్ మీద ఉద్యోగం వచ్చి చేరింది. అప్పటికే మొదటి భర్తకి విడాకులిచ్చేసింది. కూతురు మేఘనా ఆరేళ్ళది.

అప్పటి తారా అందం చూడాలి తప్ప వర్ణించలేం. ఎంత సన్నగా, మోడెల్సే ఈర్ష్యపడేలా ఉండేది. చేరిన ఏడాదికే, భార్యని వదిలేసిన పిఆర్ డిపార్టుమెంట్ ఖాన్‌ని పెళ్ళిచేసుకుంది. తాన్యా పుట్టిన తరువాత ఏడాదికే ఆ పెళ్ళీ పెటాకులు చేసుకుంది. ఆ తరువాత డాక్టర్ ఈష్ తో కొన్నాళ్ళుంది. అతనినుంచీ మూడేళ్ళలో వేరు పడింది. పదేళ్ళ తరువాత, ఏదో వాలంటరీ స్కీమ్ వచ్చినప్పుడు ఉద్యోగం వదిలేసింది. ఈష్ స్నేహితుడైన భార్య పోయిన, ఈ అరవై ఆరేళ్ళ అరవింద్‌తో, అరవై దాటిన తారా ఛత్తర్‌పుర్‌లో కలిపి ఉంటూ, పదేళ్ళవవస్తోంది.

తారా మనసు మంచిదే. ఆర్థిక సహాయం తప్ప, ఎవరికే అవసరం ఉన్నా తనే ముందుకొస్తుంది. కపటం, దాపరికం, ఈర్ష్య–ఇలాంటివన్నీ ఎరగదు. తనకే కష్టం వచ్చినా, అండగా మేమందరం ముందుకి వచ్చే కారణం ఆ స్వభావమే.

తన పెళ్ళిళ్ళూ, లివ్– ఇన్–సంబంధాలూ గురించి నేనెప్పుడూ పట్టించుకోలేదు. అది తన జీవితం. తనిష్టం వచ్చినట్టు గడుపుకునే హక్కు తనకుంది. కానీ, ఈ అరవిందుతో పాటు ఉండటం మొదలుపెట్టిన తరువాత అతనంటే ఉన్న అయిష్టతతో, స్నేహితులందరూ మెల్లిమెల్లిగా దూరం అవడం ప్రారంభించారు. నేనూ మినహాయింపు కాదు. మాటలూ, కలుసుకోవడమూ– అన్నీ ఆగిపోయాయి. కానీ, నాకున్న గిల్ట్ వల్ల, నేనే ఈ మధ్య ఫోన్ చేసి, మాట్లాడాను. దాని ఫలితమే తను మా ఇంటికి వస్తాననడం.

బయటకి వచ్చి తయారయాను.

మళ్ళీ బాల్కనీలో ఉన్న క్రేన్ కుర్చీలో కూర్చున్నాను. ఈసారి, నా ఆలోచనల్లోకి తాన్యా పట్టుబట్టి, మరీ దూరింది.

★★★

పన్నెండో క్లాసు తరువాత, కాలేజ్‌లో అడ్మిషన్ దొరకలేదు. ఇంగ్లీష్ మీడియం చదువు పుణ్యమా అని, ఏదో కాల్ సెంటర్లో చేరిందప్పుడు. అప్పటికే, మేఘనా తనకి నచ్చినవాడిని పెళ్ళి చేసుకుని సింగపూర్‌లో ఉద్యోగం చేస్తోంది.

కొన్నేళ్ళ కిందట, తారా ఫోనొచ్చింది.

"తాన్యా పెళ్ళి. డబ్బెక్కువ పెట్టలేను. షాపింగెక్కడ చేయాలో సలహా చెప్పు. వచ్చాక వివరాలు చెప్తాను." అంటూ.

"మా ఇంటి పక్కన ఉన్న మాల్ ఒకటి మూసేస్తున్నారు. అన్నీ సేల్‌లో పెట్టారు. రా, చూద్దాం." చెప్పాను.

తనతోపాటు, తాన్యా కూడా వచ్చింది. ఎత్తుగా ఉన్న తన పొట్ట చూస్తూనే అర్థం అయింది.

"ఆంటీ, అమ్మకి వాసన పడదు. సిగరెట్ పక్కగదిలోకెళ్ళి తాగొచ్చా?"– అడిగింది.

"చూశావా! ఈ పరిస్థితిలో కూడా మానదు." తల్లి ఫిర్యాదు.

"తమరి పాత అలవాటేగా!" చెప్పుతూ, "ఇంతకీ, అబ్బాయెవరు?" అడిగాను.

"పేరు దీపక్. పెళ్ళిళ్ళకీ, ఫంక్షన్లకీ కేటరింగ్ పని చేస్తాడు. ఆర్యసమాజ్ మందిర్లో రేపాదివారం పెళ్ళి. మన స్నేహితులని మాత్రం పిలిచానంతే."

టీ తాగి, మాల్‌కి వెళ్ళాం.

తల్లి బాగుందన్నది, కూతురికి నచ్చదు. కూతురు ఇష్టపడ్డది తల్లి తోసిపారేస్తుంది. ఆఖరికి, ఇద్దరూ ఎడమొహం పెడమొహంగానే, కాష్ కౌంటర్ వద్దకి వచ్చారు. షాపింగ్ కార్టులో, తాన్యా కోసం కొన్నవాటికన్నా, తారా కొనుక్కున్నవి ఎక్కువున్నాయి.

ఇప్పుడు ఇద్దరాడపిల్లలు తాన్యాకి. దీపక్‌తో పెళ్ళి ఎక్కువ రోజులు నిలవలేదు. ఆరునెల్ల కిందట వరకూ అరవిందూ, తారా కలిపున్న ఇంట్లోనే ఉండేదని విన్నాను.

★★★

ఇంటర్ కామ్ మోగింది. "మాడమ్ మీకోసం ఎవరో వచ్చారు–గేట్ వద్దనుండే సెక్యూరిటీ గార్డ్."– కానీ, ఆ తరువాత కూడా, పది నిముషాలవరకూ ఎవరూ రాలేదు.

తలుపుతీసి, రెయిలింగ్‌నుంచి కిందకి తొంగి చూశాను. మోకాళ్ళు పట్టుకుని 'ఉఫ్' మంటూ, ఆయాసపడుతూ పైకెక్కుతూ తారా కిందనున్న లాండింగ్ మీద కనబడింది. నా కళ్ళని నేనే నమ్మలేకపోయాను. తారేనా! అంత నాజూకుగా ఉండే మనిషి, ఇంత లావెలా అయింది! తన్ని తాను నిర్లక్ష్యపెట్టుకునే అలవాటే ఉండేది కాదు. వెనుకాతలే– పెద్ద బొజ్జా, దానిమీద మొద్దు ఓవర్ సైజ్ పుల్లోవరూ, డంగరీస్ వేసుకుని మెట్లెక్కి వస్తున్న అరవింద్.

ఇంట్లోకొచ్చారు. 'హెలోలూ, ఎలా ఉన్నావు!' ఫార్మాలిటీస్ పూర్తయాయి.

ఒక సంచీలో ఏమ్మే సామాన్లతో వచ్చిన తారాతో, " ఫ్రిజ్లో పెట్టు" అంటూ, తన సంచీనుండి నాలుగు ఆరంజ్ జ్యూస్ కార్టన్లు తీసిచ్చాడు. "వోడ్కా ఉందన్నావుగా! ఏ ఫ్లేవరో తెలియక, ఎందుకైనా మంచిదని తెచ్చాం." అంది తారా.

'వద్దన్నాను కదా!' అనబోయి, ఊరుకున్నాను.

"ఇంద నీ సామాను." పాకెట్టొకటి నా చేతికందించి, "మీ ఆయనేడీ? ఎండలో కూర్చుందాం." బాల్కనీవైపు దారి తీసింది.

లోపలకి వెళ్ళి అర్జున్ని లేపి చెప్పాను.

"అప్పుడే ఒంటిగంటయిందే! వంటమ్మాయి చేసి పెట్టినవి అందరికీ సరిపోతాయా?"

""మనకి మాత్రమే సరిపడా వండింది. బియ్యం నానబెట్టాను. పదేస్తాలే కానీ, అగర్వాల్ నుంచి ఛోలే బటూరేవో తెప్పిస్తేనే నయం. అయినా, వాళ్ళిద్దరూ తాగడానికి సిద్ధంగా కూర్చున్నారు. తొందరగా, భోజనానికి లాక్కొచ్చే బాధ్యత నీదే." హెచ్చరించాను.

"ఇదీ పెట్టావూ నా నెత్తిమీద!" విసుక్కుని, బాల్కనీలోకి నడిచి పలకరిస్తున్నాడు.

"ఇంకెందుకు ఆలస్యం? మొదలుపెడదాం." సంచీలోనుంచి ఏవో స్నాక్స్ తీస్తున్నాడు అరవింద్. నేనూ అర్జున్ గ్లాసులూ, బౌల్సూ, వోడ్కా, జ్యూసూ మోసుకొచ్చాం.

గుబురుగా పెరిగిన అరవింద్ జుట్టు రూట్స్ బయట, మూడంగుళాలు తెలుపు. చివర్ల చిక్కటి నలుపు. గడ్డం చేసుకుని చాలా రోజులయినట్టుంది. దట్టంగా ఉన్న తారా పొట్టిజుట్టు, వెండిలా మెరుస్తోంది. ఊలు సల్వార్ కమీజు బట్టని తన శరీరం చుట్టూ చుట్టేసి, ఆ తరువాత కుట్టినట్టుంది.

బాల్కనీ చివర్న కట్టిన మార్బుల్ గట్టు మీద ఏటవాలుగా కూర్చుని, ఫుట్ స్టూల్ మీద కాళ్ళు బార్లా జాచిపెట్టి, సీసా విప్పుతున్నాడు అరవింద్. ఎండకి వీపు చూపిస్తూ, అదే స్టూల్ మీద తనూ కాళ్ళు ఆన్చి, కుర్చీలో తారా.

"నాకు ఆరెంజ్ జ్యూస్ చాలు." నా ఆ మాటకే ఎదురు చూస్తున్నట్టు, "ఫార్మాలిటీస్ ఏమీ పెట్టుకోవద్దు. ప్లీస్, ఫీల్ ఫ్రీ. మీరు కానియ్యండి." అంటూ, అర్జున్ తన గ్లాస్‌లోకి జ్యూస్ వంపుకున్నాడు.

"కారేమయింది?" అడిగాను తారాని.

"సింగపూర్ వెళ్ళాను మేఘనా దగ్గిరకి. అంతకు ముందు అమ్మేశాను.'

తన మాట పూర్తికాకుండానే, అరవింద్ అందుకున్నాడు. "పూర్తి ఆర్నెల్లూ ఉండి వస్తానంది మరి! ఆ కారమ్మితే కొంత ఖర్చుకైనా పనికొస్తుందని, నేనే అమ్మేయమన్నాను. అదీ సరిపోలేదు తన షాపింగుకి. 'అప్పు' నెపంతో మళ్ళీ నా డబ్బు కూడా."

"వాయిదాలమీద తీరుస్తున్నానుగా!" తారా గొణిగింది.

"ఆ, తీర్చకేం! మళ్ళీ ఏదో ఖర్చుందని రోజూ తీసుకుంటూనే ఉంటుంది. ఏదో ఎక్సిబిషన్లో, ఇరవై వేలున్న పెయింటింగేదో పదివేలకే ఇచ్చేస్తున్నారు. కొందామని, ఒకటే పోరు. డబ్బు తనదైతే విలువ తెలిసొచ్చేది.

అన్నట్టు, ఈ మధ్య ఇంకో తంటా. తనకి నా ఆస్థిలో వాటా కావాలట. ఆస్థిలో భాగం ఇస్తే, రేపు నా కొడుకులిద్దరూ ఊరుకుంటారా?"–మమ్మల్ని అడుగుతున్నాడు.

టైమ్ రెండున్నర దాటింది. ఎత్తిన గ్లాస్, తిరిగి నింపుకోడానికి తప్ప– కిందకి దించడం లేదు అరవింద్. తారా మూడో డ్రింక్ పూర్తి చేసి, పక్కనే పెట్టిన పాకెట్లనుండి జీడిపప్పూ, వేరుశెనగపలుకులూ తీసుకుని, నములుతోంది.

"తాన్యా ఎలా ఉంది? తననీ, పిల్లలనీ కూడా తీసుకురావలిసింది." వాళ్ళిద్దరూ మళ్ళీ వాదనకి తగులుకోకుండా, మాట మార్చాను.

"తను పక్క బ్లాకులో, వేరే ఇంట్లో ఉంటోంది." అరవింద్ చెప్పాడు.

"'అదేం?" అడిగాను.

"'తను వీధుల్లో నడుస్తోంది." ఎదురుగా ఉన్న గోడ వైపు చూస్తూ, తార అభావంగా, ఇంగ్లీష్లో చెప్పింది.

"వీధుల్లోనా!" అయోమయంగా అడిగాను.

"స్పష్టంగా చెప్పవేం నీ కూతురి ఘనకార్యం! రెడ్ లైట్ల దగ్గర నిలుచుంటోంది లెండి." అరవింద్ అందుకున్నాడు మళ్ళీ. 'సరిగ్గానే విన్నానా?' నమ్మశక్యం కాకుండా, అర్జున్ వైపు తల తిప్పాను. తన పరిస్థితీ అలాగే ఉంది.

"తాన్యా ఇంటి అద్దె మేఘనా కడుతోంది. నెల ఖర్చులకీ డబ్బు పంపుతుంది. ఇంక ఉండేవి చిన్నచిన్న పర్సనల్ ఖర్చులే. కొంతేదో, నేనూ ఇస్తున్నాననుకో. పోనీ, ట్యూషన్లేవో చెప్పుకోమని చెప్పాను. వింటేగా! ఇంత వయస్సొచ్చాక ఏం కట్టడి చేస్తాను?" తారా.

"ఆహా, నువ్వూ, నీ కట్టడీ. తనకి పదమూడేళ్ళున్నప్పుడు, ఇంటినుంచి పారిపోయిందని నువ్వేగా చెప్పింది నాకు!" మళ్ళీ అరవింద్. తారాతో వొంటరిగా మాట్లాడే అవకాశం దొరకదని అర్థం అయింది.

"జైసల్మేర్ ఫెస్టివల్కి అని తన స్నేహితురాలికి చెప్పి వెళ్ళింది. నెలరోజులయినా రాకపోయేటప్పటికి, వెనక్కి తీసుకు రావడానికి వెళ్తే, ఒక మధ్యవయస్కుడితో ఏదో ఫైవ్ స్టార్ హోటెల్లో కనిపించింది. ఇంటికి తిరిగి రానంది. రెండు వేద్దామనుకుంటే, తిరిగి నాకే నాలుగు లెంపకాయలు.' జాలిగా చెప్పింది తారా. జాలి ఎవరి మీదో అర్థం అవలేదు.

"ఆ, అక్కడెవడితోనో బాగానే ఎంజాయ్ చేసింది. తిరిగి ఇంటికి వచ్చినప్పుడే, కాళ్ళు విరిచి ఇంట్లో కూర్చోపెట్టుంటే సరిపోయేది. అయినా, ఇంటినుంచి ఎన్నిసార్లు పారిపోయింది? తనకేం కొత్తా!" అరవింద్ సన్నాయి నొక్కులు.

"ఆ చదువూ, సంధ్యా లేని వంటవాడిని పెళ్ళి చేసుకుంది. ఇప్పుడు, మా నెత్తిమీద పడిందంతా." తారా జ్యూస్ వంచుకుంటూ చెప్తోంది. మళ్ళీ అతను ఏదో అంటున్నాడు.

వాళ్ళల్లో, వాళ్ళే మాట్లాడుకుంటున్నారు. నా ఆలోచనల్లో నేను పడ్డాను.

★★★

తల్లినీ, ఆ వాతావరణాన్నీ తప్పించుకోవాలనే కాదూ తాన్యా కనిపించిన మొదటివాడిని కట్టుకున్నదీ! చదువూ డబ్బూ, ఉన్న మనిషెవరూ, తారా ప్రాపకంలో ఉంటున్న ఎక్కువ చదువుకోని తనకోసం రాదని తాన్యాకీ తెలుసు. మేఘనాకి ఉన్న తెలివీ లేదు తనకి. కనిపించిన, ఒక్క దారీ పట్టిందంతే. తల్లి పెంపకంలో అందిన స్వేచ్ఛకి అలవాటు పడిన పిల్ల, ఆ ఛాందసపు మెట్టింట్లో ఇమడలేకపోయింది.

ఏ సంబధానికీ కట్టుబడి ఉండలేకపోయే తారా, వొళ్ళు వంచకుండా– దొరికే సౌకర్యాల గురించే చూసుకుంది తప్ప, పిల్లల గురించేనాడైనా పట్టించుకుందా!

★★★

బెల్ మోగింది. వేడివేడి చనా, బటూరాలూ అవీ వచ్చాయి.

"లోపలకి రండి. చల్లారిపోతాయి." చెప్పాను.

“అయిదు నిముషాల్లో వస్తాను. నువ్వెళ్ళి, నీలిమకి సాయం చేయి.” తన గ్లాస్ నిండా వోడ్కా వంచుకుని, ఖాళీ అయిన బాటిల్ కింద పెట్టాడు అరవింద్. వేళకాని వేళలో అంత తాగినప్పటికీ, మాట తడబడటం లేదు. మనిషి తూలడం లేదు.

ఈ లోపల, వచ్చిన వాటిని గిన్నెల్లో పెట్టి, ఇంట్లో వండిన భోజనం వేడి చేసి, టేబిల్ మీద పెట్టాను. తారా వస్తూనే, అన్నం, పప్పూ, కూరా కంచంలో పెట్టుకుంది.

“అయ్యో, ఆ ప్లేట్ వదిలేసి ఇంకోటి తీసుకో. ముందు బటూరాలు తిను. వీట్లో ముద్దయిపోతాయి.” లబలబలాడుతూనే ఉన్నాను. ఇంతలో, గ్లాస్ తనతో పాటే తెచ్చుకుని, లోపలకి వచ్చి కూర్చున్న అరవిందుకి కూడా వాటినే ఇంకో కంచంలో వడ్డించి, అతని ముందుకి జరిపింది.

నేను సగం బటూరా పెట్టుకున్నానే తప్ప, భోజనం టైమ్ దాటడంతో– ఆకలి చచ్చిపోయింది.

అంత కట్లరీ ఎదురుగా ఉన్నప్పటికీ, తారా మాత్రం కేవలం రెండు గరిటెలతోనే వడ్డిస్తూ, వాళ్ళ కంచాలలో ఉన్న పదార్థాల మీదే, బటూరాలూ, చనా కూడా పెట్టేసింది.

తినడం పూర్తైన వెంటనే, “చచ్చేంత నిద్ర వస్తోంది.” అంటూ, చేతులు కడుక్కు వచ్చి, “ఎక్కడ పడుక్కోమన్నావు!” అడిగింది.

పక్కనే ఉన్న గెస్ట్ రూమ్ చూపించాను.

అర్జున్, అరవింద్– లివింగ్ రూమ్ వైపు నడిచారు.

టేబిల్ శుభ్రం చేద్దామని చూస్తే, పప్పు గరిటె కూరలో, అన్నం గరిటె పప్పులో. వాళ్ళ కంచాల చుట్టూ మెతుకులూ. కంచాల్లో, తినలేకపోయి వదిలేసిన వంటకాలూ, వాటిల్లో ఉండలుచుట్టి పడేసిన పేపర్ నాప్కిన్లూ.

ఏదో శుభ్రం చేశాననిపించాను.

నేనూ లివింగ్ రూములోకి అడుగుపెట్టానో లేదో, “నేనూ నడుం వాలుస్తాను. అరవింద్, మీరూ రెస్ట్ తీసుకోకూడదూ!” అడిగాడు అర్జున్.

“మీరు వెళ్ళండి. నేను నీలిమతో కబుర్లు చెప్తానుగా.” అభయం ఇచ్చాడు అరవింద్.

గదిలోంచి తారా గురక గది కదిలేలా, ఇక్కడివరకూ వినిపిస్తోంది. తలుపు కొంచం మూద్దామని వెళ్తే, తెరుచుకుని ఉన్న నోటినుంచి గురకేకాక, చొంగ కూడా కారుతూ, తన ట్రిపిల్ చిన్ ముడతల్లో ఇరుక్కుని, ఇంక కిందకి జారలేకపోతోంది.

★★★

షాల్ కప్పుకుని, అరవింద్ ఎదురుగా కూలబడ్డాను.

“కార్లో వస్తున్న రెండు గంటల్లోనూ, గంటన్నర నిద్ర పోతూనే గడిపింది మీ స్నేహితురాలు. నేను తప్ప, ఇంకెవరు భరించగలరు తన్ని!”

“షుగర్ ఉందిగా మరి తనకి!” ముక్తసరిగా అన్నాను.

‘”అదే మరి. ఏ ఎక్సర్ సైజో చేయమన్నా వినదు. ‘ఇలా ఊరిపోతుంటే, ఇంక నీకు అస్తమానం బట్టలు కొనడం కష్టం’ అని హెచ్చరిస్తూనే ఉంటాను.” వొంటి కుర్చీలో శరీరం పట్టక, మూడు సీటర్ల సోఫాలో కూర్చున్న మనిషి మాటలు.

“ఇందాక, తాన్యా సంగతి పూర్తిగా మాట్లాడలేదు కదా? చెప్తాను వినండి. నేను వాళ్ళమ్మని వదిలేసి, తనతోనే ఉంటే కనుక, గెంతేసి వొప్పుకునేది. రాత్రుళ్ళు రెడ్ లైట్ల దగ్గిరా, పగళ్ళు పిల్లలు స్కూలుకెళ్ళాక,– ఆ వ్యవహారం ఇంట్లోనే.

తాన్యా పెద్ద కూతురు సెఫాలీ లేదూ! తల్లి అడుగుజాడల్లోనే నడుస్తుంది రేపు. చూస్తూ ఉండండి.”

దేవుడా, పదేళ్ళ పసిపిల్ల గురించా ఇతనిలా మాట్లాడుతున్నది!

ఆ తరువాత అతను మాట్లాడిందేమిటో, నేను విన్నదేమిటో గుర్తు లేదు. ఏ అనుభూతైనా, ఒక హద్దు దాటిన తరువాత స్తబ్దు బారుతుందేమో! ఆరు దాటింది. బాగా చీకటి పడింది.

“టీ పెడతావా?” తారా కేక.

లోపల అర్జున్ మేలుకునే ఉన్నాడు. “టీ?” అడిగాను. తన మొహం చూస్తే, అపార్టుమెంట్ల పలచని గోడలు జరిగిన సంభాషణని గుప్తంగా ఉంచలేదని అర్థమైంది. “నేను పెడతాలే.” వంటింట్లోకి వెళ్ళాడు.

"తారా, రా, టీ, బిస్కట్లూ పెట్టానిక్కడ." పిలిచాను.

"ఇక్కడికే తీసుకొద్దూ."

ఇంకా మంచంమీదే ఉన్న తన చేతికి మగ్ అందించి, బయటకి వచ్చాను. అయిదు నిముషాల తరువాత, మగ్ వంకరగా పట్టుకుని, నేలమీద టీ వంపేస్తూ వచ్చింది.

మాట్లాడకుండా, ఇల్లూడ్చే బట్ట తెచ్చి కింద వలికిన టీ తుడుస్తున్నాను. దానికి వీలుగా– కాళ్ళెత్తి, కుర్చీమీద పెట్టుకుంది. "అయ్యో, నేను చేస్తానులే." అనలేదు. నాకు తెలిసిన తారేనా ఈ మనిషి?

"లేటయింది. ఇంక వెళ్తాం" టీ తాగాక చెప్పింది. ఇద్దరూ నిలుచున్నారు. వాళ్ళతోపాటే వెళ్ళి. దిగబెట్టే మర్యాద పాటించలేదు నేను. అర్జున్ మాత్రం వెళ్ళాడు.

★★★

వాళ్ళింకా, కిందకి దిగి కూడా ఉండరు. పూజాకి ఫోన్ చేసి, జరిగిన మాటలు క్లుప్తంగా చెప్పాను.

"ఓహో, త్యాగమయీ, ఈ మర్యాదల అవసరం ఎందుకు? బుద్ధిలేకపోతే సరి. అసలు తాన్యా గురించి అలా మాట్లాడ్డానికి నోరెలా వస్తుంది వాళ్ళకి? నీకసలు సంగతి తెలియదు. ఈ దరిద్రుడు, తన్ని ఇంట్లో ఒక్క నిముషం కూడా తెరిపిగా బతకనిచ్చేవాడు కాదు. ఏదో నెపంతో, మీద చేయి వేయడమో, ఎక్కడెక్కడో పట్టుకోవడమో. అదీ భరించింది, ఇంకే దారీ లేక. ఆఖరికి సెఫాలీని కూడా చెప్పుకోలేని చోట్ల ముట్టుకోవడం. అది ముద్దు చేయడంట. ఇంక సహించలేక మేఘనాకి చెప్తే, వెంటనే తనే ఇల్లు మార్పించింది. పాపం తాన్యా , కాల్ సెంటర్ వదిలేసి చాల ఏళ్ళయిందిగా! ఉద్యోగమూ దొరకడం లేదు.

ఈ మధ్య తనకెవరో అబ్బాయి పరిచయం అయాడు. ఒకసారి, తన బైకుమీద ఇంటికి దింపడానికి వస్తే అరవింద్ కంటపడ్డాడు. అదే ఇతగాడు చెప్పిన 'రెడ్ లైటు వద్ద నిలుచోవడం.' ఆ అబ్బాయి అప్పుడప్పుడూ తాన్యా ఇంటికి వస్తుంటాడు. దానికే 'మధ్యాహ్నం ఇంట్లో' అన్నది అరవింద్. 'ఆంటీ, ఇద్దరు పిల్లలున్న నన్ను పెళ్ళి చేసుకుంటానంటున్నాడా అబ్బాయి. పెనంమీంచి కుంపట్లో పడను కదా! అని నేనే తటపటాయిస్తున్నాను.' అని చెప్పింది తాన్యా. చేజిక్కించుకుందామన్న పిల్ల చేతిలోంచి జారిపోతుంటే చూడలేకపోతున్నాడంతే ఇతగాడు. మన స్నేహితులదరికీ, ఇదే కథ చెప్తాడు." ఛీత్కరించింది.

"తారాకీ అన్నీ తెలిసే అరవిందుకి వంత పాడుతుంది. ఎదురుతిరిగితే తనకెలా గడుస్తుంది!" తన గొంతులో ఆక్రోశం.

తారాని నిరక్ష్యపెట్టేనన్న నా గిల్ట్ ఫలితం– ఇవన్నీ తెలుసుకోవడమా! నిట్టూర్చి పెట్టేశాను ఫోన్. చూస్తే, కృతజ్ఞతలు చెప్తూ రెండు టెక్స్ట్ మెసేజిలూ, మూడు మిస్డ్ కాల్సూ అరవింద్ నుంచి. 'నా నంబర్ ఎందుకిచ్చావు అతనికి!' అని, తారా మీద అరిచీ లాభం లేదు. నంబర్ బ్లాక్ చేశాను.

నిముషం తరువాత బ్లాక్డ్ లిస్టులో తారా పేరూ చేర్చాను. ఈ నిర్ణయం మాత్రం ఎక్కువకాలం నిలబడదని తెలుసు. కానీ, ప్రస్తుతానికి కొంత ఉపశమనం.